

సరికొత్త వివరణలతో

# సమగ్ర భారతచరిత్ర

## ఆధునికయుగం




కె కృష్ణారెడ్డి



ప్రజాశక్తి బుక్‌హౌస్

సరికొత్త వివరణలతో

# సమగ్ర భారత చరిత్ర

## ఆధునిక భారతదేశం

కె. కృష్ణారెడ్డి

ప్రజాశక్తి బుక్‌హౌస్

*1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013*

అనువాదం : కె. కేశవరెడ్డి

ప్రచురణ సంఖ్య : 1010

ప్రచురణ కాలం : సెప్టెంబర్, 2007

వెల : రు. 100/-

టైటిల్ : శ్రీరాం కారంకి

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | ముందుమాట | | 5 |
| I. | ఆధునిక భారతదేశ రాజకీయ చరిత్ర | | 7 |
| | 1. | రాజకీయ చరిత్ర | 9 |
| | 2. | బ్రిటిష్ విస్తరణ | 13 |
| | 3. | స్వదేశీ సంస్థానాలపై బ్రిటిషు సార్వభౌమాధికారం | 41 |
| | 4. | భారతదేశంలో బ్రిటిషు సామ్రాజ్యం యొక్క రెండు దశలు | 53 |
| II. | రాజకీయం - ప్రభుత్వం | | 65 |
| | 5. | బ్రిటిషు సామ్రాజ్యవాద సిద్ధాంతం వలసవాద విధానాలు | 67 |
| | 6. | బ్రిటిషిండియా పరిపాలన - క్రమ పరిణామం | 75 |
| III. | ఆర్థిక విధానం | | 89 |
| | 7. | బ్రిటిష్ రాజ్యం - ఆర్థిక ప్రభావం | 91 |
| | 8. | యుద్ధకాలంలో భారతదేశ ఆర్థిక విధానం | 123 |
| | 9. | ఆధునిక పరిశ్రమ పుట్టుక - పెరుగుదల | 131 |

| | | |
|---|---|---|
| **IV.** | **సమాజం – మతం** | **155** |
| 10. | సమాజం - మతం | 157 |
| 11. | భారతీయ పునరుజ్జీవనం<br>మత సాంఘిక సంస్కరణ ఉద్యమాలు | 165 |
| 12. | కుల ఉద్యమాలు | 177 |
| **V.** | **సంస్కృతి** | **193** |
| 13. | భారతీయ భాషలలో ఆధునిక సాహిత్యావిర్భావం | 195 |
| 14. | ఆధునిక భవన నిర్మాణం | 213 |
| 15. | భారత చలన చిత్ర చరిత్ర | 219 |
| **VI.** | **అనుబంధం** | **231** |
| 16. | వంశక్రమం | 233 |
| 17. | మ్యాపులు | 243 |

# రచయిత తొలి పలుకులు

**భా**రతదేశ చరిత్రను అంశాల వారీగా, శాస్త్రబద్ధంగా పరిశీలించి, వివరించడం ఈ పుస్తకంలోని నూతనత్వం అని ముందుగా చెప్పాలి. పూర్తిగా భిన్నమైన, నూతన ప్రణాళికతో ఈ పుస్తకాన్ని రచించానని వేరుగా చెప్పనవసరం లేదు. దీనిలో రాజకీయ చరిత్రపై కాకుండా ఇతర అంశాలపై కేంద్రీకరణ హెచ్చుగా ఉంది. ప్రతి అధ్యాయంలోను ఆ కాలానికి చెందిన రాజకీయ చరిత్రను ప్రత్యేకంగా పేర్కొన్నాను. అయినప్పటికీ తరతరాలుగా వస్తున్న విస్తారమైన, విభిన్నమైన అన్ని జీవిత కోణాల ఆవిష్కరణకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇచ్చాను. పాలక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ, సామాజిక, మత, సాంస్కృతిక సంస్థలు, ఆచారాలు, విశ్వాసాలను సుబోధకంగా వివరించే ప్రయత్నం చేశాను. పైకి భిన్నత్వం కనిపిస్తున్నప్పటికీ భారత దేశ చరిత్ర మొత్తంలోను అంతర్లీనంగా కొనసాగిన ఏకత్వాన్ని చూపించాను.

వివిధ దశల్లో చరిత్రను ప్రభావితం చేసిన రకరకాల శక్తుల గురించి విశ్లేషించడానికి శాయశక్తులా ప్రయత్నించాను. సామాజిక మార్పుకు దోహదపడి అవి చరిత్రను ఎలా తీర్చిదిద్దాయో తెలియ చేశాను. దురదృష్టవశాత్తు అనేక రిఫరెన్సు గ్రంథాలలో సామాన్యుడి గురించి కాని, దేశ సాంస్కృతిక వారసత్వం గురించి కాని తగినంత చెప్పకపోవడమే కాకుండా, ఆ చెప్పినది కూడ ఒక పద్ధతి ప్రకారం లేదు. ఈ పుస్తకంలో నూతన ప్రణాళికను అనుసరించడం ద్వారా ఆ లోపాలను అధిగమించే ప్రయత్నం జరిగింది. అంతేకాదు ఆధునిక యుగానికి సంబంధించిన భాగంలో విద్యార్థుల అవసరాలను గమనంలో ఉంచుకొని విషయాలను పొందుపరిచాను. బారత స్వాతంత్ర్యపోరాటాన్ని వివరించే సమయంలో వాస్తవాలకు అనుగుణంగా ఉన్నదున్నట్లు చెప్పడానికి కృషి చేశాను. భారత దేశ చరిత్రను, సంస్కృతిని ప్రాచీన కాలం నుండి, వర్తమాన కాలం వరకు సమగ్రమైన రీతిలో వివరించడానికి ఒక నమ్మకమైన ప్రయత్నం చేశాను.

**'సరికొత్త వివరణలతో సమగ్ర భారత చరిత్ర'** పేరుతో వెలువడుతున్న ఈ పుస్తకంలో నాలుగు భాగాలున్నాయి. **1. ప్రాచీన యుగం, 2. మధ్య యుగం, 3. ఆధునిక యుగం, 4. జాతీయోద్యమం.** విద్యార్థులను మాత్రమే కాకుండా, భారత దేశ చరిత్ర, సంస్కృతి పట్ల ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరిని దృష్టిలో పెట్టుకొని ఈ పుస్తకాన్ని రూపొందించాను. ఈ ప్రయత్నాన్ని పాఠకులు హర్షించి ఆదరిస్తారని ఆశిస్తాను. చివరిగా, ఈ పుస్తకాన్ని చక్కటి తెలుగులోకి తెచ్చిన అనువాదకులకు, నిశితంగా ఎడిట్ చేసి ఎంతో వేగంగా ప్రచురించిన ప్రజాశక్తి వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**న్యూఢిల్లీ,**

**10-09-2007**

**కూనం కృష్ణారెడ్డి**

# అంకితం

చరిత్ర రచనలో నా ఈ కృషిని ప్రేమాదరాలతో

అంగీకరించి సహకరిస్తున్న

నా చిన్ని కుటుంబం

ఉమ, ఆదిత్య, నీలిమలకు

# I

# ఆధునిక భారతదేశ రాజకీయ చరిత్ర

1

# రాజకీయ చరిత్ర

**సాధారణ సమీక్ష**

భారతదేశానికి బ్రిటీష్ వారి రాక 17వ శతాబ్దపు తొలిభాగంలో మొదలయింది. 1600 డిసెంబరు 31న లండన్ వర్తకుల కంపెనీ పేరుతో కొత్త వ్యాపార సంస్థగా ఏర్పడిన వర్తకులకు బ్రిటీష్ రాణి అధికార పత్రాన్ని మంజూరు చేసినది. 1601–1613 కాలంలో జాన్ కంపెనీగాను ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఈస్టిండియా కంపెనీగాను ప్రసిద్ధి గాంచిన ఈ వర్తకులు భారతదేశానికి 12 సముద్ర యాత్రలు చేశారు. భారతదేశంలో వుంటూ వర్తకం చేసుకొనడానికి అనుమతి కోరేందుకు 1609లో కెప్టెన్ జాన్ హాకిన్స్ జహంగీరు దర్బారుకు వచ్చాడు. జాన్ హాక్సిన్ అనుమతి తీసుకోవడంలో విఫలమైనప్పటికీ, 1617లో మొగల్ చక్రవర్తిని సందర్శించిన సర్ థామస్‌రో ఒక మేరకు విజయం సాధించాడు. సూరత్‌లో బ్రిటిష్ ఫ్యాక్టరీ నిర్మించేందుకు రో జహంగీర్ అనుమతి పొందాడు. ఆ తరువాత 1639లో మద్రాసులో సెయింట్ జార్జి ఫోర్టు స్థాపన జరిగింది. 1688–91 మధ్య కాలంలో మొగలు చక్రవర్తి యైన ఔరంగజేబుతో యుద్ధానికి తలపడి అవమానాలు, ఎదురు దెబ్బలు తిన్నప్పటికీ కంపెనీ వెనక్కితిరిగి చూడలేదు.

1757లో ఇంగ్లీషువారు పన్నిన రాజకీయ కుట్ర ప్లాసీ యుద్ధానికి దారితీసింది. కుట్రలో భాగంగా రాబర్ట్ క్లైవ్, బెంగాల్ నవాబు సిరాజుద్దౌలా సైన్యంలో భారీ ఎత్తున ఫిరాయింపులు జరిపించాడు. అప్పటి వరకు వర్తక సంఘంగా వున్న ఈస్టిండియా కంపెనీ తమకు తెలియని విస్తృత భూభాగంపైన, ప్రజలపైన, రాజకీయ పాలనాధికారం సాధించింది. దశాబ్దంలోగా గద్దెదిగిన బెంగాల్ నవాబు, అతడి మిత్రపక్షాలపై 1764లో జరిగిన బక్సార్ యుద్ధంలో కంపెనీ విజయం సాధించడమే గాక 1765లో మొగలు చక్రవర్తి తరపున బెంగాల్,

బీహార్, ఒరిస్సాలలో పన్నులు వసూలు చేసే హక్కుని అంటే దివాన్ గిరీని కూడ సాధించింది. తొలి సైనిక పరమైన విజయాల తర్వాత బ్రిటీష్ పాలనను పటిష్ట పరిచే బాధ్యత వారన్ హేస్టింగ్స్‌పై బడింది. మొగలు చక్రవర్తి పాలనాధికారి, అతడికి కంపెనీ బాధ్యత వహించాలి – అనే ధోరణిని వదిలించుకోవడానికి హేస్టింగ్స్ చాలా కృషి చేశాడు. బ్రిటిష్ వారికి భారతీయ చరిత్ర, సంస్కృతి, సామాజిక ఆచారాలతో పరిచయాలు కల్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కాని అతడు ఇంగ్లండ్ తిరిగి వెళ్ళిన తరువాత చేసిన నేరాలకు అభిశంసించబడ్డాడు. అతడి తరువాత బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఆకాంక్షలతో ప్రేరితులైన వారు పాలనా బాధ్యతలు చేపట్టారు. వారు భారతదేశంలో బ్రిటిష్ పాలనను సమర్థించేందుకు నడుంకట్టారు. భారత ప్రజలు నాగరికత గల ప్రజలుగా మార్చబడాలని ప్రాచ్య నిరంకుశ అరాచకత్వాల స్థానంలో బ్రిటిష్ పాలన విశ్వసనీయమైన న్యాయవ్యవస్థని, చట్ట బద్ధ పాలనని ప్రవేశ పెడుతుందని నమ్మబలికారు. కొన్ని భారతీయ సాంఘిక మతాచారాలను చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించారు. సతీసహగమన దురాచారాన్ని 1829లో రద్దు చేశారు. బ్రిటిషు సాంఘిక విధానాలు నైతిక అభివృద్ధిని రూపొందిస్తాయని చెప్పారు.

దేశీయ పాలకులు లంచగొండులు అసమర్థులు ప్రజల సంక్షేమం పట్టని వారని సాకులు చూపి, రాజుకి పుత్రసంతానం లేకపోతే అతడి మరణానంతరం అతడి రాజ్యం బ్రిటిషిండియాకి సంక్రమిస్తుందని నిబంధనపెట్టి 1840 దశాబ్దం చివరిలోనూ, 1850 దశాబ్దం ప్రారంభంలోనూ డల్హౌసీ చాలా ప్రాంతాలను బ్రిటీషు పాలన క్రిందకి తెచ్చాడు.

1848లో సతారా, 1849లో జైత్పూర్, సంబల్పూర్, 1850లో భాగట్, 1852లో ఉదయపూర్, 1853లో ఝాన్సీ, 1854లో నాగపూర్, 1856లో అవధ్ బ్రిటిషిండియా పాలన క్రిందకు తీసుకొని రాబడ్డాయి. అవుధ్ నవాబు ప్రాచ్య నిరంకుశత్వానికి ఒక నమూనా అని, అతడికి నాట్యకత్తెలపై, గాలిపటాలు ఎగుర వేయడం, కోడి పందాల లాంటి చౌకబారు సరదాలపై ఆసక్తి ఎక్కువని, పాలనా బాధ్యతలు చేపట్టలేని సోమరి అని బ్రిటీష్‌వారు ఈసడించారు. అవధ్‌ని కలుపుకొన్న తరువాత 1857లో వలసవాదుల పదజాలంలో చెప్పాలంటే "సిపాయిల కలహం", జాతీయవాద దృక్పథంలో 'మొదటి స్వాతంత్ర్య సంగ్రామం', రాజకీయంగా సరియైన పదం వాడాలంటే ప్రజల తిరుగుబాటు చెలరేగింది. భారతదేశంలో సామ్రాజ్యస్థాపన ప్రయత్నాలు ప్రారంభించిన 1757 నుండి బ్రిటీష్ వారికి ఇంత ఎదురు దెబ్బ ఎప్పుడూ తగలలేదు. మేలో ఒకటి, రెండు వారాలలో గంగా మైదానంలోని విశాల ప్రాంతాలు తిరుగుబాటుదారుల వశమయ్యాయి. అత్యాచారాలు ఇరువైపులా జరిగాయి. కాని ఏ తిరుగుబాటునైనా బ్రిటిషు వారు స్థానికులు తమపై స్వాతంత్ర్యం కొరకు చేసిన యుద్ధంగానే పరిగణిస్తారు.

కంపెనీ పాలన తొలి రోజుల్లో మాదిరిగానే 1857 తర్వాత కూడ 'విషాదం' అని చెప్పబడిన దాని చుట్టూ ఇరువైపులా అనేక గాథలు పుట్టుకొచ్చాయి. ఢిల్లీని బ్రిటిష్ దళాలు స్వాధీనం చేసుకున్న తర్వాత మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్‌ను రాజద్రోహ నేరం క్రింద విచారించి శిక్షించారు. 1858 మధ్య నాటికి తిరుగుబాటు పూర్తిగా అణచివేయబడింది. ఈస్టిండియా పాలన రద్దయింది. భారత దేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో ఒక వలస దేశంగా మారింది. భారత దేశపు పాలనను బ్రిటిష్ పార్లమెంటు నేరుగా చేపట్టింది. భారత దేశానికి సంబంధించిన విధానాలను బ్రిటిష్ క్యాబినెట్ రూపొందిస్తుంది. క్యాబినెట్‌లో భారత వ్యవహారాల కార్యదర్శి దీనికి బాధ్యత వహిస్తాడు. భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వపు ప్రతినిధిగా గవర్నర్ జనరల్ లేదా వైస్రాయ్ ఉంటారు.

1858లో బ్రిటిష్ రాణి లాంఛనపూర్వకంగా భారత దేశపు పగ్గాలను చేపట్టారు. తాను, తన అధికారులు భారతీయుల సంక్షేమం కోసం పాటు పడతామని ఆమె ప్రకటించారు. స్త్రీ విద్య, వితంతు పునర్వివాహం, మొత్తంగా స్త్రీల ప్రతిపత్తి లాంటి అంశాలపై భారతీయులలో చర్చ మొదలయింది. అదే సమయంలో ఇంగ్లీషు విద్య అధికం కావడం, ప్రభుత్వ యంత్రాంగం విస్తరించడం, ప్రభుత్వ సర్వీసుల్లో భారతీయులు చేరడం కూడ వూపునందుకుంది. ఈ కాలంలోనే ఇంగ్లీషు పత్రికలు, ప్రాంతీయ భాషా పత్రికల స్థాపన కూడ పెరిగింది. 1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన జరిగింది. ఆ సంస్థలో ఎక్కువ భాగం లాయర్లు, ఇతర ప్రొఫెషనల్స్ చేరారు. తమ దేశ పాలనలో భారతీయులకూ భాగస్వామ్యం ఉండాలన్నది వారి అభిమతం. అయితే జాతీయతా భావనలు జాతీయ కాంగ్రెస్‌కు చెందిన పెద్ద మనుషులు నిర్దేశించిన పరిధిలకే పరిమితం కాలేదు. మహరాష్ట్ర, బెంగాల్‌లలో సాయుధ విప్లవకారులు బ్రిటిష్ అధికారులపై హత్యా యత్నాలకు, పాలనా సంస్థలపై దాడులకు పూనుకున్నారు.

1905లో పాలనా సౌలభ్యం పేరుతో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాలును విభజించింది. 1857 తర్వాత ఎన్నడూ లేని విధంగా బ్రిటిష్ పాలనపైన, ప్రభుత్వ విధానాలపైన భారతీయలలో నిరసన పెల్లుబికింది. స్వదేశీ ఉద్యమకాలంలో అహింసాయుత తిరుగుబాటు, బాయ్‌కాట్, సమ్మె, సహాయ నిరాకరణ లాంటి పోరాట రూపాలు ముందుకొచ్చాయి. చివరకు 1911లో బెంగాల్ విభజనను ప్రభుత్వం ఉపసంహరించుకున్నది. బెంగాల్ తూర్పు ప్రాంతంలో అత్యధికంగా ఉన్న ముస్లిములను, హిందువులు అత్యధికంగా ఉన్న పశ్చిమ ప్రాంతాన్ని వేరుచేయాలన్న మత తత్వ పూరిత కుట్ర బ్రిటిష్ వారిలో ఉంది. ముస్లిం లీగు ఏర్పాటును ప్రోత్సహించడం వెనుక బ్రిటిష్ వారి పాత్ర ఈ అంశాన్ని రుజువు చేస్తుంది. ముస్లిముల ప్రయోజనాలు జాతీయ కాంగ్రెస్ ద్వారా నెరవేరబోవన్న అభిప్రాయంతో ముస్లిం లీగు 1907లో ఏర్పడింది. దేశ రాజధాని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చబడింది. బ్రిటిష్ పాలకులకు అవసరమైన భవనాలు, ఇతర సదుపాయాలతో కొత్త ఢిల్లీ రెండు దశాబ్దాల కాలంలో రూపుదిద్దుకుంది.

బ్రిటన్ భారత దేశాన్ని కూడ ప్రధమ ప్రపంచ సంగ్రామంలో భాగస్వామిని చేసింది. జర్మనీకి వ్యతిరేకంగా జరిగిన ఆ యుద్ధంలో భారతీయ సైనికులు పెద్ద సంఖ్యలో విదేశాలకు

వెళ్లి ఆ యుద్ధంలో పాల్గొన్నారు. 1917 చెమ్స్ ఫర్డ్ ప్రకటన ప్రకారం ప్రభుత్వ యంత్రాంగంలో భారతీయులను తీసుకోవడం అధికమయింది. ఇది భారతీయుల్లో స్వయంపాలన ఆకాంక్షను మరింత బలోపేతం చేసింది. కాని యుద్ధం ముగియగానే బ్రిటిష్ ప్రభుత్వం తీవ్రవాదులను నిరోధించడం అనే పేరుతో భారత దేశంలో పలు నిరంకుశ చట్టాలను ప్రవేశపెట్టింది. 1919లో పంజాబులో అల్లర్లు చెలరేగాయి. జలియన్‌వాలాబాగ్‌లో జనరల్ డయ్యర్ అతి కిరాతకంగా 400 మంది అమాయకులను పొట్టన పెట్టుకున్నాడు. ఈ కాలంలోనే గాంధీ రంగ ప్రవేశం చేశారు. 1921-22లో సహాయ నిరాకరణోద్యమాన్ని, ఆ తర్వాత 1930-31లో శాసనోల్లంఘనోద్యమాన్ని చేపట్టాడు. 1942లో ఆయన 'క్విట్ ఇండియా' ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఒక వైపున భారత దేశంలో బ్రిటిష్ వారితో చర్చలు, లండన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాలు జరుగతుండగానే, భారత జాతీయ కాంగ్రెస్ లాహోర్‌లో జరిగిన మహాసభలో సంపూర్ణ స్వరాజ్యం కోసం తీర్మానం చేసింది.

ఈ సమయంలోనే దేశంలో మత వైషమ్యాలు తీవ్రమయ్యాయి. ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగింపుకు వచ్చిన దశలో గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్ లాంటి వారు అరెస్టుకు గురయ్యారు. యుద్ధంలో బ్రిటిష్ వారికి మద్దతు ప్రకటించిన ముస్లిం లీగు ఈ కాలంలో బాగా విస్తరించింది. బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలోకి రావడంతో కొత్తగా ప్రధాని పదవిని చేపట్టిన అట్లీ భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని ఇస్తున్నామని ప్రకటించిన తర్వాత ప్రధాన రాజకీయ పార్టీలతోను, మత ప్రతినిధులతోను చర్చలు ముమ్మరమయ్యాయి. 1946లో కలకత్తాలో పెద్ద ఎత్తున మత కల్లోలం చెలరేగింది. ఇవి రెండుగా చీలిపోని భారత దేశం అసాధ్యమన్న భావనకు బలం చేకూర్చాయి. 1947 అగస్టు 14 అర్ధరాత్రి భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. అయితే దేశం పాకిస్తాన్, భారత్‌లుగా చీలిపోయింది. కాని దేశ విభజనతో కూడిన ఈ స్వాతంత్ర్యం లభించిన వెనువెంటనే మతకల్లోలాలు భయంకరంగా ప్రజ్వరిల్లాయి. దాదాపు 5 లక్షల మంది ఈ అల్లర్లలో ప్రాణాలు కోల్పోయారని. 1 కోటి 10 లక్షల మంది ముస్లిములు, హిందువులు, సిక్కులు భారత్, పాక్ సరిహద్దులలో అటునుండి ఇటు, ఇటునుండి అటు పయనించారని అంచనా. ఇప్పటికి చరిత్రలో ఇదే అతి పెద్ద వలసగా నమోదయి ఉంది.

2

# బ్రిటిష్ విస్తరణ

**పూర్వరంగం :**

కొద్ది మంది ఇంగ్లీషు వాళ్ళు ప్రాచీన నాగరికతను జయించి దాదాపు రెండు దశాబ్దాల పాటు పరిపాలించగలగడం విశ్లేషకుల్ని కూడా ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. 1757-1857 శతాబ్దంలో ఇంగ్లీషువారి 'ఈస్టిండియా కంపెనీ, స్వదేశ రాజులను జయించింది. రాజ్యాలను కలుపుకొన్నది లేక పరోక్షపాలన సాగించింది. కంపెనీ 2.5 మిలియన్ల చ.కి.మీ. లేక ఒక మిలియను చ.మై. అంటే 60 శాతానికి పైగా కలిగి 75%నికి పైగా ప్రజలు నివసించే భారత ఉప ఖండాన్ని తన ప్రత్యేక పాలన క్రిందికి తెచ్చుకొన్నది. మరో విధంగా చెప్పాలంటే బ్రిటిషిండియాలో భారతదేశంలోని 3/5 వంతు భూభాగం, 3/4 వంతు ప్రజలు వున్నారు. స్వదేశరాజుల అధీనంలో 2/5 భూభాగం 1/4వ వంతు ప్రజలు వున్నారు. బ్రిటిషువారు స్వదేశ రాజ్యాన్ని జయించినప్పుడు రాజ్యంలోని అన్ని ప్రాంతాలను బ్రిటీషిండియాలో కలుపుకోవాలను కోలేదు. జయించిన రాజ్యంలో కొంత భాగాన్ని లేక మొత్తం రాజ్యాన్ని రాజు అధీనంలోనే ఉంచి పరోక్ష పాలన సాగించారు. బ్రిటిషువాళ్ళు చాలా వరకు భారతదేశ పాలకుల రాజకీయ న్యాయ బద్ధతని గుర్తించారు. కాబట్టి బ్రిటిషువారు ప్రతి సందర్భంలోను రాజ్యంలో కొంత భాగాన్ని కలుపుకోవాలనే నిర్ణయం వారిలో వారు చర్చించుకొనే చేశారు.

బ్రిటిషువారు స్వదేశ రాజ్యాలను కలుపుకొన్నారు. కాని ప్రతి సందర్భంలోను వారి చర్యల్ని సహేతుకంగా అంటే బ్రిటీష్ ప్రజల్ని, భారత ప్రజల్ని ఒప్పించేందుకు న్యాయపరమైన సమర్ధనలు చూపారు. స్వదేశ రాజ్యాలపట్ల బ్రిటీష్ వారి వైఖరులు, విధానాలు 1757-1857 కాలంలో మారాయి. అంతే కాదు ఈ కాలంలో స్వదేశ రాజ్యాల పరిస్థితులు, విధానాలు కూడా మారాయి. ఈ మార్పులతో రాజ్యాలను కలుపుకొన్న తమచర్యలను సమర్ధించుకొనేందుకు బ్రిటీషువాళ్ళు పలు వివరణలు ఇచ్చారు. భారతరాజ్యాలను యిలా కలుపుకొనడాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే యిటు భారతీయులను అటు ఇంగ్లీషు వారి పరిస్థితులను చర్యలను అధ్యయనం చేయాలి.

భారతదేశంలో బ్రిటీషు పాలనకు ఒక రూపాన్ని ఏర్పరచడంలో భారతదేశంలోని రాజ్యాలకు, వర్గాలకు వ్యక్తులకు నిర్ణయాత్మకమైన పాత్ర వుంది. మొత్తం మీద సువ్యవస్థితులైన భారతదేశ పాలకులు కూడా 1757-1857 కాలంలో కంపెనీ విసిరిన సవాళ్ళను గురించి ఎదుర్కొనడంలో అశక్తులని నిరూపించుకొన్నారు.

రాజులు అనుసరించిన రాజకీయ, సైనిక విధానాల కారణంగా వారి పాలనా ప్రాంతాలపై వారిపట్టు బలహీనపడింది. వర్తకం యూరపు వారిచేతుల్లోకి లేక యూరోపియన్ల భాగస్వాములైన భారతీయుల చేతుల్లోకి పోవడంతో పాలకులు, వారి ఆర్థిక విధానాలు దెబ్బతిన్నాయి. మొగలు సామ్రాజ్యానికి యితర స్వదేశ రాజులకు సాంప్రదాయకంగా, పాలనాపరమైన, సైనిక పరమైన సేవలు చేస్తూ వచ్చిన కుటుంబాల వారికి కూడా కంపెనీ ఉద్యోగాలు ఆకర్షణీయంగా కన్పించాయి. వాస్తవంగా బ్రిటీష్‌వారి ఆక్రమణలకు భారతీయుల గణనీయమైన సహకారం కీలకాంశంగా పనిచేసింది.

ఐతే కంపెనీ రాజ్యాలలోని భూభాగాలను కలుపుకోడానికి ఏ పద్ధతుల్ని ఎలా ప్రయోగించింది, రాజ్యాల భూభాగాల్ని కలుపుకోడానికి ముందు వాటిపై అదుపు సాధించేందుకు కంపెనీ అధికారులు వివిధ పద్ధతులు అవలంబించారు. కలుపుకోవాలను కొనగానే కంపెనీ తన సైన్యాలను అక్కడికి పంపించలేదు. మిలటరీ ఘర్షణకు ముందు ప్రతి రాజ్యంలో కంపెనీ యొక్క రాజకీయ, ఆర్థిక సంబంధాలు దెబ్బతినేలా చేసేది. అప్పుడు రాజ్యంలో వాణిజ్య లేక రాజకీయ ప్రతినిధి (రెసిడెంటు)ని నియమించేది. 1757-1857 కాలంలో కంపెనీ అధికారం ప్రాబల్యం పెరగడంతో రాజ్యం యొక్క స్వయం ప్రతిపత్తిని తగ్గించేందుకు అనేక పద్ధతులు అవలంబించింది.

రాజ్యంతో చేసుకొనే ఒప్పందాలలో కంపెనీ జోక్యం చేసుకొనే హక్కుల్ని గురించి స్పష్టంగా చెప్పేది. కానీ కంపెనీ తరచుగా ఆ ఒప్పందాల్ని పట్టించుకొనేది కాదు. అతిక్రమించేది. కంపెనీ ప్రతి రాజ్యం నుండి కప్పం, యితర రూపాల ద్వారా పెద్ద మొత్తాలను పిండుకొనేది. ఇంకా వ్యాపార లావాదేవీల పేరుతో రాబట్టుకొనేది. అంతేగాక రాజు అధీనంలో గల సైన్యం యొక్క పరిమితిని, సామర్థ్యాన్ని తగ్గించేది. ఈ సైన్యాన్ని కూడా రాజ్యం వెలుపలికి పంపగూడదని నిషేధాలు విధించేది. ఆంతరంగికంగా రెవెన్యూ వసూళ్ళకు మాత్రమే పరిమితం చేయాలని ఆదేశించేది. రాజ్యం యొక్క సైనికాధికారాలను కంపెనీచే నియమింపబడిన సైన్యానికి (సైన్యానికి అయ్యే ఖర్చు మాత్రం రాజ్యం భరించాలి) మార్పించడం ద్వారా రాజులు కంపెనీని బాహాటంగా వ్యతిరేకించలేని ఆశక్తుల్ని చేసింది. వెంటనే రాజ్యాలను కలుపుకొనక రాజ్యం యొక్క అంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకొనడం ద్వారా కంపెనీ అన్ని భారతీయ రాజ్యాలపై పరోక్షపాలన సాగించింది.

ఆ విధంగా తొలి ఆక్రమణలు బలహీనపడిన రాజ్యాలపై సైనిక విజయాల ద్వారా జరిగాయి. కాని తరువాత తన పరోక్ష పాలనలో వున్న పాలకుల్ని తొలగించడం ద్వారా ఆ రాజ్యాలు కలుపుకోబడ్డాయి. కాని బెంగాల్ లాంటి కొన్నింటిలో లాంఛనపూర్వకంగా అధికారం చేపట్టడానికి ముందే వివిధ స్థాయిల్లో వాస్తవాధికారాన్ని స్థాపించుకొన్నది.

ప్రతి ఆక్రమణ ప్రజలను భారతీయ రాజుల పాలన నుండి బ్రిటీష్ పాలన క్రిందికి మార్చింది. ప్రజల జీవితాలపై చాలా ప్రభావాన్ని చూపింది. రాజులు, వారి కుటుంబాల పరంగా చూస్తే వారి అధికారాలు కుంచించుకుపోయాయి. కంపెనీ పింఛను దారులయ్యారు. ఇక రాజాస్థానంలోని ఉన్నతాధికారులు, రాజ భృత్యులు స్థానిక పరిస్థితులను పాత పాలనా వ్యవస్థకు అనుగుణంగా వున్న వారి విశేష పరిజ్ఞానాన్ని నూతన రాజకీయ, న్యాయసూత్రాలకు, విధానాలకు అనుగుణంగా మార్చుకోవలసి వచ్చింది లేక నిరుద్యోగులుగా వుండిపోవలసి వచ్చింది. వాణిజ్య వర్గాలకు భూస్వాములకు అది కొత్త చట్టాలను, కొత్త పన్ను విధానాన్ని తెచ్చిపెట్టింది. ఇక రాజ్యాలకు చెందిన నగర పట్టణ గ్రామ ప్రాంత ప్రజలకు వారి స్థాయిని బట్టి వారి జీవితాలలో రాజకీయ, ఆర్థిక, సామాజిక, మార్పుల ప్రభావం పడింది. ఈ మార్పుల ఫలితాలు వెంటనే స్పష్టంగా వ్యక్తం కాలేదు. కాని ప్రతిమార్పుకి స్వల్ప కాలిక, దీర్ఘకాలిక ఫలితాలు వున్నాయి.

**చారిత్రక నేపథ్యం:**

1757లో ఏ భారతీయుడుగాని, ఏ బ్రిటీషు వాడు గాని ఒక శతాబ్దం తరువాత వుండబోయే బ్రిటీష్ సామ్రాజ్యం యొక్క స్వరూపాన్ని అంచనా వేసి యుండడు. 1757లో రాజకీయ చైతన్యం గల భారతీయులు మొగలు సామ్రాజ్యాన్ని గురించి లేక అభివృద్ధి చెందుతున్న ప్రాంతీయ రాజ్యాల్ని గురించి గాని, రాజకీయ నమూనాలుగా కలలు గన్నారు. అప్పటికి సువ్యవస్థితమైన భారత రాజ్యాలనలా ఉంచి కనీసం ఈస్టిండియా కంపెనీ తన యూరప్ ప్రత్యర్థుల్ని అధిగమించడం కూడా ధృవపడలేదు. వాస్తవంగా భారతదేశంలోని రాజ్యాల అంతరంగిక వ్యవహారాలలో జోక్యం కలుగచేసుకొనే ఎత్తుగడని రూపొందించింది కూడా ఫ్రెంచి ఈస్టిండియా కంపెనీ గాని బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ కాదు.

కంపెనీ గాని, బ్రిటీష్ వారు మొత్తంగా గాని సమైక్యంగా సామరస్యంగా వారి కార్యకలాపాలు నిర్వహించలేదు. ఈ కాలమంతటా బ్రిటీషు ప్రభుత్వ విధానాలు, కంపెనీ విధానాలు కాలానుగుణంగా మారాయి. బ్రిటీషు ప్రభుత్వ విధానాలు భారతదేశంలో కంపెనీ అధికారులు చేపట్టిన చర్యలతో విభేదించాయి. కంపెనీ అధికారుల మధ్య కూడా పూర్తి సయోధ్య లేదు. సామాజిక, ఆర్థిక విధానాలపై బ్రిటన్‌లో చర్చలు, బ్రిటన్‌లో రాజకీయాధికారంలో వచ్చిన మార్పులు కూడా ఈ మార్పులకు తోడయ్యాయి. భారతదేశంలోని రాజ్యాల పట్ల కంపెనీ యొక్క నిలకడ లేని విధానాలు, ఆక్రమణలు జరపడంలో వ్యక్తమయ్యాయి.

కంపెనీలో విధాన నిర్ణయాలు చేసేందుకు వివిధ స్థాయిలున్నాయి. బోర్డ్ ఆఫ్ కంట్రోల్ (కంపెనీ వ్యవహారాలు పర్యవేక్షించేందుకు 1784 పిట్ ఇండియా చట్టంచే స్థాపించబడింది.) కోర్టు ఆఫ్ డైరెక్టర్లు (ఈస్టిండియా కంపెనీ ప్రొప్రయిటర్లచే ఎన్నుకోబడింది) కలకత్తాలో వుండే గవర్నర్ జనరల్-ఇన్-కౌన్సిల్ (మద్రాసు, బొంబాయి, గవర్నర్లను అజమాయిషీ చేసే బాధ్యత రెగ్యులేటింగ్ యాక్టు 1713చే కల్పించబడింది). మద్రాసు, బొంబాయి గవర్నర్లు ప్రెసిడెన్సీ పట్టణాలలో వుండే ఉద్యోగులు - భారత రాజ్యాలలో కంపెనీ

ఎలా వ్యవహరించాలో నిర్ణయిస్తారు. కంపెనీలో అంతర్గత విభేదాలుండడమే గాక కంపెనీకి బ్రిటిష్ ప్రభుత్వానికి మధ్య కూడా విభేదాలున్నాయి. అంతేగాక కంపెనీ వ్యవహారాలపై బ్రిటీషు ప్రజలలో తీవ్రమైన చర్చలు జరుగుతుంటాయి.

ఇక భారతదేశం వైపు నుంచి చూస్తే పరిస్థితి యింకా అధ్వాన్నంగా వుంది. స్వదేశీ రాజ్యాలు లేక సంస్థానాల స్థాయిలో కూడా విభిన్నమైన పాలనా పద్ధతులున్నాయి. వాటి పాలకులు వివిధ స్థాయిలలో పాలనాధికారాలు కలిగియున్నారు. 18వ శతాబ్ద గమనంలో మొగలు సామ్రాజ్యం క్రమంగా ప్రాంతాలుగా విచ్ఛిన్నమయింది. 1858 వరకు కూడ చక్రవర్తి పేరుకు మాత్రం సార్వభౌమాధికారిగా గుర్తించబడ్డాడు. సామ్రాజ్యానికి, మొగలు దర్బారుకి చెందిన వివిధ అంతర్గత బలహీనతలు, ఉద్రిక్తతలు, పెరుగుతున్న ప్రాంతీయ ప్రయోజనాలు గుర్తింపులు, బ్రిటీషు పలుకుబడి విస్తరణ యివన్నీ కలిసి సామ్రాజ్యాన్ని ఒకటిగా కలిపి వుంచిన సంబంధాలను బలహీనపరచాయి.

బెంగాల్, అవధ్, హైదరాబాద్ లాంటి సామ్రాజ్యంలోని సంపన్న ప్రాంతాలలో ప్రావిన్సుల గవర్నర్లు స్వయం ప్రతిపత్తి గల పాలకులయ్యారు. కర్నాటక, బెనారస్‌ల లాంటి ప్రాంతాలలో ఈ సామ్రాజ్యవాద గవర్నర్ల విధేయులు వంశ పారంపర్యంగా పదిలమైన స్థానాలు పొందారు. ఇతర కులం, మత ప్రాతిపదికగా ప్రజలతో సంబంధాలు గల వారు పాలకులుగా ఎదిగారు. పంజాబ్ మహారాజా, ఉత్తర భారతదేశమంతటా పలువురు రాజపుత్ రాజాలు, సింధుకి చెందిన అమీర్‌లు, మధ్య భారతదేశానికి చెందిన పలు రకాల మరాఠా పాలకులు ఈ కోవకు చెందినవారు. వీరు వివిధ స్థాయిల భూస్వాముల, మలబార్, అవధ్‌ల జమిందారుల ప్రయోజనాలను పదిలంగా కాపాడారు. వైవిధ్యభరితమైన ఈ పాలకులకు ఈస్టిండియా కంపెనీతో వివిధ రకాల సంబంధాలు ఏర్పడ్డాయి. వివిధ శ్రేణులకు చెందిన యిలాంటి పాలకులు భూస్వాములు బ్రిటీషు వారితో వ్యక్తిగత సంబంధాలు పెట్టుకొన్నారు. సమన్వయంతో కూడిన ఎలాంటి విధానాలను అనుసరించని వీరంతా భారతదేశ పరిస్థితిని మరింత బలహీనపరిచారు.

బ్రిటీషు ఆక్రమణల పద్ధతిని రూపొందించడంలో భారతీయ సమాజంలోని యితర సెక్షన్లు కూడా ముఖ్యపాత్ర నిర్వహించాయి. వీరు నిర్వహించిన పాత్ర రాజులంత సులభంగా గుర్తించ వీలుపడనివి. అదే సమయంలో వైవిధ్య భరితమైనవి. పరిపాలనా నిర్వహణలోను, సైన్యంలోను ఉన్నతోద్యోగాలు చేసి రాజుల పాలనలో కీలకపాత్ర నిర్వహించిన వీరికి ఈస్టిండియా కంపెనీతో ఎలా వ్యవహరించాలో తెలుసు. భారతదేశంలోని రాజ్యాలతో బ్రిటీషు వారి సంబంధాలకు మార్గదర్శకత్వం నిర్వహించడానికి, అలాగే ఆక్రమణ ప్రాంతాల పాలనా నిర్వహణలో బ్రిటిషువాళ్ళకు సహాయ పడేందుకు సరిగ్గా యిలాంటి విధేయ భారతీయుల అవసరం కంపెనీకి వుంది. వర్తకులు, ఉత్పత్తిదారులతో కూడిన భారతీయ వాణిజ్య వర్గాలు ఆక్రమణలకు ముందు, ఆ తరువాత కూడ సంస్థానాలలో ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను ప్రభావితం చేశారు. వాటిచే ప్రభావితులయ్యారు. వ్యవసాయదారులు, శ్రామికులు బాధలకు

గురయ్యారు. నూతన రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులకు పలురకాలుగా ప్రతికూలంగా స్పందించారు.

**విస్తరణకు కారణాలు:**

బ్రిటిషు విస్తరణల్ని ఆధునిక విశ్లేషకులు ఆర్థిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో విస్తరణకు దారితీసిన శక్తులను గుర్తించ యత్నిస్తారు. బ్రిటీషువాళ్ళను ఏకశిలా సదృశ్యంగా కాక చాలా ప్రాథమిక అంశాలలో వారిలో విభేదాలున్నట్లు పరిగణిస్తారు. ఈస్టిండియా కంపెనీ, బ్రిటీషు ప్రభుత్వంలో గల వివిధ అంశాల వెనుక వున్న ఉద్దేశాలను అధ్యయనం చేస్తారు. మారుతున్న ప్రాపంచిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల నేపథ్యంలో భారతదేశంలో బ్రిటిషు ఆక్రమణల స్థానాన్ని నిర్దేశిస్తారు. భారతదేశానికి, ప్రపంచానికి కొత్తవియైన ఈస్టిండియా కంపెనీలో రూపుదిద్దుకొన్న శక్తులను చూస్తారు. 17వ, 18వ శతాబ్దాలలో బ్రిటన్‌లోను, యితర యూరపు ప్రాంతాలలోను వచ్చిన రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పులు ఈస్టిండియా కంపెనీ నిర్వహణలోను, కంపెనీకి చెందిన వ్యక్తులలోను ప్రతిఫలించినట్లు పరిగణిస్తారు. యూరపులో అభివృద్ధి చెందిన సైనిక నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం కూడా భారత రాజ్యాలతో ఘర్షణలలో కంపెనీకి అనూహ్యమైన సానుకూలతలను తెచ్చిపెట్టాయి. దేశంలో జరుగుతున్న మార్పులతో పాటు బ్రిటన్ కేంద్రముగా నూతన ప్రాపంచిక విధానం భారతదేశం యొక్క సాంప్రదాయ వాణిజ్య రాజకీయ స్థితిని మార్చింది.

వనరులను సమీకరించుకొనేందుకు, ఉపఖండంపై విజయం కొరకు భారత సమాజంలోని అంశాలను ఎంపిక చేసుకొనేందుకు నిస్సందేహంగా ఇంగ్లండులో వచ్చిన సామాజిక సాంకేతిక మార్పులు దోహదపడ్డాయి. వాణిజ్య మధ్య తరగతికి రాజకీయాధికారం సమకూర్చిన సామాజిక విప్లవం, బ్రిటీషు నౌకాదళానికి ఈస్టిండియా కంపెనీ సైన్యానికి దక్షిణాసియాలో భారతీయ శక్తులపై ఆధిక్యతను సాధించిపెట్టిన సైనిక, సాంకేతికాభివృద్ధి – ముఖ్యమైన అంశాలు. మరొక విధంగా చెప్పాలంటే క్రియాశీల బ్రిటీషు జాతీయరాజ్యం ఆసియా వర్తక విధానాలను మార్చివేసింది. లాభాల ప్రవాహాలను బ్రిటన్‌కి తరలించింది. ఆఖరుకి వాణిజ్యాన్ని, భూమి రెవెన్యూలను గుంజడంతో కంపెనీ హేతుబద్ధమైన ఉన్నతాధికార పరిపాలనా యంత్రాంగాన్ని క్రమశిక్షణా యుతమైన యూరోపియన్ తరహా భారతీయ సైన్యాన్ని నిర్మించగలిగింది.

అందుకు విరుద్ధంగా భారతీయ రాజ్యాలలోని ఆధిపత్య వర్గాలు – పాలకులు, మంత్రులు, సామంతులు – సైనికాధికారులు, పాలనాయంత్రాంగ నిర్వాహకులు, వారసత్వ భూస్వాములు, సాంప్రదాయ కులీన ధోరణులు కొనసాగించారు. అయినప్పటికి భారతీయ సమాజంలో నూతన ఆర్థిక సామాజిక శక్తులు అభివృద్ధి చెందాయి. వ్యాపారీకరణ సమాజంలోని వివిధ గ్రూపుల సంబంధాలను మార్చింది. మొగలు సామ్రాజ్య కులీనులు నెమ్మదిగా తమ ప్రాభవాన్ని ఆధిక్యతని కోల్పోయారు. చిన్న చిన్న రాజులు రెవెన్యూ మిలటరీ దళారులు, బ్యాంకర్లు, వగైరాలు ఆధిక్యత సాధించారు. దేశీయపెట్టుబడిదారీ విధాన ప్రతినిధులయ్యారు.

ఆ పరిస్థితులలో బ్రిటీషువారు క్రియాశీలమైన రాజకీయ, ఆర్థిక విధానాలతో అంతులేని లాభాపేక్షతో భారతదేశ ఆర్థిక విధానంలోకి చొచ్చుకొని వచ్చారు. కంపెనీ అభివృద్ధి చెందుతున్న భారతీయ వాణిజ్య వర్గాలను మచ్చిక చేసుకోవడంలో గణనీయంగా విజయం సాధించింది. వారసత్వంగా సేవలు చేస్తున్న కులీనులను పాశ్చాత్య తరహా పరిపాలనా వర్గంగా మార్చి కంపెనీ సేవలకు వినియోగించుకొన్నది.

ఇంగ్లీషు, ఇతర యూరపు దేశాల ఈస్టిండియా కంపెనీల కార్యకలాపాలతో భారతదేశంలో వచ్చిన సామాజిక, ఆర్థిక మార్పులు, బ్రిటిషు వారి విజయాన్ని భారత రాజ్యాల ఆక్రమణని సుగమం చేశాయి. భారత వాణిజ్య శక్తుల పెరుగుదలతో తొలుత ప్రయోజనాలు పొందిన మొగలు సామ్రాజ్యం వాటిపై అదుపు కోల్పోయింది. యూరోపియన్ వర్తకం కూడా బెంగాల్ పాలకులను, యితర ఆదాయ వనరులను వెతుక్కోమని ఒత్తిడి చేస్తు బలహీనపర్చింది. యూరపు వాణిజ్య శక్తులు భారతీయ సామ్రాజ్యాన్ని పశ్చిమ కోస్తా నుండి అశక్తుల్ని చేశాయి. అలాగే మైసూరు, మరాఠా రాజ్యాలు మొదట బ్రిటిషు వారిపై కత్తి కట్టి కంపెనీ సైనికంగా బలపడేలా రెచ్చ గొట్టాయి. కాని ఈ రాజ్యాలు సరియైన వనరులు సేకరించుకోలేక కొడికట్టుక పోయాయి. ఉపఖండం వెలుపల నుండి భారతదేశానికి చేరుకొనే వాణిజ్య మార్గాలను బ్రిటిషు నౌకా బలం అడ్డుకొన్నది. ఆ విధంగా బ్రిటన్ దేశీయ సమాజాన్ని ఛిన్నాభిన్నం చేసి పాలకులను బలహీనపరిచి తన అంతర్జాతీయ ఆర్థిక విధానంపై భారతదేశం ఆధారపడేలా చేసింది.

## చరిత్ర రచన ధోరణులు

కాలక్రమంలో బ్రిటిషు అక్రమాలపై వస్తున్న ఆలోచనలలో చాలా మార్పులు వచ్చాయి. భారతదేశంలో ఆక్రమణలు నిర్వహించిన రాబర్ట్ క్లైవ్, జాన్ మాల్కమ్, యితర బ్రిటిషు అధికారులు వ్యక్తి గత ఆశ చోదక శక్తిగా పనిచేసిందని అంగీకరించారు. దీనిని భారతీయులపై బ్రిటిషు వారి ఆధిక్యతకు సూచనగా భావించి గర్వించారు. కాని స్వాతంత్ర్యానంతర కాలంలో బ్రిటిషు వారినైతిక ఆధిక్యత ఏమాత్రం అంగీకారయోగ్యం కాలేదు.

బ్రిటీషువారు చెప్పుకొనే సాంస్కృతిక ఆధిక్యతను చాలా మంది చరిత్రకారులు అంగీకరించరు. కాని అధ్యయనాంశంగా స్వీకరిస్తారు. భారతదేశంలోను ప్రపంచంలోని యితర భాగాలలోను బ్రిటీషు విస్తరణని వివరించడంలో భాగంగా బ్రిటీషు వారి స్వీయ మానసిక ధోరణులను అర్థం చేసుకోవడం ముఖ్యం. భారతదేశ పాలకులపై బ్రిటీషువారి సాంస్కృతిక ఆధిక్యతకు సంబంధించిన అంచనాలను ఈ రచయితలు ఆక్రమణలను సమర్థించుకొనేందుకు బ్రిటిషు వారి ప్రయత్నాలుగా పరిగణిస్తారు. బ్రిటిషువారు భారత రాజ్యాలను ఆక్రమించడం న్యాయ సమ్మతంగా భావించి వుండవచ్చు కాని ఆక్రమణలు జరగడానికి కారణం బ్రిటీషు వారి న్యాయసంగతం కారణం కాదు. ఈ రచయితల దృష్టి కోణం మేరకు బ్రిటీషు వారు ఎలాంటి నిలకడ గల నైతిక నియమాలను పాటించలేదు. బ్రిటీషు పాలకులు తమ సామ్రాజ్య వాదాన్ని సమర్థించుకొనేందుకు ఒక దానికొకటి పొసగని

నాలుగు సిద్ధాంతాలను ఉపయోగించుకొన్నారు. సామ్రాజ్యాన్ని ధర్మకర్తగా పేర్కొన్న ఎడ్మండ్ బర్క్ ఆలోచన, జరిమీ బెంతామ్ యొక్క ఉపయోగితావాదం, రాజ్యం ప్రజల సంరక్షకుడనే ప్లేటో భావన, విలియం విల్బర్ ఫోర్స్ యొక్క సువార్త బోధనావాదం.

జాతీయవాద చరిత్ర కారులు బ్రిటీషు ఆక్రమణల్ని జాతీయవాద దృష్టి కోణం నుండి అంచనా వేశారు. ఒక వైపు బ్రిటిషువారు విజయానికి ముందు భారతదేశంలోని రాజ్యాలు కొనసాగే హక్కు గల చట్ట బద్ధమైన రాజ్యాలని వక్కాణిస్తూ ఈస్టిండియా కంపెనీ సామ్రాజ్యాన్ని ఖండిస్తారు. ఏ ఆక్రమణ కూడా న్యాయ సమ్మతం కాదని నిర్ణయానికి వస్తారు.

మరో వైపు ఈ చరిత్రకారులే వంశపారంపర్యమైన రాచరిక పాలన భారతదేశ సామాజిక రాజకీయ సంస్కరణల అభివృద్ధికి హానికరమైనదని భావిస్తారు. భారత జాతీయతా వాద ప్రవాహానికి అడ్డుకట్టగా యున్న బ్రిటీషు వారి ఉపేక్షాంగీకారం కారణంగానే మనగలుగుతున్న న్యాయ బద్ధత కోల్పోయిన సంస్థానాలను పరిరక్షిస్తున్న బ్రిటిషు పాలనను ఖండిస్తారు. బ్రిటీషు ఆక్రమణలు నైతికంగా సమర్ధనీయాలు కాకపోయినప్పటికి అవి సానుకూల ఫలితాలకు దారి తీశాయి. ఆ విధంగా ఆక్రమణల ద్వారా కంపెనీ ఉద్దేశ రహితంగా జాతీయవాదులు నిర్వహించవలసిన స్వతంత్ర భారతదేశ కర్తవ్యాన్ని సులభతరం చేసింది. అంతే కాక ఆక్రమణలు ఉద్దేశరహితంగానే భారతదేశ సమైక్యతకు తోడ్పడ్డాయి. 1947 ముందునాటి వలసవాద చరిత్రకారులకు భిన్నమైన ధోరణిలో 1757-1857 నాటి ఆక్రమణలను భారతజాతీయవాద పరిణామంలో భాగంగా పరిగణిస్తారు.

అలాగే మార్క్సిస్టు చరిత్ర కారులు ఆక్రమణలను చారిత్రక పరిణామ వాదనతో వివరిస్తారు. ఆక్రమణల ద్వారా భారతదేశంలోని ఫ్యూడల్ కులీన పాలనని యూరపు సామ్రాజ్యవాదం తొలగించడం భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధికి ముందు షరతుగా పరిగణిస్తారు. తరువాత వారి ఉద్దేశాన్ని అనుసరించి బ్రిటీషు వారు ఆక్రమించిన ప్రాంతాలలో అభివృద్ధి చెందిన వాణిజ్య బూర్జువా వర్గపాలన పీడితులచే ధ్వంసం చేయబడాలని ఆకాంక్షిస్తారు.

**విస్తరణ క్రమం:**

మొగలు పాలన ఉన్నతదశలో వున్న కాలంలో చాలా మంది యూరోపియన్లు వర్తకం కొరకు భారతదేశానికి వచ్చారు. యూరోపియన్లు జాయింటు స్టాకు కంపెనీలుగా సంఘటిత మయ్యారు. ఫ్యాక్టరీల పేరుతో వర్తక స్థావరాలను స్థాపించుకొన్నారు. భారతదేశ వాణిజ్యంపై గుత్తాధిపత్యం కొరకు వారిలో వారు పోటీ పడ్డారు. ఈ పోటీలో ఇంగ్లీషువారు, పోర్చుగీసు, డచ్చివాళ్ళపై సులభంగా విజయాలు సాధించారు. కాని ఫ్రెంచి వారి నుండి గట్టి ప్రతిఘటన నెదుర్కొన్నారు. 18వ శతాబ్దం మధ్య కాలం నుండి ఇంగ్లీషు కంపెనీ భారతదేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవహారాలలో జోక్యం చేసుకొనడం ప్రారంభించింది. సముద్ర తీరప్రాంతాలకు చెందిన పాలకులు బ్రిటీషు వ్యాపారులను తమ కనుకూలంగా

ఉపయోగించుకోవాలని యత్నించారు.  కాని బ్రిటీషు వ్యాపారులు సైనిక పరంగా, ఆర్థిక పరంగా ఇనుప గుగ్గిళ్ళుగా నిరూపించుకొన్నారు.  యూరపు ఆయుధాలు కలిగి సైనిక వ్యూహాలలో ఉద్దండులైన కొద్ది మంది కంపెనీ అధికారులు, వారిచే నియమింపబడిన భారత సైనికులు మొగలు సామ్రాజ్య ప్రాంతీయ పాలకులపై ఆధిక్యత సాధిస్తూ వచ్చారు.  కంపెనీ మిలటరీ స్థావరాలకు వాణిజ్యపరమైన సైనిక పరమైన అండదండలు ఎప్పుడు వుండేవి.  భారతదేశ రాజ్యాలలో కంపెనీ జోక్యానికి సైన్యాలు వెన్నుదన్నుగా నిలిచాయి.  మరిన్ని జోక్యాలకు దారితీసాయి.

ఆంగ్లేయులు, ఫ్రెంచి వారి మధ్య వర్తక పోటీ, ఆ తరువాత భారత రాజ్యాలలో జోక్యం చేసుకొన్న వారి కార్యకలాపాలు కర్నాటక యుద్ధాలకు దారితీశాయి.  మూడవ కర్నాటక యుద్ధం ముగిసేటప్పటికి దక్షిణ భారతదేశంలో బలమైన పోటీదారుగా ఉన్న ఫ్రెంచి వారు నెట్టివేయబడ్డారు.  ఈ మధ్య కాలంలో మరొక ముఖ్య ప్రాంతమైన బెంగాల్‌లో రాజకీయ పరిస్థితులలో చాలా మార్పులు సంభవించాయి.  బెంగాల్ భారతదేశంలో చాలా సారవంతమైన సంపద్వంతమైన ప్రాంతాలలో ఒకటి.  బెంగాల్ మొదట మొగలు పాలనలో వున్న ప్రాంతం. 18వ శతాబ్దంలో స్వతంత్ర రాజ్యమయింది.  బ్రిటీషు వారి ప్రతికూల కార్యకలాపాలను గమనించిన అప్పటి బెంగాల్ నవాబు సిరాజుద్దౌలా బెంగాల్ భవితవ్యాన్ని గురించి ఆందోళన చెందాడు.  బ్రిటీషువారిపై గట్టి చర్య చేపట్టాలని నిర్ణయించాడు. ఫలితంగా సంభవించిన ఘటనలు ప్లాసీ యుద్ధానికి దారితీశాయి.  ఈ యుద్ధం బ్రిటీషువారిని బెంగాల్‌లో పాలనని నిర్ణయించగలిగే స్థితికి పెంచింది.  ఆ తరువాత బ్రిటీషువారి కార్యకలాపాలు బక్సరు యుద్ధరూపంలో తుది పరీక్షకు దారితీశాయి.  ఇదొక మూల మలుపు. ఈ యుద్ధం తరువాత పేరుకి మాత్రం నవాబు పాలకుడుగా కొనసాగినప్పటికి నిజమైన అధికారాలు బ్రిటీషు వారికి దక్కాయి.  బెంగాల్‌ని స్థావరంగా చేసికొని బ్రిటీషువారు భారతీయుల రాజ్యాధికారంతో మొదట సమానులుగా పోటీకి దిగి ఆ తరువాత యజమానులుగా చెలాయించారు.  కర్నాటక యుద్ధాలలో విజయంతో మరీ ముఖ్యంగా బెంగాల్ యుద్ధ విజయాలతో బ్రిటీషువారి భారతదేశ జైత్రయాత్ర క్రమం ప్రారంభమయింది.  1765 నాటికి బ్రిటిషువారు బెంగాల్, బీహారు, ఒరిస్సాలకు నిజమైన పాలకులవడమే గాక కర్నాటక, అవధ్ నవాబులకు విధి విధానాలను నిర్దేశించడం ప్రారంభించారు. కాని బ్రిటీషు వారి మరొక అర్ధశతాబ్దం పాటు మరాఠాలతో పోరాడవలసి వచ్చింది.  హైదరాబాదు, మైసూరు రాజ్యాల ప్రతిఘటనని అధిగమించవలసి వచ్చింది. ఈ క్రమం ముగిసేటప్పటికి భారతదేశంలోని చాలా ప్రాంతాలు బ్రిటీషు వారి అదుపులోకి వచ్చాయి.

**కర్నాటక యుద్ధాలు:**

ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీకి, ఫ్రెంచి ఈస్టిండియా కంపెనీకి మధ్య నిరంతరంకొనసాగిన వాణిజ్యపరమైన పోటీ ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీకి భారత రాజ్యాలలో జోక్యం చేసుకోవాలనే ప్రేరణ నిచ్చింది.  చందనాగూర్‌కి ఫ్రెంచి గవర్నరుగాను (1731-41)

ఆతరువాత భారతదేశంలో ఫ్రెంచి గవర్నరు జనరల్‌గాను (1741–54) ఉన్న డూప్లే భారత రాజ్యాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం కలుగచేసుకొనే విధానాన్ని ప్రారంభించాడు. ఆ తరువాత ఇంగ్లీషువారు అనుకరించారు. దక్షిణ భారతదేశంలో హైదరాబాద్ కర్నాటక నవాబులు వారసత్వ అధికారం కొరకు కీచులాడుకొంటూ వుండగా ఒకరి పక్షాన్ని బ్రిటీషువారు మరొక పక్షాన్ని ఫ్రెంచివారు బలపరచారు. చివరికి ఇంగ్లీషు కంపెనీ సైనిక విజయాలు (రాబర్ట్ క్లైవ్ ఆధ్వర్యంలో) సముద్రాలపై బ్రిటీషు నౌకాదళాలు సాధించిన అదుపు ఫ్రెంచి వారిని రంగం నుండి నెట్టివేశాయి. దీనితో దక్షిణ భారతదేశంలో ఇంగ్లీషు కంపెనీ పట్టు సాధించింది.

ఇంగ్లీషువారు సాధించిన విజయాల ఫలితంగా కర్నాటక నవాబు కంపెనీకి మద్రాసు సమీపంలో 1763లో కొంత ప్రాంతాన్ని జాగీరుగా కేటాయించాడు. కాని 1765 నాటికి కంపెనీ కర్నాటక నవాబు పాలనలో వున్న అన్ని ప్రాంతాలపై అదుపు సాధించింది. ఆ తరువాత కంపెనీ 35 సంవత్సరాల పాటు కర్నాటకపై కర్నాటక పాలకునిపై ప్రత్యక్ష, పరోక్ష అదుపుపై పలు ప్రయోగాలు చేసింది. 1801లో కంపెనీ, నవాబుని నామమాత్రపు అధికారం నుండి కూడా తొలిగించింది. కాని 1766 వరకు కంపెనీ గణనీయమైన భూభాగాన్ని కైవశం చేసుకోలేదు. 1766లో హైదరాబాద్ నిజాం ఉత్తర సర్కారులను కంపెనీకి బదిలీ చేయడంతో మొదటి ఆక్రమణ ప్రారంభమయ్యింది.

## బెంగాల్ విజయం:

కర్నాటక యుద్ధాలలో తన సత్తా చూపించిన క్లైవ్ కంపెనీ కోల్పోయిన కలకత్తాను తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు బెంగాల్ వెళ్ళాడు. దక్షిణ భారతదేశంలో కంపెనీ నేర్చుకొన్న పాఠాలను క్లైవ్ నవాబుకి వ్యతిరేకంగా ప్రయోగించాడు. ప్లాసీ యుద్ధం (1757) బెంగాల్, బీహారులను కంపెనీ అధీనంలోకి తెచ్చినప్పటికి వాటిపై కంపెనీ పాలన చేపట్టలేదు. కంపెనీ సైనిక విజయాలు ఒక్కసారిగా 150,000 చ.మై. (388,000 చ.కీ.మీ)పై అంటే ఇంగ్లాండు వైశాల్యానికి 3 రెట్లు భూభాగంపై కంపెనీకి అధికారాన్ని తెచ్చిపెట్టాయి. కంపెనీ బెంగాల్ నవాబు పేరుతో పాలనా వ్యవహారాలు సాగించినప్పటికీ అది అధికారికంగా 1772 వరకు రెవెన్యూ వసూలు బాధ్యతలు చేపట్టలేదు. 1757లో నవాబు కంపెనీకి కేటాయించిన 24 పరగణాలో జమిందారీ బాధ్యతలు మాత్రమే నిర్వహించింది.

## ప్లాసీయుద్ధం

**కారణాలు:** బ్రిటీషువారు దక్షిణ భారతదేశంలో నేర్చుకొన్న పాఠాలను సారవంతమైన సంపన్న వంతమైన బెంగాల్‌కి అన్వయింపచేశారు. బెంగాల్‌లో వాణిజ్యం, పరిశ్రమలు, అభివృద్ధి చెందాయి. సహజంగా ఈస్టిండియా కంపెనీకి, కంపెనీ ఉద్యోగులకు అక్కడ చాలా లాభాలు తెచ్చిపెట్టే వాణిజ్య ప్రయోజనాలున్నాయి. ఈ ఆర్థిక ప్రయోజనాలే కాక 1717 నాటి మొగలు ఫర్మానాకు బ్రిటీషు వారు చేసిన విపరీత వ్యాఖ్యానాలు దస్తక్‌ల (free pass) దుర్వినియోగం

కూడా యుద్ధానికి కారణాలు. 1717లో మొదట చక్రవర్తి జారీ చేసిన ఫర్మానా క్రింద బ్రిటిషు కంపెనీ చాలా విలువైన రాయితీలు పొందింది. ఫర్మానాననుసరించి కంపెనీ బెంగాల్‌లో సరుకుల ఎగుమతి, దిగుమతులను సుంకాలు చెల్లించకుండా చేసుకోవచ్చు. అలాంటి వస్తువుల రవాణాకు కంపెనీ దస్తక్ (free pass) లను ఇచ్చే హక్కు కూడా కలిగి వుంటుంది. కంపెనీ ఉద్యోగులు కూడా వర్తకం చేసుకోవచ్చు. కాని ఈ ఫర్మానా వారికి వర్తించదు. ఈ ఫర్మానా కంపెనీకి బెంగాల్ నవాబుకి మధ్య నిరంతర ఘర్షణకి కారణమయింది. ఒకటి : ఈ ఫర్మానా కారణంగా బెంగాల్ ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. రెండు : కంపెనీ ఉద్యోగులు చేసే ప్రైవేటు వ్యాపారం పై పన్నుల రాయితీ పొందేవారు. వారికి దస్తక్‌లు యివ్వబడ్డాయి. ముర్షిద్ కులీఖాన్ నుండి ఆలీవర్ది ఖాన్ వరకు బెంగాల్ నవాబులందరూ ఫర్మానాపై బ్రిటిషు వారు చేసే విపరీత వ్యాఖ్యలకు అభ్యంతరం చెప్పారు. కంపెనీపై ఒత్తిడి చేసి పెద్ద మొత్తాలు ప్రభుత్వ ఖజానాకు రాబట్టారు. దస్తక్‌ల దుర్వినియోగాన్ని ధృడంగా అణచివేశారు. కంపెనీ, నవాబు ఆజ్ఞ పాటించక తప్పలేదు. కానీ కంపెనీ ఉద్యోగులు పన్నులు ఎగ వేయడానికి అధికారాన్ని ధిక్కరించడానికి ప్రతి అవకాశాన్ని వినియోగించుకున్నారు. కాని 1756లో సిరాజుద్దౌలా సింహాసనాన్ని అధిష్టించే నాటికి పరిస్థితులు ఒక కొలిక్కి వచ్చాయి.

అనుభవరాహిత్యం, తొందరపాటు వున్నప్పటికీ యువకుడు, ఉత్సాహవంతుడైన సిరాజుద్దౌలా కంపెనీ పై తన పూర్వీకులు అమలు జరిపిన విధినిషేధాలను కొనసాగించాలను కొన్నాడు. కాని ఇప్పుడు బ్రిటిషువారు దక్షిణ భారతదేశంలో ఫ్రెంచి వారిపై సాధించిన విజయంతో పొందిన ఆత్మవిశ్వాసంతో, భారత రాజ్యాల రాజకీయసైనిక బలహీనతలపై కలిగిన అవగాహనతో నవాబు అధికారాన్ని తిరస్కరించేటంత బలంగా ఉన్నామని భావించారు. బ్రిటీష్‌వారు కలకత్తాలోకి వచ్చే తమ వస్తువులపై పన్నులు చెల్లించ నిరాకరించారు. ఈ చర్య నవాబుకి చిరాకు కలిగించింది. కంపెనీ తనకు ప్రతికూలంగా తన ప్రత్యర్థులకు మద్దతు యిస్తున్నట్లు అనుమానించాడు.

దానికితోడు నవాబు నుండి ముందుగా అనుమతి పొందకుండా కలకత్తాలో బ్రిటీష్‌వారు కోటలు కట్టారు. పడగొట్టవలసిందిగా నవాబు జారీ చేసిన ఆదేశాలను బ్రిటీష్‌వారు ఖాతరు చేయలేదు. నవాబు ఆదేశాలను తమ స్వయం ప్రతిపత్తిపై చేసిన దాడిగా పరిగణించారు. అంతేగాక బ్రిటిషువారిని, ఫ్రెంచివారిని తన భూభాగంపై పోట్లాడుకోవడానికి అవకాశం యిస్తే కర్నాటక నవాబుకి పట్టిన గతే తనకు పడుతుందని సిరాజుద్దౌలా ఆందోళన చెందాడు. మరొక విధంగా చెప్పాలంటే సిరాజ్‌కి యూరోపియన్లు వర్తకులుగా ఉండడం యిష్టమే గాని యజమానులుగా వుండడం కాదు. ఆయన ఇంగ్లీషువారిని, ఫ్రెంచివారిని కలకత్తాలో చందనాగూర్‌లో గల కోటలను పడగొట్టమని పరస్పరం పోట్లాడుకోవద్దని ఆదేశించాడు. ఫ్రెంచివారు ఆదేశాలను పాటించారు. కర్నాటక విజయాలతో ఆత్మవిశ్వాసం పెంచుకొన్న ఇంగ్లీషు వారు పాటించలేదు. ఇంగ్లీషువారు నవాబు అభీష్టంతో పని లేకుండా బెంగాల్‌లో వుండాలని తమ షరతులతో వాణిజ్యం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం నవాబు అధికారాన్ని ప్రత్యక్షంగా సవాలు చేసినట్లయింది. సిరాజ్ ఇంగ్లీషు వారి కుతంత్రాల దీర్ఘకాలిక

ఫలితాలను పసిగట్టగల రాజనీతిజ్ఞుడు. కాబట్టి ఇంగ్లీషువారిని తన రాజ్య చట్టాలకు కట్టుబడి వుండేలా చేయాలని నిర్ణయించాడు.

సిరాజ్ కాశింబజారు అనే ఇంగ్లీషు ఫ్యాక్టరీని పట్టుకొన్నాడు. ఇంకా ముందుకు సాగి 1756లో కలకత్తాలోని విలియం పోర్టు ఆక్రమించాడు. ఇంగ్లీషువారికి నౌకలలో పారిపోవడానికి అవకాశం కల్పించి విజయోత్సవాలు జరుపుకోడానికి వెనుదిరిగాడు. ఇది సిరాజ్ చేసిన ఘోరతప్పిదం. అతడు శత్రు బలాన్ని జిత్తులమారి తనాన్ని తక్కువగా అంచనా వేశాడు. మద్రాసు నుంచి సహాయం లభించిన తరువాత బ్రిటీషువారు క్లైవ్ నాయకత్వంలో కలకత్తా పోర్టుని తిరిగి స్వాధీనం చేసుకొన్నారు. నవాబుపై ఒత్తిడి తెచ్చి ఇంగ్లీషు వారి డిమాండ్లన్నింటినీ సాధించగలిగారు. కాని బ్రిటీషువారు ఈ రాయితీలతో సంతృప్తి చెందలేదు. వారి లక్ష్యాలు సాధించేందుకు సిరాజ్ స్థానంలో ఒక కీలు బొమ్మని కూర్చోబెట్టాలని నిర్ణయించారు. నవాబు దర్బారులోని కులీనులతో కుట్రలు, కుహకాలు జరిపి తీర్చడానికి సాధ్యపడని డిమాండ్ల పత్రాన్ని నవాబుకి అందచేశారు. తాడోపేడో తేల్చుకొనే తుది సమరం అనివార్యమని యిరుపక్షాలు గుర్తించాయి. 1757 జూన్ 28న ఇరుపక్షాలు ప్లాసీలో తలపడ్డాయి. ప్లాసీ యుద్ధం పేరుకు మాత్రమే యుద్ధం. నవాబు సైన్యంలోని పెద్ద భాగం కుట్రదార్లయిన మీర్జాఫర్, రాయ్ దుర్లభ్‌ల నాయకత్వాన గల సైన్యం యుద్ధంలో పాల్గొనలేదు.

**ఫలితాలు:**

ప్లాసీ యుద్ధానికి చాలా రాజకీయ ప్రాధాన్యత వుంది. ఈ యుద్ధం కేవలం బెంగాల్‌లోనే గాక మొత్తం భారతదేశంలో బ్రిటీషు ఆధిపత్యానికి బాటవేసింది. ఇంగ్లీషు వారు బెంగాల్‌కి వాస్తవ పాలకులు అయ్యారు. కొత్త నవాబు మీర్జాఫర్ వారి చేతిలో కీలు బొమ్మగా వుండిపోయాడు. ఇంగ్లీషువారు బెంగాల్ వనరులను బెంగాల్‌లో తమ రాజకీయ ఆర్థిక ప్రయోజనాలకు వాడుకొన్నారు. భారతదేశంలో పోటీ దారులుగా వున్న ఫ్రెంచి వారినే గాక క్రమంగా దేశీయ రాజులను కూడా తుడిచిపెట్టడంలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించగల సైన్యాన్ని సాయుధ సంపత్తిని సమకూర్చుకోగలిగారు. వాస్తవంగా భారతదేశంపై బ్రిటీషువారి విజయం ప్లాసీ యుద్ధంతో ప్రారంభమయింది. అందుకే అంత విస్తృతమైన అంత దీర్ఘకాలికమైన ఫలితాలను తెచ్చి పెట్టిన యుద్ధం మరొకటి లేదంటారు.

అంతేగాక ఈ యుద్ధం భారతదేశంలో బ్రిటీషువారి ప్రతిష్ఠని పెంచింది. ఒక్క దెబ్బతో భారత సామ్రాజ్యానికి పోటీ స్థాయికి ఎదిగింది. చాలా శక్తిమంతుడుగా భావించబడే బెంగాల్ నవాబుని కంపెనీ ఓడించి భారత రాజకీయ బలహీనతని బహిర్గత పరచింది. బెంగాల్ ప్రజల్ని పీల్చి పిప్పి చేసి కంపెనీ, కంపెనీ ఉద్యోగులు అపారమైన సంపదనుపోగు చేసుకొనే అవకాశం కల్పించింది. బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో కంపెనీకి పన్ను చెల్లించకుండా వర్తకం చేసుకొనే హక్కు లభించింది. కంపెనీ కలకత్తా సమీపంలోని 24 పరగణాలను జమీందారీగా పొందింది. కలకత్తాపై దాడి చేసినందుకు 17.7 మిలియన్ల రూపాయల నష్టపరిహారం పొందింది. కంపెనీ తన మొదటి టంకశాలను కలకత్తాలో 1757లో తెరిచింది. కంపెనీ అధికారులకు కూడా పెద్ద మొత్తాలు లంచాలుగా, బహుమానాలుగా లభించాయి.

అన్నిటిని మించి భారతదేశాన్ని విచక్షణారహితంగా బ్రిటీషువారు దోచుకొనడానికి గూడా ఈ యుద్ధం నాంది అయింది. భారతదేశం నుండి బ్రిటన్‌కి సంపద తరలింపు బెంగాల్‌తో ప్రారంభమయింది. ఆ తరువాత యితర ప్రాంతాలకు విస్తరించింది. ఫలితంగా దేశం దుర్భర దారిద్ర్యంలోకి నెట్టివేయబడింది. బెంగాల్‌పై పూర్తి ఆధిపత్యం కొరకు ఇంగ్లీషు వారికి బెంగాల్ నవాబుకి మధ్య జరిగిన యుద్ధాలలో ప్లాసీ యుద్ధం చివరిది కాదు. అందుకొరకు మరొక యుద్ధం జరిగింది. అదే 1764లో జరిగిన బక్సర్ యుద్ధం.

### బక్సర్ యుద్ధం :

**కారణాలు :** కంపెనీ, కంపెనీ అధికారుల గొంతెమ్మ కోరికలన్నీ తీర్చడం అసాధ్యమని మీర్జాఫర్ త్వరలో గుర్తించాడు. మీర్జాఫర్ అసమర్థుడు, అశక్తుడని కంపెనీ నిందించసాగింది. 1760లో కంపెనీ మీర్జాఫర్‌ని పదవీ భ్రష్టుని చేసి అతడి అల్లుడైన మీర్ ఖాసింని గద్దెపై కూర్చుండబెట్టింది. అందుకు కృతజ్ఞతగా మీర్‌ఖాసిం కంపెనీకి బరద్వాన్, మిడ్నాపూర్ చిట్టకాంగ్ జిల్లాలను జమీందారీగా మంజూరు చేశాడు. ఇంగ్లీషు అధికారులకు 29 లక్షల విలువచేసే బహుమానాలను సమర్పించుకొన్నాడు. కాని మీర్‌ఖాసిం కూడా ఇంగ్లీషువారి పేరాశను గుర్తించాడు. ఇంగ్లీషువారి పథకాలు వాళ్ళ ఉనికికి ప్రమాదకారిగా పరిణమించాడు. అతడు సమర్థుడు. పాలనా దక్షుడు. విదేశీయుల పట్టునుండి బయటపడాలని నిర్ణయించుకొన్నాడు. తనను గద్దె నెక్కించినందుకు కంపెనీకి, కంపెనీ ఉద్యోగులకు పెద్ద మొత్తాలు చెల్లించాడు కనుక అతడు తన అభీష్టం మేరకు బెంగాల్‌ని పాలించాలని భావించాడు.

కాబట్టి బెంగాల్‌పై సర్వాధికారం కొరకు ఇంగ్లీషు వారికి నవాబుకి మధ్య ఘర్షణ అంటే బెంగాల్‌పై అసలైన పాలనాధికారం ఎవరిది? - అనే సమస్య బక్సర్ యుద్ధానికి ప్రధానమైన కారణం.

ఒక వర్తక సంస్థగా కంపెనీ హక్కులను అంగీకరించేందుకు మీర్‌ఖాసిం సిద్ధపడ్డాడు. కాని వారితో రాజ్యాధికారం పంచుకొనేందుకు సిద్ధపడలేదు. కాని నవాబు తమ అభీష్టం మేరకు పాలించాలని ఇంగ్లీషు వారు ఆకాంక్షించారు. మీర్‌ఖాసిం పరిపాలించకూడదని తమ చేతులల్లో బొమ్మగా వుండాలని ఆశించారు. కాని మీర్‌ఖాసిం తన స్వతంత్ర్యాన్ని కాపాడుకొనే లక్ష్యంతో రెవెన్యూ పాలనా యంత్రాంగంలో లంచగొండి తనాన్ని తొలిగించేందుకు, యూరోపియన్ల పద్ధతిలో ఆధునిక క్రమశిక్షణా యుతమైన సైన్యాన్ని నిర్మించేందుకు ప్రయత్నించాడు. ఇవేమీ ఇంగ్లీషువారికి గిట్టలేదు. కాబట్టి అతడిని తొలగించే దిశగా ఆలోచనలు సాగించారు.

1717లో జారీ చేసిన మొగల్ ఫర్మానా, దస్తక్‌లను (free passes) బ్రిటీషువారు దుర్వినియోగ పరచడం, వ్యాపారానికి చెల్లించాల్సిన పన్నులను చెల్లించకపోవడం కూడా బక్సర్ యుద్ధానికి మరొక కారణం. 1717లో జారీ అయిన ఫర్మానా దుర్వినియోగ పరచబడకుండా

మీర్‌ఖాసిం అడ్డుకోవడం కూడా ఆంగ్లేయులకు కోప కారణమయింది. బ్రిటీషువారు ఎలాంటి పన్నులు చెల్లించకుండా తమకు రవాణా చేసిన సరకులకు తాము పన్నులు చెల్లించవలసి రావడం స్వదేశ వర్తకులకు అసంతృప్తి కలిగించింది. అంతే గాక కంపెనీ ఉద్యోగులు తమకు స్నేహితులైన స్వదేశీ వర్తకులకు దస్తక్‌లను అక్రమంగా అమ్ముకోవడం ప్రారంభించారు. ఫలితంగా కొంతమంది స్వదేశ వర్తకులకు కూడా పన్ను ఎగవేసే అవకాశం లభించింది. అసమాన పోటీ కారణంగా నిజాయితీ పరులైన స్వదేశీ వర్తకులకు భారీ నష్టాలు రావడంతో పాటు నవాబు ఖజానాకు చేరే ఆదాయం కూడా గణనీయంగా పడిపోయింది. ఈ అవకతవకలన్నీ యిలాగే కొనసాగితే బెంగాల్‌ని ధృఢమైన రాజ్యంగా తీర్చిదిద్దజాలనని, తాను కంపెనీ నియంత్రణ నుండి బయటపడలేనని మీర్‌ఖాసిం గ్రహించాడు. కాబట్టి మీర్‌ఖాసిం రాజ్యంలోని అంతర్గత వాణిజ్యంపై అన్నిరకాల పన్నుల్నీ రద్దు చేసే తీవ్రమైన చర్య చేపట్టాడు. ఇంగ్లీషు వాళ్ళు బలప్రయోగంతో పొందిన రాయితీలను నవాబు దేశీయ వర్తకులకు వర్తింపచేశాడు. కాని విదేశీ, స్వదేశీ వర్తకుల మధ్య సమాన స్థాయిని విదేశీ వర్తకులు సహించలేకపోయారు. స్వదేశీ వర్తకులపై పన్నులు విధించాలని డిమాండు చేశారు. కాని నవాబు తిరస్కరించాడు. కాబట్టి అది నవాబుకు, కంపెనీకి మధ్య బాహాటమైన ఘర్షణగా పరిణమించింది.

కంపెనీ ఉద్యోగుల దుష్ప్రవర్తన, స్థానిక ప్రజలపై వారు నిస్సిగ్గుగా సాగించిన దోపిడీ – అగ్నికి ఆజ్యం తోడైనట్లయింది. కొత్తగా సంక్రమించిన అధికారం, వారిపేరాశకు అనుకూలంగా కళ్ళుమిరుమిట్లు గొలిపేలా పోగుపడుతున్న సంపద కంపెనీకి, కంపెనీ అధికారులకు కైపెక్కించాయి. కంపెనీ, కంపెనీ అధికారులు స్వదేశి ఉదోగులను జమీందారులను లంచాలు, బహుమానాలు యివ్వమని ఒత్తిడి చేశారు. స్వదేశీ వృత్తిదారుల్నీ, వర్తకుల్నీ, వారి వస్తువుల్ని చౌకగా అమ్మమని, తమ వస్తువుల్ని ప్రియంగా కొనమని ఒత్తిడి చేశారు. "బాహాటంగా, నిసిగ్గుగా దోపిడీ సాగించిన కాలమని" ఈ కాలం సరిగ్గా వర్ణించబడింది. వాస్తవంగా సిరిసంపదలకు ప్రసిద్ధిగాంచిన బెంగాల్ క్రమంగా ధ్వంసం చేయబడింది.

**క్రమం:**

1763లో జరిగిన వరుస యుద్ధాలలో మీర్‌ఖాసిం పరాజితుడై అవధ్‌కి పారిపోయాడు. అక్కడ అవధ్ నవాబైన షుజాఉద్దౌలాతోను, పదవీ భ్రష్టుడైన మొగలు చక్రవర్తి రెండవషా ఆలంతోను కూటమికట్టాడు. మూడు పక్షాల బలాలు సమిష్టిగా కంపెనీ సైన్యంతో 1764 అక్టోబరులో బక్సరు వద్ద యుద్ధం చేశాయి. మిత్రపక్షాల బలాలు తుడిచి పెట్టబడ్డాయి. భారత చరిత్రలో బక్సరు యుద్ధం అత్యంత నిర్ణయాత్మక యుద్ధాలలో ఒకటి. అది రెండు ప్రధాన శక్తులుగా యున్న బెంగాల్, అవధ్‌ల సమిష్టి సాయుధ బలగాలపై ఇంగ్లీషు సైన్యం యొక్క ఆధిక్యతను చాటి చెప్పిన యుద్ధం. గతంలో జరిగిన ప్లాసీ యుద్ధంలో ఇంగ్లీషువారి సైనిక శక్తికంటే దౌత్యకుట్రలు, కుయుక్తులు ప్రధానపాత్ర నిర్వహించాయి. కాని బక్సరు యుద్ధంలో కేవలం 8000 మంది గల ఇంగ్లీషు సైన్యం, 40 నుండి 60 వేల వరకు గల మూడు మిత్రపక్షాల సమిష్టి సేనలపై విజయం సాధించింది.

**ఫలితాలు:**

బక్సరు యుద్ధం బెంగాల్, బీహారు, ఒరిస్సాలపై బ్రిటీషు ఆధిపత్యాన్ని సుస్థాపితం చేసింది. 1765లో బెంగాల్‌కి రెండవ సారి గవర్నరుగా వచ్చిన రాబర్ట్ క్లైవ్ బెంగాలులో వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని ప్రభుత్వాధికారాన్ని నవాబు నుండి కంపెనీకి మార్పించాలని నిర్ణయించాడు. 1763లో మీర్‌ఖాసిం అవధ్‌కి పారిపోయిన తరువాత కంపెనీ మీర్‌జాఫర్‌ని నవాబు గద్దెపై కూర్చోబెట్టింది. కంపెనీ, కంపెనీ ఉద్యోగులు పెద్ద మొత్తాలు వసూలు చేసుకొన్నారు. 1765లో మీర్‌జాఫర్ మరణించడంతో కంపెనీ అతడి రెండవ కుమారుడు నజముద్దౌలాని గద్దెనెక్కించి ప్రతిఫలంగా ఒక ఒప్పందానికి వచ్చింది. ఆ ఒప్పందాన్ని అనుసరించి నవాబు తన సైన్యాన్ని పూర్తిగా తగ్గించాలి, బెంగాల్ పరిపాలనని కంపెనీచే నియమించబడిన డిప్యూటీ సుబేదార్‌ద్వారా నిర్వహించాలి, కంపెనీ ఆమోదం లేకుండా అతడిని తొలగించే అధికారం నవాబుకు లేదు. మొగలు సామ్రాజ్యానికి పేరుకి మాత్రం చక్రవర్తిగా యున్న రెండవ షా ఆలం నుండి బెంగాల్, బీహార్, ఒరిస్సాలకు దినాన్‌గిరీ ప్రన్ను వసూలు చేసుకొనే హక్కు పొందింది. ఆ విధంగా బెంగాల్‌పై కంపెనీ నియంత్రణ చట్టబద్ధం చేయబడింది. అత్యంత సంపన్నమైన ఆ ప్రాంత ఆదాయాలు కంపెనీ అజమాయిషీ లోకి వచ్చాయి.

చివరిగా యుద్ధం అవధ్‌ని కంపెనీ దయాదాక్షిణ్యలపై ఆధారపడేలా చేసింది. నష్టపరిహారంగా కంపెనీకి నవాబు 50 లక్షల రూపాయలు చెల్లించవలసి వచ్చింది. అంతేగాక కంపెనీ నవాబుతో ఒప్పందాన్ని కుదుర్చుకొన్నది. ఒప్పందాన్ని అనుసరించి కంపెనీ నవాబుకి బయటి నుండి జరిగే దాడుల నుండి రక్షణ కల్పిస్తుంది. కాని సైన్యం ఖర్చు నవాబే భరించాలి. ఒప్పందం నవాబుని కంపెనీపై ఆధారపడేలా చేసింది. ప్రాథమికంగా కంపెనీ ఒక వ్యాపార సంస్థ; ఇవాళ ఉండి రేపు పోయేది. తనకు నిజమైన శత్రువులు మరాఠాలు ఆఫ్ఘనులు – అనే దురవగాహనతో వున్న నవాబు ఒప్పందాన్ని స్వాగతించాడు. కాని ఒప్పందం అవధ్‌కే గాక దేశం మొత్తనికి వినాశకరంగా పరిణమించింది. బ్రిటీషువారు బెంగాల్‌పై అధికార పూర్వకమైన స్వాధీనాన్ని పటిష్ఠ పరచుకోవాలని అలాగే తమ ఆక్రమణలో వున్న ప్రాంతాలకు మరాఠా ప్రాంతాలకు మధ్య అవధ్‌ని అడ్డుగోడగా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు.

**భారతదేశ తూర్పు ఉత్తరప్రాంతాల ఏకీకరణ**

వారన్‌హేస్టింగ్స్ కంపెనీ రాజకీయ జోక్యాన్ని ఉత్తర భారతదేశంలోని రాజ్యాలకు నాటకీయంగా విస్తరింపచేశాడు. నవాబుపాలనలో వున్న ప్రాంతాలలో (నవాబు వంశపు నామమాత్రపు అధికారాన్ని కంపెనీ 1854 వరకు తొలగించనప్పటికీ) పాలనా వ్యవహారాలను నవాబు కంపెనీ ఉమ్మడిగా నిర్వహించే ద్వంద్వ విధానానికి హేస్టింగ్స్‌ముగింపు పలికాడు.

1764లో కంపెనీ బక్సరు యుద్ధంలో గంగా మైదాన ప్రాంతాలలో శక్తివంతమైన పాలకుడుగా వున్న అవధ్ నవాబుని ఓడించింది. 1775లో వ్యూహరీత్యా చాలా కీలకమైన

ప్రాంతాలపై ప్రత్యేకించి బనారస్‌పై అధికారాన్ని నవాబు నుండి రాబట్టుకొన్నది. 1780లో వారన్ హేస్టింగ్స్ బనారస్ పాలకుడ్ని తొలగించి అతడి మేనల్లుడిని కంపెనీ ప్రత్యక్ష పాలనలో ఒక జమిందారుగా నియమించాడు.

ఉత్తర దక్షిణ భారతదేశంలో కంపెనీ యొక్క సైనిక పరోక్ష రాజకీయాధికారం ప్రబలంగా వున్నప్పటికి 1792కి ముందు కంపెనీ చాలా పరిమితమైన ఆక్రమణలను మాత్రమే తన అధీనంలో వుంచుకొన్నది. కర్నాటకని పరిగణనలోకి తీసుకోకుండానే (అప్పటికి అధికారికంగా ఆక్రమించబడలేదు) మొదటి 35 సంవత్సరాలలో సాగించిన ఆక్రమణలు 220,000 చ.మై. (570,000 చ.కి.మీ). దీనిలో అత్యధిక భాగం బెంగాల్ నవాబు నుండి స్వాధీనం చేసుకొన్నదే. ఐనప్పటికి కంపెనీయొక్క రాజకీయ, ఆర్థిక ప్రాబల్యం దేశమంతటా వ్యాపించింది.

**బ్రిటీషు ప్రభుత్వ వైఖరి :**

1792కి ముందు కంపెనీ పరిమితమైన ఆక్రమణలను చేపట్టడాన్ని వివరించేందుకు బ్రిటన్‌లోని ఘటనలు తోడ్పడతాయి. కంపెనీపై లండన్‌లోని బ్రిటీషు ప్రభుత్వానికి కంపెనీ కోర్టు ఆఫ్ డైరెక్టర్లకు గల అంచనాలు భారతదేశంలోని కంపెనీ మెజారిటీ అధికారుల అంచనాలకు పూర్తి విరుద్ధంగా వున్నాయి.

అమెరికా వలసలను కోల్పోవడంతో (1775-83 అమెరికా విప్లవం తరువాత) గణనీయంగా పెరిగిన జాతీయ రుణభారంతో సతమతమవుతున్న బ్రిటీషు ప్రభుత్వం మిలటరీ వ్యయాన్ని తగ్గించి ఆదాయాలను పెంచుకోవాలని ఆతురతగా వుంది. కాబట్టి బ్రిటీషు మంత్రివర్గం జయించిన ప్రాంతాలనుండి పరిపాలనా పరమైన భారాలు లేకుండా ఆదాయ వనరులలో తమ వాటా కోరింది.

కోర్టు ఆఫ్ డైరక్టర్లలో ఆధిపత్య ముఠాలు బెంగాల్ భూమి రెవెన్యూలను ఆతురతగా కబళించినప్పటికి భారతదేశంలో కంపెనీ పాత్రని రాజకీయపరమైనదిగా గాక వాణిజ్యపరమైనదిగా పరిగణించడం కొనసాగించాయి.

పార్లమెంటుకి, కంపెనీకి మధ్య జరిగిన బేరసారాలు ఒప్పందానికి (1765-67) దారితీశాయి. ఒప్పందాన్ని అనుసరించి భారతదేశంలో కంపెనీ నియంత్రణలో వున్న ప్రాంతాలపై బ్రిటీషు ప్రభుత్వానికి సార్వభౌమాధికారం వుంటుంది. కంపెనీ బ్రిటీషు ప్రభుత్వానికి 400,000స్టెర్లింగ్ పౌండ్లు చెల్లిస్తుంది. కంపెనీ అధీనంలో వున్న ప్రాంతాల పరిపాలనలో కంపెనీకి స్వేచ్ఛ వుంటుంది.

కంపెనీ ఏజంట్లు లండన్ నుండి తమకు లభించే మద్దతుని మించి చర్యలు చేపట్టారు. లండన్‌లోని రాజకీయ వేత్తలు కంపెనీ తన రాజకీయాధికారాన్ని అంతత్వరగా విస్తరించడాన్ని

గురించి అవగాహన చేసుకోలేకపోయారు. కంపెనీ లేక బ్రిటీషు ప్రభుత్వం ఆక్రమణలను నిలబెట్టుకొనగలవని పూర్తిగా విశ్వసించలేకపోయాయి. లండన్ అధికారం కంపెనీ అధికారులను పూర్తిగా నియంత్రించలేక పోయింది. కానీ కంపెనీ డైరక్టర్ల దృష్టి లాభాలపై వుంది. కాని 'రంగంలో వున్న వ్యక్తి (man on the spot)' ఆక్రమణల కీర్తికి దీర్ఘకాలిక ఆర్థిక వ్యయం కంటే ప్రాధాన్యత యిచ్చాడు.

ఈ అదుపు చేసే విధానానికి 'పిట్ యిండియా చట్టం' 1784 రూపకల్పన చేసింది. వారన్ హేస్టింగ్స్ ఆకాంక్షలను నీరుగార్చడం అతడి రాజీనామాకు దారితీసింది. భారత రాజ్యాలలో జోక్యం నుండి విరమించుకొనే ఈ విధానాన్ని కంపెనీ కోర్టు ఆఫ్ డైరక్టర్లు బలపరచారు. డైరక్టర్లు వారన్ హేస్టింగ్స్ లాగాక జోక్యం చేసుకోని మెక్ఫెర్సన్ (1785–86) కారన్‌వాలీస్ (1786–93) లాంటి వారిని గవర్నర్ జనరల్స్‌గా ఎంపిక చేశారు. కాని ఈ చర్యలు బ్రిటీషు ఆక్రమణలను ఆపలేకపోయాయి.

## మైసూరు యుద్ధాలు:

దక్షిణ భారతదేశంలో మైసూరు పాలకులైన హైదరాలీ (1761–82) ఆయన కుమారుడు టిప్పుసుల్తాన్ (1782–99)లు మద్రాసులో కర్నాటకలో తమ ఉనికికి ప్రమాదమని కంపెనీ గుర్తించింది. కంపెనీ యుద్ధాలపై లండన్ నిర్బంధాలు విధించినప్పటికి కంపెనీ వ్యాపారం మద్రాసులో సజావుగా సాగించేందుకు మైసూరు ఆటంకాలు కల్పిస్తుందని భారతదేశంలోని కంపెనీ అధికారులు బ్రిటన్ ప్రజలలోను, పార్లమెంటులోను ప్రచారాలు సాగించారు. భారతదేశంలో ఫ్రాన్సు తిరిగి బలమైన శక్తిగా ఎదుగుతుందనే (మైసూరుకి లేక హైదరాబాదుకి మిత్రునిగా వ్యవహరించి) వాదన కంపెనీలోను ఇంగ్లండులోను యుద్ధోన్మాద గళాలకు ఊతమిచ్చింది. ఫలితంగా కంపెనీ మైసూరుతో నాలుగు యుద్ధాలు (1767–69, 1780–84, 1790–92, 1799) చేసింది. చివరి రెండు యుద్ధాలలో కంపెనీ గణనీయమైన భూభాగాలను కలుపుకొన్నది.

18వ శతాబ్దాంతంలోను 19వ శతాబ్ద ప్రారంభంలోను కంపెనీ చాలా యుద్ధాలు చేసింది. ఆ తరువాత భూభాగాల ఆక్రమణ చేపట్టింది. ఈ విస్తరణ విధానానికి అప్పటి గవర్నర్ జనరల్ వెలస్లీ (1790–1805) దిశానిర్దేశం చేశారు.

భారతదేశంలోని రాజ్యాలతో రాజకీయ సంబంధాలను ఒక విధానంగా పాటించే కంపెనీ అధికారుల తరానికి వెల్లస్లీ శిక్షణ యిచ్చాడు. ఉత్తేజపరచాడు. కోర్టు ఆఫ్ డైరెక్టర్లు 1805లో వెల్లస్లీని వెనక్కి పిలిపించిన తరువాత కూడా ఈ అధికారులు రాజ్యాల భూభాగాలను కలుపుకొనే వెల్లస్లీ విధానం అమలు జరపారు. ఆర్థర్ వెల్లస్లీ (తన సోదరుని దురాక్రమణ విధానాలను సమర్థించినవాడు) తన అన్న చేసిన మైసూరు మరాఠా యుద్ధాలలో కుతంత్రాలను నేర్చుకొని ఆ తరువాత పోరాటాలను యూరపులో అన్వయించడం కొనసాగించి డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్ అయ్యాడు.

వెల్లస్లీ హయాంలో భారత రాజ్యాల పట్ల కంపెనీ వైఖరి కఠినతరమయింది. వెల్లస్లీ సైన్య సహకార పద్ధతితో భారత రాజ్యాలతో కంపెనీ సంబంధాల కంటే కంపెనీ రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమయ్యాయి.

అవధ్ పాలకుని అభ్యంతరాలను త్రోసి పుచ్చి రాజ్యంలోని సగం ప్రాంతాలను 1801లో వెల్లస్లీ కంపెనీకి కలిపాడు. కంపెనీ సైన్యాలకయ్యే ఖర్చుల నిమిత్తం కలుపుకొన్నానని సమర్థించుకొన్నాడు. ఈ ప్రాంతాలు ఉత్తరభారతదేశంలోకి కంపెనీ చొచ్చుకుపోవడానికి అనుకూలంగా వున్నాయి. మైసూరులో ఆక్రమించిన ప్రాంతాలను గతంలో మిత్రుడుగా వున్న హైదరాబాదు నిజాంకు కేటాయించాడు. ఈ ప్రాంతాలు కూడ కంపెనీ కలుపుకొన్నది. కంపెనీ సైన్యాల కయ్యే ఖర్చుల క్రింద నిజాం నుండి ఈ ప్రాంతాలను కంపెనీ కైవశం చేసుకొన్నది.

**ఆంగ్లో మరాఠా యుద్ధాలు**

వెల్లస్లీ హయాంలో కంపెనీ తన పరోక్ష పాలన క్రిందికిరాని రాజ్యాల సరిహద్దులలో – ప్రత్యేకించి పశ్చిమ మధ్య భారతదేశంలో మరాఠా రాజ్యాలపై యుద్ధాలు కొనసాగించింది. ఈస్టిండియా కంపెనీకి చెందిన బొంబాయి ప్రెసిడెన్సీ మరాఠా రాజ్యాల మధ్య వుంది. కాని సైనిక బలం రీత్యా వాటితో సరితూగలేని స్థితిలో వున్నది. 1775–82 కాలంలో బొంబాయికి మరాఠా రాజ్యాలకు మధ్య చాలా యుద్ధాలు జరిగాయి. ఇవన్నీ ఫలితాలు తేల్చని యుద్ధాలు. బొంబాయి సైనిక శక్తి రీత్యా ఈ రాష్ట్రాల దరిదాపులకు చేరగలిగింది గాని సమాన స్థితికి రాలేకపోయింది. కాని 1799లో కంపెనీ మైసూరు రాజ్యాంపై తుది సైనిక విజయం సాధించిన తరువాత చేపట్టిన ఆక్రమణలు వివిధ మరాఠా పాలకులతో (1803–05, 1817–18) ప్రత్యక్ష యుద్ధాలకు దారితీశాయి.

కంపెనీ ఒక చోట (మైసూరు రాజ్యాంలో) చేసిన ఆక్రమణలు దాని సరిహద్దులలో శాంతిని స్థాపించకపోగా చాలా (మరాఠా) రాజ్యాలతో ఘర్షణకు దారితీశాయి. ప్రతి మరాఠా ఓటమి తరువాత మధ్య భారతదేశంలో గణనీయమైన భూభాగాన్ని కంపెనీ కలుపుకొన్నది. (అలా కలుపుకొన్న మొత్తం 180,000 చ.మై. లేక 466,000 చ.కి.మీ).

వెల్లస్లీ చూపిన చొరవని అనుసరించి కంపెనీ తన మిత్ర రాజ్యాలలో రాజకీయ చర్యల ద్వారా, ప్రతికూల రాజ్యాలలో సైనిక విజయాల ద్వారా సామ్రాజ్యాన్ని విస్తరించడం లక్ష్యంగా పెట్టుకొన్నది. చివరి మైసూరు యుద్ధం (1799) ఫలితంగా కంపెనీ కలుపుకొన్న భూభాగాలు, అవధ్ నుండి స్వాధీనం చేసుకొన్న గంగ – యమున మధ్య ప్రాంతం (1801), మరాఠా యుద్ధాల (1803–05) ఫలితంగా కలుపుకొన్న ప్రాంతాల మొత్తం విస్తీర్ణం 135,000 చ.మై. అంటే సమైక్య జర్మనీ అంత విస్తీర్ణం.

బ్రిటీషు విధానాలను రూపొందించే వారంతా వెల్లస్లీ వైఖరులతో ఏకీభవించలేదు. వెల్లస్లీ తన సొంత విధానాలను పాటించాడు. ఇతరుల సూచనలను,సలహాలను ప్రయోజనాలను

పట్టించుకోలేదు. యుద్ధాల పట్ల నిగ్రహంగా వ్యవహరించాలని, యితర భూభాగాలను కలుపుకోవద్దని లండన్ నుండి వచ్చిన ఆదేశాలను కూడా పాటించలేదు. కోర్టు ఆఫ్ డైరెక్టర్లు వెల్లస్లీని వెనక్కి పిలిపించారు. భారత రాజ్యాలలో జోక్యం చేసికొనని విధానాన్ని పాటించమని అదేశిస్తూ కారన్‌వాలీస్‌ని గవర్నర్ జనరల్‌గా నియమించారు. కారన్‌వాలీస్ మరణాంతరం డైరెక్టర్లు జార్జ్ బార్లో (1805–1807) ఆ తరువాత గిల్బర్ట్ ఇలియట్, ఎర్ల్ ఆఫ్ మింటో (1807–13)లను గవర్నర్ జనరల్స్‌గా నియమించారు. రాజ్యాలలో జోక్యం చేసుకొనని విధానాలను అవలంబించమని ఆదేశించారు.

లండన్‌కి గాని ఈస్టిండియా కంపెనీకి గాని ఈవిధానాలు తృప్తికరంగా లేవు.

లార్డ్ హేస్టింగ్స్ హయాంలో, కంపెనీ అధికారుల డిమాండ్ల మేరకు వరుసగా యుద్ధాలు ప్రారంభమయ్యాయి. నేపాల్ యుద్ధం (1814–16) పిండారీయుద్ధం (1817–19) మూడవ మరాఠా యుద్ధం (1817–18) – ప్రతి యుద్ధం తరువాత కొత్త భూభాగాలు కలుపుకోబడ్డాయి. సర్వాధికారం హేస్టింగ్స్ విధానమయింది. కంపెనీ సర్వాధికారం భారత పాలకుల అధికారాన్ని రద్దు చేసింది. ఏ రాజ్యంలోనైనా పరిస్థితులు బ్రిటీషు ప్రయోజనాలకు భిన్నంగా ఉంటే దానిని బెదిరించడానికి గాని లేక దానిని కలుపుకోవడానికి గాని సర్వాధికారం కంపెనీకి వుండడాన్ని కంపెనీ సమర్థించుకొన్నది. కొన్ని ఒప్పందాలలో "ప్రత్యేక పరిస్థితులలో రాజ్యంలో కంపెనీ జోక్యం చేసికొనే హక్కుని" కంపెనీ చేర్చింది. అంతేగాక అలాంటి ఒప్పందాల ఏ అవకాశాలతో ఏ పనిలేకుండా గాని లేక కొన్ని సందర్భాలలో అన్నిటిని అతిక్రమించి కంపెనీ సమర్ధనీయమని భావించినప్పుడు పాలకుని గద్దె దించేందుకు జోక్యం చేసుకొనేది.

**మొదటి మరాఠా యుద్ధం:**

1761లో పీష్వా బాజీరావు మరణానంతరం ఆయన కుమారుడు పీష్వా మాధవరావు అధికారం స్వీకరించాడు. పీష్వా మాధవరావు మరాఠా నాయకులలో ఐక్యత సాధించాడు. మూడవ పానిపట్టు యుద్ధంలో మరాఠాలు కోల్పోయిన పరువు ప్రతిష్ఠలు తిరిగి పొందగలిగేలా చేశాడు. మరాఠాలు మరొక సారి ఉత్తరాన దక్షిణాన విజయాలు సాధించారు. ఆయన ఇంగ్లీషు వారితో సంబంధాలు పెట్టుకొన్నాడు. బ్రిటీషువారి సైనిక సమర్ధత అతడికి తెలుసు. కానీ ఆయన వారి కంత ప్రాధాన్యత యివ్వలేదు. భారతరాజకీయాలలో వారి పాత్ర గణనీయమైనది కాదని భావించాడు. కాని బ్రిటీషు వారికి మరాఠా శక్తి తెలుసు. మరాఠా శక్తిని బలహీన పరచాలని నిర్ణయించారు. భారతదేశంలో సామ్రాజ్యం నిర్మించుకొనే వారి ఆకాంక్షకు మరాఠాలు పెద్ద అవరోధమని భావించారు. కాబట్టి సరియైన అదును చూసుకొని మరాఠా శక్తిని బలహీన పరచేందుకు పొంచుకొని యున్నారు. 1772లో పీష్వా మాధవరావు మరణంతో వారికాఅవకాశం లభించింది. మద్రాసు బెంగాల్‌లో లాగానే మహారాష్ట్రలో కూడా జోక్యం చేసుకొన్నారు. ఫలితంగా 1775 నుండి 1782 వరకు మొదటి ఆంగ్లో మరాఠా యుద్ధం జరిగింది.

రాజ్యాధికారం కొరకు మరాఠాల కుమ్ములాట బ్రిటీషువారి జోక్యానికి అవకాశం కల్పించింది. అప్పుడు పీష్వా కుమారుడైన రెండవ మాధవరావు మద్దతుదారులకు ప్రత్యర్థులకు తీవ్రమైన ఘర్షణ చెలరేగింది. మాధవరావు మద్దతుదారులకు నానా ఫడ్నీసు, ప్రత్యర్థులకు రఘునాథరావు నాయకత్వం వహించారు. 1772లో మాధవరావు మరణాంతరము ఆయన తమ్ముడు నారాయణరావు పీష్వా అయ్యాడు. నారాయణరావుని అతడి చిన్నాన్న రఘునాధరావు హత్య చేయించాడు. రఘునాథరావుకు పీష్వా గద్దెనెక్కాలని ఆకాంక్ష. నారాయణరావు మరణాంతరము పుట్టిన రెండవ మాధవరావుని పీష్వా చేయాలన్నాడు నానాఫడ్నీసు. బ్రిటీషువారు సహజంగా ఈ పోరాటాన్ని అవకాశంగా తీసుకొన యత్నించారు. రఘునాథరావు ఇంగ్లీషువారి సహాయాన్ని అర్థించాడు. గోతికాడ నక్కల్లా పొంచుకొని కూర్చున్న ఇంగ్లీషు అధికారులు అంగీకరించారు. వారు 1775లో "సూరత్ ఒప్పందం" పేరుతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకొన్నారు. ఒప్పందం ప్రకారం బ్రిటీషువారి సహాయానికి ప్రతిఫలంగా రఘునాధరావు సాల్సెట్టు, బస్సైన్‌లను ఇవ్వాలి.

**క్రమం:**

తొలుత మరాఠాలు బ్రిటీషు బలగాలను తాలేగావ్ వద్ద ఓడించారు. బ్రిటీషు వారితో ఒప్పందంపై సంతకాలు చేయించారు. ఒప్పందాన్ని అనుసరించి బ్రిటిషువారు గెలిచిన ప్రాంతాలను త్యజించాలి. రఘునాథరావుని పీష్వా చేసే ప్రయత్నాలను విడనాడాలి. కాని త్వరలోనే మరలా యుద్ధం ప్రారంభమయింది. వాస్తవంగా భారతదేశంలో అది బ్రిటిషు వారికి చాలా గడ్డుకాలం. నానాఫడ్నీసు నాయకత్వంలో మరాఠా నాయకులు, బ్రిటీషు వారిపై అసహ్యం పెంచుకొన్న దక్షిణ భారతశక్తులు సమిష్టిగా హైదరాలీ, నిజాం నాయకత్వంలో కంపెనీ పై యుద్ధం ప్రకటించారు. దానితో ఆంగ్లేయులు మరాఠా, మైసూరు, హైదరాబాదు రాజ్యాల బలమైన సమిష్టి శక్తిని ఎదుర్కొన్నారు. అంతేగాక అప్పుడు వారు అమెరికాలోని వలసలతో తిరుగుబాటు చేసిన ప్రజలతో పరాజయం పాలు కానున్న యుద్ధంలో కూరుకుపోయివున్నారు. ఇంకా ఆధిక్యత కోసం ఫ్రెంచి వారితో పోటీపడవలసి వచ్చింది. అప్పుడు సమర్ధుడు, అనుభవజ్ఞుడు అయిన వారన్‌హేస్టింగ్స్ గవర్నరు జనరలుగా వున్నాడు. వారన్‌హేస్టింగ్స్ ధృడనిశ్చయంతో ఆత్మవిశ్వాసంతో వ్యవహరించి బ్రిటీషువారు కోల్పోయిన పరువు ప్రతిష్ఠల్ని పునరుద్దరించగలిగాడు. కాని యుద్ధంలో ఏ పక్షానికి నిర్ణయాత్మక విజయం దక్కలేదు.

**ఫలితాలు:** ఇరుపక్షాల మధ్య 1782లో సాల్బాయ్ శాంతి ఒప్పందం కుదిరింది. ఒప్పందాన్ని అనుసరించి

i) ఇరుపక్షాలు యుద్ధంలో జయించిన ప్రాంతాలను తిరిగి యిచ్చివేయాలి. ii) రఘునాథరావుని పీష్వాని చేసే ప్రయత్నాలు ఇంగ్లీషువారు విరమించుకున్నారు, అతనికి పీష్వా పింఛన్ యివ్వాలి. iii) పూనా దర్బారుకి బ్రిటిష్‌వారిని తప్ప యితర యూరోపియన్లను అనుమతించరాదు. ఆ విధంగా సాల్భాయ్ ఒప్పందం ద్వారా యధాతధస్థితి కొనసాగించబడింది.

యుద్ధంలో ఏ పక్షానికి విజయం లభించినప్పటికి బ్రిటీషువారికి అప్పటికి భారతదేశంలో అత్యంత శక్తివంతగా వున్నా మరాఠాలతో 20 సంవత్సరాల పాటు శాంతియుతంగా గడిపే అవకాశం లభించింది. ఈ కాలాన్ని బ్రిటీషు వారు బెంగాల్ ప్రెసిడెన్సీలోవారి పాలనని పటిష్ఠపరచుకోడానికి వినియోగించుకొన్నారు. ఇక మరాఠాలు అంత:కలహాలతో బలహీనపడ్డారు. అంతేగాక హైదరాలీ నుండి తమ భూభాగాలను రాబట్టు కొనేందుకు మరాఠాలు సహాయం చేస్తామని వాగ్దానం చేశారు. గనుక బ్రిటీషువారు ఈ ఒప్పందంతో మైసూరుపై ఒత్తిడి తీసుకురాగలిగారు. ఈ విధంగా యుద్ధం శాంతి ఒప్పందం ద్వారా బ్రిటీషు వారు ఒక వైపు భారతదేశ సమిష్టి శక్తుల నుండి రక్షణ పొందారు. మరొక వైపు భారతీయ శక్తులను విభజించడంలో విజయం సాధించారు.

## రెండవ మరాఠా యుద్ధం:

### కారణాలు:

1801లో మద్రాసు ప్రెసిడెన్సీని ఏర్పాటు చేసిన తరువాత బ్రిటీషు అధికార పరిధిలోనికి రాని వారు మరాఠాలు మాత్రమే. మొదటి ఆంగ్లో మరాఠా యుద్ధం తరువాత 20 సం॥లకు మరాఠాల అంతర్గత పరిస్థితులు క్షీణించాయి. మరాఠాల అంత:కలహాలు ఆంగ్లేయులకు మరాఠాలకు మధ్య మరొక యుద్ధానికి దారితీశాయి. ఫలితంగా 1803-05లో రెండవ మరాఠా యుద్ధం జరిగింది. మరాఠాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకొనే వెల్లసీ విధానం రెండవ మరాఠా యుద్ధానికి ముఖ్యమైన కారణం. 1798లో గవర్నర్ జనరల్ అయిన వెల్లస్లీ వీలైనన్ని భారతదేశ రాజ్యాలను బ్రిటీష్ పాలనలోకి తీసుకొని రావాలనుకొన్నాడు. తన రాజకీయ లక్ష్య సాధనకు అతడు అనుసరించిన ముఖ్యమైన పద్ధతులలో సైన్య సహకార పద్ధతి ఒకటి. ఈ పద్ధతిననుసరించి 1) స్వదేశరాజు బ్రిటీషు సైన్యం తన రాజ్యంలో శాశ్వతంగా వుండడానికి అంగీకరించాలి. ఆ సైన్యాని కయ్యే ఖర్చునూ భరించాలి. 2) రాజ దర్బారులో బ్రిటీషు ప్రతినిధి నియమింపబడతాడు. 3)బ్రిటీషువారి అనుమతి లేకుండా ఏ యూరోపియన్‌ని సేవలలో నియమించకూడదు. 4) గవర్నర్ జనరల్ అనుమతి లేకుండా యితర స్వదేశీ రాజులతో దౌత్య సంబంధాలు పెట్టుకోకూడదు. 5) అందుకు బదులుగా బ్రిటీషు వారు రాజుల్ని శత్రువులనుండి రక్షిస్తారు. 6) బ్రిటీషువారు రాజ్యం యొక్క అంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసి కొనరు. బ్రిటీషు సైన్యానికయ్యే ఖర్చు భరించే పద్ధతిపై స్వదేశీ రాజుకి సహాయపడడం కొత్త కానప్పటికి వెల్లస్లీ కంపెనీ సార్వభౌమాధికారానికి స్వదేశీ రాజుల్ని విధేయుల్ని చేసేందుకు ఈ పద్ధతికొక నిర్దిష్ట రూపాన్ని యిచ్చాడు.

18వ శతాబ్ధాంతానికి మరాఠా ముఖ్య నాయకులంతా మరణించడంతో బ్రిటీషు వారికి మంచి అవకాశం లభించింది. మహాడ్జి సింథియా, అహల్యాబాయ్ హోల్కర్, తుకోజీ హోల్కర్ రెండవ పీష్వా మాధవరావు 1794, 1795, 1797, 1796లలో చనిపోయారు. పిష్వా నారాయణరావు హత్యానంతరం మరాఠా రాజ్యాన్ని ప్రధానమంత్రి నానాఫడ్నీసు పట్టుదలతో

కాపాడాడు. కాని తరువాత అతడే రాజ్యాధికారం కొరకు ప్రాకులాడడం మరాఠా ప్రయోజనాలను దెబ్బతీసింది. మరాఠాలను 39 సంవత్సరాల పాటు ఏకతాటిపై నడిపిన పడ్నీసు కూడా 1800లో చనిపోయాడు. ఆ తరువాత మరాఠాల నాయకత్వాన్ని రెండవ పీష్వా బాజీరావు, దౌలత్‌రావు సింథియా, యశ్వంతరావు హోల్కరులు స్వీకరించారు. వీరిలో బాజీరావు అసమర్థుడు. దౌలత్‌రావు, యశ్వంతరావులు స్వార్థపరులు. ఈ పరిస్థితి బ్రిటీషు వారికి, మరాఠాలను తమ అదుపులోకి తెచ్చుకొనేందుకు మంచి అవకాశమయింది.

మరాఠా నాయకుల మధ్య సోదర కలహాలు యుద్ధానికి తక్షణ కారణమయింది. పీష్వా 1802లో బ్రిటీషు సైన్య సహకార పద్ధతిని అంగీకరించాడు. పూనాలో పీష్వా బరోడాలో గైక్వాడ్ గ్వాలియర్‌లో సింథియా, ఇండోర్‌లో హోల్కర్, నాగపూర్‌లో భోన్‌స్లే అంత:కలహాలలో (అన్నదమ్ముల కీచులాటల్లో) కూరుకుపోయి ముంచుకొస్తున్న విదేశీ ముప్పుని గుర్తించలేక పోయారు. యశ్వంతరావు హోల్కర్ ఒక వైపు, దౌలత్‌రావు సింథియా, పీష్వా II మరొక వైపు తుది సమరంలో కూరుకుపోయారు. సైన్య సహకారపద్ధతికి అంగీకరించవలసిందిగా వెల్లస్లీ కోరాడు. కాని దూరదృష్టి గల నానాపడ్నీసు వలలో చిక్కుకొన నిరాకరించాడు. కానీ పిష్వా సింథియాల సంయుక్త బలగాలను హోల్కర్ 1802 అక్టోబరులో జయించడంతో పిరికివాడైన పీష్వా బాజీరావు II 1802 డిసెంబరులో బస్సైన్‌లో సైన్య సహకార పద్ధతి ఒడంబడికపై సంతకం చేశాడు. ఈ ఒప్పందం చాలా ముఖ్యమైనదని చరిత్ర కారులు, బ్రిటీషు పాలకులుపేర్కొన్నారు. ప్రత్యక్ష, పరోక్ష ఫలితాల రీత్యా ఈ ఒప్పందం భారత సామ్రాజ్యాన్ని కంపెనీకి ధారాదత్తం చేసిందని ఒక చరిత్ర కారుడు పేర్కొన్నాడు. కానీ ఈ ఒప్పందంమే కంపెనీకి భారతదేశంపై సర్వాధికారాన్ని కట్టబెట్టలేదు. మరాఠా రాజ్యాల కూటమికి పెద్దగా పరిగణింపబడుతున్న పీష్వాతో ఒప్పందానికి రావడంతో బ్రిటీషువారి ప్రతిష్ఠ పెరిగింది. కాని ఈ ఒప్పందం నుండి ప్రయోజనాలు పొందేందుకు బ్రిటీషు వారు మరాఠాలతో తీవ్రమైన యుద్ధం చేయవలసి వచ్చింది.

**క్రమం:**

దురదృష్టవశాత్తు మరాఠా నాయకులు ఉమ్మడి శత్రువుకి వ్యతిరేకంగా సమైక్యం కాలేదు. సింథియా, భోన్‌స్లేలు బ్రిటీషు వారితో యుద్ధం చేస్తున్నప్పుడు హోల్కర్ మౌనప్రేక్ష కుడిగా వుండిపోయాడు. గైక్వాడ్ బ్రిటీషు వారికి సహకరించాడు. హోల్కర్ బ్రిటీషు వారితో తలపడ్డప్పుడు భోన్‌స్లే, సింథియాలు పాతగాయాలను కెలుక్కున్నారు. అంతేగాక మరాఠా నాయకులు శత్రువుయొక్క బలాన్ని తక్కువగా అంచనా వేసి సరియైన సన్నాహాలు చేసికోకుండా యుద్ధానికి సన్నద్ధ మయ్యారు. ఫలితంగా హోల్కర్ తన స్థితిని తాను కాపాడుకొన్నప్పటికి సింథియా, భోన్‌స్లేలు సైన్య సహకారం ఒప్పందంపై సంతకాలు చేయవలసి వచ్చింది.

యుద్ధం, ఆ తరువాత ఒప్పందాలు మరాఠాలపై బ్రిటీషు వారిపై దీర్ఘకాలిక ప్రభావాలను చూపాయి. ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా మరాఠాలు వారి స్వేచ్ఛస్వాతంత్ర్యాలను కోల్పోయారు. వారిని వారు రక్షించుకొనే హక్కు కోల్పోయారు. దౌత్య

సంబంధాల నిర్వహణ, విదేశీ నిపుణుల్ని నియమించుకొనే హక్కు, పొరుగు రాజ్యాలతో వివాదాలను పరిష్కరించుకొనే హక్కు కోల్పోయారు. దైనందనికి పాలనా వ్యవహారాలలో బ్రిటీషు రాజ ప్రతినిధి యొక్క జోక్యం నానాటికి పెరిగిపోయింది. అతడికి స్వదేశీరాజులు లోబడి వుండే పరిస్థితి ఏర్పడింది.

అంతేగాక సైన్య సహకార ఒప్పందం మరాఠా రాజ్యాలను అంతర్గతంగా బలహీన పరచింది. రాజ్యంలో ఉంచిన బ్రిటీషు సైనికులకయ్యే వ్యయం చాలా ఎక్కువయింది. వాస్తవంగా రాజ్యం మోయలేనంత భారమయింది. మరాఠా రాజ్యాల ఆర్థిక వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసింది. ప్రజల్ని పేదరికంలోకి నెట్టివేసింది. ఒప్పందం కారణంగా రాజ్యం యొక్క సైన్యాన్ని దాదాపు రద్దు చేయవలసి వచ్చింది. లక్షలాది మంది సైనికులు అధికారులు వారసత్వంగా వస్తున్న బతుకు దెరువు కోల్పోయారు. ఇక మరాఠా పాలకులు ప్రజల గోడును పట్టించుకొనడం మానివేశారు. ప్రజల నుండి తిరుగుబాటు వస్తుందనే భయంలేదు కనుక అణచివేత చర్యలు చేపట్టారు. లోపలి, వెలుపలి శత్రువుల నుండి పూర్తి రక్షణ కల్పించబడుతుంది గనుక గొప్ప పాలకులనిపించుకోవాలన్న ఆకాంక్షే లేకుండా పోయింది. మరొక వైపు నుండి సైన్య సహకార పద్ధతి బ్రిటీషువారికి చాలా ప్రయోజన కారి అయింది. వారు భారత రాజ్యాల ఖర్చుతో పెద్ద సైన్యాన్ని నిర్వహించుకోవచ్చు. వారు వారి భూభాగాలకు చాలా దూరంగా యుద్ధాలు చేయవచ్చు. రక్షిత రాజ్యం యొక్క రక్షణ, యితరరాజ్యాలతో సంబంధాలు వారి అధీనంలోనే వున్నాయి. రక్షిత రాజ్యంలో వారి బలమైన సైన్యం వుంటుంది. గనుక రాజు అసమర్థుడని ప్రకటించి అతడ్ని గద్దె దించి రాజ్యాన్ని కలుపుకోవచ్చు. ఈ విధంగా రెండవ ఆంగ్లో మరాఠా యుద్ధం భారతదేశంలో కంపెనీకి సర్వసత్తాక అధికారాలు కట్టబెట్టింది.

**మూడవ మరాఠా యుద్ధం:**

రెండవ ఆంగ్లో మరాఠా యుద్ధం మరాఠా పాలకుల అధికారాన్ని ధ్వంసం చేసింది కాని వారి స్ఫూర్తిని కాదు. అందుకు బ్రిటీషు వారు మూడవ మరాఠా యుద్ధం (1817-1818) చేయవలసి వచ్చింది. స్వేచ్ఛ కోల్పోయిన మరాఠా పాలకులు బ్రిటీషు వారి పట్ల ఆగ్రహంతో వున్నారు. అంతేగాక దర్బారులలో వుండి అదుపు చేస్తున్న బ్రిటీషు రాజప్రతినిధుల చర్యలు వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీశాయి. స్వతంత్ర్యాన్ని ప్రతిష్ఠని తిరిగి పొందేందుకు మరాఠా నాయకులు తుది సమరానికి సన్నద్ధమయ్యారు. మరాఠా నాయకుల ఐక్యసంఘటనకు పీష్వా నాయకత్వం వహించాడు. కాని మరాఠాలు పటిష్ఠమైన వ్యూహాన్ని రూపొందించడంలో మరొకసారి విఫలమయ్యారు. గవర్నర్ జనరల్ లార్డ్ హేస్టింగ్స్ మరాఠాలను అణచివేశాడు. బ్రిటీషు సార్వభౌమాధికారాన్ని అంగీకరించేలా సింధియాని ఒప్పించాడు. పీష్వా భోన్స్లే, హోల్కర్ సైన్యాలను ఓడించాడు.

మూడవ మరాఠీ యుద్ధం మొదలవడానికి ముందే బ్రిటీషువారు పిండారీలతో యుద్ధం (1817-18) ప్రారంభించారు. పిండారీలు వారి పూర్వపు మిత్రులైన పఠాన్లు, కంపెనీ అధీనంలో వున్న, కంపెనీ పరోక్షపాలనలో వున్న ప్రాంతాలకు వ్యాపించారు. కోర్ట్ ఆఫ్

డైరెక్టర్ల అనుమతితో అప్పటి గవర్నర్ జనరల్ హేస్టింగ్స్ అరాచకశక్తులుగా కనిపించే పిండారీ దళాలను వారి నాయకులైన కరీంఖాన్, వసీర్ మహమ్మద్, చిట్టూలను చుట్టుముట్టి మట్టుపెట్టేందుకు పెద్దఎత్తున సైన్యాలను సమీకరించాడు. మాల్వాలో చుట్టుముట్టబడిన పిండారీలు మేవార్‌కి పారిపోయారు. కరీంఖాన్ లొంగిపోయాడు. అతడికి గవాఘ్పూర్ ఎస్టేట్ యివ్వబడింది. వసీర్ మహమ్మద్ ఆయుధాలు విసర్జించక తప్పలేదు. బందీగా పట్టుబడి చనిపోయాడు. చిట్టూ ఓడిపోయాడు. తరువాత అతడు ఏమయ్యాడో తెలియదు. సంవత్సర కాలం జరిగిన సైనిక చర్యలలో పిండారీలు పూర్తిగా తుడిచిపెట్టబడ్డారు.

మూడవ యుద్ధఫలితంగా మరాఠాల ప్రాభవం గత చరిత్రగా మిగిలిపోయింది. పీష్వా గద్దె దింపబడ్డాడు. కాన్పూరు వద్ద గల చిత్తూరులో వుంచి భరణం ఏర్పాటు చేయబడింది. అతడి పాలనలో వున్న భూభాగాలు ఆక్రమించబడ్డాయి. కొత్తగా బొంబాయి ప్రెసిడెన్సీ ఏర్పాటు చేయబడింది. కాని మరాఠా ఆత్మగౌరవాన్ని సంతృప్తి పరచేందుకు పీష్వా పాలనలోని కొద్ది ప్రాంతాలతో సతారా రాజ్యం సృష్టించి ఛత్రపతి శివాజీ వారసునికి యివ్వబడింది. అతడు బ్రిటీషువారిపై పూర్తిగా ఆధారపడి పాలనసాగించాడు. మరాఠా పాలకుల క్రింద వున్న విశాలమైన ప్రాంతాలు కంపెనీ కైవశమయ్యాయి. ఆ విధంగా మరాఠా యుద్ధం తరువాత మహారాష్ట్ర పాలకులు కూడా యితర స్వదేశరాజుల లాగానే బ్రిటీషువారి దయాదక్షిణ్యాలపై ఆధారపడి మనుగడ సాగించవలసి వచ్చింది.

**ఇతర ఆక్రమణలు:**

హేస్టింగ్ వారసులు ఈ విధానాన్ని కొనసాగించారు. ఈశాన్య దిశలో బంగాళాఖాతం తూర్పు తీర ప్రాంతంలో సరిహద్దుని పటిష్టపరచుకోవాలని కంపెనీ భావించడంతో లార్డ్ ఆమ్‌హెస్ట్ పర్యవేక్షణలో కంపెనీ మొదటి బర్మా యుద్ధానికి (1824–28) దిగింది. ఫలితంగా ఈశాన్యంలోని విశాల భూభాగాలను (అస్సాం, నాగాలాండ్), బర్మా (అరకాన్, తెనస్సరీం) లను కంపెనీ కలుపుకొన్నది.

గవర్నర్ జనరల్ బెంటింక్ (1828–35) యుద్ధాలుచేయలేదు.కాని పాలకుల చర్యల్ని కారణంగా చూపి చాలా రాజ్యాలను కలుపుకొన్నాడు; కలుపుకొంటానని బెదిరించాడు. 1830లో కంపెనీ గుర్తించిన వారసులు లేరనే సాకుతో ఈశాన్యంలో గల కచార్‌ని కలుపుకొన్నాడు. పాలనా పద్ధతులు మార్చుకొనకపోతే అవధ్‌ని కలుపుకొంటానని 1831లో బెంటింక్ అవధ్ రాజును బెదిరించాడు. అదే సంవత్సరం మైసూరు రాజుని పేరుకు రాజుగా వుంచి పాలనా బాధ్యతలు బ్రిటీషువారికి అప్పచెప్పాడు (50 సం॥ల తరువాత అంటే 1881లో బ్రిటీష విధానం మార్చుకొన్నందు వలన ఈ వంశం మరలా అధికారంలోకి వచ్చింది). సరియైన పాలన నిర్వహించడం లేదనే సాకు చూపి కంపెనీ 1834లో చేసిన కూర్గ ఆక్రమణని బెంటింక్ సమర్థించాడు.

భారతదేశంలోని రాజ్యాల భూభాగాల ఆక్రమణలకు అప్పటి వరకు అడ్డుపడుతూ వచ్చిన కంపెనీ డైరెక్టర్లు 1840 నాటికి వారి వైఖరిని మార్చుకొన్నారు. ఈ కాలంలో ఆసియాలో రష్యా సామ్రాజ్యవాద విస్తరణ బ్రిటీషువారికి ఆందోళన కలిగించింది. ఇది భారతదేశంలో కంపెనీ పాలనకు ప్రమాదకరమని బ్రిటీషువారు భావించారు. ఈ ఊహాజనితమైన భయంతోనే వాయువ్య భారతదేశంలో ఆఫ్ఘనిస్తాన్‌లో బ్రిటిషువారు జోక్యం చేసుకొన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో బ్రిటీషువారు, రష్యన్లు ఘర్షణ పడలేదు. కాని ఆంగ్లో రష్యన్ల మధ్య క్రిమియా యుద్ధం (1854–56) జరగడంతో ఆంగ్లేయులు ఆందోళన చెందారు. ఈ కాలానికి చెందిన ప్రతి గవర్నర్ జనరల్ దురాక్రమణల విధానాన్ని బలపరచాడు. పదవీచ్యుతుడైన రాజును గద్దెనెక్కించేవారు.

## మొదటి ఆఫ్ఘన్‌యుద్ధం (1838-42)

ఆఫ్ఘన్‌లో కంపెనీ మార్గదర్శకత్వంలో లార్డ్ అక్లాండ్ (1836–42) జోక్యం చేసుకొన్నాడు. లార్డ్ ఎలెన్‌బరో (1842–44) సింధ్‌ని (1843) ఆక్రమించాడు. సిస్ సట్లెజ్ పంజాబ్‌లో కొంత భాగం ఆక్రమణకు కారణమైన మొదటి సిక్కు యుద్ధం (1845–46) లార్డ్ హార్డింజ్ ఆధ్వర్యంలో జరిగింది. కాశ్మీరు రాజాని పదవీ భ్రష్టుని చేస్తానని కూడా అతడు బెదిరించాడు.

## సింధు ఆక్రమణ:

సింధుపై ఈస్టిండియా కంపెనీ ఆసక్తికి కారణం అది వ్యూహరీత్యా కీలకమైన స్థానంలో వుండడం. సింధు భారతదేశానికి పశ్చిమ మధ్య ఆసియాకి అనుసంధానంగా వుంది. ఆఫ్ఘనులుగాని రష్యన్లుగాని దాడిచేసే మార్గంగాను వాణిజ్యానికి అనుకూలంగాను వున్నది. సింధుని తన అధీనంలో వుంచుకొని కంపెనీ ఆధిపత్యం సాధించాలని కోరుకొన్నది. సింధు ఆక్రమణ ద్వారా వ్యక్తి గతంగా కూడా పేరు ప్రఖ్యాతులు వస్తాయని చార్లెస్ నేపియర్ ఆశించాడు. సింధుపై కంపెనీ మొదటి ప్రయత్నం విఫలమయింది. సింధుకి బయలు దేరిన మొదటి వర్తక బృందానికి 1800లో నధాన్‌క్రో నాయకత్వం వహించాడు. కాని అమీరులు బెదిరించి బహిష్కరించారు. 1827లో డాక్టర్ జేమ్స్ బరన్స్ చేపట్టిన రాజకీయ సాహస చర్య ఫలించలేదు. కంపెనీ కోరుకొన్న భద్రత గల సరిహద్దు వర్తక వెసులుబాటు సాధించలేక పోయింది.

కంపెనీ సరిహద్దుల వెలుపల గల భారత రాజ్యాలతో మిలిటరీ జోక్యాలు చేసుకోకుండా శాంతియుతంగా వ్యవహరించడం తన ఆకాంక్ష అని ఆక్లాండ్ (1836–42) ఎలెన్‌బరోలతో సహా గవర్నరు జనరల్స్ ప్రకటించినప్పటికి బ్రిటిషువారు సింధు ఆఫ్ఘనిస్తాన్ పంజాబులలో మిలటరీ జోక్యాలు చేసుకొన్నారు. సింధు కంపెనీని కంటిలో నలుసులా కలవర పెట్టింది. కచ్ రాజ్యానికి బ్రిటిషు రక్షణ 1819 నుండి వున్నప్పటికి ఖోసాతెగ దానిపై చాలాసార్లు దాడులు చేసింది. కంపెనీ సింధులో జోక్యం చేసుకొన్న కాలంలోనే ఆఫ్ఘనిస్తాన్‌లో బ్రిటిషువారి జోక్యం మొదటి ఆంగ్లో ఆఫ్ఘన్ యుద్ధానికి (1838–42) దారితీసింది.

ఆ తరువాత కంపెనీ అదే ఊపుతో రక్షణ రీత్యా పదిలమైన సరిహద్దుని సాధించేందుకు పంజాబుతో యుద్ధాలు చేసి ఆక్రమించుకొన్నది.

సింధు 18వ శతాబ్దపు చివరి పాదం నుండి బలూచి అమీరులకు చెందిన తాల్పూరా వంశ పాలనలో వుంది. ఈ అమీరులు ఆఫ్ఘనిస్తాన్ సామ్రాజ్యానికి సామంతులుగా వున్నారు. అమీరులకు ఖైర్పూరు (ఎగువ సింధు) హైదరాబాద్, మీర్పూర్ (దిగువ సింధు) మూడు రక్షణ కేంద్రాలున్నాయి. బ్రిటిషు వారు తమ వంశపాలనకు రక్షణగా వుంటారని సింధుపాలకులు ఆశించారు. అదే సమయంలో బ్రిటిషువారిని అల్లంత దూరంలో వుంచడం మంచిదనుకొన్నారు. బ్రిటిషు వాణిజ్య లేక రాజప్రతినిధిని తమ రాజ్యంలో వుంచడం ప్రమాదకరమని గుర్తించారు.

కాని 1832లో కుదుర్చుకొన్న ఒప్పందం ప్రకారం కంపెనీకి సింధుకి మధ్య వాణిజ్య సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత సింధు పాలకులైన అమీర్లు బ్రిటీషువారితో సైన్యసహకార ఒప్పందాలు కుదుర్చుకోవలసి వచ్చింది. ఫలితంగా 1839లో సింధు దాదాపు ఆంగ్లేయుల వశమయింది. మొదటి ఆఫ్ఘన్ యుద్ధకాలంలో (1834–42) అమీర్లు బ్రిటిషువారికి విధేయులుగా వున్నారు. వారి విధేయతకు బ్రిటిషువారి నుండి గుర్తింపు లభించలేదు. అంతేగాక ఆఫ్ఘన్ యుద్ధాల తరువాత బ్రిటిషువారు సింధుని ఆక్రమించేందుకు కారణాలు వెతకడం మొదలెట్టారు. గతంలో సింధు ప్రాదేశిక సమగ్రతను గుర్తిస్తామని యిచ్చిన హామీని తుంగలో తొక్కి సింధుని ఆక్రమించుకొన్నారు. బ్రిటిషు పాలకుల సామ్రాజ్యవాద విధానంలో భాగంగానే సింధు ఆక్రమణ జరిగింది.

## డల్హౌసీ హయాంలో విస్తరణ

బ్రిటీషు సామ్రాజ్యంలో ఎక్కువ భారత భూభాగాలను కలుపుకొన్న గవర్నరు జనరల్ డల్‌హౌసీ (1848–56). రాజుకి చట్టబద్ధమైన వారసుడు లేడని, పరిపాలన సక్రమంగా నిర్వహించడం లేదని లేక ప్రత్యేకమైన ప్రాంతం కంపెనీకి అవసరమని – యిలా పలు రకాల కారణాలు కలుపుకోవడానికి సమర్థనలుగా చూపాడు. రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని (రాజుకి పురుష సంతానం లేకపోతే ఆ రాజ్యం కంపెనీకి సంక్రమిస్తుంది) ఉపయోగించి అతడు సతారా (1848) నాగపూర్ (1853) ఝాన్సీ (1854) యింకా 8 చిన్న రాజ్యాలను కలుపుకొన్నాడు. రెండవ సిక్కు యుద్ధం (1848–49) తరువాత పంజాబుని కలుపుకొన్నాడు. రెండవ బర్మా యుద్ధం (1852–53) తరువాత పెగూని కలుపుకొన్నాడు. పరిపాలన సక్రమంగా లేదనే సాకుచూపి అవధ్‌ని కైవశం చేసుకొన్నాడు. వంశవారసత్వాలను గుర్తించ నిరాకరించి మరాఠాల పీష్వా (1851) బెంగాల్ నవాబు (1854) కర్నాటక నవాబు (1855) తంజావూరు రాజా (1855)ల పింఛన్లు ఆపివేశాడు. కంపెనీకి రావలసిన కప్పాన్ని రాబట్టుకొనేందుకు హైదరాబాద్ నుండి బేరార్‌ని (1853) కలుపుకొన్నాడు.

డల్హౌసీ హయాంలో మొత్తం కలుపుకోబడిన ప్రాంతాల వైశాల్యం 1/4 మిలియన్ చ.మైళ్లు (680,000 చ.కి.మీ). గతంలో ఏ గవర్నరు జనరల్ యింత విశాలమైన ప్రాంతాలను

కలుపుకోలేదు. కంపెనీ అప్పటి వరకు ఆక్రమించిన మొత్తం భూభాగంలో యిది నాల్గవ వంతు. డల్హౌసీ కూడా కొందరు డైరెక్టర్లు కోరిన విధంగా హైదరాబాద్ మొత్తాన్ని కలుపుకోవడాన్ని అలాగే బహవల్పూర్‌లో జోక్యం చేసుకోడాన్ని తిరస్కరించాడు. వాస్తవంగా రాజ్య సంక్రమణ సిద్ధాంతం డల్హౌసీతో మొదలుకానప్పటికి దానిని అంత విస్తృతంగా మరే గవర్నరు జనరల్ ఉపయోగ పెట్టుకోలేదు. సంక్రమించే పద్ధతుల్ని మార్పుచేశాడు. సతారా, ఝాన్సీ రాజులు మరణించకముందే వారసుల్ని దత్తత (సతారా రాజు 1847లో ఝాన్సీ రాజు 1853లో) చేసుకొన్నారు. ఐనప్పటికి వారి దత్తస్వీకారాన్ని కంపెనీ గుర్తించలేదు. ఝాన్సీరాణి తన హక్కుల్ని తన కుటుంబహక్కుల్ని గురించి చేసిన వాదనల్ని కంపెనీ తిరస్కరించింది. అసలు సతారా రాజ్యాన్ని సృష్టించింది కంపెనీయేనని, అది ఎందుకు సృష్టించబడిందో ఆ పని పూర్తయ్యాక దానిని కంపెనీ రాజ్యంలో కలుపుకొనడం సమర్ధనీయమేనన్నాడు గవర్నరు జనరల్. నాగపూర్ రాజుకి కొడుకు లేడు. దత్త స్వీకారమూ జరగలేదు. 1853లో రాజు చనిపోగానే కంపెనీ నాగపూర్‌ని కలుపుకొన్నది. కంపెనీ స్వదేశీ రాజుల చావు కొరకు గోతికాడ నక్కలా పొంచుకు కూర్చుంది.

కంపెనీతో రాజ్యాలకు గల చారిత్రక సంబంధాన్ని బట్టి డల్హౌసీ రాజ్యాల పట్ల తరతమ భేదాన్ని పాటించాడు. ఉదాహరణకు అతడు బవహల్పూర్‌లో జోక్యం చేసుకోలేదు. దానిని సతారా, ఝాన్సీ, నాగపూర్‌ల కంటె స్వేచ్ఛయుతమైన రాజ్యంగా పరిగణించాడు. ఈ కాలంలో కంపెనీ భారత రాజ్యాల స్వయం ప్రతిపత్తి స్వేచ్ఛల పట్ల అసహనంతో వ్యవహరించింది. పరిపాలన బాగాలేదనే నెపంతో అవధ్ 1856లో కలుపుకోబడింది. ఎలాంటి ఒప్పందం లేకపోయినా రాజ్యాల పాలనా బాధ్యతలు తమపై వున్నట్లు బ్రిటిషువారు వ్యవహరించారు.

### 1857 తరువాత విధానపరమైన మార్పు:

1857 నాటికి కంపెనీ భారత ఉప ఖండంలోని దాదాపు మిలియన్ చ.కి.మీ. ప్రాంతాలను కలుపుకొన్నది. ఇది దేశంలో 63 శాతం భూభాగం; 78 శాతం ప్రజలు నివశించే ప్రాంతం. 1857 తిరుగుబాటు బ్రిటిషు ఆక్రమణల క్రమాన్ని అడ్డుకొన్నది. తిరుగుబాటు ప్రధానంగా బ్రిటిషు ఆధీనంలో వున్న ప్రాంతాలకు పరిమితమయింది. రాజ్యాలను, రాజ్యాలలోని ప్రాంతాలను కలుపుకోవడం తిరుగుబాటుకి ముఖ్యకారణం. ఇదే స్వదేశీరాజుల్ని బ్రిటీషువారికి వ్యతిరేకంగా పోరాడేందుకు సన్నద్ధం చేసింది. హైదరాబాద్ లాంటి ఆక్రమించబడని ముఖ్యమైన రాజ్యాలు యుద్ధానికి దూరంగా వున్నాయి. ఆ తరువాత బ్రిటీషువారు వారి ప్రయోజనాల రీత్యా సంస్థానాధీశుల్ని మచ్చిక చేసుకోవాలనుకొన్నారు.

1857 తరువాత భారతదేశ ప్రభుత్వ పాలనని కంపెనీ నుండి బ్రిటీషుసింహాసనం స్వీకరించింది. ఆక్రమించి కలుపుకొనే విధానాన్ని విడనాడి పరోక్ష పాలన సాగించింది. సంస్థానాల ప్రజల్ని బ్రిటీషు పాలనకు విధేయతగా వుంచే బాధ్యత సంస్థానాధీశులకు అప్పజెప్పడం బ్రిటీషు విధానమయింది. 1858 నాటి రాణి విక్టోరియా ప్రకటన భారతదేశంలో రాజ్యం వారసత్వంగా సంక్రమింపజేసేందుకు హామీ యిచ్చింది. 1877లో విక్టోరియా రాణి భారతదేశ

చక్రవర్తి పదవిని స్వీకరించింది. భారతదేశ రాజులతో ఫ్యూడల్ సంబంధాలను నెలకొల్పింది.. ఆ విధంగా 1858 తరువాత కాలంలో భారత భూభాగాలను బ్రిటిషిండియాలో కలుపుకొనడం ఆగిపోయింది.

**భారత పాలకుల వైఫల్యానికి కారణాలు :**

బ్రిటిషువారు భారతదేశంలోని పెద్ద రాజ్యాలను ఓడించి విశాలమైన ప్రాంతాలపై ప్రత్యక్ష పాలన చేపట్టారు. స్థానిక పాలకులతో సహకార ఒప్పందాలు కుదుర్చుకొని యితర ప్రాంతాలను పరోక్ష పాలన క్రిందికి తెచ్చుకొన్నారు. మరాఠా, మైసూరు, సిక్కు రాజ్యాల పాలకులు తీవ్రంగా ప్రతిఘటించారు. కొన్ని తొలి విజయాలు సాధించారు. కాని చివరికి ఒకరి తరువాత మరొకరు ఆంగ్లేయుల అధికారానికి తలవంచక తప్పలేదు. తక్కువ సంఖ్యలో వున్న ఇంగ్లీషు సైన్యం చేతుల్లో అధిక సంఖ్యలో వున్న భారత రాజ్యాల సైనికులు పరాజయం చెందడానికి కొంత వివరణ అవసరం. మరొక విధంగా చెప్పాలంటే బ్రిటిషువారికి వ్యతిరేకంగా భారతదేశ పాలకుల వైఫల్యానికి కారణాలేమిటి?

మొట్టమొదటగా చెప్పవలసిన కారణం భారతీయ పాలకులలో ఐక్యత లేకపోవడం. బ్రిటిషు వారు గెలిచిన రాజ్యాలన్నీ మొగలు సామ్రాజ్యపు శిథిలాల నుండి పుట్టుకొచ్చినవే. ఈ రాజ్యాలు స్వతంత్రమైనవే అయినప్పటికి మొగలు సామ్రాజ్యం యొక్క సార్వభౌమాధికారాన్ని నామమాత్రంగా గుర్తించాయి. బ్రిటిషువారు ఢిల్లీని ఆక్రమించడంతో తరువాత ఆ అవసరం లేకపోయింది. ఈ కొత్తగా పుట్టుక వచ్చిన భారతరాజ్యాల మధ్య సారూప్యత బహు తక్కువ. ప్రతి రాజ్యం పొరుగురాజ్యాన్ని నష్టపరచి విస్తరించాలని ప్రయత్నించింది. భారతరాజ్యాల మధ్యగల అనైక్యత బ్రిటిషువారి పనిని సులభతరం చేసింది. మరొక వైపు ఈస్టిండియా కంపెనీ అధికారులు లక్ష్యసాధన కొరకు కలిసికట్టుగా వున్నారు. ఈ ఉమ్మడి కృషి వారిని 1757 నుండి భారతరాజకీయాలలో కీలకమైన శక్తిగా రూపొందించింది.

భారతరాజ్యాల మధ్య ఐక్యత లేకపోవడంతో పాటు ప్రతి రాజ్యంలోని ప్రజల మధ్య కూడా ఐక్యత లేదు. రాజ్యంలోని అంతర్గత బలహీనతలు తీవ్రస్థాయికి చేరుకొన్నప్పుడు మాత్రమే బ్రిటిషువారు విజయాలు సాధించగలిగారు. ఆ విధంగా రాజ్యంలోని అనైక్యత పెరిగినప్పుడు రాజ్యం స్వతంత్రాన్ని కోల్పోయింది. బ్రిటిషువారు విభజించి పాలించే విధానంతో అనైక్యతని పెంచే పరిస్థితులు సృష్టించారు.

విభజించి పాలించే బ్రిటిషు విధానం ముఖ్యమైన కారణమైనప్పటికీ అదే ఏకైక కారణం కాదు. ప్రజల విశ్వాసాన్ని పొందగలిగే విధంగా స్థిరమైన, సమర్థవంతమైన రాజకీయ వ్యవస్థ నెలకొల్పడం లోని భారతదేశ రాజుల అసమర్థత మరొక ముఖ్యమైన కారణం. క్షీణిస్తున్న మొగలు సామ్రాజ్యానికి భారతరాజ్యాలు కనీసం ప్రత్యామ్నాయాలు కూడా కాలేకపోయాయి. భారతరాజ్యాలలో సమర్థవంతమైన పౌర ఆర్థిక పరిపాలనా వ్యవస్థలు లేవు. యుద్ధాలకు

కూడా సామంతుల నుండి గాని ప్రజల నుండి గాని ఆర్థిక పరమైన సహకారం లభించేది కాదు. మరొక వైపు బ్రిటిషువారు వ్యాపారంలో వచ్చిన లాభాన్ని యుద్ధ ప్రయత్నాలకు వినియోగించుకోగలిగారు.

పైన చెప్పిన కారణాలన్నీ మరాఠాలకు చక్కగా వర్తిస్తాయి. మరాఠాలు పానిపట్టు యుద్ధం కలిగించిన నష్టాల నుండి కోలుకొని 1770 నాటికి బ్రిటిషువారికి భారతదేశంలో బలమైన శత్రువులుగా వున్నారు. కాని మరాఠా నాయకులు వారి పాలనా పరమైన ఆర్థిక పరమైన పరిస్థితుల్ని మెరుగుపరచుకోడానికి బదులుగా పరస్పర ఘర్షణలకు దిగడంతో ఒకరి తరువాత మరొకరిని ఓడించడానికి శత్రువుకి అనువైన పరిస్థితులు కల్పించారు. పంజాబులో రంజిత్‌సింగ్ బలమైన రాజ్యాన్ని నిర్మించాడు. హిందువుల్ని ముస్లింల్ని సిక్కుల్ని ఐక్యంగా వుంచగలిగాడు. కాని తన తరువాత సిక్కు రాజ్యాన్ని నిలబెట్టగల వారసుడిని తయారు చేయలేకపోయాడు. ఫలితంగా రంజిత్‌సింగ్ చనిపోయిన తరువాత బ్రిటిషువారు విభజించి పాలించే విధానంతో సిక్కురాజ్యాన్ని ముక్కలు చెక్కలు చేయగలిగారు. అంతర్గతంగా వున్న బలహీనతల కారణంగా, పొరుగున వున్న బలమైన రాజ్యాల భయం కారణంగా హైదరాబాద్ లాంటి రాజ్యాల పాలకులు కూడా బ్రిటిషువారి రక్షణ కోరారు. సైన్యసహకార ఒప్పందం కుదుర్చుకొన్నారు.

భారత రాజ్యాలలోని సాంకేతిక ఆర్థిక వెనుకబాటుతనం కూడా వైఫల్యానికి కారణం. సైనిక పరమైన సాంకేతిక పరిజ్ఞానంలో వెనుకబాటు కారణంగా భారత రాజ్యాల సైన్యాలు బ్రిటిషు సైన్యాలతో పోటీపడలేక పోయాయి. ముఖ్యంగా ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైన తరువాత ఈ తేడా మరింత ఎక్కువయింది. బ్రిటిషువారు భారతదేశాన్ని ఆక్రమించుకోవడం ప్రారంభించిన తొలికాలంలో మైసూరు మరాఠా సైన్యాలు శక్తి సామర్థ్యాలలో కంపెనీ సైన్యాలతో సరిసమానంగా వుండేవి. 18వ శతాబ్దాంతానికి బ్రిటిషువారు శతఘ్ని దళాలను, శక్తివంతమైన ఫిరంగుల్ని అమర్చుకోగలిగారు.

పారిశ్రామిక విప్లవం వలన బ్రిటిషు ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడింది. బ్రిటిషువారి వర్తకం పరిశ్రమలు వేగంగా పుంజుకోవడంతో యాంత్రిక విప్లవం కూడా సాధ్యపడింది. ఫలితంగా బ్రిటన్ సామాజిక ఆర్థిక స్వరూప స్వభావాలు పూర్తిగా మారిపోయాయి. ప్రపంచ రాజ్యాలలో బ్రిటన్ పలుకుబడి పెరిగింది. గతంలో కన్నా మరింత శక్తివంతమైన బ్రిటన్‌ను ప్రతిఘటించడం కష్టమైపోయింది. పరస్పర విభేదాలతో అంతఃకలహాలతో వున్న భారత పాలకుల్ని ఓడించడం బ్రిటన్‌కు మరింత సులభమయింది. ఫలితంగా 1855-56 నాటికి భారతదేశంపై పూర్తి విజయం సాధించారు.

3

# స్వదేశీ సంస్థానాలపై బ్రిటిషు సార్వభౌమాధికారం

1855–56 నాటికి భారతదేశంలో బ్రిటిషు సామ్రాజ్యం దృఢంగా స్థాపించబడింది. దేశంలోని విస్తారమైన ప్రాంతాలు బ్రిటిషు ప్రత్యక్ష పాలన క్రిందికి వచ్చాయి. ఇతర ప్రాంతాలలోని భారత పాలకులు బ్రిటిషువారిపై ఆధారపడవలసివచ్చింది. మరొక విధంగా చెప్పాలంటే బ్రిటిషువారు భారతదేశంలో సార్వభౌమాధికారాన్ని స్థాపించారు. ఈ సార్వభౌమాధికారం రెండు విధాలుగా సాధించబడింది. 1. యుద్ధాలు చేసి ఆక్రమణలు జరపడం ద్వారా. 2. ఏదో ఒక నెపంతో భారత రాజ్యాలను అధీన విధానంలోకి తీసుకొనిరావడం, తద్వారా కలుపుకొనడం ద్వారా. యుద్ధాలు చేసి మైసూరు సింధు కలుపుకోబడ్డాయి. కాని తమ సార్వభౌమాధికారాన్ని స్థాపించుకోడానికి ఎక్కువగా రెండవ పద్ధతే అవలంబించారు.

బ్రిటీషు వారు రాజ్యాలను కలుపుకోడానికి యితర సాకులు కూడా కనుగొన్నారు. అలాంటి సాకులలో రాజ్యసంక్రమణ సిద్ధాంతం ఒకటి. ఈ సాకుని యితరుల కంటె డల్హౌసీ ఎక్కువగా ప్రయోగించాడు. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి రాజుకి పుత్ర సంతానం లేకపోతే ఆ రాజ్యం బ్రిటిషువారికి సంక్రమిస్తుంది. భారతీయ సంప్రదాయాన్ని అనుసరించి రాజుకి పుత్ర సంతానం లేకపోతే అతడి లేక అతడి భార్య తరపు దగ్గరి బంధువుని దత్తత తీసుకోవచ్చు. దత్తపుత్రుడు వారసుడవుతాడు. రాజులు బ్రిటిషువారిపై ఆధారపడడంతో దత్తతని ఆమోదించే లేక తిరస్కరించే హక్కు బ్రిటిషువారు కైవశం చేసుకొన్నారు. డల్హౌసీ కాలంలో చాలా మంది రాజులు పుత్ర సంతానం లేకుండా మరణించారు. డల్హౌసీ ఝాన్సీ, నాగపూర్, సతారా లాంటి రాజ్యాల పాలకులకు అనుమతి మంజూరు చేయలేదు. ఆ రాజ్యాలను బ్రిటిషు సామ్రాజ్యంలో కలుపుకొన్నాడు. అంతేగాక పీష్వా పొందుతున్న పింఛన్ అతడి దత్తపుత్రుడైన నానాసాహెబ్‌కి తిరస్కరించబడింది. అలాగే కర్నాటక నవాబు మరణానంతరం అతడి బంధువికి

తిరస్కరించబడింది. అవధ్ నవాబు పరిపాలన సరిగ్గా లేదని అతడు అసమర్ధుడని సాకుచూపి సంస్థానాన్ని కలుపుకోవడం భారతపాలకుల భయాన్ని మరీ పెంచింది.

## బ్రిటిషు సార్వభౌమాధికారం - దశలు

1757 నుండి బ్రిటీషు సార్వభౌమాధికారం అంగలు పంగలుతో సాగిన పురోగమనం మొగలు సామ్రాజ్య శిథిలాల నుండి పుట్టిన భారతరాజ్యాలపై అనివార్యమైన ప్రభావం చూపింది. బ్రిటిషువారితో వారి సంబంధాలు మారుతున్న రాజకీయ పరిస్థితుల్ని బట్టి, వివిధ గవర్నరు జనరల్స్ యొక్క వ్యక్తిగత అభిప్రాయాలు అకాంక్షల్ని బట్టి మారుతూ వచ్చాయి. అయినప్పటికి 18వ శతాబ్దాంతంలో అభివృద్ధి చెంది 20వ శతాబ్దం ప్రారంభం వరకు కొనసాగిన సాంప్రదాయం భారతదేశ స్వదేశీ సంస్థానాల పట్ల బ్రిటీషు విధానాన్ని రూపొందించడంలో గణనీయమైన ప్రభావం కలిగివుంది.

స్వదేశీ సంస్థానాలపై బ్రిటిషు సార్వభౌమాధికార స్థాపన హఠాత్పరిణామం కాదు; క్రమబద్ధమైన విధానం యొక్క ఫలితం. స్వదేశీ సంస్థానాలపై బ్రిటిషు సార్వభౌమాధికారం యొక్క పరిణామాన్ని మూడు దశలుగా పరిశీలించవచ్చు. 1757 నుండి 1813 వరకు గల మొదటి దశలో బ్రిటిషువారు వలయ బద్ధ విధానాన్ని (Ring Fence Policy) అనుసరించారు. 1813 నుండి 1858 వరకు గల రెండవ దశలో అధీన ఏకాంత విధానాన్ని (Policy of Subordinate lsolation), 1858 నుండి 1947 వరకు గల మూడవ దశలో అధీన సంఘ విధానాన్ని (Policy of Subordinate Union) అనుసరించారు.

## వలయ బద్ధ విధానం (Policy of Ring Fence) 1757-1813

ఈ కాలంలో బ్రిటిషువారు లీవార్నర్ చెప్పినట్లు తన చుట్టూ ఒక వలయం గీచుకొని దానిలోపల వుండిపోయే ప్రయత్నం చేశారు. భారత పాలకుల వ్యవహారాలలో జోక్యం చేసుకొనే సాహసం చేయలేదు. కారణం అప్పటికి ఇంగ్లీషు కంపెనీ భారతరాజ్యాలలో జోక్యం చేసుకొనేటంత బలంగా లేదు. అప్పటికి ఈస్టిండియా కంపెనీ కూడా మరాఠాలు, నిజాం, మైసూరు నవాబు, ఫ్రెంచివారు లాగా ఒకబలమైన శక్తిగా మాత్రమే వుంది. ఉదాహరణకు మరాఠాల, మైసూరు నవాబుల ఆక్రమణల నుండి బ్రిటిషు ప్రాంతాలను రక్షించుకొనేందుకు వారన్‌హేస్టింగ్స్ వలయబద్ధ విధానాన్ని అనుసరించాడు. ముందు జాగ్రత్త చర్యగా పొరుగురాజ్యాల సరిహద్దుల రక్షణ చేపట్టాడు. అప్పుడు ఇంగ్లాండు రూపొందించిన పిట్ ఇండియా చట్టం 1784 కూడా భారతరాజ్యాల ఆంతరంగిక వ్యవహారాలలో కంపెనీ అధికారులు జోక్యం చేసుకోరాదని ఆదేశించింది. ఈ 56 సంవత్సరాల కాలంలో కంపెనీ భారత రాజ్యాల వ్యవహారాలలో జోక్యం చేసుకోకూడదనే విధానాన్ని పాటించింది. బక్సర్ యుద్ధం తరువాత

తమ దయాదాక్షిణ్యాలపై ఆధారపడివున్న అవధ్‌ని బ్రిటిషువారు కలుపుకోలేదు. రొహిల్లా యుద్ధం తరువాత జయించిన ప్రాంతాలను వారన్‌హేస్టింగ్స్ తమ అధీనంలో వుంచుకోకుండా అవుధ్‌నవాబుకి యిచ్చివేశాడు. మొదటి ఆంగ్ల మరాఠా యుద్ధం యధాతధ స్థితిని కాపాడేవిధంగా సాల్బాయ్ సంధితో ముగిసింది. నాలుగు మైసూరు యుద్ధాలు బ్రిటిషువారి కంటె వారిమిత్రులుగా వున్న మరాఠాలకు నిజాంకి తాత్కాలికంగా నైనా ప్రయోజనకారులయ్యాయి.

వెల్లస్లీ సైన్యసహకార ఒప్పందాలు నిస్సందేహంగా భారతరాజ్యాలపై బ్రిటిషు ఆధిపత్యాన్ని నెలకొల్పాయి. కాని ఈ రాజ్యాలు విధానపరంగా బ్రిటిషు సార్వభౌమాధికారానికి లోబడి వుండలేదు. వాటి అంతర్గత పాలనా వ్యవహారాలలో స్వతంత్రతని నిలబెట్టుకొన్నాయి. ఒక్క మైసూరు మినహాయించి వెల్లస్లీ ఒప్పందాలన్నీ 'సమానత్వం యిచ్చిపుచ్చుకొనే ప్రాతిపదికన' జరిగాయి. కె.యం. ఫణిక్కర్ మాటల్లో చెప్పాలంటే "మైసూరుతో తప్ప బ్రిటిషువారు కుదుర్చుకొన్న ఒప్పందాలన్నీ సమానత్వం ప్రాతిపదికపై చర్చలు ద్వారా కుదుర్చుకొన్నవే. కంపెనీ ఈ రాజ్యాలపై ఎలాంటి సార్వభౌమాధికారాన్ని గాని సామ్రాజ్యవాద అధికారాన్ని గాని చెలాయించలేదు. ఒప్పందానికి ఈ రాజ్యాలు కూడా సమానంగానే ప్రతిస్పందించాయి.

**మినహాయింపులు:**

ఐనప్పటికి కంపెనీ ఈ కాలంలో చాలా సందర్భాలలో రాజ్యాల వ్యవహారాలలో జోక్యం చేసుకొన్నది. ఉదాహరణకు వారన్‌హేస్టింగ్స్ ఎలాంటి సమర్థనీయమైన కారణం లేకుండానే మొదటి మరాఠా యుద్ధం, రెండవ మైసూరు యుద్ధం చేశాడు. అలాగే లార్డ్ కారన్ వాలీస్ మూడవ మైసూరు యుద్ధం చేసి దానిలో సగభాగాన్ని కలుపుకొన్నాడు. లార్డ్ వెల్లస్లీ నాల్గవ మైసూరు యుద్ధం, రెండవ మరాఠా యుద్ధం చేసి హైదరాబాద్, అవుధ్ పాలకులను సైన్య సహకార ఒప్పందాలపై సంతకాలు చేసేలా ఒత్తిడి చేశాడు. లార్డ్ మింటో రంజిత్‌సింగ్‌తో కుదుర్చుకొన్న అమృతసర్ ఒప్పందానికి స్వస్తి చెప్పడమే గాక రంజిత్‌సింగ్ శత్రువర్గానికి చెందిన సట్లెజ్ ప్రాంత రాజ్యాలకు రక్షణ కల్పించాడు.

**అధీన ఏకాంత వాస విధానం (Policy of Subordinate Isolation) 1813-58.**

ఈ 45 సంవత్సరాల కాలంలో కంపెనీ అన్ని రాజ్యాల పాలకులపై సైన్యసహకార ఒప్పందాలపై సంతకాలు చేయించి ఆ రాజ్యాలను లోబరచుకొన్నది. అన్ని భారతీయ రాజ్యాలు, ఎలాంటి మినహాయింపులు లేకుండా సర్వాధికారిగా కంపెనీ అంగీకరించాల్సి వచ్చింది. రాజ్య రక్షణకు రాజ్యంలో గాని రాజ్యం వెలుపలగాని కంపెనీని సైన్య నిర్వహణకు ధనాన్ని గాని కొంత ప్రాంతాన్ని గాని యివ్వవలసి వుంటుంది. సంబంధిత రాజ్యం ఇంగ్లీషేతర యూరపు వాసిని సేవలలో నియమించరాదు. బ్రిటిషు ప్రభుత్వం ద్వారా గాక విదేశీ సంబంధాలు

పెట్టుకోరాదు. ఇతర రాజ్యాలతో వచ్చే వివాదాలలో బ్రిటిషువారి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించాలి. అందుకు ప్రతిఫలంగా రాజ్యం యొక్క ప్రాదేశిక సమగ్రతని కాపాడతానని కంపెనీ వాగ్దానం చేస్తుంది.

రక్షణకు కంపెనీపై ఆధారపడి సహకార ఒప్పందానికి వచ్చిన రాజ్యాలన్నింటిలోనూ 1765-72 కాలంలో బెంగాల్‌లో లాగా ద్వంద్వ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. సైన్యసహకార పద్ధతిలోని మోసాన్ని గురించి ప్రస్తావిస్తూ సర్ థామస్ మన్రో "ఉన్నత స్థానం అధిరోహించడానికి బలహీనుల్ని అణచివేసిన సందర్భాలు చరిత్రకు కొత్తకాదు" అన్నాడు.

భారతదేశంలోని రాజ్యాలపై సర్వాధిపత్యాన్ని నెలకొల్పిన ఈ దశ ప్రాధాన్యతని గురించి వివరిస్తూ కల్నర్‌లోర్డ్ ఈ విధంగా వ్రాశాడు "భారత రాజ్యాలకు బ్రిటిషువారితో వున్న సంబంధాల చరిత్రలో ఈకాలం చాలా ప్రాధాన్యతని సంతరించుకొన్నది. బ్రిటిషువారు నెమ్మదిగా తమ ఒప్పందాలకు వ్యతిరేకంగా భారత ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం కల్పించుకోవలసి వచ్చింది. ఫలితంగా వారు వలయబద్ధ విధానానికి స్వస్తిచెప్పి అధీనుల కూటమి (Subordinate Alliance)కి తరువాత దశలో ఇంతకంటె ఉదాత్తమైన సహకార భాగస్వామ్యానికి (Cooperative partnership) అంగీకరించారు."

## అధీన సహకార విధానం (Policy of Subordinate Cooperation) 1813-34

పరస్పర స్నేహం, యిచ్చిపుచ్చుకొనే పద్ధతిలో వున్న సైన్య సహకార పద్ధతులను లార్డ్ హేస్టింగ్స్ అధీన సహకార విధానానికి మార్చాడు. యుద్ధానికి తలపడి లేక శాంతి చర్చలు జరిపిగాని భారత రాజ్యాలు తమ సార్వభౌమ హక్కులు బ్రిటిషువారికి అప్పజెప్పాలని ఒత్తిడి తెచ్చి చాలా భారతరాజ్యాలపై బ్రిటిషు సార్వభౌమాధికారాన్ని సుస్థాపితం చేశాడు. అతడు మధ్య భారతదేశంలోని 145 రాజ్యాలను, కథియవాడ ద్వీప కల్పంలోని రాజ్యాలను, రాజస్థాన్‌లోని 20 రాజ్యాలను సైన్య సహకార పద్ధతిలోకి తీసుకొనివచ్చాడు. సిద్ధాంతపరంగా ఈ రాజ్యాలు తమ అంతరంగ సార్వభౌమాధికారం కలిగివున్నట్లు చెప్పబడినప్పటికి బ్రిటిషు రాజ ప్రతినిధులు తరచుగా అంతరంగ వ్యవహారాలలో జోక్యం చేసుకొన్నారు. జోక్యం యొక్క స్థాయి అధికారుల వ్యక్తిత్వం - వారి వ్యవహార సరళిని బట్టి తరతమ భేదాలలో వుంది. భారతదేశంలోని అనేక రాజ్యాలపై ఈ అధీన సహకారాన్ని విధించినప్పటికి లార్డ్ హేస్టింగ్స్ సూత్ర రీత్యా భారత రాజ్యాలను కలుపుకోడానికి వ్యతిరేకి. ఒక్క మాటలో చెప్పాలంటే అతడు ఆక్రమణవాది కాదు. కాని అతడి తరువాత వచ్చినవారు అతడి అభిప్రాయాలతో విభేదించారు. ఈ అధీన సహకార దశలోనే ఏదో ఒక సాకుచూపి చాలా రాజ్యాలను కలుపుకొన్నారు.

**ఆక్రమణ విధానం (1834-58)**

లార్డ్ హేస్టింగ్స్ పదవీకాలం ముగియడానికి 1857 తిరుగుబాటుకి గల మధ్యకాలంలో భారతరాజ్యాలపై బ్రిటిషువారు విపరీతమైన అధికారాన్ని చెలాయించారు. ఈ రాజ్యాలను తమ అదుపులో గల అధికారులకు కట్టబెట్టడం, ఆక్రమణలు జరపాలని బ్రిటిషు ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం – యిందుకు దోహదపడ్డాయి. ఆక్రమణల విధానం అమలు జరపాలని 1834లో కోర్టు ఆఫ్ డైరెక్టర్లు తీసుకొన్న నిర్ణయం, అదే నిర్ణయంపై 1841లో వారి పునరుద్ఘాటన లార్డ్ డల్హౌసీ కాలంలో కఠినంగా అమలు జరుపబడింది. ఇది కంపెనీ ప్రభుత్వం యొక్క రెండు లక్ష్యాల ఫలితం. రెండు లక్ష్యాలు : 1. క్రొత్త ప్రాంతాలను బ్రిటిషు సామ్రాజ్యంలో కలుపుకోవడం ద్వారా బ్రిటిషువారి రాజకీయ ప్రాభవాన్ని విస్తరింపజేయడం. 2. తమ వాణిజ్య పరమైన సరుకుల రవాణా సౌకర్యాలు పెంచుకొనడం; శిస్తులు పన్నులు యితర రూపాలలో ఎక్కువ ఆదాయాన్ని వసూలు చేయడం. ఈ రెండూ కూడా భారతదేశంపై బ్రిటిషువారి పట్టుని పెంచడానికి ఉద్దేశించబడ్డాయి.

భారత రాజ్యాలను 'అలా వదిలేయ్' అనే స్పష్టమైన ఆదేశంతో విలియం బెంటింక్‌ని పంపించినప్పటికి అతడు కొన్ని సందర్భాలలో ఆదేశాలను పాటించలేదు. అంతేగాక ఆ తరువాత బ్రిటిషు ప్రభుత్వం కూడా మరలా ఆక్రమణల విధానాన్ని ప్రకటించింది. మైసూరు పాలకుడి అసమర్ధపాలన కారణంగా చెప్పి బెంటింక్ 1831లో మైసూరు పాలన చేపట్టాడు. పలు రకాలైన సాకులు చూపి యితర రాజ్యాలను కలుపుకొన్నాడు. పాలకుడికి పుత్రసంతానం లేదనే సాకుతో 1833లో కచార్ కబళింపబడింది. కూర్గ్ పాలకుడు బ్రిటిషు వారికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాడనే ఆరోపణతో 1834లో కూర్గ్ ఆక్రమణకు గురయింది. బ్రిటిషువారి ఆదేశాలకు కట్టుబడి వుండేందుకు పాలకుడు నిరాకరించాడనే సాకుతో బెంటింక్ అస్సాంలోని జైంతియా రాజ్యాన్ని బ్రిటిషు ప్రత్యక్ష పాలన క్రిందికి తెచ్చాడు. అస్సాం సమస్యతో తలమునకలై వున్న లార్డ్ ఆక్లాండ్ కర్నూలు నవాబు బ్రిటిషు వ్యతిరేక కార్యకలాపాలను సాకుగా చూపి అతడి పాలనలో వున్న ప్రాంతాన్ని ఆక్రమించాడు. ఆక్లాండ్ తరువాత వచ్చిన ఎలెన్‌బరో గ్యాలియర్ తిరుగుబాటుని అణచి దానిని బ్రిటిషు వారి రక్షణ క్రిందికి తీసుకొచ్చాడు. కాని గ్వాలియర్‌ని కలుపుకోలేదు.

లార్డ్ డల్హౌసీ గవర్నరు జనరల్‌గా వున్న కాలంలో గతంలో ఎన్నడూ లేనంతగా బ్రిటిషు సామ్రాజ్యం బహుముఖంగా విస్తరించింది. రాజ్య సంక్రమణ సిద్ధాంతం ద్వారా డల్హౌసీ చాలా రాజ్యాలను ఆక్రమించాడు. బ్రిటిషువారిపై ఆధారపడిన రాజ్యాల రాజులకు పుత్రసంతానం లేకపోతే ఆ రాజ్యాలను బ్రిటిషువారి అధీనంలోకి తెచ్చాడు. అంటే ఈ సూత్రాన్ని తమపై ఆధారపడిన రాజ్యాలకు వర్తింపజేశాడు గాని మిత్ర రాజ్యాలకు వర్తింపజేయలేదు. భారతదేశంలో

తన సామ్రాజ్యవాద పథకాలకు అనుగుణంగా డల్హౌసీ రక్షిత రాజ్యాలకు మిత్రరాజ్యాలకు మధ్య గల తేడాని విస్మరించాడు; విపరీత వ్యాఖ్యానాలు చేశాడు.

రాజ్యసంక్రమణ సిద్ధాంతం ద్వారా డల్హౌసీ ఆక్రమించిన ప్రాంతాలలో సతారా (1848) జైత్పూర్, సంబల్పూర్ (1849) భగత్ (1850) ఉదయపూర్ (1852) నాగపూర్ (1853) ఝాన్సీ (1854) రాజ్యాలు వున్నాయి. తమపై ఆధారపడిన రాజ్యాలు, తమ రక్షణలో వున్న రాజ్యాల విషయంలో బ్రిటిషువారు వేర్వేరు వైఖరులు అవలంబించారు. డల్హౌసీ రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని వర్తింపజేసి రాజుల బిరుదులు పింఛన్లు రద్దు చేశారు. కర్నూలు నవాబు వారసులు, తంజావూరు రాజు, చివరి పీష్వా లాంటి వారు బిరుదులు పింఛన్లు కోల్పోయారు. డల్హౌసీ మొగలు చక్రవర్తి బిరుదుని రద్దు చేయాలనుకొన్నాడు. కాని అందుకు కోర్టు ఆఫ్ డైరెక్టర్ల మద్దతు లభించలేదు.

'నేరుగా ఆక్రమించడం' 'రాజ్య సంక్రమణ' సిద్ధాంతంతో పాటు బ్రిటిషు వారు 'ప్రజల మంచి కోసం' నెపంతో కొన్ని రాజ్యాలను కలుపుకొన్నారు. అవుధ్ రాజ్యం యిందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. డల్హౌసీ అవుధ్ రాజుకి రాజు ప్రతిపత్తిని, రాజప్రసాదాన్ని బిరుదుల్ని అలాగే వుంచి రాజ్య పరిపాలనని స్వీకరించాలనుకొన్నాడు. కాని అవుధ్‌ని పూర్తిగా స్వాధీనం చేసుకోమని కోర్టు ఆఫ్ డైరెక్టర్లు ఆదేశించారు. డల్హౌసీ 1856లో అవుధ్‌ని బ్రిటిషు సామ్రాజ్యంలో కలిపేశాడు.

అవుధ్ ఆక్రమణ అంతర్జాతీయ న్యాయసూత్రాలకు విరుద్ధమని, అది భూభాగాల ఆక్రమణ క్రిందికి వస్తుందని 1855లో వ్రాసిన ఒక లేఖలో పేర్కొన్నాడు. అంతేగాక సరియైన పాలన లేకపోవడానికి బ్రిటిషువారే బాధ్యత వహించాల్సి వుంటుంది. వారి సైన్య సహకార పద్ధతి, పాలనా వ్యవహారాలలో వారి జోక్యం – అస్తవ్యస్తపాలనకి దారితీశాయి.

దత్తత నిరాకరణ, రాజ్యసంక్రమణ సిద్ధాంతాలు డల్హౌసీ కొత్తగా కనుగొన్నవేం కాదు. ఈ రెండు విధానాలు అంతకు ముందే రూపొందించబడ్డాయి. అమలు జరుపబడ్డాయి. అంతకు ముందు జరిగిన ఆక్రమణలను గురించి యింతకు ముందు ప్రస్తావించాం. ఇక రాజ్య సంక్రమణ సిద్ధాంతం ద్వారా 1839లో మాండవిని 1840లో కొలాబా జలాన్‌లను 1839లో సూరత్‌ని కలుపుకొనడం జరిగింది. కాని డల్హౌసీ ఈ విధానాలను కఠినంగా నిష్కర్షగా అమలు జరిపాడు. ఇన్స్ మాటల్లో చెప్పాలంటే "డల్హౌసీ ఆక్రమణల కంటె ముందు అలాంటి సందర్భాలు అనేకం వున్నాయి. కాని డల్హౌసీకి ముందువారు అవకాశం వున్న సందర్భాలలో వాయిదా వేస్తూ వచ్చారు. డల్హౌసీ మాత్రం చట్టబద్ధం అనుకొన్న వాటి నన్నింటినీ ఆక్రమిస్తూ వచ్చాడు."

### అధీన ఏకీకృత విధానం (Policy of Subordinate Union) 1858-1947

1857 తిరుగుబాటు బ్రిటిషువారు స్వదేశీ సంస్థానాల పట్ల అనుసరిస్తున్న విధానాన్ని మార్చుకొనేలా చేసింది. తిరుగుబాటుకి ముందు భారతరాజ్యాలను ఆక్రమించుకోడానికి గల ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకొన్నారు. ఆ తరువాత ఆక్రమణ విధానాన్ని వదిలిపెట్టి అధీన ఏకీకృత విధానాన్ని చేపట్టారు. తిరుగుబాటు కాలంలో చాలా మంది స్వదేశీ పాలకులు బ్రిటిషువారికి విధేయతగా వుండడమేగాక తిరుగుబాటుని అణచివేయడానికి తోడ్పడ్డారు. భారత పాలకులు చూపిన విధేయతకు బహుమానంగా బ్రిటిషు పాలకులు దత్త స్వీకారహక్కుని గౌరవిస్తామని ప్రకటించారు. ఆక్రమణలు చేపట్టకుండా వారి రాజ్యాల ప్రాదేశిక సమగ్రతకు రక్షణ కల్పిస్తామన్నారు. స్వదేశీ సంస్థానాలు తమకు మిత్రరాజ్యాలుగా వుంటాయని, ప్రజా తిరుగుబాట్లు జరిగినప్పుడు వాటిని అణచివేయడానికి సహకరిస్తాయని 1857 తిరుగుబాటు అనుభవం బ్రిటిషువారికి నమ్మకం కలిగించాయి. ఈ అంశాన్ని లార్డ్ కేనింగ్ 1862లో యిలా స్పష్టం చేశాడు. "ఇటీవలనే సర్ జాన్ మాల్కొం చెప్పినట్లు ... చాలా భారతరాజ్యాలను ఎలాంటి రాజకీయాధికారం లేకుండా కేవలం రాజకీయ ఆయుధాలుగా మాత్రమే వినియోగించుకొంటే తద్వారా భారతదేశంలో మన పాలనని మన నౌకాబల ఆధిక్యత నిలబెట్టుకొనగలిగినంత వరకు సాగించవచ్చు. ఇందులో నాకు ఏమాత్రం సందేహం లేదు. ఇటీవల జరిగిన సంఘటనలు నా అభిప్రాయాన్ని మరింతగా బలపరుస్తున్నాయి."

బ్రిటిషువారు అందుకే భారతదేశంలోని రాజ్యాలను తమ పాలనకు మద్దతు దారులుగా చేసుకోవాలని నిర్ణయించారు. "భారత రాజ్యాలను భారతదేశంలోని బ్రిటిషు సామ్రాజ్యానికి 'మూలస్తంభాలుగా' సంరక్షించుకోవడం బ్రిటిషు విధానంగా వుంటూ వచ్చింది" అని పి.ఇ. రాబర్ట్స్ పేర్కొన్నాడు. ఈ సంరక్షణ బ్రిటిషువారు భారత రాజ్యాల పట్ల అనుసరించే వైఖరిలోని ఒక కోణం మాత్రమే. మరొక కోణం భారత రాజ్యాలు బ్రిటిషు ప్రభుత్వానికి పూర్తిగా లొంగివుండవలసి రావడం. తమని పాలకులుగా కొనసాగనిస్తుందన్నందుకు మూల్యంగా వారు బ్రిటిషు ప్రభుత్వాన్ని భారతదేశ సార్వభౌమాధికార శక్తిగా గుర్తించవలసి వచ్చింది. అందుకే "భారతదేశంలో ఇంగ్లాండు కిరీటం తలెత్తుకొని నిలబడిందని, భారత దేశమంతటా బ్రిటిషువారిని ప్రశ్నించేవారు లేకుండా పోయారని" లార్డ్ కేనింగ్ అభిప్రాయపడ్డాడు. 1876లో భారత ఉపఖండంపై బ్రిటిషు సార్వభౌమాధికారాన్ని నొక్కి చెప్పేందుకే విక్టోరియా రాణి 'భారత మహారాజ్ఞి' బిరుదుని స్వీకరించింది. తరువాత కర్జన్ భారతదేశంలోని రాజులు తమ రాజ్యాలను బ్రిటిషు సామ్రాజ్యం యొక్క ఏజంట్లుగా పరిపాలిస్తారని స్పష్టం చేశాడు. రాజులకు తాము పాలకులుగా కొనసాగుతామన్న హామీ లభించడంతో వారు మనస్ఫూర్తిగా లొంగివుండడానికి అంగీకరించారు. ప్రొఫెసర్ డాడ్‌వెల్ మాటల్లో చెప్పాలంటే "ఈ రాజ్యాలకు బ్రిటిషువారు జారీ చేసిన ఆదేశాల ప్రకారం యివి బ్రిటిషిండియాలో భాగాలుగా వుండిపోయాయి".

భారతపాలకులను బ్రిటిషువారి ఒత్తిడితో యిష్టంలేని అన్యాయమైన ఒప్పందానికి వచ్చిన వారిలాగా గాక యిష్టపూర్వకంగానే బ్రిటిషువారి సామ్రాజ్యంలో సభ్యులైనట్లుగా పరిగణించడం జరిగింది."

బ్రిటిషిండియా ప్రభుత్వాన్ని బ్రిటిషు ప్రభుత్వం తన అధీనంలోకి తెచ్చుకొనక ముందు, స్వదేశీ సంస్థానాలతో బ్రిటిషు ప్రభుత్వం సంబంధాలు ఒకే విధంగా లేవు; స్పష్టంగా నిర్వచింపబడలేదు. మొదటి లోపం అనివార్యం. ఎందుకంటే వివిధ రాజ్యాలు వివిధ కాలాలలో వివిధ పరిస్థితులలో వివిధ ప్రభావాల కారణంగా వివిధ రకాలైన ఒప్పందాలు కుదుర్చుకొన్నాయి. ఇక రెండవ అంశానికి వస్తే, అభివృద్ధి చెందుతున్న బ్రిటిషు సామ్రాజ్యవాదం కూడా వివిధ పరిస్థితులూ ప్రభావాల కారణంగా కాలానుగుణంగా తన విధానాన్ని మార్చుకొంటూ వచ్చింది. ఇంతకు ముందు ప్రస్తావించినట్లు వెల్లస్లీ, హేస్టింగ్స్, డల్హౌసీ పాలనా కాలాలలో కంపెనీ కొత్త విధానాల్ని రూపొందించక పోయినప్పటికి వారు అప్పటికి వున్న విధానాలను యితరుల కంటె నిష్కర్షగా అమలు జరిపారు.

ఫలితంగా స్థానిక పాలకుల మనస్సులలో ఒక విధమైన గజిబిజి గందరగోళం నెలకొన్నాయి. వారి నిజమైన స్థితి ఏమిటో వారికి తెలియలేదు. సూత్రరీత్యా ఒప్పందాలు హామీ కల్పించిన మేరకు వారి రాజ్యాలు ప్రత్యేక రాజకీయ విభాగాలు. వారిలో అత్యధికులు కొన్ని నిర్దిష్టమైన మినహాయింపులతో స్వతంత్ర స్థాయిని స్వతంత్ర ప్రతిపత్తిని అనుభవిస్తున్నారు. కాని ఆచరణలో చాలా రాజ్యాలు (కర్నాటక, సతారా, నాగపూర్, ఝాన్సీ, అవుధ్ లాంటివి) బ్రిటిషు ఆక్రమణలకు గురయ్యాయి. భగత్‌పూర్ మైసూరు గ్వాలియర్ లాంటి చాలా రాజ్యాల అంతరంగిక వ్యవహారాలలో బ్రిటిషువారు జోక్యం చేసుకోవడమే గాక ఆయా రాజ్యాల పాలకుల్ని తొలగించడమో లేక స్థాయి తగ్గించడమో జరిగింది. కంపెనీ పాలకమండలి (Court of Directors) 1841లో బాహాటంగా ఆక్రమణల విధానాన్ని చేపట్టింది. ఆ విధానాన్ని డల్హౌసీ వీలైనంత ఎక్కువగా అమలు జరిపాడు. కాని 1857తిరుగుబాటు ఈ విధానం యొక్క గుణదోషాల్ని స్పష్టంగా వ్యక్తం చేసింది. కంపెనీ నుండి ప్రభుత్వం బ్రిటిషు ప్రభుత్వానికి బదిలీచేయబడినప్పుడు ఈ విధానం సమూలంగా పునర్వ్యవస్థీకరించబడింది.

**అమలు జరిపిన తీరు:**

బ్రిటిషిండియాలోని చాలా యితర మార్పుల లాగానే ఈ అధీన ఏకీకృత విధానం పాక్షికంగా వ్రాతపూర్వకమైన ప్రకటనల ద్వారా, ప్రధానంగా గతంలోని సంఘటనలు సాంప్రదాయాల ద్వారా చాలా నెమ్మదిగా క్రమపద్ధతిలో రూపొందింపబడిన విధానం. 1858లో వెలువడిన బ్రిటిషు రాణి ప్రకటన భారత రాజ్యాలపై బ్రిటిషు పాలకుల వైఖరిని స్పష్టంచేసింది. ఈ ప్రకటనలో భారత రాజ్యాలతో ఈస్టిండియా కంపెనీ కుదుర్చుకున్న అన్ని ఒప్పందాలను,

అన్ని అవగాహనలను తాము గౌరవిస్తున్నామనీ, ఆ ఒప్పందాలన్నింటిని బ్రిటిష ప్రభుత్వం ఆమోదిస్తుందనీ, భారత రాజ్యాల నుండి కూడా ఆ మేరకు ప్రతిస్పందనని తాము కోరుతున్నామనీ ప్రస్తుత భారతదేశంలోని బ్రిటిష భూభాగాలను యికపై విస్తరించేది లేదనీ యిందుమూలంగా భారతదేశంలోని స్వదేశీ రాజులకు తెలియజేస్తున్నాం. ఈ ప్రకటనను అమలుజరిపేందుకు తగిన చర్యలు చేపట్టబడి వుండకపోతే ఈ ప్రకటన సమస్యని పరిష్కరించి వుండేదికాదు. ఇటీవల జరిగిన ఆక్రమణలకు రెండు కారణాలు వారసులు లేకపోవడం, పాలకుల అసమర్ధపాలన. ఆక్రమణలు చేపట్టబోము– అనే విధానానికి నిర్దిష్టరూపం కల్పించబడడానికి ముందు అందుకు సరియైన సాధనాలు సమకూర్చుకోవలసి వచ్చింది.

'వారసులు లేక పోవడం' అనే సమస్య సులభంగానే పరిష్కరింపబడింది. 1860లో 160 మంది స్వదేశీ పాలకులకు దత్తత తీసుకొనే అవకాశం కల్పించబడింది. ఇక అసమర్ధపాలన సమస్య అంత చిన్నదేం కాదు. అసమర్థతని నిర్ధారించేందుకు స్పష్టమైన సూత్రమేమీలేదు. ఐనప్పటికి 1858 తరువాత ఘటనల నుండి ఒక అంశం స్పష్టమవుతుంది. అసమర్థపాలకుడిని దండించడం గాని, అవసరమైతే గద్దె దించడం గాని చేయాలి తప్ప అతడి రాజ్యాన్ని ఆక్రమించడం కాదు – అనేది కొత్త విధానమయింది. అసమర్థపాలన తీవ్రమైన చర్యల్ని అనివార్యం చేసే దశకు చేరకముందే రాజ్యం యొక్క పాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకోవాలి – అనేది ఈ విధనంలోని కొసమెరుపు. ఈ నూతన విధానం ధోరణిని నివారించే స్పష్టమైన ఉదాహరణలు పరిశీలిద్దాం.

రాజుల్ని గద్దె దించడానికి, బలవంతంగా గద్దెదిగేలా వారిపై ఒత్తిడి చేయడానికి బ్రిటిష సార్వభౌమాధికారానికి హక్కు వుందని ప్రకటించి అమలు జరిపారు. అందుకు బరోడా, మణిపూర్‌లు ఉదాహరణలు. బరోడాలో 1870లో అతడి సోదరుడు మరణించడంతో మల్హార్‌రావు గౌక్వాడ్ సింహాసన మధిష్టించాడు. పరిపాలన ఎంత అస్తవ్యస్తమయిందంటే పరిస్థితుల్ని పరిశీలించి సరియైన సంస్కరణలను సిఫార్సు చేయవలసిందిగా 1874లో బ్రిటిష ప్రభుత్వం ఒక విచారణ కమిటీని నియమించడం అనివార్యం చేసేటంతగా అస్తవ్యస్త మయ్యాయి. మల్హార్‌రావు (పాలకుడు) అసమ్మతి తెలపగా బ్రిటిష ప్రభుత్వం ఈ విధంగా సమాధానం యిచ్చింది. "బ్రిటిషువారు కుదుర్చుకొన్న ఒప్పందాల ప్రకారం ఆయా రాజ్యాల అంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం సమర్థనీయమే. బ్రిటిషువారి అధీనంలో వున్న రాజ్యాలలో అసమర్థ పాలనను ప్రభుత్వం సహించదు. ఫలితంగా బరోడా వ్యవహారాలలో జోక్యం చేసుకోడానికి బ్రిటిష వారికి హక్కు వుండటమే గాక ఒక రాజ్యంలో పరిస్థితులు దిగజారిపోయినప్పుడు దానిని సంస్కరించి బాగు చేయడం మా బాధ్యత". పరిపాలనలో చాలా లోపాలున్నట్లు విచారణ కమిటీ నిర్ణయానికి వచ్చింది. 18 నెలల్లో కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టమనీ, అలా చేయకపోతే గద్దె దింపుతామని బ్రిటిష ప్రభుత్వం హెచ్చరించింది.

బ్రిటిషు ప్రతినిధిపై జరిగిన హత్యాప్రయత్నంలో రాజు ప్రమేయం వుందనే అనుమానంతో రాజు గద్దె దించబడ్డాడు. రాజు కుటుంబానికి చెందిన మరొక యువకుడు గద్దెనెక్కించబడ్డాడు.

మణిపూర్‌లో రాజు యొక్క సోదరుని నాయకత్వంలో జరిగిన తిరుగుబాటుతో రాజు 1891లో పదవీ భ్రష్టుడయ్యాడు. రాజు అసమర్ధుడని భావించిన బ్రిటిషు ప్రభుత్వానికి అతడికి తిరిగి రాజ్యాధికారం అప్పజెప్పడం యిష్టం లేదు. అతడి కుమారుడిని వారసునిగా గుర్తించి గద్దె నెక్కించింది. తిరుగుబాటు నాయకుని శిక్షించాలని నిర్ణయించింది. శిక్షని అమలు జరపడానికి ఒక బ్రిటిషు ఉన్నతాధికారి మణిపూర్ వెళ్ళాడు. అతడు పట్టుబడ్డాడు. ఉరితీయబడ్డాడు. కోపోద్రిక్తులైన బ్రిటిషువారు సైన్యాన్ని తరలించారు. తిరుగుబాటు నాయకుడు కొత్తగా గద్దెనెక్కిన రాజు పట్టుబడ్డారు. తిరుగుబాటు, హత్య చేసినందుకు ఉరితీయబడ్డారు. ఫలితంగా ఒక మైనరు బాలుడు గద్దెనెక్కించబడ్డాడు. మణిపూర్ తిరుగుబాటు కారణంగా బ్రిటిషువారు కొన్ని నిబంధనల్ని రూపొందించారు.

1. వారసత్వ తగాదాలను పరిష్కరించే హక్కు బ్రిటిషు వారికి వుంది. పాలకునికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగితే జోక్యం చేసుకొనే హక్కు కూడా బ్రిటిషు వారికి వుంది.

2. అంతర్జాతీయ న్యాయ సూత్రాలు భారత రాజ్యాలకు వర్తించవు.

3. సామ్రాజ్యవాద ఆదేశాలను ప్రతిఘటించడం తిరుగుబాటుగా పరిగణింపబడుతుంది.

4. చట్ట బద్ధమైన విధులను నిర్వర్తిస్తున్న బ్రిటిషు ఏజంట్లను చంపిన వారిని శిక్షించే అధికారం బ్రిటిషు ప్రభుత్వానికి వుంది.

కంపెనీ పరిపాలనా కాలంలో దాదాపు యిలాంటి కారణాల రీత్యానే అవుధ్, పంజాబు, కూర్గులు ఆక్రమణలకు గురయ్యాయి. కాని బరోడా మణిపూర్ ఘటనలు పూర్తిగా భిన్నమైనవి. బరోడా మణిపూర్ ఘటనలలో జోక్యం చేసుకోవడమే గాక వారసత్వ తగాదాలు, అసమర్థపాలన, అంతర్గత తిరుగుబాటు లాంటి సందర్భాలలో వాటికి విరుగుడుగా అవసరమైన తగు చర్యలు చేపట్టేందుకు బ్రిటిషు సార్వభౌమాధికార సంసిద్ధతని వ్యక్తం చేస్తున్నాయి. మరొకవైపు భారత రాజ్యాలను కలుపుకోవడంలో బ్రిటిషు పాలకులకు గల అయిష్టతని వ్యక్తం చేశాయి.

**ప్రాధాన్యత:**

ఈ ఉదాహరణలు భారత రాజ్యాలను ఆక్రమించడం గత కాలపు చర్యలని, రాజుకి వారసుడు లేకపోవడం గాని అసమర్థపాలనని సవరించుకోవడం గాని చేస్తే రాజ్యం ఉనికికేం ప్రమాదం లేదని స్పష్టం చేశాయి. ఈ రాజ్యాలకు రక్షణ స్థిరత్వం పెరిగినప్పటికి వాటి స్థాయి

ప్రతిపత్తి క్రమంగా తగ్గాయి. ఇది పాక్షికంగా అనివార్యం; పాక్షికంగా నిర్దిష్ట విధానం యొక్క ఫలితం. 1891 గజెట్ ప్రకటన భారతరాజ్యాల పరిస్థితిని ఈ విధంగా వర్ణించింది. "బ్రిటిషు మహారాణికి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత ప్రభుత్వానికి స్వదేశీ రాజ్యాలకూ మధ్య వున్న సంబంధాలతో అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు ఏమాత్రం సంబంధం లేదు." దీనివలన బ్రిటిషు ఆధిపత్యం స్థిరపడగా స్వదేశీ రాజ్యాలు బ్రిటిషు ప్రభుత్వానికి విధేయతగా లొంగివుండవలసి వచ్చింది.

లార్డ్‌మింటో 1909 నవంబరులో ఉదయపూర్‌లో చేసిన ఉపన్యాసంలో స్వదేశీ రాజ్యాల పట్ల బ్రిటిషు ప్రభుత్వ వైఖరిని గురించి చేసిన ప్రస్తావన ఈ అంశాన్ని మరింత వివరిస్తుంది. "భారత రాజ్యాల పాలకులు, భారత యూరపు ప్రజలు స్వదేశీ రాజ్యాల పట్ల మేము అనుసరించే విధానమేమిటని అడుగుతున్నారు. విక్టోరియా మహారాణి 1858లో జారీ చేసిన ప్రకటనలోనూ యువరాజు పట్టాభిషేకం సందర్భంగా చేసిన ప్రసంగంలోనూ చెప్పిన దానినే నేను మరలా చెప్పవలసి వస్తుంది" అని స్పష్టం చేశాడు. కాని బ్రిటిషు వైఖరిలో 1858కి 1902కి మధ్య గణనీయమైన మార్పు కనిపిస్తుంది. కంపెనీ పరిపాలనా కాలంలో భారత రాజ్యాల ప్రతిపత్తి గౌరవ ప్రదంగా వున్నది. దీనిని బ్రిటిషు ప్రభుత్వం పూర్తిగా గుర్తించినట్లు ఈ క్రింది ప్రకటన స్పష్టం చేస్తుంది. "స్వదేశీ రాజ్యాల హక్కులను గౌరవాన్ని ప్రతిపత్తిని మా ప్రతిపత్తిలాగానే గౌరవిస్తాం". ఆ విధంగా భారత ప్రభుత్వాన్ని బ్రిటిషు సింహాసనం హస్తగతం చేసుకొన్న తరువాత కూడా భారతరాజ్యాలు స్వతంత్ర సార్వభౌమాధికారాలు గల రాజ్యాలుగా గుర్తించబడ్డాయి. బ్రిటిషు సామ్రాజ్యం యొక్క సామంతరాజ్యాలుగా గాక మిత్ర రాజ్యాలుగా పరిగణించబడ్డాయి. కాని 1876 చట్టం ద్వారా విక్టోరియా రాణిని భారత చక్రవర్తినిగా ప్రకటించిన తరువాత బ్రిటిషు వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చింది. ఇంగ్లాండుపై రాణికి గల సార్వభౌమాధికారాలు భారతరాజ్యాలకు కూడా వర్తింపజేయబడ్డాయి. మరొక విధంగా చెప్పాలంటే చట్టం భారతరాజ్యాలను బ్రిటిషు సామ్రాజ్యం క్రిందికి తెచ్చింది. చట్టపరంగా చెప్పాలంటే పాలకులు ప్రజలూ, సామంతరాజులు సామంత రాజ్యాలకు చెందిన ప్రజలూ అయ్యారు. బ్రిటిషువారు సార్వభౌమాధికారులయ్యారు. కాని ఆచరణలో కొంత కాలం నుండి అలాంటి అధికారాలు చెలాయిస్తూనే వున్నారు. 1902లోయువరాజ్యాభిషేకం సందర్భంగా చక్రవర్తి పంపిన ప్రకటన దీనిని స్పష్టం చేసింది. చక్రవర్తి సందేశంలో యిలా వుంది. "భారతదేశ వ్యాప్తంగా గల సామంతులకు ప్రజలకు యిందు మూలంగా తెలియజేయునది ఏమనగా వారిస్వేచ్ఛకి హామీ యిస్తున్నాం. వారి హక్కుల్ని ప్రతిపత్తిని గౌరవిస్తాం... మా పాలన ఉన్నత లక్ష్యం అది... అది మా భారత సామ్రాజ్యం యొక్క దాని ప్రజల యొక్క సౌభాగ్యాన్ని పెంచడానికి దారితీస్తుంది."

హైదరాబాద్ నిజాంకి 1906లో వ్రాసిన లేఖలో లార్డ్ రీడింగ్ యిలా పేర్కొన్నాడు. "భారతదేశంలో బ్రిటిషు సింహాసనం యొక్క సార్వభౌమాధికారం సర్వోత్కృష్టమైనది. కాబట్టి భారత దేశంలో ఏ రాజ్యం యొక్క పాలకునికి కూడా బ్రిటిషు సామ్రాజ్యంతో సమాన స్థాయిలో చర్చలు జరిపే అధికారం లేదు. కేవలం భారతరాజ్యాలతో కుదుర్చుకొన్న ఒప్పందాల వలననే బ్రిటిషువారికి ఈ ఆధిపత్యం లభించలేదు. అది బ్రిటిషు ప్రభుత్వానికి వున్న హక్కు, బాధ్యత. భారత దేశంలో శాంతి భద్రతలను పరిరక్షించే బాధ్యత బ్రిటన్‌దే. బ్రిటిషు సార్వభౌమాధికారానికి భారత రాజ్యాలకు మధ్య గల సంబంధాలను సమీక్షించి వాటిని అభివృద్ధి పరిచేందుకు 1927లో నియమించబడిన బట్లర్ కమిటీ "వాటి మధ్య సంబంధాలు చారిత్రక సైద్ధాంతిక ఆధునిక అంశాల వలన క్రమంగా పెరుగుతూ రూపుదిద్దుకొన్నాయి" అని పేర్కొన్నది. ఆవిధంగా "సార్వభౌమాధికారం పాక్షికంగా విజయాల ద్వారా, ఒప్పందాల ద్వారా పాక్షికంగా అలవరచడం ద్వారా అభివృద్ధి చెందిన క్రమం" అని 1877లో వెలువడిన అధికార ప్రకటనతో అంగీకరించక తప్పదు.

4

# భారతదేశంలో బ్రిటిషు సామ్రాజ్యం యొక్క రెండు దశలు

## కంపెనీ పాలన (1757-1857)

### ఉద్దేశాలు ఆక్రమణలు:

భారతదేశంలోకి బ్రిటిషువారు చొచ్చుకొని రావడానికి చాలా కారణాలున్నాయి. కంపెనీ వర్తకం యొక్క చోదకశక్తి సుగంధ ద్రవ్యాలు, ప్రత్తి, నల్లమందు ఉత్పత్తి చేసే ప్రాంతాలపై విజయాలు, ఆక్రమణలకు దారితీసింది. బ్రిటిషు పెట్టుబడిదారులు పరిచయం లేని భూభాగాలపై విపరీతమైన లాభాలార్జించే అవకాశాల కోసం సాహస కృత్యాలు ప్రారంభించారు. బ్రిటిషు వారి ఆర్థిక చొరబాటుకి రుణసౌకర్యాలను నియంత్రించగల భారతీయ బ్యాంకర్లు వ్యాపారులు లాంటివారు సహకరించారు. భారతీయ వ్యాపారులు గ్రామీణ, పట్టణ కేంద్రాల మధ్య సంబంధాలు ఏర్పరచివుండకపోతే భారతదేశంలో బ్రిటిషు పాలన పాక్షిక విజయాలు సాధించిన కలగా మిగిలిపోయి వుండేది. నెపోలియన్ యుద్ధాలు (1796–1815), ఆఫ్ఘన్ దిశగా రష్యన్ల విస్తరణ (1830 దశాబ్దంలో) లాంటి నిజమైన లేక ఊహాజనితమైన ఆందోళనలు, అలాగే అంతర్గత స్థిరత్వం కొరకు ఆకాంక్ష – భారతదేశంలో మరిన్ని ప్రాంతాల ఆక్రమణలకు దారితీశాయి. భారతదేశంలో యుద్ధాల వ్యయాన్ని, అవి సమకూర్చే ప్రయోజనాలను గురించి బ్రిటన్‌లోని భారతీయ విశ్లేషకులు తొలుత ఊగిసలాడారు. కాని 1810 దశాబ్దం నాటికి ఆక్రమణలు బ్రిటిషువారికి ప్రయోజనకారిగా పరిణమించాయి. వ్యాపారులకు లాభాలార్జించి పెట్టాయి. లండన్‌లోని ప్రజాభిప్రాయం ఆక్రమణలను స్వాగతించింది. తరచుగా బ్రిటన్ పార్లమెంటులో విస్తరణకు వ్యతిరేకంగా తీవ్రమైన చర్చలు జరిగేవి. కాని రక్షణ కారణాల రీత్యా మిలిటరీ చర్యల సమర్థనలు పార్లమెంటు ఆమోదం పొందేవి.

పోర్చుగీసుతో, ఫ్రెంచి వారితో గల శత్రుత్వాన్ని బ్రిటిషువారు విడనాడారు. వారిని వారి తీరప్రాంత స్థావరాలలో వుండేందుకు అనుమతించారు. బ్రిటిషువారు 1850 దశాబ్దంలో విపరీతంగా విస్తరణలు చేపట్టారు. దురాక్రమణలను ప్రోత్సహించిన గవర్నరు జనరల్స్ భారతదేశ రాజ్యాలకు రాజులకు వ్యతిరేకంగా విషప్రచారం సాగించారు. వెల్లస్లీ (1798-1805) ఆమ్‌హెర్ట్ (1823-28) ఆక్లాండ్ (1836-42) ఎలెన్ బరో (1842-44) రేమ్సే (1848-56) కూలిపోతున్న అధికారాన్ని నిలబెట్టేందుకు నిరాశా నిస్పృహలతో ప్రయత్నాలు చేసినప్పటికి చాలా మంది స్వదేశీరాజులు వారి భూభాగాలను కోల్పోయారు. బ్రిటిషువిజయానికి కారణం ఎత్తుగడలలో ఆయుధాలలో వారి ఆధిక్యత మాత్రమే కాదు. 19వ శతాబ్ద ప్రారంభంలో ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతి ద్వారా స్వదేశీ రాజులతో ఏర్పరచుకొన్న సంబంధాలు కూడా కారణం. చాలామంది స్వదేశీరాజులు భారతదేశంలో బ్రిటిషు సార్వభౌమాధికారాన్ని అంగీకరించి వారి బాధ్యతలను త్యజించారు. బ్రిటిషు వారిచే బలవంతంగా రుద్దబడిన శాంతికొరకు ఊహాజనితమైన స్వయం ప్రతిపత్తిని కాపాడుకొన్నారు. బ్రిటిషు వారు ఆ తరువాత రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి వారసులు లేని రాజ్యాలను బాహాటంగా కలుపుకొన్నారు.

## సిద్ధాంతాలు - పాలనావ్యవహారాల క్రమపరిణామం

భారతదేశం పట్ల యూరోపియన్ల ప్రత్యేకించి బ్రిటిషువారి అభిప్రాయాలలో మార్పువచ్చింది. గతంలో భారతదేశం ప్రాచీన నాగరికత, సాంప్రదాయాలు గల గొప్పదేశం అన్నారు. తరువాత అనాగరిక దేశం అన్నారు. క్రైస్తవ మిషనరీలతో సహా పలువురు మేధావులు భారత ప్రజల్ని నాగరికులుగా మార్చేందుకు ఉద్యమం చేపట్టాలన్నారు. భారతదేశం యొక్క వెనుకబాటుతనానికి గల కారణాలను పరిష్కారాలను గురించి పలువురు పలు రకాలుగా వ్యాఖ్యానించారు. భారతదేశాన్ని నాగరికం చేసే బాధ్యత యూరపుకి వుందని, భారతీయులు స్వయం పరిపాలన సాగించగల సమర్థత సాధించే వరకు ఈ కర్తవ్యం కొనసాగుతుందని వాదించారు.

బ్రిటిషు పార్లమెంటు చాలా చట్టాలు చేసింది. కంపెనీ వర్తకుల విశృంఖలమైన వాణిజ్య కార్యకలాపాలను క్రమబద్ధం చేసేందుకు చేయబడిన 1773 రెగ్యులేటింగ్ చట్టం మొదటిది. ప్రతి 20 సంవత్సరాలకు దీనిని పునఃపరిశీలించాలి. ఈ చట్టాన్ని అనుసరించి బెంగాల్, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలో బ్రిటిషు ప్రభుత్వానికి పర్యవేక్షక అధికారాలు వుంటాయి. వాణిజ్య కార్యకలాపాలకు బ్రిటిషు రాజకీయాధికారానికి కేంద్రంగా వున్న బెంగాల్‌కి ప్రాధాన్యత యివ్వబడుతుంది. బెంగాల్ గవర్నరు స్థాయి గవర్నరు జనరల్ స్థాయికి పెంచబడుతుంది. వారన్‌హేస్టింగ్స్ (1773-85) మొదటి గవర్నరు జనరల్‌గా

నియమింపబడ్డారు. 1784 పిట్ ఇండియా చట్టం కంపెనీపై మంత్రివర్గం నుండి ఎంపిక చేయబడిన బోర్డు ఆఫ్ కంట్రోలు ద్వారా పార్లమెంటు అదుపుని పెంచింది. 1813 చార్టరు చట్టం సతి, థగీ లాంటి పలు సాంప్రదాయ ఆచారాలను చట్ట విరుద్ధం చేస్తూ భారతదేశంలో న్యాయబద్ధమైన మానవతావాద చట్టాలు ప్రవేశపెట్టడం ద్వారా బ్రిటిషు నైతిక బాధ్యతని గుర్తించింది.

1786 నుండి 1793 వరకు గవర్నరు జనరలుగా వున్న కారన్‌వాలీస్ కంపెనీ పరిపాలనని వృత్తిపరం, ఉన్నతాధికారవర్గమయం, యూరోపియన్ విధానాలమయం చేశాడు. అతడు కంపెనీ ఉద్యోగుల ప్రైవేటు వర్తకాన్ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాడు. వాణిజ్య పరమైన పాలనా పరమైన బాధ్యతల్ని విడగొట్టాడు. కంపెనీ ఉద్యోగుల జీతాలను పెంచాడు. బెంగాలీ జమిందారులతో ఒప్పందం కుదుర్చుకొన్నాడు. జమిందారులకు పెద్ద పెద్ద ఎస్టేట్లపై యాజమాన్యం కల్పించి జమిందారీ పద్ధతి అంటే స్థిరమైన పన్నులు శిస్తులు వసూలు చేసే పద్ధతి ప్రవేశపెట్టాడు. వ్యవసాయ విస్తరణని ప్రభుత్వ బాధ్యతల నుండి మినహాయించి జమిందారులకు అప్పజెప్పాడు. కాని మద్రాసు, బొంబాయి రాష్ట్రాలలో రైత్వారీ విధానం అంటే రైతులే వార్షికంగా పన్నులు చెల్లించే విధానం ప్రవేశపెట్టబడింది. ఇతర ఉపాధి సౌకర్యాలు లేకపోవడం వలన ప్రజలు వ్యవసాయంపై ఆధారపడడం పెరుగుతూండగా, భారతదేశం దానికెలాంటి అదుపులేని అంతర్జాతీయ ఆర్థిక విధానంలో విలీనం చేయబడింది. గనుక జమిందారీ విధానం గాని రైత్వారీవిధానం గాని ప్రయోజకారిగా కన్పించలేదు.

సివిలు వ్యాజ్యాల పరిష్కారానికి బొంబాయి మద్రాసు కలకత్తాలలో 1727లో సివిలు కోర్టులు స్థాపించబడ్డాయి. గ్రామీణ ప్రాంతాలలో న్యాయవ్యవహారాలు కంపెనీకి వదలివేయబడ్డాయి. 1722లో అదాలత్‌గా పిలువబడే విస్తృత న్యాయ విధానం నెలకొల్పబడింది. సాంప్రదాయ బద్ధమైన చట్టాలను వ్యాఖ్యానించి వివరించి జడ్జీలకు సహాయ కారులుగా వుండేందుకు హిందూ పండితులు ముస్లిం కాజీలు నియమింపబడ్డారు. మిగిలిన సందర్భాలలో బ్రిటిషు చట్టాలు అమలు చేయబడ్డాయి. కంపెనీలో ఉద్యోగాలు పొందలేని విద్యావంతులకు మేధావులైన భారతీయులకు న్యాయవృత్తి ఒకమేరకు అవకాశాలు కల్పించింది. భారతీయ న్యాయవాదులు తరువాత జాతీయ రాజకీయాలలో సంఘసంస్కరణ ఉద్యమాలలో అగ్రభాగాన నిలిచారు.

1850 దశాబ్దంలో బ్రిటిషువారు భారతదేశంలో శాశ్వతంగా తిష్టవేయవచ్చునని భ్రమలు కల్పించే మూడు సాంఘికాభివృద్ధి వ్యవస్థలు ప్రవేశపెట్టబడ్డాయి. అవి: రైల్వేలు, టెలిగ్రాఫు, పోస్టలు సర్వీసులు. ఇవి డల్హౌసీ గవర్నరు జనరలుగా వుండగా ప్రవేశపెట్టబడ్డాయి. మొదట 1850లో హౌరా (కలకత్తా నుండి హుగ్లీ నది మీదుగా) నుండి బీహారులోని రాణిగంజ్

బొగ్గుగనుల వరకు 240 కి.మీ. రైలు మార్గం నిర్మించబడింది. మొదటి ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ లైను 1851లో బెంగాల్‌లో వేయబడింది. త్వరలో ఆగ్రా, బొంబాయి, కలకత్తా, లాహోర్, వారణాసి లాంటి యితర నగరాలకు విస్తరించబడింది. మూడు ప్రెసిడెన్సీల స్థాయిలో వున్న పోస్టలు వ్యవస్థలు 1854లో విలీనం చేయబడ్డాయి. దేశవ్యాప్తంగా ఒకే పోస్టలు విధానం అమలులోకి వచ్చింది. ఉత్తరాలకు వార్తా పత్రికలకు ఒకే విధంగావుండే ఒకే విధమైన పోస్టలురేట్లతో - అర్ధణా, అణాతో (రూపాయికి 16 అణాలు) నగరాలకు పల్లెలకు మధ్య సమాచార సౌకర్యం సులభతరం వేగవంతం చేయబడింది. సమాచార సౌకర్యం, రోడ్లు జలమార్గాలు అభివృద్ధి పరచడంతో సైన్యం కదలిక, ముడివనరుల రవాణా, వాణిజ్య సమాచారం మార్పు సులభమయింది. కాని రైల్వేలు వివిధ గ్రూపుల మధ్య సామాజిక సాంస్కృతిక దూరాలను తగ్గించలేదు. అంతేగాక ప్రయాణాలలో కొత్త తరహాలను సృష్టించయత్నించాయి. రైల్వేలో పాలకవర్గానికి ప్రత్యేకమైన బోగీలు కేటాయించబడ్డాయి. విద్యావంతుల్ని సంపన్నుల్ని సాధారణ ప్రజల నుండి వేరుచేశాయి. అలాగే 1857 తిరుగుబాటు అణచివేయబడినప్పుడు ఒక బ్రిటిషు అధికారి 'టెలిగ్రాఫ్ భారత దేశాన్ని రక్షించింది' అని వ్యాఖ్యానించాడు. భారత దేశంలో బ్రిటిషువారి ప్రయోజనాలు కలకాలం కొనసాగుతాయని అతడు కలగన్నాడు.

## బ్రిటిషు ప్రత్యక్ష పాలన (1858-1947)

### భారత దేశంలో 1857 తరువాత పరిణామాలు

1857 తిరుగుబాటు ఆధునిక భారతదేశ చరిత్రలో గొప్ప మూల మలుపు. 1858లో బ్రిటిషు ప్రభుత్వం మొగలు సామ్రాజ్యాన్ని రద్దుచేసి రెండవ బహదూర్ షా చక్రవర్తిని బర్మాకు ప్రవాసం పంపించింది. ఈస్టిండియా పాలనని రద్దుచేసి ప్రత్యక్ష పాలన చేపట్టింది. విక్టోరియా రాణి (1877లో) బ్రిటిషు చట్టం క్రింద అందరికి సమానమైన ఆదరణ లభిస్తుందని వాగ్దానం చేసింది. కాని బ్రిటిషుపాలన పట్ల భారతీయుల అపనమ్మకం 1857 తిరుగుబాటు వారసత్వమయింది. 1857 తరువాత కాలంలో ఆర్థిక రెవెన్యూ విధానాలు మారకుండా అలాగే వున్నప్పటికి బ్రిటిషు కేబినెట్ మంత్రి హోదాతో భారతరాజ్య కార్యదర్శి పదవిని సృష్టించడంతో ప్రారంభించి చాలా పాలనాపరమైన మార్పులుచేయబడ్డాయి. గవర్నరు జనరల్ (బ్రిటిషు సింహాసనం యొక్క ప్రత్యక్ష ప్రతినిధిగా పనిచేస్తూ వైస్రాయి అని పిలువబడ్డారు.) కలకత్తాలో వుంటూ భారతదేశ పాలన సాగించాడు. వైస్రాయి కార్యనిర్వాహక మండలి శాసనమండలి సహాయం స్వీకరిస్తాడు. గవర్నరు జనరల్ దిగువన రాష్ట్ర గవర్నర్లు వుంటారు. భారత సివిలు సర్వీసు యొక్క దిగువ స్థాయి ఉద్యోగులతో ఏర్పడే జిల్లా అధికారులపై గవర్నర్ల అజమాయిషీ వుంటుంది. బ్రిటిషువారు ఇండియన్ సివిలు సర్వీసు (ఐ.సి.యస్) సృష్టించారు. చట్టం, వైద్యంతో సహా ప్రజలకు సంబంధించిన అన్ని విభాగాలు ఇండియన్ సివిలు సర్వీసు

అధికారుల పర్యవేక్షణలో వుంటాయి. భారతదేశ పాలనలో ఐ.సి.యస్. అధికారులది కీలకమైన పాత్ర గనుక వారికి మంచి జీతాలు, పెద్ద స్థాయి, పదోన్నతి అవకాశాలు కల్పించబడ్డాయి. ఇంగ్లీషు చదివిన భారతీయుల సంఖ్య క్రమంగా పెరిగినప్పటికి 1910వరకు భారతీయుల్ని ఐ.సి.యస్.అధికారులుగా నియమించేందుకు బ్రిటిషు ప్రభుత్వం విముఖంగా వున్నది.

గతంలో స్వదేశీ రాజులతో చేసుకొన్న ఒప్పందాలను ప్రభుత్వం గౌరవిస్తుందని వైస్రాయి 1858లో ప్రకటించాడు. రాజ్య సంక్రమణ సిద్ధాంతం (స్వదేశీ రాజులకు పుత్ర సంతానం లేకపోతే ఆ రాజ్యాలు కంపెనీ వశమవుతాయనే సిద్ధాంతం) రద్దు చేయబడింది. భారతదేశంలోని 37 శాతం భూభాగం 22 శాతం జనాభా వివిధ మతాలకు (హిందూ, ముస్లిం, సిక్కు యితర మతాలకు) చెందిన 562 మంది సంస్థానాధీశుల పాలన క్రిందికి వచ్చింది. స్వదేశీ సంస్థానాధీశులు డాబు, దర్పం, ఆడంబరాలకు మారు పేర్లయ్యారు. కాని ప్రాదేశిక విస్తీర్ణం, సంపదరీత్యా ఎంతో వైవిధ్యం వున్న వారు పాలించే ప్రాంతాలలో బ్రిటిషిండియాలో వచ్చిన సామాజిక ఆర్థిక మార్పులు రాలేదు. సైనిక నిర్మాణం ప్రభుత్వ నిధుల సేకరణ విధానం పూర్తిగా పునర్నిర్మించబడ్డాయి. తిరుగుబాటు సమయంలో సైనికుల ఐక్యతని చూచి బెంబేలెత్తిన ప్రభుత్వం సైన్యాన్ని మూడు ప్రెసిడెన్సీలకు విభజించింది.

భారతీయుల పట్ల బ్రిటిషువారి వైఖరి మారింది. గతంలో విధేయులుగా వున్న వారిని కూడా అనుమానాస్పదులుగా చూడడం మొదలయింది. బ్రిటిషు ఉద్యోగులు అధికారులు వారి కుటుంబాలు భారతీయుల నివాసాలకు దూరంగా ప్రత్యేక కంటోన్‌మెంట్లులో నివసించారు. బ్రిటిషువారికి భారతీయులకు మధ్య గల జాతి వివక్షతను తొలగించేందుకు 1883లో భారతప్రభుత్వం ప్రయత్నించింది. నేరాలు చేసిన యూరోపియన్లను విచారించే అధికారం భారతీయ జడ్జీలకు వర్తింపజేసే బిల్లు ప్రవేశపెట్టబడింది. బిల్లుని నిరసిస్తూ బ్రిటన్‌లో ప్రదర్శనలు జరిగాయి. పత్రికలలో సంపాదకీయాలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. బ్రిటిషువారి ఒత్తిడికి తలొగ్గి అప్పటి గవర్నరు జనరల్ జార్జి రాబిన్సన్ రిప్పన్ బిల్లులో సమూలమైన మార్పులు చేశాడు. తెల్లవారి ఈ తిరుగుబాటు నుండి భారతీయ మేధావులు విలువైన రాజకీయ గుణపాఠాన్ని నేర్చుకొన్నారు. నిజమైన సమస్యల పరిష్కారానికి వీధులలో ప్రదర్శనలు పత్రికల ద్వారా ప్రచారాలు ఆశించే ఫలితాలు యిస్తాయి – అనేది ఆ గుణపాఠం.

## కాంగ్రెస్ - ముస్లిం లీగు

1857 తిరుగుబాటు తరువాత దశాబ్దాలు రాజకీయ చైతన్యం పెరిగిన కాలం. భారతీయ ప్రజాభిప్రాయం స్పష్టంగా వ్యక్తమైన కాలం. భారతీయ న్యాయకత్వం జాతీయ రాష్ట్ర స్థాయిల్లో ప్రాదుర్భవించిన కాలం. బ్రిటిషు వలస పాలన చేత సృష్టించబడిన ఆర్థిక అస్థిరత, ప్రాంతం, మతం, కులం, భాష ప్రాతిపదికలపై సమాజం పగుళ్లు వారుతున్నప్పటికి

పాశ్చాత్య విద్యలో పట్టాలు పొందిన వారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతూండగా తగ్గుతున్న ఉపాధి అవకాశాలు, విద్యావంతులైన తామే 'జాతి' అని నాయకత్వంలో ఆధిపత్యం సాధించడం – ఆనాటి రాజకీయ దృశ్యం. పదవీ విరమణ చేసిన బ్రిటిషు సివిలు అధికారి ఎ.ఒ. హ్యూమ్ సలహాచే ప్రేరణ పొంది 73 మంది భారతీయ ప్రతినిధులు 1885లో బొంబాయిలో సమావేశమై భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించారు. వీరిలో అత్యధికులు పాశ్చాత్యవిద్యలో ఉద్దండులు, కులీనులు, జీవితంలో పైపైకి ఎదుగుతున్నవారు. వకీళ్లుగా ఉపాధ్యాయులుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్నవారు. లెజిస్లేటివ్ కౌన్సిళ్లలో యూనివర్శిటీలలో, వివిధ కమిషన్లలో నియామకాల కొరకు పోటీపడుతూ రాజకీయానుభవం గడించినవారు. కాంగ్రెస్ స్థాపించబడేనాటికి దానికి స్పష్టంగా నిర్వచింపబడిన సిద్ధాంతం గాని, రాజకీయ సంస్థ నిర్వహణ కవసరమైన నిధులుగాని లేవు. కాంగ్రెస్ యించుమించు ఒక చర్చావేదికగా పనిచేసేది. వార్షికంగా సమావేశాలు జరిపి బ్రిటిషు రాజ్యానికి విధేయత ప్రకటించేది. పౌరహక్కులు గాని ప్రభుత్వంలో ప్రత్యేకించి సివిలు సర్వీసులో అవకాశాలు లాంటి వివాదాస్పదంగాని అంశాలపై చాలా తీర్మానాలు చేసేది. ఈ తీర్మానాలను వైస్రాయి ప్రభుత్వానికి అప్పుడప్పుడు బ్రిటిషు పార్లమెంటుకి సమర్పించేది. కాంగ్రెస్ తొలి సంవత్సరాలలో సాధించింది అత్యల్పం. భారతదేశం మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పుకొన్నప్పటికి కాంగ్రెస్ పట్టణ కులీనుల ప్రయోజనాలను వ్యక్తం చేసేది. ఇతర ఆర్థిక నేపథ్యాలున్న వారి భాగస్వామ్యం దాదాపు లేదు.

1900 నాటికి కాంగ్రెస్ అఖిలభారత రాజకీయ సంస్థగా ఎదిగినప్పటికి అప్పటికి విద్యలో వెనుకబడి వున్నామని ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేదని గుర్తించిన ముస్లింలను ఆకర్షించడంలో విఫలమయింది. హిందువుల కంటె ముస్లింలు వెనుకబడి వున్నారని ముస్లిం నాయకులు గుర్తించారు. మతమార్పిడి, గోవధ, ఉర్దూని ఆరబిక్ లిపితో పరిరక్షణలకు వ్యతిరేకంగా హిందూ సంస్కరణ వాదులు ఉద్యమాలు చేస్తున్నారు. ఈ పరిస్థితులలో కాంగ్రెస్ మాత్రమే భారత ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తే ముస్లిం మైనారిటీ స్థాయి హక్కులు హరింపబడతాయని ముస్లింలు ఆందోళన చెందారు. కాంగ్రెస్ నాయకులకు సహకరించడం కంటె బ్రిటిషు సింహాసనానికి విధేయులుగా వుండడం ప్రయోజనకరమని ముస్లింలు భావించారు. సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ (1817–98) ముస్లిం పునరుజ్జీవన ఉద్యమం ప్రారంభించాడు. అది 1875లో అలిఘర్‌లో మహమ్మడన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజి (1921లో అలీఘర్ ముస్లిం యూనివర్శిటీగా పేరు మార్చబడింది) స్థాపనకు దారితీసింది. ఇస్లాం ఆధునిక పాశ్చాత్య విజ్ఞానానికి అనుకూలమైనదని నచ్చజెప్పి సంపన్న విద్యార్థులకు విద్యా సౌకర్యాలు కల్పించడం దాని లక్ష్యం. కాని భారతీయ ముస్లింలలో గల వైవిధ్యం సమాన స్థాయిగల సాంస్కృతిక మేధాపరమైన పునరుజ్జీవం సాధించడాన్ని అసాధ్యంచేసింది.

గవర్నరు జనరల్ లార్డ్ కర్జన్ (1899–1905) 1905లో బెంగాల్ విభజనకు ఆదేశాలు జారీ చేశాడు. బెంగాల్ విశాలమైన, అధిక జనాభా గల రాష్ట్రం గనుక దానిని విభజించడం పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగు పరుస్తుందని చెప్పాడు. కాని బెంగాల్‌లో బెంగాలీ హిందూ మేధావులు స్థానిక జాతీయ రాజకీయాలలో గణనీయమైన పట్టు సాధించారు. బెంగాల్ రాష్ట్రం రెండుగా విభజింపబడింది. ఢక్కా రాజధానిగా తూర్పు బెంగాల్, అస్సాం; కలకత్తా రాజధానిగా పశ్చిమబెంగాల్. కలకత్తా బ్రిటిషిండియాకు కూడా రాజధానిగా వుంటుంది. దురాలోచనతో హడావిడిగా చేపట్టిన ఈ చర్య బెంగాలీలలో ఆగ్రహ జ్వాలల్నిరేపింది. ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడమే గాక 'విభజించి పాలించే' కుటిల రాజనీతిని అమలు జరిపింది. విస్తృతమైన ఆందోళన ప్రారంభమయింది. స్వదేశీ ఉద్యమం పేరుతో కాంగ్రెస్ బ్రిటిషు వస్తువుల బహిష్కరణకు పిలుపిచ్చింది.

కాంగ్రెస్ నాయకత్వంలోని స్వదేశీ ఉద్యమంతో ప్రజలు ఉవ్వెత్తుగా లేచారు. 1857 తిరుగుబాటు తరువాత బ్రిటిషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అంతగా ప్రజలు కదిలిన సందర్భం మరొకటి లేదు. దేశంలోని కొన్ని ప్రాంతాలను హింస, తీవ్రవాదం, అణచివేతలు ఆవహించాయి. ప్రభుత్వం ఉపశమన చర్యలుగా 1909 రాజ్యాంగ సంస్కరణలు చేపట్టింది. కొందరు మితవాదుల్ని ఇంపీరియల్, రాష్ట్ర కౌన్సిళ్లలో నియమించింది. 1906లో ముస్లిం ప్రతినిధివర్గం వైస్రాయి గిల్బర్ట్ జాన్ ఇలియట్ (లార్డ్ మింటో II 1905–10)ని కలిసి అమలు కానున్న రాజ్యాంగ సంస్కరణలలో ముస్లింలకు ఉద్యోగావకాశాలు పెంచాలని, నియోజకవర్గాలు కేటాయించాలని రాయితీలు కోరింది. బ్రిటిషు ప్రభుత్వం పట్ల విధేయతను ప్రోత్సహించేందుకు, ముస్లిం రాజకీయ హక్కులు సాధించేందుకు అదే సంవత్సరం ముస్లింలీగు స్థాపించబడింది. ప్రభుత్వం 1909 రాజ్యాంగ సవరణల (మోర్లే–మింటో సంస్కరణల)లో ముస్లింలకు రిజర్వు చేయబడిన నియోజకవర్గాల సంఖ్యని పెంచింది. హిందూ ఆధిక్యత గల కాంగ్రెస్ నుండి వేరుగా వుండాలని, 'జాతిలో జాతిగా' తమ వాణి వినిపించాలని ముస్లిం లీగు పట్టుబట్టింది. సుహృద్భావ చర్యగా ఐదవ జార్జి చక్రవర్తి భారతదేశాన్ని సందర్శించాడు. బెంగాల్ విభజన రద్దుచేసినట్లుగా ప్రకటించాడు. కలకత్తా నుండి దేశ రాజధానిని ఢిల్లీకి దక్షిణంగా నిర్మించనున్న న్యూఢిల్లీకి మార్చనున్నట్లు ప్రకటించాడు.

**గాంధేయ యుగం:**

దేశ సమస్యల్ని పరిష్కరించుకొనేందుకు, స్వరాజ్యాన్ని సాధించేందుకు మహాత్మగాంధీ నాయకత్వంలో భారతదేశం పూర్తిగా తనదైన మార్గాన్ని ఎంపిక చేసుకొన్నది. దక్షిణాఫ్రికాలో గాంధీ అమలు జరిపిన అహింసాయుత సత్యాగ్రహ ఆలోచనలు, ఎత్తుగడలు భారతీయ మేధావులకు తొలుత ఆచరణయోగ్యమైనవిగా కన్పించలేదు. కాని 1920లో పంజాబులో

రౌలత్‌చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనలలో గాంధీ సత్యాగ్రహం అస్త్రాన్ని ప్రయోగించినప్పుడు రాజకీయ పరిశీలకులు గాంధీ రాజకీయ శక్తిని గుర్తించారు. 1920లో గాంధీ నాయత్వంలో కాంగ్రెస్ పునర్నిర్మాణం జరిగింది. స్వరాజ్యం లక్ష్యంగా కొత్త నిబంధనావళి రూపొందించుకొన్నది. నామమాత్రమైన రుసుం చెల్లించి కాంగ్రెసులో ఎవరైనా సభ్యుడు కావచ్చు. క్రమశిక్షణకు బాధ్యత వహించే జిల్లా రాష్ట్ర అఖిలభారత కాంగ్రెస్ కమిటీల రూపకల్పన జరిగింది. అప్పటి వరకు నిరాకారంగా అస్తవ్యస్తంగా వున్న కాంగ్రెస్ క్రమశిక్షణాయుతంగా నిర్మాణబద్ధమయింది. మొదటి దేశవ్యాప్త సత్యాగ్రహం చేపట్టిన సమయంలో గాంధీ బ్రిటిషు విద్యా సంస్థల్ని కోర్టుల్ని విదేశీ వస్తువుల్ని (స్వదేశీకి అనుకూలంగా) బహిష్కరించమని, ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా చేయాలని, బ్రిటిషువారు యిచ్చిన బిరుదుల్ని త్యజించమని కోరాడు. కులీనుల సంస్థగా వున్న పార్టీ ప్రజల పార్టీగా మార్చబడింది.

గాంధీ మొదటి దేశవ్యాప్త సత్యాగ్రహం కొంత ఆలస్యంగా చేపట్టిన కారణంగా భారత ప్రభుత్వ చట్టం 1919 రూపకల్పనని ప్రభావితం చేయలేకపోయింది. ఉద్యమం గతంలో ఎన్నడూ లేనంతగా అస్తవ్యస్త పరిస్థితుల్ని సృష్టించింది. విదేశీపాలనకు కొత్త సవాల్ విసిరింది. కాని ఉత్తరప్రదేశ్‌లో మారుమూల నున్న చౌరీచారా పోలీసుస్టేషన్‌పై జరిగిన అత్యాచారాల కారణంగా 1922లో గాంధీ ఉద్యమ విరమణకు పిలుపిచ్చారు. కాని సఫలిత సాధించని ఈ ఉద్యమం భారతదేశ రాజకీయ పరిణామాలలో మైలురాయిగా నిలిచింది. 1924 వరకు గాంధీ జైలులో నిర్బంధింపబడ్డాడు. జైలు నుండి విడుదలైన తరువాత గాంధీ నిర్మాణాత్మక కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించాడు. గాంధీ సాధారణ ప్రజల హృదయాలను మనస్సులను స్పృశించాడు. గతంలో ఏ రాజకీయ నాయకుడు పొందనంత ప్రజా మద్దతు పొందాడు. ఆయన ధార్మిక చింతన, ఆయన దైవభక్తి, ఆయన హిందూ ముస్లిం ఐక్యత, అహింసపై గల దృఢ విశ్వాసాలకు ఆయన భారతీయ విశ్వాసాలకు ప్రతిరూపమయ్యాడు. గాంధీ దృష్టిలో నైతిక పునరుజ్జీవం, సామాజిక అభివృద్ధి, జాతీయ స్వాతంత్ర్యం అవిభాజ్యాలు.

జాతీయ ఆకాంక్షలను వ్యక్తీకరించడంలో గాంధీ నాయకత్వాన్ని జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్‌పటేల్,రాజేంద్రప్రసాద్, సి. రాజగోపాలాచారి, మౌలానా అబుల్‌కలాం అజాద్,సుభాష్‌చంద్రబోస్, జయప్రకాష్ నారాయణ లాంటి కాంగ్రెస్ నాయకులంతా అంగీకరించారు. కాని బ్రిటిషువారి నుండి ఎక్కువ రాయితీలను రాబట్టడంలో ఆయన ఎత్తుగడలతో విభేదించారు. 1920 దశాబ్దంలో స్వరాజ్య పార్టీ, హిందూ మహాసభ, యూనియనిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు ఇండిపెండెన్స్ ఫర్ ఇండియన్ లీగు లాంటి వివిధ రాజకీయ పార్టీలు గ్రూపులు ముందుకు రావడంతో భారతరాజకీయ దృశ్యం విస్తృత రూపం దాల్చింది. మద్రాసులో బ్రాహ్మణేతరుల (జస్టిస్ పార్టీ) మహారాష్ట్రలో మహిర్ల (అణగారిన వర్గాల సంఘం) పంజాబులో సిక్కుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేందుకు ప్రాంతీయ రాజకీయ సంస్థలు పనిచేశాయి.

కాని ఎలక్షన్లలో పోటీకి కాంగ్రెస్ దూరంగా వున్నది. కాంగ్రెస్ లోపలి వెలుపలి శక్తులు బలం పుంజుకోవడంతో రాజ్యాంగ పరంగా మరికొన్ని రాయితీలను సిఫార్సు చేయవలసిందిగా బ్రిటిషు ప్రభుత్వం 1927లో సర్ జాన్ సైమన్ నాయకత్వంలో ఒక కమిషన్‌ని నియమించింది. కమిషన్‌లో భారతీయ సభ్యుడిని నియమించనందుకు కాంగ్రెస్ యితరులు ఆగ్రహించారు. ఫలితంగా దేశవ్యాప్తంగా 'సైమన్ గోబేక్' ప్లకార్డులతో సైమన్ కమిషన్‌ని బహిష్కరించారు. 1929లో మోతీలాల్ మార్గదర్శకత్వంలో రాజ్యాంగ రచన చేయించాలని, 1930 నాటికి సంపూర్ణ స్వరాజ్యాన్ని సాధించాలని నిర్ణయించింది. కాంగ్రెస్ మరికొంత దూరం ముందుకుపోయి 1930 జనవరి 26ను స్వాతంత్ర్య దిన మొదటి వార్షికోత్సవ దినంగా పాటించాలని నిర్ణయించింది.

మహాత్మాగాంధీ తన సుదీర్ఘ ఏకాంత వాసం నుండి బయటికి వచ్చి సబర్మతి ఆశ్రమం నుండి గుజరాత్ తీరప్రాంతాన గల దండి వరకు 400 కి.మీ. 1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు పాదయాత్ర జరిపాడు. గాంధీ, ఆయన వేలాది మంది అనుచరులు చట్టాన్ని ఉల్లంఘించి ఉప్పు తయారుచేశారు. వేలాది మంది నిరసన కారులు నిర్బంధింపబడినప్పటికి వారి శాసనోల్లంఘనం స్వతంత్రం కావాలనే భారతదేశ దృఢ నిర్ణయాన్ని వ్యక్తం చేసింది. తరువాతి 5 సంవత్సరాల వరకు 1935 భారత ప్రభుత్వ చట్ట రూపకల్పనపై చర్చలు, ఘర్షణలలో అటు ప్రభుత్వం యిటు కాంగ్రెస్ మునిగిపోయాయి. కాని అప్పటికి కాంగ్రెసుకి ముస్లింలీగుకి మధ్య వైషమ్యాలు ముదిరి, ఒకటి మరొక దానిపై వేలెత్తి చూపుతూ సయోధ్య పొసగని దశకి చేరుకొన్నాయి.

బ్రిటిషిండియా పరిపాలన కొరకు రూపొందింపబడిన భారత ప్రభుత్వ చట్టం 1935 మూడు లక్ష్యాలను పేర్కొన్నది. మూడు లక్ష్యాలు: ఫెడరల్ వ్యవస్థ స్థాపించుట, రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని సాధించుట, ప్రత్యేక నియోజకవర్గాల ద్వారా మైనారిటీల ప్రయోజనాలకు రక్షణ కల్పించుట. స్వదేశీ సంస్థానాధీశులు పొందుతున్న రాయితీలకు రక్షణ కల్పించడంలో సందిగ్ధతలు నెలకొన్నందున స్వదేశీ సంస్థానాలను బ్రిటిషిండియాని కేంద్రంలో సమైక్యంగా వుంచేందుకు ఉద్దేశించబడిన సమాఖ్య నిబంధనలు అమలు జరపబడలేదు. కాని 1937 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహింపబడడంతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి వాస్తవ రూపం దాల్చింది. కాంగ్రెస్ ఐదు రాష్ట్రాలలో స్పష్టమైన మెజారిటీ సాధించింది. రెండు రాష్ట్రాలలో పైచేయిగా వుంది. కాని ముస్లింలీగు అంచనాలు పూర్తిగా తలక్రిందులయ్యాయి.

**రాజకీయ; వేర్పాటు వాద ధోరణులు:**

కాంగ్రెస్ ముస్లింలీగుని బలీయమైన శక్తిగా గుర్తించలేదు. దానితో కలిసి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకి అంగీకరించలేదు. ఇరుపక్షాల నాయకులు మధ్య జరిగిన చర్చలు

విఫలమయ్యాయి. పరస్పర విశ్వాసం సన్నగిల్లింది. అంతకుముందు మహమ్మదాలీ జిన్నా చరమ దశలో వున్న ముస్లింలీగుకు 'ప్రమాదంలో ఇస్లాం' నినాదంతో ప్రాణం పోసి జాతీయశక్తిగా మలిచాడు. గాంధీ నెహ్రూల ఉద్దేశాలను జిన్నా సందేహించాడు. వారు హిందూ దురభిమానం ప్రదర్శిస్తున్నారని ఆరోపించాడు. కాంగ్రెస్ మంత్రి వర్గాలకు కులతత్వం లంచగొండితనం ఆశ్రిత పక్షపాతాలను ఆపాదించి నిష్కర్షగా దాడిచేశాడు. బెంగాల్ పంజాబులలో గల వివిధ ఇస్లాం సంస్థలను ముఠాలను ముస్లింలీగు గొడుగు క్రింద ఐక్య పరచగలిగాడు.

భారతీయ నాయకులను సంప్రదించకుండా భారతదేశం రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొంటున్నదని వైస్రాయి ప్రకటించడంతో కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర మంత్రి వర్గాలను 1939 నవంబరులో రాజీనామా చేయవలసిందిగా ఆదేశించారు. ఫలితంగా 1937 ఎన్నికలలో కాంగ్రెస్ విజయాలు మూన్నాళ్ళ ముచ్చటయ్యాయి. కాంగ్రెస్ మంత్రివర్గాల రాజీనామాలను ముస్లింలీగు స్వాగతించింది. భారతదేశం రెండు ప్రత్యేక సర్వ స్వతంత్ర రాజ్యాలుగా – ఒకటి: ముస్లిం రాజ్యం, రెండు: హిందూ రాజ్యంగా విభజింపబడాలనే డిమాండును 1940 ముస్లింలీగు లాహోరు సదస్సులో ప్రతినిధులతో జిన్నా ఒప్పించాడు. పాకిస్తాన్ ఆలోచన 1930లోనే అలాహబాద్‌లో తీసుకొని రాబడినప్పటికి అప్పుడు చాలా కొద్దిమంది మాత్రమే అనుకూలంగా స్పందించారు. కాని అస్థిర రాజకీయ వాతావరణం, నాయకుల మధ్య వ్యక్తిగత వైరాలు, జిన్నా అవకాశవాదం – అన్నీ కలిసి పాకిస్తాన్ ఆలోచనని ప్రజల డిమాండుగా మార్చాయి.

**స్వతంత్రం, విభజన:**

1940, 42ల మధ్య కాంగ్రెస్ బ్రిటిషువారికి వ్యతిరేకంగా ఫలించని ఆందోళనలు చేపట్టింది. గాంధీ నెహ్రూలతో సహా 60,000 మంది కాంగ్రెస్ కార్యకర్తలు నిర్బంధింపబడ్డారు. కాంగ్రెస్ లాగా ప్రతికూల వైఖరి అవలంబించకుండా ముస్లిం లీగు రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో బ్రిటిషువారికి మద్దతు తెలిపింది. ఆలస్యంగా నైనప్పటికి రెండు ప్రత్యర్థి పార్టీల డిమాండ్లకు స్థానం కల్పించే వైఖరి బ్రిటిషు వారు చేపట్టి నప్పటికి యుద్ధకాలంలో ఒక పార్టీ ప్రతిపాదనల్ని మరొకటి తిరస్కరించడంతో భారతదేశాన్ని సమైక్యంగా వుంచడం సాధ్యపడలేదు. ఫలితంగా విషమ పరిస్థితి ఏర్పడింది. భారతీయులకు అధికారాన్ని బదిలీ చేయడంలో బ్రిటిషు వారి ఉద్దేశాలను అటు కాంగ్రెస్ యిటు ముస్లింలీగు సందేహించాయి. ఇక బ్రిటిషువారు స్వయం ప్రత్తిని కల్పిస్తూనే భారతదేశంపై కొంత పట్టుని నిలబెట్టుకోవాలని ఆరాటపడ్డారు.

1946 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ముస్లింల భయాందోళనల్ని నివారించ యత్నించడానికి బదులుగా బ్రిటిషువారిని నిందించడానికి విలువైన కాలాన్ని వెచ్చించింది. నెహ్రూ, పటేల్ లాంటి పరిణతి చెందిన నాయకులు కూడా ముస్లింలు ఎంత భయాందోళనలకు

గురయ్యారో, యుద్ధానంతరం బ్రిటిషువారు ఎంతగా బలహీనపడిపోయారో గుర్తించలేక పోయారు. కేంద్రంలో కాంగ్రెస్ ముస్లింలీగుతో అధికారాన్ని పంచుకోడానికి సిద్ధంగా లేదని తేలడంతో జిన్నా 1946 ఆగస్టు 16ని ప్రత్యక్ష కార్యాచరణ దినంగా ప్రకటించాడు. ఫలితంగా ఉత్తర భారతదేశంలో పలుచోట్ల దొమ్మీలు హత్యాకాండ చెలరేగాయి. అంతర్యుద్ధం కంటె విభజనే కొంత మెరుగని పించింది. 1947 జూన్ 3వ తేదీన వైస్రాయి (1947) గవర్నరు జనరల్ (1947–48) అయిన మౌంట్ బాటెన్ బ్రిటిషిండియా సామ్రాజ్యాన్ని భారతదేశం పాకిస్తాన్‌లుగా విభజిస్తున్నట్లు ప్రకటించాడు. పాకిస్తాన్ భారత దేశానికి తూర్పున పడమరా రెండు భాగాలుగా విభజింపబడింది. 1947 ఆగస్టు 15 అర్థరాత్రి 'జైహింద్' పారవశ్య నినాదాల మధ్య స్వతంత్రంలోకి దూకింది. నెహ్రూ అప్పుడు భారతదేశ భవితవ్యంపై కదిలించే చిరకాలం జ్ఞాపకం వుండే ఉపన్యాసం యిచ్చాడు.

**జాతీయ సమైక్యత:**

స్వతంత్రం తెచ్చిన ఆనందోత్సాహాలు తాత్కాలికమే అయ్యాయి. విభజన సందర్భంగా చెలరేగిన మత ఘర్షణలు వినాశకర పరిణామాల్ని తెచ్చిపెట్టాయి. లక్షలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కొట్లాది ఆస్తినష్టం సంభవించింది. లక్షలాది మంది కాందిశీకులుగా భారత పాకిస్తాన్‌లకు పారిపోయారు. ఆస్తుల పంపకంలో సరిహద్దుల గుర్తింపులో, జలవనరుల పంపకంలో, అన్నింటిని మించి కాశ్మీర్‌పై అదుపు – పలు విషయాలలో ఇరు దేశాలు వివాదాలలో కూరుకుపోయాయి. అదే సమయంలో భారతనాయకులు జాతీయ సమైక్యత ఆర్థికాభివృద్ధి – బృహత్కర్తవ్యాలను నెరవేర్చవలసి వచ్చింది.

బ్రిటిషువారు సార్వభౌమాధికారాన్ని వదులుకొన్నప్పుడు 562 స్వదేశీ సంస్థానాలకు ఇటు భారతదేశంలోగాని అటు పాకిస్తాన్‌లోగాని కలిసే అవకాశం యివ్వబడింది. చాలా కొద్ది సంస్థానాలు పాకిస్తాన్‌లో చేరాయి. హైదరాబాద్ (1,32,000 చ.కి.మీ వైశాల్యం, 14 మిలియన్లు పైగా జనాభా) జమ్ము కాశ్మీరు (3మిలియన్ల జనాభా) జూనాగడ్ (5,45,000 జనాభా)లు మినహా మిగిలినవన్నీ భారతదేశంలో కలిసిపోయాయి. భారతదేశం హైదరాబాద్, జూనాగడ్‌లను పోలీసు చర్య ద్వారా ఆయా సంస్థానాధిపతులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించే వాగ్దానాలతో విలీనం చేసుకొన్నది. పాకిస్తాన్ సాయుధ దళాలు పఠాన్లు కాశ్మీరుపై దాడిచేయడంతో కాశ్మీర్ మహారాజా జమ్ముకాశ్మీర్ సంస్థానాన్ని భారతదేశంలో 1947 అక్టోబరు 27న విలీనం చేశాడు. ఈ విలీనం యొక్క చట్టబద్ధతని పాకిస్తాన్ అంగీకరించ నిరాకరించింది. యుద్ధం చెలరేగింది. భారత పాకిస్తాన్‌ల మధ్య కాశ్మీరు సమస్య యిప్పటికి ఉద్రిక్తతలకు, ఘర్షణలకు దారితీస్తూనే వుంది.

స్వతంత్ర భారతదేశం ఎదుర్కొన్న ముఖ్యమైన సమస్యలలో ఆర్థిక వెనుకబాటుతనం ఒకటి. నెహ్రూ నాయకత్వంలో 1951–1964 కాలంలో అమలు జరిపిన మూడు పంచవర్ష ప్రణాళికలు ఆహారోత్పత్తిని పెంచాయి. దేశంలో ప్రాంతీయతత్వం పెరిగింది. జాతి నిర్మాణానికి కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలను బలహీనపరచింది. 1920 దశాబ్ద ప్రారంభంలో ప్రాంతీయ భాషలలో విద్యాబోధన, పరిపాలనా నిర్వహణ ప్రయోజనకారిగా వుంటాయని కాంగ్రెస్ భావించింది. ప్రాంతీయ ప్రయోజనాలు సున్నితమైన జాతీయైక్యతని ధ్వంసం చేస్తాయని దేశ విభజన సంఘటన నాయకులకు – ప్రత్యేకించి నెహ్రూకి అవగతం చేశాయి. భాషల ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజన జరగాలని 1953, 1956లో ఆంధ్ర ఉద్యమంతో ప్రారంభమై దేశవ్యాప్తంగా ఆందోళన జరిగినప్పుడు రాష్ట్రాల పునర్విభజన కమిషన్ సిఫార్సుల్ని నెహ్రూ చాలా అయిష్టంగానే అమలు జరిపాడు. భాషల ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజన జరగడంతో రాష్ట్రాల సంఖ్య పెరిగింది. జిల్లా స్థాయిలో రాజకీయ విధానాల ప్రజాస్వామ్యీకరణకు, జాతీయ సంస్కృతి ఐక్యతలకు వ్యతిరేకంగా ప్రాంతీయ సంస్కృతి డిమాండ్ల వ్యక్తీకరణకు, గ్రామీణ ప్రాంతాలలో కీలకమైన స్థానాల అభివృద్ధి కొరకు, రెండు పార్టీల వ్యవస్థ సాధ్యపడకుండా ప్రతిపక్ష పార్టీలు పెరగడానికి రాష్ట్రాలు ముఖ్య కేంద్రాలయ్యాయి.

# II

# రాజకీయం - ప్రభుత్వం

5

# బ్రిటిషు సామ్రాజ్యవాద సిద్ధాంతం వలసవాద విధానాలు

భౌగోళిక అన్వేషణ ప్రారంభమైనప్పటి నుండి ప్రత్యేకించి ఐర్లాండుపై విజయం సాధించినప్పటి నుండి బ్రిటిషువారు ఐర్లాండు నుండి అమెరికా వరకు, ఇంగ్లాండు నుండి ఆఫ్రికా వరకు – ప్రపంచ వ్యాప్తంగా వెనుకబడిన ప్రజానీకాన్ని నాగరికుల్ని చేసే బాధ్యతలు చేపట్టారు. బ్రిటిషు సామ్రాజ్యవాద చరిత్రని రెండు దశలుగా చూడవచ్చు. మొదటిది: అట్లాంటిక్ మీదుగా అమెరికా వెస్ట్ ఇండీస్‌ల దిశగా విస్తరించిన దశ. రెండవది: 1783లో (పారిస్ ఒప్పందం) ప్రారంభించి తూర్పు దిశగా ఆసియా ఆఫ్రికాలకు విస్తరించిన దశ. సముద్రాల కావలనున్న కొన్ని ప్రాంతాలు బ్రిటిషు వారి వశం కావడంతో బ్రిటిషు యుద్ధోన్మాదం 18వ శతాబ్దంలో క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రాచ్య దేశాల ప్రజల కంటె బ్రిటిషు వారు ఆధునికులని నాగరికులని ప్రచారాలు సాగించారు. తమ సామ్రాజ్యవాద ఆకాంక్షలకు హేతుబద్ధత వుందన్నారు.

ఈస్టిండియా కంపెనీ మొగలు చక్రవర్తిని గుర్తించింది. చక్రవర్తి పేరుతో నాణాలు విడుదల చేసింది. పర్షియన్ భాషని అధికార భాషగా ఉపయోగించుకొన్నది. న్యాయస్థానాలలో హిందువుల ముస్లింల చట్టాలు అమలు జరిపింది. కనుక ఈస్టిండియా కంపెనీ భారతదేశ పాలకుని లాగానే పరిపాలన సాగించిందని చాలా కాలం వరకు వాదనలు చేసింది. క్లైవు కూడా పాలనా వ్యవహారాలు నవాబు అధికారుల చేతుల్లోనే వుంచి కేవలం దివానీ అధికారాలు కంపెనీ అధీనంలో వుంచాడు. అలజడులు ఆందోళనలు నివారించడానికి చేపట్టిన 'ఈ తక్కువగా జోక్యం చేసుకొనే పద్ధతి' ఎక్కువ కాలం సాగలేదు. పరిస్థితుల మార్పుతో కంపెనీ అధికారులు అధికాధికంగా పాలనా వ్యవహారాలలోకి చొచ్చుకుపోయారు. పాలనా క్రమంలో ఆంగ్లేయీకరణ ప్రారంభమయింది. కాని ఈ క్రమం ఒక్కసారిగా గాక సందిగ్ధంగా నెమ్మదిగా ముందుకు సాగింది. మరొక విధంగా చెప్పాలంటే అది విప్లవాత్మకమైన మార్పుకాదు. బ్రిటిషు అధికారులు శిథిలమవుతున్న వ్యవస్థని తాము పునరుద్ధరిస్తున్నట్లుగా చెప్పుకొన్నారు.

భారతదేశానిది గతవైభవం మాత్రమేనని, ఆ వైభవం శిథిలమవడానికి చేరువలో వుందని పాశ్చాత్యులు భావించారు. వారికి భారతదేశ సంస్కృతి సాంప్రదాయాల్ని తెలుసుకోవాలని ఆకాంక్ష కలిగింది. విస్మరింపబడిన భారతీయ సంస్కృతిని న్యాయవ్యవస్థని భారతీయులకు తెలియజెప్పేందుకు సర్ విలియం జోన్స్ లాంటి మేధావులు భారతీయ భాషల్ని అధ్యయనం చేశారు. సంస్కృత గ్రీకు లాటిన్ లను ఇండోయూరపు భాషా కుటుంబానికి చెందినవిగా నిర్ధారించారు. భారతదేశానికి పాశ్చాత్య దేశాలతో సమానమైన ప్రాచీనత వుందన్నారు. ఈ వాదనలు ప్రాచ్యవాదానికి బలాన్ని చేకూర్చాయి. ఫలితంగా భారతీయ భాషల అధ్యయనాన్ని ప్రోత్సహించేందుకు కలకత్తా మదర్సా (1781), ఆసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్ (1784) బనారస్ సంస్కృత కళాశాల (1794) లాంటి సంస్థలు స్థాపించబడ్డాయి.

వారన్‌హేస్టింగ్స్ హయాంలో కంపెనీ ప్రభుత్వ విధానాలలో ప్రాచ్యభాషా వాదానికి ప్రాచుర్యం లభించింది. పరాజితులైన ప్రజల్ని వారి చట్టాల మేరకు పాలించడం ప్రయోజనకారిగా వుంటుందనేది ఆంతర్యం. అంటే బ్రిటిషు పాలనకు భారతీయ నుడికారంలో చట్టబద్ధత కల్పించడం అన్నమాట. ఫలితంగా పాలకులకు భారతీయ సమాజానికి సంబంధించిన సమాచారం అవసరమయింది. పాలిత సమాజంలో మమేకమై సమర్ధవంతంగా పాలించేందుకు దేశం యొక్క సాంప్రదాయాలు చట్టాలు పాలకులకు అవసరమయ్యాయి. ఈ లక్ష్యంతోనే సివిలు సర్వెంట్సుకి భారతీయ భాషలు సాంప్రదాయాలలో శిక్షణ యిప్పించేందుకు లార్డ్ వెల్లస్లీ 1800లో కలకత్తాలో పోర్టు విలియం కాలేజీ స్థాపించాడు. ప్రాచ్య భాషా వాదానికి మరొక రాజకీయ లక్ష్యం వుంది. బ్రిటిషు వారికి భారతీయులకు మధ్య సాంప్రదాయ సంబంధాలున్నట్లు నిరూపించడం ద్వారా, ఈ సంబంధాల ద్వారా భారతీయులకు బ్రిటిషువారి పట్ల ప్రేమ అభిమానం కలిగించి వలస పాలనను అంగీకరింపజేయడం. కాని ప్రాచ్య భాషావాద చర్చ తొలుత ప్రాచీన భారతీయ సాంప్రదాయాల పట్ల గౌరవానికే పరిమితం చేస్తూ పాలిత సమాజం యొక్క సమాచారాన్ని సేకరించి, పాలనా విధానంగా ప్రాచ్య భాషావాదాన్ని తిరస్కరించడానికి భూమికని తయారుచేసింది. ఈ మేధావులు ఆర్యుల సాంప్రదాయాల్ని, వైభవాన్ని అతిశయించి చెప్పడమే గాక ఒకప్పటి అత్యున్నత దశలో వున్న ఆర్యనాగరికత క్షీణతని గురించి నొక్కి చెప్పారు. భారతదేశం తనంతట తానుగా పతనమయింది గనుక యూరపు లాంటి అభివృద్ధిని సాధించేందుకు బ్రిటిషు పాలన అవసరమని సమర్థించుకొన్నారు.

భారత రాజకీయ సాంప్రదాయంలో నిరంకుశమైన అంశాలుగా పరిగణింపబడిన వాటిని త్రోసిపుచ్చి, న్యాయవ్యవస్థకి కార్యనిర్వాహక వర్గానికి మధ్య అధికారాలను విడగొట్టి ప్రభుత్వ జోక్యాన్ని పరిమితం చేయడం బ్రిటిషువారి లక్ష్యం. లార్డ్ వెల్లస్లీ ఈ క్రమాన్ని ప్రోత్సహించాడు.

ఈస్టిండియా కంపెనీ పాలనలో ఒకదానితో మరొకటి సంబంధం లేనివి కానప్పటికి రెండు స్పష్టమైన ధోరణులు వ్యక్తమయ్యాయి. ఒక వైపు కారన్‌వాలీస్ బెంగాలులో ప్రవేశపెట్టిన శాశ్వతశిస్తు విధానం. చట్టబద్ధపాలన, ప్రైవేటు ఆస్తి హక్కులు వ్యక్తికి ఆచార సాంప్రదాయాల నుండి విముక్తి కల్పిస్తాయని, సమాజానికి ఆర్థిక విధానానికి ఆధునీకరణ తీసుకొస్తాయని కారల్‌వాలీస్ శాశ్వత శిస్తువిధానం ప్రవేశపెట్టాడు. కాని మద్రాసులో థామస్‌మన్రో, పశ్చిమ, ఉత్తర భారతదేశంలోని మౌంట్ స్టూవర్ట్ ఎల్ఫిన్‌స్టోన్, జాన్ మాల్కం, ఛార్లెస్ మెట్కాఫ్ లాంటి ఆయన అనుచరులు భారతీయ సాంప్రదాయాలను అనుభవాలను కారన్‌వాలీస్ పరిగణనలోకి తీసుకోలేదని భావించారు. వారు చట్టబద్ధపాలనకి అధికారాలు విడగొట్టడానికి వ్యతిరేకులు కానప్పటికి, అలాంటి సంస్కరణలు భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా సవరించాలని భావించారు. కాబట్టి మన్రో భారతదేశంలోని గ్రామీణ సమాజాలను పరిరక్షించే లక్ష్యంతో రైత్వారీ విధానాన్ని ప్రవేశపెట్టాడు. కాని టిప్పుసుల్తాన్ మైసూరులో చేసిన విధంగా బ్రిటిషు అధికారుల చేత రైతుల నుండి భూమిశిస్తు వసూలు చేయించడం ద్వారా దక్షిణాన కంపెనీ రాజ్యం యొక్క ఆదాయపు పునాదిని పటిష్ఠ పరచడం జరిగింది.

ఆ విధంగా రెండు విధానాలు కూడా కేంద్రీకృత అధికారం, బ్రిటిషు చట్టాలచే రక్షింపబడే ప్రైవేటు ఆస్తి – అనే సూత్రాలపై ఆధారపడి వున్నాయి. సాంప్రదాయ భారత ప్రభుత్వ రూపాలు 'ప్రజల యెడల సానుభూతి వున్న తమలాంటి విజ్ఞానవంతుల చేతుల్లో సర్వాధికారాలు వుంచినప్పుడు' బాగా పనిచేస్తాయని నొక్కిచెప్పారు. ఈ నిరంకుశ వైఖరి సహజంగా భారతీయుల రాజకీయ భాగస్వామ్య ఆలోచనని వ్యతిరేకిస్తుంది. అంతేగాక సామ్రాజ్యవాద అధికారం గ్రామీణ భారతసమాజం యొక్క కులీనులు – బెంగాలులో జమిందారులు మద్రాసులో మిరాసీదార్ల (గ్రామపెద్దల) సహకారంతో కలకాలం వర్ధిల్లుతుందని భావించబడింది. అందుకే కారన్‌వాలీస్ విధానం, మన్రో విధానం – రెండూ కూడా గ్రామీణ కులీనులకు అధికారాలు కట్టబెట్టాయి. అవుధ్‌లో తాలూకా దార్ల తొలగింపు 1857 తిరుగుబాటుకి కారణమయింది. కాబట్టి వారి అధికారాలు పునరుద్ధరించబడ్డాయి.

1800 సంవత్సరం ప్రాంతంలో బ్రిటన్‌లో వచ్చిన పారిశ్రామిక విప్లవం నూతన ఆర్థిక పరిస్థితులను అవసరాలను సృష్టించింది. బ్రిటన్‌లో కొత్త ఆలోచనా ధోరణులు 'అభివృద్ధి ఆలోచనని ప్రచారం చేసి యింటా బయటా (బ్రిటన్‌లో భారతదేశంలో) సంస్కరణ అంశాన్ని ముందుకు తెచ్చాయి. బ్రిటన్‌లో స్వేచ్ఛా వాణిజ్య వేత్తలు భారతదేశ వర్తకంలో కంపెనీ గుత్తాధికారం రద్దు కొరకు ప్రయత్నించగా, మత ప్రచారకులు ఉపయోగితావాదులు భారతదేశంలో కంపెనీ పాలనలో సమూలమైన మార్పుల కొరకు తీవ్రంగా కృషి చేశారు. ఈ రెండు ఆలోచనా ధోరణులకు చెందిన వారు భారతదేశంలో విజయం పాపం నేరపూరిత చర్యలతో సాధించబడిందని చెప్పారు. కాని ఈ రెండు ఆలోచనా ధోరణులకు చెందిన వారు

కూడా నేరాలతో కూడుకొన్న ఈ పాలన రద్దు కొరకు గాక పాలనలో సంస్కరణలు చేపట్టాలన్నారు. భారత ప్రజలు మంచి ప్రభుత్వంతో పొందే ప్రయోజనాలు పొందాలన్నారు. ఇంకా విపరీతమేమంటే భారతదేశంలో ఇంగ్లాండు శాశ్వతంగా వుండిపోవాలన్నారు.

మత ప్రచారకులు భారతదేశం యొక్క అనాగరికతపై యుద్ధం ప్రారంభించారు. భారతదేశం యొక్క స్వరూపాన్ని మార్చే నెపంతో బ్రిటిషు పాలన శాశ్వతంగా కొనసాగాలన్నారు. భారతదేశంలో కలకత్తా సమీపంలో శ్రీరాంపూర్ వద్ద స్థిరపడిన మిషనరీలు ఈ ప్రచారం చేశాయి. ఇంగ్లాండులో ఈ వాదనకు ప్రధాన కారకుడు ఛార్లెస్ గ్రాంట్. అతడు 1792లో "భారత ప్రజల అజ్ఞానాన్ని మతపరమైన భావనలు పెంచాయి" అన్నాడు. ఈ సమస్యని క్రైస్తవ మత కాంతి పుంజాల్ని ప్రసరింపజేసి పరిష్కరించవచ్చునన్నాడు. అదే భారతదేశంలో బ్రిటిషు పాలన యొక్క మహత్తర లక్ష్యంగా వుండాలన్నాడు. గ్రాంట్ ఆలోచనలను 1813 చార్టరు చట్టానికి ముందు విలయం విల్బర్ ఫోర్స్ బ్రిటిషు పార్లమెంటులో బలంగా ప్రతిపాదించాడు. ఎలాంటి ఆటంకాలు లేకుండా క్రైస్తవ మిషనరీలు భారతదేశంలోకి ప్రవేశించేందుకు ఈ చట్టం అవకాశం కల్పించింది. అదే సమయంలో స్వేచ్ఛా వాణిజ్య వేత్తలు తమ ఆర్థిక ప్రయోజనాల కొరకు 'అభివృద్ధి, మార్పు' ఆలోచనలకు ప్రచారమిచ్చారు. 'స్వాయత్తీకరణ, ఆంగ్లేయా కరణ' విధానానికి సంబంధించినంత వరకు మత ప్రచారకుల, స్వేచ్ఛా వాణిజ్యవేత్తల ధోరణులలో ఎలాంటి తేడా లేదు. మత ప్రచారకుడు ఛార్లెస్ గ్రాంట్ అధ్యక్షతన 1833 చార్టరు చట్టం ఆమోదం పొందింది. ఈ చట్టం కంపెనీకి గల గుత్తాధికార హక్కుల్ని రద్దు చేసింది.

ఈ కాలంలో బ్రిటిషు ఉదారవాదం అత్యున్నత దశకు చేరుకొన్నది. నిరంకుశాధికారాలు విధానాలుగా గల ఉపయోగితావాదం ఉదారవాదం నుండి పుట్టింది. ఉపయోగితావాదం ప్రధాన ప్రచారకుడు జెరిమీ బెంతామ్ అభిప్రాయాన్ని అనుసరించి అత్యంత ఎక్కువ మందికి ఎక్కువ ఆనందాన్ని సమకూర్చడం మానవ నాగరికత ఆదర్శం. మంచి చట్టాలు, సమర్ధవంతమైన పాలన మార్పుని తెచ్చే సాధనాలు. బెంతామ్ అనుచరుడు జేమ్స్ మిల్ ఈస్టిండియా కంపెనీ లండన్ ఆఫీసు బాధ్యతలు స్వీకరించడంతో భారతదేశ విధానాలు అలాంటి సిద్ధాంతాలచే ప్రభావితం చేయబడ్డాయి. 1817లో ప్రచురింపబడిన బ్రిటిషిండియా చరిత్రలో సర్ విలియం జోన్స్ లాంటి వారు చెప్పిన భారతదేశ ఆర్థిక సాంస్కృతిక ఔన్నత్యాన్ని మిల్ నిరాకరించారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే సమర్థుడైన ఉపాధ్యాయుడు కావాలన్నాడు. అంటే మంచి శాసనాలుచేసే తెలివైన ప్రభుత్వం కావాలన్నాడు. అతడి ప్రయత్నాల కారణంగానే 1833లో లార్డ్ మెకాలే ఆధ్వర్యంలో లా కమిషన్ నియమింపబడింది. కమిషన్ 1835లో భారత శిక్షాస్మృతి తయారుచేసింది.

ఉపయోగితావాదులు చాలా ముఖ్యమైన విషయాలలో ప్రత్యేకించి ఆంగ్లీకరణ సమస్యపై ఉదారవాదులతో విభేదించారు. ఉదారవాదియైన లార్డ్ మెకాలే 1835లో విద్యపై చేసిన ప్రఖ్యాత ప్రకటనలో ఇంగ్లీషు విద్య ప్రవేశపెట్టాలని గట్టిగా వాదించగా మిల్‌లాంటి ఉపయోగితావాదులు ప్రాంతీయ భాషలలో విద్యని సమర్థించారు. మరొక విధంగా చెప్పాలంటే భారతదేశం పట్ల బ్రిటిషు సామ్రాజ్యవాద వైఖరులలో సందిగ్ధతలు 19వ శతాబ్దం మొదటి అర్థభాగం వరకు కొనసాగుతూ వచ్చాయి. ఈ సందిగ్ధతలు లార్డ్ బెంటింక్ చర్యలలో స్పష్టంగా కనిపిస్తాయి. మిల్ అనుచరుడుగా బెంటింక్ సతిని శిశుహత్యల్ని చట్టం ద్వారా రద్దు చేశాడు. అదే సమయంలో భారతీయ సాంప్రదాయాలపై తన నమ్మకాన్ని వదులుకోలేదు. అంతేగాక 1835లో రూపొందింపబడిన భారత శిక్షాస్మృతి 1860 వరకు చట్టరూపం దాల్చలేకపోయింది. భారతదేశంలో బ్రిటన్ లక్ష్యాన్ని త్వరితంగా సాధించాలన్న మిల్ ఆకాంక్షపట్ల నిశ్చితాభిప్రాయం లార్డ్ డల్హౌసీకి వున్నప్పటికి సందిగ్ధతలు 19వ శతాబ్దం వరకు కొనసాగాయి.

1857 తరువాత భారతదేశంలో విక్టోరియా తరహా ఉదారవాదం బ్రిటిషు రాజ్యం యొక్క సిద్ధాంతమయింది. తిరుగుబాటు అనుభవంతో చాలా మంది బ్రిటిషువారు సంస్కరణలు నిరుపయోగమని, ప్రమాదకరమని, భారతీయులకు తమలా తయారయ్యేందుకు శిక్షణ యివ్వడం సాధ్యపడదని భావించారు. కాని సంస్కరణల పట్ల ఉత్సుకత, ఆసక్తి పూర్తిగా సన్నగిల్లలేదు. సంస్కరణల పట్ల ఆసక్తి మహారాణి ప్రకటన 1858లోను, విద్యని ప్రోత్సహించడంలోను, భారత శాసనసభల చట్టం 1861లోను, స్థానిక స్వయం పరిపాలనచట్టం 1862లోనూ వ్యక్తమయింది. మరొక వైపు భారతీయ సంస్కృతిపట్ల ఆదరణని విజేతగా నిలిచిన జాతి ఆధిక్యత అధిగమించింది. అంతేగాదు ఇప్పుడు భారతదేశం యొక్క తక్కువ తనాన్ని నొక్కి చెప్పింది. ఇలాంటి ఆలోచనలకు 19వ శతాబ్దంలో పుట్టుకొచ్చిన జాతిపరమైన విజ్ఞాన శాస్త్రాలు బలాన్ని చేకూర్చాయి. జాతి గుర్తింపుకి భాషల కంటే శరీరాకృతులు, రంగులు ముఖ్యమైన సూచికలని ఈ శాస్త్రాలు పేర్కొన్నాయి. జాతులకు సంబంధించిన మానవశాస్త్రం ప్రాచీన భారతదేశ నాగరికతకు స్థానం కల్పించలేదు. కాబట్టి తెల్లజాతి వారైన ఆర్యులు, దండయాత్రలు చేశారని, నల్లచర్మం గల భారతదేశ ఆదిమ తెగల్ని జయించారని, నైతిక నాగరికతని అభివృద్ధి చేశారని సిద్ధాంతీకరణ చేయబడింది. మరొక విధంగా చెప్పాలంటే ప్రాచ్యదేశానికి సంబంధించిన ఈ అల్లిక కులపరంగా విభజింపబడిన భారతీయ సమాజాల్ని మన ముందు వుంచింది. భారతదేశానికి వర్తింపజేసిన ఈ పరిస్థితి నిరంకుశ వలస పాలనకు హేతుబద్ధతని కల్పించింది. భారతదేశానికి గల స్వయంపాలన అర్హతలు త్రోసిపుచ్చబడ్డాయి. చేపట్టబడే సంస్కరణలు కేవలం జాతీయవాదులు డిమాండ్లు చెప్పుకోడానికి పరిమితం చేయాలని నిర్ణయించబడింది.

ఇంగ్లీషువారు జాతి ఆధిక్యతపై 19వ శతాబ్దం మధ్యలో చేసిన ప్రకటనలు మొదటి సారిగా చేసినవి కావని మనం గమనంలో వుంచుకోవాలి. 18వ శతాబ్దం చివరి నుండి యిలాంటి ప్రకటనలు చేస్తూనే వున్నారు. కారన్‌వాలీస్ అధికార యంత్రాంగాన్ని భారతీయులకు దూరంగా వుంచాడు. అంతేగాక బ్రిటన్‌కి చెందిన కంపెనీ సివిలు ఉద్యోగులు భారతీయ స్త్రీలని వివాహమాడటాన్ని నిరుత్సాహపరిచాడు. బ్రిటిషు స్త్రీలను వారి ప్రత్యేకతని పరిరక్షించుకోవాలన్నారు. 'ప్రత్యేకతని కించపరచే ఎలాంటి చర్యయైనా మన భారత సామ్రాజ్యాన్ని శిథిలం చేస్తుందని' కంపెనీ కంట్రోలు బోర్డు ప్రెసిడెంటు హెన్రీ డూండాస్ వాచ్చరించాడు. పాలితులు పాలకుల మధ్య విభజన సామ్రాజ్యవాద సిద్ధాంతంగా 18వ శతాబ్దంలో సామ్రాజ్యవాద రాజధాని కలకత్తాని అభివృద్ధి పరచిన తీరు స్పష్టం చేసింది. 18వ శతాబ్దం ప్రారంభంలో కలకత్తా వైట్‌టౌన్, బ్లాక్‌టౌన్, గ్రేటౌన్‌గా విభజింపబడింది. గ్రేటౌన్‌లో ఆంగ్లో ఇండియన్లు నివసించేవారు. ఆంగ్లో ఇండియన్లు ఒక స్థాయికి మించిన సివిలు మిలిటరీ ఉద్యోగాలకు అనర్హులని ప్రకటించడంతో 1791 నుండి వారి స్థాయి క్రమంగా క్షీణించింది. 19వ శతాబ్దం ప్రారంభం నాటికి కలకత్తా నగర జీవితంలో భారతీయులకు బ్రిటిషువారికి మధ్య గల సామాజిక దూరం కంటికి కనిపించేటంత వాస్తవ రూపం దాల్చింది.

19వ శతాబ్దపు పూర్వార్ధంలో జాత్యాహంకారంతో పాటు లార్డ్ మెకాలే వ్యక్తం చేసినట్లు 'భారతీయుల్ని బ్రౌన్ సాహిబ్‌లుగా' – అంటే రక్తం రంగులో భారతీయులైనప్పటికి ఆలోచనలు అభిరుచులలో యూరపువారిగా మార్చాలనే ఉదారవాద ఆశాభావం కూడా కొనసాగింది. ఈ ఆశాభావం 1857 తిరుగుబాటుతో కకావికలమయింది. 1877 సామ్రాజ్యవాద దర్బారు విక్టోరియా రాణిని భారతదేశం సామ్రాజ్ఞిగా ప్రకటించి భారతదేశంపై బ్రిటన్‌కి గల సర్వాధిపత్యాన్ని నిర్ద్వంద్వంగా చాటుకొన్నది. ఇది ప్రజల నుండి రాజాల వరకు గల భారతీయులకు వారి వారి స్థానాలను నిర్దేశించి వైస్రాయిని సర్వాధికారిగా చేసింది. 1883లోని ఇల్బర్టు బిల్లు వివాదం నియంతృత్వ ధోరణుల తుది విజయాన్ని, వలస పాలకుల జాత్యహంకారాన్ని స్పష్టం చేసింది. 20 శతాబ్దం ప్రారంభంలో భారత జాతీయవాదం యిలాంటి జాత్యహంకార సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి పోరాడవలసి వచ్చింది.

భారతదేశంలోని కంపెనీ ఉద్యోగుల అధికార దుర్వినియోగాన్ని అదుపు చేసేందుకు పార్లమెంటు చేసిన ప్రయత్నంలో భాగంగా బ్రిటిషు ఆక్రమణలలో వున్న భారతదేశ ప్రాంతాలలో ఇంగ్లీషు విధానాలను ప్రవేశపెట్టాలనే ఆలోచనలు ప్రారంభమయ్యాయి. లార్డ్ నార్త్ 1773 రెగ్యులేటింగు చట్టం కలకత్తాలో సుప్రీం కోర్టుని స్థాపించింది. సుప్రీం కోర్టు స్థాపన లక్ష్యం ఇంగ్లీషువారికి బెంగాల్ పౌరుల నుండి రక్షణ కల్పించడం. సుప్రీం కోర్టుకి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించబడింది. గవర్నరు జనరల్ కౌన్సిల్‌తో సంబంధం లేకుండా సుప్రీం కోర్టు పనిచేస్తుంది. సుప్రీం కోర్టు ఇంగ్లీషు చట్టాన్ని అమలు జరిపింది. కాని హేస్టింగ్స్ దేశీయ హిందూ ముస్లిం

విధానాలను ఇంగ్లీషు చట్టం త్రోసిపుచ్చటాన్ని నివారించాడు. ఆంగ్లీకరణ ప్రమాదానికి వ్యతిరేకంగా భారతీయ సమాజాన్ని భారతీయ సంస్థల్ని పరిరక్షించాడు. ప్రాచ్యభాషలకు ఉపకార వేతనాలిచ్చేందుకు ప్రోత్సాహం, ప్రత్యేకించి హిందూ చట్టాలకు హాల్హెడ్ అనువాదం, హేస్టింగ్స్ వైఖరిని తెలియజేస్తాయి.

1796 నుండి 1793 వరకు గవర్నరు జనరల్‌గా వున్న కారన్‌వాలీస్ హయాంలో మరలా ఆంగ్లేయీకరణ క్రమం ఊపందుకొన్నది. కాని అప్పుడు కూడా అది రక్షణ చర్యగానే వుంది.

కంపెనీ ఆర్థికపరమైన కష్టాలు, కంపెనీ పాలిత ప్రాంతాలలోని కష్టాలు కడగండ్లు, కంపెనీ ఉద్యోగుల్ని అదుపు చేయడం లోని వైఫల్యం కారణంగా ఉత్పన్నమయ్యాయి. కాబట్టి కారన్‌వాలీస్ కంపెనీ ఉద్యోగుల్ని వ్యక్తులుగా గాక ఇంగ్లీషు రాజ్యాంగ సూత్రాలతో పరిపాలించే ప్రభుత్వ విధానంలో భాగంగా పరిగణించాలన్నాడు. కంపెనీ అమలు జరుపుతున్న ఆసియా నిరంకుశత్వం అన్ని అనర్థాలకు మూలమన్నాడు. అందుకు విరుగుడుగా ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేయాలన్నాడు. అలా చేస్తే అధికార దుర్వినియోగాన్ని నివారించవచ్చుననుకొన్నాడు. అందుకే శాశ్వత కౌలు విధానాన్ని ప్రవేశపెట్టాడు. రాజకీయాధికారం లంచగొండితనంతో కూడుకొన్నది. కాబట్టి దుర్వినియోగం చేయబడుతుంది. సరిగా ఉపయోగపడాలంటే అది వీలైనంత వరకు కుదింపబడాలి. కారన్‌వాలీస్ ప్రభుత్వం యొక్క పనిని 'వ్యక్తి అతడి ఆస్తిపాస్తులను రక్షించే మేరకు పరిమితం చేయాల'నుకొన్నాడు. భూమిపై ప్రభుత్వ ఆదాయాన్ని నిర్ధారించడం మంచిదనుకొన్నాడు. కాని శాశ్వత శిస్తువిధానం ప్రవేశపెట్టడంలో మరొక అంశం యిమిడివుంది. అది భూమిపై ప్రైవేటు ఆస్తి హక్కుల్ని ప్రవేశపెట్టడం, వాటిని పాశ్చాత్య తరహాలో పరిరక్షించడం జరిగింది.

కారన్‌వాలీస్ చట్టబద్ధపాలనకు నిర్దిష్టరూపం యివ్వాలనుకొన్నాడు. పాలనా విధానంలో ఆంగ్లీకరణ చేపట్టాడు. భారతీయుల్ని పెద్ద ఉద్యోగాల నుండి తొలగించాడు. జమిందారుల భూస్వాములు సాయుధ సిపాయిల్ని నియమించుకోడాన్ని రద్దు చేశాడు. బెంగాల్‌లో ప్రతిజిల్లా కొక కలెక్టర్ని నియమించాడు. కలెక్టరు అంటే కేవలం ప్రజల నుండి ప్రభుత్వానికి పన్నులు వసూలు చేసేవాడు. అతడికి పాలనాధికారాలు గాని న్యాయాధికారాలుగాని లేవు. అతడికి జిల్లా పోలీసుల్ని నియంత్రించే అధికారం కూడా లేదు. జిల్లా పాలనా వ్యవస్థకి జిల్లా జడ్జి ఉన్నతాధికారి. జిల్లా జడ్జి స్థాయిలోను జీతంలోను కలెక్టరు కంటె ఎక్కువ.

ఆ తరువాత వచ్చిన గవర్నరు జనరల్స్‌లో వెల్లస్లీ ప్రముఖుడు. అతడు ఇంగ్లీషు విధానాల్ని బాగా అభిమానించేవాడు. బ్రిటిషు ప్రభుత్వం కారన్‌వాలీస్ పనివిధానాన్ని ఒక నమూనాగా స్వీకరించింది. కాని భారతదేశ పాలనకు బ్రిటిషు రాజ్యాంగ సూత్రాలను వర్తింపజేసే

విధానానికి వ్యతిరేకత వెల్లస్లీ క్రింద పనిచేసే మన్రో, ఎల్ఫిన్‌స్టోన్, మాల్కం, మెటాఫ్ లాంటి అధికారుల నుండి వ్యక్తమయింది. వారి ఆలోచనలు పని విధానం నుండి ఆంగ్లీకరణ పరిపాలనా విధానానికి చైతన్యవంతమైన ప్రత్యామ్నాయం వచ్చింది. 1818 తరువాత అంతర్గత పాలనని ఉదారవాదం గణనీయంగా ప్రభావితం చేయడం మొదలవడంతో భారత విధాన రూపకల్పనలో ఈ ప్రత్యామ్నాయం ప్రధాన పాత్ర నిర్వహించింది. గనుక దీనిని లోతుగా అధ్యయనం చేయడం అవసరం. వయస్సులో మానసిక ప్రవృత్తులలో తేడాలు వున్నప్పటికి ఈ రాజకీయ సాంప్రదాయాన్ని స్థాపించిన వారి ఆలోచనా విధానంలో ఐక్యత వుంది. కారన్‌వాలీస్ స్ఫూర్తికి భిన్నంగా వారి పనివిధానం వివిధ రూపాల్లో వ్యక్తమయింది. మన్రో రైత్వారీ విధానాన్ని రూపొందించాడు. అతడు గవర్నరుగా వున్న 1819–27 కాలంలో మద్రాసు ప్రెసిడెన్సీ అంతటా అమలు జరిపాడు. మరాఠీలకు వ్యతిరేకంగా విజయవంతంగా దౌత్యవ్యవహారాలు నడిపిన మౌంట్ స్టూవర్టు ఎల్ఫిన్‌స్టోన్ 1819లో గవర్నరయ్యాడు.

6

# బ్రిటిషిండియా పరిపాలన - క్రమ పరిణామం

బ్రిటిషు పాలనా కాలంలో భారతదేశ రాజ్యం యొక్క ప్రభుత్వ స్వభావం వలసవాద లేక పరాధీన స్వభావం కలదిగా వుంది. బ్రిటిషు పాలన కాలంలో బ్రిటిషుపార్లమెంటు (రాజు, హౌస్ ఆఫ్ లార్డ్స్, హౌస్ ఆఫ్ కామన్స్‌తో కూడిన)కి అపరిమితమైన శాసనాధికారాలు వున్నాయి. కాని బ్రిటిషిండియాపై పార్లమెంటు శాసించిన చట్టపరమైన సార్వభౌమాధికారం స్పష్టంగా ప్రకటించబడలేదు. ఈ అధికారం 1858 వరకు అవ్యక్తంగా పరోక్షంగా కొనసాగింది. 1833 చార్టరు చట్టం కంపెనీని బ్రిటిషు ప్రభుత్వం నియమించిన ధర్మకర్తగా భావించింది. 1858 చట్టం బ్రిటిషు సామ్రాజ్యం యొక్క ప్రత్యక్ష పాలనకు అవకాశం కల్పించింది. అప్పటికే చాలా బాధ్యతలు నిర్వహిస్తున్న పార్లమెంటుకి చాలా దూరంలోవున్న విస్తారమైన వలస రాజ్యపాలనా బాధ్యతలు నిర్వహించడం సాధ్యపడలేదు. కాబట్టి పార్లమెంటు వలసరాజ్య పాలనకు అవసరమైన రాజ్యాంగాన్ని పాలనా సూత్రాలను రూపొందించడానికి పరిమితమయింది.

### స్వదేశీ ప్రభుత్వం:

భారతదేశ సమస్యలపై బ్రిటిషు సార్వభౌమాధికారాన్ని, పార్లమెంటు ఆధిపత్యాన్ని పటిష్టం చేసుకొనేందుకు వైట్‌హాలులో భారత కార్యాలయాన్ని (India Office) స్థాపించాలని బ్రిటిషు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యాలయం అది నిర్వహించే కార్యకలాపాలను హోం గవర్నమెంటు అన్నారు. తొలుత ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో ఆక్రమించిన ప్రాంతాలను తన ప్రైవేటు ఆస్తి (వర్తక కార్య కలాపాలలో భాగంగా ఆక్రమించడం జరిగింది గనుక) గా పరిగణించింది. బ్రిటిషు ప్రభుత్వం కూడా సమస్యని తీవ్రంగా పరిగణించకుండా వార్షికంగా కంపెనీ చెల్లించే కప్పంతో సంతృప్తి చెందింది. కాని అభివృద్ధి చెందుతున్న సామ్రాజ్యం యొక్క పాలనా బాధ్యతల్ని పూర్తిగా వర్తకుల బృందం చేతుల్లో వుంచడం వలన

వచ్చే యిబ్బందులను ప్రభుత్వం గుర్తించింది.  కాని అప్పుడు పాలనా బాధ్యతల్ని ప్రత్యక్ష అదుపులోకి తెచ్చుకొనేందుకు సుముఖంగా లేదు.  అందువలన మధ్యేమార్గంగా కంపెనీ పాలనా వ్యవస్థలో మార్పులు చేసింది.  1773 రెగ్యులేటింగు చట్టం ద్వారా సుప్రీం కోర్టుతో సహా గవర్నరు జనరల్‌ని పాలనా మండలిని నియమించింది.  కాని యాజమాన్య సమస్యని అపరిష్కృతంగా వదలివేసింది.

1784 పిట్ ఇండియా చట్టం గతంలో లాగానే కంపెనీ పాలనా బాధ్యతలు నిర్వహించడాన్ని ఉద్యోగుల్ని నియమించుకోడాన్ని అనుమతించింది.  కోర్టు ఆఫ్ డైరెక్టర్లను నియంత్రించేందుకు బ్రిటిన్ మంత్రి అధ్యక్షులుగా ఒక నియంత్రణ బోర్డుని నియమించింది.  ఆచరణలో బోర్డు నామమాత్రమే.  అధికారాలన్నీ అధ్యక్షుడివే.  అధికార కేంద్రం కోర్టు నుండి బోర్డుకి మారింది.  భారత వ్యవహారాల మార్గదర్శకత్వంలో కంపెనీ డైరెక్టర్లకు గణనీయమైన పాత్ర వుంటుంది.  ఆ విధంగా 1784 చట్టం ద్వంద్వ ప్రభుత్వాన్ని సృష్టించింది. ఈ చట్టం ఫలితంగా అధికారం కంపెనీ నుండి సామ్రాజ్యధినేతకు బదిలీ అయింది. ఛార్టరు చట్టం 1833లో మార్పు చేయబడిన తరువాత కంపెనీ బ్రిటిషు సామ్రాజ్యం తరపున ధర్మకర్తలుగా గుర్తింపు పొందారు.

ఈ విధానం బ్రిటిషు సామ్రాజ్యం భారత దేశ ప్రభుత్వాన్ని తన ప్రత్యక్ష పాలన క్రిందికి తెచ్చుకొనే వరకు అంటే 1856 వరకు కొనసాగింది.  1858 చట్టం ప్రకారం నియంత్రణ బోర్డు అధ్యక్షుడి స్థానంలో భారతరాజ్య కార్యదర్శి నియమింపబడ్డాడు.  భారత రాజ్య కార్యదర్శికి సహాయపడేందుకు ఒక సలహా మండలి నియమింపబడింది.  కోర్టు ఆఫ్ డైరెక్టర్లు స్థానంలో సలహా మండలి వచ్చింది.  ఇది సలహామండలి స్వభావంపై గవర్నరు జనరల్‌కి సంబంధించి భారత రాజ్య కార్యదర్శి యొక్క హోదాపై వివాదం లేపింది.  కౌన్సిల్ ఆఫ్ ఇండియాగా పిలువబడే ఈ సలహా మండలిలో భారతదేశ వ్యవహారాలలో అనుభవమున్నవారు ఎక్కువగా వుంటారు.  ఈ కౌన్సిల్ భారత రాజ్య కార్యదర్శికి అనుబంధంగా సలహామండలిగా ఒక విధంగా నియంత్రించేదిగా వుంటుంది.  భారతదేశాన్ని పాలించడంలో ఈ మండలి బ్రిటిషు మంత్రివర్గానికి కుడిభుజంగా వుండేది.  అందువలన భారత జాతీయ వాదులు దీనిని అభివృద్ధి నిరోధక సంస్థగాను, ప్రభుత్వ కోశాగారానికి భారంగాను పరిగణించారు. దీనికి వ్యతిరేకంగా పోరాడి 1935 చట్టం ద్వారా రద్దు చేయించారు.

శాసననిర్మాణ రంగంలో కొన్ని శాసనపరమైన నిబంధనలు కొన్ని సందర్భాలలో సందేహాలకు యిబ్బందులకు అవకాశం కల్పించినప్పటికి భారతదేశంలోని అన్ని అంశాలను పర్యవేక్షించడానికి నిర్దేశించడానికి అదుపు చేయడానికి హోం గవర్నమెంటుకి గల అధికారం తిరుగులేనిది. కాని ప్రారంభం నుండి భారతదేశ ప్రభుత్వం భారతదేశం నుండే నిర్వహింపబడాలని, అందుకు తగిన అధికార ప్రాతినిధ్యం వుండాలని గుర్తింపబడింది. ఆచరణలో కొంత మంది బ్రిటిష్ విదేశాంగ మంత్రులు (డూండస్, సాలిస్‌బరీ లాంటివారు)

కఠినంగా నియంత్రించ యత్నించారు. కాని మరికొందరు గవర్నరు జనరల్స్ (ఎలెన్‌బరో, కర్జన్ లాంటి వారు) వారి స్వంత పద్ధతుల్ని అనుసరించారు. సాధారణంగా చెప్పాలంటే గవర్నరు జనరల్ చొరవ గౌరవించబడింది. గవర్నరు జనరల్ చర్యల్ని హోం గవర్నమెంటు ఆమోదించేది; సవరించేది; వీటో చేసేది. హోం గవర్నమెంటు నిర్ణయాలను పార్లమెంటు ఆమోదించేది.

## భారతదేశ ప్రభుత్వం:

బ్రిటిషు రాజకీయ వేత్తల శతాబ్దాల రాజకీయ ఆలోచనలలో చారిత్రక ఘటనల పరస్పర సంబంధం కారణంగా బ్రిటిషిండియాలో ఆవిర్భవించిన ప్రభుత్వ విధానం కేంద్రీకృత స్వభావం గలది. బ్రిటిషిండియాలోని ప్రొవిన్షియల్ (రాష్ట్ర) ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం కంటె ముందు ఏర్పడ్డాయి. సామాన్య పౌరుల దృష్టికోణం నుండి చూస్తే యివి కేంద్ర ప్రభుత్వం కంటె ముఖ్యమైనవి. కాని ప్రెసిడెన్సీ విధానం 1813లో అంతమయింది. తరువాత ప్రొవిన్షియల్ (రాష్ట్ర) ప్రభుత్వాలు పునరుద్ధరించబడినప్పుడు అవి వికేంద్రీకరణ ప్రాతిపదికగా ఏర్పడ్డాయి. ఈ వికేంద్రీకరణ 1935లో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి తోడ్పడింది. అప్పటికి పనిభారం విపరీతంగా పెరిగింది. వికేంద్రీకరణ పెద్ద విజయంగా నిరూపితమయింది. ప్రభుత్వంలో భారత ప్రజల భాగస్వామ్యం గుర్తించబడింది.

ప్రభుత్వం కేంద్రీకృత విధానం యొక్క పరిణామ క్రమం యిలా జరిగింది. మద్రాసు బొంబాయి కలకత్తాలలో స్థాపితమైన మూడు ప్రెసిడెన్సీలలో కంపెనీ వర్తక కేంద్రాలు ఏదో ఒకదానికి అనుసంధానం చేయబడ్డాయి. ప్రెసిడెంటు (ఆ తరువాత గవర్నరు), అతడి మండలి ప్రధాన కార్యాలయం గనుక ప్రెసిడెన్సీ పదం ప్రాచుర్యం పొందింది. అప్పుడు భారతదేశంలో కేంద్రీయ అధికారం లేదు. ప్రతి ప్రెసిడెన్సీ కూడా అన్ని అంశాలలో లండన్‌లో వున్న కంపెనీ డైరెక్టర్లకు బాధ్యత వహించేది.

## కేంద్రీకరణ:

పాలనా వ్యవహారాల కేంద్రీకరణ తొలి చిహ్నాలు రెగ్యులేటింగు చట్టం 1773 నిబంధనలలో వున్నాయి. ఈ చట్టం కలకత్తా ప్రెసిడెన్సీ (ప్లాసీ యుద్ధం తరువాత పెద్ద ప్రావిన్సుగా ఆవిర్భవించింది). గవర్నరు హోదాని గవర్నరు జనరల్ హోదాకి పెంచింది. ఇతర రెండు ప్రెసిడెన్సీల గవర్నర్లను వారి కౌన్సిళ్లను, భారతదేశ రాజులతో యుద్ధం శాంతికి సంబంధించిన అంశాలను అతడి అధీనంలోకి తెచ్చింది. ఆవిధంగా భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభమయింది. 1793, 1813 ఛార్టరు చట్టాలతో బెంగాల్ ప్రభుత్వం యొక్క అధికారం యింకా పటిష్టం చేయబడింది. ప్రెసిడెన్సీలు మరికొన్ని దశాబ్దాల వరకు మిగతా అంశాలలో ఇంగ్లాండులోని అధికారానికి జవాబుదారీగా వుంటూ స్వతంత్రంగా

వ్యవహరించాయి.

19వ శతాబ్దంలో బ్రిటిషిండియా మరికొన్ని ప్రాంతాలకు విస్తరించడంతో పైన చెప్పబడిన పాలనా వ్యవస్థలో మార్పులు అవసరమయ్యాయి. కాలక్రమంలో బెంగాలీ ప్రెసిడెన్సీ విస్తరించి దాదాపు ఉత్తర భారతదేశం మొత్తాన్ని తన అధీనంలోకి తెచ్చుకొన్నది. మద్రాసు, బొంబాయి ప్రెసిడెన్సీలు కూడా అంత విపరీతంగాకాకపోయినా అవి కూడా విస్తరించాయి. సువిశాల ప్రాంతాల పాలనా వ్యవహారాలలో బాధ్యతల పెరుగుదల, ప్రభుత్వ నిర్వహణలో పెరిగిన సంక్లిష్టత, వివిధ ప్రెసిడెన్సీలలోని పాలనా నిర్వహణలో ఒకే రకమైన నిబంధనలు లేకపోవడం, వృధా, వ్యయంపై తరచుగా ఫిర్యాదులు రావడం – బలమైన కేంద్రాధికారం యొక్క ఆవశ్యకతని గుర్తింపజేశాయి. లండన్ నుండి మూడు ప్రెసిడెన్సీల పాలనని సమన్వయ పరచి అదుపుచేయడం కూడా ఆచరణ సాధ్యం కాదని స్పష్టమయింది. కాబట్టి 1833 ఛార్టరు చట్టం కలకత్తా కేంద్రంగా గల పాలనాధికారానికి నియంత్రించే సమగ్రమైన అధికారాలను యిచ్చి స్థానిక ప్రభుత్వాలను (1919 చట్టం చేయబడే వరకు ప్రొవిన్షియల్ ప్రభుత్వాలుగా స్థానిక ప్రభుత్వాలుగా పిలువబడేవి) ఏజంట్ల స్థాయికి తగ్గించింది. ఈ మార్పుతో బెంగాల్ గవర్నరు జనరల్ హోదా ఇండియా గవర్నరు జనరల్‌గా మార్చబడింది.

కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి గవర్నరు జనరల్ ఇన్ కౌన్సిల్ బాధ్యతలు పెరగడంతో అతడిని స్థానిక బాధ్యతల నుండి తప్పించవలసిన అవసరం గుర్తించబడింది. ఫలితంగా బెంగాలు ప్రావిన్సు తొలుత గవర్నరు జనరల్ కౌన్సిల్‌లోని సీనియరు సభ్యుని నియంత్రణలోకి ఆ తరువాత 1854లో లెఫ్టినెంట్ గవర్నరు నియంత్రణలోకి తీసుకొని రావడం జరిగింది. 1919 వరకు బ్రిటిషిండియా చాలా ప్రావిన్సులుగా విభజింపబడివుంది. ఒక్కొక్క ప్రావిన్సుకి ఒక స్థానిక ప్రభుత్వం వుంది. ఒక్కొక్క ప్రెసిడెన్సీకి గవర్నరు, కౌన్సిలు గల మూడు ప్రెసిడెన్సీలు, లెఫ్టినెంటు గవర్నరు నియంత్రణలో గల నాలుగు ప్రావిన్సులు, ఛీఫ్ కమీషనర్ల నియంత్రణలో గల మరి మూడు ప్రావిన్సులు వున్నాయి. తరువాత లెఫ్టినెంటు గవర్నరు గిరీని రద్దుచేసి,ఆ స్థాయిని గవర్నరుకి పెంచడం జరిగింది. ఈ మార్పుతో యిక రెండు రకాల స్థానిక ప్రభుత్వాలే వున్నాయి. అవి: 1) గవర్నర్ల నియంత్రణలో గల ప్రావిన్సులు 2) ఛీఫ్ కమిషనర్ల నియంత్రణలో గల ప్రావిన్సులు. వివిధ స్థానిక ప్రభుత్వాల మధ్య వాటి స్థాయి అధికారాల రీత్యా తేడాలు వున్నాయి.

ఏకీకరణ చట్టం 1915 ద్వారా కేంద్రీకరణ విధానం పునరుద్ఘాటించబడింది. దీనిలో స్థానిక ప్రభుత్వాలు అన్ని అంశాల్ని కార్యక్రమ వివరాల్ని గవర్నరు జనరల్‌కి నివేదించాలని స్పష్టంగా చెప్పబడింది. ఆవిధంగా చట్టం 1915 బ్రిటిషిండియా యొక్క పరిపాలనా కేంద్రీకరణ ధోరణి కొనసాగింపుని ధృవపరచింది. 1833లో స్థాపించబడిన ప్రభుత్వ ఏకీకరణ విధానం 1919 వరకు అమలులో వుంది. శాసనపరమైన పన్ను విధింపు చర్యలకు స్థానిక ప్రభుత్వాల వార్షిక బడ్జెటుకూ బ్రిటిషిండియాకి బాధ్యత వహిస్తున్న గవర్నరు జనరల్ ఇన్ కౌన్సిల్ ఆమోదం

అవసరం. వివిధ రంగాలకు చెందిన విధానాల అమలుకు సంబంధించిన ఆదేశాలు జారీ అవుతూ వుండేవి. ఈ పరిస్థితి కేంద్రంలో వ్యవహారాలు పెరగడానికి, ప్రావిన్సులు నిధుల కొరకు వెంపర్లాడడానికి, అధీన ప్రభుత్వాలలో బాధ్యతా భావం పతనం కావడానికి చివరికి నిరుత్సాహానికి దారితీసింది.

**వికేంద్రీకరణ:**

పాలనాపరమైన అన్ని వ్యవహారాలలో కేంద్ర నియంత్రణ నుండి విడిపోయే తొలి ప్రయత్నం ఆర్థికరంగంలో లార్డ్ మేయో చేశాడు. ఈ సూత్రం వివిధ విస్తరీకరణలతో 1918 వరకు కొనసాగింది. కాని బ్రిటిషు పార్లమెంటుకు బ్రిటిషిండియా ప్రభుత్వం నిర్వహించవలసిన బాధ్యతల రీత్యా నియంత్రణల సడలింపు కొన్నిపరిమితులకు మించి సాధ్యపడదు. కాబట్టి అర్థవంతమైన వికేంద్రీకరణ విధానాల్ని రాజ్యాంగ మార్పుల ద్వారా మాత్రమే చేపట్టవలసి వుంటుంది.

ఇందుకు బ్రిటిషు పార్లమెంటు మోంట్ ఫర్డ్ సంస్కరణలు ప్రసిద్ధిగాంచిన భారత ప్రభుత్వ చట్టం 1919ని ఆమోదించింది. ఇది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అంశాలను విభజించింది. ఈ చట్టం రాష్ట్రాలలో ద్వంద్వ పరిపాలనా విధానాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రాలకు చెందిన అంశాలను ప్రభుత్వాధీన అంశాలు (Reserved Subjects) శాసనసభాధీన అంశాలు (Transferred Subjects) - అని రెండు గ్రూపులుగా విడగొట్టింది. రాష్ట్రాల శాంతి, రక్షణ, ఆర్థిక స్థిరత్వంపై ఆధారపడిన అంశాలు అంటే న్యాయం, పోలీసు, జైళ్లు లాంటివి ప్రభుత్వాధీన అంశాలు. ఇక జాతి నిర్మాణానికి చెందిన వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, ప్రజారోగ్యం, స్థానిక స్వయం పరిపాలన లాంటివి శాసనసభాధీన అంశాలు. మొదటివి గవర్నరుకు అతడి సలహామండలి వదిలివేయబడ్డాయి. ఇక శాసనసభాధీన అంశాలు శాసనసభలకు బాధ్యత వహించే మంత్రుల అధీనంలో వుంటాయి. భారతదేశ ప్రభుత్వం, దానిని నియంత్రించే ఇంగ్లాండు యాజమాన్యం శాసనసభాధీన అంశాలపై పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యతల నుండి తప్పుకొని కేవలం ప్రభుత్వాధీన శాఖలకే పరిమితమయ్యాయి. కాని రెండు విభాగాల అధిపతిగా గవర్నరు వాటి కార్యక్రమాలను సమన్వయ పరచి ఘర్షణలను పరిష్కరించవలసి వుంటుంది. అంతేగాక శాంతి భద్రతలు పరిరక్షించేందుకు, మైనారిటీలకు వెనుకబడిన తరగతులకు, ప్రజాసేవలకు రక్షణ కల్పించేందుకు గవర్నరుకి ప్రత్యేకాధికారాలు కల్పించబడ్డాయి. శాసనసభాధీన అంశాలను కూడా ప్రభుత్వాధీన అంశాలుగా పరిగణించి వాటిని గవర్నరు పరిధిలోకి తెచ్చుకొనేందుకు అవకాశం కల్పించే విధంగాను మంత్రుల బాధ్యతల నిర్వహణకు ఆటంకాలు కల్పించే విధంగాను వ్యాఖ్యానించడానికి అనువుగా చట్టంలోని నిబంధనల రూపకల్పన జరిగింది.

అయినప్పటికి 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని ఆమోదించడం పరిపాలన వికేంద్రీకరణ దిశగా వేసిన మరొక ముందడుగు. ఈ చట్టంలోని నిబంధనల ననుసరించి

1919తో పోల్చితే రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించబడింది. రాష్ట్రాల ద్వంద్వ ప్రభుత్వ పాలన యిటు భారతీయులకు అటు బ్రిటిషువారికి సంతృప్తి కరంగా లేదు. కాబట్టి అది రద్దు చేయబడింది. ఈ చట్టంలో రెండు ముఖ్యమైన అంశాలు వున్నాయి.

**మొదటిది:** ఇది రాష్ట్రాలకు కొన్ని ప్రత్యేకమైన రంగాలలో పూర్తి అధికారాన్ని యిచ్చింది. 1919 నాటి పరిస్థితులతో పోల్చిచూస్తే కేంద్ర ప్రభుత్వ నియంత్రణ నుండి స్వేచ్ఛపొందాయి.

**రెండవది:** రాష్ట్ర స్థాయిలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టాలని వలస వాద ప్రభుత్వం ఆసక్తిగా వుంది. ఇంకా ఈ చట్టం భారత సమాఖ్య (Federation of India) (బ్రిటిషిండియా రాష్ట్రాలు స్వదేశీ సంస్థానాలతో కూడిన)కు అవకాశం కల్పించింది. కాని సమాఖ్య భాగం అమలు జరుపబడలేదు. కాబట్టి భారత ప్రభుత్వ చట్టం 1919 ననుసరించి పనిచేయడం కొనసాగింది. 1935 చట్టంలోని రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి నిబంధన 1937లో అమలులోకి వచ్చింది.

## కార్యనిర్వాహకశాఖ - క్రమ పరిణామం

బ్రిటిషిండియా పరిపాలనా యంత్రాంగంలో అత్యంత అగ్రభాగాన బ్రిటిషు రాజు అత్యంత దిగువన గ్రామ పంచాయతీ వుండేది. రాజ్యాంగపరంగా విదేశాంగ మంత్రికి సర్వాధికారాలు వుండేది. అతడు ఏ అధికారికైనా ఏ అంశం మీదనైనా ఆదేశాలు జారీ చేయగలడు. వైస్రాయిగాని గవర్నరు జనరలు గాని వ్యక్తిగతంగా అతడికి బాధ్యత వహించాల్సి వుంటుంది. రాష్ట్రాల అధిపతులు వైస్రాయికి విధేయులుగా వుంటారు. కాని ఆచరణలో యిచ్చిపుచ్చుకొనే పద్ధతిపై దారిచేసుకొని ముందుకుపోయే వెసులుబాటు రంగం మీద వున్న వ్యక్తికి వుంటుంది. 19,20 శతాబ్దాలలో సలహా మండళ్లు మంత్రివర్గ ప్రభుత్వాల పెరుగుదలకు దారితీశాయి. వాటిలో నియంతృత్వానికి ప్రజాస్వామ్యానికి చోటు కల్పిస్తూ శాఖీకరణ కేంద్రీకరణ పెరిగాయి.

కంపెనీ చరిత్ర ప్రారంభం నుండి కేంద్రంలో గవర్నరు జనరల్,ప్రావిన్సులలో (రాష్ట్రాలలో) గవర్నర్లు వున్నారు. గవర్నరు జనరల్‌కు రాష్ట్రాల గవర్నర్లకు కార్యనిర్వాహక మండళ్లు అనుసంధానం చేయబడి వున్నాయి. 1773 చట్టానికి ముందు కార్యనిర్వాహక మండళ్లు పెద్దవిగా వుండేవి. ఈ చట్టంతో వాటి పరిమాణం గణనీయంగా తగ్గించబడింది. ఉదాహరణకు 1919లో వైస్రాయి కార్యనిర్వాహక మండలిలో కమాండర్ ఇన్ ఛీఫ్‌తో పాటు ఆరుగురు సభ్యులు గవర్నరు కార్యనిర్వాహక మండలిలో ముగ్గురు సభ్యులు మాత్రమే వున్నారు. బ్రిటిషు పాలన తొలిదశలో మండళ్లు మెజారిటీ ఓటుతో నిర్ణయాలు చేసేవి. వాటి అధిపతులకు ప్రత్యేకాధికారాలు లేవు. కాని ఈ ఏర్పాటు సూత్రరీత్యా మంచిదైనప్పటికి విస్తరిస్తున్న సామ్రాజ్యం యొక్క శాంతి, పాలనా పరమైన సమస్యల్ని సమర్ధవంతంగా నిర్వహించలేకపోయింది. కాని

కారల్‌వాలీస్ ప్రేరణతో 1786లో చట్టాలు చేయడం పన్నులు విధించడం మినహాయించి యితర అంశాలలో కౌన్సిల్ నిర్ణయాలను త్రోసిపుచ్చే అధికారం గవర్నరు జనరలుకు,గవర్నర్లకూ కల్పించబడింది. ఈ అధికారం సాధారణంగా వినియోగించుకోబడకపోయినప్పటికి మండళ్లలో విభజనల్ని నివారించింది. వాటి దైనందనిక కార్యకలాపాలలో ఐక్యత క్రమశిక్షణ, పటిష్టతలను చేకూర్చింది.

చివరిగా కంపెనీ పరిపాలనా కాలమంతటా కౌన్సిళ్లు సమిష్టగా వ్యవహారాలు నడిపేవి బోర్డులుగా పనిచేశాయి. పని విధానం సంక్లిష్టమైనది. ఎక్కువ కాలవ్యవధి తీసుకొనేది. కాబట్టి 1861 తరువాత లార్డ్ కాన్నింగ్ వ్యవహార నియమావళి ప్రకారం సచివాలయం లోని పని పోర్టు పోలియో పద్ధతి ద్వారా నిర్వాహక మండలిలోని సంబంధిత సభ్యుల మధ్య పంపిణీ చేయబడింది. ఈ సభ్యులే వ్యవహారాలను పరిష్కరించారు. మరీ ముఖ్యమైన పనిని మాత్రమే గవర్నరు జనరల్ లేక గవర్నర్లకు పంపడం జరిగింది.

1833, 1947 మధ్య కాలంలో భారతదేశం యొక్క చట్ట నిర్మాణంలో మూడు సూత్రాలు మార్గదర్శకాలుగా పనిచేశాయి. మొదటిది: భారతదేశం విషయంలో బ్రిటిషు పార్లమెంటు అత్యున్నత చట్ట నిర్మాత అయినప్పటికి అది శాసన నిర్మాణానికి సంబంధించిన చట్రం రూపొందించడానికే పరిమితమయింది. రెండవది: ప్రజాప్రతినిధులకు కొన్ని రాయితీలు వున్నప్పటికి ఆచరణలో శాసన వ్యవస్థపై కార్యనిర్వాహక వర్గ నియంత్రణ సంపూర్ణంగా వుండేది. మూడవది: గవర్నరు జనరల్ వ్యక్తిగత హోదాలో ఆర్డినెన్సులు జారీచేయగలడు. తన మండలి ఆమోదంతో మాత్రమే ప్రావిన్సుల నిబంధనలు రూపొందించగలడు.

బ్రిటిషు పాలన తొలిదశలో స్పష్టమైన శాసన నిర్మాణ క్రమం లేదు. చట్టాలకు కార్యనిర్వాహక ఆదేశాలకు మధ్య తేడాని గుర్తించడం కూడా కష్టసాధ్యంగా వుండేది. 1833 నాటికి చట్టాలు అస్తవ్యస్తంగా వున్నాయి. శాసన నిర్మాణ యంత్రాంగం సంతృప్తికరంగా లేదు. వాటిని సవరించేందుకు సమూలమైన సంస్కరణలు చేపట్టబడ్డాయి. శాసననిర్మాణం కేంద్రీకృతం చేయబడింది. 1833 ఛార్టరు చట్టం గవర్నరు జనరల్ ఇన్ కౌన్సిల్‌ని బ్రిటిషిండియా మొత్తానికి ఏకైక శాసన నిర్మాతని చేసింది. చట్ట నిర్మాణంలో సహాయపడేందుకు లార్డ్ మెకాలే కౌన్సిల్‌లో అదనపు సభ్యునిగా నియమింపబడ్డాడు. శాసన నిర్మాణ రంగంపై గల నిబంధనలు తొలగించబడ్డాయి. పార్లమెంటు ఆధిక్యతకు భంగం కలగని విధంగా శాసననిర్మాతగా వ్యవహరిస్తున్న గవర్నరు జనరల్ ఇన్ కౌన్సిలుకు పార్లమెంటుకి యిచ్చినట్లే పూర్తి శాసన నిర్మాణాధికారాలు యివ్వబడ్డాయి. శాసన నిర్మాణ క్రమంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకొన్నాయి. మండలి అవసరమైన చర్చలకు అవకాశం కల్పించబడింది. చట్ట విధానంలో చాలా మెరుగైన మార్పుల్ని ప్రవేశపెట్టేందుకు మెకాలే ప్రెసిడెంటుగా 'లా కమిషన్' నియమించబడింది. కాని శాసన నిర్మాణం అనేది కార్యనిర్వాహక వర్గానికి చెందిన విశేషాధికారం లాగే కొనసాగింది. ప్రజా ప్రాతినిధ్యం గాని నియంత్రణగాని వున్న జాడలు కనిపించవు.

లా కమిషన్ చేపట్టిన కోడిఫికేషన్ పథకం విఫలమవడం వలన దిగువ ప్రెసిడెన్సీలు అసంతృప్తి వ్యక్తం చేయడం వలన 1853లో ఒక చట్టం ద్వారా శాసన నిర్మాణ యంత్రాంగం పునర్వ్యవస్థీకరించబడింది. శాసన నిర్మాణం కొరకు గతంలో అదనంగా చేర్చుకొనబడిన 'లా మెంబర్' యిప్పుడు ప్రభుత్వంలో భాగమయ్యాడు. అన్ని చట్టాలకు గవర్నరు జనరల్ ఆమోదం యిక మీదట అవసరం లేదు. ప్రభుత్వ శాసన నిర్మాణం. దాని కార్యక్రమాలు పత్రికలకు ప్రజలకు వెల్లడిచేయబడ్డాయి. అది అప్పటికి విప్లవాత్మక చర్యే. 1853 శాసన వ్యవస్థ ప్రశంసనీయమైన కృషి చేస్తున్నప్పటికి అది చిన్న పార్లమెంటుగా రూపొందే ప్రమాదం వుందని బ్రిటిషు పాలకులు ఆందోళన చెందారు. ఇక 1857 తిరుగుబాటు శాసననిర్మాణ వ్యవస్థ నుండి భారతీయుల్ని తొలగించే ప్రమాదానికి దారితీసింది.

భారతశాసనసభల చట్టం 1861, అప్పటికి వున్న కేంద్ర శాసనసభతో పాటు స్థానిక చట్టసభల్ని ప్రెసిడెన్సీలో యితర ప్రావిన్సులలో చట్టసభల్ని స్థాపించడం ద్వారా శాసననిర్మాణ అధికారాన్ని కేంద్రీకరించింది. అదనపు సభ్యులు కనీసం 50 శాతం అనధికారులు (భారతీయులు, యూరోపియన్లు). వీరిని కార్యనిర్వాహక వర్గ అధిపతులు నామినేట్‌చేస్తారు. పరిపాలనకు చెందిన కొన్ని అంశాలు కేంద్రశాసనసభకు రిజర్వు చేయబడ్డాయి. గవర్నరు జనరల్ యొక్క ముందు అనుమతిలేకుండా స్థానిక చట్టసభలు కొన్ని అంశాలు పరిశీలించరాదని నిషేధాలు విధించబడ్డాయి. అన్ని స్థానిక కేంద్ర చర్యలన్నీ శాసనాలుగా రూపొందడానికి గవర్నరు జనరల్ ఆమోదం అవసరమవుతుంది. శాసనసభలు చిన్నతరహా పార్లమెంట్లుగా మారకుండా నిరోధించటం కొరకు అవి ప్రస్తుతం నిర్వహిస్తున్న వ్యవహారాలను మాత్రమే కొనసాగించాలని 1861 చట్టంలో స్పష్టంగా నిర్దేశించబడింది.

కాని భారతీయులలో పెరుగుతున్న రాజకీయ చైతన్యం దృష్ట్యా రాజ్యాంగ అభివృద్ధిని ప్రాతినిధ్యం వహించే హక్కుని ఆపడం ఎక్కువ కాలం సాధ్యపడలేదు. అందువలన శాసనమండళ్లు విస్తరించబడ్డాయి. కేంద్ర శాసనసభకు, రాష్ట్ర శాసనసభల ద్వారాను, రాష్ట్ర శాసనసభలకు స్థానిక సంస్థల ద్వారాను, అనధికారులకు కేటాయించబడిన చాలా సీట్లను సిఫార్సుల ప్రాతిపదికన (బ్రిటిషు కన్సర్వేటివ్‌లను సంతృప్తి పరచేందుకు ఎన్నిక అనే పదానికి బదులుగా సిఫార్సు అనే పదం వాడబడింది) నింపే అవకాశం కల్పించబడింది. శాసనసభలలో ప్రశ్నలు అడగవచ్చు. బడ్జెటుపై చర్చించవచ్చు. కాని ఓటింగు జరపబడదు. చర్చలలో కొన్ని అభివృద్ధికరమైన అంశాలు ప్రస్తావనకు వచ్చేవి.

20వ శాతాబ్దపు మొదటి దశాబ్దంలో భారత జాతీయోద్యమం పెరుగుదల 1909లో మింటో మోర్లే సంస్కరణలుగా పిలువబడిన మరికొన్ని సంస్కరణలకు దారితీసింది. చట్టసభలు యింకా విస్తరించబడ్డాయి. నామినేటెడ్ సభ్యుల మెజారిటీకి (అధికార అనధికార సభ్యులతో కూడిన) అవకాశం కల్పించబడింది. స్థానిక స్వపరిపాలనా సంస్థలు యింకా అలాంటి సంస్థల ద్వారా గతంలో వున్న పరోక్ష ఎన్నికల విధానం కొనసాగింది. ముస్లింల భూస్వామ్య

నియోజకవర్గాలకు ప్రత్యక్ష ఎన్నికలు ప్రవేశపెట్టబడ్డాయి. ప్రజలలోని ముఖ్యమైన సెక్షన్లకు ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య యుతంగా అభివృద్ధికరమైన చర్య కాని ముస్లింల మతపరమైన ప్రాతినిధ్యం విధ్వంసకరమైన పరిణామాలకు దారితీసింది. శాసనసభల అధికారం విషయానికి వస్తే చర్చల తరువాత బడ్జెటుపై ఓటు వేయడానికి అనుమతించబడ్డాయి.

చివరిగా 1919 సంస్కరణలు కేంద్రంలో రెండు శాసనసభలకు అవకాశం కల్పించాయి. శాసనసభకి (Legislative Assembly)కి తోడు దానిని అదుపు చేసేందుకు మరొక సభ శాసనమండలి (Council of States) ఏర్పాటు చేయబడింది. కేంద్ర రాష్ట్ర శాసనసభలు ఎన్నికైన సభ్యులతో విస్తరించబడ్డాయి. గతంలో కంటె ఎక్కువ మందికి ఓటు హక్కు కల్పించబడింది. నామినేట్ చేయబడిన అధికార అనధికార సభ్యుల సంఖ్యచాలా తగ్గించబడినప్పటికి ఎన్నికైన సభ్యులలో విభజన వచ్చినప్పుడు నిర్ణయాలను ప్రభావితం చేయగలిగినంతగా వుంది. గతంలో ముస్లింలకు మాత్రమే పరిమితమైన మతపరమైన ప్రాతినిధ్యం యితర మతాలకు విస్తరించబడింది. 1919 సంస్కరణలలో సిక్కుల ప్రత్యేక నియోజకవర్గాలకు మద్రాసులో బ్రాహ్మణేతరులకు రిజర్వుడు సీట్లకు, అన్ని స్థాయిల్లో దళిత వర్గాలకు నామినేటెడ్ సీట్లకు అవకాశాలు కల్పించబడ్డాయి.

**న్యాయశాఖ - క్రమపరిణామం**

కంపెనీ వర్తకదశలో వున్నప్పుడు కంపెనీ ఉద్యోగుల న్యాయపాలన కొరకు స్వంత న్యాయస్థానాలు వుండేవి. ఫ్యాక్టరీలలో స్థానికంగా నివశించేవారు వారి తగవులను వారే పరిష్కరించుకొనేవారు. వారన్‌హేస్టింగ్స్ 1772లో జిల్లా స్థాయిలో సివిలు, క్రిమినల్ కోర్టుల్ని (దివాని, నిజామత్‌లను) పై స్థాయిలో సాదర్ (ఛీఫ్) కోర్టుల్ని స్థాపించి సువ్యవస్థితమైన న్యాయవ్యవస్థ రూపకల్పనకు మార్గదర్శకుడయ్యాడు. కాని ఈ విధానం కంపెనీ ఉద్యోగుల దుష్ప్రవర్తనని నివారించలేకపోయింది.

కాబట్టి పార్లమెంటు 1773లో కంపెనీపై దాని ఆస్తులపై అపరిమితమైన అధికారాలు కల్పిస్తూ కలకత్తాలో సుప్రీంకోర్టుని స్థాపించింది. ఈ కోర్టుద్వారా కంపెనీ ప్రభుత్వాన్ని అదుపు చేసే పథకం పూర్తిగా విఫలమవడంతో కోర్టు అధికార పరిధిని కలకత్తాకి పరిమితంచేస్తూ 1781లో మరొక చట్టం చేయబడింది. 1781 చట్టం కలకత్తా మినహాయించి బెంగాల్ అంతటా వారన్‌హేస్టింగ్స్ ప్రవేశపెట్టిన కోర్టుల్ని గుర్తించింది. సుప్రీంకోర్టు, సాదర్ కోర్టుల విధానం క్రమంగా యితర ప్రెసిడెన్సీలలో కూడా ప్రవేశపెట్టబడింది. ఒకటి కంపెనీ ప్రభుత్వానికి లోబడి వుండేది. మరొకటి కంపెనీతో సంబంధం లేకుండా స్వతంత్రంగా పనిచేసేది – ఒకేసారి సమాతరంగా పనిచేసే న్యాయస్థానాల వ్యవస్థ ఎన్నో చిక్కులకు వైరుధ్యాలకు దారితీసింది. 1813 నాటికి న్యాయస్థానాల విలీనానికి సర్వత్రా ఆమోదం లభించింది. కాని కంపెనీ న్యాయస్థానాల అధికార పరిధిని అంగీకరించడం పట్ల బ్రిటిషు జాతీయులకు గల వ్యతిరేకత

కారణంగా ఈ విలీనానికి మరి మూడు దశాబ్దాల కాలం పట్టింది. కాని చివరికి ఇండియన్ హైకోర్ట్సు చట్టం 1861 అన్ని ప్రెసిడెన్సీలలో హైకోర్టుల సాధారణ విధానానికి అవకాశం కల్పించింది. ఇతర రాష్ట్రాలలో (ప్రావిన్సులలో) భారత ప్రభుత్వం తన ఛీఫ్ మరియు జ్యుడీషియల్ కమిషనర్ల న్యాయస్థానాలను ఏర్పాటు చేసింది.

న్యాయ నిర్వహణలో రాజ్యాంగ ప్రాధాన్యత గల పునరావృతమయ్యే రెండు సమస్యలు గమనార్హం. మొదటిది: భారతదేశంలో వున్న బ్రిటిషు పౌరులు భారతదేశ న్యాయమూర్తులు తమని విచారించడం పట్ల అయిష్టత ప్రకటించడం. జాతి వివక్షతకు వ్యతిరేకంగా 1836 నుండి చాలా చర్యలు చేపట్టినప్పటికి వాటిని యూరోపియన్లు వ్యతిరేకించారు. బ్రిటిషుపాలన అంతమయ్యేవరకు ఈ వివక్షత కొనసాగింది, రెండవది:కార్య నిర్వహణాధికారులకు సంబంధించిన సమస్య. అంటే న్యాయవ్యవస్థ స్వాతంత్రానికి సంబంధించిన సమస్య. ప్రారంభంలో కార్యనిర్వహణ శాఖకి చెందిన సభ్యులు సాదర్ కోర్టుల జడ్జీలుగా పనిచేశారు. కాని 19వ శతాబ్దం ప్రారంభంలో ఈ పద్ధతి ఆగిపోయింది. ఆ తరువాత సివిలు సర్వీసుకి చెందినవారు న్యాయాధికారులుగా వుండేవారు. వీరు సహజంగా కార్యనిర్వాహణాధికారి నియంత్రణకు లోబడి వుండేవారు.

1862లోహైకోర్టుల స్థాపనతో న్యాయవ్యవస్థకు స్వేచ్ఛ కల్పించబడింది. న్యాయవ్యవస్థ క్రింది స్థాయిలో జటిలమైన సమస్యలున్నాయి. ప్రత్యేక న్యాయాధికారుల నియామకం; వారికి స్వేచ్ఛ కల్పించబడిన తరువాత కేవలం రెవెన్యూ ఆఫీసరుగా వుండే కలెక్టరుకి జుడీషియల్ మెజిస్ట్రేటు బాధ్యతలు అప్పజెప్పడంలోని విజ్ఞతపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. భారతదేశంలోని పితృస్వామిక సాంప్రదాయాల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ కొరకు కలెక్టరుకి మెజిస్ట్రేటు బాధ్యతలు అప్పజెప్పకపోతే కలెక్టరు అధికారం, స్థాయి దెబ్బతింటాయని భావించబడింది.

బ్రిటిషు పాలకులు ప్రవేశపెట్టిన మరొక ముఖ్యమైన అంశం: చట్టబద్ధపాలన పౌరహక్కులు. రాజ్యపాలన పాలకుని యిష్టా యిష్టాల మేరకు గాక చట్టబద్ధంగా వుండాలన్నది బ్రిటిషు పాలకుల విధానం. చట్టాలు ప్రజల యొక్క హక్కుల్ని బాధ్యతల్ని విశేషాధికారాల్ని నిర్వచించాయి. కాని ఆచరణలో గవర్నర్లకు అధికారులకు (సివిలు, పోలీసు) విపరీతమైన విచక్షణాధికారాలు యిచ్చింది. ఐనప్పటికి ప్రజాన్యాయం నెమ్మదిగా నైనప్పటికి క్రమబద్ధంగా అభివృద్ధి చెందింది.

ఆ విధంగా బ్రిటిషు పాలనలో యించుమించు స్వతంత్ర న్యాయవ్యవస్థ వ్యాఖ్యానించిన చట్టాల ప్రకారం పరిపాలన సాగింది. కాని ఆ చట్టాలు లోప భూయిష్టంగా వుండేవి. కారణం ఆ చట్టాలు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలచే రూపొందించబడినవి కావు; విదేశీ పాలకులచే నిరంకుశంగా రూపొందించబడిన చట్టాలు.

**శాఖీకరణ:**

మొదట కంపెనీ సీక్రెట్ కమిటీ సెలెక్టు కమిటీ – అనే రెండు కమిటీల సహాయంతో పని ప్రారంభించింది. కొంత కాలం తరువాత ప్రజాపనులు (Public Affairs) వాణిజ్య (Commerce) శాఖలు చేర్చబడ్డాయి. ఆ తరువాత సెలెక్టు కమిటీ పేరు కంప్ట్రోలింగ్ కమిటీగా మార్చబడింది. 1772లో ఈ కమిటీ స్థానంలో రెవెన్యూ బోర్డు సృష్టించబడింది. మరి రెండు సంవత్సరాల తరువాత రెవెన్యూ బోర్డు సీక్రెట్ కమిటీ, ప్రజాపనులశాఖ – మూడు ఒకే శాఖగా విలీనం చేయబడ్డాయి. మరి రెండు సంవత్సరాల తరువాత (1776) మిలిటరీశాఖ చేర్చబడింది. 1833 నాటికి కస్టమ్స్, ఉప్పు, పర్షియన్, ధార్మికశాఖలు – లాంటి మరికొన్ని శాఖలు చేర్చబడ్డాయి. 1835లో శాసన నిర్మాణశాఖ, 1843లో ఆర్థికశాఖ రూపొందింపబడ్డాయి. అప్పటినుండి శాఖల సంఖ్య క్రమంగా పెరిగింది.

1930 నాటికి బ్రిటిషు పాలకులు విస్తృతమైన పాలనా వ్యవస్థని రూపొందించారు. రైల్వేలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, పరిశ్రమలు, భౌగోళిక సర్వే, గనులు, విద్యుచ్ఛక్తి, కర్మాగారాలు లాంటి శాఖలను ఉపశాఖలను ఏర్పాటుచేయడం ద్వారా ప్రభుత్వం శాఖీకరణని విస్తృత పరచింది. రెండవ ప్రపంచ యుద్ధకారణంగా యుద్ధ సమాచారం, ఆహార పథకం, పౌర సరఫరాల లాంటి శాఖల అవసరం ఏర్పడింది. ఆవిధంగా బ్రిటిషు వలస వాద ప్రభుత్వం విస్తృతమైన ఉద్యోగి స్వామ్యం మద్దతు గల విస్తారమైన పాలనా వ్యవస్థతో భారతదేశాన్ని పాలించింది.

**జిల్లా పాలనా వ్యవస్థ:**

బ్రిటిషు పాలన తొలిదశలో రెవెన్యూ (ప్రధానంగా భూమిశిస్తు) వసూలు, న్యాయ నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ లాంటివి ప్రభుత్వ కార్యకలాపాలలో ప్రధానాంశాలుగా వుండేవి. ప్రతి రాష్ట్రం జిల్లాలుగా విభజింపబడింది. ఈ జిల్లాలు ముఖ్యమైన పాలనాపరమైన యూనిట్లుగా పరిగణింపబడేవి. అవి కలెక్టర్ల (కొన్ని ప్రాంతాలలో డిప్యూటీ కమిషనర్లు) అధీనంలో వుండేవి. కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వానికి బాధ్యత వహించేవారు.

కలెక్టర్లు ప్రభుత్వం పక్షాన జిల్లా పాలనా బాధ్యతలు నిర్వహించేవారు. అతడు కార్యనిర్వాహక న్యాయపరిపాలన విధులు నిర్వహించేవాడు. అయితే ఇది ఇంగ్లీషు సాంప్రదాయం, భారతీయ సాంప్రదాయం – అనే రెండు సిద్ధాంత సాంప్రదాయాల మధ్య పెద్ద వివాదానికి దారితీసింది. వ్యక్తి స్వేచ్ఛ, పరిమిత ప్రభుత్వాధికారం భావనలకు అలవాటు పడిన ఇంగ్లీషు సాంప్రదాయానికి ఒకడు చేసిన తప్పొప్పులకు అతడే న్యాయనిర్ణేతగా వ్యవహరించడం ఆశ్చర్యకరంగాను ఎదిరించదగిందిగాను కనిపించింది. భారతదేశ సాంప్రదాయాన్ని అభిమానించే బ్రిటిషువారికి యిందులో తప్పేమీ కనిపించలేదు. భారతదేశ

చరిత్ర మొత్తం మీద స్థానిక అధికారులే రెవెన్యూ వసూలు చేస్తూ వచ్చారని, శాంతిభద్రతలు నిర్వహించారని, న్యాయపాలన సాగించారని వీరు వాదించారు. ఆ విధంగా ఈ వ్యవస్థ పూర్తిగా భారతదేశ పితృస్వామ్య సాంప్రదాయానికి అనుకూలంగా వుంది. ప్రజలు కూడా దీనిని సక్రమమేనని న్యాయమేనని పరిగణించారు. అందువలన కేవలం ఇంగ్లీషువారి మనోభావాల్ని సంతృప్తిపరచడానికిచేపట్టే చర్య ప్రభుత్వ సమర్థతని తగ్గిస్తుందని వారు అభిప్రాయడ్డారు.

బ్రిటిషుపాలనా కాలమంతటా రెండు సిద్ధాంతాల ప్రతిపాదకులు, మద్దతుదారులూ ఆధిక్యత కొరకు పోట్లాడుకొంటూనే వున్నారు. ఒకవైపు ఇంగ్లీషు సాంప్రదాయానికి చెందిన కారన్‌వాలీస్ జుడీషియల్ పోలీసు బాధ్యతల నుండి రెవెన్యూని విడగొట్టి వేర్వేరు వ్యక్తులకు ఆ బాధ్యతలు అప్పగించాడు. మరొక వైపు భారతీయ సాంప్రదాయాన్ని బలపరచిన మన్రో, ఎల్ఫిన్‌స్టోన్, లారెన్స్‌లు పార్లమెంటుచేత కలెక్టరుకి మేజిస్ట్రేటు బాధ్యతలు కూడా అప్పజెప్పేలా చేశారు. ఫలితంగా తరువాత సంవత్సరాల విధానంలో చాలా మార్పులు వచ్చాయి. 1857 తిరుగుబాటు తరువాత కలెక్టరు – మెజిస్ట్రేటు విధానం సువ్యవస్థిత మయింది. ఆ విధంగా జిల్లా కలెక్టరు రెవెన్యూ, మెజిస్టీరియల్ పోలీసు వ్యవహారాలకు బాధ్యుడయ్యాడు. నేర సంబంధమైన న్యాయానికి జిల్లా జడ్జి బాధ్యుడయ్యాడు.

తరువాత సంవత్సరాలలో జిల్లా పాలనలో వచ్చిన ముఖ్యమైన మార్పు కలెక్టరు బాధ్యతలను తగ్గించే వైఖరి. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జిల్లా పోలీసు సూపరెండెంటు, జిల్లా మెడికల్ ఆఫీసరు, జిల్లా విద్యాశాఖాధికారి – లాంటి జిల్లా యితర అధికారులు రాష్ట్రంలో కొత్తగా ఏర్పరచిన ఆయాశాఖల అధిపతులకు బాధ్యత వహించవలసి వచ్చింది. స్థానిక స్వపరిపాలనా సంస్థల పెరుగుదల కూడా కలెక్టరు అధికారాలపై పరిమితులు విధించింది. అయినప్పటికి కలెక్టరు జిల్లా ప్రధానాధికారిగా కొనసాగాడు. అటు ప్రభుత్వం యిటు ప్రజలు పనులు జరిగేందుకు కలెక్టరుపైనే ఆధారపడ్డారు. ఇతర జిల్లా అధికారుల పనులను సమన్వయ పరచి క్రమబద్ధీకరించే బాధ్యత కలెక్టరుదిగా గుర్తించబడింది.

## స్థానిక స్వయం పరిపాలన

బ్రిటిషు పాలనకు ముందు భారతదేశంలో బాగా అభివృద్ధి చెందిన గ్రామ పంచాయతీ వ్యవస్థ రూపంలో స్థానిక స్వయం పరిపాలన సాగించిన సాంప్రదాయం వున్నది. బ్రిటిషు పాలకుల కేంద్రీకృత విధానాల కారణంగా గ్రామ పంచాయతీలు నిర్వీర్యమయ్యాయి. బ్రిటిషు వారు వర్తకదశలో (1757–1813) వుండగానే వారి దేశంలో వున్న సాంప్రదాయం మేరకు మున్సిపల్ సంస్థల్ని ప్రారంభించారు. 1850, 1860 దశాబ్దాలలో కొన్నిచోట్లనైనా అలాంటి సంస్థల్ని అభివృద్ధి పరచాలని ప్రయత్నాలు జరిగాయి. దాదాపు అన్ని సంస్థలలో సభ్యుల్ని నామినేట్ చేశారు. అవి జిల్లా మెజిస్ట్రేట్ అధ్వర్యంలో పనిచేశాయి. కాబట్టి అవి స్థానిక

స్వపరిపాలనకు ప్రాతినిధ్యం వహించలేదు. కాని రిప్పన్ సంస్కరణలతో స్థానిక స్వపరిపాలన ఉద్యమం ఊపందుకొన్నది. అవి కేవలం పరిపాలనని అభివృద్ధి పరచడానికి ఉద్దేశించబడిన సాధనాలు మాత్రమే కాదు; రాజకీయ విద్య కొరకు చేపట్టబడిన చర్యలు. పట్టణ గ్రామీణ సంస్థల ద్వారా పాలన సాగించాలని 1880లో ప్రభుత్వం తీర్మానించింది. ఎన్నికలు ఎప్పుడు ఎక్కడ జరపాలో అధికారులు నిర్ణయిస్తారు. అలాంటి చోట్ల అనధికార సభ్యులు మెజారిటీగా వుంటారు. ఆ విధంగా ఏర్పాటు చేయబడిన సంస్థలు ఇంగ్లీషు సంస్థల నమూనాలుగా వుంటాయి. కాని దాని వెనుక వున్న స్ఫూర్తి మాత్రం ఈ దేశానికి పరాయిది కాదు. కాని యిలాంటిస్థానిక సంస్థలు కలకత్తా, మద్రాసు, బొంబాయిలలో మినహాయించి యితర చోట్ల కేవలం ప్రభుత్వ శాఖలుగా పనిచేశాయి. స్థానిక స్వపరిపాలనకు ఉదాహరణలుగా ఏమాత్రం నిలువలేకపోయాయి. ఆ విధంగా 1914కి ముందు ఈ సంస్థలలో నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి యొక్క అభివృద్ధి పర్యవేక్షణ నెపంతో అధిక జోక్యంతోను అదుపు పేరుతోనూ అధికారుల ఆధిక్యతతోనూ అడ్డుకోబడింది.

ఒక రాజ్యం, ఒక చట్టం ఏర్పడడంతో ఒకే ప్రభుత్వ కోశాగారం బడ్జెటు రూపకల్పనలు ప్రారంభమయ్యాయి. పాలనా వ్యవస్థకు రాజ్యాంగితా వాదం ఆదర్శమైతే బడ్జెటు దానికి సాధనమవుతుంది. 1757, 1947ల మధ్య భారత ప్రభుత్వ ఆదాయ వ్యయాలపై సర్వాధికారం పార్లమెంటుదే. కాని ఆచరణలో పార్లమెంటు అధికారాలను దిగువ స్థాయికి అప్పజెప్పింది. ఇది 1919 నుండి స్వయం ప్రతిపత్తి రాష్ట్రాలకు గట్టి పునాదిగా పనిచేసింది. ఈ అధికారాల అప్పగింత రాజ్యాంగబద్ధమై ప్రజాస్వామ్య హక్కుగా మార్చబడింది. అయినప్పటికి భారత రాజ్య కార్యదర్శి బడ్జెటు నివేదిక, అలాగే గవర్నరు జనరల్ గవర్నర్ల బడ్జెటు నివేదికల లాగానే సమీకృత బడ్జెటుకూ ఏకైక ఖాతాకుమాత్రమే చెందివుంటుంది. ఈ అధికారుల్లో ఎవరైనా ఖర్చు పెట్టినప్పుడూ, నియంత్రణ చేసినప్పుడూ పన్నులను ఒకే అధికారం ద్వారా అంటే పార్లమెంటు ద్వారా మాత్రమే విధించడం జరుగుతుంది. ఏ రాష్ట్ర ప్రభుత్వమూ పబ్లిక్ రుణం తీసుకోలేదు. ఏశాసన మండలి నిర్ణీత నియమాల ప్రకారం తప్ప పన్ను విధించడానికి ప్రభుత్వ కోశాగార సంబంధమైన సమస్యలను చర్చించడానికి స్వంత హక్కుగా బిల్లు ప్రవేశపెట్టలేదు. ఆర్థికపరంగా జరిగే ఏ చర్య కూడా వర్తమాన సంవత్సరంలో ఆర్థిక వనరులను పెంచదు, తగ్గించదు. కాని 1870 నుండి ప్రొవిన్షియల్ (రాష్ట్ర) ప్రభుత్వాల స్వంత రెవెన్యూలలో నిర్ణీత మొత్తాన్ని అంతర్గత పాలన కొరకు ఉపయోగించుకోవచ్చునని వాటికి అధికారం యిచ్చింది. స్వంత వనరులను అభివృద్ధి చేసుకోవడం, వాటిని సాధ్యమైనంత మేరకు విస్తరించుకోవడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత.

**ముగింపు:**

బ్రిటిషు సామ్రాజ్యంలో భారతదేశ రాజ్యం, ప్రభుత్వం యొక్క స్వభావం వలస స్వభావం – అంటే పరాధీన స్వభావం. బ్రిటిషు పార్లమెంటుకి అపరిమితమైన శాసనాధికారాలు వున్నాయి. కాని పార్లమెంటుయొక్క ఈ సర్వాధిపత్యం 1858 వరకు బాహాటంగా ప్రకటింపబడలేదు. 1858 చట్టం బ్రిటిషు చక్రవర్తికి భారతదేశంపై ప్రత్యక్ష పాలన సాగించే అవకాశం కల్పించింది. భారతదేశంలో గతంలో వున్న పాలనా వ్యవస్థల్ని రూపాల్ని యధేచ్ఛగా ఉపయోగ పెట్టుకొన్నప్పటికి బ్రిటిషు వారి పాలనా విధానం అప్పుడు ఇంగ్లాండులో ప్రచలితంగా వున్న ఆలోచనలు ఆచరణల చేత నిర్ణయింపబడింది. గొలుసుకట్టు ఆదేశాలతో ఒక పిరమిడ్ నిర్మాణం అభివృద్ధి పరచబడింది. ఈ పిరమిడ్‌కి స్థానిక దిగువ స్థాయి అధికారులు క్రింద, స్థానిక (ప్రొవిన్షియల్) ప్రభుత్వాలు భారతదేశ ప్రభుత్వం హోం గవర్నమెంటు మధ్యన, బ్రిటిషు రాజు పార్లమెంటు శిఖరాన వున్నాయి. అంతేగాక బ్రిటిషిండియా అంతటా గలసంస్థలలో ఒక ఏకరూపత వుంది. బ్రిటిషువారు నెలకొల్పిన పాలనా యంత్రాంగం గతంలో వున్న వాటికంటె చాలా శక్తివంతమైనది; సమగ్రమైనది. ఇలాంటి పాలనా వ్యవస్థ నెలకొల్పడానికి బ్రిటిషువారికి అచ్చుయంత్రాలు, విజ్ఞాన విస్ఫోటనం, శాస్త్ర సాంకేతికరంగాలు సాధించిన అద్భుతమైన అభివృద్ధి, ప్రభుత్వం పాలనా వ్యవహారాలపై హేతుబద్ధమైన క్రమబద్ధమైన ఆలోచనల అభివృద్ధి లాంటి చాలా అనుకూల పరిస్థితులు తోడ్పడ్డాయి.

# III

# ఆర్థిక విధానం

7

# బ్రిటిష్ రాజ్యం - ఆర్థిక ప్రభావం

**సాధారణ పరిశీలన:**

బ్రిటిష్ ప్రభావంతో భారతదేశం యొక్క పాలనా వ్యవహారాలలో సమాచార, రవాణా సాధనాలలో, వాణిజ్య చక్రంలో వాణిజ్యం, పరిశ్రమల నిర్వహణలో అలాగే దేశంలోని రాజకీయ సంస్థలలో మరీ ముఖ్యంగా ప్రజల ఆలోచనలలో దృక్పథాలలో సమూలమైన మార్పులు మొదట నెమ్మదిగా 1850 తరువాత వేగంగా రావడం ప్రారంభించాయి. 17వ శతాబ్దములోనూ, 18వ శతాబ్దం తొలిభాగంలోనూ యూరప్ వర్తక సంఘాలు భారతదేశంలో తయారైన వస్తువులు యూరప్ మార్కెట్లలో అమ్ముకునేందుకు కొనేవి. కాని యూరప్ వస్తువులకు భారతదేశంలో మార్కెట్లు పరిమితంగా ఉండేవి. ఆ విధంగా భారతదేశం ఎగుమతులు, దిగుమతుల కంటే ఎక్కువగా వుండేవి. భారతదేశపు అదనపు వస్తువులకు యూరప్ దేశాలు బంగారం, వెండి రూపంలో చెల్లించవలసి వచ్చేది.

బంగారం, వెండి ఇంగ్లండు నుండి భారతదేశానికి తరలింపబడడాన్ని వర్తకులు నిరసించారు. భారతదేశ ఎగుమతులు ఇంగ్లండు ఉత్పత్తి దారుల అభివృద్ధికి ఆటంకమయింది. బంగారం, వెండి ఇంగ్లండు నుండి ప్రవాహంగా వచ్చిపడడంపై తీవ్రమైన నిర్బంధాలు విధించబడ్డాయి. భారతవస్తువుల దిగుమతిపై ఆంక్షలు విధింపబడ్డాయి. ఈఆంక్షలు, ఆటంకాలు భారత ఎగుమతులు, దిగుమతులపై తీవ్రప్రభావం చూపాయి. నూలు, సిల్కు తయారీ వస్తువులకు మారుగా భారతదేశం పారిశ్రామిక ముడి వనరులకు ఉష్ణమండల వస్తువులైన ప్రత్తి, నీలిమందు, టీ, కాఫీ, చక్కెర, ఆహార ధాన్యాలు ఎగుమతి చేసే పరిస్థితులు కల్పించబడ్డాయి. ఇంగ్లండులో క్రమంగా విస్తరిస్తున్న పరిశ్రమలకు (1750నుండి ఇంగ్లండులో పారిశ్రామిక విప్లవం క్రమంగా విస్తరిస్తుంది). పారిశ్రామిక ముడివనరులు కావలసి వచ్చింది. వీటికి బదులుగా లాంక్ షైరు ప్యాక్టరీలలో తయారైన బట్టలు దిగుమతి చేసుకొనేలా భారతదేశంపై ఒత్తిడి పెంచింది.

ఇంగ్లాండు పారిశ్రామిక మిలిటరీ ఆధిపత్యం సాధించిన స్వేచ్ఛా వాణిజ్యం (పన్నులు లేని ఎగుమతి, దిగుమతులు పరిమితులు లేని) సూత్రాన్ని అమలు జరిపింది. 1815 నెపోలియన్ యుద్ధాల తరువాత స్వేచ్ఛా వాణిజ్య సూత్రం నిక్కచ్చిగా అమలు జరుపబడింది. 1853 నాటికి ఇంగ్లండు, భారతదేశానికి మధ్య గల వర్తక పరమైన ఆటంకాలన్ని తొలగించబడ్డాయి. 1854-59 కాలంలో భారతదేశ వార్షిక ఎగుమతులు 22.2 కోట్ల రూపాయలకు, దిగుమతులు 15.37 కోట్లకు పెరిగాయి. 1840 తరువాత కొన్ని నాటకీయ పరిమాణాలు చోటుచేసుకున్నాయి. 1840 తరువాత తెరచాప ఓడల స్థానంలో ఆవిరి ఓడలు ప్రవేశపెట్టబడ్డాయి. 1869లో సూయజ్ కాలువ తెరువబడింది. యూరప్ భారతదేశానికి మధ్య దూరం సగానికి తగ్గించబడింది. సముద్రంలోపల నుండి తంతి తీగల ఏర్పాటు, అంతర్జాతీయ పోస్టల్ సౌకర్యాలు, అంతర్జాతీయ వాణిజ్యానికి మరింత ఊపునిచ్చాయి. చాలా కాలం వరకు భారత ఎగుమతులు, దిగుమతులు ఇంగ్లాండుతోనే జరిగాయి. ఇతర దేశాలు ప్రవేశించాయి. మొదట జర్మనీ - 19 శతాబ్దాంతానికి అమెరికా, జపాన్‌లు భారత మార్కెట్లలో తమ పారిశ్రామిక వస్తువుల అమ్మకాలు సాగించాయి.

1850 తరువాత భారతదేశంలో అంతర్గత మార్కెట్లు తెరవడం ప్రారంభమయింది. 1850 తరువాత రైల్వే, రోడ్లు నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. లార్డ్ డల్హౌసీ ప్రజా పనుల విభాగం (Public works Department) స్థాపించి 1850 దశాబ్దంలో ఆధునిక రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించాడు. భారతదేశంలో మొదటి రైలు మార్గం 1853లో ప్రారంభమయింది. రైలు మార్గాలు మారుమూల ప్రాంతాల్ని బొంబాయి, కలకత్తా లాంటి సముద్ర, రేవు నగరాలను కలిపాయి. దీనితో మారుమూల ప్రాంతాల నుండి రేవు పట్టణాలకు, సరకుల రవాణాకు అవకాశాలు ఏర్పడ్డాయి. వస్తువుల రవాణాని అడ్డుకుంటూ వసూలు చేయబడుతున్న సుంకాలు 1836లో రద్దు చేయబడ్డాయి. 1835 తరువాత దేశవ్యాప్తంగా రూపాయి చట్టబద్ధమైన కరెన్సీ అయింది. ఒకే రకమైన కరెన్సీ అంతర్గత వ్యాపార విస్తరణకు తోడ్పడింది. 1815 తరువాత ఇంగ్లండులో స్వేచ్ఛా వాణిజ్యసూత్రాన్ని అమలు జరపడం వలనను, బ్రిటీష్‌పాలిత దేశంగా వున్న భారతదేశంపై ఆ సూత్రాన్ని రుద్దడం వలనను దిగుమతి పన్నులన్నీ క్రమంగా 1882 నాటికి రద్దు చేయబడ్డాయి. అలాగే 1888 నాటికి ఎగుమతుల పన్నులన్నీ రద్దు చేయబడ్డాయి.

## భారతదేశంలో బ్రిటిష్ వలసవాదం

### నేపథ్యం:

భారతదేశంలో బ్రిటీష్ వలసవాద పాలనని మూడు దశలుగా వర్గీకరించవచ్చు. మొదటిదశ (1757-1813) వర్తక దశకు (mercantile phase) ప్రాతినిధ్యం వహిస్తుంది; రెండవ దశ (1813-1860) స్వేచ్ఛా వాణిజ్య దశకు ప్రాతినిధ్యం వహిస్తుంది; మూడవదశ 1860 తరువాత ద్రవ్య పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది; వర్తక దశలో సంపదను పోగుచేయడం కార్యకలాపాల లక్ష్యంగా వున్నది. అనుకూల వాణిజ్యం కొరకు బ్రిటిష్ కంపెనీ

దుందుడుకు విధానాలను ప్రారంభించింది. కంపెనీ వ్యవహారాలపై ఎక్కువ అదుపును, ప్రత్యక్ష అదుపును సాధించేందుకు బ్రిటిష్ ప్రభుత్వం రెగ్యులేటింగ్ చట్టాన్ని, పిట్ ఇండియా చట్టాన్ని చేసింది. కంపెనీ అధికారులు భారతదేశంలో దోచుకున్న ధనాన్ని ఇంగ్లండుకు తరలించారు. బ్రిటీష్‌వారు భారతదేశ భూభాగాలపై ఆధిపత్యం సాధించడంతో భారతదేశం ఆర్థిక రక్తస్రావం ప్రారంభమయ్యింది. వ్యవసాయ చట్రంపై క్రొత్త శిస్తు విధానాలు రుద్దబడ్డాయి. బ్రిటీష్ వారు చాలా యుద్ధాలు చేశారు. స్వదేశీ రాజ్యాలను అణచివేశారు. వలస వాద నియంత్రణ క్రిందికి తెచ్చారు. ఆ తరువాత వర్తకదశ ముగిసింది.

19 శతాబ్దం ప్రారంభం నాటికి పారిశ్రామిక విప్లవం కారణంగా బ్రిటిష్ పారిశ్రామిక శక్తిగా ఎదిగింది. పరిశ్రమలకు ముడిసరుకులు అవసరమయ్యాయి. అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారి విధానం యొక్క మార్కెట్ల విస్తరణకి కంపెనీ ఆటంకమయింది. బ్రిటిష్ పారిశ్రామిక వర్గం భారతదేశంలోని కంపెనీ గుత్తాధిపత్యపై తీవ్రమైన దాడిచేసింది. బ్రిటిషు పారిశ్రామిక వస్తువులకు ముడివనరులు, మార్కెట్ల అవసరం స్వేచ్ఛా వాణిజ్య రూపకల్పనకు తెరతీసింది. ఈ విధానం యొక్క ప్రత్యేక లక్షణం "వన్ వే ట్రాఫిక్" అంటే బ్రిటీష్ వస్తువులు భారతదేశంలో స్వేచ్ఛగా వచ్చిపడేవి. భారతదేశ వస్తువులు బ్రిటన్‌లో ప్రవేశించేందుకు పెద్ద మొత్తాలలో సుంకాలు చెల్లించవలసి వచ్చేది. ఈ విధానం బ్రిటిష్ వర్తకానికి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించబడింది.

ఈ విధానం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వినాశకరమైనది. సాంప్రదాయ చేతి వృత్తులు, అస్తవ్యస్త మయ్యాయి. దాదాపు అంతరించిపోయే దశకు చేరుకొన్నాయి. ఉపాధి కోల్పోయిన వారు వ్యవసాయ రంగాన్ని ఆశ్రయించడం తప్ప మార్గాంతరం లేకపోయింది. ఈ క్రమం 1813లో ప్రారంభమై వలస పాలన అంతమయ్యే వరకు (20వ శతాబ్దం మధ్య భాగం వరకు) కొనసాగింది. కుటిలమైన విధానాలతో పెట్టుబడిని ప్రోగుచేసి కొన్న, ఇంగ్లండు 1850లలో తన స్వంతగడ్డపై తన పెట్టుబడిని వినియోగించుకోలేని పరిస్థితిలో పడింది. యూరప్‌లోని యితర పారిశ్రామిక శక్తులతో పోటీ పడవలసి వచ్చింది. అమెరికాతో వర్తక వాణిజ్యాలలో పోటీ పడవలసి వచ్చింది. తన పెట్టుబడికి భారతదేశాన్ని సురక్షిత స్థానంగా భావించిన ఇంగ్లండు భారతదేశంలో కొన్ని ఆధునిక పరిశ్రమల్ని స్థాపించడం ప్రారంభించింది. వలసవాద దోపిడీని సాఫిగా సాగించేందుకు భారతీయ సమాజంలో ఆర్థిక విధానంలో చాలా మార్పుల్ని తీసికొనివచ్చింది. తన దుశ్చర్యల్ని చట్టబద్ధం చేసేందుకు న్యాయవ్యవస్థని, దోపిడీకి మానవతా ముఖాన్ని అతికించేందుకు సామాజిక విధానాన్ని లక్ష్యాలుగా పెట్టుకొన్నది. ఇక వలసవాద ప్రయోజనాల సంరక్షణకు చౌకగా విధేయులైన ఏజంట్లను సమకూర్చుకొనేందుకు అనుగుణంగా విద్యా విధాన రూపకల్పన చేయబడింది.

**వలసవాదం మొదటిదశ:**

భారతదేశ సమస్యల్ని ఇంగ్లీషు వారి ఆలోచనలు, ప్రయోజనాల కోణం నుండి చూసే విధంగా భారతదేశ పాలనా వ్యవస్థ రూపకల్పన జరిగింది. భారతదేశం ఇంగ్లండు

నుండి పాలింపబడుతుంది. కంపెనీ తన వర్తకం కొరకు భారత భూభాగాలను వదలుకోనంటుంది. భారతదేశాన్ని రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకొనడం పట్ల ప్రభుత్వం ఆసక్తి చూపుతుంది.

19వ శతాబ్దంలో భారతదేశ ఆర్థిక విధానాలకు రూపకల్పన చేసి, అమలు జరిపే వారి ఆలోచనా ధోరణుల్ని ఈ రాజకీయ ఆర్థిక శాస్త్రం నియంత్రించింది. చాలా సంవత్సరాల వరకు రాజకీయ ఆర్థికశాస్త్ర అధ్యయనానికి సిపార్సు చేయబడిన గ్రంథాలు మెక్‌కుల్లాక్ “జాతీయ సంపద” (దీనిలో కొన్ని వ్యాసాలు అడమ్‌స్మిత్ వ్రాశారు), రికార్డో “రాజకీయ ఆర్థిక శాస్త్ర సూత్రాలు (Principles of Political Economy). ఇండియన్ సివిల్ సర్వీస్ ఉద్యోగాల అభ్యర్థులు రాజకీయ, ఆర్థిక శాస్త్రం తప్పనిసరిగా అధ్యయనం చేయవలసి వచ్చింది. “జాతీయ సంపద విలువైన లోహాలలో ఉంది, ఎక్కువ ఎగుమతుల్ని , తక్కువ దిగుమతుల్ని ప్రోత్సహించాలి; బంగారాన్ని రాబట్టడం ద్వారా వర్తక సమతుల్యత సాధింపబడాలి’ – ఇది వర్తకంపై తొలి వర్తక సంఘాల తాత్విక ధృక్పధం. ఈ ఉద్దేశంతో బ్రిటీష్‌వారు కీలకమైన వర్తక యుద్ధాలుచేశారు. భారతదేశంపై వారి గుత్తాధిపత్యాన్ని స్థాపించుకున్నారు. కానీ కేవలం విలువైన లోహాలను పోగుచేయడం జాతీయసంపద పెరుగుదల కాదని ఆర్థికవేత్తలు చెప్పారు. కాబట్టి బంగారం, వెండిని కూడబెట్టడం గాక వస్తువుల, సేవల ఉత్పత్తిని ప్రభుత్వం ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యంగా వుండాలన్నారు.

## 18వ శతాబ్దంలో బ్రిటిష్ వారి యొక్క మారుతున్న పారిశ్రామిక స్వభావం

తొలిదిగుమతులైన సుగంధ ద్రవ్యాలు, చక్కెర, పొగాకులతో పాటు ప్రత్తి, అద్దకాలు, ముడిసిల్కు లాంటి ముడివనరుల దిగుమతుల అవసరాన్ని పెంచింది.

ఆ విధంగా వలస పాలిత దేశంగా యున్న భారతదేశం ఇంగ్లాండ్‌తో పోటీ పడకుండా ముడివనరుల్ని సరఫరా చేయాలి. వర్తకం కొనసాగింపుకు ఆక్రమణలు అవసరమయ్యాయి. అందుకే వర్తకాన్ని యుద్ధంతో మిళితం చేసేందుకు స్థావరాల నిర్మాణానికి సైన్యాన్ని తయారుచేసుకొనేందుకు బ్రిటిష్ ప్రభుత్వం కంపెనీకి అనుమతినిచ్చింది.

వలసవాదశక్తి భారతదేశంపై ఆధిపత్యం సాధించడం పూర్తిఅయింది. తరువాత దోపిడీ సాగింది. మరోవిధంగా చెప్పాలంటే వలసవాద ఆర్థిక రక్తస్రావం ప్రారంభమయింది. బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం కారణంగా నిస్సిగ్గుగా కొల్లగొట్టడం కొనసాగింది. సంపద తరలింపు – లంచాలు, కానుకల రూపంలో కూడా జరిగింది. భారతీయ రాజుల నుండి, జమిందారుల నుండి, వ్యాపారుల నుండి, సాధారణ ప్రజల నుండి పెద్ద మొత్తాలు గుంజుకోబడ్డాయి. హస్తకళలు, చేతివృత్తులు ధ్వంసం చేయబడ్డాయి. భారతదేశాన్ని ముడివనరుల సరఫరా దారుగా మార్చడం ప్రభుత్వ విధానం అయ్యింది.

రెగ్యులేటింగ్ చట్టం, పిట్ ఇండియా చట్టంలను చేసేటప్పుడు బ్రిటీషు విధానంలో రెండు ప్రధానాంశాలున్నాయి. మొదటిది: భారతదేశంలో ఆక్రమించిన ప్రాంతాలు కంపెనీ

ఆధీనంలో వుండాలి. భారతదేశంలో వర్తకంలో కంపెనీ గుత్తాధిపత్యం కొనసాగకూడదు. బ్రిటిష్ వర్తక సంఘాలలో "స్వేచ్ఛా వాణిజ్యం" బలం పుంజుకొంటుంది. భవిష్యత్‌లో బ్రిటిష్ పరిశ్రమలు, అభివృద్ధి చెందాలంటే ఆసియా వ్యాపారంలో కంపెనీ గుత్తాధిపత్యం రద్దు కావాలని బ్రిటిష్ వర్తక సంఘాలు వాదించాయి. పారిశ్రామిక విప్లవ ఫలితంగా బ్రిటన్ పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. నూతన పరిశోధనలు బ్రిటిష్ పరిశ్రమలన్ని సమర్ధవంతంగా చేశాయి. శక్తివంతమైన భారత్ ప్రత్యర్థుల అమ్మకాలను తగ్గించాయి.

బ్రిటిష్ వస్త్ర పరిశ్రమ సామర్థ్యం విపరీతంగా పెరిగినప్పుడు మాంచెస్టర్ వర్తకులు భారత పోటీపట్ల ఇంకా ఆందోళన చెందారు. కేవలం అధికార బలంతో భారతదేశ వస్తువులపై వలసవాద ప్రభుత్వం 60శాతం సుంకాలు విధించింది. 1) ప్రింటింగ్, అద్దకం వేసిన నూలు బట్టల వాడకాన్ని నిషేధిస్తూ చట్టాలు చేసింది. 2) సివిల్‌సర్వీస్‌లో పైస్థాయి పదవులు పొందకుండా భారతీయులపై నిషేధం విధించింది.

ధనదాహంతో పేరాశతో రైతుల, కౌలుదారుల గోడుపట్టించుకొనక జమిందారీ విధానం లేక శాశ్వత శిస్తు విధానాన్ని ప్రవేశపెట్టింది. భూమిశిస్తులు, పన్నులు పెంచడంతో ప్రజలు దుర్భర దారిద్ర్యంలోకి నెట్టివేయబడ్డారు.

**వలసవాదం రెండవదశ:**

స్వేచ్ఛా వాణిజ్య విధానంతో బ్రిటిషు వస్తువులు ఎలాంటి అడ్డంకులు లేకుండా కుప్పలు, తెప్పలుగా వచ్చిపడ్డాయి. చేతివృత్తుల వస్తువులు, యంత్రపరికరాల వస్తువులతో అసమానత పోటీని ఎదుర్కొన్నాయి. దాదాపు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. మరొక అంశం నావికా చట్టాలు భారతదేశం, యూరపు లేక యితరదేశాలతో ప్రత్యక్ష వాణిజ్యాన్ని అడ్డుకొన్నాయి. నెపోలియనిక్ యుద్ధాల కాలంలో బ్రిటిషు రాజకీయ వేత్తలు ప్రపంచ వ్యాప్తంగా గల ఫ్రెంచి వలసలపై ఆధిపత్యం సాధించడం లక్ష్యంగా పెట్టుకొన్నారు. ఈ నేపథ్యంలో భారతదేశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. మరొక వైపు కంపెనీ గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా బ్రిటిష్ పారిశ్రామికవేత్తల వత్తిడి పెరిగింది. బ్రిటిషు ప్రభుత్వం కంపెనీ రాజకీయ కార్యకలాపాలను అదుపు చేయడం అవసరంగా భావించింది. ఫలితంగా 1813, 1833, ఛార్టరు చట్టాలు చేయబడ్డాయి. దీనితో భారతదేశంతో వర్తకంలో కంపెనీ గుత్తాధిపత్యం ముగిసింది. దోపిడీ విధానంలో కొత్తదశ ప్రారంభమయింది.

భారతదేశంలో బ్రిటన్‌కి అనుకూలంగా సుంకాలు విధించి దేశీయ పరిశ్రమలు కోలుకోకుండా అణచడం ప్రారంభించింది. అదే సమయంలో భారతదేశంలోకి వచ్చే బ్రిటన్ వస్తువులపై పన్నులు విపరీతంగా తగ్గించింది. బ్రిటన్‌లోకి ప్రవేశించే భారతదేశ వస్తువులపై పన్నులు పెంచింది.

ఉదాహరణకు 1824లో బ్రిటన్‌లోకి ప్రవేశించే భారతదేశ నూలు బట్టల (కేలికో, మస్లిన్)పై 67.5, 37.5 శాతం పన్నులు విధించబడ్డాయి. అప్పటికే అభివృద్ధి చెంది పటిష్ఠంగా

యున్న బ్రిటీషు నౌకా నిర్మాణం శైశవదశలో ఉన్న భారతనౌకా నిర్మాణం నుండి రక్షణ కోరింది. బ్రిటీషు ప్రభుత్వం రక్షణ కల్పించింది. అంతేగాక 1814–35 కాలంలో భారతదేశానికి బ్రిటీషు వస్త్ర ఎగుమతులు ఒక మిలియన్ గజాల నుండి 5.1 మిలియన్ల గజాలకు పెరిగాయి. అదేకాలంలో భారత వస్త్ర దిగుమతులు 1,25,000ల ముక్కల నుండి 1,06,000లకు పడిపోయాయి. 1884 నాటికి 63,000కి పడిపోయాయి.

భారత, బ్రిటిషు వస్తువుల మధ్య పోటీ లేకపోయినప్పటికి బ్రిటన్‌లో భారతదేశ వస్తువులు ఒక స్వతంత్ర దేశం నుండి వచ్చే వస్తువులుగా పరిగణింపబడ్డాయి. పన్నులు విధించదగిన వస్తువులే గాక 1824 వరకు సిల్కు వస్తువుల దిగుమతులు పూర్తిగా నిషేధించబడ్డాయి. దోపిడీ సజావుగా సాగించేందుకు చాలా మార్పులు చేయబడ్డాయి. గ్రామీణ స్వయం ప్రతిపత్తి చిందరవందర చేయబడింది. పోలీసు, న్యాయవ్యవస్థలు ప్రక్షాళన చేయబడ్డాయి. కొత్త పద్ధతులు ప్రవేశపెట్టబడ్డాయి. 1853 నుండి సివిల్ సర్వీసు ఉద్యోగులు పోటీ పరీక్షల ద్వారా నియమింపబడ్డారు. కాని అన్ని ప్రభుత్వ శాఖల పైస్థాయి ఉద్యోగాలలో భారతీయులు మినహాయించబడ్డారు. గుమస్తాలు క్రింది స్థాయి ఏజంట్ల సరఫరాకు ఇంగ్లీషు విద్య ప్రవేశపెట్టబడింది.

**వలసవాదం - మూడవ దశ**

19వ శతాబ్దం మధ్య కాలం నాటికి భారతదేశంలో బ్రిటీషు పాలన దృఢంగా వేళ్ళూను కొన్నది. 1857 తిరుగుబాటు తరువాత కంపెనీ సర్వసత్తాక అధికారాలను బ్రిటిష్ సింహాసనం కైవశం చేసుకొన్నది. అప్పటికి ఇంగ్లాండు పారిశ్రామికంగా పరిణితి చెందింది. విపరీతంగా పోగుచేసుకున్న పెట్టుబడులు దేశంలో లాభదాయకంగా వినియోగించే పరిస్థితులు లేవు. తరగని ముడివనరులు, చౌకగా లభించే శ్రామికులతో భారతదేశ పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలంగా వున్నది. ఈకాలంలోనే పారిశ్రామిక విప్లవం ప్రపంచంలోని యితర దేశాలకు వేగంగా విస్తరించింది. యునైటెడ్ స్టేట్స్, పాశ్చాత్య యూరప్ దేశాల పారిశ్రామికీకరణల కారణంగా బ్రిటిషు పెట్టుబడి, వస్తువుల ఎగుమతులు పడిపోయాయి. ఫలితంగా బ్రిటన్ పెట్టుబడులు పబ్లిక్ రంగానికి మరల్చబడ్డాయి. ఈ దశ దాదాపు 1879లో విషమించడంతో బ్రిటన్ మరలా యిబ్బందులలో పడింది. 1873 తరువాత వడ్డీరేటు, ఈక్విటీ రేట్లు, లాభాలరేటు, వస్తువుల ధరలు తగ్గాయి. పెట్టుబడులు, కొత్తస్థావరాలు వెతుక్కోవలసి వచ్చింది. ఈ మధ్య కాలంలో అమెరికా, యూరపు ఆర్థిక గ్రూపులు విదేశాలలో బ్రిటిషు వారితో పోటీ చేసే స్థితికి ఎదిగాయి. కాబట్టి బ్రిటిషు పెట్టుబడిదారులు పెట్టుబడులకు అవకాశాలు కల్పించే సామ్రాజ్యం కేసి చూస్తున్నారు. ఉపాధి అవకాశాల లభ్యత, ప్రత్యేకించి మధ్య తరగతి యువకులకు భారతదేశ సామ్రాజ్యం అత్యంత ఆకర్షణీయంగా కనిపించింది.

భారతదేశానికి స్థిరమైన రక్షణ కల్పించగల పాలనా యంత్రాంగం యున్నది. బ్రిటన్‌కి ఆహార ధాన్యాలను ఇతర ముడివనరుల అవసరాన్ని ఉత్పత్తి చేసి సరఫరా చేయగల సాగుచేయబడని మిలియన్ల ఎకరాల సారవంతమైన భూమియున్నది. వీటిని గమనించి

1857లో ఒక పరిశీలకుడు భారతదేశం గురించి "ఇంగ్లండుకి ప్రపంచ వ్యాప్తంగా గల ప్రాంతాలన్నిటికంటే భారతదేశం చెప్పరానంత ప్రయోజనకరమైనది" అని వ్యాఖ్యానించారు. 1870 దశాబ్దంలో త్వరగా పారిశ్రామికీకరణ చెందుతున్న దేశాల నుండి తీవ్రమైన పోటీని ఎదుర్కొన్నది. ఫలితంగా తరువాత దశాబ్దంలో బ్రిటన్ అభివృద్ధి చెందిన ఏకైక పారిశ్రామిక దేశం అనే స్థాయిని కోల్పోయింది. ఇతర దేశాల పోటీతో తగ్గుతున్న ప్రాధాన్యత రెండు ఘటనలకు దారితీసింది.

ఒకటి: విరివిగా సుంకాలు విధించి బ్రిటిషు పరిశ్రమలకు మార్కెట్లకు రక్షణ కల్పించుట. రెండు: బ్రిటిషు ప్రజల పెట్టుబడిని, ప్రభుత్వ పెట్టుబడిని జొప్పించడం ద్వారా మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరచుట.

సైన్యాన్ని తరలించడానికి, బ్రిటిషు వస్తువుల్ని భారతదేశ మారుమూల ప్రాంతాలకు కుప్పలు తెప్పలుగా రవాణా చేయడానికి రైలు మార్గాలు నిర్మించబడ్డాయి. బ్రిటిషు సైనిక ఆధిక్యతని నిలబెట్టేందుకు సమాచార సౌకర్యాలు ప్రవేశపెట్టబడ్డాయి. వ్యవసాయాన్ని వాణిజ్యపరం చేసేందుకు నీటిపారుదలకు తగిన ప్రాధాన్యత యివ్వబడింది. విధేయత గల ఏజంట్లను చౌకగా ఒనగూర్చుకొనేందుకు వీలుగా విద్యావిధానం అభివృద్ధి చేయబడింది. ప్రభుత్వ అప్పులు, రైలు మార్గాలు, నౌకానిర్మాణం, విదేశీవర్తకం, బ్యాకింగ్, మైనింగ్, ప్లాంటేషన్ లాంటి అన్ని ప్రధాన రంగాలలో విదేశీ పెట్టుబడికి అవకాశాలు కల్పించబడ్డాయి. కాని యిక్కడ గమనించవలసిన అంశం ఒకటుంది. భారతదేశంలో బ్రిటిషు వారుపెట్టిన పెట్టుబడి భారతదేశంలో భారత ప్రజల్ని లూటీ చేయడం ద్వారా పోగు చేయబడింది. ఆ తరువాత దానిని బ్రిటన్ యిచ్చిన అప్పుగా లెక్కరాయబడింది. దానిపై వచ్చే వడ్డీ, లాభాలు వారికే దక్కాయి.

పరిపాలనాపరంగా బ్రిటిషు యాజమాన్య విధానం భారతదేశ పరిశ్రమాభివృద్ధి పీకనొక్కింది. భారత పరిశ్రమాభివృద్ధిపై అదుపు కలిగి వుండేందుకు యాజమాన్య విధానం ఒక ఆయుధం అయింది. ఈ విధానం క్రింద కొద్ది మేనేజింగ్ ఏజన్సీ సంస్థలు, వివిధ పారిశ్రామిక సంస్థలకు నిధులు సమకూర్చాయి, ప్రోత్సహించాయి, అదుపు చేశాయి. వాటి ఉత్పత్తి వ్యవహారాలను శాసించాయి. వస్తువులను మార్కెటు చేశాయి. లభించిన లాభాలు షేర్ హోల్డర్లకు గాక మేనేజింగ్ సంస్థలకు అందచేయబడ్డాయి. భారతదేశాన్ని అభివృద్ధి పరచి, భారత ఆర్థిక వ్యవస్థని బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించే లక్ష్యాలు గల ఈ విధానాల ద్వారా బ్రిటన్ తన స్వంత ఆర్థిక పరాధీనతను తగ్గించుకోవాలని ఆశించింది. ఆవిధంగా వలసవాద విధానం, బ్రిటిషు పెట్టుబడిదారీ విధానం అవసరాల కనుగుణంగా, మారుతున్న గాలి దిశ బట్టి తెరచాపల్ని మార్చింది.

## ఆర్థిక ప్రభావం - ప్రధాన రంగాలు

### భారత విదేశీ వర్తకం త్వరిత విస్తరణ

రోడ్లు, రైలు మార్గాల నిర్మాణం, అంతర్గత సుంకాల రద్దు, దేశవ్యాప్తంగా ఒకే కరెన్సీ రూపాయిని ప్రవేశపెట్టడం, ఎగుమతి దిగుమతుల పన్నులు రద్దు, స్వేచ్ఛా వాణిజ్య సూత్రం అమలు లాంటి బ్రిటిషు వారు చేపట్టిన చర్యల ఫలితంగా భారతదేశం యొక్క విదేశ వాణిజ్యం త్వరితంగా అభివృద్ధి చెందింది. 1864-69 ఐదు సంవత్సరాల కాలంలో భారత దిగుమతి, ఎగుమతుల వార్షిక సగటు విలువ 87.5 కోట్ల రూపాయలు. 1913-14 నాటికి యిది 427 కోట్ల రూపాయలకు పెరిగింది.

### భారత ఎగుమతులు-దిగుమతులలో మార్పులు:

భారతదేశ ఎగుమతులు, దిగుమతులలో మార్పురెండవ పరిణామం. ఇప్పుడు ముడి ప్రత్తి, మైనము, ముడి ఖనిజాలు, టీకాఫీ ఆహార ధాన్యాలు లాంటి వ్యవసాయ ఉత్పత్తులు భారత దేశం ఎగుమతులయ్యాయి. మరోవైపు ఇంగ్లాండు ఫ్యాక్టరీలలో తయారయ్యే వస్తువులు దిగుమతులయ్యాయి.

### పట్టణ చేతివృత్తుల తరుగుదల:

భారతదేశ ఎగుమతులు, దిగుమతులలో వచ్చిన ఈ మార్పు ఫలితంగా ఒకప్పుడు అభివృద్ధి చెందిన ప్రఖ్యాతి గాంచిన పట్టణ చేతివృత్తులకు డిమాండ్ పడిపోయింది. గతంలో పట్టణ ప్రాంతాలకు చెందిన భారతనేతగాళ్ళు, లోహకారులు, యితర చేతివృత్తుల వాళ్ళు దేశ విదేశీయ మార్కెట్లకు వస్తువుల ఉత్పత్తి చేసేవారు. ఇప్పుడు ఈ చేతివృత్తుల వారు ఇంగ్లాండు ఫ్యాక్టరీలలో చౌకగా, భారీ యెత్తున సాగే ఉత్పత్తులతో పోటీపడలేకపోయారు. అంతేగాక భారతదేశంలోని చేతివృత్తుల వారు నిరక్షరాస్యులు. కులం యితర ఆచారాలను పాటించే సాంప్రదాయవాదులు. వీరు బ్రిటిషు పారిశ్రామిక వేత్తల సవాలును స్వీకరించి ఆధునిక ఉత్పత్తి విధానాల నవలంభించి సంఘటితం కాగల స్థితిలో లేరు. విదేశీ ప్రభుత్వమైన అప్పటి భారతదేశ ప్రభుత్వం మాతృదేశ ప్రయోజనాల సంరక్షణ పట్ల ఆసక్తి కలిగివుంది గాని దురదృష్టవంతులైన ఈ చేతివృత్తులవారికి చేసిందేమీ లేదు. ఇది భారతదేశంలో చేతివృత్తుల పతనానికి దారితీసింది.

### వ్యవసాయంపై పెరిగిన ఒత్తిడి:

క్రమంగా గ్రామాలలోని చేతివృత్తులు క్షీణించాయి. కొన్నిచోట్ల అంతర్ధానమయ్యాయి. వృత్తులు కోల్పోయిన యిలాంటి వారంతా వ్యవసాయంపై పడ్డారు. హిందూ ముస్లిం వారసత్వ చట్టాలననుసరించి కుటుంబానికి చెందిన భూమిలో తమ వాటా కోరారు. వ్యవసాయ భూములు

విభజనలు, ఉపవిభజనలతో ముక్కలు చెక్కలయ్యాయి. తక్కువ భూకమతాలతో గిట్టుబాటుకాని వ్యవసాయంతో గ్రామీణ రుణభారం పెరిగింది.

**వ్యవసాయ వ్యాపారీకరణ:**

1850 తరువాత సమాచార రవాణా సౌకర్యాలలో వచ్చిన విప్లవం కారణంగా వివిధ వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలకు క్రమంగా విదేశాలలో డిమాండ్ పెరిగిన కారణంగా భారతదేశ వ్యవసాయ ఉత్పత్తి విధానంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకోవడం ప్రారంభమయ్యింది. గతంలో కుటుంబ సభ్యుల అవసరాల కోసం, గ్రామంలో యితర వృత్తుల వారి అవసరాల నిమిత్తం, భూమి శిస్తు చెల్లించడం కోసం వ్యవసాయం చేసిన రైతులు అమ్మకం కోసం పండించడం ప్రారంభించారు. బ్రతుకు దెరువు వ్యవసాయం క్రమంగా వ్యాపారీకరణ వ్యవసాయమయింది. సాంప్రదాయంగా కుటుంబ అవసరాల నిమిత్తం అన్ని రకాల పంటలు పండించే వ్యవసాయదారులు ఎక్కువ ధర పలికే, ఆ ప్రాంతానికి అనుకూలమైన ఒకటి రెండు పంటలు పండించటం ప్రారంభించారు. ఇది వ్యవసాయోత్పత్తి రంగంలో ఒక మేరకు ప్రాంతీయ ప్రత్యేకతలకు దారితీసింది. ద్రవ్యవినియోగం గ్రామాలలోకి చొచ్చుకుపోయింది. 1850 తరువాత భారతదేశ గ్రామాలకు బయటి ప్రపంచానికి మధ్య డబ్బు సంబంధాలు క్రమంగా వ్యవస్థాపితమయ్యాయి.

**దళారుల ప్రవేశం:**

జీవనాధార వ్యవసాయం నుండి వ్యాపారీకరణ వ్యవసాయానికి జరిగిన మార్పు మరొక మార్పును తెచ్చింది. ద్రవ్య పంటల్ని మార్కెట్ చేయడంలో నిపుణత సాధించిన దళారీలు రంగ ప్రవేశం చేశారు. ఈ దళారులు ఒకవైపు వ్యాపార పంటల్ని పండించే గ్రామాలలోని చిన్న వ్యవసాయదారులకు మరొక వైపు ప్రపంచ వ్యాప్త సంబంధాలు గల ఎగుమతి ఏజన్సీలకు మధ్య అనుసంధాన కర్తలయ్యారు.

**భారతదేశ మార్కెటు ప్రపంచ మార్కెటుతో అనుసంధానం:**

గ్రామాలలోని వ్యవసాయ ఉత్పత్తిదారులకు, ప్రపంచ మార్కెట్‌కి సంబంధాలు ఏర్పడటంతో భారతదేశంలోని వ్యవసాయోత్పత్తుల ధరలపై ప్రపంచ వ్యవసాయ ధరల ప్రభావం పడింది. వ్యాపార పంటల విషయంలో ప్రపంచ డిమాండు, సరఫరా శక్తులు ధరలపై ప్రభావం చూపడం మొదలెట్టాయి. దీని అర్థం భారత వ్యవసాయదారుల ఆదాయం అభివృద్ధి స్థాయి, ప్రత్యేకించి వ్యవసాయ పంటలు ఉత్పత్తి చేసే భారతదేశ వ్యవసాయదారులు భారతదేశం నుండి వ్యవసాయ వస్తువులు కొనే ఇంగ్లండు లాంటి పారిశ్రామిక దేశాల అభివృద్ధి స్థాయిచే ప్రభావితులయ్యారు.

**కొత్త ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన:**

భారత ఎగుమతులలో వచ్చిన మార్పుల ఫలితంగా కాటన్ జిన్నింగ్, కాటన్ ప్రెసింగ్ ఫ్యాక్టరీలు, బియ్యానికి పాలిష్ చేసే మిల్లులు, తోలు శుద్ధిలాంటి ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభమయ్యాయి. ఎగుమతి అవసరాల రీత్యా కొన్ని ఖనిజ పదార్థాల విస్తరణ చేపట్టబడింది. లక్క, జిగురు లాంటి కొన్ని అటవీ ఉత్పత్తుల ఎగుమతి ప్రారంభమయింది. అటవీ ఉత్పత్తుల క్రమబద్ధమైన ఉత్పాదన ఈ కాలంలో చేపట్టబడింది.

**మేనేజింగ్ ఏజన్సీ సంస్థల ఆవిర్భావం:**

19వ శతాబ్దం ద్వితీయార్థంలో యూరోపియన్ మేనేజింగ్ సంస్థల ఆవిర్భావం ముఖ్యమైన పరిణామం. మేనేజింగ్ సంస్థలు భారతదేశంలో పరిశ్రమలు, వ్యాపార సంస్థలు నిర్వహించే బాధ్యతను చేపట్టాయి. భారతదేశంలో ఉద్యోగాలు చేసి పెద్ద మొత్తాలు పోగుచేసికొని ఇంగ్లండులో నివశిస్తున్నవారి తరుపున ఈ సంస్థలు పనిచేశాయి. పెద్ద మొత్తాలు పెట్టుబడులు పెట్టి రోజువారి వ్యాపార లావాదేవీలు చూడటం సాధ్యపడని వారి తరుపున ఇవి పనిచేశాయి. 19వ శతాబ్దం ద్వితీయార్థంలో భారతదేశంలో రైలు మార్గాల నిర్మాణం చేపట్టిన కాలంలో ఇంగ్లండు నుండి పెట్టుబడి ప్రవాహంలా వచ్చి పడడం ప్రారంభమయింది. 1850 తరువాత భారతదేశంలో విదేశీ పెట్టుబడి ఆర్థిక పరమైన మార్పుని వేగవంతం చేసింది.

**ధ్వంసమైన సాంప్రదాయ స్వయం సమృద్ధి గ్రామీణ ఆర్థిక విధానం:**

మరొక ముఖ్యమైనపరిణామం భారతదేశంలో సాంప్రదాయ స్వయం ప్రతిపత్తి గల స్వయం సమృద్ధి గ్రామీణ ఆర్థిక విధానం ధ్వంస మయింది. రోడ్లు, రైల్వేలు లాంటి సమాచార రవాణా సౌకర్యాల అభివృద్ధితో గ్రామాలు వేటికవి ఉండే పరిస్థితి మారింది. 1818 విజయం తరువాత బ్రిటిషు వారు భారతదేశంలో కేంద్రీకృత పాలనా వ్యవస్థని స్థాపించారు. ఈ నూతన పాలనా విధానం గతంలో గ్రామ పంచాయతీలు నిర్వహించే గ్రామ పాలనా బాధ్యతలను స్వాధీనం చేసికొని గ్రామీణ పాలనా స్వయం ప్రతిపత్తిని బలహీన పరచాయి. గ్రామాధికారుల విధులు బాధ్యతలపై తాలూకా, జిల్లా కేంద్రాల పర్యవేక్షణ ప్రారంభమయింది. గ్రామాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు ఏర్పరచబడ్డాయి. గ్రామాలలో ఉత్సాహవంతులు, పరిస్థితుల ఒత్తిడి రీత్యా కొత్తగా అభివృద్ధి చెందుతున్న ఫ్యాక్టరీలు, గనులు, ప్లాంటేషన్లు రైలు మార్గాల నిర్మాణం లాంటి వాటిలో ఉపాధి వెతుక్కుంటు గ్రామాలు వదలివెళ్ళారు.

**సామాజిక సంస్థలలో, వైఖరులలో, విలువలలో మార్పులు:**

బ్రిటిషు పాలన భారతీయసామాజిక చట్రంలో భారతీయుల వైఖరులలో, విలువలలో కొన్ని ప్రాథమిక మైన మార్పులు తీసుకొని వచ్చింది. ఉదాహరణకు భారతదేశ గ్రామాలలో

ఉమ్మడి కుటుంబ విధానం సువ్యవస్థితమైఉంది. దగ్గరి బంధువులంతా ఒకే ఇంటిలో వుండేవారు. వారి ఆస్తి ప్రత్యేకించి (భూమి) సమిష్టిగా వుండేది. ఒకే వంట గది వారందరిది. ఉమ్మడి కుటుంబం వలన పెద్ద ఎత్తున వ్యవసాయం, వృద్ధులకు, బిడ్డలకు, వికలాంగులకు ఆర్థిక రక్షణ, ఆస్తిపాస్తుల సంరక్షణ లాంటి కొన్ని ప్రయోజనాలు వుండేవి. కాని ఈ పద్ధతి వ్యక్తి చొరవకి, అభివృద్ధికి ఆటంకంగా ఉండేవి. గ్రామాలు, పట్టణాలు, నగరాలతో అనుసంధానం చేయబడడం కుటుంబంలోని కొంత మంది ప్యాక్టరీలలో, రైల్వేలలో, గనులలో పనులు వెదుక్కుంటూ పట్టణాలకు వలస పోవడం సహజంగా ఉమ్మడి కుటుంబ వ్యవస్థని క్రమంగా విచ్ఛిన్నం చేశాయి. పట్టణ ప్రభావం, 1833 తరువాత ఇంగ్లీషు విద్యని ప్రవేశపెట్టడంతో ప్రోత్సహించబడిన వ్యక్తిగత ధోరణలు, ఇంగ్లీషు న్యాయ వ్యవస్థని ప్రవేశపెట్టడం, వగైరాలు ఉమ్మడి కుటుంబ వ్యవస్థని విచ్ఛిన్నం చేశాయి.

## సంపద తరలింపు

### చారిత్రక పూర్వరంగం

ఇంగ్లండు భారత దేశాన్ని దాదాపు 200 సంవత్సరాలు పాలించింది. బ్రిటిషు పాలన శాంతి భద్రతలు నెలకొల్పింది. ఇది అన్ని రంగాలలో విజయాలు సాధించడానికి ప్రాతిపదిక అయింది. అందుకు భారతదేశం ఎంతో మూల్యాన్ని చెల్లించవలసి వచ్చింది. బ్రిటిషు పాలన భారతదేశంలో సమృద్ధి మధ్య పేదరికాన్ని సువ్యవస్థితం చేసింది. ప్రజల్ని కట్టెలు కొట్టేవాళ్ళు, నీళ్ళు మోసేవారిగా చేసింది. భారత వనరుల్ని సంపదని బ్రిటిషువారు పీల్చిన విధానాన్ని దాదాభాయ్ నౌరోజీ, యితరులు ఆర్థిక తరలింపు (Economic Drain) అన్నారు.

భారత జాతీయవాద మేధావులు, ప్రధానంగా భారతదేశంలో పేదరికానికి ముఖ్య కారణాలను విశ్లేషించేందుకు తరలింపు సిద్ధాంతాన్ని (The Theory of Drain) అభివృద్ధి పరచారు. ఇంగ్లాండుకి తరలింపబడిన దిగుమతులకు మించిన అదనపు ఎగుమతుల్ని తరలింపు (Drain) అన్నారు. ఈ వాదంలోని సారాంశం ఏమంటే భారతజాతీయ సంపదలోని గణనీయమైన భాగం ఎలాంటి ప్రతిఫలం లేకుండా ఇంగ్లాండునకు తరలింపబడింది. తరలింపు వలస పాలన విధానం. భారతదేశం నుండి ఇంగ్లాండునకు వనరులను ఏమి చెల్లించకుండా గాని లేక సరియైన నిష్పత్తిలో గాక నామమాత్రంగా చెల్లించిగాని రవాణా చేసికొనడాన్ని వనరుల తరలింపు అన్నారు. దాదాభాయ్ నౌరోజీ తన 'Poverty and un-British Rule in India (1871) అనే గ్రంథంలో వనరుల తరలింపును వివరించారు. ఆయన ఈ గ్రంథంలో తరలింపునకు కారణాలు, తరలింపబడుతున్న మొత్తం, తరలింపు ఫలితాలను వివరించే ప్రయత్నం చేశారు. భారతదేశంలో పేదరికం పెరుగుదలకు ఈ వనరుల తరలింపు ప్రధాన కారణమని నిరూపించ ప్రయత్నించాడు.

**తరలింపు రూపాలు:**

దాదాభాయ్ నౌరోజీ ననుసరించి ఈ క్రింద పేర్కొనబడినవి తరలింపు రూపాలుగా గుర్తించవచ్చు. ఇంగ్లీషు వారు తమ కుటుంబ ఖర్చులకు, పిల్లల చదువులకు ఇంగ్లండుకు చేస్తున్న చెల్లింపులు (వలస వాద ప్రభుత్వ విధానం). కంపెనీ ఉద్యోగుల పొదుపు మొత్తాల చెల్లింపులు, బ్రిటిషు ఉద్యోగులు ఇంగ్లండు వస్తువులకు ఇంగ్లండులో గాని, భారతదేశంలోగాని చేస్తున్న చెల్లింపులు, ఇంగ్లండులో ఉత్పత్తి అయిన వస్తువులను ప్రభుత్వ కొనుగోళ్లు, బ్రిటిషు ప్రభుత్వం నుండి తెచ్చిన మొత్తాలకు వడ్డీలు లాంటివి. భారత ఇంగ్లాండుల మధ్య రాజకీయ, పాలనా పరమైన, వాణిజ్య పరమైన సంబంధాలు ఏర్పడబడ్డాయి గనుక భారతదేశ ప్రభుత్వం పెద్ద మొత్తాలను ఇంగ్లీషు ప్రజలకు చెల్లించాలి. ఈ చెల్లింపులకు ముద్దుగా "హోం ఛార్జీలు" అని పేరు పెట్టారు. అవి: ఇంగ్లండు ఎక్కువ రేట్లకు యిచ్చిన అప్పులపై వడ్డీలు, రైలు మార్గాలు,నీటి పారుదల పనులకు వార్షిక చెల్లింపులు, సివిల్ డిపార్టుమెంటులో పనిచేస్తున్న ఇంగ్లీషువారికి చేసే చెల్లింపులు, భారతదేశంలో పనిచేసి రిటైరయిన అధికారులకు, లేక ఇంగ్లాండులో వుండి భారతదేశం కొరకు పని చేసి అక్కడే రిటైరయిన ఉద్యోగులకు పెన్షన్ల చెల్లింపులు,సైన్యం, నావికాదళాలలో పనిచేసి రిటైరయిన ఉద్యోగుల పెన్షన్ల చెల్లింపులు.

**తరలింపు మొత్తంపై అంచనా:**

భారతదేశంలో బ్రిటిషు పాలనా కాలంలో తరలించబడిన బంగారం వస్తువుల విలువ కట్టడం సాధ్యపడదు. కొందరు రచయితలు ఇచ్చిన గణాంక వివరాలను బట్టి సుమారుగా ఒక అంచనాకి రావచ్చు. ప్లాసీ యుద్ధం తరువాత కేవలం 5 సంవత్సరాలలో 4,941,611 స్టెర్లింగ్ పౌండ్లు విలువ గల బంగారం వస్తువులు దేశం నుండి తరలించబడ్డాయని వెరెస్ట్ అంచనా వేశారు. 1757, 1780 సంవత్సరాలలో కేవలం బెంగాల్ నుండి తరలింపబడిన వనరులు 38మిలియన్ల పౌండ్లని జె.సి. సిన్హా పేర్కొన్నారు. లభ్యమైన సమాచారాన్ని బట్టి భారతదేశ ఆదాయంలో నాల్గవ వంతు కేవలం "హోం ఛార్జీల" క్రింద తరలించబడింది. తరలింపుని లెక్క గట్టేందుకు వివిధ రచయితలు వివిధ పద్ధతులు అనుసరించారు గనుక వీరి అంచనాలలో తేడాలు ఉండవచ్చు. అంతేగాక భారతదేశ ఎగుమతుల మిగుళ్ళు ప్రతి సంవత్సరం పెరిగాయి.

**భూమిశిస్తు నిర్ధారణలు**

**జమిందారీ విధానం లేక శాశ్వత కౌలు విధానం:**

లార్డ్ కారన్ వాలీసు బెంగాల్‌లో శాశ్వత భూమిశిస్తు విధానాన్ని 1793లో ప్రవేశపెట్టాడు. జాన్ కంపెనీ 1765లో దివానీ హక్కుల్ని పొందిన తరువాత శాశ్వత శిస్తు విధానం ప్రవేశపెట్టాలనే ఆలోచన ఉన్నప్పటికి దాదాపు రెండున్నర దశాబ్దాల వరకు భూమి శిస్తు వార్షికంగా నిర్ణయించబడుతూ వచ్చింది. కాని 1790 ఫిబ్రవరి 10వ తేదీన గవర్నరు

జనరల్ 10 సంవత్సరాలకు శిస్తు విధానాన్ని ప్రకటించాడు. శాశ్వత కౌలు విధానం, బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదం పొందిన తరువాత ప్రకటించవలసి వచ్చింది. మూడు సంవత్సరాల తరువాత బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదం తరువాత శాశ్వత కౌలు విధానం 1793 మార్చి 22 నుండి అమలులోకి వచ్చింది. దీనినే కారన్‌వాలీస్ కౌలువిధానం లేక జమిందారీ విధానం, శాశ్వత కౌలు విధానమంటారు.

ఈ విధానాన్ని అనుసరించి జమిందారులు భూమి యజమానులుగా గుర్తించబడ్డారు. భూమి శిస్తు నిర్ణయించబడింది. జమిందారులు బకాయిలు చెల్లించడంలో మినహాయింపులు, తగ్గింపులు వుండవు. నిర్ణీత కాలంలో చెల్లించాలి. ఈ విధానం వలన ప్రభుత్వానికి శాశ్వతాదాయం వస్తుందని, బంజరు భూములు సాగులోకి వస్తాయని, ప్రభుత్వానికి శ్రమ, కాలం వృధా కావని కారన్‌వాలీసు వాదించాడు. ఈ విధానం జమిందారులకు వారసత్వ హక్కులు కల్పించి వ్యవసాయదారుల ప్రయోజనాలను పట్టించుకోలేదు. వ్యవసాయ దారులు జమిందారుల దయాదాక్షిణ్యాలకు వదిలివేయబడ్డారు. జమిందారులు రైతుల్ని పీల్చి పిప్పి చేసి తమ బొక్కసాలు నింపుకొన్నారు.

గవర్నర్ జనరల్ అభిప్రాయాన్ని ఆయన సలహాదారులైన జాన్‌షోర్, చార్లెస్ గ్రాంట్‌తో సహా పలువురు వ్యతిరేకించారు. శాశ్వత శిస్తు విధానం నిర్ణయించడానికి ముందుగా సరియైన సర్వే జరపాలని కోరారు. రికార్డులను అధ్యయనం చేయకుండా జమిందారులకు యాజమాన్య హక్కులు కల్పించడంపై సందేహాలు వ్యక్తం చేశారు. కారన్‌వాలీస్ తరువాత షోర్ గవర్నరు జనరల్ అయ్యాడు. ఆవిధానం వలన వచ్చిన దుష్ఫలితాలను స్వయంగా చూశాడు.

ఈ విధానం తీసుకొని వచ్చిన మార్పులు సామాజిక అలజడికి దారితీశాయి. రైతుల హక్కులకు వాటిల్లిన నష్టం, ఉపకౌలుదారులు (Sub-infeudation), పాతకొత్త యాజమాన్యాల మధ్య ఘర్షణలు, అమ్మకం చట్టాల ఒత్తిడి, తగినన్ని కోర్టులు తగినంత మంది పోలీసులు లేకపోవడం, ముఖ్యమైన అధికారాల నుండి స్థానికుల తొలగింపు, వర్తక వాణిజ్యాలు, పరిశ్రమలు తగ్గడం లాంటివి తీవ్ర ఉద్రిక్త అస్థిర సాంఘిక వాతావరణానికి దారితీశాయి. ఈ వాతావరణంలో జమీందారులు ప్రభుత్వం ఆశించిన అభివృద్ధికి సంకేతాలుగా నిలువలేక పోయారు. చివరకు నిరంకుశులుగా తయారయ్యారు.

కారన్ వాలీస్ శిస్తు పెంచటాన్ని చట్ట బద్ధం చేశాడు. నిక్కచ్చిగా, కఠినంగా వసూలు చేయించాడు. అతడి ఆలోచనలు బ్రిటిషు పాలక వర్గాల తక్షణ ప్రయోజనాలకు, బెంగాల్ సామాజిక వాస్తవాలపై తప్పుడు అంచనాలకు ప్రాతినిధ్యం వహించాయి. ఎక్కువ మొత్తాలు గుంజడానికి చేసిన ప్రయత్నాలు భవిష్యత్తులో రానున్న ప్రభుత్వాదాయానికి గండి కొట్టాయి.

**రైత్వారీ విధానం:**

కారన్ వాలీస్ బెంగాల్‌లో శాశ్వత భూమిశిస్తు విధానం ప్రవేశపెట్టిన కొద్దికాలానికే కంపెనీ అధీనంలోకి వచ్చిన యితర ప్రాంతాలకు వర్తింపచేయాలా? వద్దా? అనే సమస్య వచ్చింది. మూడవ మైసూరు యుద్ధంలో టిప్పుసుల్తాన్ నుండి కైవశం చేసుకొన్న బారామహల్,

దిండిగల్‌లు, 1794లో జాగీరుగా పొందిన ఉత్తర సర్కారులు ఈ సమస్యని ముందుకు తెచ్చాయి. 1799లో తంజావూర్, కోయంబత్తూర్‌లు, 1801లో మలబారు ఆర్కాటు నవాబు రాజ్యం, మద్రాసు ప్రెసిడెన్సీలో కలిపివేయబడ్డాయి. ఈప్రాంతాలలో భూమిశిస్తు నిర్ణయంతో సంబంధం వున్న మొదటి అధికారులు అలెగ్జాండర్ రీడ్, లియోనల్ ప్లేస్. థామస్ మన్రో. రీడ్‌కు సహాయకులుగా పనిచేసిన వారిలో ఒకడు. ఆయన 1800లో కనరా నుండి హైదరాబాద్ నిజాంచే కంపెనీకి దారాదత్తం చేయబడిన దక్కన్ జిల్లాలకు బదిలీ చేయబడ్డాడు.

ఈ అధికారులు సంక్లిష్టమైన భూమిశిస్తు సమస్యలతో తలమునకలై వుండగా గవర్నరు జనరల్ వెల్లస్లీ బెంగాల్‌లో అమలు జరిపిన శాశ్వత శిస్తు విధానాన్ని మద్రాసులో కొత్తగా కలుపబడిన ప్రాంతాలకు వర్తింపచేయాలని ఆదేశాలు జారీచేశాడు. కాని పరిస్థితులను అధ్యయనం చేసిన మన్రో ఆయన సహాయకులు బెంగాల్ విధానాన్ని విమర్శించారు. అప్పటి మద్రాసు గవర్నరు విలియం బెంటింక్ (1803-07) ఈ వాదనలోని సమంజసత్వాన్ని గ్రహించాడు. జమీందారీ విధానం అమలును ఆపివేయవలసిందిగా ఆదేశించాడు. ఆ తరువాత (1808లో) రైత్వారీ విధానంతో పాటు గ్రామ పంచాయతీలతో ప్రయోగాలు సాగించేందుకు అనుమతివ్వబడింది.

రైత్వారీ విధానానికి మన్రో గట్టి మద్దతుదారు. తంజావూరులో పొందిన అనుభవంతో హోడ్సన్ దృష్టి పంచాయతీలపై పడింది. 1808-09లో రైత్వారీ పద్ధతి ప్రయోగపూర్వకంగా అమలు జరపబడింది. గ్రామాల వసూళ్ళు అనుకూలంగా లేవు.

1818 నాటికి మద్రాసు ప్రావెన్స్‌లో జమిందారుల పాలెగాళ్ళ అణచివేత, న్యాయ నిర్ణయానికి కోర్టుల స్థాపన - రెవెన్యూ విధానంలో మెరుగుదల సాధించబడింది. 1820మేలో మన్రో గవర్నరు కాగానే అప్పటికే శాశ్వత కౌలు విధానం అమలులో ఉన్న ప్రాంతాలలో తప్ప రైత్వారీ విధానం అమలులోనికి వచ్చినట్లు ప్రకటించబడింది.

మన్రో విధానాన్ని అనుసరించి భూమి శిస్తు శాశ్వతంగా నిర్ణయించబడుతుంది. రైతు తనకు కేటాయించిన పొలాన్ని సాగు చేసికొనవచ్చు. శిస్తు ఎక్కువని భావిస్తే మానుకోవచ్చు. శిస్తు అంచనా వేయబడిన ఉత్పత్తిలో సగం నుండి మూడవ వంతుకు తగ్గించబడింది.

దీనిలో మరి రెండు అంశాలు ఇమిడి వున్నాయి. మొదటిది పంట దిగుబడి ధరలతో సంబంధం లేకుండా రైతు నిర్ణీత మొత్తం చెల్లించాలి. రెండవది వాయువ్య రాష్ట్రాలవలే శిస్తుని నిర్ణయించేది స్థానిక సంస్థలు కాదు. తక్కువ జీతాలు పొందే ఏజంట్లు. ఈ ఏజెంట్లు అణచివేత పద్ధతులు అవలంబించేవారు. రైతుల నుండి అక్రమ వసూళ్ళు చేసేవారు. మన్రో తన ఏడు సంవత్సరాల పాలనా కాలంలో యిలాంటి అక్రమాలపై గట్టి తనిఖీచర్యలు చేపట్టాడు.

బొంబాయి ప్రాంతంలో మొదట మరాఠాల పద్ధతి అనుసరించబడింది. జిల్లాలు మొదట దేశాయ్‌లకు, ఆ తరువాత గ్రామాల పటేళ్ళకు అప్పజెప్పబడ్డాయి. కలెక్టరు లేక అతని ఏజెంటు మామ్లత్‌దార్, లేక కమవిశ్‌దార్, దేశాయ్‌ల నుంచి వసూళ్ళ బాధ్యత చేపట్టారు. దేశాయ్‌లు సక్రమంగా చెల్లించినంత వరకు వారి పద్ధతులలో జోక్యం చేసుకొనే వారు కాదు. కాని 1819 తరువాత రైత్వారీ పద్ధతి ప్రవేశపెట్టబడింది. బొంబాయి ప్రభుత్వంచే

నియమింపబడిన గ్రామాధికారులకు శిస్తు వసూలు బాధ్యతలు అప్పజెప్పబడ్డాయి. మద్రాసు, బొంబాయి, (సింధ్‌తో సహా) ప్రెసిడెన్సీలతో పాటు రైత్వారీ పద్ధతి స్థానిక అవసరాల మేరకు చేయబడిన మార్పులతో బెరార్, అస్సాం, బర్మా, కూర్గులలో అమలు జరపబడింది.

**మహల్వారీ పద్ధతి:**

జయించిన, ఆక్రమించిన ప్రాంతాలలో భూమిశిస్తు సమస్య 19వ శతాబ్దపు ప్రారంభ సంవత్సరాలలో ముందుకు వచ్చింది. బోర్డ్ ఆఫ్ కమీషనర్ల సిఫార్సు ప్రాతిపదికగా 1819లో హోల్ట్‌మెకంజీ ఆదేశాలను రూపొందించాడు. వీటిని అనుసరించి క్రమబద్ధమైన సర్వే విచారణ జరిపిన మీదట గ్రామ సభలతో శిస్తు నిర్ణయం జరగాలి. భూమిపై హక్కులకు సంబంధించిన రికార్డు నిర్వహించబడాలి. గ్రామ కమిటీలకు గ్రామ పెద్ద (లంబార్‌దార్) బాధ్యత వహించాలి. అతడి పేరు కలెక్టరు రిజిష్టరులో నమోదై వుండాలి. గ్రామం తరుపున శిస్తు చెల్లించే పూచీ అతడిది.

1821లో బెంగాలీ పద్ధతి త్రోసి పుచ్చబడింది. కొత్త శిస్తు విధానానికి మెకంజీ సూచనలు ప్రాతిపదిక అయ్యాయి. భూమిశిస్తు అంత ఎక్కువ మరీ తక్కువ కాకుండా మధ్యస్తంగా నిర్ణయించాలన్నాడు మెకంజీ. భూస్వాములు, పెద్ద రైతులు వున్న చోట వారితో భూమిశిస్తు నిర్ణయం జరగాలన్నాడు. గ్రామానికి ఉమ్మడి కౌలు విధానం వున్నచోట గ్రామ పెద్దలతో నిర్ణయం జరగాలన్నాడు. భూమిపై జమిందారులకు, తాలూకాదార్లకు హక్కులున్నట్లైతే వారికి ప్రభుత్వం నష్టపరిహారం యివ్వాలన్నాడు. తరువాత ఆ మొత్తాన్ని గ్రామ జమీందారుల నుండి వసూలు చేయాలి. భూమిశిస్తు గ్రామానికి, గ్రామానికి, ఎస్టేటుకు, ఎస్టేటుకు నిర్ణయించాలి. ఎస్టేటును మహల్ అంటారు. కనుక ఈ పద్ధతికి మహల్వారీ పద్ధతి అనే పేరు వచ్చింది. మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో వ్యవసాయ పెట్టుబడి, కూలి ఖర్చులు మినహాయించి మిగిలిన ఉత్పత్తిని ప్రాతిపదికగా చేసుకొని భూమిశిస్తు నిర్ణయించాలి.

1822 విధానంలోని ఏడవ రెగ్యులేషన్, సెటిల్‌మెంట్ విఫలమయింది. పట్టాలు మంజూరు చేయడానికి అవసరమైన దర్యాప్తులో పురోగతి లేకపోవడమే దీనికి కారణం. ఆయా భూముల ఉత్పత్తికి సంబంధించి వివరమైన పరిశీలన సాధ్యం కాలేదు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన వాటా 80 శాతం అంతకుమించి నిర్ధారించడం చాల ఎక్కువగా ఉండటమే కాకుండా, ఆచరణ సాధ్యమయ్యేది కూడ కాదు. విలియం బెంటింక్ 1833లో ప్రవేశపెట్టిన రెగ్యులేషన్ తొమ్మిది, ఉత్తర భారత దేశంలో ల్యాండ్ సెటిల్ మెంట్‌కు నిజమైన ప్రాతిపదికగా పనిచేసింది. అంతేకాకుండా ప్రభుత్వ వాటా స్థూల కౌలులో మూడింట రెండు వంతులుగా తగ్గించబడింది. ఈ సెటిల్‌మెంట్ 30 ఏళ్లకు పూర్తవుతుంది. వాయవ్య రాష్ట్రాల లెఫ్టినెంట్ గవర్నర్ ఆర్ఎం బర్డ్ ఈ సెటిల్‌మెంట్‌ను అమలు చేశాడు. ఆయనను 'ఉత్తర భారత దేశపు ల్యాండ్ సెటిల్‌మెంట్ పితామహుడు'గా పరిగణిస్తారు. ఆ తర్వాత ఇదే విధానం మధ్య రాష్ట్రాలలోను, పంజాబులోను, ఇంకా ఇతర ప్రాంతాలలోను ప్రవేశపెట్టబడింది.

## పారిశ్రామికీకరణ విచ్ఛిన్నత

### చేతివృత్తుల రకాలు:

వివిధ వస్తువులను తయారుచేసే పలు రకాల హస్తకళలు (Handi craft) భారతదేశమంతటా వ్యాపించియున్నాయి. వాటిని ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు. గ్రామీణ ప్రజల దైనందిన అవసరాలను తీర్చే వస్తువుల్ని తయారుచేసే గ్రామీణ చేతివృత్తులు, పట్టణ ప్రజల అవసరాలు తీర్చే పట్టణ చేతివృత్తులు. ఈ వస్తువుల తయారీ ఒక ఇంటిలో, కుటుంబ సభ్యుల సహకారాలతో కొంత మంది కూలీలను పెట్టుకొని జరుగుతుంది. పట్టణ చేతివృత్తులు మరి కొంత విస్తృత స్థాయిలో నిపుణత గల పనివారిని నియమించి నిర్వహించబడేవి. ఈ చేతివృత్తులతో ఒక మేరకు పనివిభజన నిపుణతలుండేవి. వీరుడక్కా మస్లిన్లు, షాల్స్, లోహ వస్తువులు, కొయ్యలపై లోహాలపై చెక్కడాలు – లాంటి అత్యంత స్థాయీ పనితనం గల విలాస వస్తువుల్ని, అర్ధవిలాస వస్తువుల్ని, తయారుచేసేవారు. 19వ శతాబ్దంలో భారత చేతివృత్తుల పతనాన్ని గురించి ప్రస్తావించేటప్పుడు మనం సాధారణంగా ఈ మూడవ తరహా అంటే విలాస వస్తువుల్ని, అర్ధవిలాస వస్తువుల్ని తయారుచేసే వారిని గురించి ప్రస్తావిస్తుంటాం.

### వర్తక విధానం, భారతదేశ దిగుమతులపై ఆంక్షలు :

పట్టణ చేతివృత్తులను ప్రోత్సహించి ఈస్టిండియా కంపెనీ తొలుత భారతదేశం నుండి ఇంగ్లండుకు యితర యూరప్ దేశాలకు విలాస, అర్ధవిలాస వస్తువుల ఎగుమతులు చేయడం ప్రారంభించింది.

ఆ తరువాత బ్రిటన్ ప్రభుత్వం ఈ వస్తువుల దిగుమతులపై ఆంక్షలు విధించింది. బ్రిటిషు వస్త్ర పరిశ్రమని ప్రోత్సహించేందుకు 17వ శతాబ్దం ప్రారంభం నుండి నూలు, సిల్కు వస్తువుల దిగుమతులపై షరతులు విధించబడ్డాయి.

### తగ్గుముఖం పట్టిన ఆదరణ :

బ్రిటిషు వారి రాక ముందు హస్త కళలకు, చేతివృత్తులకు నవాబులు, రాజాలు ప్రోత్సహకులుగా వుండేవారు. బ్రిటిషువారి విజయ పరంపరలతో నవాబులు, రాజాలు అధికారం కోల్పోయారు. దానితో విలాస వస్తువుల గిరాకీ తగ్గింది. హస్తకళలు, చేతి వృత్తులకు ప్రత్యేకించి రాజదర్బారులకు అనుబంధంగా వుండే అత్యంత నిపుణులతో కూడిన హస్తకళలకు ఆదరణ కరువైంది. అత్యంత నిపుణతతో విలాస వస్తువుల తయారీ ఆగిపోయింది. రాజ దర్బారులు అంతరించినప్పటికీ యితర వస్తువులకు గిరాకీ కొంత కాలం పాటు కొనసాగింది. కాని క్రమంగా క్షీణదశ పట్టింది.

**నూతన విద్యా వర్గాలు - మారిన అవసరాలు:**

రాజులు, నవాబుల స్థానంలో బ్రిటిషు అధికారులు, కొత్తగా విద్యావంతులైన బ్రిటిషు యజమానుల్ని గ్రుడ్డిగా అనుకరించయత్నించే భారత బూర్జువా వర్గం వచ్చింది. ఈ నూతనవర్గం ఆవిర్భావంతో కొత్త అవసరాలు ముందుకు వచ్చాయి. ఈ వర్గం నగిషీలు చెక్కిన హస్తకళల్ని పట్టించుకొనలేదు. చౌకగా వచ్చే విలాస వస్తువులతో తృప్తి చెందారు. సహజంగా యిది చౌక వస్తువుల తయారీకి, తరచుగా కల్తీ వస్తువుల తయారీకి, తక్కువ నైపుణ్యం గల వస్తువుల తయారీకి దారితీసింది. అంతేగాక బ్రిటిష్‌వారి పాలనతో పాటు ప్రత్యేకించి భారతీయ విద్యావంతులలో నూతన వస్త్రధారణ గృహోపకరణాలు – లాంటి వాటి కొత్త ఫ్యాషన్లు ప్రవేశించి ప్రజాదరణ పొందాయి. ఇవన్నీ పట్టణ హస్తకళలు, చేతివృత్తులపై వాటిలో పనిచేసే నిపుణులపై ప్రతికూల ప్రభావం చూపాయి.

**ఇంగ్లండు నుండి ఫ్యాక్టరీ వస్తువుల దిగుమతి:**

19వ శతాబ్దంలో ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవం వేగం పుంజుకోవడంతో తొలుత ఇంగ్లండులో ఆ తరువాత భారతదేశంలో రవాణా సాధనాలు అభివృద్ధితో స్వేచ్ఛా వాణిజ్య విధానం అమలుతో ఇంగ్లండు ఫ్యాక్టరీలలో తయారైన వస్తువులు భారతదేశ మార్కెట్టులోకి కుప్పలు తెప్పలుగా వచ్చి పడడం ప్రారంభమయింది. అవి నాణ్యమైనవి గాక పోయినప్పటికి చౌకగా లభించాయి. పట్టణ ప్రజలు అప్పటికే నాణ్యత గురించి పట్టించుకోవడం మానేశారు.

**స్వేచ్ఛా వాణిజ్య విధానం:**

19వ శతాబ్దం ప్రారంభం నుండి ఇంగ్లాండు భారతదేశంపై బలవంతంగా రుద్దిన స్వేచ్ఛా వాణిజ్య విధానం ఎలాంటి పన్నులు విధించబడకుండా ఇంగ్లీషు వస్తువులు, భారతదేశ మార్కెట్లలో ప్రవేశించడానికి తోడ్పడింది. అప్పుడు భారతదేశ హస్తకళలకు చేతివృత్తులకు రక్షణ కల్పించేందుకు భారతదేశ ప్రభుత్వం ఇంగ్లండు దిగుమతులపై చాలా ఎక్కువ దిగుమతి సుంకాలు విధించి యుండవలసింది. చేతి వృత్తులకు, హస్తకళలకు ఆర్థిక సహాయం చేసి వుండవలసింది. కాని ప్రభుత్వం అలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. అంతేకాక సరుకుల రవాణాకి అతి తక్కువ రైలుఛార్జీలు వసూలు చేసింది. ఆ పరిస్థితులలో చేతివృత్తుల తయారి వస్తువులు ఇంగ్లండు ప్యాక్టరీలలో తయారైన చౌకవస్తువులతో పోటీలో నిలబడలేకపోయాయి.

**సంస్థాగతమైన బలహీనత:**

భారతదేశ చేతివృత్తుల వారి సంస్థాగతమైన బలహీనత కూడ వారి క్షీణతకు దారితీసింది. కొత్త సవాళ్ళను ఎదుర్కొనడానికి వారు సంఘటిత పడలేదు. నూతన ఉత్పత్తి పద్ధతులను చేపట్టలేకపోయారు. అంతేగాక భారతదేశంలో ప్రవేశపెట్టబడిన విదేశీ పాలన, ఇంగ్లీషు చట్టాలు కూడా చేతివృత్తుల వారి గిల్డు నిర్మాణాన్ని బలహీన పరచాయి.

## పారిశ్రామికీకరణ విచ్ఛిన్నతా క్రమం

19వ శతాబ్దంలో కొత్తగా ప్యాక్టరీలు, గనులు, ప్రారంభించబడినప్పటికి పరిశ్రమలపై ఆధారపడే ప్రజల నిష్పత్తి తగ్గింది. పరిశ్రమలపై జీవనం సాగించే ప్రజలనిష్పత్తి తగ్గింది. పరిశ్రమలపై జీవనం సాగించే ప్రజల నిష్పత్తి 1809లో 18.6 శాతం వుండగా 1901కి 8.5 శాతానికి పడిపోయింది. ఈ తరుగుదలకు బీహారులోని గంగా మైదాన ప్రాంతం జిల్లాలలోని నూలు వడికేవారు నేతనేసేవారు ఉపాధి కోల్పోవడం ప్రధాన కారణం.

## వ్యవసాయ వ్యాపారీకరణ:

### కారణాలు:

వలస పాలనకు ముందు భారతదేశ వ్యవసాయం స్వయం సమృద్ధి స్వభావం గలది. గ్రామాలకు అవసరమైన ఆహార ధాన్యాలు పండించేది. స్థానిక చేతి మగ్గాలకు సరిపడా ప్రత్తి, జనుము పండించబడేది. కాని బ్రిటిషు పాలన సృష్టించిన పరిస్థితులు వాణిజ్య వ్యవసాయాన్ని ప్రోత్సహించాయి. 1869లో సూయజ్ కాలువ తెరవబడడంతో భారతదేశంలో ఇంగ్లండుకు గల దూరం 3000 మైళ్లకు పైగా తగ్గింది. పారిశ్రామికీకరణ ముడి సరకునకు డిమాండ్ సృష్టించింది. రవాణా సౌకర్యాలు ముఖ్యంగా రైలు మార్గాలను మెరుగు పరచుట ద్వారా అలాంటి పంటలు పండించేందుకు అవసరమైన నిపుణుల్ని అందచేయడం ద్వారా ప్రత్తి, జనుము, పొగాకు, చెరకు, నీలిమందు, టీ, కాఫీ, పాపీ లాంటి వాణిజ్య పంటల పెరుగుదలకు బ్రిటిషువారు అవసరమైన ప్రోత్సాహం యిచ్చారు.

బ్రిటిషువారు ముడి వనరుల్ని, ఆహార ధాన్యాల్ని వ్యాపార పరం చేయగా భారతీయ రైతు తన శిస్తుల్ని, అప్పుల్ని వడ్డీలను డబ్బు రూపంలో చెల్లించేందుకు వాణిజ్య పంటల్ని పండించారు.

## వ్యాపారీకరణ ప్రభావం:

వ్యవసాయ వ్యాపారీకరణ నుండి ఒక సానుకూల అంశం అభివృద్ధి చెందింది. వ్యవసాయ ఉత్పత్తులతో వ్యాపారం ప్రారంభమయింది. ఇక మీదట ఏ గ్రామంగాని, ఏ ప్రాంతంగాని ఆహార ధాన్యాల, యితర జీవితావసరాల విషయంలో స్వయం సమృద్ధిపై ఆధారపడవలసిన పనిలేదు. గ్రామీణ స్వయం సమృద్ధి విచ్ఛిన్నం చేయబడింది. మరో వైపు వ్యవసాయ వ్యాపారీకరణ వలన వినాశకర ఫలితాలు చాలా వచ్చాయి. రైతు అంతర్జాతీయ ధరల అస్థిర పరిస్థితిపై ఆధారపడవలసి వచ్చింది. ఉదాహరణకు తొలుత 1860వ శతాబ్దంలో విపరీతంగా పెరిగిన బొంబాయి ప్రత్తి ధర అమెరికా అంతర్యుద్ధం సమాప్తమై అమెరికా ఉత్పత్తులు మామూలు స్థాయికి చేరుకోగానే ఒక్కసారిగా పడిపోయింది.

భారతదేశ వ్యవసాయోత్పత్తులకు విదేశి డిమాండ్ విపరీతంగా పెరిగినప్పటికి సాంకేతిక అభివృద్ధికి తగిన వనరులు కొరవడడంతో భారతరైతు తన వ్యవసాయాన్ని అభివృద్ధి

పరచలేకపోయాడు. నూతన పరిస్థితులలో రైతు వ్యవసాయ ప్రాంతాలను విస్తరించుకోలేదు. ఎకరానికి పండే పంటను పెంచుకోలేదు. గతంలో ఆహార ధాన్యాలు యితర పంటలు పండించే పొలంలో వ్యాపార పంటలు ఉత్పత్తి చేశాడు. ఇది వినాశకరమైన ఫలితాలకు దారితీసింది. వరుసగా కరువులు వచ్చిపడ్డాయి. భారతరైతు పట్ల వలసవాద వైఖరికి నల్లమందు వ్యవసాయం ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

భారతదేశంపై బ్రిటన్ పూర్తి ఆధిపత్యం సాధించిన తరువాత భారత ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలోభూమి, ఉప్పు నుండి వచ్చే ఆదాయం తరువాత స్థానం నల్లమందుది. ఇది మొత్తం ఆదాయంలో 10వ వంతుకు పైగా వుంది. భారతదేశంలో అతిసారవంతమైన పొలాల్లో నల్లమందు వ్యవసాయం సాగింది. సారవంతమైన పొలాల్లోనల్లమందు వ్యవసాయం కారణంగా ఆహార ధాన్యాల కొరత ఏర్పడింది. ఫలితంగా కరువులు, కాటకాలు సంభవించాయి. భారత చైనాల నల్లమందు వ్యాపారం విషయంలో భారత ప్రభుత్వం వైఖరి సమర్థించిన బ్రిటిషు రాజకీయ వేత్తలు అధిక జనాభా చైనాకి ప్రధాన సమస్య అని, భారతదేశం నుండి నల్లమందు దిగుబడి చేయబడకపోతే చైనా సారవంతమైన భూములలో ఆహార ధాన్యాలు, పప్పు ధాన్యాలకు బదులుగా నల్లమందు వ్యవసాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరి భారతదేశంలోని సారవంతమైన భూముల్ని నల్లమందు వ్యవసాయానికి మళ్ళించడం వలన భారతదేశంలో ఆహార ధాన్యాల పప్పుధాన్యాల దిగుబడుల కొరత కారణంగా కరువులు కాటకాలు వస్తాయని ఈ మేధావులు ఎందుకు గుర్తించలేకపోయారు.

### భారత రైల్వేల అభివృద్ధి:

భారతదేశంలో రైల్వేల అభివృద్ధిని ఐదు దశలుగా విభజించవచ్చు.

i) పాత గ్యారంటీ విధానం (1849–69)

ii) ప్రభుత్వ యాజమాన్యంలో నిర్మాణం (1869–1882)

iii) మార్పు చేయబడిన గ్యారంటీ విధానం (1882–1924)

iv) జాతీయీకరణ (1924–48)

v) ఏకీకరణ పునర్విభజన (1948–52)

### మొదటి దశ (1849-69)

మొదట 1845లో ప్రయోగాత్మకంగా మూడు మార్గాలు అనుమతించబడ్డాయి. ఈస్టిండియా రైలు మార్గం; కలకత్తా నుండి రాణిగంజి వరకు (120 మైళ్ళు). భారత ద్వీపకల్ప రైల్వే (The Great Indian Peninsular Railway) బొంబాయి నుండి కళ్యాణి వరకు (32 మైళ్లు), మద్రాసు రైల్వే :- మద్రాసు నుండి ఆర్కోణం (30 మైళ్లు). 1853లో లార్డ్ డల్హౌసీ ప్రకటనతో రైలు మార్గాల నిర్మాణం ప్రారంభమయింది. 1857 తిరుగుబాటుతో సమాచార రవాణా సౌకర్యాల ప్రాధాన్యతని గుర్తించిన బ్రిటిషు ప్రభుత్వం ఈ క్రమాన్ని వేగం చేసింది.

ఈ భారీ నిర్మాణాలకు విస్తృత స్థాయిలో ప్రైవేటు పెట్టుబడి ముందుకురాకపోవడంతో ఇంగ్లీషు కంపెనీల పెట్టుబడిపై వడ్డీకి ప్రభుత్వం చేత హామీ యిప్పించి కంపెనీ రైలు మార్గాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. 1857 సంవత్సరాంతానికి 5000 మైళ్ళ రైలు మార్గాల నిర్మాణం చేపడతామని 8 కంపెనీలు కాంట్రాక్టు పత్రాలపై సంతకాలు చేశాయి. రైలుమార్గాల కవసరమైన భూమిని సమకూర్చి ప్రభుత్వం పెట్టుబడికి పూచీపై 5 శాతం వడ్డీకి కూడా హామీ యిచ్చింది. లాభాలలో ప్రభుత్వానికి వాటా ఇచ్చేందుకు కంపెనీలు అంగీకరించాయి. ఒప్పందంలోని షరతుల ప్రకారం 25 సంవత్సరాల తరువాత కంపెనీలు రైలు మార్గాన్ని ప్రభుత్వానికి అమ్మివేయాలి. ఈ కాలంలో వాటిపనివిధానంపై ప్రభుత్వ అదుపు వుంటుంది. ఇక్కడ గమనించవలసిన అంశం రైలు మార్గాల యాజమాన్యం ప్రైవేటు కంపెనీలది. కనీస లాభాలకు ప్రభుత్వం హామీ యివ్వడం.

**రెండవ దశ (1869-82)**

రెండవ దశలో ప్రభుత్వం నిర్మాణం చేపట్టే విధానాన్ని బ్రిటన్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం అంగీకరించాయి. రైల్వేల నిర్మాణాన్ని యజమాన్యాన్ని ప్రభుత్వంచేపట్టాలని 1869లో జాన్ లారెన్స్ గట్టిగా సిఫార్సు చేశాడు. కాని నిర్మాణం నెమ్మదిగా సాగింది. 1869–91 కాలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో కేవలం 3297 మైళ్ళ రైలు మార్గం వేయబడింది. 1879 సంవత్సరాంతానికి వివిధ కంపెనీలు 6128 మైళ్ళ రైల్వే లైనులను నిర్మించాయి. ప్రభుత్వం 2175 మైళ్ళ రైల్వేలని నిర్మించింది.

**మూడవ దశ (1882-1924)**

అప్పటి వరకు పనిచేస్తున్న కంపెనీలు అత్యవసరమైన కొత్త రైలు మార్గాల నిర్మాణానికి పెట్టుబడి పెట్ట నిరాకరించడంతో కేంద్ర ప్రభుత్వం కొత్త వనరుల్ని అన్వేషించవలసి వచ్చింది. కేంద్రప్రభుత్వం ఉపశాఖల నిర్మాణం చేపట్టింది. నష్టాలకు రాష్ట్ర ప్రభుత్వాలు పూచీ పడాలని ఆదేశించింది. ఈ మార్పుచేయబడిన హామీ విధానం 1882–1924 కాలంలో అమలులో వుంది. ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు నిర్మాణాన్ని చేపట్టాలి. ప్రభుత్వం అత్యవసరమైన మార్గాలపై కేంద్రీకరించాలి. అంతే గాక భారతదేశ రాష్ట్రాలు, జిల్లా బోర్డులు, యితర స్థానిక సంస్థలు ఆయాప్రాంతాలలో ప్రత్యేకంగా గాని, ఏదైన ఏజన్సీ ద్వారా గాని రైలు మార్గాల నిర్మాణం నిర్వహణ ప్రోత్సహించాలి.

1923 మార్చి నాటికి భారతదేశంలో 37,618 మైళ్ళ రైలు మార్గాలు నిర్మించబడ్డాయి. దీనిలో 66% కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించాయి. కాని అత్యధికరైలు మార్గాలపై యాజమాన్యం ప్రైవేటు కంపెనీలది. మూడు ప్రధానమైన రైలు మార్గాలు: వాయువ్య, తూర్పు బెంగాల్, అవుధ్ రోహిల్ఖండ్; మరి రెండు చిన్న మార్గాలు జోర్హాట్, అడెన్రైలు మార్గాలు ప్రభుత్వ ప్రత్యక్ష అదుపు యాజమాన్యాలలో వున్నాయి. మిగిలిన వాటిపై యాజమాన్యం కంపెనీలది.

1900లో రైల్వేలు మొదటిసారిగా స్వల్ప లాభం ఆర్జించాయి. ఆ తరువాత సంవత్సరాలలో రైల్వే ఆదాయాలు త్వరితగతిని పెరిగాయి. 1918–19లో రైల్వేలు 10 మిలియన్లు ఆర్జించాయి. 1924–25లో మొదటిసారిగా రైల్వే పద్దులు సాధారణ బడ్జెటు నుండి వేరుచేయబడ్డాయి. 1901లో భారత రైల్వేల నిర్వహణ, పని విధానాన్ని పరిశీలించేందుకు థామస్ రాబర్ట్ సన్ స్పెషల్ కమీషనర్‌గా నియమించబడ్డాడు. అతడు సమూలమైన మార్పుల్ని (1903) ప్రతిపాదించి ఒక ఛైర్మన్, ఇద్దరు సభ్యులు సెక్రటరీతో రైల్వే బోర్డుని ఏర్పాటు చేయాలని సిఫార్సు చేశాడు. 1905లో రైల్వే బోర్డు ఏర్పాటుచేయబడింది. 1907లో రాజ్య కార్యదర్శి జాన్‌మోర్లే, రైల్వేల ఆర్థిక నిర్వహణాపరమైన అంశాలను పరిశీలించేందుకు సర్ జేమ్స్ మెకే ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించాడు. రైల్వే బోర్డు నిర్మాణంలో లోపముందని, బోర్డుకి ప్రభుత్వానికి మధ్య ఘర్షణ వుందని కమిటీ పేర్కొన్నది.

1905లో స్థాపించబడి 1909, 1914లలో మార్పులు చేయబడిన రైల్వే బోర్డు సంతృప్తికరంగా పనిచేయలేదు. తొలుత రైల్వే బోర్డు ఛైర్మన్, సభ్యులు గణనీయమైన పరిజ్ఞానం కలిగి రైల్వేలలో అనుభవమున్న వారు. 1914లో ఆర్థిక పరమైన వాణిజ్య పరమైన అర్హతలున్న సభ్యుని నియమించి ఈ బోర్డు మార్చబడింది. ముగ్గురు సభ్యులకు రైల్వేలలో అనుభవముండాలని 1920లో మరలా బోర్డులో మార్పులు తెచ్చారు. 1921 తరువాత ప్రభుత్వ రైల్వేలపై ప్రభుత్వం ప్రత్యేక బాధ్యత వహించి అన్ని అధికారాల్ని రైల్వే బోర్డుకు అప్పజెప్పింది.

1920లో విదేశాంగ మంత్రి సర్ విలియం ఆక్వర్త్ ఛైర్మన్‌గా ఈస్టిండియా రైల్వే కమిటీని నియమించి ఆర్థికం, నిర్వహణలతో సహా మొత్తం రైల్వే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించవలసిందిగా కమిటీని ఆదేశించాడు. ఆక్వర్త్ కమిటీగా పిలువబడ్డ ఈ కమిటీలో 10 మంది సభ్యులున్నారు. వారిలో ముగ్గురు భారతీయులు వారు వి.యస్. శ్రీనివాసశాస్త్రి, (స్టేట్ కౌన్సిల్ సభ్యుడు) సర్ రాజేంద్రనాథ్ ముఖర్జీ (కలకత్తా పారిశ్రామికవేత్త), పురుషోత్తం దాస్ ఠాగూర్ దాస్ (బొంబాయి పారిశ్రామికవేత్త). రైల్వేలు ప్రభుత్వ యాజమాన్యంలో వుండాలని కమిటీ సిఫార్సు చేసింది. తరువాత భారతరైల్వేల అభివృద్ధికి కమిటీ సిఫార్సులు చాలా వరకు ప్రాతిపదికయ్యాయి.

రైల్వేలకు చీఫ్ కమీషనర్‌ని నియమించాలనేది కమిటీ సిఫార్సులలో ఒకటి, గతంలో రైల్వే బోర్డు ప్రెసిడెంటు స్థానంలో చీఫ్ కమిషనర్ నియమింపబడతారు. సాంకేతికాంశాలతో సహా రైల్వే విధానానికి సంబంధించిన అన్ని నిర్ణయాలకు అతడు బాధ్యుడుగా వుంటాడు. సభ్యుల ఓటింగ్‌తో గాని, తొలగించడానికి గాని అతడిపై చెలాయించడానికి వీలులేదు. మొదటిసారిగా 1923లో సి.డి.యం. హిండ్లే "ఛీఫ్ కమీషనర్ ఆఫ్ రైల్వేస్"గా నియమింపబడ్డాడు. సాధారణ ఆర్థిక పద్దుల నుంచి రైల్వే పద్దుల్ని విడగొట్టే సమస్యను కూడా ఆక్వర్త్ కమిటీ చర్చించింది. ఈ సమస్యని రైల్వే ఆర్థిక కమిటీ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ సంయుక్తంగా పరిశీలించాలని కమిటీ సిఫార్సు చేసింది. తరువాత రెండు కూడా విడగొట్టాలని నిర్ణయించాయి. 1924–25 నుండి సాధారణ బడ్జెటు నుండి రైల్వే బడ్జెటు విడగొట్టబడింది.

**నాల్గవ దశ (1924-48)**

1932–33లో పి.ఎ. పోప్ ఆధ్వర్యంలో రైల్వేకి చెందిన అన్ని అంశాలపై పరిశీలన జరిపేందుకు కమిటీ నియమింపబడింది. రైల్వేలకు అధికంగా ఉపయోగించుకోవాలని ఆర్థికపరంగా లాభసాటిగా లేని వేగన్లను అమ్మివేయాలని, వివిధ రైల్వేల వనరులు కలిపివేయాలని, యింకా టికెట్లు లేని ప్రయాణం, రైల్వే ఆదాయాన్ని పెంచడం లాంటి పలు అంశాలపై కమిటీ ముఖ్యమైన సిఫార్సులు చేసింది. రైల్వే ఆదాయాన్ని పెంచేందుకు సూచనలు చేయవలసిందిగా 1936లో సర్ రాల్ఫ్ వెడ్జివుడ్ ఆధ్వర్యంలో కమిటీని నియమింపబడింది. కమిటీ 1937 జూన్‌లో రైల్వే బోర్డుకి రిపోర్ట్ సమర్పించింది. కొన్ని సిఫార్సుల్ని అమలు జరపాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. చివరిగా 1947లో ప్రభుత్వం కె.సి. నియోగి ఛైర్మన్‌గా రైల్వే ఎంక్వయిరీ కమిటీని నియమించింది. కాని అప్పుడు దేశంలో నెలకొన్న అస్థిర పరిస్థితుల కారణంగా ఈ కమిటీ రద్దుచేయబడింది.

**ఐదవ దశ (1948-52)**

దేశ విభజనతో జోధ్‌పూర్ రైల్వేని సింథ్ సెక్షన్‌తో పాటు పశ్చిమాన గల వాయువ్య సరిహద్దు రైల్వే, తూర్పున గల బెంగాల్, అస్సాం రైల్వేలోని కొన్ని సెక్షన్‌లు పాకిస్తాన్‌కి దక్కాయి. మొత్తం 6958 మైళ్ళ రైలు మార్గం పాకిస్తాన్‌కి అప్ప జెప్పబడింది. వాయువ్య రైల్వే సెక్షన్‌లో భారతదేశానికి వదలివేయబడిన భాగం యిప్పుడు తూర్పు పంజాబు రైల్వేగా (Eastern Punjab Railway) పిలువబడుతుంది. బెంగాల్, అస్సాం బ్రాడ్‌గేజ్ రైలు మార్గం ఈస్టిండియా రైల్వేకి కలుపబడింది. మీటర్ గేజ్ ప్రత్యేక అస్సాం రైల్వేగా ఏర్పాటు చేయబడింది.

1944కి ముందు భారత రైల్వేలను విస్తృతంగా ఈ క్రింది తరగతులుగా విభజించవచ్చు. i) ప్రభుత్వ పెట్టుబడితో (Govt. Owned) ప్రభుత్వ యాజమాన్యంలో గల రైల్వేలు. ii) ప్రభుత్వ పెట్టుబడితో (State owned) ప్రైవేటు యాజమాన్యంలోగల రైల్వే మార్గాలు. iii) కంపెనీ పెట్టుబడితో కంపెనీ యాజమాన్యంలో గల రైలు మార్గాలు iv) భారత ప్రభుత్వానికి చెందిన రైలు మార్గాలు. v) ఇతర రైలు మార్గాలు. 1944 నాటికి రెండవ, మూడవ తరహాకి చెందిన రైలు మార్గాలు జాతీయం చేయబడ్డాయి. కేవలం 533 మైళ్ళ పొడవు రైలు మార్గాలు ప్రభుత్వం లేక ప్రభుత్వ సంస్థల అధీనంలో లేవు. ఆ విధంగా 1944 నాటికి రైల్వేల జాతీయకరణ పూర్తియింది. 1946లో భారతదేశంలో 20,686.60 మైళ్ళు బ్రాడ్‌గేజ్ 16004.03 మైళ్ళు మీటర్‌గేజ్ 3827.08 మైళ్ళు నేరోగేజ్ రైలు మార్గాలు వున్నాయి.

## గ్రామీణ రుణభారం - వ్యవసాయ కార్మికులు

## గ్రామీణ రుణభారం వడ్డీ వ్యాపారుల పాత్ర:

గ్రామీణ భారతదేశం సామాజిక, ఆర్థిక నిర్మాణంలో వడ్డీ వ్యాపారులు (మహాజనులు, షావుకార్లు, షాలు, వన్మీలు, మార్వారీలు, బనియాలు) ఒక భాగంగా వుంటూ వచ్చారు. రైతులు రుతుపవనాలపై ఆధారపడే వారు గనుక వ్యవసాయంలో అస్థిరత ఎక్కువ. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు రైతుకు వడ్డీ వ్యాపారిని ఆశ్రయించడం తప్ప మార్గాంతరం లేదు. వడ్డీ వ్యాపారి రైతు తక్షణావసరాలు తీర్చేవాడు. అందుకే "అతడిలో ఎన్ని లోపాలు వున్నప్పటికి వడ్డీ వ్యాపారి చాలా అవసరమైనప్పుడు అప్పులిస్తాడు గనుక ఉపయోగకారి" అన్నాడు సర్ రిచార్డ్ టెంపుల్. గతంలో సాంప్రదాయాలు వడ్డీ వ్యాపారిని అదుపు చేసేవి. బ్రిటిష్ వారు రాకముందు వడ్డీ వ్యాపారి గ్రామంలో భాగంగా వుండేవాడు. ప్రజాభిప్రాయానికి భయపడి విపరీతమైన వడ్డీలు గుంజేవాడు కాదు. అప్పటికి నిర్మాణబద్ధమైన, న్యాయ వ్యవస్థ లేదు. గనుక అప్పుల వసూళ్ళకు గ్రామ పెద్దలపై ఆధారపడవలసి వచ్చేది.

బ్రిటిష్ పాలనలో వడ్డీ వ్యాపారిపై గ్రామపెద్దల అదుపు లేదు. లిఖిత ఒప్పందాలను కోర్టులు కఠినంగా అమలు జరిపేవి. వడ్డీ వ్యాపారి తన వసూళ్ళకు గ్రామపెద్దలపై ఆధారపడవలసిన పనిలేదు. ఫలితంగా వ్యక్తిగత ఆర్థిక సంబంధాలు దెబ్బతిన్నాయి. బ్రిటిషువారు ప్రవేశపెట్టిన భూమి విధానాలు రైతుకి అప్పుపుట్టే పరపతిని పెంచాయి.

భూమి శిస్తు పన్నులు పెంచడంతో గ్రామీణ రైతుకి అధిక వడ్డీరేట్ల కైనా అప్పుచేయక తప్పలేదు. పెట్టుబడికొరత, చట్టంలో లోపాలు, పాలకులకు రైతు పట్ల సానుభూతి కొరవడడం వగైరాలు వడ్డీ రేట్లు పెరగడానికి కారణాలు. రైతుకి పంట చేతికి రావడానికి ముందు శిస్తు వసూళ్ళు వుండేవి. పంటలకు గిట్టుబాటు ధరలు వుండేవి కావు. వీటికి తోడు 1860, 1870 దశాబ్దాలలో తరుచుగా సంభవించే కరువు కాటకాలు, తాత్కాలికంగా భూమి ధరల తగ్గుదల, అప్పు క్రింద రైతు వడ్డీ వ్యాపారికి తక్కువ ధరకి అమ్ముకొనక మార్గాంతరం లేని పరిస్థితులు వున్నాయి.

20వ శతాబ్దం ప్రారంభానికి గతంలో ఎన్నడూ లేనంతగా గ్రామీణ రుణభారం పెరిగింది. 20వ శతాబ్దం ప్రారంభంలో గ్రామీణ రుణభారం 300 కోట్ల రూపాయలు. సెంట్రల్ బ్యాంకులో ఎంక్వయిరీ కమిటీ అంచనా మేరకు 1929లో గ్రామీణ రుణ భారం 900 కోట్లు. ఆ తరువాత ఆర్థిక మాంద్యం వలన కేవలం బ్రిటిషిండియా గ్రామీణ రుణభారం 1200 కోట్లకు పైగా వున్నది. గ్రామీణ రుణ విధానంతో ప్రభుత్వం రైతుకు రక్షణ కల్పించలేకపోతే వడ్డీ వ్యాపారి వలలో రైతుపడిపోతాడు. వాస్తవంగా గ్రామీణరుణ విధానం వుంది. దానికి అరకొరగా నిధులు కేటాయింపబడతాయి. గ్రామీణ రుణ విధానం రైతుల పోరాట ఫలితంగా ఏర్పాటు చేయబడింది. 1875లో బొంబాయి ప్రెసిడెన్సీలో విస్తృతంగా జరిగిన ఘర్షణలు అధికారుల్ని పరిస్థితుల తీవ్రతని గుర్తించేలా చేశాయి. 19వ శతాబ్దంలో జరిగిన అనేక తిరుగుబాట్లలో వడ్డీ వ్యాపారుల్ని వ్యతిరేకించే శక్తుల ప్రమేయం వుండడం

గమనించవలసిన అంశం. 1857 తిరుగుబాటులో కూడా వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా రైతుల ఆగ్రహం పెల్లుబికింది. ఇక 1850 దశాబ్దంలో జరిగిన సంతాల్ తిరుగుబాటు వడ్డీ వ్యాపారుల్ని లక్ష్యంగా పెట్టుకొని జరిపిన తిరుగుబాటు.

1875లో జరిగిన దక్కను ఘర్షణలు. సమస్యలపై పలు చట్టాలు చేసేందుకు రుణ పరపతి కల్పించేందుకు బ్యాంకులు ప్రారంభించేందుకు దారితీశాయి. భూమి అభివృద్ధి చట్టం (1883) వ్యవసాయదారుల రుణచట్టం (1884) దక్కను వ్యవసాయ దారుల సహాయ చట్టం (1879) పంజాబు భూమి అన్యాక్రాంత చట్టం (1902) లాంటివి – రైతుని వడ్డీ వ్యాపారి నుండి రక్షించేందుకు ప్రభుత్వ రుణ సౌకర్యాలు కల్పించేందుకు చేయబడిన చట్టాలలో కొన్ని. ఇక 20వ శతాబ్దంలో వ్యవసాయక రుణభారంపై తనఖా విమోచన చట్టం 1935, అధిక వడ్డీలకు సంబంధించిన అప్పుల చట్టం 1935, అస్సాం వడ్డీ వ్యాపారుల చట్టం 1934, పంజాబ్ అప్పుదారుల రక్షణ చట్టం 1936, ఉత్తర ప్రదేశ్ వ్యవసాయదారుల సహాయక చట్టం 1934, ఉత్తరపదేశ్ అధిక వడ్డీలకు చెందిన అప్పుల సవరణ చట్టం – లాంటివి చాలా చట్టాలు చట్టసభలలో చేయబడ్డాయి. కాని గ్రామీణ ప్రజల ఆందోళన ఫలితంగా చేయించిన ఈ చట్టాలలో వడ్డీ వ్యాపారులు విశృంఖలంగా దోపిడీ కొనసాగించడానికి వీలు కల్పించే అన్ని అవకాశాలు ఉన్నాయి.

ఈ సందర్భంగా గ్రామీణ రుణభారంపై బ్రిటిషు ఆర్థిక విధానాలకు సంబంధించిన ఒక అంశం స్పష్టం చేయాల్సి వుంది. గతంలో దోపిడీదారుల దోపిడీకి గురయ్యేవారు లేరని కాదు. కాని జరిగిందేమిటంటే బ్రిటిషు చట్టాల ఫలితంగా వారి మధ్య గల సంబంధం యొక్క స్వభావం (Character) గణనీయంగా మారింది. కోర్టులు గ్రామీణ సమాజంలో భాగంగా వున్న వడ్డీ వ్యాపారులకు అదనపు శక్తిని సమకూర్చాయి. భూమి విలువైన అమ్మకపు సరుకయింది. వడ్డీ రేట్లు విపరీతంగా పెంచబడ్డాయి. రైతులు చెల్లించలేకపోతే పొలాల్ని కబళించే హక్కు వడ్డీ వ్యాపారులకు కల్పించబడింది. గ్రామీణ రుణభారం పెంచడానికి కారణాలను వివరిస్తూ 'ది ఇండియన్ ఎకనామిస్టు' పత్రిక ఆనాటి వడ్డీ వ్యాపారి బ్రిటిషు ఆర్థిక సిద్ధాంతాల నుండి పుట్టుకొచ్చినవాడు" అని వ్యాఖ్యానించింది.

### వ్యవసాయ కార్మికుల పెరుగుదల - కారణాలు

భూయజమాన్యంలో తీసికొని రాబడిన మార్పులు, శిస్తులు పన్నుల పెంపుదల, కోర్టుల స్థాపన వడ్డీ వ్యాపారులకు కల్పించబడిన రక్షణ, వ్యవసాయ వ్యాపారీకరణ, చేతి వృత్తుల పరిశ్రమల పతనం, పెరిగిన జనాభా – భారతదేశంలో వ్యవసాయ కార్మికుల పెరుగుదలకు ప్రధాన కారణాలు. శాశ్వత పన్ను విధానం ప్రవేశపెడుతూ ప్రభుత్వం రైతుల్ని నిర్బంధించడానికి వారి ఆస్తిపాస్తుల్ని జప్తు చేయించడానికి జమీందారులకు అధికారాలు కట్టబెట్టింది. ప్రతిచిన్న అవకాశాన్ని సాకుగా తీసికొని జమీందారుల నిర్బంధ చర్యలు పెరిగాయి.

రైతులు వ్యవసాయ కూలీలుగా మారిపోక తప్పని పరిస్థితులు కల్పించబడ్డాయి. రైత్వారీ విధానం అమలులో వున్న ప్రాంతాలలో విపరీతంగా పెంచిన శిస్తులు చెల్లించేందుకు రైతులు అప్పుకొరకు వడ్డీ వ్యాపారుల్ని ఆశ్రయించారు. పొలాలు తాకట్టు పెట్టారు. రైతులు అప్పులు చెల్లించలేకపోయారు. పొలాల్ని వడ్డీ వ్యాపారులు కబళించారు. వ్యవసాయ వ్యాపారీ కరణ ఫలితంగా అంతర్జాతీయంగా ధరలలో వచ్చిన ఒడిదుడుకులపై ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది.

విదేశీ మార్కెట్‌లో మాంద్యం ఏర్పడితే రైతులు శిస్తులు పన్నులు చెల్లించేందుకు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పుకి పోకతప్పలేదు. మరొక వైపు వ్యాపారీకరణ వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది ప్రత్యేకించి ప్లాంటేషన్ ఎస్టేట్‌లో వ్యవసాయ కార్మికుల డిమాండును పెంచింది. దానికి తోడు జనాభా పెరుగుదల వ్యవసాయ కూలీలను పెంచింది. యంత్రాలతో తయారైన చౌక వస్తువుల దిగుమతులు కుప్పలు తిప్పలుగా వచ్చి పడడంతో హస్తకళల, చేతివృత్తుల, గ్రామీణ పరిశ్రమలు ధ్వంసమయ్యాయి. ఫలితంగా వ్యవసాయ కూలీలు పెరిగారు. ధ్వంసమయిన పరిశ్రమలస్థానంలో క్రొత్త పరిశ్రమల పెరుగుదల లేదు. వృత్తులు కోల్పోయిన వారు కొద్ది మంది చిల్లర మల్లర పనులు చేపట్టారు. కొద్ది మంది మారిషస్ లాంటి చోట్లకు వలసపోయారు. కొందరు బిచ్చగాళ్ళగా మారారు. కాని అత్యధికులు వ్యవసాయంపై పడ్డారు. బ్రతుకు దెరువుకు గ్రామాలు చేరారు. వ్యవసాయంలో రద్దీ పెరిగింది. ఆ విధంగా బ్రిటిషు పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానానికి భారతదేశం వ్యవసాయ వలసగా మార్చబడింది.

**వ్యవసాయ కార్మికుల పెరుగుదల ప్రభావం:**

ఈ పరిణామం యొక్క ప్రభావం భారతదేశానికి ఆత్మహత్యా సదృశమైనది. వ్యవసాయ యోగ్యమైన పొలానికి డిమాండు అంతకంతకు పెరిగింది. రైతు అధీనంలో వుండే వ్యవసాయ యోగ్యమైన పొలం తగ్గుతూ వచ్చింది. అసలే వెనుకబడిన వ్యవసాయం. గిడసబారిన అభివృద్ధి – పెరుగుతున్న జనాభాకి బతుకుదెరువును కల్పించలేకపోయింది. ఫలితంగా వ్యవసాయం స్తంభించింది. గ్రామీణ ప్రజల జీవన పరిస్థితుల క్షీణతకు దారితీసింది. అత్యధికులు వ్యవసాయంపై పడడంతో కూలిరేట్లు తగ్గాయి. అతి తక్కువ కొనుగోలు శక్తితో సాధారణ వ్యవసాయ కార్మికులు, కొరతగా వున్న తిండి గింజలు కొనలేక కరువు కాటకాలతో అలమటించారు.

మాంటేగ్ – చేమ్స్ ఫర్డ్ సంస్కరణల తరువాత భారత ప్రభుత్వం చేసిన అరకొర చట్టాలు, లేక రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాలు గ్రామీణ శ్రామికులకు చేయూత నిచ్చేందుకు చేసిన ప్రయత్నాలు ఎలాంటి సత్ఫలితాలనివ్వలేదు.

పెరుగుతున్న గ్రామీణ శ్రామిక సమస్యపై బ్రిటిషు విధానాల్ని, దృక్పధాల్ని చార్లెస్ ట్రెవిలియన్ మాటల్లో చూద్దాం. "అత్యధికులు మన చేనేత కార్మికుల లాగానే గతంలో సగం వ్యవసాయదారులు. వ్యవసాయ వర్గంలో వారి చేరిక ఇంగ్లాండుకి భారతదేశానికి ప్రయోజనకారి.

భారతదేశ ఉత్పాదక శక్తులతో వ్యవసాయం భారతదేశం యొక్క ముఖ్య పరిశ్రమగా ఎల్లప్పుడూ వుంటుంది". భారతదేశ భవితవ్యం ఎవరి అధీనంలో వుంచబడిందో ఆ రాజకీయ శక్తుల, రాజకీయ నాయకుల ఆదరణ సరళి అలా వుంది.

## భారతదేశం కరువులు

### కరువుల స్వభావం:

భారతదేశంలో బ్రిటిషు పాలన కరువు (1770)తో మొదలయింది. మిలియన్ల ప్రజల్ని బలిగొన్న వినాశకరమైన 1943 బెంగాల్ క్షామంతో అంతమయింది. 1850లో దేశంలో చాలా ప్రాంతాలలో వర్షాలు లేక, కొన్ని ప్రాంతాలలో వరదల కారణంగా ఆహార ధాన్యాల, పశుగ్రాసం కొరత ఏర్పడింది. ఒక ప్రత్యేక ప్రాంతంలో ఆహార ధాన్యాల కొరత, అంటే ఆ ప్రాంతంలో కరువన్న మాటే. ఇతర ప్రాంతాలలో వర్షాలు పడివుండవచ్చు. సమృద్ధిగా ఆహారధాన్యాలు పండి వుండవచ్చు. 1850కి ముందు సరియైన రవాణా సాధనాలు లేకపోవడం వలన యితర ప్రాంతాల నుండి తరలించడం కూడా సాధ్యమయ్యేది కాదు.

రోడ్లు, రైలు మార్గాల అభివృద్ధితో భారతదేశంలోని కరువుల స్వభావం మారింది. 1850 తరువాత కరువంటే ఆహార ధాన్యాలు, పశుగ్రాసం లేకపోవడం వలన కాదు. వాటి సరఫరాలో గణనీయంగా కోత పెట్టడం వలన కరువు వచ్చేది. ఇప్పుడు ఆహార ధాన్యాన్ని యితర ప్రాంతాల నుండి తరలించవచ్చు. కాని ఒక ప్రత్యేక ప్రాంతంలో వర్షాలు లేకపోవడం అంటే ఆ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లేకపోవడం, ప్రజలకు ఆదాయం లేక పోవడం, ఆహార ధాన్యాల పశుగ్రాసాల ధరలు విపరీతంగా పెరగడం.

### కరువుకి కారణాలు:

ఉష్ణమండల సమశీతోష్ణ మండల దేశంగా భారతదేశం రుతుపవనాల వర్షాలపై ఆధారపడింది. దాదాపు ప్రతి 5 సంవత్సరాలలో రెండు సంవత్సరాలు రుతుపవనాల వైఫల్యం, రెండు సంవత్సరాలు అంతంత మాత్రం వర్షాలు, ఒక సంవత్సరం మాత్రం సంతృప్తికరమైన వర్షాలు వుండేవి. అంటే తరచుగా రుతుపవనాల వైఫల్యం భారతదేశం కరువుకు ముఖ్యమైన కారణం. బ్రిటిషు వారు తమ రక్షణ అవసరాలరీత్యా రైల్వేలకు యిచ్చిన ప్రాధాన్యత నీటి పారుదలకు యివ్వకపోవడం కరువులకు మరొక కారణం. గ్రామంలో ప్రత్యామ్నాయ వృత్తులు లేవు. వ్యవసాయం విఫలమైనప్పుడు గ్రామీణ ప్రజలు ఆకలితో అలమటించారు.

### భారతదేశంలో పెద్ద కరువులు:

ఈస్టిండియా కంపెనీ పాలనా కాలంలో మొట్టమొదటి కరువు 1770లో బెంగాల్ బీహారు ఒరిస్సాలలో సంభవించింది. 1768 నుండి సరిగా వర్షాలు లేవు. 1770లో

ఆహారధాన్యాల కొరత తీవ్రమైంది. దురాశాపరులైన భారత, బ్రిటిషు వర్తకులు పరిస్థితిని క్షీణింపజేశారు. దాదాపు 10 మిలియన్ల (ఆప్రాంతంలోని ప్రజలలో మూడవ వంతు) ప్రజలు మరణించారు. కొద్ది సంఖ్యలో గంజికేంద్రాలు, ఆహార ధాన్యాలపై అరకొర ఆంక్షలు విధించడం మాత్రమే చేపట్టబడిన సంక్షేమ చర్యలు. ఎలాంటి మినహాయింపులు, తగ్గింపులు లేకుండా ఈస్టిండియా కంపెనీ భూమిశిస్తు వసూలు చేసుకొన్నది.

1806-07లో మద్రాసు, కర్నాటకలలో తీవ్రమైన కరువు వచ్చింది. 1812-1815 మధ్య కాలంలో వాయువ్య భారతదేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. 1819-20లో కరువు వచ్చింది. అలాగే 1823లో మద్రాసులో, 1824లో బొంబాయిలో, 1825-26లో ఉత్తరప్రదేశ్‌లో కరువులు సంభవించాయి. అధికారులు దిగుమతి చేయబడిన ఆహార ధాన్యాలపై సబ్సిడీలు యివ్వడం మినహా ప్రజా సమస్యలలో జోక్యంచేసుకోలేదు. రెవెన్యూ అధికారులు భూమిశిస్తుపై రెమిషన్ యివ్వాల్సిన అవసరం గుర్తించలేదు. 1830వ దశాబ్దం ప్రారంభంలో ఢిల్లీ పరిసర ప్రాంతాలు, 1832లో మద్రాసు, దక్కన్‌లో కొన్ని ప్రాంతాలు కరువు వాతబడ్డాయి. మరలా ఢిల్లీ రాజపుటానాలలో కరువు ఆహార ధాన్యాల కొరత ఏర్పడ్డాయి. తరచుగా తిండి కొరకు దొమ్మీలు జరిగాయి. కొద్దిపాటి సహాయక చర్యలు చేపట్టబడ్డాయి. ప్రభుత్వం శాంతి భద్రతల పరిరక్షణకు సైన్యాన్ని దించింది. ప్రజలు పనులు కొరకు తిండికొరకు వలసలు పోయారు.

1857 తిరుగుబాటు తరువాత కొన్ని సంవత్సరాల పాటు వ్యవసాయం నిలదొక్కుకోలేదు. 1858-60లలో వర్షాలులేవు. మరలా ఉత్తరప్రదేశ్, అజ్మీరు, తూర్పు పంజాబు జిల్లాలలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. పనిదొరకక ఆకలితో ప్రజలు అలమటించారు. ఈ కాలంలో రాష్ట్ర ప్రభుత్వాలు కరువు నివారణకు కొంత చొరవ చూపాయి. భారత దేశ ప్రభుత్వం కరువులకు కారణాలను పరిశీలించి సహాయక చర్యల్ని సిఫార్సు చేయవలసిందిగా కల్నల్ బైర్డ్ స్మిత్‌ని నియమించింది.

1896లో దేశంలో చాలా ప్రాంతాలు కరువు వాత బడ్డాయి. సహాయక చర్యలకు ప్రభుత్వం 7.25 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టింది. దాదాపు 2.2 మిలియన్ల మంది సహాయం పొందారు. 1896 నాటి కరువుతో ప్రభుత్వం సర్ జె.బి. ల్యాల్ అధ్యక్షతన రెండవ కరువు కమీషన్‌ని నియమించింది. 19వ శతాబ్దాంతంలో సెంట్రల్ ప్రావిన్సిస్ రాజపుటానా, దక్షిణ పంజాబు, మధ్య బొంబాయిలను విస్తృతమైన కరువు కకావికలం చేసింది. దాదాపు 1.2 మిలియన్ల ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ కరువు సర్ మెక్డోనెల్ అధ్యక్షతన మూడవ కరువు కమిషన్ నియామకానికి దారితీసింది. కమిషన్ 1901లో నివేదిక సమర్పించింది.

1943లో సంభవించిన బెంగాలు కరువు చాలా వినాశకరమైనది. దాదాపు 3 మిలియన్ల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది మానవ కల్పితమైన కృత్రిమ

కరువు.  ఇతర ప్రాంతాల నుండి బెంగాలు లోకి ఆహర ధాన్యాలను రవాణా చేయడంతో పాలనా యంత్రాంగం విఫలమయింది.  ఆహారధాన్యాల రవాణాకు రైల్వేలు తగిన ప్రాధాన్యత నివ్వలేదు.  ఆహార ధాన్యాల సేకరణ, పంపకం సహాయక చర్యలు ప్రభుత్వం అర్థ మనస్కతతో తగు విధంగా చేపట్టలేదు.  బెంగాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలు పని, డబ్బు, తిండి కొరకు కలకత్తాపై బడ్డారు.  ప్రభుత్వం సంతృప్తికరమైన సహాయక చర్యలు చేపట్టలేదు.  కలకత్తా నగర ఫుట్‌పాత్‌లపై వేలాది మంది చనిపోయారు.  1943 బెంగాలు కరువు కారణాలను అధ్యయనం చేసేందుకు 1944లో ఉడ్‌హెడ్ కమిషన్ నియమింపబడింది.  పాలనా యంత్రాంగాన్ని సరిగా వినియోగించివుంటే బెంగాలు వెలుపల నుండి ఆహార ధాన్యాలను బెంగాలులోకి తరలించివుండేదని కమిషన్ పేర్కొన్నది.

ఇప్పటి వరకు చెప్పిన వివరాలతో దేశంలో ఒక ప్రాంతం లేక మరొక ప్రాంతం తరచుగా కరువు బారిన పడుతుందని, కరువు బారినపడిన ప్రజలు, పశువులు ప్రాణాలు కోల్పోయాయని, ఆయా ప్రాంతాల గ్రామీణ ఆర్థిక విధానం అస్తవ్యస్తమయిందని గమనించాం. 1876-78, 1896-97 కరువులు అఖిల భారత స్వభావం గలవి.  అంటే దీనర్థం యితర కరువులతో సంభవించిన నష్టాలు తక్కువని కావు.  కాని కాలం గడచిన కొలదీ గడించిన అనుభవంతో కరువు సహాయక యంత్రాంగం వివిధ కరువు కమిషన్ల సిఫార్సుల మేరకు సహాయక చర్యలు చేపట్టి కొంత సమర్థవంతంగా పనిచేశాయి.  ఫలితంగా మనుషుల పశువుల చావులు తగ్గాయి.

**కరువు సహాయక విధానం**

**కంపెనీ పాలనలో కరువు సహాయం**

1760-1857 కాలంలో ఈస్టిండియా కంపెనీ కరువు, కరువు సహాయక సమస్యల్ని గురించి అంతగా పట్టించుకోలేదు. 1760 తరువాత కొంత కాలం కంపెనీ యుద్ధాలలో విజయాలు, వర్తక వాణిజ్యాలలో లాభాలు ప్రోగుచేసుకోవడంతో తీరికలేకుండా వుంది. అంతేగాక కరువు సమస్యల్ని పరిశీలించి పరిష్కరించడానికి కంపెనీకి పాలనా యంత్రాంగం గాని అనుభవజ్ఞులైన నిపుణులుగాని లేరు.  19వ శతాబ్దం ప్రారంభంలో కరువు బాధిత ప్రజల సమస్యల్ని పరిష్కరించేందుకు అరకొర చర్యలు చేపట్టింది.  ఉదాహరణకు 1812లో కంపెనీ కరువు బాధిత ప్రాంతాల నుండి ఆహార ధాన్యాల ఎగుమతి నిషేధించింది.  కరువు ప్రాంతాలకు యితర ప్రాంతాల నుండి ఆహార ధాన్యాల దిగుమతి కొరకు ప్రయత్నించింది. 1833లో కరువు పీడిత ప్రజలకు పని కల్పించే బాధ్యతని అంగీకరించింది.  కాని పనిచేయలేని నిస్సహాయుల్ని వృద్ధుల్ని వికలాంగుల్ని ప్రైవేటు ధార్మికుల దయాదాక్షిణ్యాలకు వదలివేసింది.

### మొదటి కరువు కమిషన్ (1880)

1876-78 కరువు తరువాత భారతదేశ ప్రభుత్వం 1878లో సర్ స్ట్రాచీ అధ్యక్షతన మొదటి కరువు కమిషన్‌ని నియమించింది. కమిషన్ 1880లో రిపోర్టు అందజేసింది. కరువు సహాయక విధానానికి సాధారణ సూత్రాన్ని రూపొందించింది. నివారణ, తక్షణ చర్యలను సూచించింది. కరువు బాధిత ప్రజల పట్ల ప్రభుత్వ బాధ్యతను గుర్తించింది. కరువు సహాయక చర్యల్లో భాగంగా అదనంగా చేసే పంపిణీ వ్యక్తిగత పొదుపుని నిరుత్సాహ పరుస్తుందని స్వయం సహాయక సూత్రాన్ని బలహీన పరుస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ సూత్రాల ఆధారంగా కమిషన్ కరువు సహాయక నియమాల్ని రూపొందించింది. పని చేయగలవారందరికి పని కల్పించాలి; కాని కూలి మాత్రం కేవలం ఆహార ధాన్యాలకు సరిపడేంత మాత్రమే వుండాలి. వృద్ధులకు వికలాంగులకు మాత్రమే ఉచిత సహాయం చేయాలి. వ్యవసాయ దారులకు తక్కువ రుణాలు మంజూరు చేయాలి. భూమిశిస్తు రద్దు, తగ్గింపులు ఆయాప్రాంతాల కరువు తీవ్రతని బట్టి వుండాలి. మొదటి కరువు కమిషన్ సిఫార్సులు 1896లో అమలు జరపవలసి వుంది.

### రెండవ కరువు కమిషన్ (1898)

1896-97లో అఖిల భారత స్థాయిలో వచ్చిన కరువు సర్ జేమ్స్ ల్యాల్ అధ్యక్షతన రెండవ కరువు కమిషన్ నియామకానికి దారితీసింది. రెండవ కరువు కొన్ని చిన్న మార్పులతో మొదటి కరువు కమిషన్ సిఫార్సులకు ఆమోదముద్ర వేసింది. గ్రామాలలో ఉచిత సహాయం చేయాలని సిఫార్సు చేసింది. భూమిశిస్తు ఉదారంగా తగ్గించబడింది. నేత పనివారు తెగలవారు లాంటి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధచూపబడింది.

### మూడవ కరువు కమిషన్ (1901)

1899-1900లో వచ్చిన తీవ్రమైన కరువు 1901లో సర్ అంటోని మెక్డోనెల్ అధ్యక్షతన మూడవ కరువు కమిషన్ నియామకానికి దారితీసింది. కరువు పీడిత ప్రాంతాల ప్రజలకు ఉదారంగా తక్కువ రుణాలు మంజూరు చేయాలని, భూమిశిస్తు రద్దు చేయాలని, అన్నింటి కంటె ముఖ్యంగా బాధితులలో ఆత్మవిశ్వాసం పెంపొందించే చర్యలు చేపట్టాలని కమిషన్ సిఫార్సు చేసింది. కరువు సమయాలలో పశుగ్రాస సమస్యని కూడా పరిష్కరించాలని, స్వయం సహాయక సూత్రాన్ని ప్రోత్సహించేందుకు సహకార సంఘాలను ప్రవేశపెట్టాలని, పనులు కల్పించేందుకు నీటి పారుదల రైల్వేల విస్తరణ కార్యక్రమాలు చేపట్టాలని సిఫార్సు చేసింది. 1907-08 ఉత్తర ప్రదేశ్ కరువు, బొంబాయి, హైదరాబాద్, మద్రాసు, సెంట్రల్

ప్రావిన్స్, బెంగాలు, రాజస్థాన్‌లను కుదిపివేసిన కరువులు కమిషన్ సిఫార్సుల్ని పరీక్షకు నిలబెట్టాయి.

**ఉడ్‌హెడ్ కరువు కమిషన్ (1944)**

1943లో బెంగాలులో 3 మిలియన్ల మందిని కబళించిన అతి విషాదకరమైన కరువు ఉడ్‌హెడ్ కమిషన్ నియామకానికి దారితీసింది. కరువు పీడిత ప్రజలకు ఆహారం సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని కమిషన్ పేర్కొన్నది. ఆహార సమస్యని పరిష్కరించేందుకు అఖిల భారత ఆహార మండలి (All India Food Council) ని ఏర్పాటు చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. ఇంకా రాజ్యం గుత్తగా ఆహార ధాన్యాలను సేకరించాలని, అటు ఉత్పత్తి దారులకు, ఇటు వినియోగదారులకు హేతుబద్ధంగా వుండే ధరలకు ఆహార ధాన్యాలు సరఫరా చేయాలని కమిషన్ సిఫార్సుచేసింది.

## బ్రిటిషిండియా - వర్తకం పన్నుల విధానం :

తొలికాలంలో కంపెనీ ఎగుమతులకు తోడ్పడే భారతదేశ పరిశ్రమలకు తోడ్పడడంలో సహజంగా ఈస్టిండియా కంపెనీ ఆసక్తి కలిగివుంది. కాబట్టి ఇంగ్లాండులో యూరపులో లాభదాయకమైన మార్కెటు గల నూలు, సిల్కు బట్టల తయారీని కంపెనీ ప్రోత్సహించింది. కాని మాంచెస్టర్, లాంక్‌షైర్‌లలో అభివృద్ధి చెందుతున్న వస్త్ర పరిశ్రమ ఈ విధానాన్ని వ్యతిరేకించింది. కాబట్టి భారతదేశ నూలు బట్టల దిగుమతిపై విపరీతమైన సుంకాలు విధించి, కొన్ని సందర్భాలలో వాటిపై నిషేధాలు విధించి ఇంగ్లాండు బ్రిటన్ పరిశ్రమలకు రక్షణ కల్పించే విధానాన్ని అమలు జరిపింది.

భారతదేశ వర్తకంపై ఈస్టిండియా కంపెనీకి గల గుత్తాధిపత్యంపై ఇంగ్లాండులో వ్యతిరేకత వ్యక్తమయింది. ఈ వ్యతిరేకత 1813లో ఇంగ్లీషు వారందరూ భారతదేశంలో వర్తకం చేసుకొనేందుకు అవకాశం కల్పించింది. 1815 నుండి కొన్ని ఇంగ్లాండు వస్తువులు ఎలాంటి దిగుమతి సుంకాలు లేకుండాగాని లేక బాగా తగ్గించబడిన దిగుమతి సుంకాలతో గాని భారతదేశానికి దిగుమతి చేయబడ్డాయి. అంతేగాక ప్రత్తి, నీలిమందు, జనపనార లాంటి కొన్ని ముడి వనరులు ఇంగ్లీషు రేవులకు ఎగుమతి సుంకాలు లేకుండా పంపబడ్డాయి. మరొకవైపు గ్రేట్ బ్రిటన్‌కి దిగుమతి చేయబడే విదేశీ వస్తువులకు దాదాపు రెట్టింపు సుంకాలు విధించబడ్డాయి. ఇలాంటి ఘటనలు బ్రిటిషు వాణిజ్య పారిశ్రామిక ప్రయోజనాలకు రక్షణ కల్పించాయి. బ్రిటిషిండియా వర్తక విధానాన్ని శాసించాయి.

పారిశ్రామిక విప్లవం కారణంగా 1830 నాటికి ఇంగ్లాండు పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. వాణిజ్య పారిశ్రామిక రంగాలలో ఇంగ్లాండు బలమైన పోటీదారుగా ఎదిగింది. భారతదేశ వస్తువులపై విపరీతమైన దిగుమతి సుంకాలు విధించడం వలననూ, కొన్ని వస్తువుల దిగుమతి నిషేధించడం వలననూ, యంత్రాలతో చౌకగా తయారైన ఇంగ్లీషు వస్తువుల

కారణంగానూ, భారతీయ ఉత్పత్తిదారులు ఇంగ్లాండు మార్కెట్ల నుండే గాక, భారతదేశ మార్కెట్ల నుండి కూడా పోటీ నుండి నెట్టివేయబడ్డారు. ఇక ఇంగ్లాండులో వేగంగా పెరుగుతున్న పరిశ్రమలకు భారతదేశం లాంటి దేశాలనుండి అధికాధికంగా ముడివనరుల అవసరమేర్పడింది. పారిశ్రామిక వాణిజ్య రంగాలలో బలం పుంజుకొని బలమైన పోటీదారుగా ఎదగడంతో ఇంగ్లాండులో రక్షణ బంధాల నుండి స్వేచ్ఛ కొరకు డిమాండు పెరిగింది. ఇంగ్లాండు వాణిజ్య వేత్తలు పారిశ్రామిక వేత్తలు స్వేచ్ఛా వాణిజ్య సూత్రాన్ని అమలు జరపాలని ఒత్తిడి చేశారు.

**స్వేచ్ఛా వాణిజ్యం - సుంకాల విధానం:**

స్వేచ్ఛా వాణిజ్యానికి అనుకూలంగా రక్షణ పట్ల మారిన ఈ వైఖరి ప్రభావం భారతదేశం యొక్క పన్నుల విధానంపై పడింది. 1833-44 కాలంలో ఈస్టిండియా కంపెనీ విదేశీ పారిశ్రామిక ఉత్పత్తిదారులకు వ్యతిరేకంగా గల వివక్షతను రద్దు చేసింది. వాణిజ్యానికి ఆటంకంగా వుంటుందనే కారణం చూపి దేశంలోపల విధించే పన్నులను రద్దు చేసింది. నామమాత్రమైన ఎగుమతి దిగుమతి సుంకాల్ని వసూలు చేసింది. ఫలితంగా భారతదేశం యొక్క అంతర్జాతీయ వాణిజ్యం పెరిగింది. 1834-39 కాలంలో వార్షికంగా 9.7 కోట్ల రూపాయలుగా వున్న దిగుమతులు 1854-59 కాలానికి వార్షికంగా 15.37 కోట్లకు పెరిగాయి. అదే కాలంలో వార్షిక ఎగుమతులు 13 కోట్ల నుండి 22.2 కోట్లకు పెరిగాయి. 1857 తిరుగుబాటుని అణచడానికి భారతదేశ ప్రభుత్వం పెద్ద మొత్తం వెచ్చించింది. బడ్జెటు లోటుని నివారించేందుకు భారతదేశ ప్రభుత్వ సాధారణ సుంకాల్ని 5 నుండి 10 శాతానికి దిగుమతి చేయబడిన నూలుపై పన్నుల్ని 3.5 నుండి 5 శాతానికి పెంచింది.

1850 నాటికి స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని అమలు పరచడం దాదాపు పూర్తి చేసింది. లాంక్‌షైర్ నుండి వచ్చిన ఒత్తిడిమేరకు భారతదేశం యొక్క దిగుమతి పన్నుల రేటు తగ్గించబడింది. నూలుపై 1864లో 7.5 శాతం వున్న దిగుమతి పన్ను 1875 నాటికి 5 శాతానికి తగ్గించబడింది. 1882 నాటికి మరికొన్ని వస్తువుల్ని (ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, మద్యం లాంటివి) చేర్చి దిగుమతి పన్నులు పూర్తిగా రద్దు చేయబడ్డాయి. అలాగే ఎగుమతి పన్నులు కూడా తగ్గించబడ్డాయి. 1875 నాటికి నూనె గింజలు, బియ్యం, నీలిమందు, లక్క లాంటి కొన్ని వస్తువులపై మాత్రమే 3 శాతం ఎగుమతి పన్ను విధించబడింది. బియ్యంపై మినహా 1880 నాటికి అన్నింటిపై పన్నులు రద్దయ్యాయి. ఆ విధంగా ఇంగ్లాండు ప్రయోజనాల రీత్యా భారతదేశంపై స్వేచ్ఛా వాణిజ్యం రుద్దబడింది.

**ద్రవ్య మారక పద్ధతి:**

దీర్ఘకాలం పాటు కొనసాగిన వలసపాలన ద్రవ్యమారక పద్ధతిలో వ్యవస్థాగతమైన మార్పులు తీసుకొని వచ్చింది. భారత ఆర్థిక వ్యవస్థకి చెందిన ప్రధాన రంగాలలో వచ్చిన వ్యవస్థాగత మార్పులకు ద్రవ్యమారక పద్ధతి తోడయింది. వాణిజ్యంలో ఈస్టిండియా గుత్తాధిపత్యం ముగియడం, బ్రిటిషు వస్తువుల దిగుమతులు పెరగడం జరిగిన తరువాత భారతదేశంలోని ఆర్థిక రుణ విధానంపై వలస ప్రభుత్వం కేంద్రీకరించింది.

వలసపాలనకు ముందుగాని ఈస్టిండియా కంపెనీ కాలంలో గాని భారతదేశంలో సమగ్రమైన ద్రవ్య ఆర్థిక వ్యవస్థ లేదు. వివిధ విలువలలో బంగారు, వెండి నాణాలు పెద్ద మొత్తంలో చెలామణిలో వుండేవి. వెండి రూపాయి విలువ కూడా దేశమంతటా అన్ని ప్రాంతాలలో ఒకే విధంగా లేదు. వాణిజ్యపరమైన దోపిడి ప్రారంభమైనప్పుడు వ్యాపారులు వర్తకులు నల్లబజారు వర్తకులు మరింత ధనవంతులు కావడానికి ఈ ఆర్థిక అనిశ్చిత పరిస్థితి సహకరించింది. పారిశ్రామికీకరణ వలన ఒకే సమగ్రమైన ఆర్థిక వ్యవస్థ కావలసివచ్చింది. భారతదేశంలో అమ్మిన వస్తువులకు లభించిన రూపాయలను పౌండు స్టెర్లింగుల లోకి మార్చవలసి వచ్చినందున మారకం రేటుని కూడా రూపొందించవలసిన అవసరం ఏర్పడింది.

1818, 1835భారతదేశ చట్టాలు వెండి రూపాయిని ప్రమాణీకరించాయి. నిర్ణీత బరువున్న వెండి రూపాయిని దేశానికంతటికీ మౌలికమైన ద్రవ్య యూనిటుగా ప్రవేశపెట్టారు. దీని వలన వలసప్రభుత్వం యొక్క ఆదాయం సుస్థిరం కావడంతో పాటు నగదు విధానాన్ని ప్రవేశపెట్టడానికి దారితీసింది. నగదురూపంలో పన్నుల విధింపుని ప్రవేశపెట్టడం వలన రైతుల ఆర్థిక పరిస్థితులు దిగజారాయి. దీనివలన అప్పటి వరకు ప్రజల మధ్య వున్న సాంప్రదాయ ఆర్థిక సంబంధాలు దెబ్బతిన్నాయి. వస్తుమార్పిడి విధానానికి స్వస్తి చెప్పడం జరిగింది. బ్రిటిషువారి వస్తువులకు మార్కెటు కల్పించడంతో పాటు మార్కెటులో డిమాండు వున్న వస్తువుల కొరకు రైతులపై ఒత్తిడి పెరిగింది.

**సుంకాల విధానం:**

హోం ఛార్జీల భారాన్ని కరువు కాటకాల్ని పెంచడమే గాక భారత ప్రభుత్వ వ్యయాన్ని పెంచిన రూపాయి స్టెర్లింగు నిష్పత్తి తగ్గింపు భారతదేశ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని క్షీణింపజేసింది. ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకొనేందుకు దిగుమతి అయ్యే అన్ని వస్తువులపై చాలా తక్కువగా దిగుమతి సుంకాలు విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

భారతదేశ ప్రభుత్వం 1894లో అన్ని రకాల దిగుమతులపై 5 శాతం సుంకం విధించింది. కాని వెంటనే లాంక్‌షైర్ నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా భారతరాజ్య కార్యదర్శి దిగుమతి అయ్యే నూలుపై సుంకాలు రద్దు చేశారు. నూలు ఉత్పత్తులపై కేవలం 3.5 శాతం సుంకాలు విధించేందుకు అంగీకరించారు. దీని ఆంతర్యం చాలా స్పష్టమే. భారతదేశ వస్త్ర పరిశ్రమని పణంగా పెట్టి బ్రిటన్ వస్త్ర పరిశ్రమకి హారతులు పట్టి ఆహ్వానించడం. ఈ విధానం 1926 వరకు కొనసాగింది. భారత పరిశ్రమలకు రక్షణ కల్పించే డిమాండు ప్రక్కన పెట్టబడింది. ఇంగ్లీషు పరిశ్రమల ప్రయోజనాలను పదిలంగా కాపాడే విధంగా భారతదేశ ద్రవ్య విధానం సుంకాలు విధించే విధానాలకు రూపకల్పన చేసింది.

# 8

# యుద్ధకాలంలో భారతదేశ ఆర్థిక విధానం

**ప్రభుత్వ వ్యవసాయ విధానం**

వ్యవసాయ విధానం విషయంలో 19వ శతాబ్దాంతం వరకు ప్రభుత్వం దాదాపు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కొన్ని సందర్భాలలో చేపట్టిన పరిమిత చర్యలు ప్రయోజనాల్ని సాధించలేక పోయాయి. అఖిలభారత స్థాయిలో సంభవించిన రెండు కరువులు వ్యవసాయాభివృద్ధి సమస్యలపై ప్రభుత్వాన్ని కదిలించాయి. మాంటేగ్ చెమ్స్ ఫర్డ్ సంస్కరణలు 1919 ననుసరించి వ్యవసాయం రాష్ట్రాలకు బదిలీ చేయబడినప్పటికి నిధుల కొరత, దేశంలో నిపుణుల కొరత కారణంగా రాష్ట్ర వ్యవసాయ శాఖల అభివృద్ధికి అంతగా అవకాశం లేకపోయింది. భూమిశిస్తు కౌలు దాని పరిధి నుండి మినహాయించ బడినందున వ్యవసాయంపై రాయల్ కమిషన్ సిఫార్సులు కూడా ప్రభుత్వ వ్యవసాయ విధానంపై అంతగా ప్రభావం చూపలేకపోయాయి.

యునైటెడ్ స్టేట్స్‌తో సహా వివిధ ప్రభుత్వాల వ్యవసాయ విధానాలలో చాలా మార్పులు తీసుకొని వచ్చిన 1929-33 నాటి ఆర్థిక మాంద్యం భారతదేశ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల వైఖరిలో సమూలమైన మార్పులు తీసుకొని రాలేదు. 18,19 శతాబ్దాలలో ప్రాశ్చాత్య దేశాలలోను, యునైటెడ్ స్టేట్స్‌లోనూ వ్యవసాయ విప్లవాలు వచ్చిన కాలంలో భారతదేశంలోని వ్యవసాయ రంగంలో మార్పులు రాకపోవడం గమనార్హం. ప్రయోజన కరమైన విధానాలు చేపట్టని కారణంగా భారతదేశ వ్యవసాయం స్వతంత్రం సాధించే వరకు ఎలాంటి ఎదుగూ బొదుగూ లేకుండా స్తబ్ధతగా వుండిపోయింది.

1937లో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కల్పించబడిన తరువాత, ప్రత్యేకించి 1947లో స్వతంత్రం సాధించిన తరువాత వ్యవసాయానికి సంబంధించిన ప్రభుత్వ విధానాలు సమూలంగా మారాయి. అయినప్పటికి ప్రభుత్వ వ్యవసాయ విధానం 20వ శతాబ్దం ప్రారంభం నుండి క్రమంగా అభివృద్ధి చెందుతూ వచ్చిందని అంగీకరించితీరాలి.

## 1919-29 కాలంలో వ్యవసాయం:

ఈ కాలంలో వ్యవసాయ పురోగతి మందకొడిగా సాగింది. మెరుగైన విత్తనాలు ప్రవేశపెట్టడం వలన ప్రత్తి, గోధుమ, జనుము, వేరుశనగ దిగుబడులు కొంత పెరిగాయి. 1919 చట్టాన్ని అనుసరించి వ్యవసాయం శాసనసభాధీనశాఖ అయింది. రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయశాఖలు ప్రారంభించి కొంత కృషి చేశాయి. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ అఖిల భారత స్వభావం గల సమస్యలకే పరిమితమయింది. అది ఈ క్రింది శాఖలను నిర్వహించింది. వ్యవసాయ పరిశోధనా శాఖ (పూసా నుండి న్యూఢిల్లీకి మార్చబడింది), కేంద్ర పశుపరిశోధనా శాఖ (1893లో ప్రారంభించబడింది), పశుపోషణ, పాడి పరిశ్రమ సంస్థ, బెంగుళూరు, కర్నాల్ వద్ద పశుపెంపకం కేంద్రం; ఆనంద్ వద్ద పాల ఉత్పత్తులు, కోయంబత్తూరులో చెరకు ఉత్పత్తి కేంద్రం.

భారత వ్యవసాయ సమస్యలకు చెందిన వివిధ అంశాలను అధ్యయనం చేసి వ్యవసాయాభివృద్ధికి తగు సిఫార్సులు చేసేందుకు 1926లో రాయల్ కమిషన్ నియమింపబడింది. కమిషన్ 1929లో నివేదిక సమర్పించింది. కమిషన్ సిఫార్సులలో అత్యధికం ఆమోదించబడ్డాయి. అమలు జరుపబడ్డాయి. ఇతర అంశాలతో పాటు బ్రిటిషు సామ్రాజ్యంలోని యితర భాగాలలోను యితర దేశాలలోను ఈ రంగాలలోని పరిశోధనల్ని అనుసంధానం చేసేందుకు, వ్యవసాయ పరిశోధనని సమన్వయ పరచి మార్గ దర్శకత్వం వహించేందుకు వ్యవసాయ పరిశోధనా మండలి (Imperial Council of Agricultural Research) నెలకొల్పాలని కమిటి సిఫార్సు చేసింది. సిఫార్సుల ననుసరించి 1929లో వ్యవసాయ పరిశోధనా మండలి స్థాపించబడింది. సిఫార్సుల ననుసరించి ప్రాంతీయ పరిశోధన కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి. ఇవి సామ్రాజ్యవాద వ్యవసాయ పరిశోధనా మండలి సహకారంతో పనిచేశాయి.

## తీవ్రమైన ఆర్థిక మాంద్యం-ఆ తరువాత (1929-39)

ఆర్థిక మాంద్యం (1929-33) కాలంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు విపరీతంగా పడిపోవడంతో రైతులు చాలా దెబ్బతిన్నారు. ధరలు పడిపోవడాన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు భూమిశిస్తుని తగ్గించడం తప్ప మరేమీ చేయలేదు.

రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి విధానంతో 1937లో ప్రజా ప్రభుత్వాలు అధికారానికి వచ్చినప్పుడు రైతులకు సహాయపడేందుకు చాలా చర్యలు ప్రారంభించాయి. 1937 తరువాత చాలా రాష్ట్రాలలో కౌలు కాలపరిమితిని, కౌలు రేటును నిర్దేశిస్తూ శాసనాలు చేయబడ్డాయి. వడ్డీ వ్యాపారుల చట్టంతో వడ్డీ వ్యాపారుల దురాగతాలు కొంతవరకు అడ్డుకోబడ్డాయి. కాని రాష్ట్ర శాసనసభలు చట్టాన్ని అమలు జరిపే ప్రయత్నాలలో వుండగానే రెండవ ప్రపంచ యుద్ధం వచ్చిపడింది.

## రెండవ ప్రపంచ యుద్ధకాలంలో వ్యవసాయం (1939-45)

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఆహార ధాన్యాల కొరత, ధరల పెరుగుదల సమస్యలు తీవ్రమయ్యాయి. ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలతో కూడిన విధానం లేదు. అమలు జరిపే యంత్రాంగమూ లేదు. 1942 ఆహార ఉత్పత్తి సదస్సు సాధారణ పద్ధతులలో ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచమని ప్రతిపాదనలు చేసింది. 1943లో బెంగాలు కరువు వచ్చిపడింది. అప్పుడు ప్రభుత్వం స్పందించవలసి వచ్చింది. ఆహారధాన్యాల సరఫరాలు పెంచేందుకు, ఆహారధాన్యాల సేకరణ యంత్రాంగాన్ని మెరుగుపరచేందుకు, రేషనింగు విధానాన్ని విస్తరించేందుకు, ధరల్ని అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆహార ధాన్యాల విధాన కమిటీ సిఫార్సు చేసింది. ఈ సూచనలు ప్రభుత్వ విధానానికి మార్గదర్శకాలయ్యాయి.

ధరల్ని అదుపు చేసేందుకు చాలా సదస్సులు నిర్వహించబడ్డాయి. ఫలితంగా కొనుగోలు కేంద్రాలు పెట్టి ఆహారధాన్యాలు సేకరించాలని నిర్ణయించబడింది. పట్టణ ప్రజల కొరకు ఆహారధాన్యాలు గ్రామాల నుండి సేకరించబడాలి. రేషనింగు విధానం ప్రవేశపెట్టబడింది. రేషనింగు షాపులు, చౌకడిపోలు, రేషనింగు ఇనస్పెక్టర్లు, సివిలు సరఫరా శాఖ వగైరాలతో విస్తృతమైన యంత్రాంగం రూపొందించబడింది. రేషనింగ్ సేకరణలకు సంబంధించిన సాధారణ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ సమస్యల సానుకూల పరిష్కారానికి ప్రయత్నాలు జరిగాయి. కాని ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచాలనే ప్రాథమిక సమస్య పరిష్కరింపబడలేదు. 1947లో దేశ విభజనానంతరం వ్యవసాయ సమస్యలు, ఆహార కొరత సమస్య తీవ్రతరమయ్యాయి. కేంద్రంలో రాష్ట్రాలలో వ్యవసాయశాఖల్ని పటిష్టం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. అలాగే ఆహార ధాన్యాల సేకరణ, రేషనింగు యంత్రాంగం కూడా పటిష్టం చేయబడింది.

## పరిశ్రమలు రక్షణ సమస్య:

మొదటి ప్రపంచయుద్ధం ప్రభుత్వ రక్షణతో కొన్ని పరిశ్రమల స్థాపనకు దారితీసింది. రాయల్ పారిశ్రామిక కమిషన్ (1916–18) భారతదేశాన్ని పారిశ్రామికీకరణ చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ప్రభుత్వం చురుకైన పాత్ర నిర్వహించాలని కోరింది. భారత ప్రభుత్వ బిల్లు 1919పై నియమింపబడిన జాయింటు సెలెక్టు కమిటీ భారతదేశానికి స్వతంత్ర ఖజానా విధానాన్ని మంజూరు చేయాలని సిఫార్సు చేసింది. భారత రాజ్య కార్యదర్శి అందుకు అంగీకరించి, సామ్రాజ్యవాద ప్రాధాన్యతతో పాటు భారత ప్రభుత్వ వాణిజ్య సుంకాల విధానాన్ని పరిశీలించి భారతదేశానికి తగిన విధానాన్ని సిఫార్సు చేయవలసిందిగా భారత ఖజానా కమిషన్ (Indian Fiscal Commission)ని నియమించాడు.

భారత ఖజానా కమిషన్ విచక్షణాత్మక రక్షణ విధానాన్ని సిఫార్సు చేసింది. పరిశ్రమలు కోరుతున్న రక్షణల్ని పరిశీలించేందుకు సుంకాల బోర్డు (Tariff Board) ని నియమించింది. రక్షణ కోరే పరిశ్రమకు సుంకాల బోర్డు మూడు షరతుల్ని విధించింది.

1. సమృద్ధిగా లభ్యమయ్యే ముడి పదార్థాలూ చౌక ఇంధనమూ, చాలినంత మంది శ్రామికులూ, పెద్ద స్వదేశీ మార్కెట్లూ లాంటి సహజ సౌకర్యాలు ఆ పరిశ్రమకు వుండాలి.

2. ఆ పరిశ్రమ రక్షణ సహాయం లేకపోతే దేశ ప్రయోజనాల దృష్ట్యా వాంఛనీయమైనంత వేగంగా గానీ బొత్తిగా గానీ అభివృద్ధి చెందజాలనిదిగా వుండాలి.

3. కొంత కాలం తరువాత ఆ పరిశ్రమ రక్షణ లేకుండానే ప్రపంచ పోటీని ఎదుర్కొన గలిగేదిగా వుండాలి.

భారతదేశ ప్రభుత్వం ఖజానా కమిషన్ సిఫార్సులను అంగీకరించింది. 1923లో సుంకాల బోర్డుని నియమించింది. రక్షణ కోరే పరిశ్రమల విజ్ఞప్తుల్ని బోర్డు పరిశీలించింది. బోర్డు సిఫార్సుల మేరకు ఇనుము, ఉక్కు, నూలు వస్త్రాలు, చక్కెర, అగ్గిపెట్టెలు లాంటి పరిశ్రమలకు రక్షణ కల్పించబడింది. రక్షణ సహకారంతో ఈ పరిశ్రమలు గణనీయమైన అభివృద్ధి సాధించాయి. బోర్డు సిఫార్సుల మేరకు జింకు, గంధకం యంత్రాలు లాంటి వాటిపై సుంకాలు రద్దు చేయబడ్డాయి. ముడి వనరులపై పన్నుల రద్దు ఉక్కు రసాయనాల నూలు వస్త్రాల అభివృద్ధికి గణనీయంగా తోడ్పడింది.

**సామ్రాజ్యవాద ప్రాధాన్యత:**

మొదటి ప్రపంచ యుద్ధానికి ముందే సామ్రాజ్యవాద ప్రాధాన్యత ఆలోచన బలం పుంజుకొంటూ వచ్చింది. యుద్ధానంతర మాంద్యం (1919–23), దాని ఫలితంగా ఇంగ్లాండులో పెరిగిన నిరుద్యోగం – సామ్రాజ్యవాద ప్రాధాన్యత అవసరాన్ని నొక్కి చెప్పాయి. అమెరికా, జర్మనీ, జపాన్‌ల నుండి ఎదురైన తీవ్రమైన పోటీ సామ్రాజ్యవాద ప్రాధాన్యతని గురించి ఇంగ్లాండు ఆలోచించేలా చేసింది. ఇబ్బందుల నుండి బయటపడేందుకు ఇంగ్లాండుకి అదొక్కటే మార్గాంతరంగా కనిపించింది.

సామ్రాజ్యవాద ప్రాధాన్యత సమస్యని పరిశీలించిన భారత ఖజానా కమిషన్ అది భారతదేశానికి ప్రత్యేకంగా ఒనగూర్చే ప్రయోజనం లేదని చెప్పింది. ఎందువలన నంటే భారతదేశం నుండి ప్రధానంగా ముడిసరుకులు, ఆహార ధాన్యాలు ఎగుమతి చేయబడుతున్నాయి. పన్నులు లేకుండా ఇంగ్లాండు వాటిని దిగుమతి చేసుకొంటుంది. వాటికి గిరాకీవుంది. ఐనప్పటికి బ్రిటిషు సామ్రాజ్యంలోని వివిధ దేశాల మధ్య సంబంధాలను పటిష్టం చేయడానికి, గ్రేట్ బ్రిటన్‌కి భారతదేశం యొక్క విధేయతని చాటి చెప్పడానికి సామ్రాజ్యవాద ప్రాధాన్యత విధానాన్ని అమలు చేయవలసిందిగా కమిటీ సిఫార్సు చేసింది.

1927లో బోర్డు బ్రిటిషు ఉక్కుకి ప్రాధాన్యతతో కూడిన ఆదరణ వుండాలని సిఫార్సు చేసింది. అంతేగాక 1932 అట్టావా వాణిజ్య ఒప్పందం, 1933 మోడీ–లీస్ ఒప్పందం; 1935, 1939 భారత బ్రిటిషు వాణిజ్య ఒప్పందాలు వివిధ బ్రిటిషు వస్తువులకు ప్రాధాన్యతతో కూడిన ఆదరణ అవకాశం కల్పించాయి. ఈ ప్రాధాన్యతతో కూడిన ఆదరణ భారతదేశానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చకపోవడమే గాక భారతదేశం విచక్షణాత్మక రక్షణ క్రింద పొందుతున్న ప్రయోజనాలను లాగివేసింది.

చాలా లోపాలున్నప్పటికి విచక్షణాత్మక రక్షణ విధానం భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి రంగంలో ముఖ్యమైన ముందడుగుగా పరిగణింపబడింది. నిస్సందేహంగా ఈ విధానం తీవ్రమైన ఆర్థిక మాంద్యం 1929–33 కాలంలో పరిశ్రమల్ని రక్షించడానికి మరికొన్ని పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడింది. ఇనుము, ఉక్కు, నూలు బట్టలు, చక్కెర, అగ్గిపెట్టెలు, కాగితం – లాంటివి ఈ విధానంతో ప్రయోజనం పొందిన కొన్ని ముఖ్యమైన పరిశ్రమలు.

**విచక్షణాత్మక రక్షణ - అట్టావా ఒప్పందాలు**

**విచక్షణాత్మక రక్షణ విధానం:**

విచక్షణాత్మక రక్షణ విధానం కొన్ని భారతదేశ పరిశ్రమల (ఇనుము, ఉక్కు, నూలు బట్టలు, చక్కెర, కాగితం వగైరాల)కు కొంత వరకు తోడ్పడినప్పటికి దేశ పారిశ్రామికీకరణకు పెద్ద ఎత్తున తోడ్పడలేదని విమర్శకుల అభిప్రాయం. ఈ విధానం రక్షణ రూపంలో కొంత సహాయపడింది. కాని ఈ విధంగా చేయబడిన సహాయం పూర్తిగా గాక అర్థమనస్కతతో చేయబడింది. పెరిగిన రైల్వే ఛార్జీలు యితరాలతో సమన్వయంతో జరగలేదు. అంటే దిగుమతి సుంకాలపై యిచ్చిన రాయితీ పెరిగిన రైల్వే ఛార్జీలు లేక యితరంగా పెరిగిన వ్యయం కారణంగా రాయితీగా మిగలని పరిస్థితి ఏర్పడింది.

విచక్షణాత్మక రక్షణ విధానంలో విచక్షణమాత్రమే వుంది, రక్షణ లేదని విమర్శకులు నిరసించారు. ఈ విధానం క్రింద ప్రభుత్వం అప్పుడున్న పరిశ్రమలకు ఒక రకమైన రక్షణ కల్పించింది. కాని కొత్త పరిశ్రమల స్థాపనకు సహాయం చేయలేదు. అంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పరిశ్రమ స్థాపించి ఒకమేరకు అభివృద్ధి పరచిన తరువాత ప్రభుత్వం కొంత రక్షణ కల్పించడాన్ని గురించి ఆలోచిస్తుంది. కాని వాస్తవంగా పారిశ్రామికవేత్తలకు పరిశ్రమ ప్రారంభించక ముందే రక్షణ హామీ అవసరమవుతుంది. రక్షణ మంజూరు చేయబడిన తరువాత కూడా ప్రభుత్వ సహాయం ప్రోత్సాహాలు అంతంత మాత్రంగానే వున్నాయి. ఫలితంగా ప్రభుత్వ వైఖరి పారిశ్రామిక వేత్తలలో విశ్వాసాన్ని పెంచలేకపోయింది.

1) ముడి వనరులు శ్రామికులు విస్తరించే మార్కెటు 2) రక్షణ లేకపోతే పరిశ్రమ అభివృద్ధి చెందలేదు. 3) ఎలాంటి రక్షణ లేకుండా పరిశ్రమ తన కాళ్లపై తాను నిలబడగలిగే స్థితిలో వుండాలి అని ప్రభుత్వం విధించిన మూడు షరతులు విమర్శల పాలయ్యాయి. మొదటి రెండు షరతుల మధ్య వైరుధ్యం వుంది. పరిశ్రమకి సానుకూలమైన అంశాలు వుంటే అది రక్షణ లేకుండానే అభివృద్ధి చెందుతుంది. అలాంటప్పుడు సానుకూలమైన అంశాలు షరతు ఎందుకు? జపాన్, లాంక్‌షైర్‌లోని నూలు బట్టల పరిశ్రమలు వాటికి అత్యవసరమైన ముడి వనరుల్ని భారతదేశం, ఆగ్నేయాసియా దేశాల నుండి దిగుమతి చేసుకొని అభివృద్ధి చెందలేదా? అంతేగాక ముడివనరులు లభించే కొత్త ప్రదేశాలు కనుగొనబడవచ్చు. మొత్తంగా ఈ విధానం పరిస్థితులు స్థిరంగా చలన రహితంగా వుంటాయనే వైఖరితో వుంది.

భారత పరిశ్రమలకు భారత ప్రభుత్వం రక్షణ కల్పించడంలో గ్రేట్ బ్రిటన్‌లోని స్వప్రయోజన పరులకు పెద్ద పాత్ర వుంది. బ్రిటిషు పరిశ్రమలకు ఎలాంటి యిబ్బంది కలుగకుండా జాగ్రత్త వహించబడింది. అంతేగాక సుంకాల బోర్డు నియమ నిబంధనలు భారత పరిశ్రమలకు తగు రక్షణ కల్పించేవిగా లేవు.

సామ్రాజ్యవాద ప్రాధాన్యతని అమలు జరపడం విచక్షణాత్మక రక్షణ కల్పించే ప్రయోజనాల్ని నిరర్థకం చేసింది. భారత పరిశ్రమలు ప్రధానంగా బ్రిటిషు పరిశ్రమలతో పోటీపడవలసి వచ్చింది. బ్రిటిషు పరిశ్రమల నుండి రక్షణ కోరబడింది. ఇనుము, ఉక్కు, నూలు వస్త్రాల లాంటి భారత పరిశ్రమలకు ఆటంకాలుగా వున్న పరిశ్రమలకు ప్రాధాన్యతతో కూడిన ఆదరణ మంజూరు చేయడం ద్వారా సామ్రాజ్యవాద ప్రాధాన్యతా విధానం విచక్షణాత్మక రక్షణని నిష్ఫలం చేసింది. విచక్షణాత్మక రక్షణతో పాటు వివిధ వాణిజ్య ఒప్పందాలు బ్రిటిషు వస్తువులకు భారతదేశాన్ని మార్కెటు చేశాయి.

విచక్షణాత్మక రక్షణ ఒప్పందంతో భారత జాతీయవాదులు అసంతృప్తి చెందారు. సిమెంటు, గ్లాసు, బొగ్గు, చమురు, ఊలు వస్తువుల లాంటి చాలా పరిశ్రమలకు రక్షణ ఏదో ఒక నెపంతో తిరస్కరించబడింది. ఆటో మొబైల్, నౌకానిర్మాణం, బేసిక్ పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వస్తువులు, విమానయానం లాంటి చాలా ముఖ్యమైన బేసిక్ పరిశ్రమలు ప్రభుత్వ సహాయం లేనిదే అభివృద్ధి చెందలేవు. ఇలాంటి పరిశ్రమలకు రక్షణ కల్పించే అంశం ప్రభుత్వం అసలు పరిగణనలోకి తీసుకోలేదు. ఫలితంగా దేశం స్వతంత్రమైనప్పుడు దేశానికి చెప్పుకోదగిన బేసిక్ భారీ పరిశ్రమలు (ఒక మేరకు ఇనుము, ఉక్కు మినహా) లేవు.

1929–33 కాలం నాటి తీవ్రమైన ఆర్థిక మాంద్యంతోను, స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని విడనాడి భారతదేశంతో సహా ప్రపంచంలోని వివిధ దేశాలతో సుంకాల రక్షణతో చేసుకొన్న వాణిజ్య ఒప్పందాలకు చాలా ప్రాధాన్యత లభించింది. వివిధ దేశాల వస్తువులపై విధించే సుంకాల రేట్లుని నిర్ణయించడంలో వివిధ వాణిజ్య దేశాలు నిమగ్నమయ్యాయి. పరిశీలనలో వున్న కాలంలో భారతదేశం ఇంగ్లాండు, జపాన్, ఆ తరువాత బర్మాతోను వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకొన్నది.

## అట్టావా వాణిజ్య ఒప్పందం 1932

సామ్రాజ్యవాద ప్రాధాన్యత సూత్రం ప్రాతిపదికగా అట్టావా ఒప్పందం 1932లో జరిగింది. సామ్రాజ్యవాద ప్రాధాన్యత యొక్క లక్ష్యం బ్రిటిషు సామ్రాజ్యంలోని దేశాలలో వాణిజ్యాన్ని అభివృద్ధి పరచడం – యింకా ముఖ్యంగా విదేశీ వాణిజ్యరంగంలో దిగజారుతున్న ఇంగ్లాండుకు సహాయపడడం. అట్టావా ఒప్పందాన్ని అనుసరించి బ్రిటను దిగుమతి పన్నుల చట్టం క్రింద 10 శాతం పన్నులు చెల్లించే భారతదేశ వస్తువుల్ని ఎలాంటి పన్నులు చెల్లించకుండా అనుమతించింది. అంతేగాక నూలు, జనపనార వస్తువులు, తోళ్లు, పొగాకు, టీ, కొబ్బరిపీచు, దారం, వేరుశనగ లాంటి భారతదేశ వస్తువుల ప్రాధాన్యతని తగ్గించకుండా వుండేందుకు అంగీకరించింది. అంతేగాక యూరపేతర దేశాల నుండి వచ్చే వరి, గోధుమ, చమురు, అవిశనూనె లాంటి వస్తువులపై కొత్తగా ఎక్కువ పన్నులు విధించేందుకు అంగీకరించింది.

దానికి బదులుగా ఇంగ్లాండు నుండి భారతదేశానికి దిగుమతి చేయబడుతున్న కొన్ని తరహా మోటారు వాహనాలపై భారతదేశం 7.5 శాతం ప్రాధాన్యతని, భారతదేశానికి దిగుమతి అయ్యే 163 రకాల వస్తువులపై 10 శాతం సుంకం ప్రాధాన్యతని అనుమతించింది.

భారతదేశ వస్తువుల ధరలు పడిపోతున్నప్పుడు వాటికి శాశ్వత మార్కెట్లు కల్పించేందుకు ఒప్పందం హామీ యిచ్చిందని అట్టావా ఒప్పందాన్ని ప్రతిపాదన చేసినవారు చెప్పుకొన్నారు. భారతదేశ వస్తువుల ధరలు తగ్గకుండా ఆపి ధరల్ని స్థిరంగా వుంచేందుకు, ఆ విధంగా ఉత్పత్తి దారులు మంచి ధరలు పొందేందుకు ఒప్పందం తోడ్పడిందని వాదించారు. కాని అట్టావా ఒప్పందాన్ని భారతజాతీయవాదులు వ్యతిరేకించారు. భారతదేశ ఎగుమతులు ప్రధానంగా ముడివనరులని, వాటికి బ్రిటన్‌లోనే గాక యితరదేశాలలో కూడా నమ్మకమైన మార్కెట్లు వున్నాయని కాబట్టి భారతదేశానికి బ్రిటన్ యొక్క ప్రాధాన్యతతో కూడిన ఆదరణ అవసరం లేదని జాతీయవాదులు వాదించారు. అంతేగాక ప్రాధాన్యతతో కూడిన ఆదరణ అవసరమైన ముడి ప్రత్తి లాంటి వస్తువులకు బ్రిటన్ ప్రాధాన్యత మంజూరు చేయలేదని, అలాంటి అవసరం లేని యిప్పటికే ఇంగ్లాండు మార్కెటులో గిరాకీ వున్న టీ, జనపనార, తోళ్ళు లాంటి వస్తువులకు మంజూరు చేసిందని జాతీయ నాయకులు వాదించారు. అంతేగాక అట్టావా ఒప్పందంతో బ్రిటన్‌కి భారతదేశ వస్తువుల ఎగుమతి పెరగడానికి కారణం బ్రిటన్ మంజూరు చేసిన ఆదరణతో కూడిన ప్రాధాన్యత కాదు; పారిశ్రామికాభివృద్ధి అని విమర్శకుల అభిప్రాయం. ఇంకా ముఖ్యమైన విషయమేమంటే ఇంగ్లాండు వస్తువులు జర్మనీ జపాన్ లాంటిదేశాలతో తీవ్రమైన పోటీ ఎదుర్కొంటున్న సమయంలో ఒప్పందం భారతదేశంలో బ్రిటిషు వస్తువులకు శాశ్వత మార్కెటు సౌకర్యం కల్పించింది. అట్టావా ఒప్పందంపై భారతదేశంలో తీవ్రమైన ప్రతికూలత వ్యక్తమయింది. ఒప్పందాన్ని ఆరు నెలల్లో రద్దు చేయాలని భారతదేశ ప్రభుత్వం ఇంగ్లాండుకి నోటీసు పంపించింది. ఇది చాలా రాయబారాలకు, భారత ఇంగ్లాండు దేశాల మధ్య కొత్త వాణిజ్య ఒప్పందం జరిగే వరకు ఈ ఒప్పందం కొనసాగింపుకి దారితీసింది.

## మోడీ - లీస్ ఒప్పందం 1933

బ్రిటిషు వస్త్రాలపై భారతదేశం దిగుమతి పన్నులు విధించడం వలన, జపనీయులు పోటీ వలననూ బ్రిటిషు వస్త్ర ఉత్పత్తిదారులు చాలా ప్రతికూల పరిస్థితుల నెదుర్కోవలసి వచ్చింది. భారతదేశ మార్కెట్లలో వారి స్థితిని కాపాడుకొనేందుకు ఒక ప్రయత్నం చేశారు. భారత బ్రిటిష్ వస్త్ర పారిశ్రామిక వేత్తలు మధ్యచర్చలు జరిగాయి. విభేదాల కారణంగా భారత పారిశ్రామిక వేత్తలు కలిసికట్టుగా లేరు. ఫలితంగా భారత బ్రిటిషు పారిశ్రామిక వేత్తలు ఒక ఒప్పందానికి రాలేక పోయారు. కాబట్టి లాంక్‌షైర్ పారిశ్రామిక వేత్తలు బొంబాయి మిల్లు యాజమానుల సంఘం (భారతదేశంలోని వస్త్ర పరిశ్రమలో 50 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తుంది)తో 1933లో మోడీ–లీస్ ఒప్పందంగా పిలువబడే ఒక ఒప్పందానికి వచ్చారు.

బ్రిటిషు నూలు సిల్కు వస్త్రాలకు అనుకూలంగా పన్నులు విధించబడాలని అంగీకరించబడింది. దానికి ప్రతిఫలంగా బ్రిటిషువారు భారతదేశ ప్రత్తిని లాంక్‌షైర్‌లోను భారత పారిశ్రామిక ప్రయోజనాలను విదేశాలలోను వలసవాద మార్కెట్లలోను ప్రోత్సహిస్తామని వాగ్దానం చేశారు. ఈ అంశాలు భారత వాణిజ్య సుంకాల చట్టం 1934లో చేర్చబడ్డాయి.

మోడీ–లీస్ ఒప్పందం 1935 డిసెంబరు 31 వరకు అమలులో వుంటుంది. మోడీ–లీస్ ఒప్పందం లాంక్‌షైర్ వస్త్ర పరిశ్రమకి నిర్దిష్టమైన ప్రయోజనాలు చేకూర్చింది. ప్రతిఫలంగా 'వలస దేశాల మార్కెట్లలో భారత ప్రయోజనాలను కాపాడడం' లాంటి శుష్కవాగ్దానాలు పొందింది. ఫలితంగా మోడీ–లీస్ ఒప్పందం తీవ్ర విమర్శలకు గురయింది.

**భారత బ్రిటిషు వాణిజ్య ఒప్పందం 1935**

1935 ఒప్పందం అట్టావా వాణిజ్య ఒప్పందం 1932కి అనుబంధం. ఈ ఒప్పందం లోని ముఖ్యమైన అంశాలు: బ్రిటిషు వస్తువులకు ప్రాధాన్యతతో కూడిన ఆదరణ; ఖజానా కమిషన్ నిర్దేశించిన మూడు షరతులను పాటించిన భారతదేశ పరిశ్రమలకు రక్షణ కల్పించుట; ఏ బ్రిటిషు పరిశ్రమకైనా భారతదేశ సుంకాల బోర్డు ఎదుట తన వాదన చెప్పుకొనేందుకు అవకాశం కల్పించుట; భారతదేశ పరిశ్రమలు ప్రస్తావించే ఏ అంశానికైనా జవాబు చెప్పుకొనే అవకాశం కల్పించుట; బ్రిటిషు ప్రభుత్వం గాని భారత ప్రభుత్వంగాని కోరితే ప్రస్తుత పన్నుల విధింపులో గల సమంజసత్వంపై విచారణ జరిపించుట. అందుకు ప్రతిఫలంగా భారతదేశ ముడివనరుల్ని – ప్రత్యేకించి ప్రత్తి దిగుమతిని ప్రోత్సహించేందుకు బ్రిటన్ చర్యలు చేపడుతుంది. అలాగే బ్రిటిషు ఉక్కు వస్తువులపై సుంకాల రాయితీ కొనసాగినంత కాలం భారతదేశం యొక్క ఉక్కు, ఇనుమును సుంకాలు లేకుండా బ్రిటన్ దిగుమతి చేసుకొంటుంది.

భారత బ్రిటిషు వాణిజ్య ఒప్పందం బ్రిటిషు పరిశ్రమలకు గణనీయమైన రాయితీలు కల్పించింది. ఈ రాయితీలు భారత పరిశ్రమలకు ప్రతికూలంగా వున్నాయి. ప్రజాభిప్రాయంకు వ్యతిరేకంగా వుంది. భారతదేశ చట్టసభ తిరస్కరించింది. గవర్నరు జనరల్ ఇన్ కౌన్సిల్ సర్టిఫికేషన్ ద్వారా ఒప్పందం అమలు జరిగింది. ఒప్పందం 1939 మార్చి 31 వరకు అమలులో వుంది. ఆ తరువాత పునరుద్ధరించబడిన భారత బ్రిటిషు వాణిజ్య ఒప్పందం 1939లో అమలులోకి వచ్చింది.

**భారత బ్రిటిషు వాణిజ్య ఒప్పందం 1939**

భారత చట్టసభచే తిరస్కరించబడిన ఈ ఒప్పందం కూడా 1935 ఒప్పందం లాగానే సర్టిఫికేషన్ ద్వారా చట్టం చేయబడింది. బ్రిటిషు వస్తువులపై ప్రాధాన్యతతో కూడిన సుంకాల కొనసాగింపు, దానికి బదులుగా భారతదేశ ముడివనరుల్ని సుంకాలు లేకుండా బ్రిటన్‌లోకి అనుమతించడం – ఈ ఒప్పందంలోని ప్రధానాంశం. ఈ ఒప్పందంలో గమనించవలసిన అంశమేమి టంటే భారతదేశం నుండి ఎగుమతి చేయబడే ప్రత్తికి బ్రిటిషు వస్త్రాల దిగుమతికి లంకెపెట్టడం.

బ్రిటన్ భారతదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలుగా చెప్పబడే ఈ ఒప్పందాలు – బ్రిటన్ తన పరిశ్రమలకు ఎలాంటి రక్షణ కల్పించిందీ; విచక్షణాత్మక రక్షణ విధానం పేరుతో కల్పించబడిన కొద్దిపాటి రక్షణ కూడా వాణిజ్య ఒప్పందాల ద్వారా ఎలా నిర్వీర్యం చేసిందీ, బ్రిటిషు ప్రభుత్వం భారతదేశ చట్టసభ యొక్క ఆకాంక్షల్ని ఏవిధంగా తిరస్కరించిందీ – మొత్తంగా స్వతంత్రానికి ముందు భారతదేశం యొక్క వాణిజ్య పారిశ్రామిక విధాన రూపకల్పనలో బ్రిటిషు వారి ఆధిపత్యం ఎలా సాగిందీ స్పష్టం చేశాయి.

# 9

# ఆధునిక పరిశ్రమ పుట్టుక - పెరుగుదల

ప్రారంభంలో బ్రిటిషిండియాలో ఆధునిక వాణిజ్యం పరిశ్రమలు ప్రధానంగా యూరపువారివే. 19వ శతాబ్దం చివరిలో భారతీయుల యాజమాన్యంలో బొంబాయి, అహమ్మదాబాదులలో ఆధునిక పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. 1850–1880 కాలంలో తూర్పు భారతదేశంలో టీ తోటలు, బొగ్గుగనులు, జనపనార మిల్లుల్ని యూరపు వర్తకులు అభివృద్ధి పరచారు. బొంబాయి ప్రెసిడెన్సీకి గల ప్రత్యేక పరిస్థితుల రీత్యా అమెరికా అంతర్యుద్ధానికి ముందూ, ఆ తరువాత పార్సీ, గుజరాతీ పారిశ్రామిక వేత్తలు బొంబాయిలో ప్రత్తిమిల్లులు అభివృద్ధి పరచారు. దేశంలోని లోతట్టు ప్రాంతాలలో గల వర్తకులు వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటు సౌకర్యాలు కల్పించడం, వర్తకానికి పెట్టుబడులు పెట్టడం, చేతి వృత్తుల ఉత్పత్తుల్ని రైతుల పంటల్ని రవాణా చేయడం లాంటి పనులలో నిమగ్నమయ్యారు. దేశీయ కమిషన్ ఏజన్సీల ద్వారా బిల్లుల మారకం పద్ధతిని ఈ కార్యాకలాపాలు సాగించారు. వర్తకులు బ్యాంకర్లు పెట్టుబడిని పోగుచేసుకొనడానికి, దేశీయ మార్కెటులోని దూరప్రాంతాలకు సంబంధాలేర్పరచడానికి ఈ మార్కెటు కార్యకలాపాలు తోడ్పడ్డాయి. పరిశ్రమలు స్థాపించిన తరువాత వారికి ఈ సంబంధాలు ఉపకరించాయి. బ్యాంకర్లు వర్తకులు పారిశ్రామికులుగా ఎదిగిన క్రమంపై అధ్యయనాలు జరిగాయి.

తీవ్రమైన చర్చనీయాలుగా వున్న అంశాలపై ప్రత్యేకించి భారత పరిశ్రమల అభివృద్ధి (లేక వెనుకబాటు తనం)పై బ్రిటిషు పెట్టుబడి, బ్రిటిషు ప్రభుత్వం యొక్క ప్రభావంపై ఒక అభిప్రాయానికి రావలసి వుంది. ఒక రకమైన ఆలోచనా ధోరణి ననుసరించి పారిశ్రామిక వెనుకబాటుతనానికి కారణం వలసపాలన, మరొక ఆలోచనా ధోరణికి చెందినవారు. భారతదేశపు ఆర్థిక పరిస్థితులు కారణంగా చెపుతారు. మొదటి కోవకి చెందిన వారు రాజ్యం అనుసరించిన స్వేచ్ఛా వాణిజ్య ఆర్థిక విధానాల కారణంగా 19వ శతాబ్దంలో భారతదేశంలో

పారిశ్రామీకీకరణ జరగలేదని వివరిస్తారు. సామ్రాజ్యం అత్యున్నత దశలో వున్న 1900 సంవత్సరం కాలంలో పీకనులిమే బ్రిటిషువారి గుత్తాధిపత్యాన్ని వర్ణించి ఆ తరువాత 1914లో వలస చట్రం కుదిపివేయబడటంతో 1920, 1930 దశాబ్దాలలో భారతీయుల చొరవతో పరిమితమైన పారిశ్రామికాభివృద్ధి జరిగిన క్రమాన్ని వివరిస్తారు. మరొక ఆలోచనా ధోరణికి చెందిన వారు భారతదేశ ఆర్థిక నిర్మాణం యొక్క సాంకేతిక వెనుకబాటుతనం భారీ పరిశ్రమల అభివృద్ధికి ఆటంకంగా నిలిచింది అన్నారు. కాని వెనుకబాటు తనానికి చెందిన వివరణ, భారతదేశ నాగరికత, హిందూమత సాంప్రదాయాలు, కుల వ్యవస్థకి వర్తింపజేయరు. విలువలు సాంప్రదాయాలను గురించి విమర్శనారహితమైన సాధారణీకరణలు చేయడానికి బదులుగా ఆర్థిక చరిత్రకారులు సరఫరా డిమాండు అంశాలపై కేంద్రీకరించి అధ్యయనం చేస్తున్నారు.

ఈ అధ్యయనం భారతదేశంలోని పారిశ్రామిక చరిత్రకి సంబంధించిన చాలా ప్రశ్నల్ని ప్రస్తావిస్తుంది. భారతదేశ పెట్టుబడిని పరిశ్రమలకు అనుసంధానం చేయడం ఎందు కంత ఆలస్యంగా జరిగింది? యూరపు పారిశ్రామికవేత్తలు ఏ పరిస్థితులలో కార్పొరేటు పారిశ్రామిక కార్యక్రమాలు తమకు మాత్రమే పరిమితం చేసుకోగలిగారు? ఆర్థికాభివృద్ధి పరంగా భారతదేశానికి యూరపు పారిశ్రామికవేత్తలు ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చారు? పరిశ్రమల స్థాపనలో బొంబాయి మాత్రమే ఎందుకు ముందుకడుగేయగలిగింది? ఇలాంటి ప్రశ్నలకు 'భారతదేశ ఆర్థిక విధానం పారిశ్రామిక విప్లవాన్ని ఎందుకు తీసుకురాలేకపోయింది' – అనే ప్రాథమిక ప్రశ్నతో సన్నిహిత సంబంధాలు వున్నాయి. భారత ఆర్థిక విధానం 19వ శతాబ్దంలో ఊపందుకోడానికి వీలుపడనంతగా 1800 సంవత్సరాల కాలం వెనుకబడివున్నదా? బ్రిటిష పాలకులు హస్తకళల్ని చేతివృత్తుల్ని ధ్వంసం చేయడం వలన వెనుకబాటుతనం పెరిగిందా?

**పారిశ్రామిక ఉత్పత్తి - ఉపాధి**

19వ శతాబ్దంలో చేతివృత్తుల ఉత్పత్తుల తగ్గుదల యింతకు ముందు వివరించబడింది. దీనిపై చేసే విశ్లేషణ ఆధునిక పరిశ్రమ పెరుగుదల గురించి సమగ్రమైన అవగాహన కల్పిస్తుంది. ఆర్థిక వ్యవస్థలోని రెండవ రంగంలో ఉపాధికి సంబంధించి లభ్యమయ్యే గణాంక వివరాలను బట్టి 19వ శతాబ్దంలో ఫ్యాక్టరీలు గనులు ఆవిర్భవించినప్పటికి పరిశ్రమలపై ఆధారపడిన ప్రజల నిష్పత్తి గణనీయంగా తగ్గింది.

1800 సంవత్సరం ప్రారంభంలో పరిశ్రమలపై ఆధారపడిన ప్రజల నిష్పత్తి 1900 సంవత్సరంతో పోల్చేందుకు ఒకరు సేకరించిన గణాంక వివరాలు మాత్రమే వున్నాయి. ఇవి 1809లో హేమిల్టన్ బీహారులోని గంగామైదానం జిల్లాల నుండి సేకరించిన వివరాలు. వీటిననుసరించి 1809లో పరిశ్రమలపై ఆధారపడి జీవనం సాగించే వారు 18.6 శాతం వుండగా 1901లో అది 8.5 శాతానికి తగ్గింది. తరుగుదలకి కారణం ఈ శతాబ్దంలో బీహారులోని గంగామైదాన జిల్లాలలో నూలు వడికే, బట్టలు నేసే కార్మికుల సంఖ్య తగ్గిపోవడం.

హామిల్టన్ సర్వేపై సందేహాలు వ్యక్తమయ్యాయి. 19వ శతాబ్ద ప్రారంభంలో చేయబడిన సర్వే అదొక్కటే. ఊహాజనితమైన ఆధారాల కంటే హామిల్టన్ గణాంకాలే విశ్వసనీయాలు. సమకాలీన పరిశీలకులు కూడా వీటిని ఆమోదించారు. కాబట్టి 19వ శతాబ్దపు భారతదేశంలో ఆధునిక ఫ్యాక్టరీలు స్థాపించబడినప్పటికి పరిశ్రమలలో ఉపాధి, ఉత్పత్తి తగ్గిందని నిర్ధారణకు రావచ్చు.

20వ శతాబ్దపు ప్రారంభంలో చేతివృత్తుల ఉత్పత్తులలో తగ్గుదల ఆగిపోయిందని సాక్ష్యాధారాలు వున్నాయి. 1880, 1890 దశాబ్దాలలో ఆధునిక పరిశ్రమలు వేగంగా విస్తరించాయి. 1882లో 282 మిలియన్ల రూపాయలుగా వున్న ఉత్పత్తి 1899 నాటికి 820 మిలియన్ల రూపాయలకు పెరిగింది. 1900 సంవత్సరం ప్రాంతంలో ఫ్యాక్టరీల సంఖ్య పెరగడమే గాక చేతివృత్తుల పరిశ్రమలు కూడా నెమ్మదిగా నైనా గణనీయంగా పెరిగాయి. భారతీయ పరిశ్రమల – అటుచేతివృత్తుల యిటు ఆధునిక పరిశ్రమల ఉత్పత్తులు 1900–1947 కాలంలో పెరిగాయి. 1900 సంవత్సరంలో పారిశ్రామిక ఉత్పత్తులు 1638 మిలియన్ల రూపాయలుగా వుండగా 1946 నాటికి 4307 మిలియన్ల రూపాయలకు పెరిగాయి. మొదటి ప్రపంచ యుద్ధకాలం నుండి స్వతంత్రం వచ్చేవరకు ఫ్యాక్టరీ పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందాయి. వార్షిక అభివృద్ధి రేటు 14.5 శాతం కాని రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యే వరకు చేతివృత్తుల ఉత్పత్తి ఫ్యాక్టరీల ఉత్పత్తి కంటే ఎక్కువగా వుంది. భారతదేశం సాధించిన ఈ అభివృద్ధి యితర పారిశ్రామిక దేశాల కంటె భిన్నమైన అభివృద్ధి. 1900–1946 మధ్య చేతివృత్తుల ఉత్పత్తుల అభివృద్ధి రేటు 1.2 శాతానికి మించగా మొత్తం పారిశ్రామిక రంగం ఉత్పత్తులు 3.5% రేటున పెరిగాయి. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో ఆధునిక పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందినట్లు కనిపించినప్పటికి భారతదేశాన్ని పారిశ్రామిక విప్లవ మార్గంలో పెట్టగలిగినంత అభివృద్ధి రేటు కాదు.

ఆధునిక పారిశ్రామిక పెరుగుదలను వేరుగా చూస్తే అది పెరుగుదలపై తప్పుడు అవగాహనని కలిగిస్తుంది. అందుకు కారణం భారతదేశంలో ప్రధానంగా వున్న వ్యవసాయ చేతివృత్తుల ఆర్థిక వ్యవస్థలో గనుల పరిశ్రమ ఉత్పత్తి కొద్ది భాగం మాత్రమే. యుద్ధకాలంలో మాత్రమే ఆర్థిక వ్యవస్థలో చిన్న కుటీర పరిశ్రమల కంటె ఆధునిక పరిశ్రమ గణనీయమైన రంగమయింది. ఆధునిక పరిశ్రమల అభివృద్ధి రేటును విడిగా చూస్తే అది ప్రారంభమైన 19వ శతాబ్దపు మధ్య కాలం నుండి 20వ శతాబ్దపు తొలి సంవత్సరాల వరకు బాగానే వుంది. పరిశ్రమలు రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలోను, ఆర్థిక మాంద్యం కాలంలోనూ బాగానే అభివృద్ధి చెందాయి. కాని ఫ్యాక్టరీ ఉత్పత్తులు మొత్తం జాతీయ ఉత్పత్తిలో చిన్న భాగమే గనుక ఈ అభివృద్ధి ఆర్థిక వ్యవస్థ యొక్క వృత్తి పరమైన చట్రంపై స్పష్టమైన ప్రభావం చూపలేక పోయింది.

భారత ఉపఖండం యొక్క ప్రజల ఉపాధి చట్రం 1881–1951 కాలంలో మార్పులకు గురికాకుండా యధాతథంగా వుంది. వ్యవసాయం 70 శాతం పరిశ్రమలు దాదాపు 10

శాతం సేవలు 10 నుండి 20శాతం ఉపాధి కల్పించాయి. పరిశ్రమ ఎక్కువ శ్రమశక్తిని యిముడ్చుకోలేకపోయింది. అంతేగాక దానిపై ఆధారపడి బతికే వారి శాతం తగ్గింది. 1881 లో పరిశ్రమలు మొత్తం పురుషులలో 10.6 శాతానికి ఉపాధి కల్పించాయి. 1911 నాటికి యిది 9.1 శాతానికి తగ్గింది. 20వ శతాబ్దం మొదటి అర్థభాగంలో, ఆధునిక పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నట్లు కనిపించిన కాలంలో వాటిలో పనిచేసే కార్మికుల శాతం తగ్గడం గమనించవలసిన అంశమే. 1901లో స్త్రీ, పురుష కార్మికుల శాతం 10.1 వుండగా, 1951 నాటికి 8.7 శాతానికి తగ్గింది.

1900 నుండి 1946 వరకు గల కాలంలో దేశీయ ఉత్పత్తికి పరిశ్రమల తోడ్పాటు వ్యవసాయంతో పోల్చితే పెరిగింది. ఆధునిక పరిశ్రమల్ని సక్రమంగా నడపడం వలన యిది సాధ్యపడింది. చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు చాలా నెమ్మదిగా అభివృద్ధి చెందిన కాలంలో పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందాయి. చేతివృత్తులు 19వ శతాబ్దంలో క్షీణించగా 20వ శతాబ్దంలో పరిశ్రమలు చేతివృత్తులు కలగలిపిన తరహా విధానం అభివృద్ధి చెందింది. ఫ్యాక్టరీ పరిశ్రమ ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల (ఒక కార్మికుని ఉత్పత్తి సూచిక 1900లో 100 వుండగా 1946లో 149.7) ఫ్యాక్టరీలలో అంతగా పెరగని ఉపాధి (1901లో ఉప ఖండంలో కార్మికుల సంఖ్య 0.6 మిలియన్లు వుండగా 1951కి 2.9 మిలియన్లకు పెరిగింది). నెమ్మదిగా విస్తరించిన చేతివృత్తుల ఉత్పత్తులు (వారి సంఖ్యలో 12.6 నుండి 11.4 మిలియన్లకు తగ్గింది. తలసరి ఉత్పత్తి సూచిక 100 నుండి 168.6కి పెరిగింది.) ఇది పరిమిత తరహా పారిశ్రామికీకరణ ఐనప్పటికి ఈ క్రమంలో భారతదేశం 1947 నాటికి మూడవ ప్రపంచ దేశాల స్థాయిలో ఒక విస్తృతమైన పరిశ్రమల సముదాయం గల దేశంగా ఎదిగింది. ఈ పరిశ్రమలు బలమైన దేశీయ పెట్టుబడిదారీ వర్గం అధీనంలో వున్నాయి.

**భారతదేశ ఆర్థిక విధానం స్వభావం-మార్కెటు:**

పరిశ్రమల పెరుగుదల, తరుగుదల యొక్క మిశ్రమ ధోరణులను సాంప్రదాయ ఆర్థిక విధానాల వర్గీకరణ ననుసరించి అవగాహన చేసుకొనడం సాధ్యపడదు. ఆర్థిక వేత్తలు పశ్చిమయూరపు ఉత్తర అమెరికా ఆర్థిక విధానాలను మూడు రకాలుగా వర్గీకరించారు. మొదటిరంగం వ్యవసాయం, రెండవ రంగం పరిశ్రమలు; మూడవ రంగం సేవలు. ఈ వర్గీకరణ వ్యవసాయంతో సన్నిహిత సంబంధం గల అనేక చేతివృత్తులు గల వ్యవసాయిక దేశమైన భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా లేదు. పారిశ్రామిక దేశాలలా గాక భారతదేశానికి బ్రిటిషు పాలన అంతమయ్యే వరకు పరిశ్రమల నుండి గాక చేతివృత్తుల నుండి ఎక్కువ జాతీయాదాయం వచ్చింది. చేతివృత్తులు రైతాంగ ఆర్థిక విధానంలో అవిచ్ఛిన్న భాగం గనుక ఆధునిక పరిశ్రమల్ని పాత చేతివృత్తుల్ని కలిపి పరిశ్రమల రంగంగా వర్గీకరించడం సరియైన పద్ధతి కాదు. రైతుల చేతివృత్తుల వారి కుటుంబపరమైన ఆర్థిక విధానం, ఆధునిక పారిశ్రామిక విధానం యొక్క ఆర్థిక వ్యవహారాలకు భిన్నమైనది.

వలసపాలనలో వున్న భారత సమాజం యొక్క ఆర్థిక వ్యవస్థ ద్వంద స్వభావం గలది. అంటే ఒకవైపు విదేశీ వర్తకం, ఫ్యాక్టరీ పరిశ్రమలు, బ్యాంకులు, కార్పొరేషన్లు, మేనేజింగు ఏజన్సీల లాంటి నిర్మాణబద్ధమైన రంగానికి చెందింది. మరొక వైపు దేశీయ బ్యాంకర్లు, వర్తకులు, వడ్డీ వ్యాపారులు, రైతులు చేతివృత్తుల వారూ గల నిర్మాణబద్ధంగాని రంగానికి చెందింది. పాశ్చాత్య తరహా సంస్థలు నిర్మాణబద్ధమైనవిగాను, సాంప్రదాయ ఆర్థిక సంస్థల్ని నిర్మాణ బద్ధం కానివిగానూ పరిగణించడం - దేశీయ ఆర్థిక వ్యవస్థలోని సంక్లిష్టతను విస్మరించడమే అవుతుంది. దేశీయ ఆర్థిక వ్యవస్థకు తనవైన స్వంత సంస్థలున్నాయి. నిర్మాణ బద్ధమైన రూపాలున్నాయి. ఇవి పాశ్చాత్య నమూనాకి భిన్నంగా వుండవచ్చు. కాని యివి కూడా మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా మార్పు చెందగలవే. ద్రవ్య పరిస్థితులపై ప్రభుత్వ రిపోర్టులు బజారుగా ప్రస్తావించే వాణిజ్యం రుణాలకు సంబంధించిన భాగానికి కొంత చలనశీలత వుంది. ఈ బజారు నుండే 19వ శతాబ్దం చివరిలోను 20వ శతాబ్దం లోనూ భారతీయ పారిశ్రామిక పెట్టుబడిదారులు ఆవిర్భవించారు. కాబట్టి ఆర్థిక వ్యవస్థలో దానికి గల స్థానాన్ని గుర్తించితీరాలి.

19వ శతాబ్దం మధ్య కాలం నాటికి పాశ్చాత్య దేశాలలో వున్నట్లు భారతదేశంలో ఏకీకృత ద్రవ్య వ్యవస్థ లేదు. దేశంలోని ద్రవ్యమార్కెటు వేర్వేరు రేట్లచే శాసించబడే మూడు భాగాలుగా విభజించబడివుంది. 1) పాశ్చాత్య బ్యాంకులు విధించే రేట్లు 2) బ్యాంకర్ల నుండి వర్తకులు తెచ్చుకొనే అప్పులపై విధించే బజారు ఎగుడు దిగుడు రేట్లు 3) రైతులు చేతివృత్తిదారుల నుండి వడ్డీ వ్యాపారులు వసూలు చేసే అధిక వడ్డీరేట్లు.

బెంగాలు బొంబాయి మద్రాసు ప్రెసిడెన్సీల బ్యాంకుల లాగానే బజారు బ్యాంకర్లు మార్కెటులో చెలామణి అయ్యే నోట్లు జారీ చేశారు. రైతులు చేతివృత్తుల వారికి అప్పులిచ్చే సాధారణ వడ్డీ వ్యాపారి అలా చేయలేదు. బజారుగా పిలువబడే దేశీయ ద్రవ్య మార్కెటు, 'అర్హతియాస్' అని పిలువబడే కమిషన్ ఏజంట్లకు డబ్బు సమకూర్చేది. ఈ ఏజంట్లు నిర్వహించే కమిషన్ ఏజన్సీల ద్వారా దేశంలో మార్కెటయిన వస్తువుల రవాణా జరిగేది. పెద్ద కమిషన్ ఏజంట్లు బ్యాంకర్లుగా వుండేవారు. వారు ఇతర ప్రాంతాలలో టోకు వ్యాపారం చేసేవారు. 1860 దశాబ్దం మధ్య కాలం నాటికి దేశీయ బ్యాంకర్లు బొంబాయి, కలకత్తాలలో ప్రధాన కార్యాలయాల నేర్పాటు చేసుకొని కార్యకలాపాలు నిర్వహించారు.

19వ శతాబ్దపు భారతదేశ ఆర్థిక వ్యవస్థలో మూడు విభిన్నమైన రంగాలు వున్నాయి.

1) పాశ్చాత్య తరహా బ్యాంకులు, ఫ్యాక్టరీలు గనులు ప్లాంటేషన్లు, కార్పొరేషన్లు, మేనేజింగు ఏజన్సీలు, ఇతర ఆర్థిక విధానంతో బలహీనమైన సంబంధాలు గల ఎగుమతి, దిగుమతి సంస్థలు.

2) నోట్ల చెలామణితో దేశ అంతర్గత వ్యాపార లావాదేవీలు సాగించే బజారు, అల్లిక లాంటి సంబంధాలతో సమైక్యంగా పనిచేసే షరాఫులు, అర్హతియాలు, టోకు వ్యాపారులు.

3) బ్యాంకులలో అప్పులు తెచ్చుకోవడం సాధ్యపడక అనివార్యంగా వడ్డీ వ్యాపారుల నాశ్రయించే రైతులు, చేతివృత్తుల వారు, చిల్లర వ్యాపారుల బతుకు దెరువు ఆర్థిక వ్యవస్థ.

ఈ మూడు రంగాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఒక రంగం నుండి మరొక రంగానికి మారడం జరగదు. అందుకే వడ్డీ రేట్లలో అంత తేడాలున్నాయి. భారతీయ సమాజం యొక్క రూపురేఖలలో మూడు తరహాల విభజన ఈ క్రింది రెండు క్రమాల వలన ఉత్పన్నమయింది.

1) బ్రిటిషు పెట్టుబడి భారత ఆర్థిక వ్యవస్థని కైవశం చేసుకొనడం - ప్రత్యేకించి ఎగుమతి దిగుమతులతో సముద్రమార్గాలపై ఆధిపత్యం, భారీ స్థాయి ఉత్పత్తి కార్యకలాపాలపై వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల దిగుమతులపై అదుపు.

2) దేశంలోని ఉత్పత్తిని సేకరించడానికి దిగుమతి వస్తువులను దేశంలోని లోతట్టు ప్రాంతాలకు సరఫరా చేయడానికి యూరోపియన్ కార్పొరేషన్లు, భారతదేశ వర్తకులు, కమిషన్ ఏజంట్లు బజారు వ్యాపారులపై ఆధారపడ్డారు. ఈదశలో యూరోపియన్ కార్పొరేషన్లు, భారతదేశంలో వారికి సహకరించిన వర్తకులు, కమిషన్ ఏజంట్లు, బజారు బ్యాంకర్లతో పరస్పర ప్రయోజన కారిగా వుండే విధంగా చేసుకొన్న సర్దుబాటు. వాణిజ్యంలో యూరోపియన్ బ్యాంకులు సముద్ర మార్గాలు, మేనేజింగు ఏజన్సీలు ఆధిక్యత సాధించాయి. బజారు బ్యాంకర్లు దేశీయ వ్యాపారులు మధ్యశ్రేణికి నెట్టివేయబడ్డారు. హుండి సంబంధం ప్రాచీన మైనదైనప్పటికి 17వ శతాబ్దంలో టావిర్నియర్ వర్ణించిన విధంగా లేదు. కొత్త హుండి రైలు మార్గాల వెంట బొంబాయి నుండి కలకత్తా వరకు వ్యాపించింది. 1835లో వెండి రూపాయి ప్రాతిపదికన బ్రిటిషువారు ద్రవ్యవిధానాన్ని ఏకీకృతం చేసి బిల్లుల్ని ఒకదాని తరువాత మరొకటి సరఫరా చేస్తూ స్వంత ట్రెజరీలను నిర్వహించుకొనడంతో బజారు బ్యాంకర్లు గతంలో ఈస్టిండియా కంపెనీకి ద్రవ్యమారకం దార్లుగా, చెల్లింపుల ఏజంట్లుగా, కోశాధికారులుగా అనుభవించిన ప్రత్యేక స్థానాలను కోల్పోయారు. గతంలో వున్న ఇన్సూరెన్సు ద్రవ్యమారకం బాధ్యతలు కత్తిరింపబడడంతో దేశీయ వర్తకంలో బిల్లుల మారకం దారులుగా మిగిలారు.

దేశీయ ఉత్పత్తుల్ని రైల్వేల ప్రక్కన వున్నమార్కెటు పట్టణాల మధ్య రవాణా సరఫరాల్ని కొత్తగా ఎదిగిన వ్యాపార కుటుంబాలు చేపట్టాయి. వాటిలో గుజరాత్‌కచ్, కథియవాడలకు చెందిన వివిధ ప్రాంతాల నుండి వర్తక కుటుంబాలు - పార్సీలు, భాటియాలు, ఖోజాలు, మెమన్లు; 'షికార్‌పూర్ (సింధు) నుండి ముల్తానీలు; 'షెకావతి, బికనీరు, మార్వార్, జైసల్మేర్‌ల నుండి మార్వాడీలు; తమిళదేశానికి చెందిన నట్టుకొట్టై చెట్టియార్లు వున్నారు. సామ్రాజ్యవాద వ్యాపార సంస్థలకు సహాయకులుగా ఈ వ్యాపార సంస్థలు విదేశాలలో - పారిస్ నుండి చైనా వరకు కొత్త సంబంధాలేర్పరచుకొన్నాయి. నట్టుకొట్టాయి చెట్టియార్లు బర్మాకి, భాటియాలు ఖోజాలు మెమన్లు మధ్యప్రాచ్యం, తూర్పు ఆఫ్రికాకి విస్తరించారు. వారి మధ్య సంబంధాలు

గతంలో లేని వర్తక బ్యాంకింగు అల్లికలకు పునాదులు వేసి దేశ విదేశాల వలసలకు దోహదపడ్డాయి.

ఈ వర్తక కుటుంబాల పరిమితులు విజయాలు సామ్రాజ్యవాద ఆర్థిక విధానంలో వారి స్థానాల్ని బట్టి వుంటాయి. వలసవాద ఆర్థిక విధాన చట్రంలో వాటికి కొంత స్థానం కేటాయించబడింది. ఇంతకు ముందు ప్రస్తావించినట్లు దీని అర్థం వాటిని అత్యంత ఉన్నత శ్రేణి నుండి అంటే యూరపుతో ప్రపంచ మార్కెటు కొరకు వస్తువుల ఉత్పత్తి, విదేశీ మార్కెటు ద్రవ్యంతో బ్యాంకింగు లావాదేవీలు జరిపే స్థితి నుండి తగ్గించడం. వారికి కేటాయించబడిన పరిధి నుండి రైల్వేలు టెలిగ్రాఫ్‌ల అల్లికతో పెద్ద గుజరాతి, మార్వాడి వ్యాపార కుటుంబ సంస్థలు పుట్టుకొచ్చాయి. కొన్ని గుజరాతీ కుటుంబ వ్యాపార సంస్థలు 19వ శతాబ్దాంతంలో బొంబాయి అహమ్మదాబాదులలో చాలా నూలు మిల్లులు స్థాపించాయి. కాస్త ఆలస్యంగా వ్యాపారంలో ప్రవేశించిన మార్వాడీలు మొదటి ప్రపంచ యుద్ధం తరువాత విస్తృత స్థాయిలో కార్యకలాపాలు సాగించారు.

## మారుతున్న భారతీయ యూరపు వాణిజ్యవేత్తల పాత్ర:

అప్పుడు యూరపుతో వాణిజ్యం ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యం క్రింద వున్నది. అప్పుడు కంపెనీ వ్యాపారం ప్రధానంగా సిల్కు నూలు వస్త్రాలను ఎగుమతి చేయడం. 1813 ఛార్టరు చట్టం యూరపు భారతదేశాల మధ్య వ్యాపారం చేసేందుకు ప్రైవేటు వ్యాపారులకు అనుమతి యివ్వబడంతో కలకత్తా, బొంబాయి, మద్రాసు ఏజన్సీ సంస్థలు ఈస్టిండియా కంపెనీ సహాయంతో వాటి కార్యకలాపాలను విస్తరించాయి. అవి నూతన వలసవాద వర్తకాన్ని అభివృద్ధి పరచాయి. ఇప్పుడు గతంలో లాగా సిల్కు, నూలు వస్త్రాల ఎగుమతి ప్రధానమైనది కాదు. 1830 దశాబ్దం నాటికి భారతదేశం మాంచెస్టరు వస్త్రాల ప్రధాన దిగుమతిదారవడంతో అది ప్రత్యామ్నాయ ఎగుమతులు – ప్రత్యేకించి నీలిమందు ఎగుమతిని చేపట్టింది. చైనాకు ప్రత్తి, నల్లమందు ఎగుమతులు చేసింది. కలకత్తాకి చెందిన పామిర్ అండ్ కో, అలగ్జాండర్ అండ్ కో, ఫెర్గూసన్ అండ్ కో, బ్రూస్ ఫాసెట్ అండ్ కో, మద్రాసుకి చెందిన పారీస్, బిన్నీస్‌లు వాణిజ్యానికి సాధనాలుగా పనిచేశాయి. ఇవన్నీ ప్రభుత్వ గుత్తాధిపత్యంలో, ప్రభుత్వం కల్పించిన రక్షణతో పనిచేశాయి.

ఏజన్సీ సంస్థలు నౌకల్ని నిర్మించాయి; వాణిజ్యానికి వినియోగించాయి. ఇన్సూరెన్సు బ్యాంకింగు రంగాలకు విస్తరించాయి. యూరపు భారతదేశాల మధ్య వర్తకంపై కంపెనీ గుత్తాధిపత్యం అంతం కావడంతో అవి కలకత్తా, బొంబాయి ఏజన్సీ సంస్థల ద్వారా ఇండియా చైనా యూరపుల మధ్య వాణిజ్యంలో ఎక్కువగా భాగస్వామ్యం వహించాయి. ఇండియా చైనా యూరపుల మధ్య ద్రవ్యమారకం కూడా చేపట్టాయి. అదే సమయంలో కలకత్తా ఏజన్సీ సంస్థలు దేశంలో పారిశ్రామిక సాహసచర్యల్ని ప్రోత్సహించాయి. నీలిమందు తోటల పెంపకం

దార్లకు ఆర్థికం సమకూర్చాయి. స్వయంగా వాణిజ్యం జేశాయి. కార్పొరేటు రంగంలో మేనేజింగు ఏజన్సీలను ప్రవేశపెట్టాయి.

ఏజన్సీ సంస్థలతో బ్రోకర్లకు సన్నిహిత సంబంధాలు వుండేవి. ఈ బ్రోకర్లు లోతట్టు ప్రాంతాల వ్యాపారుల నుండి ఎగుమతి చేయదగిన వస్తువుల్ని సరఫరా చేసేవారు. ఈ సహాయకులు కలకత్తాలో బనియాలు, మద్రాసులో దుబాసీలు, బొంబాయిలో గ్యారంటీ బ్రోకర్లు అని పిలువబడేవారు. కొన్ని సందర్భాలలో వారు ప్రముఖ వ్యాపారులుగా వారి వ్యాపారాలు వారు చేసుకొనేవారు. కాని 1850, 1880 మధ్య కాలంలో దేశంలోని లోతట్టు ప్రాంతాలకు రైలు నిర్మాణం పూర్తి, సూయజు కాలువ గుండా ఆవిరి ఓడల సేవల అభివృద్ధి, టెలిగ్రాఫ్ కేబుల్స్ అల్లికతో సాధించబడిన సమాచార సంబంధాల విప్లవం – భారతదేశ వాణిజ్యాన్ని చిన్న స్వదేశీ వాణిజ్య సంస్థల నుండి పెద్ద యూరపు సంస్థల చేతుల్లోకి మార్చాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ కనుకూలంగా వినియోగించుకొనే స్థితికి ఎదిగి, ఆపైన స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహించే సామ్రాజ్యవాద ఆశీస్సులు గల యూరపు మేనేజింగు సంస్థలతో భారతీయ వాణిజ్య సంస్థలు పోటీ పడలేకపోయాయి. గంజాయిని మాల్వా నుండి బొంబాయికి, లాంచెస్టరు బట్టల్ని కలకత్తా నుండి గంగామైదాన ప్రాంతాలకు చేరవేయడం లాంటి అంతర్గత వాణిజ్యం సాగిస్తూ ఎగుమతి దిగుమతులకు సహాయక పాత్ర నిర్వహించాయి. దేశీయ వాణిజ్యవేత్తలు తమ స్వయం ప్రతిపత్తిని ఒక మేరకు కాపాడుకొంటూ సామ్రాజ్యవాద ఆర్థిక విధానం విధించిన పరిమితులలో ఎదిగే ప్రయత్నాలు చేశారు.

## పారిశ్రామికీకరణ దశలు

వలస వాద పాలనకు గురయిన భారతదేశ పారిశ్రామికాభివృద్ధిలో మూడు దశలువున్నాయి.

1) 1850–1914 2) 1914–39 3)1939–47. మొదటి దశలో యూరపు మేనేజింగు సంస్థలు ఆధిపత్యం వహించాయి. ప్లాంటింగు మైనింగు పరిశ్రమలు విదేశీ మార్కెట్లపై ఆధారపడ్డాయి. తూర్పు భారతదేశానికి చెందిన తేయాకు జనపనార పరిశ్రమలు పూర్తిగా ఎగుమతి పరిశ్రమలు. బొంబాయి ప్రత్తి జౌళి పరిశ్రమలలోని అత్యధిక భాగం దూరప్రాచ్య మార్కెట్లుకు ఎగుమతులు చేయబడ్డాయి. భారతదేశ మార్కెట్ల నుండి గట్టి పోటీ ఎదురుకాలేదు. దేశీయ మార్కెటుపై ఆధారపడిన బొగ్గు పరిశ్రమ వలస రేవులకు వస్తువుల్ని రవాణా చేసే రైలు మార్గాల అవసరాల్ని తీర్చింది. ఉక్కు పరిశ్రమ ప్రాథమిక దశలో వుంది. ఈ కాలానికి చెందిన పరిశ్రమలు సహజంగా వుండే అనుకూల పరిస్థితులలో సులభంగా బ్రిటన్ నుండి దిగుమతి చేసుకోగలిగిన సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందాయి.

రెండవ దశలో పారిశ్రామిక ఉత్పత్తులు దేశీయ మార్కెట్ల కొరకు చేయబడ్డాయి. దేశీయ పరిశ్రమలు అభివృద్ధి చెందిన పాశ్చాత్య పరిశ్రమల నుండి గట్టి పోటీని ఎదుర్కొన్నాయి.

నూలు పరిశ్రమలతో పాటు యుద్ధం, సుంకాలు, మాంద్యం కల్పించిన రక్షణతో కొత్త పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. నూలు బట్టలు, కాగితం, చక్కెర వగైరాల ఉత్పత్తులు స్థానిక మార్కెట్లు కల్పించిన రక్షణతో సాధారణ సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో జరిగాయి. ఈ దశ ముగిసేనాటికి మాంచెస్టరు నూలు బట్టలు, జావా చక్కెర, న్యూస్ ప్రింటు మినహా అన్ని రకాల విదేశీ కాగితం దేశీయ వాణిజ్య పారిశ్రామిక వేత్తల యాజమాన్యం క్రింద జరిగిన ఉత్పత్తులతో దాదాపు తుడిచిపెట్టుకుపోయాయి. ఈ మార్పుల కతీతంగా జరిగిన కీలకమైన పరిణామం 'టాటా ఐరన్ అండ్ స్టీలు' కంపెనీ విస్తరణ (1916–24).

ఈ పరిణామం జరిగి వుండకపోతే మూడవదశకి చెందిన పెట్టుబడి వస్తువుల పరిశ్రమ సాధ్యపడి వుండేది కాదు. రెండవ ప్రపంచయుద్ధం సాంకేతికంగా వేసిన పెద్ద ముందడుగు భారత పారిశ్రామిక వేత్తలు నూతన సంక్లిష్టమైన పరిశ్రమలు ప్రారంభించడానికి అవకాశం కల్పించింది. కాని అవసరమైన పరికరాలు యంత్రాలు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం వలన మౌలిక, భారీ పెట్టుబడి వస్తువుల ఉత్పత్తి కుంటుపడింది. స్వతంత్రం సాధించే నాటికి ఈ సమస్య భారత పారిశ్రామిక సంస్థలు బహుళజాతి సంస్థల మధ్య కొత్త తరహా సహకారం యొక్క అవసరాన్ని కల్పించింది.

**మొదటి దశ (1850–1914)**

1857 తిరుగుబాటు అణచివేత నుండి మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యే వరకు గల కాలంలో కొత్త పారిశ్రామిక రూపాలను స్థాపించిన యూరపు ప్రైవేటు వ్యాపార సంస్థలు భారతీయ ఆర్థిక వ్యవస్థలో తిరుగులేని ఆధిక్యత సాధించారు. యూరోపియన్ల చొరవతో ఏజన్సీ సంస్థలు వేతన కార్మికుల్ని వినియోగించి తోటల పెంపకం, గనులు, ఫ్యాక్టరీలు నిర్వహించాయి. భారతదేశంలో కలకత్తాకి దూరంలో గంగానదీతీరాన 1817లో ఫోర్ట్ గ్లోస్టర్ వద్ద ఒక ప్రత్తిమిల్లు, ఒక ఇనుప కార్ఖానా, ఒక నూనె మిల్లుతో కూడిన పారిశ్రామిక ప్రాంగణం నిర్మించబడింది. 1839లో లండన్‌లో స్థాపించబడిన 'అస్సాం టీ కంపెనీ' అనే ప్రైవేటు వ్యాపార సంస్థ అస్సాంలో టీ తోటల పెంపకం ప్రారంభించింది. అలెగ్జాండర్ అండ్ కో చే1820లో ఫైనాన్స్ చేయబడిన రాణిగంజ్ బొగ్గుగని భారతీయ బొగ్గుగనుల వ్యాపారానికి అగ్రగామి సంస్థ. పశ్చిమ భారతదేశంలో మొదటి కాటన్ మిల్లు బ్రోచ్‌వద్ద 1854లో జేమ్స్ లేండన్ ప్రారంభించాడు (అదే సంవత్సరం మొదటి బొంబాయి కాటన్ మిల్లు కావాస్జీ నానాభాయ్ దావర్‌చే స్థాపించబడింది). తొలి జనపనార మిల్లు కలకత్తా సమీపంలో 1885లో జార్జి ఆక్లాండుచే స్థాపించబడింది.

ఇవి చిన్న ప్రారంభాలు మాత్రమే. బ్యాంకు ఇన్సూరెన్సు సంస్థలు మినహా పరిమిత బాధ్యతలతో లిమిటెడ్ కంపెనీలుగా ఏర్పడడానికి అవకాశం కల్పిస్తూ కంపెనీచట్టంలోని మార్పు, దీనిని బ్యాంకులకు కంపెనీలకు విస్తరింపజేస్తూ చేయబడిన 1860, 1866 చట్టాలు– కార్పొరేటు రంగానికి గట్టి పునాదులు వేశాయి. కంపెనీ చట్టంలోని ఈ మార్పులు, గంగాలోయవరకు

అలాగే దక్కన్ మీదుగా విస్తరించిన రైలు మార్గాలు – యూరపు పద్ధతిలో మేనేజింగు ఏజన్సీ సంస్థల ఏర్పాటుకు ఊపునిచ్చాయి. 1870 దశాబ్దాంతానికి రైలుమార్గాలు బాగా విస్తరించాయి. మొదటిసారిగా భారత ఆర్థిక వ్యవస్థలో వ్యాపార సంస్థలు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించే స్థితి వచ్చింది.

అయినప్పటికి కలకత్తా, బొంబాయి, మద్రాసు, ఢిల్లీలు రైలు మార్గాలతో అనుసంధానం చేయబడిన ఈ కాలంలో భారతదేశం ఒక ముఖ్యమైన అవకాశాన్ని కోల్పోయింది. అదే కాలంలో రష్యా, జపాన్‌లలో జరిగిన విధంగా వివిధ ప్రాంతాలకు రైలు మార్గాల విస్తరణ, ఇనుము ఉక్కు పరిశ్రమలు, బొగ్గు ఉత్పత్తి – వీటికి సంబంధించిన ఇంజనీరింగు పరిశ్రమలు అభివృద్ధి పరచే అవకాశం కోల్పోయింది.

భారతదేశంలోకి బ్రిటిషు పెట్టుబడిని జొప్పించి దిగుమతి చేయబడిన రైలు ఇంజన్లు, రైలు బోగీలు, రైలుపట్టాలే గాక దిగుమతి చేయబడిన సాంకేతిక నిపుణులు మేనేజర్లచే రైలు మార్గాలు నిర్మించబడ్డాయి. బ్రిటిషు వస్తువుల్ని కొనే ఈ విధానం భారతదేశ పారిశ్రామికాభివృద్ధికి అవరోధంగా నిలిచింది. యునైటెడ్ స్టేట్స్, రష్యా, జర్మనీలలో రైల్వేల నిర్మాణం పారిశ్రామిక విప్లవానికి డైనమోలుగా పనిచేశాయి. భారతదేశం మాత్రమే పెట్టుబడి ఉత్పత్తి వస్తువులు తయారు చేయగల సమర్థత, రైలు మార్గాలు వుండి కూడా పారిశ్రామికదేశంగా ఎదగలేదు. దుక్క ఇనుము, ఉక్కు ఇంజనీరింగు పరిశ్రమలకు ఊపివ్వవలసిన రైల్వేలు ప్లాంటేషన్లకు వాణిజ్య పంటల ప్రాసెసింగుకు ముడివనరుల రవాణాకు ఊపిచ్చాయి. ఈ మేనేజింగు సంస్థల విధానం క్రింద కలకత్తా, బొంబాయి, మద్రాసు లేక లండన్‌లో గల ఒక మేనేజింగు ఏజన్సీ సంస్థ ఒకే సమయంలో వివిధ గనుల ప్లాంటేషన్ల మిల్లుల కంపెనీలపై అజమాయిషీ నిర్వహించ గలిగింది. ప్రత్యేకించి బొంబాయి అహమ్మదాబాద్‌లలో ఆధునిక పరిశ్రమలో అప్పుడే అడుగిడిన భారతీయ సంస్థలు ఆ పద్ధతినే అనుసరించాయి. కేంద్రీకరణ క్రమం 20వ శతాబ్దం తొలి సంవత్సరాల నాటికి యించుమించు పూర్తయింది.

దేశంలోపల నుండి వలసవాద రేవు నగరాలకు వేయబడిన రైలు మార్గాలు, రేవుల నుండి విదేశాలకు వెళ్ళే రైలు మార్గాలు – 19వ శతాబ్దం చివరలో యూరపు పెట్టుబడులకు ప్రత్యేకమైన అవకాశాలను కల్పించాయి. 1930వ దశాబ్దం చివరలో బహుళజాతి సంస్థలు అభివృద్ధి చెందేవరకు భారతదేశంలో బ్రిటిషు వాణిజ్యం నిరంతరంగా కొనసాగే స్వభావాన్ని కల్పించాయి. రైల్వేలు, ఆవిరి ఓడలతోపాటు బ్రిటిషు పారిశ్రామిక వేత్తలు టీ, కాఫీ, నీలిమందు, జనపనార వస్తువుల ఎగుమతి పరిశ్రమలు చేపట్టాయి. యూరపు పారిశ్రామిక వేత్తలు అభివృద్ధి పరచిన ఒకే ఒక పరిశ్రమ జనపనార పరిశ్రమ. జనపనార పరిశ్రమ యూరోపియన్, అమెరికా ఆస్ట్రేలియా మార్కెట్లు అవసరాలకు ఉత్పత్తి చేయడంపై కేంద్రీకరించింది. బ్రిటిషు పెట్టుబడి భారతదేశ అంతర్గత ఆర్థిక వ్యవస్థలో భాగం కాలేదు; పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థల ప్రయోజనాలకు కాపలా కాసింది.

దేశం యొక్క అంతర్గత వినియోగం కొరకు ప్రత్తి ఉత్పత్తుల పరిశ్రమ, ఇనుము ఉక్కు పరిశ్రమలు అభివృద్ధి పరచబడ్డాయి. ఈ పరిశ్రమలు బ్రిటన్ పారిశ్రామిక విప్లవానికి పునాది వేశాయి. ఈ పరిశ్రమల అభివృద్ధిలో భారతీయుల పాత్రతో పోల్చితే యూరోపియన్లు నిర్వహించిన పాత్ర చాలా స్వల్పం. 19వ శతాబ్దంలో బొంబాయి ప్రత్తిమిల్లు పరిశ్రమలో ప్రవేశించిన ఒకే ఒక యూరోపియన్ మేనేజింగు ఏజన్సీ 'గ్రీవ్స్ కాటన్ అండ్ కో'. ఈ కంపెనీ దూర ప్రాచ్య ఎగుమతి కొరకు ముతకదారాన్ని ఉత్పత్తి చేసింది. భారతదేశంలో వినియోగం కొరకు బట్టల్ని తయారుచేయడంలో ఈ కంపెనీ మాంచెస్టరుతో పోటీపడలేదు. భారతదేశంలోని మొట్టమొదటి ఇనుము ఉక్కు కంపెనీ – పోర్టొనొవొ స్టీల్ అండ్ ఐరన్ కంపెనీ (1830) చాలా కొద్ది కాలంలోనే – అదీ రైలు మార్గాలు వచ్చిన తరువాత (1874) క్షీణించి నశించింది. ఈ ప్రత్యేక తరహా యూరపు పరిశ్రమ, దాని వివక్షతా ఏం తెలియజేస్తుంది? భారతదేశంలో విదేశీ బ్రిటిషు సంస్థల సామాజిక నీతి నియమాలను తెలియజేస్తుంది. ఈ పరిశ్రమ కూడా బ్రిటన్ ప్రయోజనాలకు హానికరంగా వున్న పోటీ నుండి వైదొలగింది.

1870 దశాబ్దంలో వాణిజ్యం పరిశ్రమలు ప్రధానంగా వలసవాద పాలనలో వున్న భారతదేశ రేవులపై – ప్రత్యేకించి కలకత్తా, బొంబాయి రేవులపై కేంద్రీకరించాయి. జనుము, టీ, బొగ్గు లాంటి యూరోపియన్ సంస్థలైన స్కోనే కిల్‌బర్గ్, జార్డైన్ స్కిన్నర్, జార్జి హెండర్సన్ బర్డ్‌ల ప్రధాన కార్యాలయాలు కలకత్తాలో వున్నాయి. యూరోపియన్ ప్రయోజనాలకు బొంబాయిలో ఫోర్బ్సు, రెమింగ్టన్, కెల్లిక్ నిక్సన్ – లాంటి ప్రముఖ సంస్థలు ప్రాతినిధ్యం వహించాయి.

మేనేజింగు ఏజన్సీ సంస్థలు అరుదుగా అగ్రగామి సంస్థలుగా వుంటాయి. తేయాకు, జనుములలో తొలినాటి యూరపు వ్యాపార సంస్థల్ని అభివృద్ధి పరచింది పెద్ద మేనేజింగు సంస్థలు కాదు. ఇవి నీతినియమాలు లేని అన్యాయానికి వెనుకాడని వారిచే నిర్వహింపబడ్డాయి. టీపట్ల ఆసక్తి, జనుముకి గిరాకి తగ్గిపోవడంతో సగం ఖాళీ అయిన తోటల్ని, యాజమాన్య పద్ధతులు సరిగాలేని మిల్లుల్ని అమ్ముకొని త్వరగా సంపన్నులు కావాలనేది వారి ఆలోచన. 1866–68లో టీ తోటలు,1875–80 జనపనార మిల్లుల వ్యాపార సంక్షోభంతో తొలినాటి వ్యాపార సంస్థలు మూటా ముల్లే సర్దుకొన్నాయి. ఆ తరువాత కలకత్తాకి చెందిన ప్రఖ్యాత మేనేజింగు సంస్థల ఆధ్వర్యంలో తేయాకు జనపనార పరిశ్రమల పునర్నిర్మాణంతో అవి విస్తరించాయి. కొత్త యాజమాన్యం యొక్క విస్తృతమైన సంబంధాల కారణంగా జనపనార మిల్లులు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ శాన్‌ఫ్రాన్సిస్కోలలో మార్కెట్లు సాధించింది. ఈస్టిండియా రైలు మార్గం నిర్మాణం కల్పించిన ప్రేరణతో అప్పటికే వున్న బెంగాలు బొగ్గు కంపెనీతో పాటు పెద్ద మేనేజింగు సంస్థల్ని నెలకొల్పి నిర్వహించింది.

బెంగాల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ – దాని మూడు సహాయక సంస్థలైన భారతీయ జనపనార మిల్లుల సంఘం, భారతీయ తేయాకు సంఘం, భారతీయ గనుల సంఘం

సహకారంతో తూర్పు భారతదేశం యొక్క జనపనార, తేయాకు, బొగ్గు పరిశ్రమల సంఘటిత ఆధిపత్యానికి ప్రాతినిధ్యం వహించింది. కలకత్తాకి చెందిన ప్రముఖ యూరోపియన్ యాజమాన్య సంస్థలు – వాటిలో ఆరు సంస్థలు ఆన్డ్రూయూల్, జార్డైన్ స్కిన్నర్, బర్డ్, 'షావాలీస్, బెగ్‌డన్‌లప్, హీల్జర్‌లు 1914లో 50 శాతానికి పైగా పెట్టుబడులతో మూడు పరిశ్రమల్ని (తేయాకు, జనపనార, బొగ్గు) అదుపుచేశాయి. ఇక భారత వాణిజ్యం, జల్పాయి గురి జిల్లాలో తేయాకు తోటలకు గృహావసరాలకు తీర్చే తక్కువ రకం బొగ్గు ఉత్పత్తి చేసే బొగ్గు గనులకు పరిమితమయింది. వాణిజ్య రంగంలో భారతీయ ప్రవేశానికి జాతి ఆటంకంగా వుందనే అంశాన్ని తిరస్కరించడానికి జనపనార పరిశ్రమలో భారతీయ పెట్టుబడిని ఆకర్షించేంతగా లాభాల రేట్లు లేవని వాదించడం జరిగింది. కాని వాస్తవంగా జనపనార మిల్లులు భారతీయ వాణిజ్య రంగంలో అధికంగా పెట్టుబడుల నాకర్షించేవిధంగా వున్నాయి.

భారతీయపెట్టుబడిదార్లకు అందుబాటులో వున్న ప్రాంతాలకు, సంక్లిష్టమైన తొలిదశలో దూర ప్రాచ్య మార్కెట్లకు పశ్చిమ భారతదేశం యొక్క ప్రత్తిమిల్లుల పరిశ్రమ సేవలు చేసింది. తేయాకు జనుము లాగా గాక ప్రత్తిమిల్లుల పరిశ్రమ – ప్రత్యేకించి అహమ్మదాబాద్ బొంబాయిలలో – చేనేత ఉత్పత్తులతో బజారుతో, బ్యాంకింగుతో యితర బహుముఖమైన దేశీయ కార్యకలాపాలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకొని ఆర్థికాభివృద్ధిలో సమన్వయం సాధించింది. బొంబాయి మిల్లులు పాశ్చాత్య పద్ధతులలో నిర్వహించబడ్డాయి. అహమ్మదాబాదు మిల్లులు దేశీయ వర్తక పారిశ్రామిక సాంప్రదాయాల ననుసరించి నడపబడ్డాయి... ఇక బొంబాయి, అహమ్మదాబాద్ పెట్టుబడిదారుల మధ్య గల సామాన్య అంశం ఏమిటంటే సామ్రాజ్యం కల్పించిన ఆర్థిక అవకాశాన్ని ఈ పెట్టుబడిదారులు వినియోగించుకోగలగడం. పశ్చిమ భారతదేశంలో ఆర్థిక అవకాశంలోని సామ్రాజ్యవాద భాగం కలకత్తాలోను, వలస పాలనకు గురిచేయబడిన కలకత్తా వెనుక భూమి (లోతట్టు ప్రాంతాల)లోనూ వున్నంత పదిలంగా లేదు.

ప్రత్తి, గంజాయి సాగుచేసి బొంబాయి రేవు ద్వారా ఎగుమతులు సాగించే పశ్చిమ మధ్య భారతదేశంపై యూరోపియన్లు గట్టి పట్టు సాధించలేకపోయారు. అందుకు కారణాలు: ఇండోర్, అహమ్మదాబాద్, బేరార్ వర్తకులు ఆర్థికంగా బలం పుంజుకొని వున్నారు. వెనుకభూమి బరోడా, ఇండోర్, హైదరాబాదు లాంటి ప్రాంతాలు స్వయం ప్రతిపత్తిగల స్వదేశీ సంస్థానాల అదుపులో వున్నాయి. దేశం ప్రపంచ ప్రత్తి సరఫరాలో ఐదవ వంతు ఉత్పత్తి చేస్తూ అమెరికా తరువాత స్థానంలో వుంది. మిల్లులు ప్రత్తిపండించే పొలాలకు దగ్గరలో వున్నాయి. రవాణా ఛార్జీలు నామమాత్రం. శ్రమశక్తి కారుచౌకగా లభ్యమయింది. ఇంకా విపరీతమైన జనాభా, అసంఖ్యాకమైన నేత పనివాళ్లు, రైలు మార్గంచే అనుసంధానం చేయబడిన మార్కెట్లు. ఈ పరిస్థితులలో అభివృద్ధి చెందడం కాదు విపరీతం. అభివృద్ధి చెందక పోతే విపరీతంగా వుండివుండేది.

బొంబాయి అహమ్మదాబాదులలో మిల్లులు పెరగడంతో పెరిగిన పరిశ్రమలపై – బొంబాయిలో పార్శీలు, భాటియాలు, ఖోజాలు, బాగ్దాదు యూదులు, యూరోపియన్ల కుటుంబాలు; అలాగే అహమ్మదాబాద్‌లో బనియాలు, నాగపూరు బ్రాహ్మణుల, కన్బీల కుటుంబాలు ఆధిపత్యం సాధించాయి. బొంబాయి వస్త్ర పరిశ్రమలో ప్రముఖులు పెటిట్లు, వాడియాలు, టాటాలు (పార్శీలు), కర్రీమ్ భాయిలు (ఖోజాలు), ససూన్లు (బాగ్దాదు యూదులు), ఖటావులు, గోకుల్‌దాసులు, థకార్సేలు మొదలగువారు. గ్రీవ్స్, కాటన్ అండ్ కంపెనీ, డబ్ల్యుహెచ్ బ్రాడీ అండ్ కో, కిలక్ నిక్సన్ అండ్ కో (యూరపు వ్యాపార సంస్థలు) తొలుత ఇంగ్లీషు వస్త్ర పారిశ్రామిక సంస్థల ఏజంట్లుగా వచ్చి బొంబాయి మిల్లులకు యంత్రాలను సమకూర్చాయి.

20వ శతాబ్దం ప్రారంభంలో బొంబాయి పెట్టుబడితో మరొక ప్రాముఖ్యం గల పరిణామం–ఉక్కు పరిశ్రమ ప్రారంభమయింది. 'బెంగాలు ఇనుము ఉక్కు కంపెనీ'తో బ్రిటిషు ప్రయత్నాలు వాణిజ్యపరంగా ఉక్కుని ఉత్పత్తి చేయడంలో విఫలం కాగా 'టాటా ఇనుము ఉక్కు పరిశ్రమ' ఎందుకు ఎలా జయప్రదమయింది? జవాబు: అధిగమించవలసిన తీవ్రమైన సమస్యలు ఎన్నో యిబ్బందులు, ఖర్చు విషయంలో అనిశ్చిత పరిస్థితి. బెంగాల్ ఇనుము ఉక్కు పరిశ్రమ గాని, బ్రిటిషువారు ప్రారంభించిన ఉక్కు కంపెనీగాని ఈ సమస్యల్ని పరిష్కరించగలంత పెద్ద స్థాయివి కావు. గతంలో ఆసియాలో ఎక్కడా లేనంత పెద్ద స్థాయిలో పెట్టేందుకు భౌగోళికంగా సరియైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకొనడం సమస్య. టాటాలు ఈ సమస్యని పరిష్కరించారు. మధ్య భారతదేశంలో అలాంటి ప్రదేశం కొరకు అన్వేషణ సంవత్సరాల పాటు సాగించారు. చాలా పెద్ద మొత్తాలు వెచ్చించారు. ప్రదేశం చౌకగా మేలిమిరకం ముడి ఇనుప ఖనిజం లభించే వనరులకు దగ్గరగా వుండాలి. భారతదేశంలో ఉక్కుకి పెద్ద మార్కెటుగా వున్న కలకత్తాకు రవాణా చేయడానికి అనుకూలంగా వుండాలి. తక్కువ ఖరీదుకి సున్నపురాయి, దగ్గరలో అందుబాటులో వుండాలి. టాటాలు ఎంపిక చేసిన స్థలం యిలాంటి పరిశ్రమకు ఒక విధంగా ప్రపంచంలోనే అత్యంత అనుకూలమైన ప్రదేశం.

అయినప్పటికి ప్రభుత్వ మద్దతు లేకపోతే టాటాలు సాహసించి వుండేవారు కాదు. ఉక్కుకి పెద్ద కొనుగోలు దారులైన ప్రభుత్వం, రైల్వేలు 19వ శతాబ్దాంతం వరకు బ్రిటిషు వస్తువులు కొనే విధానం కొనసాగించారు. కాని శతాబ్దారంభంలో కర్జన్ యొక్క నూతన సామ్రాజ్యవాద స్వప్నం ప్రభుత్వ వైఖరిని మార్చింది. కర్జన్ ప్రభుత్వం టాటా ఇనుము ఉక్కు కర్మాగారానికి కీలకమైన రైలు మార్గాలను వేయించింది. 19వ శతాబ్దపు విధానమైన స్వేచ్ఛా వాణిజ్యం అమలులో వున్నప్పటికి 10 సంవత్సరాల పాటు వార్షికంగా 20,000 టన్నుల రైలు పట్టాలను దిగుమతి రేట్లపై కొనేందుకు హామీ యిచ్చారు. టాటాలు తొలుత పెట్టుబడిని లండన్‌లో సేకరించాలనుకొన్నారు. కాని బ్రిటిషుపెట్టుబడిదారులు పరిశ్రమలో ఎదురయ్యే కష్టనష్టాలతో సంబంధం లేకుండా పరిశ్రమపై అదుపు తమ అధీనంలో వుండాలన్నారు.

**రెండవ దశ: (1914-39)**

మొదటి ప్రపంచ యుద్ధం మొదలవడంతో సామ్రాజ్యవాద సూర్యుడు మధ్యాహ్నాన్ని దాటాడు. బజారు నీడప్రాంతానికి బ్రిటిషు పెట్టుబడికి కేటాయించబడిన ప్రాంతానికి మధ్య గీయబడిన సరిహద్దురేఖ చెదిరిపోవడం మొదలయింది. భారతీయ వ్యాపార సంస్థలు నెమ్మదిగా అభివృద్ధి చెందడంతో సామ్రాజ్యం అత్యున్నత దశలో వున్నప్పుడు లండన్ ద్రవ్యమార్కెటు బ్యాంకుల, లైనర్సు కాన్ఫరెన్సుల బ్రిటిషు పారిశ్రామిక వాణిజ్య సంస్థల, విదేశీ మేనేజింగు సంస్థల లాభదాయకమైన పెట్టుబడులకై కేటాయించబడిన ఆర్థికావకాశాలను పదిలంగా కాపాడడం సాధ్యపడలేదు. మొదటి ప్రపంచ యుద్ధం, తీవ్రమైన ఆర్థిక మాంద్యం అప్పటి వరకు కొనసాగుతున్న విధానాన్ని కుదిపివేశాయి. ఆర్థిక మాంద్యం విదేశీ సంస్థల కొనుగోలు అమ్మకాలను స్తంభింపజేసింది. రైళ్ల, నౌకల రాకపోకలకు అంతరాయమేర్పడింది. యుద్ధ కాలంలో దేశీయ మార్కెటు పారిశ్రామిక పెట్టుబడికి ప్రధాన రంగమయింది. ఆధునిక వాణిజ్య పారిశ్రామిక రంగాలలో భారతీయ వ్యాపార సంస్థల పురోగతి, విదేశీ సంస్థల తిరోగమనం, బహుళజాతి సంస్థల ఆవిర్భావం - ఈ కాలంలో వాణిజ్య రంగంలో వచ్చిన ముఖ్యమైన పరిణామాలు.

అన్ని విధాలా మొదటి ప్రపంచ యుద్ధం విభజన రేఖగా నిలిచింది. భారతీయులకు క్రమంగా అధికారం బదిలీ చేయడానికి దీర్ఘకాలిక రాజకీయ ఆర్థిక పరిణామాలను ప్రారంభించింది. దిగుమతులను తగ్గించింది. పారిశ్రామికీకరణకు ప్రేరణనిచ్చింది. విదేశీ సంస్థల సరఫరా మార్గాలను అస్తవ్యస్తం చేసింది. యుద్ధకాలంలో దిగుమతులు ఆగిపోవడం వలన గిరాకీ పెరిగిన రంగాలలో భారతీయ పెట్టుబడిదారులు ప్రవేశించారు. సంక్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానం అవసరం లేని వినిమయ వస్తువుల ఉత్పత్తి రంగాలలో కూడా చొచ్చుకుపోయారు. బిర్లా, దాల్మియా, వాల్‌చంద్ లాంటి దేశీయ వాణిజ్య సంస్థలు వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో బర్డ్ హీల్జర్స్, బెగ్ డన్‌లప్, డంకన్ బ్రదర్స్, షా వాలీస్ లాంటి సంస్థలు కొత్తగా పెట్టుబడులు పెట్టలేదు. ఆండ్రూ యూల్, కిల్లిక్ నిక్సన్, జార్డైన్ స్కిన్నర్ లాంటి సంస్థల పెట్టుబడులు 1937-39 కాలంలో తగ్గాయి. యూరపు మేనేజింగు సంస్థలు రాజకీయ ఆర్థిక వాణిజ్య కారణాల రీత్యా స్తబ్ధత వహించాయి. రెండవ ప్రపంచ యుద్ధం చివరికి తమ పెట్టుబడుల రక్షణ కొరకు ఆరాట పడవలసి వచ్చింది.

విదేశీ సంస్థలు తొలుత ఆధారపడిన విదేశీ మార్కెట్ల లాగా కాక పారిశ్రామిక ఉత్పత్తులు స్వదేశీ మార్కెటు 20వ శతాబ్దపు ఒడిదుడుకులతో గాని, 30వ దశాబ్దపు మాంద్యం వలన గాని అస్తవ్యస్తం కాలేదు. భారతదేశంలోని అతి పెద్దదైన బట్టల మార్కెటు తలసరి వినిమయం రీత్యా పెరిగింది. మొదటి ప్రపంచ యుద్ధకాలం నాటి చివరిదశలో 9.8 గజాలుగా వున్న తలసరి వినిమయం 1930 దశాబ్దం చివరికి 14.4 గజాలకు పెరిగింది.

మాంద్యం దేశంలోని వివిధ వ్యాపార విభాగాలను తాత్కాలికంగా ఆటంకంగా పరిణమించి నప్పటికి ఆ సమయంలో దిగుమతులపై ఎక్కువ సుంకాలు విధించడం వలన, నూలు వస్త్రాలకు చక్కెర లాంటి యితర పరిశ్రమలకు రక్షణ కల్పించే సుంకాలు అనుమతించడం దేశీయ మార్కెటు వాటాని విస్తరించింది. లాభాల పరంగా చూస్తే రెండు ఎగుమతి పరిశ్రమలైన జనపనార పరిశ్రమ, కాస్త తక్కువగా బొగ్గు (యూరోపియన్ పరిశ్రమ) 1930 దశాబ్దంలో క్రమంగా క్షీణించాయి. రక్షణ కల్పించబడిన పరిశ్రమలు మాంద్యం చివరలో విపరీతమైన లాభాలతో పెట్టుబడుల స్వర్గ ధామాలయ్యాయి.

**మూడవదశ:**

రెండవ ప్రపంచయుద్ధం భారతదేశ పారిశ్రామికీకరణలో నూతనాధ్యాయనాన్ని ప్రారంభిస్తూ ప్రాధాన్యతని మౌలిక, భారీ పరిశ్రమలకు మార్పుచేసింది. బహుళ జాతి సంస్థల ప్రవేశం ప్రారంభమయింది. భారతదేశంలో అగ్గిపెట్టెల దిగుమతిదారు అయిన స్వీడిష్ అగ్గిపెట్టెల కంపెనీ (విమ్కో) 1924లో ఎత్తైన సుంకాల అడ్డుకోడని అధిగమించి అంబర్‌నాథ్ (బొంబాయి సమీపంలో) కలకత్తాలలో అగ్గిపెట్టెల నుత్పత్తి చేయడం ప్రారంభించింది. బొంబాయిలో సబ్బులు ఉత్పత్తి చేసేందుకు 1933లో స్థాపించబడిన లివర్ బ్రదర్స్ (ఇండియా) లిమిటెడ్ ఫ్యాక్టరీ గోద్రెజ్ లాంటి భారతీయ పోటీదారుల్ని వెనక్కి నెట్టివేసింది. అదే సంవత్సరం బాటా షూ కంపెనీ ప్రారంభమయింది. 1935-36లో డన్‌లప్ టైర్ల ఫ్యాక్టరీ ప్రారంభించింది.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసేటప్పటికి ఇండియా లిమిటెడ్స్‌గా ప్రసిద్ధిగాంచిన బహుళజాతి సంస్థలు రసాయనాలు, ఆటో మొబైల్సు, రబ్బరు, అగ్గిపెట్టెలు, సబ్బులు, సిగరెట్లు, బూట్లు, చెప్పులు వగైరా పరిశ్రమలపై గుత్తాధిపత్యం సాధించాయి. ఇవన్నీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమైన బేసిక్ భారీ పరిశ్రమలు కావు. కాని 1937 నుండి ఉక్కు, జౌళి, చక్కెర, కాగితం లాంటి పరిశ్రమలలో పోగుచేసుకొన్న లాభాలను పెట్టుబడులుగా పెట్టాలని ఆతురతగా వున్న భారతీయ మేనేజింగు సంస్థలతో కలిసి ఈ బహుళజాతి కంపెనీలు పెట్టుబడులు పెట్టగలిగిన కొత్త రంగాన్ని అన్వేషించడం ప్రారంభించాయి. నూతనరంగంలో ఈ పెట్టుబడి కొరకు ఈ ప్రతిపాదన రెండవ ప్రపంచ యుద్ధకాలంలో వచ్చింది. భారత వాణిజ్య సంస్థలు అందుకు ముందు నిలిచాయి.

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు ఇంజనీరింగు విడిభాగాలను ఉత్పత్తి చేయగల వర్కుషాపులు 600 మాత్రమే వున్నాయి. యుద్ధం ముగిసేటప్పటికి ప్రభుత్వం యొక్క యుద్ధ అవసరాలను సరఫరా చేసే 15000 ఇంజనీరింగు వర్కుషాపులున్నాయి. యుద్ధ పరికరాల ఉత్పత్తిపై దృష్టి కేంద్రీకరించిన ప్రభుత్వం ఉక్కు ఉత్పత్తి, సామర్ధ్యాన్ని పెంచడం పట్ల విముఖత ప్రదర్శించింది. తేలికపాటి యుద్ధ పరికరాలు నుత్పత్తి చేయగల సమర్ధత నుండి భారతదేశం దృష్టిని మరల్చుడమవుతుందనే నెపంతో ప్రభుత్వం నౌకలు, విమానాలు, మోటారు వాహనాలు, జౌళి యంత్రాలు కుట్టుమిషన్ల ఉత్పత్తిని అడ్డుకొన్నది. ప్రభుత్వం

ఆటంకపరచినప్పటికి భారత పారిశ్రామిక సంస్థలు పారిశ్రామికీకరణ క్రమం పట్ల నిబద్ధతతో తక్షణంగాని సమీప భవిష్యత్తులోగాని లాభాలను ఆశించకుండా కొత్త పరిశ్రమల్ని ప్రారంభించారు. హేతుబద్ధమైన లాభాల రేట్ల గణన, లాభాల కొరకు నిరీక్షించే కాల వ్యవధి - వగైరాలను గురించి అంచనాలు వేస్తూ కూర్చుంటే 1937-45 కాలంలో కొత్తపరిశ్రమల్ని ప్రారంభించి వుండేవారు కాదు. మరొక విధంగా చెప్పాలంటే ఏవిదేశీ వ్యాపార సంస్థ కూడా అలాంటి కష్టనష్టాల్ని ఎదుర్కొనడానికి సిద్ధపడివుండేది కాదు.

లోహ రసాయనిక ఇంజనీరింగు పరిశ్రమలు చాలా సంక్లిష్టమైన సమస్యల్ని తెచ్చిపెట్టాయి. అంతేగాక జౌళి, ఆటో మొబైల్సు లాంటి చాలా పరిశ్రమలు సులభంగా, చౌకగా లభ్యమయ్యే విడిభాగాలపై ఆధారపడతాయి. అభివృద్ధి చెందిన దేశాలలో ఈ విడిభాగాల్ని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసే పరిశ్రమలు వున్నాయి. భారతదేశంలో అలాంటి విడిభాగాల నుత్పత్తి చేసే పరిశ్రమలు రెండవ ప్రపంచ యుద్ధం తరువాత మాత్రమే ప్రారంభమయ్యాయి. కాబట్టి అభివృద్ధి చెందిన దేశాల కంటే పరిశ్రమల స్థాపనకు అయ్యే ఖర్చులు సాంకేతిక సమస్యలు ఎక్కువ. అంతేగాక ఉక్కు యితర రసాయినాలు అవసరమైన మేరకు లభ్యం కాకపోతే భారీ ఇంజనీరింగు రసాయన పరిశ్రమల స్థాపన సాధ్యపడదు. భారతీయ పరిశ్రమలకు గల పరిమితమైన సాంకేతిక పునాది వాటి అభివృద్ధికి ఆటంకంగా వున్నట్లు రెండవ ప్రపంచ యుద్ధకాలంలో మొదటిసారిగా గమనించబడింది.

**ముగింపు:**

పెట్టుబడిని తరలించడం ద్వారా వలసవాదం భారతదేశ ఆర్థికాభివృద్ధిని అడ్డుకొన్నది. 1830 ప్రాంతం నుండి వివక్షతతో కూడుకున్న సుంకాలు విధించి చేతివృత్తుల ఉత్పత్తుల నడ్డుకొన్నది. 1813, 1833 చార్టరు చట్టాల ద్వారా స్వేచ్ఛా వాణిజ్యవేత్తలు కంపెనీ గుత్తాధిపత్యంపై సాధించిన విజయం ఇంగ్లాండు స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం కల్పించింది. కాని భారతదేశ స్వేచ్ఛా వాణిజ్యానికి కాదు. 1838 ట్రివెల్సన్ రిపోర్టు సిఫార్సుల ననుసరించి భారతదేశంలో అంతర్గత సుంకాలు రద్దు చేయబడడంతో భారతదేశం ఇంగ్లాండుల మధ్య నౌకల రాకపోకల రద్దీ పెరిగింది. మొదటి పారిశ్రామిక దేశం యొక్క పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ముడివనరుల సరఫరాదారుగా, పారిశ్రామిక వస్తువుల మార్కెటుగా విలీనం చేయబడింది. ఆ దశలో స్వేచ్ఛా వాణిజ్యం భారతదేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకమయింది.

గతంలో భారతదేశ ఎగుమతి ఉత్పత్తులు - ప్రత్యేకించి జౌళి ఉత్పత్తులు భారతదేశానికి పెద్ద మొత్తాలలో వెండిని తెచ్చిపెట్టాయి. ఆ తరువాత భారతదేశానికి వస్త్రాలు యితరాల దిగుమతులు జరిగాయి. 1825-50 కాలంలో వెండి నిల్వలు కరిగిపోయాయి. ఆ తరువాత 1852 ప్రాంతంలో పుంజుకొనడం ప్రారంభమయింది. వలసవాద వ్యాపారుల ఉత్పత్తుల ఎగుమతులు పెరిగాయి. భారతదేశంలో రైల్వే నిర్మాణానికి బ్రిటన్ నుండి పెట్టుబడులు పెద్ద మొత్తాలలో వచ్చాయి. మాంద్యంలో కూరుకుపోయిన ఆర్థిక వ్యవస్థ కొంత కుదుట పడింది.

కాని రైల్వేలపై ఖర్చుపెట్టబడిన మొత్తాలలో ఎక్కువ భాగం దిగుమతులు చేయబడిన రైలు ఇంజన్లు, రైలు పట్టాలు, యితర పరికరాలు, యూరోపియన్ మేనేజర్ల సాంకేతిక పనివాళ్ల జీతాలు వగైరా రూపాలలో విదేశాలకు తరలివెళ్లింది. రైల్వేలకు పెట్టిన పెట్టుబడులలో కనీసం కొంత భాగన్నాయినా దేశంలో సేకరించబడానికి ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు. అలా సేకరించి వుంటే దేశంలోని పెట్టుబడి మార్కెటుకి కొంత ప్రేరణ లభించి వుండేది. 1875 నుండి వెండి విలువ పతనం సంపద తరలింపుకి తోడయింది. 1893లో టంకశాల మూసివేయబడే వరకు రూపాయి విలువ నిరంతరంగా పడిపోవడంతో బ్రిటన్‌కి చెల్లించవలసిన కప్పం ప్రాథమిక ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా చెల్లించవలసి వచ్చింది. రైలు మార్గాల నిర్మాణం పూర్తి, వాణిజ్య పంటల జోనుల ఏకీకరణ పాక్షికంగా వర్తకానికి అవకాశాలు కల్పించి కొంత ఊరట కలిగించాయి. కాని ఈ పాక్షిక ప్రయోజనాలను 19వ శతాబ్దం ఉత్తరార్థంలో సంభవించిన వ్యవసాయ విపత్తులు, రాజపుటానా మధ్య భారతదేశంలో 1868-69లో వచ్చిన కరువు, దేశవ్యాప్తంగా సంభవించిన 1876-78, 1896-97, 1899-1900 కాటకాలు నిష్ఫలం చేశాయి.

అరకొర అభివృద్ధి సాధించిన ఈ సంవత్సరాలలో వలసవాద ప్రభుత్వం స్వేచ్ఛావాణిజ్య విధానాన్ని నిక్కచ్చిగా అమలు జరిపింది. స్వేచ్ఛా వాణిజ్య విధానం - లేక ఒకేదిశలో సాగిన స్వేచ్ఛా వాణిజ్యం భారతదేశంపై బలవంతంగా రుద్దబడింది. ఇది భారతదేశ పారిశ్రామికాభివృద్ధిని కీలకమైన సమయంలో ఆటంకపరచింది. సమకాలీన రష్యా జపాన్‌ల మాదిరిగా బలమైన పారిశ్రామిక విధానాన్ని అమలు జరిపి వుంటే భారతదేశం పారిశ్రామికంగా ఊపందుకొని వుండేది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత మారిన రాజకీయ ఆర్థిక వాతావరణం, స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రభుత్వం విడనాడి అర్థమనస్కతతో నైనా విచక్షణాత్మకరక్షణ చర్యలు చేపట్టవలసిన పరిస్థితిని కల్పించింది. విదేశాల నుండి దిగుమతి చేయబడిన వినిమయ వస్తువుల ద్వారా పారిశ్రామికీకరణని ఒక మేరకు ప్రోత్సహించింది. కాని కొత్త మార్కెట్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించి ప్రోత్సహించవలసిన రసాయినిక, ఇంజనీరింగు, లోహపరిశ్రమల అభివృద్ధికి రూపకల్పన జరగలేదు.

పారిశ్రామిక రంగం యొక్క పరిమితమైన సాంకేతిక పునాది కారణంగా మొదటి ప్రపంచ యుద్ధానంతరం దేశం శీఘ్రంగా పారిశ్రామికీకరణ చెందలేక పోయింది. ఉక్కు, భారీ రసాయనాలు లాంటి మౌలిక పరిశ్రమలు గణనీయమైన మేరకు అభివృద్ధి చెందనిదే నిపుణతతో కూడిన ఇంజనీరింగు రసాయనిక పరిశ్రమల అభివృద్ధికి అవకాశాలు వుండవు. కాబట్టి 19వ శతాబ్దపు సేచ్ఛావాణిజ్యం అందజేసిన వెనుకబాటుతనం, వారసత్వం విచక్షణాత్మక రక్షణ కల్పించబడిన కాలంలో అభివృద్ధికి ఆటంకంగా నిలిచింది.

విచక్షణాత్మక రక్షణ విధానం పరిశ్రమలో పరస్పర సంబంధం గల సమస్యల్ని పరిష్కరించలేదు. అది ప్రతి సమస్యను వేరుగా పరిశీలించే విధంగా రూపొందించబడింది. మౌలిక పరిశ్రమ పెరుగుదలను అడ్డుకొంటున్న సాంకేతిక నిర్మాణపరమైన ఆటంకాలను విద్య, ఆరోగ్యం, విద్యుత్, నీటి సరఫరా, నీటిపారుదల లాంటి ప్రాథమిక సౌకర్యాలను విస్తృత ప్రజానీకానికి కల్పించడం ద్వారా మాత్రమే అధిగమించడం సాధ్యపడుతుంది. 1930లో ఈ అంశాన్ని గుర్తించిన భారతీయ వాణిజ్యవేత్తలు భారత జాతీయ కాంగ్రెస్ యొక్క ఆర్థిక విధానాన్ని ఆమోదించారు. పరిమితమైన విచక్షణాత్మక రక్షణకు బదులు మొత్తం ఆర్థిక రంగానికి ప్రణాళికలు రూపొందించి పబ్లిక్ సెక్టరు క్రిందికి తీసుకొని రావాలన్నారు. ఇది ప్రైవేటు పెట్టుబడులకు ఎక్కువ అవకాశాలు కల్పిస్తుందని భావించారు. 1938లో కాంగ్రెసు నియమించిన ప్రణాళికా సంఘంలో పురుషోత్తందాస్ ఠాకూరుదాస్, ఎ.డి. షరాఫ్, అంబాలాల్ సారాభాయ్, వాల్‌చంద్ హీరాచంద్ లాంటి ప్రముఖ పెట్టుబడిదారుల్ని సభ్యులుగా నియమించింది. తరువాత 1944లో జె.ఆర్.డి. టాటా, జి.డి. బిర్లా, లాలా శ్రీరాం యితర ప్రముఖ పెట్టుబడిదారులు భారతదేశ ఆర్థికాభివృద్ధికి బొంబాయి ప్లాను రూపొందించారు.

1950 దశాబ్దంలో స్వతంత్ర భారతదేశ ప్రభుత్వం తన స్వంత ప్రణాళికల అమలు ప్రారంభించింది. కాని అప్పటికే జరగవలసిన నష్టం జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసేటప్పటికి అభివృద్ధి చెందిన దేశాలు రెండవ పారిశ్రామిక విప్లవాన్ని చేపట్టాయి. అభివృద్ధి చెందిన దేశాలకు వెనుకబడిన దేశాలకు మధ్య అంతరం బాగా పెరిగిపోయింది. 1950 దశాబ్దంలో గాక భారత పారిశ్రామిక వాణిజ్య వర్గాలు డిమాండు చేసిన విధంగా 1930 దశాబ్దంలో ప్రణాళికా పథకాలు అమలు జరిపివుంటే పారిశ్రామికాభివృద్ధికి రెండవ ప్రపంచ యుద్ధం తెచ్చిపెట్టిన అవకాశాలను కోల్పోయి వుండేవి కావు. ఇలా పారిశ్రామికీకరణ అవకాశాలు కోల్పోవడం యిది రెండవసారి. రైలుమార్గాలు వేసినప్పుడు పారిశ్రామికీకరణ అవకాశాల్ని మొదటిసారి కోల్పోయింది.

1930 దశాబ్దాంతానికి భారతదేశ ప్రభుత్వం 1920 దశాబ్దపు తొలి సంవత్సరాలలో రూపొందించిన పథకాలను మించి భారతదేశ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందింది. కాని ప్రభుత్వం యింకా విచక్షణాత్మక రక్షణ విధానాన్ని అంటిపెట్టుకొని వుంది. ఆర్థిక మాంద్యం చివరినాటికి భారత ఆర్థిక వ్యవస్థ చురుకుగా పురోగమించింది. భారత వ్యాపార సంస్థలు విచక్షణాత్మక రక్షణతో సంబంధం లేకుండా చాలా కార్యక్రమాలు చేపట్టారు. రెండవ ప్రపంచ యుద్ధం భారత పారిశ్రామిక వేత్తలకు నౌకలు, ఆటో మొబైల్స్, విమానాలు, రైలు ఇంజన్లు, వస్త్ర పరిశ్రమ యంత్రాలు, కుట్టు మిషన్లు లాంటి పలు రకాల ఉత్పత్తులను వేగవంతం చేసే అవకాశం కల్పించింది. కాని ప్రభుత్వం సహాయపడడానికి బదులుగా యుద్ధపరికరాల ఉత్పత్తికి ఆటంకం కలుగుతుందనే నెపంతో ఆటంక పరిచింది. ఆవిధంగా భారతదేశం శీఘ్రంగా పారిశ్రామికీకరణ చెందే అవకాశాన్ని కోల్పోయింది. భారతపెట్టుబడిదారీ వర్గం

ముందుకు చొచ్చుకొని పోయేందుకు సన్నద్ధమయింది. కాని ప్రభుత్వం ఆమేరకు పథకాలు రూపొందించలేదు.

**భారతదేశంలో కార్మిక ఉద్యమాలు:**

బ్రిటిషు పాలనలో ప్రారంభమైన ఆధునిక పరిశ్రమలు కార్మికవర్గాన్ని సృష్టించాయి. శ్రామికవర్గంలో ప్రధానంగా పేదరికంలోకి నెట్టివేయబడిన రైతులు, ఉపాధి కోల్పోయిన బతుకు దెరువుకి మార్గాంతరం లేని చేతివృత్తుల వారు వున్నారు. భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి ఆలస్యంగా పాక్షికంగా జరగడం వలన కార్మిక ఉద్యమాలు కూడా ఆలస్యంగా మందకొడిగా అభివృద్ధి చెందాయి. కార్మికులను పెద్ద సంఖ్యలో నియమించవలసిన అవసరం లేనందున ప్రత్యేకమైన ప్రాంతాలలో కార్మికుల కేంద్రీకరణ జరగలేదు. అందువలన కార్మికులు వారి సమిష్టి ప్రయోజనాల సాధనకు సమిష్టి కార్యాచరణ అంతగా చేపట్టలేకపోయారు. అంతేగాక భారతీయ కార్మికవర్గంలో అత్యధికులు నిరక్షరాస్యులు, సాంస్కృతికంగా వెనుకబడిన వారు. అందుకే మేధావులు బూర్జువాల కంటె కార్మికవర్గం చాలా ఆలస్యంగా జాతీయ, వర్గ చైతన్యాలను అభివృద్ధిపరచుకొంది.

పరిశ్రమలలో, ఫ్యాక్టరీలలో, గనులలో, ప్లాంటేషన్లలో కార్మికులు దుర్భరమైన పరిస్థితులలో పనిచేయవలసి వచ్చింది. తక్కువ వేతనాలు, అనారోగ్యకరమైన పని పరిస్థితులు సర్వసామాన్యం. కార్మికులు అర్ధబానిసలుగా హేయంగా పరిగణింపబడ్డారు. స్వదేశీ, విదేశీ పారిశ్రామిక వేత్తలకు కార్మికుల శ్రేయస్సుపట్ల ఎలాంటి ఆసక్తిలేదు. వారి ఆసక్తి వారి లాభాలపైననే. వలస ప్రభుత్వం చేసిన అరకొర చట్టాలు కూడా భారతదేశ పారిశ్రామికులు బ్రిటిషు పారిశ్రామికవేత్తలకు పోటీదారులుగా నిలబడలేని పరిస్థితి కల్పించేందుకు చేసినవే గాని కార్మికుల శ్రేయస్సు కొరకు చేసినవికావు.

మొదటి ప్రపంచ యుద్ధం మొదలవడంతో నౌకల కొరత ఏర్పడింది. ఫలితంగా భారతదేశ దిగుమతులపై ఆంక్షలు విధించబడ్డాయి. భారతదేశ దిగుమతులకు బ్రిటిషు మిత్రదేశాలలో, తటస్థ దేశాలలో చాలా డిమాండు వున్నది. భారతదేశ వాణిజ్య పరిశ్రమలకు గతంలో ఎన్నడూ లేనంత ఊపు వచ్చింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. జీవన వ్యయానికి తగినట్లుగా వేతనాలు పెరగలేదు. కార్మికులు ఆందోళన చేపట్టారు. మారుతున్న పరిస్థితుల్ని అర్థం చేసుకొనడంలో యాజమాన్యాలు విఫలమయ్యాయి. ఈ సందర్భంగా కార్మికుల ప్రయోజనాల కొరకు పోరాడి స్వాతంత్ర్య పోరాటానికి వారి మద్దతు పొందేందుకు జాతీయవాద నాయకులు కార్మికులకు మార్గదర్శకత్వం వహించారు; నాయకత్వం వహించారు.

1917 రష్యా విప్లవం, సోవియట్ రష్యా స్థాపన – నూతన సామాజిక వ్యవస్థ ఆదర్శాన్ని కార్మికుల దృష్టికి దెచ్చింది. ఈ అంతర్జాతీయ ఘటనల ప్రభావంతో భారత దేశంలో

కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. ఈ పార్టీ శ్రామికుల పక్షాన నిలిచి వారి ప్రయోజనాల కొరకు పోరాడే క్రమంలో భాగంగా కార్మిక ఉద్యమం పుట్టింది; అభివృద్ధి చెందింది. అంతేగాక మొదటి ప్రపంచ యుద్ధం తరువాత కార్మిక ప్రయోజనాల సంరక్షణ కొరకు అంతర్జాతీయ కార్మిక సంస్థ (International Labour Organization) స్థాపన, దాని యొక్క త్రైపాక్షిక నిబంధనావళి కూడా భారత దేశంలో కార్మిక సంఘాల అభివృద్ధికి తోడ్పడ్డాయి.

**మొదటి దశ ( 1875 - 1918 )**

ఈ దశని రెండు కాల వ్యవధులుగా విభజించవచ్చు. మొదటి కాల వ్యవధి 1875 – 91లో ప్రధాన లక్ష్యం – భారత దేశ ఫ్యాక్టరీలలో మహిళ బాల కార్మికుల శ్రమని క్రమబద్ధీకరించడం. రెండవ కాల వ్యవధి 1891 – 1918లో భారతదేశం నుండి విదేశాలకు – బ్రిటిషు వలసలకు వలసలుపోయిన భారతదేశ కార్మికుల పని పరిస్థితుల్ని మెరుగుపరుచుట లక్ష్యం. మొదటి దశలో కార్మిక సంఘాల నిర్మాణం జరగలేదు. మేధావులైన కొందరు నాయకులు సభలు సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం నియమించిన కమిషన్లకు, కమిటీలకు మహాజరులు, ప్రాతినిధ్యాలు అందజేశారు.

19వ శతాబ్దపు ద్వితీయార్థ భాగంలో భారతదేశంలో పారిశ్రామికీకరణ ప్రారంభమయింది. పారిశ్రామికీకరణ కొత్త యిబ్బందులను తెచ్చి పెట్టింది. యజమానులు స్త్రీలను పిల్లల్ని పనులలో పెట్టుకొన్నారు. కార్మికుల స్థితిగతులు అధ్వానంగా వున్నాయి. ఎక్కువ గంటలు పని చేయాలి. కనీస గృహ వసతి లేదు. కనీస విద్యలేదు. వారిలో మరణాల రేటు ఎక్కువ. కార్మికుల ఈ స్థితిగతుల్ని గమనంలో పెట్టుకొని 1875లో బొంబాయిలో మొదటి ఫ్యాక్టరీ కమిషన్ నియమించబడింది. 1881లో మొదటి ఫ్యాక్టరీ చట్టం చేయబడింది. కాని ఈ చర్య అరకొర చర్యగా నిరూపితమయింది.

కాబట్టి మరొక ఫ్యాక్టరీ కమిషన్ 1884లో నియమించబడింది. బొంబాయిలో లొఖండే ఒక కార్మిక సదస్సు నిర్వహించి కమిషన్‌కి సమర్పించేందుకు ఒక విజ్ఞాపన పత్రాన్ని తయారుచేశాడు. విజ్ఞాపన పత్రంలో వారానికొకరోజు సెలవు, పనికాలంలో అర్ధగంట విరామం, పనిలో అశక్తులైన వారికి నష్ట పరిహారం, ప్రతి నెలా 15వ తేదీ నాటికి వేతనాల చెల్లింపు, పని గంటలు ఉదయం 6 గంటలు నుండి సాయంత్రం 6 గంటలకు పరిమితం చేయాలని డిమాండ్లు రూపొందించాడు. రెండవ ఫ్యాక్టరీ కమిషన్ సిఫార్సుల మేరకు రెండవ ఫ్యాక్టరీ చట్టం (1891) చేయబడింది. ఈ చట్టం వారానికొక రోజు సెలవు దినం, స్త్రీల పిల్లల పని గంటల పై పరిమితి లాంటి ఒకటీ అరా మినహాయింపులు తప్ప కార్మికులకు చేకూర్చిన ప్రయోజనాలేమీ లేవు. సహజంగానే యిది కార్మికులకు నిరాశ మిగిల్చింది.

## రెండవ దశ (1918- 24)

రెండవ దశలో గణనీయమైన సంఖ్యలో కార్మిక సంఘాలు నిర్మాణబద్ధమయ్యాయి. మొట్టమొదటిగా నిర్మాణబద్ధమైన కార్మికసంఘం 'మద్రాసు లేబరు యూనియన్' (1918). దాని అధ్యక్షుడు బి.పి.వాడియా. ఆయన 'హోంరూలు' ఉద్యమంలో చురుకైన కార్యకర్త. కార్మిక సంఘాన్ని అభివృద్ధి పరచడానికి చాలా కృషి చేశాడు. ఇతర చోట్ల కూడా చాలా సంఘాలు నిర్మాణ బద్ధమైయ్యాయి. 1920లో ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (AITUC) స్థాపించబడింది. 1,40,000 సభ్యత్వంతో 64 సంఘాలు దానికి అనుబంధ సంఘాలుగా వున్నాయి. వివిధ పరిశ్రమలకు చెందిన కార్మికుల ప్రయోజనాల కొరకు సంబంధిత సంఘాలు పనిచేశాయి. ఎఐటియుసి కార్మికుల ఉమ్మడి ప్రయోజనాల కొరకు పనిచేసింది. కార్మిక విధానం, కార్మిక చట్టాలపై కార్మికుల పక్షాన ఎఐటియుసి ప్రభుత్వానికి ప్రాతినిధ్యాలు చేసింది. ఎఐటియుసి ప్రధానంగా అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) సదస్సులకు కార్మిక ప్రతినిధుల్ని పంపడానికి ఉద్దేశించబడినదైనప్పటికీ కార్మిక ఉద్యమానికి ఒక స్థాయిని తెచ్చిపెట్టింది. కార్మిక సమస్యల్ని చర్చించేందుకు ఒక వేదికగా పనిచేసింది.

కార్మిక సంఘాల నిర్మాణంతో సమ్మెలు ప్రారంభమయ్యాయి. వేతనాల పెంపుతో, బోనసు మంజూరు, పనిగంటల తగ్గింపు, అదనపు సెలవులు – కార్మికుల డిమాండ్లు. ఈ కాలంలో నిర్మించబడిన కార్మిక సంఘాలన్నీ స్థిరంగా నిరంతరాయంగా పనిచేశాయని నిర్ణయానికి రావడం తప్పవుతుంది. వీటిలో చాలా సంఘాలు తాత్కాలికమైనవి. డిమాండ్లు రూపొందించడానికి, సమ్మెలు చేయడానికి ఏర్పడ్డాయి. సమ్మెలు పూర్తికాగానే సంఘాలు పని చేయడం ఆగిపోయేది. కాని ఇలాంటివి భారతదేశంలో కార్మిక సంఘాల అభివృద్ధిని ఆటంకపరచలేకపోయాయి. కార్మిక సంఘాలన్నీ కొనసాగక పోయినప్పటికీ కార్మిక వర్గ కార్యకలాపాలు కొనసాగాయి.

ఈ కాలంలో కార్మిక సంఘాల కార్యకలాపాలు గనులు, జౌళి, జనపనార లాంటి సువ్యవస్థితమైన పరిశ్రమలలోకి అంతగా చొచ్చుకుపోలేక పోయాయి. కాని మధ్యతరగతి ఉద్యోగులలో స్థిరంగా బలంగా వేళ్లూనుకొన్నాయి. భారత దేశంలో కార్మిక వర్గ కార్యకలాపాలు కార్మికులతో పాటు మధ్యతరగతి ఉద్యోగులలో కూడా ఒకే సారి అభివృద్ధి చెందాయి. ఇతర దేశాలలో గుమస్తాలు, యితర ప్రభుత్వ ఉద్యోగులు కార్మికుల కంటే ఆలస్యంగా సంఘటితమయ్యారు.

## మూడవ దశ: ( 1929 - 34 )

ఈ దశలో కార్మికులపై కమ్యూనిస్టు సిద్ధాంత ప్రభావం ప్రబలంగా పని చేసింది. 1920ల నుండి కమ్యూనిస్టులు కార్మిక సంఘాలలో ప్రవేశించడం ప్రారంభమయింది. వారి జోక్యం సమ్మెల నిర్వహణలో మార్పు తెచ్చింది. ఉద్యమాలలో సమరశీలత పెంచింది.

కార్మికోద్యమ నాయకుల మధ్య గల సైద్ధాంతిక విభేదాల కారణంగా కార్మికోద్యమం ఎదురు దెబ్బ తిన్నది. కమ్యునిస్టులు కార్మికోద్యమంలో తమ పార్టీ సిద్ధాంతాలను ప్రవేశ పెట్ట యత్నించారు. మిత వాదులు ఉద్యమాన్ని కమ్యూనిస్టులకు దూరంగా ఉంచాలని యత్నించారు. ఫలితంగా ఎఐటియుసిలోని నాయకత్వ స్థానాల్ని పట్టుకొని బలపడేందుకు జరిగిన పోరాటం కాంగ్రెస్ కమ్యూనిస్టు అనుచరుల మధ్య అంతరాన్ని పెంచింది. ఇది కార్మికులు సమిష్టిగా బేరసారాలాడే శక్తిని తగ్గించింది. ఎఐటియుసి లో గల విభేదాల కారణంగా కాన్పూరు బొంబాయి ఇంకా ఇతర చోట్ల జరిగిన పెద్ద సమ్మెలు విఫమయ్యాయి. కార్మికుల మధ్య గల ఈ విభేదాలు యాజమాన్య వర్గానికి ప్రయోజనకారిగా పరిణమించాయి.

సైద్ధాంతిక విభేదాలు 1929లో ఎఐటియుసి చీలికకు దారితీశాయి. మితవాదులు ఎఐటియుసి నుండి బయటకు వచ్చి ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ (ఐ.టి.యు.యఫ్) స్థాపించారు. ఎఐటియుసి నుండి మరొక సెక్షన్ చీలి 'రెడ్ టక్'ని స్థాపించింది. దేశాన్ని ప్రపంచ ఆర్థిక మాంద్యం, సహాయ నిరాకరణోద్యమం ప్రభావితం చేసిన కాలంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ కాలంలో కార్మికోద్యమం సాధించిన ఒక విజయం కార్మికోద్యమ చట్టం 1926ని చేయించడం. ఈ చట్టం కార్మిక సంఘాల్ని రిజిష్టరు చేయించుకొనేందుకు, రిజష్టరు చేయించుకున్న సంఘాలకు ప్రత్యేకమైన హక్కులకు అవకాశం కల్పించింది.

**నాల్గవ దశ: (1935 - 39)**

నాల్గవ దశలో సంఘకార్యకలాపాలు పునరుద్ధరించబడ్డాయి. సమ్మెల సంఖ్య పెరిగింది. ఈ కాలంలో ఈ క్రింది కారణాల రీత్యా సంఘ కార్యకలాపాలు పునరుద్ధరించ బడ్డాయి. భారత ప్రభుత్వ చట్టం 1935తో ఏర్పాటు చేయబడిన రాష్ట్రాల కాంగ్రెస్ మంత్రి వర్గాలు కార్మిక సంఘాల్ని అణచివేసి వారి డిమాండ్లను నిరాకరించడం ద్వారా గాక కనీస జీవన స్థాయిని పౌర హక్కుల్ని కల్పించడం ద్వారా పారిశ్రామిక శాంతిని పరిరక్షించే విధానాన్ని అమలు జరిపాయి. అంతేగాక 1935 చట్టం కార్మిక ప్రతినిధుల్ని కార్మిక సంఘ నియోజక వర్గాల ద్వారా ఎన్నిక చేసుకొనే అవకాశం కల్పించింది. ఇంకా యాజమాన్య వర్గం వైఖరిలో మార్పు కూడా కార్మిక సంఘాల పెరుగుదలని ప్రోత్సహించింది. యజమానులు కార్మిక సంఘాలతో స్నేహంగా మెలగాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ హితవు చెప్పింది. కార్మిక సంఘాల ఐక్యతా ప్రయత్నాలు కూడా జరిగాయి. ఫలితంగా ఐటియుఎఫ్; యన్‌టియుఎఫ్‌తో కలిసిపోయింది. రెడ్ టక్, ఎఐటియుసిలో విలీనమయింది. చివరిగా 1938లో యన్ టి యు ఎఫ్, ఎ ఐ టి యు సి అనుబంధ సంస్థగా మారింది.

**ఐదవ దశ: (1939 - 45)**

రెండవ ప్రపంచ యుద్ధం పరోక్షంగా భారతీయ పరిశ్రమలకు గతంలో ఎన్నడూ లేనంత రక్షణ కల్పించింది. పాక్షికంగా నౌకల కొరత కారణంగానూ, పాక్షికంగా దేశ విదేశాలలోని పరిశ్రమలు యుద్ధ పరికరాల ఉత్పత్తులలో నిమగ్నం కావడం వలననూ భారతీయ మార్కెట్లలోకి విదేశీ వస్తువుల సరఫరా నిరాకరింప బడింది. భారతీయ పరిశ్రమలు తమ కార్యకలాపాల్ని పెంచిన ఫలితంగా భారత దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి పెరిగింది. కొత్త రికార్డుల్ని నెలకొల్పింది. యుద్ధకాలంలో గ్రేట్ బ్రిటన్ భారత దేశంలో నిరంతరాయంగా కొనుగోలు చేయడం వలన ధరలు విపరీతంగా పెరిగాయి. ద్రవ్యోల్బణం విస్తరించింది. లాభాలు పెరిగాయి. కాని వేతనాలు పెరగలేదు. ఫలితంగా కార్మిక సంఘాల కార్యకలాపాలు ఊపందుకొన్నాయి. కార్మిక సంఘాల సభ్యత్వం పెరిగింది.

సమ్మెలు తక్కువగానే జరిగాయి. కాని సమ్మెలు చేసిన చోట్ల కార్మికులు కొన్ని రాయితీలు పొందారు. సమ్మెల సంఖ్య తగ్గడానికి కారణాలు:

1) కమ్యూనిస్టులు యుద్ధాన్ని బలపరిచారు. సమ్మెలకు అనుకూలంగా లేరు.

2) ఇతర సంఘాలకు కార్మికుల డిమాండ్లను రూపొందించి ఉద్యమాలను నడిపేందుకు సరియైన నాయకులు లేరు.

3) యాజమాన్యాల వైఖరి ప్రతికూలంగా లేదు.

4) రక్షణ నిబంధనల మేరకు భారత ప్రభుత్వం సమ్మెల్ని నిరోధించే అధికారాన్ని చేపట్టింది.

మొత్తం మీద కార్మిక సంఘాల ప్రాధాన్యత గుర్తించ బడింది. ప్రభుత్వ ప్రతినిధులు, కార్మిక నాయకులు, యజమానులతో తరచుగా త్రైపాక్షిక సమావేశాలు నిర్వహించబడ్డాయి. నేషనల్ సర్వీసు ఆర్డినెన్సు 1940 మేరకు కార్మికుల హక్కులకు రక్షణ కల్పించబడింది. ఆదే విధంగా సరియైన కారణం లేకుండా యజమానులు కార్మికుల్ని తొలగించడాన్ని అత్యవసర సేవల నిర్వహణ ఆర్డినెన్స్ 1941 (Essential Services Maintenance Ordinance) నిషేధించింది.

**ఆరవ దశ: (1945 - 47)**

యుద్ధం ముగిసిన తరువాత ధరలు పెరిగాయి. జీవన వ్యయం పెరిగింది. ద్రవ్యోల్బణం, స్పెక్యులేషన్, బ్లాకు మార్కెటింగ్ పెరిగాయి. ఈ కాలం నాటి రాజకీయ పరిణామాలు కూడా కార్మిక సంఘాల పెరుగుదలని ప్రోత్సహించాయి. ప్రతి రాజకీయ పార్టీ

కార్మిక ఉద్యమంలో స్థానం కొరకు ఆరాట పడింది. అంతే గాక మారిన పరిస్థితులలో శ్రమ విలువైన పాత్రని నిర్వహించ వలసి ఉంటుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. కార్మిక సంఘాలను యాజమాన్యాలు తప్పని సరిగా గుర్తించాలని 1947లో సవరించబడిన కార్మిక సంఘ చట్టం స్పష్టం చేసింది. అన్నిటినీ మించి యుద్ధం తరువాత పరిశ్రమలలో పనిచేసే కార్మికుల సంఖ్య పెరిగింది. కార్మికుల బలం పెరిగింది.

ఈ కాలంలో కార్మిక సంఘాలలో మహిళల సంఖ్య పెరిగింది. ఈ కారణంగా కార్మిక సంఘాలలోనూ, సమాజంలోనూ వారి స్థాయి గౌరవం పెరిగాయి. మరొక వైపు యాజమాన్య సంఘాలు బలం పుంజుకుని కేంద్ర స్థాయిలో నిర్మాణంలోకి వచ్చాయి. దీనితో కార్మికులు కూడా అంతర రాష్ట్ర ప్రాంతీయ సంఘాలు ఏర్పాటు చేసుకోవలసి వచ్చింది.

ఫలితంగా సమ్మెల సంఖ్య పెరిగింది. బొంబాయి, పశ్చిమ బెంగాల్ ఆ తరువాత మద్రాసు, ఉత్తర ప్రదేశ్‌లలో పారిశ్రామిక వివాదాలు ఎక్కువగా జరిగాయి. వివాదాల కారణంగా పారిశ్రామిక ఉత్పత్తి తగ్గింది. దేశానికి నిరంతరాయంగా ఉత్పత్తి పెరుగుదల అవసరం కాబట్టి 1946 డిసెంబరులో పారిశ్రామిక శాంతి సదస్సు నిర్వహించబడింది. ఈ సదస్సుకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు కార్మికులు యజమానులు హాజరయ్యారు. ఈ సదస్సు ప్రభుత్వ నిర్బంధ శాంతి మధ్యవర్తిత్వాల సూత్రాన్ని, సమాధాన పరిచే యంత్రాంగ నియామకానికి అవకాశం కల్పించిన 1947 పారిశ్రామిక వివాదాల చట్టాన్ని ఆమోదించింది.

కార్మిక ఉద్యమాలు పుట్టక ముందు దుర్భరంగా ఉన్న కార్మికుల పని పరిస్థితులు వివిధ దశలలో చేయబడిన చట్టాల ద్వారా గణనీయంగా మెరుగుపడ్డాయి. కార్మిక సంఘాల స్థాపనతో కార్మిక వర్గం హక్కులు బాధ్యతల పట్ల చైతన్యవంతమయింది. అంతేగాక స్వాతంత్ర్య పోరాటంలో కార్మికులు జాతీయ నాయకులకు పూర్తి మద్దతు యిచ్చారు. ఆ విధంగా కార్మిక ఉద్యమం కార్మికుల స్థితి గతులను మెరుగు పరచడంతో పాటు స్వాతంత్ర్య పోరాటానికి గణనీయమైన తోడ్పాటు నందించింది.

# IV

# సమాజం - మతం

10

# సమాజం - మతం

**సాధారణ పరిశీలన:**

19వ శతాబ్దంలో భారతదేశం మధ్య యుగాల నుండి ఆధునిక యుగంలోకి ఆలశ్యంగా ప్రవేశించింది.

మిషనరీల కార్యకలాపాలు బ్రిటిషు ప్రభుత్వ విధానాల ఫలితంగా క్రైస్తవ మతదాడులనుండి రక్షించుకునేందుకు, భారతీయ సంస్కృతి నాగరికతల జీవనాడులలో జొచ్చుకుపోయిన సాంఘిక దురాచారాల మూఢ రుగ్మతని నిర్మూలించేందుకు, సామాజిక మత సంస్కరణ ఉద్యమాలు అభివృద్ధి చెందాయి. ఈ ఉద్యమాలు మత విశ్వాసాలతో, ఆచారాలతో, అనుసంధానం చేయబడ్డాయి. రాజారామ్‌మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, వివేకానంద, స్వామి దయానంద సరస్వతి, వీరేశలింగం పంతులు ఇంకా పలువురు సంస్కర్తల ఆలోచనలు, కార్యకలాపాలు భారతీయ సమాజం యొక్క పునరుజ్జీవం కొరకు చేపట్టబడ్డాయి.

కులపరమైన అసహనం, దేశవ్యాప్తంగా వున్న రుగ్మత. నిరక్షరాస్యత అంతటా అలుముకుని వుంది. విద్యావంతుల్లో అత్యధికులు సాంప్రదాయవాదులు. స్త్రీల పరిస్థితి భయంకరం, బాధాకరం. భ్రూణహత్యలు, బహుభార్యత్వం సర్వసామాన్యాలు. సాధారణ ప్రజలకు అంధకారం నుండి విముక్తి కల్పించేందుకు కొద్దిమంది ఉదారవాదులు భారతీయ సమాజాన్ని సంస్కరించే బృహత్కర్తవ్యాన్ని చేపట్టారు. వారు ప్రధానంగా ఉన్నత, మధ్య తరగతులకు చెందిన పాశ్చాత్య విద్యనార్జించిన మేధావులు. కానీ మత రంగంలో దయానంద సరస్వతిలాంటి కొద్దిమంది నాయకులు పాశ్చాత్య సంస్కృతీ ప్రభావాన్ని పూర్తిగా వ్యతిరేకించారు.

సమాజాన్ని సంస్కరించే తమ ప్రయత్నాలలో భాగంగా దాదాపు అందరు నాయకులూ విద్యకి ప్రాధాన్యత నిచ్చారు. సతీదురాచారం రద్దు, వితంతు పునర్వివాహాలు, స్త్రీలకు ఆస్తి హక్కులాంటి సంస్కరణలు చేపట్టారు. ఆర్యసమాజం, దివ్యజ్ఞాన సమాజం లాంటి కొద్ది సంస్థలు

విద్యకంటే కూడా పునరుద్ధరణ వాదానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాయి. ఇవి సమాజం మీద, సంస్కరణ ఉద్యమాల మీద ప్రతికూల ప్రభావం చూపాయి. వివేకానందుడు పాశ్చాత్యదేశాలలో హిందూమతం యొక్క ఔన్నత్యాన్ని జాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పాడు. సయ్యద్ అహ్మద్‌ఖాన్ ముస్లిం మత సంస్కరణలకు ఆద్యుడు. ముస్లింలు ఆధునిక విద్య పొందేందుకు, బ్రిటిష్‌వారి సానుభూతి పొందేందుకు దోహదపడ్డాడు. తిలక్ మినహా సంస్కర్తలందరూ మత సాంఘిక సంస్కరణలను ప్రవేశపెట్టాలని బ్రిటిష్‌వారిని అర్థించారు. వారి సహాయాన్ని కోరారు. అంతేగాక 19వ శతాబ్దపు ముఖ్యమైన సంస్కరణ ఉద్యమాలన్నీ సెక్యులర్ స్వభావం గలవిగాక మతపరమైన స్వభావం కలవి. వారి రాజకీయ ఆర్థిక ఆలోచనలు సమూలమైన మార్పులను కోరేవి కావు. ఉద్యమం వైఖరి పద్ధతులపై సంస్కర్తల మధ్య విభేదాలున్నాయి. 19వ శతాబ్దపు సంస్కరణ ఉద్యమాలు వెంటనే గొప్ప ప్రయోజనాల్ని సాధించనప్పటికీ తరువాత పరిణామాలకు అవి ఒక ప్రారంభాన్నిచ్చాయి. ప్రభావితం చేశాయి. సాంస్కృతిక విప్లవం నుండి ఉద్భవించిన జాతీయవాద స్ఫూర్తి సంస్కరణల కొరకు పోరాడవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

## పాశ్చాత్య విద్య - పాశ్చాత్య ఆలోచనలు

### మొదటిదశ (1758-1812)

ఈ దశలో 1781లో ముస్లిం చట్టం సంబంధిత అంశాల బోధనకు వారన్ హేస్టింగ్స్‌చే కలకత్తా మదర్సా స్థాపన, హిందూ చట్టం తత్వశాస్త్రము బోధనకు జొనాథన్ డంకన్‌చే 1792లో సంస్కృత కళాశాల స్థాపన జరిగాయి. ఇవి కూడా కంపెనీ నెలకొల్పిన కోర్టుల నిర్వహణకు సహాయ పడేందుకు అవసరమైన అర్హతలు కలిగిన భారతీయుల్ని సరఫరా చేసే ఉద్దేశ్యంతో స్థాపించబడ్డాయి. విలియం జోన్స్, ఆయన పిలుపుకు స్పందించిన 30 మంది ఇతరులతో ఆసియా పరిస్థితుల్ని అధ్యయనం చేసేందుకు 1784 జనవరి 15న ఆసియా సంఘం (Asiatic Society) స్థాపించబడింది. దీనిలో ఇష్టమైన వారు సభ్యులుగా చేరవచ్చు. కాని 1829 వరకూ భారతీయులకు అనుమతి లభించలేదు. ఈ సంఘం చేసిన అధ్యయనాలు ఆసియాపై పరిశోధనలుగా 1789లో మొదటి గ్రంథంగా ప్రచురింపబడింది. కానీ ఈస్టిండియా కంపెనీ భారతదేశంలోని సాధారణ ప్రజల విద్యపట్ల ఎలాంటి ఆసక్తి చూపలేదు.

### రెండవదశ (1813-1853)

భారతదేశంలో ఆధునిక విద్యని ప్రోత్సహించాలని కొంత మంది భారతీయులతో సహా పలువురు మానవతా వాదులు, క్రైస్తవ మిషనరీలు కంపెనీపై విపరీతమైన వత్తిడి తీసుకురావడంతో భారతీయులలో విద్యావంతుల్ని ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు సాలీనా ఒక లక్ష రూపాయలు వెచ్చించాలని 1813 చార్టర్ చట్టం కంపెనీని ఆదేశించింది. ఈదశలో విద్య యొక్క స్వభావంపై రెండు ధోరణులు ఘర్షణ పడ్డాయి. మొదటిది: ఆధునిక పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రాల్ని ప్రోత్సహించాలా? లేక ప్రాచ్య భాషాధ్యయనాన్ని ప్రోత్సహించాలా? రెండవది: పాఠశాలలు కళాశాలల్లో బోధనా మాధ్యమంగా భారతీయ భాషల్ని ప్రవేశపెట్టలా లేక ఇంగ్లీషుని పెట్టాలా?

**ప్రాచ్య భాషావాదుల, ఇంగ్లీషువాదుల వైరుధ్యం:**

అప్పటికి వున్న ప్రభుత్వ విద్యాసంస్థల బాధ్యత వహించి, 1813 చార్టర్ ప్రకారము కేటాయించబడిన లక్ష రూపాయలు వెచ్చించే విధానం గురించి, ఇంకా పైన చెప్పబడిన రెండు అంశాల గురించి చర్చించేందుకు 1823లో ఒక కమిటీ నియమించబడింది. చర్చలలో ఇంగ్లీషు భాషావాదుల వాదన నెగ్గింది. ప్రాచ్య భాషావాదుల వాదన వీగిపోయింది.

1835లో ప్రాచ్య భాషావాదులు (జేమ్స్ సుదర్‌లేండ్, జాన్‌షేక్స్‌పియర్, జేమ్స్‌హెన్రీ ప్రిన్సెప్ సోదరులు, ఇలియట్ మెక్నేటన్) ఆంగ్ల భాషావాదులు (డబ్ల్యు.డబ్ల్యు.బర్డ్. పి.బి. శాండల్స్, జి.ఎ.బుష్బీ, జె.ఆర్. కాల్విన్, సి.యి.ట్రివిలియన్) వారి వారి వాదనలు సుప్రీం కౌన్సిల్ ముందు విన్పించారు. సంస్కృతం అరబిక్ భాషా బోధనలకు ప్రాధాన్యత తగ్గించడం 1813 చార్టరు చట్టానికి విరుద్ధమన్నారు. మెకాలే ఇంగ్లీషు భాషావాదుల్ని సమర్థించాడు. మెకాలే సూచనల మేరకు బెంటింక్ విద్యకి కేటాయించే మొత్తం ఆంగ్ల భాషా బోధనకే వెచ్చించాలని ఆదేశాలు జారీ చేశారు. 1835 మార్చి 7న ఇంగ్లీషు భారతదేశ అధికార భాషగా ప్రకటించబడింది.

మెకాలే అభిప్రాయాన్ని అనుసరించి ఇంగ్లీషు విద్య నేర్పిన ఈ భారతీయులలోని నూతనవర్గం 'రక్తంలో, రంగులో భారతీయులు అయినప్పటికీ అభిప్రాయాలు, ఆలోచనలు అభిరుచులలో బ్రిటిషువారిలాగా వుంటారు.' వీరు బ్రిటిషు పాలకులకు, భారతదేశ పాలితులకు మధ్య వ్యాఖ్యాతలుగా పనిచేయడమే కాక విద్యని భారతదేశ ప్రాంతీయ భాషలలో వడపోత పద్ధతి ద్వారా సాధారణ ప్రజల్లోకి తీసుకుపోతారని భావించబడింది.

ఇంగ్లీషు పాఠశాలల్లో చదివిన భారతీయులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని 1844లో లార్డ్ హార్డింగ్ ప్రకటించాడు. 1813–1853 కాలంలో బెంగాల్, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలో చాలా కొత్త పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించబడ్డాయి. ఇంగ్లీషు భాషకి ప్రాధాన్యత పెరిగింది. ఈ కాలంలో మరి మూడు పరిణామాలు చోటుచేసుకొన్నాయి. ఆధునిక విద్యకి చెందిన అన్ని రంగాలలో అగ్రభాగాన నిలిచిన మిషనరీల కార్యకలాపాలు ఊపందుకొన్నాయి. వృత్తి విద్యకి సంబంధించిన లా, మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలు స్థాపించబడ్డాయి. బాలికల విద్యకి ప్రభుత్వ మద్దతు లభించింది. (లార్డ్ డల్హౌసి ప్రభుత్వ మద్దతుని ప్రకటించారు).

విస్తృతంగా ప్రాధమిక పాఠశాలల్ని ప్రారంభించడానికి బదులుగా చాలా పరిమితంగా ఇంగ్లీషు పాఠశాలలు కళాశాలలు ప్రారంభించాలనే ప్రభుత్వ విధానం సాధారణ ప్రజల విద్య నిర్లక్ష్యానికి దారితీసింది. కారణం ప్రభుత్వం చాలా పరిమితమైన మొత్తాన్ని మాత్రమేవిద్య కొరకు వెచ్చించాలని నిర్ణయించింది. వారి విధానంలోని ఈ లోపాన్ని కప్పిపుచ్చుకునేందుకు బ్రిటిషువారు వడపోత విధానాన్ని ప్రస్తావించారు. మరొక విధంగా చెప్పాలంటే ఉన్నత మధ్య తరగతుల నుండి విద్యావంతులైన కొద్దిమంది విస్తృత ప్రజానీకంలో ఆధునిక భావజాలాన్ని వ్యాపించేసే కర్తవ్యాన్ని నిర్వహిస్తారన్నారు. వడపోత విధానానికి స్వస్తి చెపుతున్నట్లు 1854లో ప్రకటించినప్పటికీ ఆచరణలో బ్రిటిషు పాలన ముగిసేవరకు కొనసాగింది.

**మూడవ దశ: (1854-1900)**

1854 నాటి ఉడ్స్ ఆదేశాలు (Wood's Dispatch) (అప్పటి బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ప్రెసిడెంట్ అయిన ఉడ్ ఈ విధానానికి రూపకల్పన చేశాడు. తరువాత అతడు మొదటి భారత రాజ్య కార్యదర్శి అయ్యాడు.) భారతదేశంలో 'ఇంగ్లీషు విద్యకి మాగ్నా కార్టాగా' పరిగణింపబడింది. భారతదేశంలో ఆధునిక విద్య చరిత్రలో ఉడ్స్ డిస్పాచ్ ఒక మైలురాయిగా నిలుస్తుంది. తరువాత విద్యా పరిణామానికి ప్రాతిపదికగా నిలిచే సమగ్రమైన పథకానికి ఉడ్స్ డిస్పాచ్ నమూనాని రూపొందించింది. ఇది వడపోత సిద్ధాంతాన్ని తిరస్కరించింది. విస్తృత ప్రజా విద్యని, స్త్రీ విద్యని, ప్రాంతీయ భాషల అభివృద్ధిని ప్రోత్సహించాలన్నది. ప్రాథమిక స్థాయి నుండి యూనివర్శిటీ స్థాయి వరకు గల విద్యని అనుసంధానం చేసింది. సెక్యులర్ విద్యని ప్రోత్సహించింది. 1854 ఉడ్స్ డిస్పాచ్ విధానాలు 19వ శతాబ్దపు ద్వితీయ భాగంలో అమలు జరపబడ్డాయి.

1855లో మొదటిసారిగా బొంబాయి, మద్రాసు, బెంగాల్, వాయువ్య పంజాబు, ప్రావిన్సులలోను ఆ తరువాత ఏర్పడిన ప్రావిన్సులలోను విద్యాశాఖలు స్థాపించబడ్డాయి. కలకత్తా యూనివర్శిటీ (1857 జనవరి) బొంబాయి యూనివర్శిటీ (1857 జూలై) మద్రాసు యూనివర్శిటీ (1857 సెప్టెంబరు) పంజాబ్ యూనివర్శిటీ (1882) అలహాబాద్ యూనివర్శిటీ (1887)ల స్థాపన ఈకాలానికి చెందిన ముఖ్యమైన ఘటనలు. విద్యాశాఖలో ఉన్నతోద్యోగుల నియామకాల కొరకు 1897లో 'ది ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీస్' సృష్టించబడింది.

1854 ఉడ్స్ డిస్పాచ్ సిఫార్సులు ఏమేరకు అమలు జరపబడుతున్నాయో పరిశీలించి ప్రాథమిక విద్యపై అవసరమైన సిఫార్సులు చేసేందుకు హంటర్ కమిషన్‌గా పిలవబడే ఇండియన్ ఎడ్యుకేషన్ కమిషన్ 1882 లార్డ్ రిప్పన్‌చే నియమింపబడింది. ప్రాథమిక పాఠశాలల యాజమాన్య బాధ్యత కొత్తగా స్థాపించబడిన స్థానిక సంస్థలకు (జిల్లా బోర్డులు, మున్సిపాలిటీలు) అప్పజెప్పాలని కమిషన్ సిపార్సు చేసింది. కొద్ది కాలేజీలను సెకండరీ పాఠశాలలను ఇంకా ఇతర ముఖ్యమైన సంస్థలను తన యాజమాన్యంలో వుంచుకొని మిగిలిన విద్యారంగం మొత్తాన్ని ప్రైవేటు సంస్థలకు వదలివేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులన్నింటినీ ప్రభుత్వం ఆమోదించింది. అమలు పరచింది.

**నాల్గవదశ (1901-1920)**

ప్రభుత్వ విద్యా సంచాలకుల తొలి సదస్సు 1901లో లార్డ్‌కర్జన్ నిర్వహించి దాని నిర్ణయాల ప్రాతిపదికన విద్యా సంస్కరణలు ప్రారంభించారు. 1902లో ర్యాలీ అధ్యక్షతన యూనివర్శిటీస్ కమిషన్ నియమించాడు. ఆ కమిషన్ సిఫార్సుల మేరకు యూనివర్శిటీ చట్టం (1904) చేయబడింది. ఈ చట్టం యూనివర్శిటీలను బోధనా కార్యక్రమం చేపట్టేలా చేసింది. (గతంలో కేవలం పరీక్షలు నిర్వహించేవిగానే వుండేవి). బాధ్యతలు సత్వరంగా నిర్వహించేందుకు సిండికేట్‌లను స్థాపించింది. ఈ చర్యలతో పైస్థాయి విద్యలో గుణాత్మకమైన మార్పు వచ్చింది.

ఈ చర్యల్ని యూనివర్శిటీలపై ప్రభుత్వ అదుపును పెంచుకునేందుకు చేపట్టిన చర్యలుగా జాతీయ వాదులు నిరసించారు.

1910లో కేంద్రంలో ప్రత్యేక విద్యాశాఖ స్థాపించబడింది. 1913లో విద్యావిధానంపై భారత ప్రభుత్వ తీర్మానం రెసిడెన్షియల్ యూనివర్శిటీలు ప్రారంభించాలని, ప్రాథమిక సెకండరీ పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణని అభివృద్ధి పరచాలని పేర్కొన్నది. కలకత్తా యూనివర్శిటీ కమిషన్ సిఫార్సుల అమలుని పరిశీలించేందుకు లార్డ్ చెమ్స్ ఫర్డుచే శాడ్లర్ కమిషన్ (1917–19) నియమించబడింది. సెకండరీ విద్యని సెకండరీ విద్యాబోర్డుకి అప్పజెప్పాలని డిగ్రీ కోర్సు కాలవ్యవధి 3 సంవత్సరాలుగా వుండాలని కమిషన్ సిఫార్సు చేసింది.

1921 నాటికి యూనివర్శిటీల సంఖ్య 12కు పెరిగింది. కొత్తగా స్థాపించబడిన ఏడు యూనివర్శిటీలు; బనారస్, మైసూరు, పాట్నా, అలీఘర్, ఢాకా, లక్నో, ఉస్మానియా. అలాంటి అభివృద్ధే సెకండరీ ప్రాథమిక స్థాయిలో జరిగింది. కానీ సార్వత్రిక విద్యా లక్ష్యానికి చాలా దూరంలో వుంది.

ఈ దశలోనే జాతీయ విద్యా విధానం, గాంధీ, లాలాలజపతిరాయ్, అనిబీసెంట్ లాంటి నాయకులచే పునరుద్ధరించబడింది. అప్పటికీ అమలులో వున్న విద్యావిధానం జాతీయాభివృద్ధికి ప్రతికూలమైనది కాబట్టి దేశభక్తిని ప్రేరేపించే విద్యా విధానం రూపొందింపబడాలన్నారు. కాశీ విద్యాపీఠ్, జామియా ఇస్లామియా లాంటి జాతీయ విద్యాసంస్థలు స్థాపించబడ్డాయి. అవి ప్రభుత్వ సహాయం లేకుండా స్వతంత్రంగా పనిచేశాయి.

### ఐదవ దశ (1921-47)

ఈదశలో విద్య భారతీయుల అదుపులోకి వచ్చింది. మౌంట్‌ఫర్డ్ 1919 (ద్వంద్వ పరిపాలన) చట్టంలో కల్పించబడిన అవకాశాల మేరకు రాష్ట్ర చట్టసభల్లో విద్యాశాఖ భారతీయ మంత్రుల అధీనంలోకి వచ్చింది. ఫలితంగా అన్ని స్థాయిల్లో గతంలో ఎన్నడూ లేనంతగా విద్యావ్యాప్తి జరిగింది. ఈ కాలానికి చెందిన కొన్ని గణనీయమైన పరిణామాలు; యూనివర్శిటీల సంఖ్య పెరుగుదల (1947 నాటికి 20) శాడ్లర్ కమిషన్ సిఫార్సుల ప్రాతిపదికగా సంస్కరణలు ప్రవేశపెట్టినందున పైస్థాయి గుణాత్మకవిద్య అభివృద్ధికి అంతర్విశ్వ విద్యాలయ బోర్డు (1924) స్థాపన, అంతర్ కళాశాలల విశ్వవిద్యాలయాల కార్యకలాపాల ప్రారంభం; మంత్రివర్గాలు ఉదారంగా రాయితీలు ఇచ్చిన కారణంగా స్త్రీ విద్య, వెనుకబడిన తరగతుల విద్యారంగాలలో గణనీయమైన విజయాలు.

### హార్టాగ్ కమిటీ రిపోర్టు (1928-29)

బ్రిటిషు ఇండియాలో విద్యాభివృద్ధిని, ఇంకా అభివృద్ధికి గల అవకాశాలను గురించి నివేదించేందుకు 1928 మేలో సైమన్ కమిషన్ సర్‌ఫిలిప్ జోసెఫ్ హార్టాగ్ ఛైర్మన్‌గా 5 గురు సభ్యులతో కమిటీని నియమించింది. కమిటీ తన రిపోర్టులో ఈ క్రింది సిఫార్సులు చేసింది.

1. ప్రజా బాహుళ్యం యొక్క విద్యా బాధ్యత ప్రధానంగా ప్రభుత్వంపై వుంటుంది. విద్యావసతుల కల్పన బాధ్యత కేవలం స్థానిక సంస్థల దయాదాక్షిణ్యాలకు వదలివేయకూడదు.

2. సెకండరీ విద్య సంతృప్తికరంగా వున్నది. కానీ మెట్రిక్యులేషన్ స్థాయిలో కృతార్థులు కాలేనివారి సంఖ్య అధికంగా వున్నది.

3. యూనివర్శిటీలలో చాలా మంది అనర్హులైన విద్యార్థులుంటున్నారు.

4. మానవ వనరుల వృధా ప్రత్యేకించి ప్రాథమిక స్థాయిలో ఎక్కువగా వుంటుంది. వృధాని నివారించడానికి పలు సూచనలు చేయబడ్డాయి.

5. కేంద్రీకృత విద్యా ఏజెన్సీని ఢిల్లీలో ఏర్పాటు చేయవలసిన అవసరం వుంది.

6. ప్రాథమిక విద్యపై యాజమాన్యాన్ని స్థానిక సంస్థలకు మార్చడం వాంఛనీయం కాదు. రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో ఎక్కువ అధికారాలు వుండాలి.

7. చివరిగా ఉపాధ్యాయుల వేతన స్కేళ్ళ పెంపు, పర్యవేక్షణలో మెరుగుదల, మెరుగైన పాఠ్యాంశాలు అత్యవసరాలుగా గుర్తింపబడ్డాయి.

## ప్రాతిపదిక విద్య (1937)

స్వతంత్రమైన అహింసాయుత భారత సమాజ నిర్మాణం ఈ విద్యావిధానం యొక్క లక్ష్యం. 1937లో గాంధీజీ తన పత్రిక 'హరిజన'లో వరుసగా వ్రాసిన వ్యాసాలలో దీన్ని గురించి వ్రాశాడు. దేశవ్యాప్తంగా నిర్బంధ ప్రాథమిక విద్య ఉత్పత్తిని కేంద్ర బిందువుగా చేసుకుని అభివృద్ధి పరచాలి. విద్యార్థి నివశించే పరిసరాల్ని బట్టి చేతివృత్తులను ఎంపికచేయాలి. జాతీయ విద్యపై మొదటి సదస్సు 1937 అక్టోబరు 22-23లలో వార్ధాలో జరుపబడింది. పాఠ్యాంశాల రూపకల్పనకు డాక్టర్ జాకిర్‌హుస్సేన్ అధ్యక్షతన ఒక కమిటీని సదస్సు నియమించింది. కమిటీ తన రిపోర్టుని 1937 డిసెంబరు నాటికి రూపొందించింది. ఇది గాంధీజీ సామాజిక రాజకీయ భావాలకు ఒక ఆకారం కల్పించేందుకు చేసిన ప్రయత్నం. స్వాతంత్ర్యానంతరం ఇది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలచే ప్రాథమిక స్థాయిలో జాతీయ విద్యా నమూనాగా గుర్తించబడింది.

## సార్జెంటు రిపోర్టు (1944)

సర్ జె.పి. సార్జెంట్ ఛైర్మన్‌గా గల సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ భారతదేశంలో యుద్ధానంతర విద్యాభివృద్ధిపై తన రిపోర్టుని 1944లో సమర్పించింది. రిపోర్టులోని ముఖ్యాంశాలు: 3-6 వయో పరిమితి గల బిడ్డలకు పూర్వప్రాథమిక విద్య, 6-14 వయోపరిమితి గల పిల్లలందరికీ నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్య లేక ప్రాతిపదిక విద్య; 11-15 వయోపరిమితిని ఎంపిక చేయబడిన వారికి 6 సంవత్సరాల సెకండరీ విద్య; హయ్యర్ సెకండరీ విద్యలో ఉత్తీర్ణులయిన వారిలో ఎంపిక చేయబడిన వారికి 3 సంవత్సరాల యూనివర్శిటీ కోర్సు;

వయోజన నిరక్షరాస్యతను నిర్మూలించుట; 20 సంవత్సరాలలో ప్రజా గ్రంథాలయాలను అభివృద్ధి పరచుట; ఈ పథకం అమలుకు అవసరమైన ఉపాధ్యాయులకు శిక్షణా సౌకర్యాలు కల్పించుట; నిర్బంధ వ్యాయామవిద్య; పౌష్టికాహారలోపం వున్నవారికి పాలు, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించుట; ఉపాధి కల్పించే కేంద్రాల ఏర్పాటు; శారీరక మానసిక లోపాలున్నవారికి విద్యా సౌకర్యాలు కల్పించుట.

## 1857కి ముందు ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు:

నరబలి, తల్లి గర్భంలో వుండగానే ఆడశిశువుల్ని చంపడం 1802లో ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. బాప్టిష్టు మిషనరీ విలియం కార్వే పరిశీలనానంతరం లార్డ్ వెల్లస్లీ నరబలిని రద్దుచేశారు. ఆడశిశువుల హత్యలు కొన్ని అనాగరిక తెగల్లోనే కాక రాజ్‌పుట్ కులాల్లో కూడా జరుగుతున్నట్లు గమనించబడింది. బెంగాల్ రెగ్యులేషన్ 1795 ప్రకారం భ్రూణ హత్య, హత్యగా పరిగణింపబడుతుందని ప్రకటించబడింది. చాలా రాష్ట్రాల్లో చట్టాలు చేసినప్పటికీ పూర్తిగా తొలగించడం అసాధ్యంగా పరిణమించింది. 1870లో శిశు జననాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఆడశిశువుల సజీవంగా వున్నట్లు ధృవీకరించాలని చట్టం చేయబడింది. ఆడశిశువుల మరణాలు క్రమంగా తగ్గాయి.

## సతీదురాచారం రద్దు:

సార్వత్రిక నైతిక విలువకి భిన్నమైన మరొక దురాచారం సతి. అంటే సహమరణం లేక భర్తతో పాటు భార్య చనిపోవడం. భర్తకి పేర్చిన చితిలో భార్యను కూడా చంపడం. ఇది హిందువులలోని పై కులాలకు పరిమితమయినది. ముస్లిం పాలకులు దీనిని అభ్యంతరకరంగా భావించారు. మొగలు చక్రవర్తులు నిరుత్సాహపరచ యత్నించారు. బ్రిటీషు అధికారులు వ్యక్తులుగా చాలా మంది అడ్డుకొన యత్నించినప్పటికీ ప్రభుత్వం విధానంగా అమలు పరచలేదు. 1803లో లార్డ్ వెల్లస్లీ కంపెనీ పాలిత ప్రాంతాలలో రద్దు చేయాలని ప్రతిపాదించాడు. ముందుగా కలకత్తాలోని సుప్రీం కోర్టు పరిశీలనకు పంపాడు. కోర్టు ఆచితూచి స్పందించింది. స్థానికుల మతపరమయిన అభిప్రాయాలను, ఆచారాలను పరిగణనలోకి తీసుకోవల్సిందిగా ప్రభుత్వానికి సలహా ఇచ్చింది. ప్రభుత్వం అరకొర చర్యలతో రాజీపడింది.

చట్టం ద్వారా సతీదురాచారాన్ని రద్దు చేసేందుకు తగిన సమయం రాలేదని గవర్నర్ జనరల్ ఆమ్‌హెర్స్ట్ విశ్వసించాడు. 1828లో విలియం బెంటింక్ గవర్నర్ జనరల్‌గా వచ్చిన తరువాత పరిస్థితిలో మార్పువచ్చింది. సతీదురాచారాన్ని రద్దు చేసేందుకు తక్షణమే కానీ, క్రమంగా కానీ తన విచక్షణ మేరకు చర్యలుచేపట్టవలసిందిగా డైరక్టర్లు సూచించారు.

సతీ దురాచారం చట్ట విరుద్ధమని బెంగాల్ ప్రెసిడెన్సీ (రెగ్యులేషన్ XVII) 1829 డిసెంబరు 4న ప్రకటించింది. ఈ చట్టం ప్రకారం విధవరాలు భర్తతో పాటు చితిలో దూకి చనిపోవడాన్ని ప్రోత్సహించిన వారికి మరణశిక్ష విధించవచ్చు. ఇలాంటి చట్టాలే మద్రాసు ప్రెసిడెన్సీలో 1830 ఫిబ్రవరి 2న ఆ తరువాత బొంబాయి ప్రెసిడెన్సీలో చేయబడ్డాయి.

ఈ చట్టంతో బెంగాల్‌లో గణనీయమైన ఆందోళన చెలరేగింది. చట్టాన్ని తీవ్రంగా నిరశిస్తూ బెంటింక్‌కి అర్జీ సమర్పించబడింది. తగు చర్య చేపట్టకపోతే లండన్‌లోని ప్రీవీ కౌన్సిల్‌కి అప్పీలు చేస్తామన్నారు అర్జీదారులు. కాని అప్పీలు తిరస్కరించబడింది. భారతదేశంలో ఎలాంటి అలజడులూ జరగలేదు.

**మహిళా విమోచన:**

1830 దశాబ్దం చివరి నుండి ప్రభుత్వం సైనిక కార్యకలాపాలలో నిమగ్నమవడంతో సంఘ సంస్కరణ ఉద్యమాన్ని అంతగా పట్టించుకోలేదు. సంస్కరణలు చేపట్టమని ఒత్తిడులు అటు బ్రిటన్‌లోనూ భారతదేశంలోనూ తగ్గాయి. హిందూ సమాజంలో మహిళల స్థితిపై ఆందోళనాకారులు దృష్టిని కేంద్రీకరించారు. ప్రభుత్వం స్త్రీలకు విద్యా సదుపాయాలు కల్పించడానికి సుముఖంగా లేదు. కంపెనీ పాలన అంతమయ్యే వరకు ఆ వైఖరే కొనసాగించింది. బాలికల పాఠశాలల్లో అత్యధికం మిషనరీ కార్యకలాపాల వలన సాధ్యపడ్డాయి. మిషనరీల ఒత్తిడి కారణంగాను, పాశ్చాత్య ఉదారవాద భావజాలం కారణంగాను సమాజంలో మహిళ స్థితిగతులపైన, ప్రత్యేకించి విధవల దయనీయ స్థితిపైన ఆందోళన చేపట్టబడింది. చాలా మంది భారతీయులు కనీస వివాహ వయస్సుని పెంచాలని కోరారు. వితంతువుల పునర్వివాహం అనుమతింపబడాలన్నారు. అందుకు చట్టాలు చేయాలని ప్రతిపాదించారు. అలాంటి చట్టాలు చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపలేదు. చట్టాలు చేయమని చేసిన ఒత్తిడిని అడ్డుకొన్నది. అలాంటి చర్యలు మతపరమైన విషయాలలో జోక్యం చేసుకోవడంగా ప్రభుత్వం భావించింది. హిందూ వితంతు పునర్వివాహ చట్టం 1856 కొరకు ఈశ్వరచంద్ర విద్యాసాగర్ చేసిన ప్రయత్నాలను అనుమతించింది.

1855-57 కాలంలో హిందువులలో నెలకొన్న బహుభార్యత్వంపై ప్రభుత్వానికి చాలా పిటీషన్లు అందాయి. బెంగాల్ బ్రాహ్మణ కులీనులలో బహుభార్యత్వం ఎక్కువగా వుంది. బహు భార్యత్వ నిషేధ చట్టానికి ముసాయిదా పత్రం రూపొందించబడింది. కాని సిపాయిల తిరుగుబాటుతో ఆ ప్రయత్నం విరమించబడింది. బెంగాల్ గవర్నరు భారత ప్రభుత్వాన్ని బహుభార్యాత్వంపై చట్టం చేయమని కోరగా బహుభార్యాత్వం పాటించేవారికి అలాంటి చట్టం అభ్యంతర కరంగా వుంటుందనే సాకుతో ప్రభుత్వం తిరస్కరించింది. 1857 వరకు గల కాలం సంస్కరణల పట్ల సానుకూల దృక్పథంతో కొన్ని సంస్కరణలు చేపట్టబడిన కాలం. కాని ప్రభుత్వం తన మనుగడ కొనసాగింపు పట్ల గల భయాందోళనలతో అంతకంటె ముందుకు పోవడానికి విముఖంగా వుంది. పాశ్చాత్య ఆలోచనలు- మత, మతేతర ఆలోచనలు భారతీయ మేధావుల్ని ప్రభావితం చేశాయి. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు స్పందనగాను, యింకా ఎక్కువ సంస్కరణలు చేపట్టేందుకు ప్రభుత్వానికి గల విముఖతకు వ్యతిరేకంగాను హిందూ సంస్కరణ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి.

11

# భారతీయ పునరుజ్జీవనం మత సాంఘిక సంస్కరణ ఉద్యమాలు

బ్రిటిషు వారిచే జయింపబడి, వలసపాలన క్రిందికి వచ్చిన వారిలో వారు వలస పాలన క్రిందికి వచ్చిన కాలం, పరిస్థితుల్ని బట్టి వారి అనుభవాలలో వైవిధ్యం వున్నది. వారి స్పందనలు వారి ప్రాంతీయ సంస్కృతి, నివసించిన ప్రాంతం, వారి మతాన్ని బట్టి వేరువేరుగా వున్నాయి. బ్రిటిషు వారి సంస్కృతి 18వ శతాబ్దం నుండి 19వ శతాబ్దంలోకి ఆ తరువాత 20వ శతాబ్దంలోకి అడుగిడడంలో మార్పులకు గురయింది. గనుక బ్రిటిషు వారి వైఖరులలో గూడా మార్పులు వచ్చాయి. భారత ఉపఖండంలోని దేశీయ నాగరికతలు బ్రిటిషు సంస్కృతితో అత్యంత సాన్నిహిత్యం పొందిన కాలమది. మొదట సైనిక రాజకీయ ఆధిపత్యం సాధించబడింది. జయింపబడిన ప్రాంతాల నుండి నెమ్మదిగా సాంస్కృతిక సంబంధాలు వ్యాపించాయి. విజయం అనివార్యంగా ఒక ప్రాంతంలో గాని ప్రాంతంలోని వ్యక్తులలో గాని వలసవాద వాతావరణాన్ని సృష్టించలేదు. అది మానవ సంబంధాల చేత నిర్ణయించబడింది.

సమాజాన్ని అలుముకొన్న వలసవాద వాతావరణంలోని తరతమ భేదాలు, సామాజిక మతపరమైన అంశాలపై వచ్చిన అసంతృప్తి రూపాల నుండి రెండు రకాల ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. ఒకటి పరివర్తనీయమైనది. రెండవది నిరంతర సంబంధాల ద్వారా స్వాయత్తం (విలీనం) చేసుకొనేది. పరివర్తనీయ ఉద్యమాల మూలాలు వలస వాద కాలానికి ముందునాటివి. సామాజిక మతపరమైన అసంతృప్తి యొక్క దేశీయ రూపాల నుండి ఉత్పన్నమైనవి. పరివర్తనీయ ఉద్యమం యొక్క స్పష్టమైన లక్షణం ఆంగ్లీకరణకు గురయిన వ్యక్తులు ఉద్యమ నాయకులుగా లేకపోవడం; దాని భావనలను కార్యక్రమాలను వలసవాద ప్రపంచంతో పరివర్తనీయ ఉద్యమాలు వలసవాదం ముందు కాలాన్ని ఇంగ్లీషు ఆధిక్యత సాధించిన కాలంతో అనుసంధానం చేశాయి. వలసవాదంతో సంబంధాలు ఏర్పడడంతో పరివర్తనీయ ఉద్యమాలు వలసవాద వాతావరణంతో పరిమితమైన సర్దుబాట్లు చేసుకొన్నాయి. రెండవది వలసవాద వాతావరణం నుండి పుట్టింది. వలసవాదంతో సాంస్కృతిక సంబంధాలు వున్నవారు

దీని నాయకులయ్యారు. అలాంటి ఉద్యమ సంస్థాపకుడు ఇంగ్లీషు సంస్కృతిచే ప్రభావితుడైన వాడు కావచ్చు. కాకపోనూవచ్చు. కాని అనుచరులు ఇంగ్లీషు విద్యనార్జించి ఇంగ్లాండు సంస్కృతిచే ప్రభావితులైన వారే నాయకత్వ స్థానాలలోకి ఎదిగారు. ఈ ఉద్యమాలు వలసవాద ఆధిక్యతని అంగీకరించాయి. ఈ ఉద్యమాల ప్రాతిపదిక, వాడి ప్రకటిత లక్ష్యాలు దేశీయ సామాజిక మతపరమైన నిరసనల వారసత్వంపై ఆధారపడి వుంటాయి. ఈ ఉద్యమాలు ఏ విధంగానూ పూర్తిగా కొత్తవి కావు. భారతదేశం యొక్క సువ్యవస్థితమైన సంస్కృతులలో మూలాలు లేనివి కావు. ఈ విధంగా ఈ రెండు తరహాల ఉద్యమాల మధ్య భేదం ప్రధానంగా వాటి పుట్టుకలో మాత్రమే వున్నది.

ఒక ప్రాంతానికి చెందిన సాంఘిక మతపరమైన ఉద్యమాలను, వాటిపై గల బ్రిటిషు ప్రభావాన్ని, రాజకీయ ఆధిపత్యాన్ని గమనంలో పెట్టుకొని వివిధ మతపరమైన సమాజాల మధ్య సంబంధాల తరహాలననుసరించి అధ్యయనం చేయాలి. సాంఘిక, మతపరమైన ఉద్యమాల చారిత్రక పాత్రని అవి ఆవిర్భవించి, పనిచేసిన నేపథ్యంలో అర్థం చేసుకోవాలి.

**హిందూ సంస్కరణ ఉద్యమాలు**

**బ్రహ్మ సమాజం:**

**రామ్మోహన్‌రాయ్ (1772-1833):** పశ్చిమ బెంగాల్‌లోని బర్ద్వాన్ జిల్లాలోని రాధానగర్ గ్రామంలో 1772లో జన్మించాడు. అత్యంతాధునికుడిగా గుర్తింపబడ్డాడు. ఆధునిక భారతదేశంలోని సామాజిక మత రాజకీయ సంస్కరణ ఉద్యమాలకు ఆద్యుడు. ఆయన ఇంగ్లాండులోని బ్రిస్టల్‌లో 1833లో మరణించాడు. పదవీ భ్రష్టుడైన మొగలు చక్రవర్తికి ఎక్కువ పింఛన్ కావాలని బ్రిటిషు సింహాసనాన్ని అర్థించేందుకు ఇంగ్లాండు పంపించబడ్డాడు. వివిధ మతాలకు చెందిన మూల గ్రంథాలను అధ్యయనం చేసేందుకు ఆయన బహుభాషలను (పర్షియన్, అరబిక్, సంస్కృతం, ఇంగ్లీషు, ఫ్రెంచి, లాటిన్, గ్రీకు, హిబ్రూ) అధ్యయనం చేశాడు. ఆయన ఏకేశ్వరోపాసనని విశ్వసించాడు. విగ్రహారాధనని వ్యతిరేకించాడు. ఆయన ఏకేశ్వరవాదం భావాన్ని వివరిస్తూ పర్షియన్ భాషలో 'తుహ్ ఫల్-ఉల్-మువాహిదిన్' అనే గ్రంథాన్ని 1903లో ప్రచురించాడు.

ఆయన ఏకేశ్వర వాదాన్ని ప్రచారం చేసేందుకు హిందూమతంలోని దురాచార సాంప్రదాయాలను వ్యతిరేకించేందుకు కలకత్తాలో ఆత్మీయ సభని (1815)లో స్థాపించాడు. ఆ తరువాత హిందూమతాన్ని క్షాళనం చేసి, ఏకేశ్వరవాదానికి ప్రచారం చేసేందుకు కలకత్తాలో 1828లో బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. బ్రహ్మసమాజ హేతుబద్ధతకు ప్రాచీన హిందూ గ్రంథాలు వేదాలు, ఉపనిషత్తులు మూలస్థంభాలు. ఆయన ఇతర మతాలలోని మంచి బోధనలను స్వీకరించారు. ఆయన మత విషయాలలో హేతుబద్ధతకి ప్రాధాన్యత యిచ్చాడు. ఆయన 'క్రీస్తు ఉపదేశాలు, శాంతి ఆనందాలకు మార్గదర్శి' అనే గ్రంథాన్ని 1820లో ప్రచురించి

క్రైస్తవ మతానికి హేతుబద్ధతని అన్వయింపజేశాడు. ఆయన క్రీస్తు అద్భుత కధల్ని వదలిపెట్టి క్రీస్తు నైతిక ఆధ్యాత్మిక బోధనలను స్వీకరించాడు. అజ్ఞానంతో క్రైస్తవ మిషనరీలు చేస్తున్న దాడులను ఖండించి వేదాలు ఉపనిషత్తులలో వున్న హిందూ తాత్వికతని సమర్ధించాడు.

సతీదురాచారానికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసి తుదకు దానిని రద్దు చేయించేందుకు బెంటింక్‌ని ఒప్పించగలిగాడు. స్త్రీలకు ఆస్థిహక్కు వారసత్వ హక్కులాంటి మహిళా హక్కుల కొరకు పోరాడాడు. బహుభార్యత్వాన్ని వ్యతిరేకించాడు. వితంతువుల దయనీయ స్థితిని తొలగించేందుకు నిర్విరామంగా పోరాడాడు. ఇంగ్లీషు మాధ్యమం ద్వారా ఆధునిక విద్యను ప్రవేశపెట్టేందుకు పోరాడాడు. భాషాపరమైన సంకెళ్ళను తెంచి బెంగాలీ భాషని ఆధునీకరించాడు. భారతీయ సమాజంలోని విభిన్న గ్రూపుల ఏకీకరణని విశ్వసించిన రామ్మోహన్‌రాయ్ జాతీయ చైతన్యాన్ని పెంచయత్నించాడు. బ్రిటిషు పరిపాలన, వర్తక వాణిజ్యాలు, ఆర్థిక విధానాలు లాంటి రాజకీయ సమస్యలపై ప్రజాందోళనలకు శ్రీకారం చుట్టాడు. సమకాలీన సమస్యలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసేందుకు, ప్రభుత్వం ఎదుట ప్రజాభిప్రాయానికి ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేశాడు. పత్రికా రచనకు ఒరవడి దిద్దిన తొలితరం పత్రికా రచయిత.

**బ్రహ్మ సమాజంలో చీలిక:**

**దేవేంద్రనాథ్ ఠాగూర్ (1817-1905):** రామ్మోహన్‌రాయ్ ఆలోచనలకు ప్రచారమిచ్చేందుకు దేవేంద్రనాధ ఠాగూర్ కలకత్తాలో తత్వబోధన సభ (1839)ని స్థాపించాడు. ఆయన 1843లో బ్రహ్మసమాజంలో చేరాడు. దానిని పునర్నిర్మించాడు. ప్రాచీన భారతదేశం యొక్క క్రమబద్ధమైన అధ్యయనాన్ని ప్రోత్సహించేందుకు బెంగాలీ మాసపత్రిక తత్వబోధనని నడిపాడు. 1866 వరకు బ్రహ్మసమాజానికి వివాదరహితుడైన నాయకుడిగా కొనసాగాడు. రామ్మోహన్‌రాయ్ ప్రారంభించిన సంఘ మత సంస్కరణలను ముందుకు తీసుకుపోయాడు.

**కేశవచంద్రసేన్ (1838-84):** 1857లో బ్రహ్మ సమాజంలో చేరి దేవేంద్రనాధ్‌కి కుడి భుజమయ్యాడు. కాని క్రమంగా దేవేంద్రనాధ్ నాయకత్వంలో పాత సాంప్రదాయ సెక్షన్‌కి కేశవచంద్రసేన్ నాయకత్వంలోని యువత అభివృద్ధికరమైన సెక్షన్‌కి మధ్య సంఘ సంస్కరణలు (ప్రత్యేకించి కులం సమస్యపై); హిందూమతానికి బ్రహ్మసమాజానికి మధ్య గల సంబంధాలపై (కుల వ్యవస్థ రద్దు, బ్రహ్మ సమాజం హిందూమతానికి భిన్నమైనది అనే వాదనకి రెండవ గ్రూపు ప్రాతినిధ్యం వహించింది. మొదటి గ్రూపు కుల వ్యవస్థని తీవ్రంగా విమర్శించినప్పటికి కులవ్యవస్థ కొనసాగింపు, బ్రహ్మసమాజం హిందూయిజమే అనే వాదనకి ప్రాతినిధ్యం వహించాయి) విభేదాలు వచ్చాయి. ఈ విభేదాలతో సేన్‌గ్రూపు మాతృసంస్థ నుండి 1865లో ఆది బ్రహ్మ సమాజం పేరుతో విడిపోయింది. 1866లో పునర్నిర్మాణం చేసుకొని భారతీయ బ్రహ్మసమాజం అయింది. సేన్ బొంబాయి, మద్రాసులతో సహా భారతదేశంలోని యితర ప్రాంతాలు పర్యటించి (1864, 1868లలో) బ్రహ్మసమాజ సందేశానికి

ప్రచారం యిచ్చాడు. ఆయన సమూలమైన మార్పులు గోరే సంఘ సంస్కరణ పథకానికి ప్రచారమిచ్చాడు. బ్రహ్మ సమాజంలో భక్తిని జొప్పించాడు. అంతేగాక ఆయన భారతీయ సంస్కరణ సంఘాన్ని (Indian Reform Association) స్థాపించాడు. దేశీయ వివాహ చట్టం 1872 (సివిలు వివాహ చట్టం) చేయవలసిందిగా బ్రిటిషు ప్రభుత్వాన్ని ఒప్పించారు. ఇది బ్రహ్మసమాజం చేసే పెళ్ళిళ్లకు చట్టబద్ధత కల్పించింది. వివాహం చేసుకొనేందుకు వరుడికి 18, వధువుకి 14 సంవత్సరాలు కనీస వయస్సుగా గుర్తించింది.

**బ్రహ్మసమాజంలో రెండవ చీలిక:**

ఆనందమోహన్‌బోస్, శివనాథ్ శాస్త్రిల నాయకత్వంలో సేన్ అనుచరులలోని కొందరు చీలిపోయి సాధారణ బ్రహ్మసమాజం స్థాపించడంతో 1878లో బ్రహ్మసమాజం రెండోసారి చీలిపోయింది. సమాజ నిర్వహణ సమస్య, సేన్ స్వయంగా దేశీయ వివాహ చట్టాన్ని ఉల్లంఘించడం ఈ చీలికకు కారణాలు. సేన్ తన పెద్ద కుమార్తెను కూచ్ బిహారీ సంస్థానాధీశునికిచ్చి పెళ్ళి చేశాడు. వధువూ వరుడూ యిరువురూ చట్టం మేరకు కనీస వివాహ వయస్సురానివారే.

**మానవధర్మ సభ:**

1830 దశాబ్దంలో సమకాలీన సమాజాన్ని తీవ్రంగా విమర్శించే విద్యావంతులైన గుజరాతీయులు గ్రూపులో దుర్గారాం మంచారాం (1809–78) ప్రముఖుడు. ఈ గ్రూపులోని యితర ప్రముఖులు దాదోబ పాండురంగ్, దినమణిశంకర్, దళపత్రాల భాగుభాయ్, దామోదర్‌దాస్. వీరు సూరత్‌లో 1844లో మానవధర్మ సభని స్థాపించారు. ప్రతి ఆదివారం సమావేశాలు జరిపేవారు. సమావేశాలకు అందరూ ఆహ్వానితులే. మానవ ధర్మసభ తన కార్యక్రమంలో భాగంగా మాంత్రికుల్ని వారి మంత్ర తంత్రాలని సవాలు చేసింది. కులాన్ని కూడా విమర్శించింది. కాని కులవ్యవస్థకి వ్యతిరేకంగా ప్రత్యక్ష చర్య చేపట్టలేదు. చురుకైన సంస్థగా కొద్ది కాలమే పనిచేసింది. దాదోబ పాండురంగ్ బొంబాయికి దుర్గారాం మంచారాం రాజకోటకి వెళ్ళడంతో సంఘ కార్యకలాపాలు ఆగిపోయాయి. సంఘం కొద్దికాలమే పనిచేసినప్పటికి సంఘ సభ్యులు యిలాంటి సంఘాలు స్థాపించి ఆదర్శాలను ప్రచారం చేయడంతో గుజరాత్ మహారాష్ట్రల తరువాత పరిణామాలతో వీటికి ప్రత్యక్ష సంబంధం వున్నది.

**పరమహంస మండలి:**

దీని చరిత్రకి మానవధర్మ సభలోను దాని నాయకుడైన దాదోబ పాండురంగ (1814–82) నాయకత్వంతోను ప్రత్యక్ష సంబంధం వుంది. దాదోబ తన ధర్మ వివేచన (1848)లో తన సూత్రాలను ప్రకటించారు. అవి: భగవంతుడు మాత్రమే పూజింపబడాలి. నిజమైన మతానికి ప్రేమ, నైతికత ప్రాతిపదికగా వుంటాయి. ఆధ్యాత్మిక మతం ఒక్కటే. ప్రతి

వ్యక్తికి ఆలోచనాపరమైన స్వేచ్ఛ వుండాలి. మనం అనుదినం మాట్లాడే మాటలు హేతుబద్ధంగా వుండాలి. మానవులంతా ఒకే కులానికి చెందినవారు. అందరికి సరియైన విజ్ఞానం అందజేయబడాలి. ఈ సూత్రాలు హిందూమతం యొక్క బహు దేవతారాధనని, కుల వ్యవస్థని విజ్ఞానంపై బ్రహ్మణాధిక్యతని తిరస్కరించాయి.

1849లో దాదోబ, ఆయన మిత్రులు బొంబాయిలో రహస్యంగా సమావేశమయ్యే పరమహంస మండలిని నిర్వహించారు. రాం బాలకృష్ణ జయకర్ మండలి అధ్యక్షుడు. సభ్యులంతా కులపరమైన నియమాలని ఉల్లంఘిస్తామని ప్రతిజ్ఞ చేయాలి. నిమ్నకులాలకు చెందిన వారు వండిన ఆహారాన్ని సభ్యులు భుజించాలి. సభ్యుల, సానుభూతిపరుల ఇళ్ళలో సమావేశాలు నిర్వహింపబడ్డాయి. సభ్యులు మత సామాజిక అంశాల్ని చర్చించారు. వారు ఏ మతంపై దాడిచేయరు. అమోఘం అద్వితీయమని చెప్పుకొనే ఏ మతాన్నైనా తిరస్కరించారు.

ఈ మండలి యొక్క శాఖలు పూనా, అహమ్మద్‌నగర్, రత్నగిరిలలో స్థాపించబడ్డాయి. కులవ్యవస్థని, విగ్రహారాధనని, సనాతనాచారాలను, బ్రాహ్మణాధిక్యతని తిరస్కరించిన మండలి తరువాత కాలానికి నిర్దిష్టమైన విజయాలను మిగల్చలేకపోయింది. హిందూ సాంప్రదాయాల్ని బాహాటంగా వ్యతిరేకించేందుకు గల అయిష్టత కారణంగానే అది రహస్య సంస్థగా పనిచేసింది. ఐనప్పటికి మానవ ధర్మ సభ పరమహంస మండలి భావాలు నూతన సామాజిక మతపరమైన ఉద్యమరూపంలో మరొక సారి ముందుకు వచ్చాయి.

**ప్రార్థనాసమాజం:**

ఇది బ్రహ్మసమాజం యొక్క పిలక. డాక్టర్ ఆత్మారాం పాండురంగ (1823-98)చే 1867లో బొంబాయిలో స్థాపించబడింది. 1870లో యం.జి. రనడే, ఆర్.జి. భండార్కర్‌లు దీనిలో చేరి నూతన జనసత్వాలు చేకూర్చారు. ఇది హిందూ మతంలోని సంస్కరణ ఉద్యమం. సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాలు, వితంతు పునర్వివాహం, మహిళల అణగారిన వర్గాల సముద్ధరణ లాంటి సంఘ సంస్కరణలపై కేంద్రీకరించి పనిచేసింది.

**ఆర్య సమాజం:**

**స్వామిదయానంద సరస్వతి (1824-83):** అసలు పేరు మూలశంకర్‌గా గల దయానంద్ గుజరాత్‌లోని టంకర్ పట్టణంలో 1824లో జన్మించాడు. ఆయన 15 సంవత్సరాలు (1845-60) సంచార సన్యాసిగా జీవితం గడిపాడు. ఆ తరువాత మధురలోని స్వామి బిరజానంద వద్ద విద్య నభ్యసించాడు. ఆయన 1875లో బొంబాయిలో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. ఆర్య సమాజం యొక్క ప్రత్యేక లక్షణం శుద్ధి ఉద్యమం. అంటే యిష్టపూర్వకంగా గాని బలవంతంగాని యితర మతాలలోకి మార్చబడిన హిందువుల్ని తిరిగి హిందువులుగా మతమార్పిడి జరపడం. భారతదేశంలో సామాజిక, మత రాజకీయ ఐక్యతని సాధించడానికి

ఇది శక్తివంతమైన సాధనమని ఆర్యసమాజం విశ్వసించింది. ఆర్య సమాజం బొంబాయిలో స్థాపించబడినప్పటికి పంజాబులో బలమైన సంఘంగా ఎదిగింది. ఉత్తర భారతదేశంలోని ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ తదితర ప్రాంతాలకు వ్యాప్తిచెందింది.

ఆయన వేదాలు శాశ్వతమైనవని భావించాడు. విగ్రహారాధనకు పూజారుల కర్మకాండలకు వ్యతిరేకి. ఆయన ఉద్దేశాన్ని అనుసరించి పూజారులు తప్పుల తడకగా వున్న పురాణాల సహాయంతో హిందూమతాన్ని వక్రీకరించారు. పుట్టుకతో సంక్రమించే కులవ్యవస్థని, బాల్య వివాహాలను వ్యతిరేకించాడు. కులాంతర వివాహాలను, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించాడు. పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానం వ్యాప్తి చెందాలన్నాడు. ప్రకృతి వైపరీత్యాల లాంటివి సంభవించినప్పుడు సేవా కార్యక్రమాలను నిర్వహించాడు. శుద్ధి ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఆయన సత్యార్థప్రకాష్ (హిందీలో) వేదభాష్య భూమిక (పాక్షికంగా హిందీలో, పాక్షికంగా సంస్కృతంలో) వేదభాష (సంస్కృతంలో) అనే మూడు గ్రంథాలను రచించాడు. ఆయన తన బోధనలకు ప్రచారమిచ్చేందుకు దేశమంతటా విస్తృతంగా పర్యటించాడు.

### ఆర్య సమాజంలో చీలిక:

దయానంద మరణానంతరం (1883) అనుసరించవలసిన విద్యావిధానం సమస్యలపై ఆర్య సమాజం రెండు గ్రూపుల మధ్య తీవ్రమైన విభేదాలు వచ్చాయి. ఫలితంగా 1892లో రెండుగా చీలిపోయింది. స్వామి శ్రద్ధానంద నాయకత్వంలోని గురుకుల (గ్రూపు) ప్రాచీన హిందూ గురుకుల విద్యావిధానం అమలు జరపాలని వాదించింది. కేవలం బాలురకు మాత్రమే - విద్యా సంస్థలు నెలకొల్పాలన్నది. వాటిలో హరద్వార్ గురుకుల విద్యాలయం ప్రసిద్ధిగాంచింది. లజపతిరాయ్ హన్స్‌రాజ్ నాయకత్వంలోని కాలేజీ గ్రూపు ఇంగ్లీషు విద్యావ్యాప్తి జరగాలన్నది. బాలబాలికలకు దయానంద్ ఆంగ్లో వేదిక పాఠశాలల్ని కళాశాలల్ని నెలకొల్పింది. వాటిలో లాహోర్ విద్యా సంస్థ ప్రసిద్ధిగాంచింది.

### రామకృష్ణమిషన్,రామకృష్ణ మఠం:

**రామకృష్ణ పరమహంస (1836-86):** మొదటి పేరు గడోధర్ ఛటోపాధ్యాయ. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో గల కమర్‌పుకూర్ గ్రామంలో 1836లో జన్మించాడు. కలకత్తా సమీపంలోని దక్షణేశ్వర్ కాళీదేవత గుడిలో పూజారి అయ్యాడు. (1856). 1860లో మైనరు బాలికైన శారదా మణిని వివాహమాడాడు. (ఆమె దక్షిణేశ్వర్ వచ్చి ఆయన చనిపోయే వరకు సేవలు చేసింది) ఆయన సాంప్రదాయ పద్ధతిలో సన్యాసం, భక్తి ధ్యానం ద్వారా ముక్తి సాధించాలని వాంఛించాడు. భగవంతుని చేరడానికి ముక్తి సాధించడానికి చాలా మార్గాలున్నాయని చెప్పాడు. మానవ సేవే మాధవసేవ అని నొక్కి చెప్పాడు.

**స్వామి వివేకానంద (1863-1902):** మొదటి పేరు నరేంద్రనాథ్ దత్తా. 1863లో కలకత్తాలో జన్మించాడు. భవిష్యత్తులో గురువు కానున్న రామకృష్ణని 1881లో సందర్శించారు. ఆ తరువాత తరచుగా వెళ్లాడు. గురువు మరణానంతరం బారానగర్‌లో మఠాన్ని స్థాపించాడు. (1887) భారతదేశమంతటా విస్తృతంగా పర్యటించాడు. ప్రజలతో సంబంధాలు ఏర్పడ్డాయి. భారతదేశం నిజమైన స్థితిని అర్థం చేసుకొన్నాడు. చికాగో ప్రపంచ మతాల మాహాసభకి (1893) హాజరయ్యాడు. భారతదేశం, హిందూమతాల ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాడు. యూరపు పర్యటించి 1897లో భారతదేశానికి తిరిగి వచ్చాడు. ఆయన ఆంగ్లంలో 'ప్రబుద్ధ భారత' మాసపత్రికని, బెంగాలీలో 'ఉద్బోధన' పక్షపత్రిక నడిపాడు. రెండవసారి అమెరికాని 1899లో సందర్శించాడు. పారిస్‌లో మతాల చరిత్ర మహాసభ (Congress of History of Religions) లో ప్రసంగించాడు. (1900). 1900లో భారతదేశానికి తిరిగి వచ్చాడు. అనారోగ్యంతో 1902లో మరణించాడు.

స్వామి వివేకానంద 1897లో బేలూరు వద్ద రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు. ఇది సంఘసేవ చేసే ధార్మిక సంస్థ. దాని లక్ష్యం పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, శిశు సంరక్షణాలయాల లాంటివి స్థాపించడం ద్వారా సంఘ సేవ చేయడం. రామకృష్ణ మఠం వివేకానందునిచే 1887లో బారానగర్ వద్ద స్థాపించబడిన మతధార్మిక సంస్థ. (1898 నుండి బేలూరు రామకృష్ణ మిషన్‌కి మఠానికి కేంద్ర స్థానమయింది) సంస్థ లక్ష్యం రామకృష్ణ పరమహంస బోధనల్ని (సార్వత్రిక వేదాంత సందేశాన్ని) అంకిత భావంతో ప్రచారం చేసే సన్యాసుల్ని తయారుచేయడం. మిషన్, మఠం రెండూ వేర్వేరు నిధులచే నిర్వహింపబడే సంస్థలైనప్పటికి ఆచరణలో రెండూ ఒకటే. కార్యకర్తలు రామకృష్ణ సందేశాల్ని ప్రచారం చేస్తారు. ధర్మకర్తలు మిషన్ నిర్వహణ కార్యకలాపాలు చూస్తుంటారు.

వివేకానందుడు తన గురువు సందేశానికి ప్రజాదరణ కల్పించాడు. దానికి సమకాలీన భారతీయ సమాజం యొక్క అవసరాలకు సరిపడే రూపకల్పన చేశాడు. కలసికట్టుగా పనిచేయడం చాలా అవసరమని చెప్పాడు. అలా చేయకపోతే విజ్ఞానం నిరుపయోగమన్నాడు. అంతేగాక కుల విధానాన్ని ఖండించారు. ఆచారాలకు సాంప్రదాయాలకు అతిగా ప్రాధాన్యత నివ్వడాన్ని వ్యతిరేకించాడు. స్వేచ్ఛ, సమానత్వం, స్వేచ్ఛాయుతమైన ఆలోచనలను అలవర్చుకోవాలని ప్రజలను అర్థించాడు. అన్ని మతాల సారాంశం ఒకటేనన్నాడు. ఆయన దృష్టిలో 'వేదాంత' అంటే హేతుబద్ధమైన ఆలోచన.

**దివ్యజ్ఞాన సమాజం:**

ఈ సమాజం రష్యన్ మహిళ మేడమ్ హెచ్.పి. బ్లేవట్స్కీ (1831-91) అమెరికా కల్నల్ హెచ్.యస్.ఓల్కాట్‌లచే 1875లో న్యూయార్క్‌లో మూడు లక్ష్యాలతో స్థాపించబడింది. అవి: విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని స్థాపించుట, ప్రాచీన మత తాత్విక గ్రంథాల అధ్యయనాన్ని ప్రోత్సహించుట, జీవితం పదార్థ విజ్ఞాన రహస్యాలను కనుగొనేందుకు క్రమబద్ధమైన పరిశోధన

సాగించుట. వారు 1879లో భారతదేశానికి వచ్చారు. 1882లో మద్రాసు సమీపంలోని అడయార్‌లో ప్రధాన స్థావరాన్ని ఏర్పాటుచేశారు. ఆ తరువాత అనిబిసెంట్ 1893లో భారతదేశానికి వచ్చారు. 1907లో ఓల్కాట్ మరణానంతరం దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షులయ్యారు. బిసెంటు అధ్యక్షతన సమాజం ప్రాచీన భావాల హిందూమత పునరుద్ధరణలపై కేంద్రీకరించింది. హిందూమత బోధనలకవకాశం కల్పించేందుకు వారణాసిలో కేంద్రీయ హిందూ పాఠశాల (1898) స్థాపించింది. ఆతరువాత దానిని మదన్‌మోహన్ మాలవ్యా బనారస్ హిందూ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి పరచాడు.

**యువ బెంగాల్ ఉద్యమం:**

ఈ ఉద్యమ స్థాపకుడు హెన్రీ వివియన్ డిరోజియో. 1809లో కలకత్తాలో జన్మించాడు. 1826-31 కాలంలో కలకత్తా హిందూ కాలేజీలో పనిచేశాడు. 1831లో కలరాతో మరణించాడు. ఆయన అనుచరులు డిరోజియన్లుగా పిలువబడేవారు. ఉద్యమం యువబెంగాల్ ఉద్యమంగా ప్రఖ్యాతిగాంచింది. ఉద్యమకారులు సనాతన సాంప్రదాయాలను, ఆచారాలను విమర్శించేవారు. స్త్రీల హక్కులకు స్త్రీ విద్యకి ప్రచారం ఇచ్చారు. సమావేశాల ద్వారా పత్రికల ద్వారా ప్రజల్ని సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపై చైతన్యవంతుల్ని చేశారు. పత్రికా స్వేచ్ఛ, విచారణ జరిపి న్యాయ నిర్ణయం, రైతుల రక్షణ లాంటి ప్రజాసమస్యలపై ప్రజాందోళనలు చేపట్టారు.

**ఇతర హిందూ సంస్కర్తలు, సామాజిక కార్యకర్తలు**

**పండిట్ ఈశ్వరచంద్ర విద్యాసాగర్ :** వితంతు పునర్వివాహానికి అనుకూలంగా పోరాడడం ద్వారా (1856లో బ్రిటిషు ప్రభుత్వం హిందూ వితంతు పునర్‌వివాహ చట్టం చేయడంతో ఆయన ప్రయత్నాలు సఫలమయ్యాయి) బాల్య వివాహాలను బహు భార్యాత్వాన్ని వ్యతిరేకించడం ద్వారా స్త్రీ విద్యకి ప్రచారం యివ్వడం ద్వారా ఈశ్వరచంద్ర విద్యాసాగర్ మహిళాభ్యున్నతికి ఎనలేని కృషి చేశారు. సంస్కృతాన్ని బోధించడంలోనూ, ఆధునిక బెంగాలీ వచన రచనలోను ఆయన కొత్తదారులు తొక్కాడు. కలకత్తాలోని సంస్కృత కళాశాలలో (1851లో కళాశాల ప్రిన్సిపాల్ అయ్యాడు) బ్రాహ్మణేతర విద్యార్థులను చేర్చుకున్నాడు. పాశ్చాత్య ఆలోచనా సరళిని ప్రవేశపెట్టాడు.

**గోపాల్‌హరిదేశ్‌ముఖ్ :** లోకహితవాదిగా ప్రసిద్ధిగాంచాడు. మహారాష్ట్రలో సంఘ సంస్కరణ ఉద్యమాలు చేపట్టాడు. హిందూ సనాతన ఛాందస ఆచారాలపై శక్తివంతమైన దాడులు చేశాడు. మత సాంఘిక సమానత్వాన్ని బోధించాడు.

**యం.జి. రనడే :** మహారాష్ట్రకి చెందిన ఈ ప్రఖ్యాత సామాజిక మత సంస్కర్త ప్రార్థనా సమాజ సభ్యులలో ముఖ్యుడు. దక్కన్ విద్యా సంఘం స్థాపనకు (1884) స్ఫూర్తి

నిచ్చినవాడు. 1887 భారత జాతీయ సామాజిక సదస్సుని ప్రారంభించాడు. ఆయనను జి.కె. గోఖలే తన గురువుగా గుర్తించాడు.

**గోపాల్‌గణేష్ అగార్కర్:** మహారాష్ట్రకి చెందిన హేతుబద్ధమైన ఆలోచనాపరులలో ముఖ్యుడు. సాంప్రదాయాలపై గుడ్డిగా ఆధారపడడాన్ని విచక్షణా రహితంగా భారతదేశ గతాన్ని ఆకాశానికెత్తడాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు. ఆయన బి.జి.తిలక్, వి.కె. చిప్లూంకర్, మాధవరావు నాంజోషిలతో కలసి 1884లో పూనాలో దక్కన్ విద్యా సమితిని స్థాపించాడు.

**జ్యోతిబాపూలే:** మహారాష్ట్రలో నిమ్నకులానికి చెందిన బ్రాహ్మణేతరుల అస్పృశ్యుల హీనస్థితిని గుర్తించి, అగ్రకులాల అణచివేతకు బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా తన సత్యశోదక్ సమాజ్ ద్వారా జీవితకాలం పోరాడిన యోధుడు. మహారాష్ట్రలో వితంతు పునర్ వివాహాలకు, స్త్రీ విద్యా వ్యాప్తికి ఆద్యుడు.

**తులసీరాం:** శివదయాళ్ సాహిబ్‌గా పిలువబడే తులసీరాం ఏకేశ్వరోపాసనని ప్రచారం చేసే లక్ష్యంతో 1861లో ఆగ్రా వద్ద రాధాస్వామి సత్యంగ్ అనే నిగూఢశాఖని స్థాపించాడు. అతడిననుసరించి మోక్షం సాధించాలంటే మానవ ఆత్మని మాటతో సంలీనం చేయాలి. ఆయన బోధనలు 'సర్ బచన్' పేరుతో రెండు సంపుటాలుగా ప్రచురింపబడ్డాయి. ఈ శాఖ హిందూ దేవగణానికి చెందిన ఏ దేవుణ్ణి గాని ఏ దేవాలయాన్ని గాని, ఏ పవిత్ర స్థలాన్ని గాని గుర్తించదు.

**గోపాలకృష్ణ గోఖలే:** ఈ ప్రఖ్యాత మితవాద జాతీయ నాయకుడు ప్రముఖ సామాజిక కార్యకర్త. మాతృదేశ సేవకు వివిధ రంగాల్లో శిక్షణ యిచ్చే లక్ష్యంతో 1905లో బొంబాయిలో 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా' సంస్థని స్థాపించాడు. అంతకు ముందు (జి.జి. అగార్కర్‌చే 1884లో పూనాలో స్థాపించబడిన) దక్కన్ విద్యా సమితిలో చురుకైన సభ్యుడు. తిలక్‌తో తీవ్రమైన విభేదాల కారణంగా సమితి నుండి వైదొలిగాడు.

**యన్.యం. జోషి:** తొలుత గోఖలే 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా' సభ్యుడు. ప్రజలకు మంచి జీవితం, పని కల్పించే లక్ష్యంతో 1911లో బొంబాయిలో 'సోషల్ సర్వీస్ లీగు' స్థాపించాడు. 1920లో బొంబాయిలో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ స్థాపించాడు. 1929లో ఆ సంఘం సోవియట్ యూనియన్ వైపు మొగ్గు చూపడంతో దాని నుండి బయటికి వచ్చి 'ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్' ప్రారంభించాడు.

**హెచ్.యన్. కుంజ్రు:** ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు విద్య, ఆరోగ్య, పరిరక్షణలను ప్రోత్సహించేందుకు 1914లో అల్హాబాద్‌లో సేవాసమితిని స్థాపించాడు. తొలుత ఆయన సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీలో సభ్యుడు.

**శ్రీరాం బాజ్‌పాయ్:** తొలుత సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీలో సభ్యుడు. ప్రపంచ వ్యాప్తంగా బేడెన్ పావెల్ నమూనాలో 1914లో సేవాసమితి బాయ్స్ స్కౌట్స్ అసోసియేషన్ స్థాపించాడు.

**వీరేశలింగం పంతులు:** 19వ శతాబ్దం ద్వితీయార్థంలో దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రఖ్యాతి గాంచిన సంఘ సంస్కర్త. ఆయన ఆంధ్రప్రదేశ్‌లో వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించే ప్రధాన లక్ష్యంతో 1878లో రాజమండ్రిలో సంఘసంస్కరణ సంఘాన్ని స్థాపించాడు.

## 19వ శతాబ్దం పునరుజ్జీవనం స్వభావం పరిమితులు

### స్వభావం :

19వ శతాబ్దపు ముఖ్యులందరినీ మర్రి ఊడలతో పోల్చవచ్చు. అందరూ ఆధ్యాత్మిక వాదం స్ఫూర్తితో పనిచేశారు. ఈ కాలపు సామాజిక మత పరమైన అలజడి మత స్వభావం గలది. అప్పటికి విద్యాసాగర్ లాంటి కొద్ది మంది వ్యక్తులు కొన్ని సందర్భాలలో ఊహించినప్పటికీ సెక్యులరిజం ప్రత్యామ్నాయంగా ముందుకు రాలేదు. నాయకులు వారి భావాలను మత పరమైన పరిభాషక పదజాలంలో వ్యక్తీకరించారు. 19వ శతాబ్దపు హిందూ పునరుద్ధరణ వాద ప్రతినిధులైన స్వామి దయానంద, వివేకానంద లాంటివారు మొత్తం మీద రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు. తిలక్, రనడే, బకిం లాంటి కొద్ది మంది మాత్రమే బ్రిటిషు పాలనని వ్యతిరేకించారు; కూలదోయాలన్నారు. ఇతర నాయకులు చాలామంది బ్రిటిషు పాలన యొక్క ఉదారతని విశ్వసించారు.

సంస్కరణ నాయకుల ఆర్థిక ఆలోచనలు కనీస మనుగడకవసరమైన సాంప్రదాయ సాధారణ ఆర్థిక సూత్రాలకు ప్రాతినిధ్యం వహించాయి. సమూలమైన మార్పులు కోరే ఆర్థిక ఆలోచనలు ఆనాటి నాయకులకు లేవు. అది అలాంటి ఆలోచనలు అభివృద్ధి చెందే కాలం కాదు. ఏమైనప్పటికీ నాయకులు సామాజిక న్యాయం భావనతో ప్రభావితులయ్యారు. నాయకుల సంస్కరణ ఉద్యమాల నిర్వహణ యొక్క వైఖరులలో, పద్ధతులలో చాలా వ్యత్యాసం ఉన్నది. రాయ్ బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. సాంప్రదాయ హిందూ సమాజం యొక్క ప్రధాన స్రవంతి నుండి విడిపోయాడు. రనడే అవసరమైన సందర్భాలలో రాజీపడుతూ హిందూ సమాజంలో క్రమబద్ధమైన మార్పులు చేపట్టే వైఖరినవలంబించారు. స్వామి దయానంద విదేశీ ప్రభావాల పట్ల కఠినమైన, బద్ధ వ్యతిరేకమైన వైఖరిని అవలంబించారు.

శతాబ్దాంతానికి సంఘ సంస్కర్తలు రాజకీయ స్వాతంత్ర్యం కొరకు పోరాడుతున్న శ్రేణులలో విభజన తీసుకొస్తున్నారనే వాదనతో తిలక్, రనడేని ప్రతిఘటించాడు. సంఘ సంస్కర్తలు వెనకడుగు వేయవలసి వచ్చింది. రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే సామాజిక సమస్యని పరిష్కరిస్తుందని, సామాజిక న్యాయం సాధిస్తుందని భావించబడింది.

**పరిమితులు :**

సంఘ సంస్కరణ ఉద్యమాలు సాధించిన విజయాలు ఇప్పటికీ చర్చనీయాంశాలుగానే ఉన్నాయి. 19వ శతాబ్దపు నాటి సాంప్రదాయ దురాచారాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అయినప్పటికీ నాటి సంఘ మత సంస్కర్తల చొరవని అభినందించాలి. వారి కృషి కారణంగానే ఆత్మాభిమానం ఆత్మ విశ్వాసం ప్రజలలో పెంపొందాయి. ఉద్యమాలు ఆధునిక ప్రపంచాన్ని అవగతం చేశాయి. అదే సమయంలో మత సంస్కరణ ఉద్యమాలు అతి కొద్ది మంది పైననే కేంద్రీకరించాయి, ప్రయోజనాలు సమకూర్చాయి. అదే సమయంలో గత వైభవాన్ని తవ్వి తలకెత్తి మత గ్రంథాలపై ఆధారపడేలా చేసి వెనుక చూపు నేర్పాయి. హేతుబద్ధత, శాస్త్రీయ దృక్పథం విస్మరించబడ్డాయి. సంస్కర్తలు మతం పట్ల గల గాఢ విశ్వాసముతో ప్రజలందరికీ సంబంధించిన కళలు, శిల్పం, సాహిత్యం, సంగీతం, సైన్స్, సాంకేతిక రంగాలను విస్మరించారు. మధ్య యుగాలనాటి భారతదేశ చరిత్రపై చూపిన అశ్రద్ధ తరువాత కాలంలో సామాజికంగా రాజకీయంగా ప్రతికూల ఫలితాలకు దారి తీసింది. సయ్యద్ అహ్మద్ ఖాన్, స్వామీ దయానంద యింకా పలువురు చేపట్టిన కార్యక్రమాలు మతపరమైన చైతన్యం పుట్టుక, పెరుగుదలకు కారణమయ్యాయి.

కాని సంఘ సంస్కరణ రంగంలో చాలా సానుకూల ఫలితాలు చేకూరాయి. దాదాపు సంస్కర్తలందరూ మహిళా సమస్యలను, అస్పృశ్యతా సమస్యలను ప్రజల దృష్టికి తీసుకొని వచ్చారు. శతాబ్దాల తరబడి సాధారణ మానవ హక్కులు కూడా తిరస్కరించబడిన స్త్రీల, అస్పృశ్యుల అభ్యున్నతికి స్పష్టమైన సిద్ధాంతం నిర్ధిష్టమైన కార్యక్రమాలు రూపొందింపబడ్డాయి. అద్భుతాలు సాధించనప్పటికీ సరియైన దిశలో బాటలు వేయబడ్డాయి. 20వ శతాబ్దపు మొదటి రెండు దశాబ్దాలలో సమాజంలోని అణగారిన వర్గాల సమస్యలపై దృష్టి కేంద్రీకరించబడింది. వారి సంక్షేమం కొరకు చర్యలు జరిగాయి. తీర్మానాలు చేయబడ్డాయి. ప్రజలలో సాధారణ, రాజకీయ చైతన్యం పెరుగుదల ఇందుకు కారణాలు.

20వ శతాబ్దపు ప్రారంభం నుండి సంఘ సంస్కరణ ఉద్యమాల తీవ్రత తగ్గింది. అందుకు కారణం భారతీయ పునరుజ్జీవనోద్యమంలో నిర్మాణ బద్ధత లోపించడం. ఆధునికత కొరకు సంస్కర్తలు చేసిన ప్రతి ప్రయత్నాని సాంప్రదాయవాదులు అడుగడుగునా అడ్డుకొన్నారు. ఉదా : హిందూ మతంలో రామ్మోహన్ రాయ్ అభివృద్ధి కరమైన సంస్కరణలను రాధాకాంతదేవ్ 'ధర్మసభ' ద్వారా అడ్డుకొన్నారు. అలాగే సయ్యద్ అహ్మద్‌ఖాన్ ప్రయత్నాలను సాంప్రదాయ ముస్లింలు దియోబండ్ ఉద్యమంతో అడ్డుతగిలారు. ఈ వైఖరి కొనసాగింది. తరువాత దశాబ్దాలలో జాతీయోద్యమం ప్రముఖపాత్ర నిర్వహించి ఇతర ఉద్యమాల నన్నింటినీ వెనక్కునెట్టింది. 19వ శతాబ్దపు చివరి దశాబ్దంలో హిందూమతాన్ని, మతగ్రంథాలను ఆకాశానికెత్తుతూ ప్రాదుర్భవించిన దివ్య జ్ఞాన సమాజం కూడా సంస్కరణ ఉద్యమాల స్ఫూర్తిని తగ్గించడానికి తోడ్పడింది.

పునరుద్ధరణ వాద ధోరణులతో వెల్లువెత్తిన సమరశీల జాతీయవాదం సంస్కరణ ఉద్యమాలపై పెద్ద దెబ్బ తీసింది. వలస వాద సమాజంలో అంతర్గతంగా ఉన్న పరిమితులకు లోబడి సంస్కర్తలు ఉద్యమాలు నడిపారనే వాస్తవం విస్మరించరానిది. ఉదాహరణకు సంస్కర్తలు ఫలితాలు సాధించే ప్రయత్నాలలో విదేశీ పాలకులపై ఆధారపడవలసి వచ్చింది అంతేకాక సంస్కర్తల ఆలోచనలు, కార్యక్రమాలు మధ్య తరగతులు – వారి సమస్యల్ని అధిగమించి ముందుకు పోనందున వారు విస్తృతమైన సాధారణ ప్రజల మద్దతు పొందలేకపోయారు. అంతేకాక వడపోత విధానం పనిచేయలేదు. ప్రజలు గతంలోలాగానే నిరక్షరాస్యత అజ్ఞానంలో కూరుకుపోయి ఉన్నారు. ప్రజల ఈ స్థితి ఛాందస సాంప్రదాయ శక్తులు బలపడడానికి తోడ్పడింది. అన్నింటినీ మించి ఫ్యూడలిజం బలంగా వేళ్ళూనుకొని ఉన్నది. బలహీనపడే సూచనలు లేవు. సాంప్రదాయ వాదుల్ని దూరం చేసుకుంటామనే బెరుకుతో వలస పాలకులు సంఘ సంస్కరణలపై ఆసక్తి చూపలేదు. అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ వర్గానికి ప్రజల మతం నైతిక విలువలు మెరుగుపరచాలనే ఆసక్తి లేదు. ఆ విధంగా సంస్కరణ ఉద్యమాలు అటు పైవర్గాల నుండి గాని, క్రింది వర్గాలనుండిగాని మద్దతు పొందలేక పోయాయి. ఫలితంగా క్రమంగా క్షీణించడం ప్రారంభమైంది.

12

# కుల ఉద్యమాలు

## కులం

కులాలు అంటే వేదాలలో యితర సంస్కృత గ్రంథాలలో వర్ణింపబడిన వర్ణాలని పిలువబడే అస్పష్టమైన సామాజిక విభజన కాదని, వివిధ స్థాయిల వృత్తిపరమైన గుర్తింపుతోనే ఉమ్మడి ఆచారాలు సాంప్రదాయాలు, వివాహాలపై లేక తమ గుంపు వెలుపల తినడంలో నిషేధాలు వగైరాలతో ఐక్యం చేయబడిన విభిన్నమైన స్థానిక జాతులని కులంపై జరిపిన ఆధునిక సామాజిక పరిశోధన నిర్ధారించింది. కఠినమైన మార్పులేని కుల చట్రం అనే పాత భావన తిరస్కరింపబడింది. కులాల 'సంస్కృతీకరణ' యిటీవల పరిణామమని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త యం.ఎన్.శ్రీనివాస్ పేర్కొన్నాడు. జాతులు (కులాలు) తమకంటే ఉన్నతంగా ఉన్న జాతుల (కులాల) ఆచారాలు, సాంప్రదాయాలు పద్ధతులను అనుసరించి తమను తాము ఉన్నతమైన జాతిగా నిర్ధారించుకోవడం సంస్కృతీకరణ. బ్రిటిషిండియాకి ముందు కాలంలో రాజకీయ అస్థిరత, వలసలకు అవకాశం కల్పించే అదనపు భూమి – కులమార్పులకు అవకాశం కల్పించాయి. ఉదాహరణకు తొలుత మధ్య యుగాల కాలంలో పశువుల కాపరులుగా ఉన్న 'గోప్' తెగకు చెందిన మధ్య యుగాల నాటి బెంగాలీ 'సద్గోపులు' బెంగాల్ బీహార్ సరిహద్దు ప్రాంతాలకు వలసపోయి భూమిని ఆక్రమించి వ్యవసాయ యోగ్యంగా మార్చి ఆ తరువాత వ్యవసాయదారులుగా, వర్తకులుగా ఎదిగారు. వలస పాలన యిలాంటి దారుల్ని మూసివేసింది. కాని కొత్త దారుల్ని తెరిచింది. ఇప్పుడు కొత్త రాజ్యాల స్థాపన అసాధ్యం. అలాగే వ్యవసాయ యోగ్యం చేసేందుకు కొత్త ప్రాంతాలు లభ్యం కావు. కాని అభివృద్ధి పరచబడిన వార్తా రవాణా సౌకర్యాలు విస్తృతమైన అవకాశాన్ని సాధ్యం చేస్తున్నాయి. ఎదుగుతున్న కొద్దిమంది మైనారిటీలకు ఇంగ్లీషు విద్య సామాజిక నిచ్చెనగా పనిచేస్తుంది. వలస దోపిడి కొన్ని గ్రూపులను నొక్కిపెట్టి మరికొన్ని గ్రూపులకు ప్రయోజనాలు చేకూర్చే పద్ధతి అవలంబించింది.

**కుల ఉద్యమాలు - కారణాలు**

మధ్య తరహా, క్రింది కులాల విద్యావంతుల సమస్యలు ప్రధానమైనవి. వృత్తిపరమైన లేక ఉద్యోగాల పోటీలోకి ఆలస్యంగా వచ్చిన వారవడంతో అప్పటికి రంగంలో ముందున్న బ్రాహ్మణులు ఇతర అగ్రకులాలతో పోటీ పడేందుకు కులం సమీకరణ శక్తిగా కన్పించింది. దక్షిణ భారతదేశంలో జస్టిస్ ఉద్యమానికి, మహారాష్ట్రలో సత్యశోధక ఉద్యమానికి ఇది ముఖ్యమైన కారణం. సంస్కృతీకరణ ద్వారా సామాజిక నిచ్చెనపైకి ఎగబాకాలని కొన్ని కులాలకు గల ఆకాంక్ష ఇందుకు దోహదపడింది. ఇది వలస పాలన కాలంలో కొత్తగా ప్రారంభమైన విధానం కాదు. పలురకాల క్రింది మధ్యతరగతి కులాలు, హిందూ మతానికి వెలుపల ఉన్న కొన్ని కులాలు సామాజిక నిచ్చెనలో పైకి ఎగబాకాలని కోరుకోవడం వలన ఈ సంస్కృతీకరణ ప్రాచీన మధ్య యుగాల కాలమంతటా అనుసరించబడింది. ఈ సంస్కృతీకరణ ముఖ్యమైన పాత్ర నిర్వహించిందనడానికి తమిళనాడులో నాడార్, పల్లీల ఉద్యమాలు, కేరళలోని ఎజవాల నాయర్ల ఉద్యమాలు ఉదాహరణలు.

మధ్య తరహా, క్రింది కులాలలోని కొందరు తమ స్థితిని మెరుగుపరుచుకొనేందుకు బ్రాహ్మణాధిపత్యాన్ని కొన్ని సందర్భాలలో కుల విధానం ప్రాతిపదికన సవాలు చేయడం కూడా ఈ ఉద్యమాలకు కారణాలు. తమిళనాడులో ఇ.వి. రామస్వామి నాయకర్ ఆత్మగౌరవ ఉద్యమం, మహారాష్ట్రలో డాక్టర్ అంబేద్కర్ నాయకత్వంలోని మహర్ ఉద్యమం ఇందుకు ఉదాహరణలు. ఈ ఆకాంక్షతోనే ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో మహారాష్ట్ర సత్యశోధక ఉద్యమం ప్రారంభించబడింది.

1901 నుండి వలస ప్రభుత్వం ప్రతి పది సం॥ల కొకసారి కుల ప్రాతిపదికన జనాభా లెక్కలు ప్రకటించడం కూడా కుల సంఘాల నిర్మాణాన్ని ప్రోత్సహించింది. 1901కి ముందు వలస ప్రభుత్వం తన – విభజించి పాలించే విధానంతో ఒక కులానికి వ్యతిరేకంగా మరొక కులాన్ని ఒక గ్రూపుకి వ్యతిరేకంగా మరొక గ్రూపుని పోటీకి దించడం ద్వారా కుల ఉద్యమాల పెరుగుదలను పరోక్షంగా ప్రోత్సహించింది. మారిన పరిస్థితులలో రెండు విధాలుగా కులపరమైన ఐక్యత ప్రోత్సహించబడింది. కులం మద్దతు పొందడానికి ఉద్యోగాలు, రాజకీయ ప్రయోజనాలు సాధించడానికి కుల సంఘాలు ఉపయోగపడతాయని కుల పెద్దలు భావించారు. 1880 నుండి క్రమ బద్ధంగా ప్రారంభించబడిన ఎన్నికల రాజకీయాలు కుల సంఘాల నిర్మాణాన్ని ప్రోత్సహించింది. ఇక కులంలోని పేదలకు నానాటికి మారుతున్న పరిస్థితులలో కుల పెద్దలను అంటిపెట్టుకొని సత్సంబంధాలు కొనసాగించటం ప్రయోజన కారిగా కనిపించింది.

కుల ఐక్యతకి చెందిన కుహనా చైతన్యం కులపరమైన పోటీలు, సంస్కృతీకరణ ఉద్యమాల ప్రభావం సామాజిక ఆర్థిక ఉద్రిక్తతల రూపంలో వ్యక్తమయింది. కుల సంఘాలు,

కుల ఉద్యమాలు ఉత్తర, తూర్పు, భారతదేశంలో అసాధారణమైనవి కాకపోయినప్పటికీ వాటికి ఉద్యోగాలలో సాధారణ సాంస్కృతిక జీవితంలో బ్రాహ్మణాధిక్యతకు వ్యతిరేకంగా 19వ శతాబ్దాంతానికే దక్షిణ భారత దేశంలో మహారాష్ట్రలో ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. కనుక ఎక్కువ ప్రాచుర్యం పొందాయి.

**మహారాష్ట్రలో కుల ఉద్యమాలు :**

జ్యోతి బాపూలే (1870) తన గ్రంథం 'గులాంగిరి' (1872), తన సంఘం 'సత్య శోధక్ సమాజ్' (1873) ద్వారా బ్రాహ్మణ వ్యతిరేక భావాలను వ్యక్తీకరించారు. ఈ రెండూ బ్రాహ్మణుల నయవంచన నుండి వారి అవకాశ వాద గ్రంథాల నుండి నిమ్నకులాలను కాపాడవలసిన అవసరాన్ని స్పష్టం చేశాయి. దిగువ కులమైన 'మాలి' కులానికి చెంది పట్టణంలో విద్య నార్జించిన వానిచే ప్రారంభించబడిన ఈ ఉద్యమం ప్రధానంగా రైతాంగ కులాలలో వేళ్ళూనుకొన్నది. ఈ ఉద్యమంలో ద్వంద్వ స్వభావం ఉన్నది. ఒకవైపు సంస్కృతీకరణ ద్వారా మధ్య తరహా, క్రింది కులాలకు చెందిన పట్టణ విద్యావంతులు సామాజిక నిచ్చెన పైకి ఎగబాకాలనే ఆకాంక్ష ఉన్నది. మరొకవైపు కుల దురాచారాలను పూర్తిగా తుడిచిపెట్టాలనే గ్రామీణ రైతు కులాల ఆకాంక్ష ఉన్నది. మితవాద సంస్కృతీకరణ పద్ధతులలో అభివృద్ధి చెందుతూ, తరచుగా మరాఠాలు క్షత్రియ జాతికి చెందిన వారని ప్రకటించుకుంటూ ఉన్న ఈ సంఘం 1890 దశాబ్దం నుండి కొల్హాపూర్ మహారాజా ప్రోత్సాహాన్ని స్వీకరించింది. పట్టణాలలో కంటే గ్రామాలలో పనిచేస్తూ, ఇంగ్లీషు కంటే మరాఠీని ఉపయోగిస్తూ కుల వ్యవస్థపై దాడి చేసింది; సేట్‌జీ భాట్‌జీ (వడ్డీ వ్యాపారులు, బ్రాహ్మణుల)లకు వ్యతిరేకంగా సాధారణ ప్రజల పక్షాన నిలిచింది. 1919-21 కాలంలో సతారా రైతాంగ తిరుగుబాట్లకు ప్రేరణనిచ్చింది. ఆ తరువాత మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతాలలో గాంధేయ కాంగ్రెస్‌కి నూతన చైతన్యమిచ్చేందుకు తోడ్పడింది.

అంబేద్కర్ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన మహర్లు 19వ శతాబ్దాంతానికి మాజీ సైనికోద్యోగి గోపాల్ బాబా వలాంగకర్ ఆధ్వర్యంలో సంఘటితమవ్వడం ప్రారంభించారు. 1894లో వలాంగకర్ తయారు చేసిన ఒక పిటీషన్‌లో 'మహర్లు' క్షత్రియ జాతికి చెందిన వారని అస్పృశ్యులుగా పరిగణించబడుతూ గ్రామంలో దిగువ స్థాయి పనులు (వాచ్ మెన్, మెసెంజర్లు, స్వీపర్లు) చేస్తున్న వీరికి సైన్యంలో యితర సర్వీసులలో ఎక్కువ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. వీరిలో కొందరు కొద్ది కాలంపాటు సాంప్రదాయ వృత్తులు వదిలిపెట్టారు. మిలటరీలో కొన్ని ఉద్యోగాలు పొందారు. 1920 దశాబ్దం నుండి మహర్లలో తొలి పట్టభద్రుడైన అంబేద్కర్ నాయకత్వంలో స్వతంత్ర్య ప్రతిపత్తిగల ఉద్యమాన్ని అభివృద్ధి పరచారు. గ్రామాలలో చెరువుల్ని, బావుల్ని ఉపయోగించుకొనే హక్కు, దేవాలయాలలో ప్రవేశం, గ్రామ పెద్దలకు చేసే వెట్టి

చాకిరి రద్దు, పాలనా వ్యవస్థలో ప్రత్యేక ప్రాతినిధ్యం – లాంటి డిమాండ్లు చేశారు. మొదటి మహర్ల రాజకీయ సదస్సు జరిగిన 1927 నాటికి అంబేద్కర్ అనుచరులతో కొందరు హిందూ మతంతో పూర్తిగా విభేదానికి సంకేతంగా మనుస్మృతిని తగులబెట్టడం ప్రారంభించారు.

**తమిళనాడులో కుల ఉద్యమాలు**

తొలుత 'షానన్లు' అని పిలువబడే అంటరాని కులానికి చెందిన కల్లుగీత పనివాళ్ళు, వ్యవసాయ కార్మికులు, వర్తకం చేసే స్థాయికి ఎదిగారు. 1901 జనాభా సేకరణ నాటికి తమని తాము 'నాడార్లు'గా ప్రకటించుకొన్నారు. దక్షిణ తమిళనాడులోని 'రామ్‌నాథ్' జిల్లాలోని పట్టణాలలో అంటరాని కులంగా పరిగణించబడే 'షానన్లు' 19వ శతాబ్దాంతానికి వర్తకులుగా ఎదిగి విద్య సామాజిక సంక్షేమ కార్యకలాపాలకు నిధులు సేకరించారు. అగ్రకులాల ఆచారాలను, సాంప్రదాయాలను అనుకరించారు. 1910 లో 'నాడార్ మహాజన్ సంగం' నిర్వహించారు. రామ్‌నాథ్ జిల్లాలోని షానన్లు నాడార్లుగా ఎదిగినప్పటికి తిరునల్వేలికి చెందిన షానన్లు పాతపద్ధతిలోనే ఉన్నారు. అదే విధంగా ఉత్తర తమిళునాడుకి చెందిన 'పల్లీలు' 1871 నుండి తమ మూలాలు క్షత్రియ కులానికి చెందినవని తమను తాము వన్నియకుల క్షత్రియులమని ప్రకటించుకొని, వితంతు పునర్వివాహంపై నిషేధంలాంటి బ్రాహ్మణాచారాలను అనుకరించడం ప్రారంభించారు. పైన పేర్కొన్న 'నాడార్లు', 'వన్నియకుల క్షత్రియలు' సంస్కృతీకరణకు సరియైన ఉదాహరణలు.

పైన పేర్కొనబడిన రెండింటి కంటే తమిళ వెల్లలాలు, ముదలియార్లు, చెట్టియార్లు, తెలుగు రెడ్లు, కమ్మవారు, బలిజ నాయుడ్లు, మళయాళీ నాయర్ల పక్షాన 1915 – 16లో సి.యన్. ముదలియార్, టి.యం.నాయర్, పి.త్యాగరాజ చెట్టిలచే ప్రారంభించబడిన జస్టిస్ ఉద్యమం ఎన్నదగింది. విద్య, ఉద్యోగాలు, రాజకీయాలలో బ్రాహ్మణుల ఆధిపత్యం పట్ల అసూయ చెందిన భూస్వాములు, వ్యాపారులు ఈ ఉద్యమంలో చేరారు. మద్రాసు ప్రెసిడెన్సీలో కేవలం 3.2 శాతంగా ఉన్న బ్రాహ్మణులు 1912లో 55 శాతం డిప్యూటీ కలక్టర్ ఉద్యోగాలు 72.6 శాతం డిస్ట్రిక్టు మున్సిఫ్ ఉద్యోగాలు చేస్తున్నారు. వారు కొన్ని చోట్ల ప్రత్యేకించి తంజావూరులో పెద్ద భూస్వాములు కూడా. అగ్రకులాల వారితో వ్యవసాయ సంబంధాలు, పట్టణాలలో పెద్ద ఉద్యోగాలలో భూములున్న గ్రామాలలో నివసించని భూస్వాములు వీరు. ఎగువ ఉద్యోగాలు, కొత్త చట్టసభలలో ప్రత్యేక ప్రాతినిధ్యం పొందే ఆశతో జస్టిస్ పార్టీ బ్రిటిషు ప్రభుత్వానికి విధేయత ప్రకటించింది.

మహారాష్ట్రలో లాగా తమిళనాడులో కూడా ఆత్మగౌరవ ఉద్యమాలు లేకపోలేదు. సహాయ నిరాకరణోద్యమంలో చురుకుగా పాల్గొన్న 'పెరియార్'గా ప్రజాదరణ పొందిన ఇ.వి.రామస్వామి నాయకర్ కులీనుల జస్టిస్ ఉద్యమానికి ప్రత్యామ్నాయంగా ఉద్యమాన్ని

నిర్మించేందుకు 1920 దశాబ్దం మధ్య కాలంలో కాంగ్రెసు నుండి విడివడ్డారు. ఆయన 1924లో ప్రారంభించిన 'కుడి అరసు' తమిళ గ్రామీణ భాషలో వ్రాయబడింది. 1925లో స్థాపించిన ఆత్మగౌరవ ఉద్యమం బ్రాహ్మణ పురోహితులు లేకుండా వివాహాలు జరపడానికి, దేవాలయాల ప్రవేశానికి, మనుస్మృతి తగులబెట్టడానికి, కొన్ని సందర్భాలలో పూర్తిగా నాస్తికవాదానికి ప్రచారమిచ్చి అభివృద్ధి చెందింది.

### కేరళ, మైసూరులలో కుల ఉద్యమాలు

20వ శతాబ్దం ప్రారంభం నుండి అస్పృశ్యులుగా ఉన్న ఎజవాలు బ్రాహ్మణాధిక్యతను వ్యతిరేకించేందుకు దేవాలయాల ప్రవేశం, సాంప్రదాయాల సంస్కృతీకరణ డిమాండ్లు చేసేందుకు నారాయణగురుగా ప్రసిద్ధి గాంచిన నాను ఆసన్ నుండి స్ఫూర్తి పొందారు. తరువాత కాలంలో ఎజవాలు కమ్యూనిష్టు పార్టీ మద్దతుదారులయ్యారు.

తిరువాన్కూర్ సంస్థానంలో మధ్య తరహా కులానికి చెందిన నాయర్లు నంబూద్రి బ్రాహ్మణుల, మళయాళీయేతర బ్రాహ్మణుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిర్విరామ ప్రచారం సాగించారు. జనాభాలో కేవలం ఒక శాతంగా ఉన్న నంబూద్రి బ్రాహ్మణలు పన్ను చెల్లించనవసరం లేని జన్మీఎస్టేట్లు కలిగి ఉన్నారు. మళయాళీయేతర (మరాఠీ, తమిళ) బ్రాహ్మణులు 1891లో కేవలం 28,000 మంది మాత్రమే ఉన్నప్పటికీ ఐదు లక్షల జనాభా గల నాయర్లతో పాటు సమానంగా ఉద్యోగాల్లో ఉన్నారు. మళయాళియేతర బ్రాహ్మణులు తమని వెలివేస్తున్నారని నాయర్లు ఆందోళన చెందారు. సిరియన్ క్రైస్తవుల్ని (ఉత్తర తిరువాన్కూర్‌లో పెద్ద సంఖ్యలో భూస్వాములు, అభివృద్ధి చెందుతున్న వర్తకులు ఉన్నారు. ఆధునిక జర్నలిజంలో అగ్రభాగాన ఉన్నారు) జూచి కలత చెందారు. మరొక వైపు ఎజవాలు పైకి ఎదుగుతున్నారు. అంతేగాక నాయర్లకు అంతర్గతంగా చాలా సమస్యలున్నాయి. సాంప్రదాయబద్ధమూ, భారమూ అయిన నాయర్ల మాతృస్వామిక కుటుంబ వ్యవస్థ ఆధునిక ఆర్థిక పరిస్థితులకు సరిపడనిదయిందని భావింపబడింది. చాలా మాతృస్వామిక కుటుంబాలకు చాలా పరిమితమైన భూఖండాలు మాత్రమే ఉన్నాయి. నాయర్ల సామాజిక సాంప్రదాయాలు ప్రత్యేకించి నాయర్ల మహిళలు నంబూద్రి సందర్శకుల ఎదుట రొమ్ములపై ఆచ్ఛాదన లేకుండా కన్పించాలని, వారితో తాత్కాలిక సంబంధాలు కలిగి ఉండాలనే నిబంధనలు తిరోగామి దృక్పథం కలవి.

ఫలితంగా సంఘ సంస్కరణ, బ్రాహ్మణ వ్యతిరేక భావాలు, దేశభక్తి, సమూలమైన మార్పులు కోరే ధోరణులన్నీ ఒకేసారి కలిసి కట్టుగా ముందుకి వచ్చాయి. ఆ విధంగా కేరళ లోని మొదటి ఆధునిక నవల చందర్ మీనన్ రచించిన ఇందులేఖ (1889) నంబూద్రిల

సామాజికాధిపత్యాన్ని మాతృస్వామిక కుటుంబ వ్యవస్థని తీవ్రంగా విమర్శించింది.

అలాగే సి.వి.రామన్ పిళ్ళై చారిత్రక నవల మార్తాండవర్మ (1891) దానిలోని నాయకుడైన ఆనంద పద్మనాభన్ ద్వారా కోల్పోయిన నాయర్ల సైనిక వైభవాన్ని పునరుద్ధించ యత్నించింది. ప్రభుత్వ ఉద్యోగాలలో బ్రాహ్మణుల ఆధిపత్యంపై దాడిచేస్తూ 'మళయాళి మెమోరియల్' ని నిర్వహించిన వారిలో రామన్ పిళ్ళై ప్రముఖుడు. 1890 దశాబ్దాంతానికి రామన్ పిళ్ళై గ్రూపు పదవుల్లో ఉన్న కులీన వర్గం సులభంగా ఇముడ్చుకోగలిగింది. 1900 తరువాత కె.రామకృష్ణ పిళ్ళై, యం.పద్మనాభన్ పిళ్ళైల ఆధ్వర్యంలో శక్తివంతమైన నాయర్ల నాయకత్వం ఎదిగింది. పద్మనాభన్ పిళ్ళై 1914లో 'నాయర్ సేవా సంఘం' స్థాపించారు. కుల పరమైన ప్రయోజనాలతో కొంత సంఘ సంస్కరణ లక్ష్యాన్ని మేళవించి యిప్పటికీ కొనసాగుతుంది. రామకృష్ణ పిళ్ళై 1906 నుండి 1910 వరకు స్వదేశాభిమాని పత్రిక నడిపాడు. పత్రిక రాజకీయ హక్కులు డిమాండు చేయడంతో పిళ్ళై తిరువాన్కూర్ నుండి బహిష్కరింపబడ్డారు.

మైసూర్ స్వదేశీ సంస్థానంలో పట్టణ పునాదిగల బ్రాహ్మణులు (జనాభాలో 3.8 శాతం) 1918లో గెజిటెడ్ ఉద్యోగులలో 65 శాతం మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఒక్కలిగలు లింగాయతులు ఆధిపత్య గ్రూపులుగా ఉన్నారు. 1905 – 06 లో లింగాయత్ విద్యానిధి సంస్థ, ఒక్కలిగ సంఘం స్థాపించబడ్డాయి. 1917లో మైసూరు మహారాజా కళాశాలలో బోధిస్తున్న రాజకీయ వేత్త సి.ఆర్.రెడ్డి బ్రాహ్మణ వ్యతిరేక వేదికగా 'ప్రజా మిత్ర మండలి' – అనే మొదటి రాజకీయ సంస్థని స్థాపించారు. ఇలాంటి సంస్థలు పట్టణాలకు పరిమితమయ్యాయి. వ్యక్తిగత సంబంధాలతో స్వీయ ప్రయోజనాల కొరకు పనిచేశాయి.

**ఉత్తర తూర్పు భారతదేశంలో కుల ఉద్యమాలు:**

ఈ ప్రాంతాలలో బ్రాహ్మణాధిక్యత అంతగా లేదు. యు.పి., బీహార్లలో రాజపుట్‌లు, క్షత్రియులు, బెంగాల్‌లో క్షత్రియులు, వైద్యాలు తటస్థంగా ఉండిపోయారు. కుల ప్రాతిపదికపై సమీకరణలు కాస్త ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కానీ క్షత్రియులు పరస్పర సంబంధాలు ఏర్పరచుకొని 1910 నాటికి అఖిల భారత సంఘాన్ని, కాయస్థ సమాచార్ పత్రికని స్థాపించారు.

బెంగాల్‌లో 20వ శతాబ్దపు మొదటి దశాబ్దం నుండి దిగువ కుల సంఘాల ప్రాధాన్యత పెరగడం ప్రారంభమైంది. కొందరు స్థానిక జమిందారుల నాయకత్వంలో సంపన్నులైన 'కైవర్తాలు' తమని తాము 'మహిష్యాలు'గా పిలుచుకొనే కలకత్తాకి చెందిన లాయర్లు, వర్తకులు 1897లో 'జాతి నిర్ధరాని సభ'ని ప్రారంభించారు. 1901 జనాభా లెక్కల కాలంలో కేంద్రీయ మహిష్య సమితిని స్థాపించారు. తరువాత కాలంలో మిద్నపూర్ మాహిష్యాలు జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. బ్రిటిషువారి విభజించి పాలించే ఎత్తుగడలు పనిచేస్తున్నప్పటికీ

కొద్ది మంది విద్యావంతులు మిషనరీల చొరవతో 1901 తరువాత ఫరీద్‌పూర్ నామ శూద్రులు సంఘాలు స్థాపించడం ప్రారంభించారు. ఈ వైరుధ్యాన్ని పాక్షికంగా యిలా వివరించవచ్చు. మిడ్నాపూర్ మహిష్యాలు చిన్న భూస్వాములు, రైతులు పేద రైతులతో స్థానికంగా ఆధిపత్యం సాధించిన కులం. అస్పృశ్యపేద రైతులైన నామశూద్రులు దూరానగల బ్రిటిష పాలకుల దోపిడికంటె నెత్తిన కూర్చున్న అగ్రకులాల దోపిడీ తీవ్రమైనదని భావించారు.

**మహిళలు-సంఘ సంస్కరణ:**

19వ శతాబ్దంలో మహిళా సమస్యకి విస్తృతమైన ప్రాధాన్యత లభించింది. మహిళలు ఏమి కోరుతున్నారు? అనే దానికంటె వారు ఏవిధంగా ఆధునీకరింపబడాలనేది సమస్య అయింది. విదేశీపాలకులు ఈ సమస్యపై దృష్టిని కేంద్రీకరించారు కనుక 19వ శతాబ్దపు బ్రిటిషిండియాలో ఇది ముఖ్య సమస్య అయింది. నాగరికతా కర్తవ్యంచే ప్రభావితులైన బ్రిటిష రచయితలు భారతదేశంలోని మతాలు సంస్కృతి సాంప్రదాయాలు మహిళలపై విధించిన నియమ నిబంధనలను ఖండించారు. పూర్తిగా విభిన్న సంస్కృతీ సాంప్రదాయాలు కలిగి భారతదేశాన్ని గెలిచిన వారిలో బ్రిటిషువారు ప్రథములు కారు. ముస్లిం వంశాలు వాయువ్య దిశ నుండి భారతదేశంలో చొచ్చుకు వచ్చాయి. భారతదేశానికి కొత్త మతాన్ని తెచ్చారు. కాని సాధారణ ప్రజల జీవితాలలో గణనీయ మార్పులు మాత్రం బ్రిటిషుపాలనతోనే వచ్చాయి. గతంలో విదేశీ ఆక్రమణదారులు సాంప్రదాయ భారతీయ సమాజాన్ని యధాతథంగా ఉంచారు. కానీ బ్రిటిషువారు దానిని కకావికలు చేశారు. గతంలో ప్రభుత్వాలు పన్నులు వసూలు చేశాయి. ప్రజల విధేయతను డిమాండు చేశాయి. కాని సామాజిక వ్యవస్థలో జోక్యం చేసుకోలేదు. ముస్లిం పాలన దీనిని మార్చలేదు. కాని బ్రిటిష వారు మాత్రం వారి వాణిజ్య లక్ష్యాల్ని నెరవేర్చుకొనేందుకు కొత్త సంబంధాలను ప్రవేశపెట్టారు. వారి చర్యల్ని "స్పష్టమైన, సంక్షిప్తమైన, శాస్త్రీయమైన, సాంకేతికమైన, సమర్థవంతమైన, నిజాయితీగల, అన్నింటినీ మించి వారితో సంబంధంలోకి వచ్చిన అందరికీ ప్రయోజనకారి అయిన" ప్రాపంచిక దృక్పథంలో వివరించారు.

బ్రిటిష పాలకుల భావాలలో మానవతావాదం, ఉపయోగితావాదం, సామాజిక డార్వినిజం, జాతీయవాదం ప్రాచుర్యం పొందాయి. భౌతిక ప్రమాణాలపై ఆధారపడిన తాత్విక దృక్పథం, సామాజిక డార్వినిజంలు మతాలు సంస్కృతుల స్థాయిని పెంచాయి; పరిణామ క్రమంలో మధ్యప్రాచ్యం లేక పశ్చిమ యూరపు కంటె భారతదేశాన్ని దిగువ స్థాయిలో ఉంచాయి. భారతదేశం అభివృద్ధి చెందాలంటే పాశ్చాత్య భావాల్ని, నిబంధనల్ని అనుసరించడం ద్వారానే సాధ్యపడుతుంది. కొద్దిమంది పాశ్చాత్య విమర్శకులు పునరుజ్జీవనం సాధ్యమని విశ్వసించారు. ఏమైనప్పటికీ స్త్రీ పురుష సంబంధాల పట్ల నూతన సిద్ధాంతం, స్త్రీలతో వ్యవహరించే విధానంలో

సవరణలు సానుకూలమైన మార్పుకి అవసరమైన పీఠికగా ఉండాలి.

**వలసవాదుల సవాలుకు భారతీయుల స్పందన:**

వలసాధిపత్యంతో మార్పులు ప్రారంభమయ్యాయి. భారతీయులు సామాజిక సాంస్కృతిక వాతావరణానికి సరిపడే విధంగా దిగుమతి అయిన ఆలోచనలకు సంస్థలకు కొత్తరూపమిచ్చారు. భారతీయ మేధావులు దిగుమతి చేసుకున్న ఆలోచనల ప్రభావంతో గతాన్ని పునరావిష్కరించడానికి చేసిన ప్రయత్నాలను బెంగాల్ పునరుజ్జీవనంలో చూడవచ్చు. స్త్రీ, పురుష సంబంధాలను పునర్నిర్వచించేందుకు ముందుకు వచ్చిన సిద్ధాంతం – నూతన విదేశీ భావనల, దేశీయ భావనలు వారి మధ్య విదేశీయులుండటంతో వచ్చిన స్పందనల కలయిక.

స్త్రీ పురుష సంబంధాలలో మార్పు అవసరమని అందరూ అంగీకరించలేదు. చాలా మంది మేధావులు స్త్రీల పట్ల భారతీయ సాంస్కృతిక దృక్పథం చాలా గొప్పదని చెప్పారు. భారతీయ స్త్రీల స్థితిగతులను యూరపు స్త్రీల స్థితిగతులతో పోల్చారు. రెండు దేశాలలో స్త్రీలు కష్టాలతో కాపురం చేస్తున్నారని నిర్ణయానికి వచ్చారు. సమాజం యొక్క వెనుకబాటుతనానికి కారణం స్త్రీల అణచివేతయని గమనించిన వారు స్త్రీ విద్య, స్త్రీ విముక్తి సమాజాభివృద్ధికి చేపట్టవలసిన తొలి చర్యలుగా గుర్తించారు. స్త్రీ పురుష సంబంధాల పట్ల సంతృప్తి వ్యక్తం చేసినవారు, సంస్కరణ అవసరమని భావించినవారూ – రెండు గ్రూపులకు చెందిన వారు స్త్రీ సమస్యలకు ప్రపంచం నుండి ఇంటిని వేరు చేయడం కారణమని అంగీకరించారు.

19వ శతాబ్దపు చివరి దశాబ్దం నాటికి సంస్కరణవాదం అవసరమని గుర్తించబడినది. ఈ సిద్ధాంతం యొక్క స్వరూపం – స్త్రీల పట్ల వైఖరి 20వ శతాబ్దమంతా కొనసాగింది. మొదటిది భారతీయ స్త్రీలు దయనీయమైన స్థితిలో ఉన్నారు. 1839లో మహేష్‌చంద్రదేవ్ వివాహితలైన స్త్రీల దైనందిన జీవితాన్ని గురించి మాట్లాడుతూ; 'హిందూ స్త్రీల స్థితిగతులను జాగ్రత్తగా గమనించిన ఎవరైనా విజ్ఞాన వెలుగులు ప్రసరించకుండా ఉంచబడిన స్త్రీల దయనీయ స్థితిని గమనించి జాలిచూపక తప్పదు' అన్నారు.

దేవ్ ఉపన్యాసంలోని విషయం – భారతీయ స్త్రీల దయనీయ స్థితి పాశ్చాత్య విమర్శకుల ఉపన్యాసాలలో, వ్యాసాలలో ప్రతిధ్వనించింది. మానవతావాద ధృక్పథంతో సంస్కరణలు చేపట్టాలన్నారు. పాశ్చాత్య ఆలోచనలతో ప్రేరేపితులైన ప్రభావితులైన ఈ సంస్కర్తలకు వారి సంస్కృతీ సాంప్రదాయాలపట్ల మంచి అవగాహన ఉంది. రామ్మోహన్ రాయ్, పండిట్ విద్యాసాగర్, స్వామి దయానంద సరస్వతి యింకా హిందూ సాంప్రదాయ గ్రంథాలను అధ్యయనం చేసినవారు భారతదేశం అంధయుగం నుండి బయటపడుతున్నట్లు భావించారు. స్త్రీలకు గౌరవం లభించిన, స్త్రీలు అత్యున్నత స్థానాలు ఆక్రమించిన 'స్వర్ణయుగం'

ఒకటుందని వాదించారు. వేదకాలానికి చెందిన ఈ దృక్పథం బ్రిటిష చరిత్రకారుడు విన్సెంట్ స్మిత్ కథనాన్ని తిప్పికొట్టడానికి ఉపయోగపడింది.

స్వర్ణయుగాన్ని పలువురు అంగీకరించారు. కానీ పతనానికి వివరణలు యివ్వడంలో విభేదించారు. కొందరు సంస్కర్తలు యుద్ధాలు దాడులు కారణమన్నారు. రాజకీయ అశాంతి అనివార్యంగా స్త్రీల విద్య, అభ్యున్నతికి ఆటంకంగా నిలిచిందన్నారు. చాలా మంది సంస్కర్తలు స్మృతుల కాలం అంటే మనుస్మృతి, యితర వ్యాఖ్యానాలు, పురాణాలు, యితిహాసాలు విధి నిషేధాలు రాయబడిన కాలంతో స్త్రీల పతనా వ్యవస్థ ప్రారంభమయిందన్నారు. ఈ రచనల కారణంగా సమాజంలో స్త్రీల స్థాయి దిగజారిందన్నారు. అత్యధిక సంస్కర్తలు ముస్లిం పాలనని నిందించారు. అక్బర్‌లాంటి ముస్లిం పాలకులు సతీదురాచారం రద్దుకు ప్రయత్నించటాన్ని, ముస్లిం చట్టం హిందూ చట్టం కంటె స్త్రీకి ఉన్నత స్థానం కల్పించటాన్ని విస్మరించి, ఈ రచయితలు మహిళల భద్రతకు ముస్లింలు కల్పించిన భయానికి బాల్య వివాహాలు, వితంతు వివాహ నిషేధాలు, స్త్రీ విద్యకి పరిమితులు స్పందనలని పేర్కొన్నారు.

చరిత్రకారులకు 'స్వర్ణయుగం' 'అంధయుగం' సమస్యలయ్యాయి. కానీ ఈ భావనలు సంఘ సంస్కరణ సిద్ధాంతాన్ని సహేతుకంగా అభివృద్ధి పరచడానికి ఉపయోగపడ్డాయి. 'అంధయుగం' ఆత్మ విమర్శకి అవకాశం కల్పించింది. గత వైభవ పునరుద్ధరణకు మార్పు, సంస్కరణలు అవసరమయ్యాయి. ఈ సంస్కర్తలు పునరుద్దరణ వాదులు కాదు. ప్రాచుర్యం పొందిన నైతిక ప్రమాణాల పోటీలో వలస పాలకులతో వారి పారిభాషిక పదజాలంతో మాట్లాడారు. భారతీయ జీవితంలో మతం కేంద్ర బిందువుగా ఉందని అంగీకరించారు. భారతీయులు మతానికి బానిసలని సతి, యితర దురాచారాలు మతపరమైనవని అన్నారు. భారత సైనిక బలహీనత, వర్తక విధానాలు, సాంకేతిక పరిశోధనలు లాంటి యితర విషయాలను వదిలిపెట్టి బ్రిటిషువారు స్త్రీ పురుష సంబంధాల అంశంపై చర్చని కేంద్రీకరించడం ఆశ్చర్యం కలిగించక మానదు. కానీ జరిగిందిది.

స్వర్ణయుగం, స్వర్ణయుగం పతనానికి దారితీసిన లోపాలపై పరిశోధన – భారతీయులు మార్పుని కోరేందుకు అవకాశం కల్పించింది. స్త్రీల దయనీయ స్థితి, వారి స్థితిని మెరుగుపరిచే పద్ధతులు అవగతమైన తరువాత యిక కావలసింది సంకల్పం. చాలా మంది సంస్కర్తల అభిప్రాయాలననుసరించి సంస్కరణ అంటే గతాన్ని పునరుద్ధరించటం సహజ పద్ధతికి హేతుబద్ధమైన ఆలోచనకు అనుగుణంగా ఉంది. రామ్మోహన్‌రాయ్ బలవంతంగా తాళ్ళతో కట్టివేసి చితిమంటల్లో త్రోసివేయబడిన స్త్రీలను గురించి వ్రాశారు. స్త్రీల శక్తియుక్తుల అభివృద్ధికి ఆటంకంగా నిలిచిన సంప్రదాయాన్ని గురించి విద్యాసాగర్ వ్రాశారు. డి.కె. కార్వే మూర్ఖుని కామానికి బలిఅయిన విధవరాలిని గురించి వ్రాశారు. సంస్కర్తల అభిప్రాయాల్ని అనుసరించి

సాంప్రదాయాలు, అమాయకత్వం, భయం నుండి పుట్టి కనీస పరిజ్ఞానం లేకుండా వక్రీకరించబడ్డాయి.

పాశ్చాత్య విద్యనార్జించిన తొలితరం యువకులు ఆలోచనకు, చర్యకు కారణాల్ని గీటురాయిగా భావించారు. ఆ తరువాత రంగంలోకి వచ్చిన సంస్కర్తలు స్వర్ణయుగాన్ని పునరుద్ధరించాలన్నారు. మత విజ్ఞానానికి పాశ్చాత్య విశ్లేషణా పద్ధతులు అన్వయించేందుకు సందేహించనవసరం లేదన్నాడు వివేకానందుడు. అలాగే స్వామి దయానంద హిందూ మతంలోని తప్పులను తాను సమర్థించనని, యితర మతాలలోని తప్పుల్ని బహిర్గత పరచినట్లే హిందూ మతంలోని తప్పుల్ని బహిర్గత పరుస్తానన్నాడు.

**మారుతున్న మహిళల జీవితాలు:**

మార్పు జరగడానికి ముందు మహిళల జీవితాల్ని గురించి మనకు తెలిసిందేమిటి? సంస్కర్తల రచనలున్నాయి కానీ వాటిలో అభిప్రాయ భేదాలున్నాయి. వలస పాలనకు ముందు మహిళల జీవితాలకు సంబంధించిన స్పష్టమైన అవగాహన నేర్పరచుకొనటం కష్టం. బ్రిటిష పాలనకి ముందునాటి గ్రంధాలున్నాయి. కాని స్త్రీల వాస్తవ జీవితాలపై వెలుగును ప్రసరింపజేసే ప్రామాణిక పత్రాలు బహుతక్కువ. మహిళల బాధ్యతలను పూర్తిగా వివరించే త్రయంబక యజ్వన్ రచించిన 'స్త్రీదర్మ పద్ధతి' ఉన్నది. 18వ శతాబ్దంలో సంస్కరణ కార్యక్రమాలకు ముందు రచించబడిన ఈ గ్రంథం భూస్వామ్య కుటుంబాలకు చెందిన స్త్రీల జీవితాలను వర్ణించింది. కానీ వ్యవసాయ పనులు, యితర వృత్తులు చేసుకొనే సాధారణ పేద స్త్రీల బతుకుల వెతలను గురించి పట్టించుకోలేదు.

అగ్రవర్ణాలలో అమ్మాయిలు వివాహానికి సన్నద్ధమవుతూ బాల్యం గడుపుతారు. అమ్మాయి పెళ్ళి అదే కులానికి చెందిన అంతకంటె స్థాయి కల వ్యక్తితో తల్లిదండ్రులచే నిర్ణయింపబడుతుంది. పెళ్ళి తరువాత భర్త యింటికి పంపించబడుతుంది. అక్కడి పరిస్థితుల కనుగుణంగా సర్దుబాటు చేసుకోవలసి ఉంటుంది. భర్తని దేవాధిదేవుడిగా పరిగణించాలి. సేవలు చేయాలి. కుమారుల్ని కంటే అదృష్టవంతురాలే. పిల్లలు లేకపోతేగాని, ఆడపిల్లల్ని కంటే గాని చీత్కరించబడుతుంది. వయస్సు కాస్త పెరిగిన స్త్రీ పిల్లలు పెరగడాన్ని వారికి పెళ్ళిళ్ళు చేయడాన్ని గమనిస్తుంటుంది. తరువాత అత్త, అమ్మమ్మ లేక నాయనమ్మల పాత్ర నిర్వహిస్తుంది. భర్త తమ కంటె ముందు చనిపోతే విధవరాలవుతుంది. అన్ని అలవాట్లని త్యజిస్తుంది. అతని జ్ఞాపక చిహ్నంగా బతుకుతుంది. ఆమె కళంకము తొలిగిపోనిది, తొలగింపరానిది. అత్యంత అపవిత్రమైన జీవిగా బతుకు కొనసాగిస్తుంది.

స్త్రీలు ఈ నియమ నిబంధనల్ని మతాల్ని బట్టి, కులాన్ని బట్టి, వర్గాన్ని బట్టి, వయస్సుని

బట్టి, కుటుంబ వారసత్వంలో స్థానాన్ని బట్టి పాటించారు. ఈ నియమ నిబంధనల్ని నిక్కచ్చిగా పాటించినవారున్నారు. వ్యతిరేకంగా తిరగబడ్డవారూ ఉన్నారు. మత సాంప్రదాయ పాత్రల నుండి బయటపడడానికి మార్గాంతరం కొన్ని రాజకీయ చర్యల ద్వారా కనుగొన్నవారున్నారని చారిత్రక ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. కొందరు పితృస్వామ్య కుటుంబాల వెలుపల నివశించి రాజాస్థానంలోని నర్తకుల స్థాయి పొందగలిగినవారు ఉన్నారు. అసాధారణ ప్రతిభగల స్త్రీలకు గాని, జీవితం పట్ల అసంతృప్తి చెందిన స్త్రీలకు గాని గల అవకాశాలు పరిమితం. లభ్యమయ్యే ప్రామాణిక ఆధారాలను బట్టి అతి కొద్దిమంది స్త్రీలు మాత్రమే విద్యావంతులయ్యారు; పేరు ప్రతిష్టలు గడించారు, సైన్యాన్ని నడిపించారు; కానీ విజ్ఞానం ఆస్తి, సామాజిక స్థాయి పొందేందుకు పురుషులకు గల అవకాశాలు అత్యధిక స్త్రీలకు తిరస్కరించబడ్డాయి.

19వ శతాబ్దం ద్వితీయార్ధ భాగం నాటికి బ్రిటిషిండియా అంతటా సంస్కరణ గ్రూపులు ముందుకు వచ్చాయి. వాటి దృష్టి సతి, శిశు హత్య, బహుభార్యాత్వం, బాల్య వివాహం, పరదా, స్త్రీ విద్యపై గల నిషేధాలు, దేవదాసీలు, పితృస్వామిక ఉమ్మడి కుటుంబం వగైరాలపై కేంద్రీకరించాయి. వారి కార్యకలాపాలు యితర ప్రాంతాలలోని సంస్కరణ వాద భావాలు గల వ్యక్తులకు ప్రేరణ ప్రోత్సాహాలిచ్చాయి. క్రమంగా అఖిలభారత గుర్తింపు గల సంస్కరణ సంఘాలు ప్రారంభమయ్యాయి.

**పురుష సంస్కర్తల తోడ్పాటు:**

దేశవ్యాప్తంగా స్త్రీ సమస్యలు చేపట్టిన సంస్కర్తలు చాలా మంది ఉన్నారు. బెంగాల్‌లో ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ స్త్రీ విద్య కొరకు ఎనలేని కృషి చేశారు. వితంతు పునర్వివాహానికి చట్టబద్ధత కల్పించే ప్రచారానికి నాయకత్వం వహించారు. కేశవచంద్రసేన్ పాఠశాలల ద్వారా ప్రార్థనా సమావేశాల ద్వారా స్త్రీలు జీవితంలో కొత్త పాత్రలు నిర్వహించేందుకు సన్నద్ధం చేశారు. శతాబ్దాంతానికి స్వామి వివేకానంద స్త్రీ బలమైన పునరుజ్జీవింపజేసే శక్తి కాగలదని వాదించారు.

ఉత్తర భారతదేశంలో స్వామి దయానంద సరస్వతి స్త్రీ విద్యని ప్రోత్సహించాడు. ఎక్కువ వయోభేదం గల స్త్రీ పురుషుల వివాహాలు, కట్నాలు, బహుభార్యాత్వం లాంటి స్త్రీలను కించపరచే సాంప్రదాయాల్ని ఖండించారు. అదే సమయంలో రాధాస్వామి అనుచరుడు రాయ్‌సాలిగ్ రాం (హుజూర్ మహరాజ్) తన 'ప్రేమ పత్ర్' వచన గ్రంథాల ద్వారా మహిళా విముక్తికి ప్రచారమిచ్చాడు. ముస్లింలలో ఖాజా అల్తఫ్ హుస్సేన్ హాలి, షేక్ మహమ్మద్ అబ్దుల్లా బాలికల విద్యని ప్రవేశపెట్టారు.

పశ్చిమ భారతదేశంలో మహాదేవ్ గోవింద రనడే సంఘ సంస్కరణలపై ప్రజల

దృష్టిని కేంద్రీకరించేందుకు 'జాతీయ సామాజిక సదస్సు' స్థాపించారు. అదే సమయంలో పార్సీ పత్రికా రచయిత అయిన బెమ్‌రామ్‌జీ మలబారీ 'ది టైమ్స్' పత్రికలో వ్యాసాల ద్వారా బాల్య వివాహాలు, యువతుల నిర్బంధ వైధవ్యం సమస్యల్ని బ్రిటిషు ప్రజల దృష్టికి తెచ్చాడు. డి.కె. కార్వే బాలికల పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు విధవలకు తర్ఫీదు యిచ్చే ఆచరణాత్మక కార్యక్రమాన్ని తన పూనా విద్యాసంస్థల ద్వారా చేపట్టారు.

దక్షిణ భారతదేశంలో ఆర్. వెంకటరత్నం నాయుడు దేవదాసీ విధానాన్ని వ్యతిరేకించారు. వీరేశలింగం పంతులు వితంతు పునర్వివాహాలు ఉద్యమంగా చేపట్టారు. ఇరువురూ మహిళా విద్యావకాశాలను పెంచేందుకు కృషి చేశారు. వివాహం, స్త్రీ విద్యలకు సంబంధించిన అనేక సమస్యల్ని పరిష్కరించారు.

19వ శతాబ్దపు సంస్కర్తలలో ఆసక్తికరమైన లక్షణం కార్యశీలత. లింగ వివక్షకు సంబంధించిన అంశాలు వారు స్వయంగా, వ్యక్తిగతంగా పరిశీలించినవి. వారు సమకాలీన ప్రజలతో కలసి పనిచేసే పరిస్థితుల్ని మార్చయత్నించారు. వారు బ్రిటిషు ఒత్తిడికి లొంగి స్పందించలేదు. సమస్యలు వాస్తవాలు. వారు చిత్తశుద్ధితో, ఆవేదనతో స్పందించారు.

సంస్కర్తలు స్త్రీలను తమవారిగా గుర్తించారు. అనునయంతో కూడిన వాదనలతో, కార్యశీలతతో, విద్యతో, చట్టంతో మార్చదగిన వారుగా భావించారు. వారు వారి కుటుంబాలలో స్త్రీ పురుష సంబంధాలను మార్చ యత్నించారు. స్త్రీల పునరుజ్జీవనం కొరకు రూపొందించిన పథకాలలో స్త్రీలు భాగస్వామ్యులు కారు. తరచుగా స్త్రీలు తమ విముక్తిని వ్యతిరేకించేవారుగా చిత్రీకరించబడ్డారు. ఈ సంస్కర్తలు పితృస్వామిక అధికారాన్ని కోల్పోవడానికి గాని, సంపదని పునఃపంపిణీ చేయడానికి గాని సిద్ధపడినవారు కాదు. స్త్రీలు విద్యావంతులై, బాల్య వివాహం, సతి, బహుభార్యాత్వం లాంటి దురాచారాలు లేని సమాజాన్ని ఊహించారు. ఈ నూతన స్త్రీలు ఇంటికి, కుటుంబానికి తమ సర్వస్వాన్ని అర్పించేవారుగా ఉండాలని ఆశించారు.

### 19వ శతాబ్దపు 'అధునాతన స్త్రీ'

19వ శతాబ్దంలో స్త్రీల జీవిత నమూనా మారడం ప్రారంభమయింది. 'ఉత్తమ ఇల్లాలు' భావన పునర్నిర్వచించబడింది. మొదటిది: స్త్రీ జీవితంలోని వివిధ దశలలో నిర్వర్తించవలసిన కార్యకలాపాలలో మార్పులు వచ్చాయి. రెండవది: స్త్రీలు నిర్వర్తించవలసిన కార్యకలాపాల క్షేత్రం విస్తరించబడింది. మూడవది: స్త్రీ వ్యక్తిత్వానికి అధికాధికంగా గుర్తింపు లభించింది.

బ్రిటిషు వారు భారతదేశంపై సాధించిన విజయంతో వచ్చిన మార్పుల ఫలితంగా 19వ శతాబ్దాంతానికి చాలా మంది మహిళలు విద్యావంతులయ్యారు. స్వేచ్ఛగా భావాల్ని

వ్యక్తీకరించారు. ప్రజాపరమైన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కుటుంబ వ్యవహారాలలో స్త్రీ పురుషులు పాల్గొన్నారు. వలసాధిపత్యంతో పట్టణీకరణ, కొత్త వృత్తుల పెరుగుదలతో పని ఇంటి నుండి వేరుచేయబడింది.

ఈ మార్పుతో పాటు నూతన మత, విద్య, సామాజిక సంస్థలు స్థాపించబడ్డాయి. కుటుంబాలు గ్రామాలలోని ఇళ్ళనుండి పట్టణాలకు తరలడంతో బయటివారితో సంబంధాలు ఏర్పడ్డాయి. సాంప్రదాయ గృహకార్యకలాపాలు క్షీణించాయి. అంతకు ముందుతరం అబ్బాయిల లాగా అమ్మాయిలలో కొందరు విద్యాసంస్థలకు వెళ్ళారు. కొత్త తరహా మతపరమైన ఉత్సవాలలో పాల్గొన్నారు. కుటుంబంతో సంబంధం లేని సాంఘిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్త్రీ పురుషుల మధ్య ఎక్కువ సమానత్వం దిశలో స్త్రీ పురుష సంబంధాలను మార్చగోరే ఆధునీకరణ ఉద్యమంలో ఈ నూతన స్త్రీలు భాగం అయ్యారు.

ఈ కొత్త తరహా స్త్రీలలో చాలా మంది ముందు ఇళ్ళ వద్ద చదువుకొన్నారు. ఆ తరువాత బాలికల పాఠశాలలకు పంపించబడ్డారు. స్త్రీ విద్యపట్ల ఆసక్తిగల తల్లిదండ్రులు బిడ్డలకు వివాహ నిర్ణయం జరిగేవరకు చదివించారు. కొన్ని సందర్భాలలో పెళ్ళి అయిన తరువాత కూడా చదువు కొనసాగించేందుకు అనుమతించారు. ఎదిగిన తరువాత పెళ్ళి చేసుకున్న అమ్మాయిలు ఆ తరువాత పిల్లల్ని కన్నారు. పిల్లల పెంపకంలో ఎక్కువ శ్రద్ధ వహించగలిగారు. కొన్ని సందర్భాలలో స్వంతంగా నిర్ణయాలు చేసే అవకాశాలు లభించేవి. అలాంటి వారు చేయూతనిస్తే ఎదిగిన గడచిన తరం వారిలా గాక స్వశక్తితో సామాజిక స్థాయి పొందగలిగారు.

మహిళలు చేయగలిగిన అంశాలలో కూడా చాలా మార్పులు వచ్చాయి. మార్పు హఠాత్తుగా వచ్చిందిగాదు. శాశ్వతంగా నిలబడలేదు. కొద్దికాలం పాటు పాఠశాలలకు హాజరయిన స్త్రీలు, ఉత్సవానికి పరదా లేకుండా హాజరయిన స్త్రీలు ఇళ్ళకి తిరిగి వచ్చి తుచ తప్పకుండా ఆచార సాంప్రదాయాల్ని పాటించారు.

స్త్రీలు తమ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడానికి పెరిగిన అవకాశాలను గమనించారు. గతకాలంలో స్త్రీల జీవితాలను గురించి సాధారణీకరించడానికి కావలసినన్ని ఆధారాలు లేవు. సాధారణ విద్య, స్త్రీలను గురించి రచనలు చేసి స్త్రీలు చేపట్టిన ప్రచురణలు మహిళల గళం స్పష్టంగా వినిపించేలా చేశాయి. ఈ కాలంలో వచ్చిన సాహిత్యం మొత్తాన్ని గురించి చెప్పడం సాధ్యపడదు. కానీ బెంగాలీ స్త్రీలు నవలల నుండి స్వీయ చరిత్రల వరకు వైవిధ్యం గల 400 సాహిత్య రచనలు చేశారు. 21 పత్రికలు ప్రచురించారు. వారి రచనల ద్వారా పరస్పర సంబంధాలు పెట్టుకోగలిగారు; సామాజిక సంబంధాలను అభివృద్ధి పరచగలిగారు.

**ముగింపు:**

పురుష సంస్కర్తల లక్ష్యం అభివృద్ధి. మహిళల స్థాయిని గణనీయంగా పెంచేందుకు సామాజిక సంస్కరణ చేపట్టకపోతే పునరుజ్జీవనం విఫలం కాక తప్పదు. వలసపాలనతో న్యూనతకు గురయిన 19వ శతాబ్దం భారతీయులు బలం, శక్తి సమస్యలతో కష్టాలు కడగండ్లలోకి నెట్టివేయబడ్డారు. వారి పరాజయానికి దారితీసిన బలహీనతలకు వివరణ అవసరమైంది. వారు బలం ఎలా పుంజుకోవాలి అనే ప్రశ్నకు జవాబు కావాలి. మహిళల స్థాయి నాగరికతలో అనివార్య భాగమని, భారతీయ సాంప్రదాయాలు మహిళల స్థాయిని తగ్గించాయని 19వ శతాబ్దపు యూరోపియన్లు సిద్ధాంతీకరించారు. దీని నుండి భారతీయుల పరాజయానికి వివరణ లభించింది. సంస్కరణలు చేపట్టి మహిళాభ్యున్నతికి కృషి చేశారు.

బకించంద్ర ఛటోపాధ్యాయుని దేశభక్తియుత నవల అనందమఠం (1882)లో అవమానాలకు నిరాదరణకు గురయిన మాతృదేవత విషణ్ణవదనాన్ని గాంచిన ప్రజలు జాతీయ వాదులయ్యారు. తల్లి పునరుజ్జీవానికి అసువులు అర్పిస్తూ 'వందేమాతరం' నినాదం చేపట్టారు.

దేవతారాధన, మాతృభూమి పట్ల పూజ్యభావం, స్త్రీ విద్య మహిళల స్థాయిని పెంచడం అనేవి ఆధునిక మానవుని మూడు ప్రతిజ్ఞలు గావాలన్నారు. కానీ సమకాలినులు చేపట్టిన సంఘసంస్కరణ కార్యక్రమాలలో అత్యధికం జాతీయ పునర్నిర్మాణ కర్తవ్యాన్ని నెరవేర్చగలిగిన స్థాయిలో లేవని ఆయన భావించారు. మార్పు అత్యవసరం, కానీ పాశ్చాత్యుల మార్గదర్శకత్వంపై ఆధారపడరాదన్నారు. మేధావుల మార్గదర్శకత్వంలో ప్రజలలో మార్పు రావాలన్నారు.

1891 నాటికి విద్యావంతులు, ప్రముఖులు జాతీయ రాజకీయాలలో భాగస్వాములయ్యారు. మహిళా సమస్యలపై బ్రిటిషుపాలకులకు భారతీయ విద్యావంతులపై ఏకాభిప్రాయం లేదు. కానీ స్త్రీ సమస్యలు పూర్తిగా విస్మరించబడలేదు. 'నూతన మహిళలు' వారి సంస్థల్ని స్థాపించుకొనేందుకు సంఘ సంస్కరణ ప్రాధాన్యతను నిర్ణయించుకొనేందుకు ముందుకు వచ్చారు.

పురుష సంస్కర్తలు ప్రతిపాదించిన మార్పులు స్త్రీ సమస్యని పరిష్కరించజాలవు. వారి కుటుంబాలలోని స్త్రీలు తప్ప బయటి స్త్రీల జీవితాలపై వారికి గల అవగాహన చాలా తక్కువ. అంతేగాక ఈ సమస్యలపై చట్టాలు చేయబడినప్పటికి వాటి అమలుపై చాలా మందికి సందేహాలు ఉన్నాయి. అయినప్పటికి వీరు చేపట్టిన చర్యలు ఆధునీకరణ ఎజెండాలో మహిళల స్థాయిని మెరుగుపరచేందుకు తోడ్పడ్డాయి. వారి ప్రయత్నాలు నూతన తరం మహిళా నాయకుల నూతన సంస్థల స్థాపనకు మద్దతునిచ్చాయి.

**మధ్యతరగతి పెరుగుదల:**

1833 ఛార్టరు చట్టంలో అప్పటి వరకు వ్యాపార సంస్థగా ఉన్న ఈస్టిండియా కంపెనీ రాజకీయ సంస్థగా మార్చబడింది. భారతదేశంలో వర్తక వాణిజ్యాలు సాగించేందుకు యూరోపియన్లకు స్వేచ్ఛ లభించింది. యూరపు పెట్టుబడిదారులు భారతదేశంలో పెట్టుబడులు పెట్టారు. భారతదేశ దిగుమతి ఎగుమతులు విపరీతంగా పెరిగాయి. ఈ వాణిజ్యాభివృద్ధిలో భారతీయుల వాటాలు బహుస్వల్పం.

ఉన్న కొద్దిపాటివాటాలు మార్వాడీలకు, మొగలులకు, పార్శీలకు ఉన్నాయి. ఆ తరువాత స్థానం బెంగాలీలది. వర్తక వాణిజ్యాభివృద్ధితో నాయిబులు, గుమస్తాలు, బ్రోకర్లు, ఎకౌంటెంట్లు పెరిగారు. వివాదాలు పెరగడంతో లాయర్ల సంఖ్య పెరిగింది. విద్యావ్యాప్తితో ఉపాధ్యాయులు పెరిగారు. వీరితో పాటు డాక్టర్లు, యితర వృత్తుల వారు పెరిగారు. ఈ వృత్తుల వారందరూ కలసి మధ్య తరగతి సమాజంలో బలీయమైన శక్తి అయింది. బ్రిటిషు పాలన తీసుకొని వచ్చిన ముఖ్యమైన పరిణామం : గతానికి చెందిన పాలకవర్గాల ప్రాధాన్యత సామాజిక స్థాయి, అధికారం తగ్గిపోవడం; అదే సమయంలో కొత్త సామాజిక విభజనలు అభివృద్ధి చెందడం.

భారతదేశంలో బ్రిటిషు పాలన యొక్క అనివార్య ఫలితంగా ప్రత్యేకించి యూరపు వర్తకులతో మిషనరీలతో సన్నిహిత సంబంధాల కారణంగా భారతీయుల సామాజిక దృక్పథంలో, ఆలోచనలలో మార్పులు వచ్చాయి. మార్పు 18వ శతాబ్దం మధ్య భాగంలో ప్రారంభమయింది. 19వ శతాబ్దమంతా కొనసాగింది. భారతీయ సమాజంపై పాశ్చాత్య విద్య సంస్కృతుల ప్రభావం లోతుగా విస్తృతంగా పెరగడం కొనసాగింది. ఫలితంగా వచ్చిన మార్పు బెంగాల్‌లో ప్రారంభమయింది. దేశంలోని యితర ప్రాంతాలకు వ్యాపించింది.

గతంలో ఉన్న సామాజిక విభజనల స్థానంలో వర్గ విభజనలు రావడం మొదలయింది. సంపద, విద్య, వృత్తి వగైరాలలో తేడాలున్నప్పటికి వివిధ కులాలు మతాలకు చెందిన ప్రజలు క్రొత్త వర్గంగా – మధ్య తరగతిగా ఏర్పడ్డారు. పాశ్చాత్యదేశాలలో మధ్య తరగతి ఫ్యూడలిజం, చర్చి ఆధిపత్యాన్ని అంతమొందించి సామాజిక ఆర్థిక వ్యక్తి స్వేచ్ఛలను స్థాపించింది. భారతదేశంలో మధ్య తరగతి ఆయా రంగాలలో అభినందనీయమైన కృషి చేసింది. కానీ యూరపులో సాధించినంతగా విజయాలు సాధించలేకపోయింది. ఏమైనప్పటికీ భారతీయులలో జాతీయ వాదాన్ని వ్యాప్తి చేయడంలోను, దేశానికి స్వతంత్ర్యం సాధించడంలోను మధ్య తరగతి గణనీయమైన పాత్ర నిర్వహించింది.

భారతదేశంలో మధ్యతరగతి అభివృద్ధి చెందడానికి రెండు అంశాలు తోడ్పడ్డాయి.

1) అంతకముందు గల పాలకవర్గాన్ని రద్దు చేయడం వలన ఫ్యూడల్ మన:ప్రవృత్తి ప్రవర్తన అంతమయ్యాయి. 2) నూతన భూయాజమాన్య, వాణిజ్యపరమైన మేధావుల వర్గాలు పైకి వచ్చాయి. భారతదేశంలో యూరోపియన్ల వాణిజ్య పారిశ్రామిక కార్యకలాపాలు మధ్య తరగతి అభివృద్ధి చెందడానికి తోడ్పడ్డాయి. సహజంగా కలకత్తా, బొంబాయి, మద్రాసులలో మధ్య తరగతి మొదట అభివృద్ధి చెందింది. పాశ్చాత్య విద్య, పాశ్చాత్య ధృక్పథం, పాశ్చాత్య నగర జీవితం అభివృద్ధి పొందే అవకాశం లభించింది. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులు, ఎగుమతి దిగుమతుల వర్తక నిపుణులు మొదట కలకత్తాని తమ కార్యకలాపాల కేంద్రంగా చేసుకొన్నారు. సహజంగా ఈ మూడు ప్రెసిడెన్సీలలో కలకత్తాకి ఎక్కువ ప్రాధాన్యత ఉన్నది.

మధ్యతరగతి మొదటి పట్టణాలలో, నగరాలలో అభివృద్ధి చెందినప్పటికీ క్రమంగా గ్రామాలలో కూడా ఎదగడం ప్రారంభమయింది. శాశ్వత కౌలు విధానం ఫలితంగా ఒక్క బెంగాల్‌లోనే పెద్ద ఎస్టేటు దారులు 20 వేల మంది మాత్రమే ఉండగా చిన్న భూఖండాలు గలిగిన వారు ఒక లక్ష ముప్పదివేల మంది ఉన్నారు. పెద్ద ఎస్టేటు దారులు విలాస జీవితం కొరకు పట్టణాలు, నగరాలు చేరారు. కొద్దిపాటి భూములు కలిగిన వారు గ్రామాలలోనే ఉండిపోయారు. మధ్య తరగతి ఎదుగుదలకు వీరు మూలస్తంభాలు.

పాలనాపరమైన అవసరాల నిమిత్తం బ్రిటిషు వారు ఇంగ్లీషు విద్యని ప్రోత్సహించవలసి వచ్చింది. విద్యావంతులైన భారతీయులు కంపెనీ ఉద్యోగులుగా నియమింపబడ్డారు. అంతేగాక రోడ్లు, భవనాలు నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్లు, వర్తకుల వద్ద ఉద్యోగాలు చేసే యితరులు పట్టణ మధ్య తరగతిని పెంచారు; ఈ కాంట్రాక్టర్లు చిన్న వ్యాపారులు, దళారులు లాంటి వారు అంతగా విద్యావంతులుకానప్పటికీ డబ్బు సంపాదించారు; నోరు పెట్టుకుని బతికారు.

రాజనీతిజ్ఞులుగా, మేధావులుగా, జాతికి నాయకత్వం వహించగల వ్యక్తులుగా, మిలటరీలో అత్యున్నత పదవులు నిర్వహించగల సమర్థులుగా భారతీయులు ఎదగాలని బ్రిటిషువారు కోరుకోలేదు. అలాంటి సమర్థతలు గల వ్యక్తుల ఎదుగుదల భారతదేశంలో బ్రిటిషువారి ప్రయోజనాల రీత్యా అవాంఛనీయం. కానీ ఇంగ్లీషు విద్యనేర్చి సామాజిక పరిస్థితుల్ని అర్థం చేసుకున్న మధ్య తరగతి వారి హక్కులు, స్థాయి, అభివృద్ధి చెందవలసిన అవసరం పట్ల చైతన్య వంతులయ్యారు. భావవ్యక్తీకరణకు పాలకవర్గం కల్పించిన ఆటంకాలు వారిలో జాతీయ చైతన్యాన్ని పెంచాయి. జాతీయోద్యమానికి రంగాన్ని సిద్ధం చేశాయి. భారతీయుల సామాజిక, రాజకీయ ఆర్థిక విముక్తికి ఏకైక సాధనం విదేశీ పాలనకి చమరగీతం పాడడమేనని మధ్యతరగతి స్పష్టంగా గుర్తించింది.

# V

# సంస్కృతి

13

# భారతీయ భాషలలో ఆధునిక సాహిత్యావిర్భావం

## బెంగాలీ సాహిత్యం

### బెంగాలీ వచన రచన:

శీరాంపూర్ మిషనరీలు, ఫోర్ట్ విలయం కాలేజి ఆధునిక బెంగాలీ సాహిత్యాన్ని ప్రారంభించి, అభివృద్ధిపరిచారు. నథానియేల్ బి. హాల్‌హెడ్ 1778లో బెంగాలీ వ్యాకరణాన్ని ప్రచురించాడు. విలియం కాలే (1761–1834) బైబిల్‌ను 1801లో బెంగాలీ భాషలోకి అనువదించాడు. 19వ శతాబ్ద ప్రారంభంలో అభివృద్ధి పరచబడిన బెంగాలీ వచనం సంస్కృత, అరబిక్, పర్షియన్ పదాల సమ్మిశ్రితంగా వుంది.

మొదటి బెంగాలీ వచన గ్రంథం రాంరాం బాసు రచించిన రాజా ప్రతిపాదిత్య చరిత్ర 1801లో ప్రచురించబడింది. రచయిత తరువాత లిపిమాల అనే గ్రంథాన్ని రాశాడు. 1802లో మృత్యుంజయ విద్యాలంకార్ రచించిన బత్రిశ సింహాసన ప్రచురించబడింది. ఈ రచయిత హితోపదేశ్, రాజబలి, వేదాంత చంద్రిక, ప్రబోధ చంద్రిక లాంటి ఇతర గ్రంథాలను కూడ వ్రాశారు. రాజారామమోహనరాయ్ తన మొదటి వచన గ్రంథం 1815లో ప్రచురించారు. 1815–30 కాలంలో రాజారామమోహనరాయ్ బెంగాల్‌లో 30 పుస్తకాలు వ్రాశారు. ఉపనిషత్తులలో కొన్నింటిని అనువదించారు. బెంగాలీ వచనంలో భగవద్గీతపై వ్యాఖ్యానాలు రాశాడు.

తరువాత బకించంద్ర, శరత్‌చంద్ర చటర్జీ, రవీంద్రనాథ్‌ఠాగూర్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, ప్యారీచంద్రమిత్ర, టేక్‌చంద్ ఠాకూర్‌లాంటి వారు అగ్రగామి రచనలతో బెంగాలీ వచనాన్ని సుసంపన్నం చేశారు. అప్పటి నుండి బెంగాలీ వచనం సమూలమైన పరిణామం చెందింది. ఆధునిక బెంగాలీ వచన రచనకు ఆద్యుడుగా భావించబడుతున్న ఈశ్వరచంద్ర

విద్యాసాగర్ (1820–91) కాళిదాసు, భవభూతి, షేక్ స్పియర్ నాటకాలనాధారం చేసుకొని శకుంతల (1854), సీతావనవాసం (1860), భ్రాంతి విలాసం (1869) నాటకాలను వ్రాశాడు.

చారుచంద్ర బెనర్జీ (1876–1938) ఇందిరాదేవి (1880–1922) అనురూపాదేవి (1882–1958) నిరుపమాదేవి (1883–1951) సురేంద్రమోహన్ ముఖర్జీ (1884–1966) రాఖల్‌దాస్ బెనర్జీ (1885–1930) గోకుల్‌చంద్రనాగ్ (1895–1925) శైలజానంద ముఖర్జీ (1900–1976), విభూతి భూషణ్‌బెనర్జీ (1899–1950) రవీంద్రనాథ్ మైత్రా (1896–1933) రాజశేఖర్ బాబు (1880–1960) ప్రబోధ్‌కుమార్ సన్యాల్ (1907 జననం) సీతాదేవి (1896–1974) శాంతదేవి (1894 జననం) లాంటివారు 19, 20 శతాబ్దాలకు చెందిన ప్రముఖ బెంగాలీ రచయితలు, నవలాకారులు.

## నవలా సాహిత్య వికాసం

**పౌరాణిక జానపద సాహిత్యం :** బెంగాలీ సాహిత్య తొలిదశలో పౌరాణిక జానపద కథల నాధారం చేసుకొని సాహిత్య సృష్టి జరిగింది. మతం, ప్రేమ – కథావస్తువులు. 17వ శతాబ్దం కవిరూప్‌రాం చక్రవర్తి, ధర్మమంగళ్, భరత్‌చంద్ర, విద్యాసుందర్ ఉదాహరణలు.

**బకించంద్ర యుగం :** ఈకాలానికి చెందిన 'చంద్ర కాంత', కామినీ కుమార్ లాంటి పద్యాలలో వ్రాయబడిన కథలు పాఠకులకు ఊహాజగత్తును సృష్టించాయి. ప్యారీలాల్, మిత్రాయొక్క పథనిర్దేశం చేసిన అలాలేర్ ఘూరెర్ దులాబ్ అనే వచన కావ్యంతో నూతన యుగం ప్రారంభమయింది. కాని బకించంద్ర ఛటర్జీ తన ఉత్తమ రచన 'దుర్దేశనందిని' (1865) ప్రచురణతో పౌరాణిక, జానపద సాహిత్యానికి తెరదించాడు. బెంగాలీ సాహిత్య చరిత్రలో రమేష్‌చంద్రదత్ (1848–1909) చాలా ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఆయన సంసార (1886) సమాజ (1894) నవలలతో పాటు వంగ విజేత (1874) మాధవీ కంకణ (1877) మహారాష్ట్ర జీవన ప్రభాత (1878) రాజపుత్ర జీవన సంధ్య (1879) అనే నాలుగు చారిత్రక నవలలు వ్రాశాడు. బకించంద్రుని 'కపాల కుండల', 'దుర్గేశనందిని'ల కొనసాగింపుగా దామోదర ముఖర్జీ (1853–1907) మృణ్మయి (1874) నవాబ్‌నందిని నవలలు వ్రాశాడు. ఇంకా భూదేవ్ ముఖర్జీ (ఐతిహాసక, ఉపన్యాస, అంకురీయ, వినిమయ) సంజీవ్ చంద్ర ఛటర్జీ (కాంతామాల, మాధవీలత, జల్ ప్రితాప్‌చంద్) తారాకాంత్ గంగూలీ (స్వర్ణలత) శివంత శాస్త్రి (మేజ బావు, యుగాంతర) స్వర్ణ కుమారిదేవి (దీప నిర్వాణ, చిన్నాముకుల, మాలతి) ఈ కాలానికి చెందిన ముఖ్య రచయితలు.

**ఠాగూర్ :** సాహిత్యం వివిధ ప్రక్రియలతో సంపద్వంతమై సార్వత్రికతని సంతరించుకున్న కాలం. ఠాగూర్ కేవలం బెంగాలీ కవి, రచయిత మాత్రమే కాదు. ఆయన విశ్వకవి. ఠాగూర్ కథలు వస్తుపరంగాను, అభిరుచిపరంగాను, అభివ్యక్తి పరంగాను, సార్వత్రిక విలువల పరంగాను, సాహిత్యం యొక్క అంత:సౌందర్యం పరంగాను, వైవిధ్యభరితమైన

అత్యుత్తమ రచనలు. కుటుంబంలోనూ, సమాజంలోనూ గల ప్రజలకు సాహిత్యంలో ప్రాణప్రతిష్ట చేశాడు. ఆయన బెంగాలీ ప్రజలపై, సంస్కృతిపై పాశ్చాత్య ప్రభావాన్ని చక్కగా చిత్రీకరించాడు.

**శరత్:** శరత్‌చంద్ర ఛటర్జీ ఆధునిక బెంగాలీ సాహిత్యాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్ళాడు. తన రచనలలో సమాజం, మానవప్రేమ, విశ్వాసంలాంటి అంశాలను నొక్కి చెప్పారు. ఆయన పీడితుల పక్షం, స్త్రీల పక్షం వహించారు. ఆయన నిష్కల్మషమైన రచనా శైలి ప్రపంచ ప్రఖ్యాత నవలాకారులలో ఒకర్ని చేసింది. ఆయన నవలలు, కథలు, వివిధ వృత్తుల ప్రజానీకాన్ని ఆకట్టుకొన్నాయి. హరప్రసాద్ శాస్త్రి (1853-1931). కాంచనమాల (1916) 'బెనెర్‌మేయె' అనే రెండు చారిత్రక నవలలు రచించాడు. స్వామివివేకానంద కూడ సుప్రసిద్ధ బెంగాలీ రచయిత. ప్రాచ్య పాశ్చాత్య, భావర్ కథ, వర్తమాన భారత, పరివ్రాజక - ఆయన ప్రముఖ బెంగాలీ రచనలు. తారాశంకర్ బందోపాధ్యాయ, బాలచంద్ ముఖోపాధ్యాయ, అవధూత్, అక్షయ కుమార్ మైత్రేయి విమల మిత్రా లాంటి ప్రముఖులు శరత్ సాంప్రదాయంలో నవలా రచనలు చేసిన వారిలో కొందరు.

**బెంగాలీ సాహిత్య కారులు:**

**మైకేల్ మధుసూదన దత్తా (1824-73) :** బెంగాలీ సాహిత్య చరిత్రలో అత్యంత ప్రముఖులలో ఒకరు. థామస్‌మూరే, జాన్ కీట్స్ లాంటి ఇంగ్లీషు కవులచే ప్రభావితుడైన దత్తా బెంగాల్ సాహిత్య గతిని మార్చిన వాడు. సాహిత్యానికి కొత్త కోణాలు సమకూర్చిన వాడు. దత్తా వచన కవితాశైలి 'పద్మావతి' నాటకంతో మొదలయింది. శర్మిష్ఠ, కిసేన్‌కు మేరి, మాయకానన్‌లాంటి నాటకాలలోనూ 'ఎకేకీ బోలే సభ్యత' 'బోరో షాలికర్ ఘరేరో' లాంటి వ్యంగ్య నాటికల లోను కొనసాగించాడు. ఓ ప్రముఖ బెంగాలీ నాటక రచయిత రచించిన 'నీల్‌దర్పణ్'ని ఇంగ్లీషులోకి అనువదించాడు. 1860లో ఆయన వచన కవిత్వం తిలోత్తమ సంభవ్ కావ్యం కలకత్తా సాహిత్యంలో సంచలనం సృష్టించింది. ఆయన ఆధునిక కవితా కావ్యం 'మేఘనాథ్ బాధ్' కావ్యం విస్తృత ప్రజాదరణ పొందింది. ప్రజన్ గన కావ్య, వీరాంగనా కావ్య, కృష్ణకుమారి - ఆయన యితర ముఖ్య రచనలు.

**బకించంద్ర ఛటర్జీ (1838-94):** బకించంద్ర సాంప్రదాయ కుటుంబానికి చెందినవాడు. హుగ్లీ కాలేజీలో విద్యనార్జించాడు. బెంగాలీ సృజనాత్మక సాహిత్యంలో కల్పన, సాంప్రదాయకత, ఆత్మీయతలను ప్రవేశపెట్టి తనదైన శైలిని సృష్టించుకొన్నాడు. సాహిత్య జీవితం కవిగా ప్రారంభించాడు. త్వరలోనే సృజనాత్మక వచన రచన చేపట్టాడు. మొదటి రచన రాజమోహన్ భార్య ఇంగ్లీషులో చేశాడు. మొదటి బెంగాలీ నవల 'దుర్గేశ్‌నందిని' 1865లో ప్రచురించబడింది. తరువాతి నవల కపాలకుండల (1866) ప్రఖ్యాత నవలల్లో ఒకటి. మృణాళిని (1869), విషవృక్ష (1873), చంద్రశేఖర్ (1877), రజని (1877), కృష్ణకాంతర్ ఉల్ (1878), రాజసింహ (1881), ఆనందమఠ్ (1882), దేవిచౌదురాణి (1884), సీతారాం (1886) యితర రచనలు. ఆనంద మఠ్ దేశభక్తి సందేశాన్ని వ్యాఖ్యానించి

ప్రజల మనసులలో చెరగని ముద్ర వేసింది. తరువాత జాతీయ గీతమైన వందేమాతరాన్ని అందించింది. సాహిత్య ప్రచారం ద్వారా బెంగాలీ ప్రజల మేధస్సుకి ప్రేరణ కల్పించే లక్ష్యంతో 1872లో 'వంగ దర్శన్' మాసపత్రిక నడిపాడు. ఆయన మంచి వ్యాసాలు కూడా వ్రాశాడు. కమలకాంత (1885) ఆయన వ్యాస సంకలనం. ఆయన కృష్ణచరిత (1882), ధర్మతత్వాలు – మత విషయాలపై ఉత్తమ రచనలు.

**రవీంద్రనాథ్ ఠాగూర్ (1861–1941) :–** బహుముఖ ప్రజ్ఞావంతుడు, కవి, నవలా రచయిత, నాటక రచయిత, సంగీతవేత్త, కథానికా రచయిత, ఉపాధ్యాయుడు, చిత్రకారుడు, తాత్వికుడు, సంఘ, మత సంస్కర్త. అన్నింటిని మించి మహామానవతావాది. ఆయన సాహిత్య కృషి ఆరుదశాబ్దాలకు పైగా సాగింది. వేయికి పైగా కవితలు, రెండు డజన్ల నాటకాలు, నాటికలు, 8 నవలలు, 8 కథాసంకలనాలు, నాలుగు వేలకు పైగా పాటలు, సాహిత్య, సామాజిక, మత, రాజకీయ ఇతర అంశాలపై అసంఖ్యాకమైన వచన రచనలు. ఆయన స్వర పరచిన పాటలు రవీంద్ర సంగీత్‌గా ప్రసిద్ధిగాంచాయి.

రవీంద్రనాథ్ ఠాగూర్ 19వ శతాబ్దం ద్వితీయార్థంలో భారతదేశంలో నూతన చైతన్యం తీసుకొని రావడంలో ప్రముఖ పాత్ర నిర్వహించాడు. ఆయన జీవితం, సృజనాత్మక కృషి అప్పటి భారతీయ సమాజానికి లక్ష్యాన్ని, దిశని, కార్యక్రమాన్ని సమకూర్చాయి. ఆయన బహుముఖ ప్రజ్ఞా పాటవాలు బెంగాల్, భారతదేశంలోని యితర ప్రాంతాలలోనే గాక ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందాయి. ఆయన 1901లో అప్పుడున్న విద్యావిధానానికి వ్యతిరేకంగా నిరసనగా బోలాపూర్‌లో శాంతినికేతన్ విద్యా సంస్థని స్థాపించాడు. శాంతినికేతన్ విశ్వభారతిగా పరిణితి చెందింది.

రవీంద్రుని గీతాంజలికి 1912లో నోబెల్ బహుమతి లభించింది. నోబెల్ బహుమతి పొందిన మొదటి ఆసియా వాసి రవీంద్రుడు. 1915లో బ్రిటిష్ సామ్రాజ్యం ఆయనను (Knight) నైట్ బిరుదుతో సత్కరించింది. జలియన్ వాలాబాగ్ విషాద ఘటనకు నిరసనగా 1919లో రవీంద్రుడు నైట్‌హుడ్‌ను త్యజించాడు. రవీంద్రుని 'జనగణమన' భారతదేశానికి 'అమర్ సోనార్ బంగ్లా' బంగ్లాదేశ్‌కి జాతీయ గీతాలుగా స్వీకరించబడ్డాయి. రెండు దేశాలకు జాతీయ గీతాలు వ్రాసిన ఘనత ఒక్క రవీంద్రునికే దక్కింది. ఠాగూర్ మొదటి కవితా సంకలనం 'మానస' 1890లో ప్రచురింపబడింది. నవలాకారుడిగా ఠాగూర్ బెంగాల్ ఎగువ మధ్య తరగతిని నౌకాదుబి, చోకర్–బాలి, గోరా, ఘరేబైరే నవలలో ప్రామాణికంగా చిత్రీకరించాడు. చివరి రెండు నవలలు భారతీయ జీవితంపై పాశ్చాత్య ప్రభావాన్ని చిత్రించాయి.

ఠాగూర్ నాటకాలు వైవిధ్య భరితమైనవి. చిరకుమార్‌సభ, గోరేగూడ్, వైకుంఠ కథ లాంటివి సామాజిక హాస్య నాటకాలు. రాజా, ఫల్గుణి, రాస్తా కరాబి లాంటివి ప్రతీకాత్మక నాటకాలు. మాలిని, చండాలిక, నాటిర్ పూజలాంటివి కాల్పనిక నాటికలు. 'పోస్టాఫీసు'

ప్రతీకాత్మక నాటికగా భావించబడుతుంది. ఠాగూర్ యూరపు సంగీత రూపకాలను స్ఫురింపచేసే వాల్మీకి ప్రతిభ, మాయర్ ఖేలా లాంటి నాటకాలు చాలా వ్రాశారు.

**శరత్‌చంద్ర ఛటర్జీ (1876-1938):** శరత్ తన పెద్ద కథ (బడాదీది)ను, భారతి (1907) రెండు సంచికలలో ప్రచురించారు. బిందూర్ చేలే (1913) రామేర్ సుమతి (1914) అరక్షన్య (1916) లాంటి కథలు పాఠకుల హృదయాలలో చెరగని ముద్రవేసాయి. ఆయన తొలి రచనలపై బకించంద్ర చటర్జీ ప్రభావం ఎక్కువగా వుంది. దేవదాసు (రచన 1911, ప్రచురణ 1917) పరిణీత (1914) బిరాజ్ బావు (1914) పల్లి సమాజ్ (1916)ల కథావస్తువు , సంవిధానం బకించంద్రుని రచనలను స్ఫురణకు తెస్తాయి. కాని శరత్ సమకూర్చిన నేపథ్యం ఆధునికమైనది. భాష సరళం, సులభతరమైనది. శరత్ కథానికలపై నవలలపై ఠాగూర్ కథల, నవలల ప్రభావం - ప్రత్యేకించి చోఖేర్-బాలి, గోరా నవలల ప్రభావం కనిపిస్తుంది. 1913 వరకు గల శరత్ సాహిత్య జీవితంలోని మొదటి దశలో నాలుగు భాగాలుగా శ్రీకాంత్ (1917, 1918, 1927, 1933) చరిత్రహీనులు (1917) బిరాజ్ బావు (1914) పల్లిసుమాజ్ (1916), దేవదాసు మొదటి భాగం (తన మొదటి నవల) మొట్టమొదట ప్రచురించిన చిన్నకథ మందిర్ (1904) లాంటిముఖ్యమైన రచనలు చేశారు. రెండవదశలో అత్యంత పెద్ద నవల గృహదాహ (1919) రచించారు. దత్తా (1917-19) దేనా-పానా(1923), పథేర్ ధాబి (1926), విప్రదాస్ (1935), శేషప్రశ్న (1931) లాంటి కాల్పనిక ప్రేమకథలు కూడా వ్రాశాడు. శరత్ రచనలన్నీ అన్ని ప్రధాన భారతీయ భాషలలోకి పలుమార్లు అనువాదం చేయబడ్డాయి.

**విభూతి భూషణ్ బెనర్జీ (1899-1950):**

బెనర్జీ 1922 నుండి కథానికలు వ్రాస్తువున్నప్పటికి ఆయన మొదటి నవల పథేర్‌పాంచాలి (1929) విచిత్రలో ప్రచురించబడిన తరువాత ప్రముఖ రచయితగా గుర్తింపు లభించింది. స్వీయ జీవిత కథ ఆధారంగా పథేర్ పాంచాలి, దాని కొనసాగింపుగా రచించిన అపరాజిత నవలలు, పాఠకుల హృదయాలలో కలకాలం ఉంటాయి. దృష్టప్రదీప్ (1935), అరణ్యక్ (1949), ఆదర్శ హిందూహోటల్ (1940), విపినర్ సంసార్ (1941), దేవయాన్ (1944) ఇచ్ఛామతి (1949) బెనర్జీ ఇతర నవలలో కొన్ని. ఉమారాణి (1922), పూయిామాంచా (1925) ఆయన మంచి కథలు. బెనర్జీ కథా సంకలనాలు మేఘమల్లార్ (1931) మౌరిఫూల్ (1932) జాత్రబాదల్ (1934) గ్రంథాలుగా వెలువడ్డాయి. ప్రకృతి పట్ల బెనర్జీకి గల ప్రేమను అరణ్యక్ ప్రతిఫలిస్తుంది.

**జీవనానంద దాస్ (1899-1954):**

నూతన కవితారీతికి చెందిన దాస్ తొలి రచనలు సత్యేంద్రనాధ్ దత్తా, కాజినజ్రుల్ ఇస్లాం కవితల నమూనాలో వుంటాయి. తొలి కవితల సంకలనం ఝూరపాలక్ (1928) గ్రంధంగా వెలువడింది. తనకు మొదట గుర్తింపు తెచ్చిన కవితా సంకలనం ధూసర్ పాండు

లిపి. 1936లోని చాలా కవితలు తొలుత ప్రగతి (1927-30) పత్రికలో, మిగిలినవి కొల్లోల్ యితర పత్రికలలో ప్రచురించబడ్డాయి. వనలత సేన్ (1942), మహా ప్రీతిబి (1944), సత్తి తారర్ తిమిర్ (1948), శ్రేష్ఠకవిత (1954) దాస్ ఇతర కవితా సంకలనాలు. దాస్ సాహిత్య విమర్శ వ్యాసాలు కవితా కథ (1956)గా ప్రచురింపబడింది.

**కాజినజ్రుల్ ఇస్లాం (1899-1976):**

నజ్రుల్ ఇస్లాం కవి, కథారచయిత, వక్త, పత్రికా సంపాదకుడు, నటుడు, స్వాతంత్ర్య యోధుడు, రాజకీయ కార్యకర్త, గేయరచయిత. కొత్త రాగాలను, తాళాలను రూపకల్పన చేసిన సంగీత కారుడు. ఇస్లాం మొదటి రెండు కవితలు ప్రళయోల్లాస్, విద్రోహ్‌లు 1922లో ప్రచురితమయ్యాయి. ఆయన మొదటి కవితా సంకలనం 'అగ్నివీణ' అదే సంవత్సరము ప్రచురింపబడింది. విశేషాదరణ పొందింది. అగ్నివీణ తరువాత ప్రాచుర్యం పొందిన కవితల గేయాల సంకలనాలు : దోలోచంప (1923) బిజర్ బన్సి (1924), భంగర్‌గన్ (1924), పూబర్ హోయ (1925), బుల్‌బుల్ (1928) కవితల, గేయాల, కథల, నాటకాల, గ్రంథాలు 20 ప్రచురించారు. సామాన్య మానవుని జీవితంలోని కటువైన వాస్తవికతను సాహిత్యంలో ప్రవేశపెట్టాడు. సామాజిక జీవితంలోని అన్నిరకాల అణచివేతపై దృష్టి సారించాడు. 2680 కి పైగా పాటలు వ్రాశాడు, స్వరపరిచాడు.

**మాణిక్ బెనర్జీ (1908-1956):**

1935లో తన దివారాత్రి కావ్యం 'వంగశ్రీ'లో ప్రచురింపబడడం ద్వారా సాహితీ ప్రియులకు పరిచమయ్యాడు. 1936లో 'పుతుల్‌నాచే ఇతికథ' వ్రాశాడు. ఈ రెండు నవలలతో రచయితగా స్థిరపడ్డాడు. బెనర్జీ యితర ప్రముఖ నవలలు, కథాసంకలనాలు: జనని (1935), అతసీమమి(1935) పద్మవాడి మాజి (1936) ప్రగతి హాసిక్ (1937) మోహిఓ మోటా కహిని (1938) శహర్తాలి (1940-41) హోలు ద్పోడ (1945), చతుష్కోణ్ (1948) సోసార్ చేయే దామి (1951-52), హరస్ (1954), హోలుద్‌నాడి సాబుజ్ బన్ (1956).

**హిందీ సాహిత్యం:**

**హిందీ కవిత్వం:** హిందీ సాహిత్యంలో ఆధునిక యుగం 19వ శతాబ్దపు మధ్య భాగంలో ప్రారంభమయింది. ఈ కాలం నాటి ముఖ్యమైన పరిణామం 'ఖరిబోలి (వాడుకభాష) వచనం వికాసం చెందింది. కవిత్వములో కూడా 'బ్రజ్‌భాష' (గ్రాంధిక భాష) స్థానంలోకి ఖరిబోలి (వ్యవహారిక భాష) విస్తృతంగా జొచ్చుకవచ్చింది. హిందీ కవిత్వం అభివృద్ధిని నాలుగు దశలుగా విభజించవచ్చు. భరతేందు లేక పునరుజ్జీవ యుగం (1868-1893) ద్వివేదియుగం (1893-1918) ఛాయావాదయుగం (1918-1937) 1937 నుండి సమకాలీన యుగం.

**భరతేందు యుగం (1868–1893):** హిందీసాహిత్యంలో ఆధునిక దృక్పథాన్ని ప్రవేశపెట్టిన భరతేందు హరీష్ చంద్ర ఆధునిక హిందీ సాహిత్యానికి ఆద్యుడు. ప్రతాప్ నారాయణమిశ్రా, బాలకృష్ణ భట్టా, బద్రీనారాయణ చౌదురి, సుధాకర్ ద్వివేది – ఈ దశకి చెందిన ఇతర ప్రముఖులు.

**ద్వివేది యుగం (1893–1918):** హిందీ వచన రచన శైలికి నూతన ఒరవడి దిద్దిన మహావీర్ ప్రసాద్ ద్వివేది ఆధునిక హిందీ వచన రూపశిల్పి. ఈ కాలంలో కవితా మాధ్యమంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలు చిత్రించబడ్డాయి. నాధూరాం శర్మ శంకర్ (1859–1932) అయోధ్యా సిన్హా ఉపాధ్యాయ్ (1865–1947) మైథిలీశరణ్‌గుప్త (1886–1964) రాంనరేష్ త్రిపాఠి (1889–1962) గోపాల శరణ సిన్హా (1891–1960) ఈకాలానికి చెందిన ఇతర ముఖ్య రచయితలు. మైథిలీ శరణ గుప్త తన జయద్రధ వధ (1910), పంచవటి (1925), సాకేత్ (1931), యశోధర లాంటి సుదీర్ఘమైన కథా కవితలతో ఐతిహాసిక సాంప్రదాయాన్ని పునరుద్ధరించాడు. ఆయన మధుసూదనదత్ యొక్క మేఘనాథ్ వధని హిందీలోకి అనువదించాడు. ఉపదేశాత్మకయుగంగా వర్ణింపబడిన ఈ కాలం భరతేందు యుగానికి ఛాయా వాద యుగానికి మధ్య వారథిగా పనిచేసింది.

**ఛాయావాద యుగం (1918–1937):** హిందీ కవిత్వంలో ద్వివేదియుగం తరువాత ఛాయావాదం రూపంలో నూతన కాల్పనిక కవితా కెరటం లేచింది. ఈ నూతన కవితోద్యమం సౌందర్యోపాసక వస్తుగత ఉద్యమంగా వర్ణించబడింది. సాంప్రదాయకత ఉపదేశాత్మకతలపై తిరగబడింది. మఖన్‌లాల్ చతుర్వేది (1888–1968), బాలకృష్ణ శర్మ, నవీన్ (1897–1959), సియారాం శరణ్‌గుప్త, జయశంకర ప్రసాద్, సూర్యకాంత్ త్రిపాఠి 'నిరాలా' (1897–1963), సుమిత్రానందన్ పంత్ (1900–1977), మహాదేవివర్మ, సుభద్రాకుమారి చౌహాన్ (1904–1948) ఇతర ప్రముఖ ఛాయా వాద కవులు. హిమకిరీటిని, హిమ తరంగిణి – మఖన్ లాల్ చతుర్వేది ముఖ్య రచనలు. నిరాలా యొక్క శక్తివంతమైన కవిత్వం జూపాకి కలి, పరిమళ, అనామిక, అర్చన, ఆరాధనలలో ప్రతిఫలించింది. సుమిత్రానందన్ పంత్ పల్లవ, గుంజానా, యుగవాణి, గ్రామ్య, స్వర్ణకిరణ,శిల్పి, లోకాయతన లాంటి కవితలతో సహా అనేక ముఖ్యమైన రచనలు చేశాడు. ఛాయావాద కవితోద్యమానికి చెందిన ఇతర ముఖ్యమైన రచనలు: జయశంకర్‌ప్రసాద్ యొక్క కామాయని, ఝూర్నా, ఆంశూ–లహర్, మహాదేవివర్మ యొక్క రష్మి (1932), నిరాజా (1934), సంధ్యగీత (1936),. యమ (1940), దీపశిఖ (1942); నవీన్‌యొక్క క్వాసి, అపాలక, గుప్తా యొక్క గాంధీ, అన్‌ముక్త, నకుల, మృణ్మయి; సుభద్రాకుమారి చౌహాన్ యొక్క ఝూన్సీకి రాణి, ముకుల్ (1931), ఉన్మాదిని.

**సమకాలీన యుగం (1937 తరువాత):** ఛాయావాదం క్షీణించడంతో హిందీ కవిత్వంలో పలు విభిన్న కవితోద్యమాలు ముందుకు వచ్చాయి. వాటిలో ప్రముఖమైనది ప్రగతి వాద లేక అభ్యుదయ కవితా ఉద్యమం. బాలకృష్ణశర్మ నవీన్ (1897–1960), భగవతి చరణ్ వర్మ (జననం1903), రాంధారి సింగ్‌దినకర్ (జననం 1908), రామేశ్వర్

శుక్లా 'అంకాలా' (జననం 1915), నరేంద్ర శర్మ (జననం 1916) – ఈ ఉద్యమానికి తమ రచనల ద్వారా ప్రచారమిచ్చారు. హరివంశరాయ్ బచన్ (జననం 1907) హిందీకవితా ప్రపంచాన్ని తన మూడు కవితా సంకలనాలు మధుశాల (1935) మధుబాల (1936) మధుకలశ్ (1936)ల ద్వారా సుసంపన్నం చేశాడు. బచన్ కవిత్వం ఛాయా వాదానికి, ప్రగతి వాదానికి భిన్నమైనది. దీనిని 'హృదయవాద' లేక అనుభూతి వాద కవిత్వం అన్నారు. ఆ తరువాత ప్రయోగవాద కవిత వచ్చింది. దీనినే తరువాత కాలంలో నయీ కవిత అన్నారు. ఈ ధోరణికి ఎస్. హెచ్. వాత్సాయన్, అజ్ఞేయ (జననం (1911), శివమషళ్ 'సుమన్' (జననం 1916), గిరిజా కుమార్ మాధుర్ (జననం (1917), గజానన్ మాధవ్ ముక్తి బోధ్ (1918–1964), ధరమ్ వీర్ భారతి (జననం (1926), నిర్మల్‌వర్మ ఇతరులు ఆద్యులు. ఆ విధంగా హిందీ కవితా చరిత్ర వెయ్యి సంవత్సరాలకు పైగా విస్తరించి వుంది.

## హిందీ వచనం:

**మొదటి దశ:** (1868–1918) హిందీ వచన రచన అభివృద్ధి మూడు కాలాలకు చెందినదిగా వర్గీకరించబడింది. మొదటిదశ (1868–1918), అభివృద్ధి దశ (1918–37), ప్రస్తుత దశ (1938 తరువాత). భరతేందు, ద్వివేదిల వచన సాహిత్య యుగం మొదటిదశకి చెందింది. ఈ కాలానికి చెందిన రచయితలు నాటకం, నవల, కథానిక, వ్యాసం, సాహిత్య విమర్శ ప్రక్రియలను అభివృద్ధి పరచారు. భరతేందు, హరీష్‌చంద్ర, బాలకృష్ణ భట్, రాధాకృష్ణదాస్ ఈ కాలానికి చెందిన ప్రముఖ రచయితలు.దేవకీనందన్ ఖత్రి (నవలాకారుడు) చంద్రధర్ శర్మ గులేరి (కథానికా రచయిత) మహావీర్‌ప్రసాద్ ద్వివేది (వ్యాసరచయిత) పద్మసింగ్‌శర్మ (విమర్శకుడు) – ఈ కాలానికి చెందిన ఇతర ప్రముఖ రచయితలు.

**రెండవదశ:** ఈ దశ అభివృద్ధికి జయశంకర్ ప్రసాద్ (ఛాయ ఆకాష్ దీప్) రామకృష్ణదాస్, మహాదేవి వర్మ ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రేమచంద్ (1880–1936) అత్యంత ప్రతిభా సంపన్నుడైన కథకుడు, నవలా రచయిత. సేవాసదన, ప్రేమాశ్రమ, నిర్మల, కాయకల్ప, రంగ భూమి, గబన్, గోదాన్ – ప్రేమ్‌చంద్ రచనలలో ముఖ్యమైనవి. ఆయన చివరి నవల 'గోదాన్' అన్ని భారతీయ భాషలలోకి అనువదించబడింది.

**మూడవదశ:** (1938 తరువాత): ఆధునిక కథ, నవలా రచయితలలో ముఖ్యులు: జై నేంద్రకుమార్ (సునిత త్యాగపత్ర, సుఖధ, వైవర్త), ఫణీశ్వర్‌నాథ్ రేణు (మైలాంచల్), సచిదానంద వాత్సాయన్ (శేఖర్ ఏక్ జీవని), ధర్మవీర్ భారతి (సూరజ్ కా సత్వన్ ఘోద), యశ్‌పాల్ (దాదా–కామ్రేడ్, దేశద్రోహి, దివ్య మనుష్యకే రూప్), జగదాంబ ప్రసాద్ దీక్షిత్ (ముర్దాఘర్), రాహిమసూం రాజా (ఆధా గావ్). డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ నామ్ వార్‌సింగ్ ప్రముఖ విమర్శకులు. ప్రముఖ ఆధునిక నాటక రచయితలు: ఉపేంద్రనాథ్ 'అస్క్', జగదీశ్‌చంద్రమాధుర్ (కోణార్క్), లక్ష్మీనారాయణ్ లాల్ (సుఖ్‌సరోవర్), మోహన్ రాకేష్ (ఆసదాకా ఏక్ దిన్, లహరోంకే, రాజహంస, ఆధే ఆధూరే).

## హిందీ సాహిత్య ప్రముఖులు:

**మున్షీ ప్రేమ్‌చంద్ (1880-1936):** అసలు పేరు ధన్‌పతిరాయ్. హిందీ, ఉర్దూ కథ, నవలా సాహిత్యంలో అత్యంత ప్రముఖుడు. సేవాసదన్, ప్రేమాశ్రమ, నిర్మల, కాయకల్ప, రంగభూమి (1925), కర్మభూమి (1932), గబన్, గోదాన్ (1936) ప్రముఖ రచనలు. ఆయన చివరి నవల గోదాన్ భారతీయ గ్రామీణ జీవితాన్ని అత్యంత ప్రతిభావంతంగా చిత్రించిన నవల. అన్ని భారతీయ భాషలలోనే గాక చాలా విదేశీ భాషలలోకి అనువదించబడింది.

**మైథిలీ శరణ్ గుప్త:** వ్యవహారిక భాషా కవిత్వానికి అగ్రగామిగా భావించబడుతున్న మైథిలీ శరణ్ గుప్త తన జయద్రద వధ (1910) పంచవటి (1925) సాకేత్ (1931) యశోధర (1932) లాంటి సుదీర్ఘ కథా కవితల ద్వారా ఐతిహాసక సాంప్రదాయాన్ని పునరుద్ధరించారు. ఆయన మధుసూదనదత్ యొక్క మేఘనాధవధని హిందీలోకి అనువదించారు. 57 ఏళ్ళుగా సాగిన సాహిత్య జీవితంలో 49 సంకలనాలు,17 కవితల నాటకాల అనువాదాలతో సహా మొత్తం 60కి పైగా గ్రంధరచనలు చేశారు. జాతీయ కవి బిరుదుతో ఆయనగౌరవ పురస్కారాలు అందుకొన్నారు.

**జయశంకర ప్రసాద్ (1889-1937):** హిందీ కవిత్వంలో ఛాయావాద ఉద్యమ అగ్రగాములలో ముఖ్యుడు. హిందీ వచన రచన అభివృద్ధికి కృషిచేశాడు. ఆయన ప్రముఖ రచనలు, ఛాయ, ఆకాష్‌దీప్, లహర్, కామయాని (1936), ఆంశు-కాముక.

**సూర్యకాంత్ త్రిపాఠి 'నిరాలా' (1899-1961):** నిరాలా తిరుగుబాటు కవిగా ప్రసిద్ధి గాంచాడు. జూహికీ కలీ, పరిమళ, అనామిక, అర్చన, ఆరాధన, అపార లాంటి ప్రసిద్ధరచనలతో ప్రచురించిన 12 కవితా సంకలనాలలో శక్తివంతమైన కవిత్వరచన చేశాడు. పలు కధానికలు, వ్యాసాలు, విమర్శలు వ్రాశాడు. సంస్కృత, బెంగాలీ భాషలనుండి చాలా అనువాద రచనలు చేశాడు. ఆధునిక హిందీ వచనంలో కవితాశైలిని ప్రవేశపెట్టాడు.

**సుమిత్రానందన్ పంత్ (1900-77)**: కవి, నాటక రచయిత, వ్యాస రచయిత. పల్లవ, గుంజాన్, యుగవాణి, గ్రామ్య, స్వర్ణ కిరణ, శిల్పి, లోకయాతన లాంటి ప్రముఖ రచనలతో సహా 28 గ్రంథాలు ప్రచురించాడు. పద్మభూషణ్ (1961), జ్ఞానపీఠ్ అవార్డు (1968), సాహిత్య అకాడమి అవార్డు, సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు లాంటి పలు ప్రతిష్టాత్మకమైన గౌరవపురస్కారాలు స్వీకరించారు. 1918-1925 మధ్య కాలంలో వ్రాసిన 32 కవితల సంకలనం పల్లవ్ ఆయన రచనలలో అత్యుత్తమమైనది.

**యష్పాల్ (1903-76):** నవలా రచయితగా హిందీ సాహిత్యంలో ప్రసిద్ధుడు. జూటా సచ్ (1958-60), దాదా-కామ్రేడ్, దేశద్రోహి, దివ్య మనుష్యకే రూప్ లాంటి గొప్ప నవలలు వ్రాశాడు. అనువాదరచనలు గాక 42 గ్రంథాలు ప్రచురించాడు.

**మహాదేవి వర్మ (1907-87):** ఆధునిక హిందీ కవిత్వంలో ఛాయావాద ఉద్యమ నాలుగు స్తంభాలలో ఒకరు. ఆమె ప్రముఖ రచనలు: రష్మి (1932) నీరజ (1934), సంధ్యాగీత

(1936), యమ (1940), దీపశిఖ (1942), బాలికల విద్యను ప్రోత్సహించేందుకు అలహాబాద్‌లో 'ప్రయోగ మహిళా విద్యాపీఠ్' స్థాపించారు. ప్రముఖ స్వాతంత్ర్యపోరాట యోధురాలు. జ్ఞాపకాలు,అతీతకే చలీసిత్ర, స్మృతికీ రేఖాయేం గ్రంథాలు ఆమెకు చాలా పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి. ఆమె మార్మిక వాదం రహస్యవాద ఉద్యమానికి దారితీసింది.

**రామ్‌ధారి సింగ్ దినకర్ (1908-74):** స్వాతంత్ర్యం రాక ముందు వ్రాసిన జాతీయవాద కవిత్వంతో ప్రముఖుడయ్యాడు. ఛాయావాద కవుల బృందానికి చెందిన దినకర ప్రసిద్ధ కావ్యం ఊర్వశి (1961), జ్ఞానపీఠ అవార్డు గ్రహీత (1972).

**ఎస్.హెచ్.వాత్సాయన అగ్నేయ (1911-87) :** హిందీలో ఆధునిక కవిత్వం, కథ, నవల, విమర్శ, జర్నలిజంలకు ఆద్యుడు. హిందీలో నయీ కవిత ఉద్యమ రథసారథులలో ముఖ్యుడు. చాలా సాహిత్య పత్రికలకు సంపాదకుడు. దినమన్ అనే స్వంత పత్రికను ప్రారంభించాడు. సాహిత్య అకాడమీ అవార్డు, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, భారత భారతి అవార్డు, అంతర్జాతీయ స్థాయి గోల్డెన్ రెత్ అవార్డు లాంటి పలు గౌరవ పురస్కారాలు స్వీకరించారు. ఆమ్ గాన్‌కే ప్యార్ ద్వారా 'చక్రాంతశీల' తో సహా పలు ప్రముఖ రచనలు చేశారు.

**విష్ణు ప్రభాకర్ (జననం1912) :** చాలా కథానికలు, నవలలు, నాటకాలు యాత్రావర్ణనలు వ్రాశారు. తన 'అర్ధనారీశ్వర' నవలలకు సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. ఆయన రచించిన ప్రముఖ బెంగాలీ నవలాకారుడు శరతచంద్ర చటర్జీ జీవిత చరిత్ర 'ఆవరమాసిహ' హిందీ సాహిత్యంలో వచ్చిన మూడు అత్యంత గొప్ప జీవిత చరిత్రలలో ఒకటి.

**ఫణీశ్వర్‌నాథ్ 'రేణు' (1921-77) :** ప్రేమ్‌చంద్ తరువాత కాలపు ముఖ్య నవలాకారులలో ఒకరు. ఆయన ప్రముఖ నవల మైల ఆంచల్ (1954)

**మోహన్ రాకేష్ (1925-72)** : కవిత్వం, నవల, కథానిక, యాత్రా వర్ణనలు, విమర్శ, జ్ఞాపకాలు, నాటకం లాంటి వైవిధ్యభరితమైన ప్రక్రియలు చేపట్టి గణనీయమైన కృషిచేశాడు. 1950లలో వచ్చిన నయీ కహాని ఉద్యమ అగ్రగాములలో ఒకరు. ఆషాఢ కా ఏక్ దిన్ (1958), 'ఆధే అధూరే, లెహరోంకే, రాజహంస' ప్రజాదరణ పొందిన నాటికలు.

**నిర్మల్ వర్మ (జననం 1929):** 'నయీ కహాని' ఉద్యమ అగ్ర గాములలో ఒకడు. ఆయన రచించిన నాలుగు నవలలు, ఆరు వ్యాస సంకలనాలు, సాహిత్య విమర్శ ఎన్నదగినవి. కవ్వే ఔర్ కాలాపానీ (1983) వర్మ ప్రచురించిన శక్తివంతమైన కథల సంపుటి.

**రఘువీర్ సహాయ్:** ఆయన చేయి దిరిగిన కవి, అనువాదకుడు, కథానికా రచయిత, పత్రికా రచయిత, దినమన్ పత్రిక సంపాదకుడు. 'లోగ్ భూల్ గయే హై' (1982), ఆత్మహత్య కే విరుద్ధా (1967) ప్రముఖ రచనలు.

**ఉర్దూ సాహిత్యం:**

**వివిధ దశలు, రూపాలు:**

19వ శతాబ్దం చివరి నుండి యిప్పటి వరకు వచ్చిన ఆధునిక ఉర్దూ సాహిత్యాన్ని రెండు దశలుగా విభజించవచ్చు. 1) సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ ప్రారంభించిన అలీఘర్‌ఉద్యమ కాలం. 2) సర్ మహమ్మద్ ఇక్బాల్ ప్రభావితం చేసిన కాలం అభ్యుదయ ఉద్యమం, హల్కా-ఎ-అర్‌బాబ్-జౌక్, ఆధునిక, ఆధునికానంతర వాద రచనా కాలం.

**అల్తాఫ్ హుస్సేన్ హాలి (1837-1914) :** ఉర్దూ కవిత్వంలో ఆధునిక స్ఫూర్తిని ప్రవేశపెట్టినవారు. 'దివాన్-ఎ-హాలి' 'ముసద్దాస్-ఎ-హాలి' (1879) 'షక్వ-ఎ-హింద్' (1887), 'మునాజత్-ఎ-బేవ' (1886) 'చుప్‌కీదాడ్' (1905) - ఆయన ప్రముఖ రచనలు. ఆయన వ్రాసిన హయత్-ఏ-సాది, హయాత్-ఏ-జవీద్ జీవిత చరిత్రలలో విమర్శనా దృక్పథాన్ని ప్రవేశపెట్టాడు. హాలి ఆధునిక విమర్శకు ఆద్యుడు. ఆయన 'ముకుద్దమ్-ఎ-'షేర్-ఒ-షహారీ' ఉర్దూ విమర్శకు పునాదిరాయి.

**షిబ్లి నొమాని (జననం 1857):** ఆధునిక చరిత్ర రచనకు ఆద్యుడుగా భావించబడతాడు. ఆయన చరిత్ర పరిశోధన ఆధారంగా ప్రత్యేకించి ఇస్లామిక్ చరిత్ర ఆధారంగా సీరత్-ఉన్-నొమాన్ (1892) అల్‌ఫరూఖ్ (1899) లాంటి పలు రచనలు చేశారు. ఆయన ఇంకా స్వనిహ్ ఉమరీ మౌలానా రుమ్, ఇల్‌ముల్ కలాం (1903), మువజిన-ఎ-ఆనిస్-ఒ-దాబిర్ (1907) షేర్ ఉల్ అజాం (1899) లాంటి ముఖ్య రచనలు చేశారు. మహమ్మద్ హుస్సేన్ అజాద్ ఈ కాలానికి చెందిన ప్రముఖ కవి, రచయిత. ఆధునిక ఉర్దూ కవిత్వానికి పునాది వేసిన వాడు. అబ్-ఎ-హయాత్, సుఖందన్-ఎ-పార్స్, దర్బార్-ఎ-అక్బరీ, నజమ్-ఎ-అజాద్ లాంటివి సాహిత్యంలో కాలానికి నిలబడగలిగే రచనలు.

ఆధునిక కాలానికి చెందిన ప్రముఖ కవులలో సయ్యద్ అక్బర్ హుస్సేన్ అక్బర్ అల్హాబాది (1846-1921) ఒకరు. ఆయన వ్యంగ్య హాస్య కవితల్ని ఆశువుగా చెప్పారు. మరొక ప్రముఖ కవి ఖుషి మహమ్మద్ నజీర్ (1846-1921) జోగి, పానీమే రచనలు చేశారు. ఇతర ప్రముఖ కవులు మహమ్మద్ ఇక్బాల్ (1873-1938), దుర్గా సహాయ్ సురోర్ (మరణం 1910) మహమ్మద్ ఆలి జవహర్ (మరణం 1931) హజరత్ మోహాని (మరణం 1951).

**మరాఠీ సాహిత్యం**

**వివిధ కాలాలు-రూపాలు:**

మరాఠీ సాహిత్యం యొక్క ఆధునిక కాలాన్ని నాలుగు కాలాలుగా విభజించవచ్చు. మొదటిది 1800-1885. రెండవది 1885-1920; మూడవది 1921-1945, నాల్గవది

1946 నుండి నేటి వరకు. ఈ కాలంలో శాస్త్ర సాంకేతిక సాహిత్యంతో సహా పద్యం, గద్యం – అన్ని రూపాలు అభివృద్ధి చెందాయి.

ఇంగ్లీషు గ్రంథాల నుండి మరాఠీ లోకి అనువాదాలు చేసేందుకు చాలా ప్రయత్నాలు జరిగాయి. ఛాత్రే, బాలశాస్త్రి జాంబేకర్ (1810–1846) లోకహితవాది, కృష్ణహరి చిప్లూంకర్, జ్యోతిబాపూలేలు మరాఠీలో పలు అంశాలపై రచనలు చేశారు. మొదటి మరాఠీ నిఘంటువు, వ్యాకరణం 1829లో వెలువడ్డాయి. మొదటి మరాఠీ వార్తా పత్రిక 1835లో ప్రారంభించబడింది. 1880–81 'కేసరి' వార్తా పత్రిక ప్రారంభం. ఆధునిక మరాఠీ సాహిత్యాభివృద్ధికి మంచి ప్రోత్సాహాన్నిచ్చింది.

కేశవసుత (1866–1905) ఆధునిక మరాఠీ కవితా ఉద్యమాన్ని 1885లో ప్రారంభించారు. 1923 నాటికి మాధవ్‌జులియన్ (1894–1939) కొందరు కవుల్ని చేర్చి 'రవికిరణ్ మండలి'అనే కవుల సంఘాన్ని స్థాపించారు. ఈ సంఘం మరాఠీ సాహిత్య రంగంలో ప్రముఖ పాత్ర నిర్వహించింది. మాధవ జులియన్ కథా కవిత 'విరహతరంగ' ప్రత్యేకంగా పేర్కొనదగిన కావ్యం. బి.ఆర్.టాబే (1874–1941) చంద్రశేఖర్ గోరే (1871–1937) మనోరామ్‌బాయి రనడే (1896–1926)లు రవికిరణ్ మండలి వెలుపల నున్న ప్రముఖ కవులు. ఫూల్‌వతా, చంద్రరాత్ లాంటి కవితా రూపాల్ని సృష్టించిన ఆధునిక కవులు అనిల్ (1901–1982), అనంత్ కానేకర్‌లు మండలి కవితా లక్ష్యాల్ని ప్రశ్నించాడు.

బాలగంగాధర తిలక్, వి.డి. సావర్కర్, జి.టి. దావేకర్ (1874–1956) యస్.యన్.రనడే (1892–1984), యన్.జి.దేశ్‌పాండేలు జాతీయ వాద కవులలో కొందరు. ఇక మరాఠీ సాహిత్యం యొక్క ఆధునిక దశకి చెందిన ప్రముఖులు : బి.యస్.మాఢేకర్, పి.ఎస్.రాగే, యన్.సి.కేల్కర్ (1872–1947) యస్.కె. కొల్హాట్కర్, సి.వి. జోషి, విందా కారండెకర్, వసంత్‌బాపట్, శాంతాషేల్కే.

విష్ణు దాస్ భావే మరాఠీ నాటకోద్యమానికి ఆద్యుడు. మరాఠీ నాటక కారులలో ఇతర ప్రముఖులు : బి.పి. కిర్లోస్కర్, (సౌభద్ర, శకుంతల, రామరాజ్య వియోగ) జి.బి.దేవల్ (శారద), ఆర్‌జి. గడ్కారి (ఏకాబ్‌ప్యాలా) మామావారేకర్ (అపూర్వ బెంగాల్), పి.యల్. దేశ్‌పాండే (అమల్దార్), విజయ్ టెండూల్కర్ (శ్రీమంత్, గిధాడే, శౌఖారాం బిందర్), శాంతాలా! కోర్టు చాతా ఆబే, ఘషీరాం కొత్వాల్, సి.టి. ధానోల్కర్.

హరినారాయణ్ ఆప్టే (1864–1919) యొక్క 'మాధలి స్థితి' మరాఠీలో ప్రచురించబడిన మొదటినవల. ఆయన ఇతర ముఖ్యమైన నవలలు 'ఉషాంకల మి పాన్ లక్షత్ కోన్ ఘెటో' బాబా పద్మాజి యొక్క 'యమునా పర్యటన' (1857) సంఘ సంస్కరణపై వ్రాయబడిన మొదటి నవల. నటమాధవ్, సి.వి. వైద్య, ప్రొఫెసర్ వి.ఎం.జోషి, వి.ఎస్. ఖండేకర్ (యయాతి, దోన్‌ధృవ్, ఉల్కా, క్రౌంచవధ్) సానే గురూజీ, కుసుమ్‌వతి దేశ్ పాండే, కమలాబాయ్ తిలక్‌లు మరాఠీ సాహిత్యంలో ఇతర ప్రముఖ నవలాకారులు. దివాంకర్ కృష్ణ,

హెచ్.ఎన్. ఆప్టే, వి.ఎస్.గుర్జార్‌లు ప్రముఖ కథారచయితలు. యస్.యం.ఘూటే, దుర్గా భగవత్, యన్.యస్.ఫడ్కేలు ప్రసిద్ధ వ్యాస రచయితలు. దయాపవర్ వ్రాసిన 'బలుత' మరాఠీలోతొలుత వెలువడిన దళితుల స్వీయచరిత్రలలో ఒకటి.

**మరాఠీ సాహిత్య ప్రముఖులు:**

**హరినారాయణ ఆప్టే (1864-1919):** మరాఠీ నవలా రచనకు అగ్రగామి. మాధవిస్థితి, ఉషంకల, మి, పాన్‌లక్షత్, కోన్‌ఘెటె ఆయన ముఖ్యమైన నవలల్లో కొన్ని. కారణ్కుఖ్ పత్రిక సంస్థాపక సంపాదకులు. ఆప్టే చాలా గ్రంధాలు ప్రచురించారు.

**వి.యస్.ఖండేకర్ (1889-1976):** ప్రముఖ కధకుడు, నవలా రచయిత, వ్యాస రచయిత. 1930-60 కాలంలో మరాఠీ సాహిత్యరంగాన్ని శాసించారు. ఆయన ప్రముఖ నవలలు యాయాతి, దోన్‌ధృవ్, ఉల్క, క్రౌంచవధ్, యాయాతి నవలకు 1960లో సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. 1975లో జ్ఞానపీఠ్ అవార్డు పొందారు.

**చింతామని వినాయక్ జోషి (1892-1963):** ప్రఖ్యాత హాస్య రచయిత. పది హాస్య కథల స్కెచెస్‌ల సంకలనాలు ప్రచురించాడు. ఆయన చిమన్ రావాచే చర్హాట్ ఆధునిక మరాఠీ సాహిత్యంలో ప్రామాణిక గ్రంధంగా పరిగణింపబడుతుంది.

**సానే గురూజి (1899-1950) :** శ్యామ్ చి ఆయ్, ఆస్తిక్, గోడ్‌షేవట్ లాంటి పలు నవలలు రాశారు. టాల్‌స్టాయ్ 'కళ అంటే ఏమిటి?' అనే రచనను 'కళామాంజే కాయ్' అనే పేరుతో మరాఠీలోకి అనువదించారు.

**బి.ఎస్. మార్థేకర్ (1909-56):** ప్రముఖ మరాఠీ కవి, శిశిరాగమ్, కాన్హి కవిత, ఆనఖి కాన్హి కవిత - లాంటి పద్య కావ్యాలు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇంకా ఆయన మూడు నవలలు, ఒక నాటకం, నాలుగు సంగీత రూపకాలు రచించారు. ఆయన సౌందర్య ఆణి సాహిత్య విమర్శనా గ్రంధం మరాఠీ సాహిత్య విమర్శ అభివృద్ధిని ప్రభావితం చేసింది.

**విజయ్ టెండూల్కర్ (జననం 1928):** మరాఠీ ప్రముఖ నాటక రచయితలలో ఒకరు. శ్రీమంత్, గిధాడే, శాఖారం బిందర్, ఘషీరాం కొత్వాల్, శాంతల కోర్టు చౌతా ఆహే లాంటి చాలా మంచి నాటకాలు వ్రాశారు.

**తమిళ సాహిత్యం:**

ఆధునిక తమిళ సాహిత్యాన్ని ఇస్లాం, క్రైస్తవ మతాలు ప్రభావితం చేశాయి. ఉమరుప్ప లవర్ (1605-1703) ముస్లిం తమిళ కవులలో ఆద్యుడు. ఆయన మహమ్మద్ జీవిత చరిత్రను సిరప్పురాణంగా వ్రాశారు. ఇస్లాం విశ్వాసానికి మరొక గ్రంథం మొహయిద్దీన్ పురాణాన్ని (1845) మహమ్మద్ ఇబ్రహీం వ్రాశారు. కాన్స్టాంటియో బెస్చి (1680-1747) విరామ మునివర్ మారుపేరుతో జీసస్ క్రైస్తు జీవిత చరిత్రను తెంబవాణి గ్రంధంగా వ్రాశారు.

ఆధునిక కాలంలో సుబ్రహ్మణ్య భారతి తమిళ కవులలో అత్యంత గొప్పవాడు. ఆధునిక కాలానికి చెందిన ఇతర తమిళ కావ్యాలు వి.ఒ. చిదంబరం రచించిన మెయ్యారిపు, పాదల్ తిరత్తు, దేశికా వినాయగం యొక్క మలరుం – మలైయిం, ఉమరుక్కయ్యం, పాదల్ కల్, కళ్యాణ సుందరం యొక్క పొదుమెట్టల్, తమిజాన్ ఇడయం, సంకోలి, యన్.కె. రామలింగం యొక్క ఆవలుం అవనుం, భారతీదాసన్ యొక్క అజ్వాన్ సిరిప్పు, పొండియన్ ఏరిసు, తమిజియక్కం, కుడుంబు ఎలక్కు, అయియాయి, నురుసిరియం, కొయ్యక్కని, ఎక్సువాయి, ఎన్బాటు, పవియిక్కొట్టు కావ్యాలను వ్రాసిన దురై మాణికం మరొక ముఖ్యడైన ఆధునిక తమిళకవి. ఈ కాలానికి చెందిన ఇతర ప్రముఖ తమిళ కవులు. యం.యల్. తంగప్ప, ముడియరసన్, ఎజిల్ ముతల్వాన్, యన్. కనకరాజ అయ్యర్, ఎ. శ్రీనివాస రాఘవన్, కన్నదాసన్, తవిజ జగన్.

18వ శతాబ్దంలో వీరమ మునివర్ వ్రాసిన పరమార్ధ గురుకథై మొదటి తమిళ నవల. కాని వేదనాయుగం పిళ్ళై (1824–89) 1875లో రచించిన 'పిరతాలు ముదలియార్ చరిట్టిరం' మొదటి తమిళ నవలగా గుర్తింపబడింది. జాన్ బన్యాన్ పిలిగ్రిమ్స్ ప్రోగ్రెస్ని అనుకరించి హెచ్.ఎ. కృష్ణ పిళ్లై 'ఇరట్ కన్య యట్టిరగం' వ్రాశాడు.

ఈ కాలంలో వచ్చిన ఇతర ముఖ్య రచనలు పెరుందెవనార్ యొక్క భారతం, గోపాల కృష్ణ భారతి యొక్క నందార్చరిట్టిరక్కిర్పనైకాల్, రాజం అయ్యర్ (1896) యొక్క కమలాంబల్ చరిట్టిరం, మాధవయ్య వ్రాసిన పద్మావతి చరిట్టరం, వడయార్ దొరస్వామిగారి మేనక, బాలామణి ఎ. కుప్పస్వామి గారి రత్నపురి రహస్యం శంకర రాం గారి మన్నసై, కరియ దరిసి.

యం. వరదరాజన్ తమిళనవలల్లో ప్రయోగాత్మకంగా కొత్త పోకడలను ప్రవేశపెట్టారు. వరదరాజన్ ప్రముఖ రచనలు: పెర్రమానం (1953) కరిట్టుండు (1953), ఆహల్ విలక్కు, సెంతమరై, మంకుడిసై, సి.ఎన్. అన్నాదురై చేసిన రెండు ముఖ్యమైన రచనలు నల్లతంబి, రంగూన్ రాధ (1952). అకిలన్ తన 'చిట్టిరప్పవై' (1968) నవలకు 1976లో జ్ఞానపీఠ అవార్డు పొందారు.

### తమిళ సాహిత్య వేత్తలు:

**మయూరం వేద నాయకం పిళ్లై (1826–89):** అద్భుతమైన కవితలు రాశాడు. తమిళనవలకు ఆద్యుడు. ఆయన వ్రాసిన ప్రతాప ముదలియార్ చరిట్టిరం (1829) తమిళంలో మొదటి నవల. తరువాత నవలా రచయితలకు స్ఫూర్తినిచ్చిన నవల.

**సుబ్రమణియ భారతి (1882–1921):** దేశభక్తి గీతాలు భక్తి పాటలతో ప్రజలనాకట్టుకొన్నారు. సమకాలీన సామాజిక సమస్యలపై వచన రచనలుచేశారు. మహా భారతాన్ని ఆధారం చేసుకొని 'పాంచాలి శబదం' వ్రాశారు. ఇతర ప్రముఖ రచనలు: కలిప్పట్టు, కన్ననపట్టు, కుయిల్పట్టు (1921).

**భారతీదాసన్ (1851-1964):** కవి, నాటక రచయిత, గేయ రచయిత. తమిళనాడులో విప్లవ కవిగా ప్రసిద్ధిపొందాడు. తరువాత ఆయన పెరియార్ రామస్వామి నాయకర్ హేతువాద ఉద్యమంలో చేరాడు. సంఘ సంస్కరణ, విప్లవం-వస్తువులుగా కవితలు రాశాడు. 'కుయిల్' సాహిత్య పత్రిక సంపాదకుడు.

**ఆర్.కృష్ణమూర్తి 'కల్కి' (1899-1954):** తమిళ నవలా రచయితలలో ముఖ్యుడు. హరిజనోద్ధరణ, మహిళాభివృద్ధి లాంటి సమకాలీన, సామాజిక అంశాలు చేపట్టి నవలకు ప్రాచుర్యాన్ని తెచ్చారు. త్యాగభూమి (1941), అలైబసై (1950) కల్కి ప్రఖ్యాత నవలలు.

**యం. వరదరాజన్ (1912-74):** తమిళ నవలల్లో కొత్త ప్రయోగాలు చేశాడు. ప్రముఖ రచనలు: పెర్రమనం (1953) ఆహల్ విలక్కు, శంతమరై, మంకుడిసై.

**ఆర్.షణ్ముగ సుందరం (1918-77):** తమిళ కల్పనా సాహిత్యంలో ఆధునికతను ప్రవేశపెట్టాడు. ప్రముఖ నవలా రచయిత. ఆయన నవల నాగమ్మళ్ తమిళ సాహిత్యంలో వాస్తవికతను ప్రవేశపెట్టిన నవలగా గుర్తింపు పొందింది. సుందరం తమిళ నవలలో ప్రాంతీయ మాండలికాన్ని ప్రవేశపెట్టాడు. నవలల కథావస్తువులు పేదలు, వ్యవసాయ వర్గాలు. రచనల్లో మట్టివాసన జొప్పించారు.

## భారతదేశంలో ఇంగ్లీషు రచన

### ప్రారంభం-పెరుగుదల:

ఇంగ్లీషు భాష విదేశీ భాష అయినప్పటికీ విద్యాభాషగా ప్రవేశపెట్టబడింది. భారతదేశంలోని వివిధ ప్రాంతాల మధ్య సమాచార మాధ్యమమయింది. 18వ శతాబ్దాంతం, 19వ శతాబ్దం ప్రారంభం నాటికి భారతదేశంలో బ్రిటిష్ అధికార కేంద్రాలుగా వున్న కలకత్తా, మద్రాసు, బొంబాయిలలో దృఢంగా వేళ్ళూనుకొంది. తొలినాటి భారతీయ ఆంగ్ల రచయితలు భారతదేశంలోని ఇతర ప్రాంతాల కంటె బ్రిటిష్ వారికి మొదటి బలమైన కేంద్రంగా వున్న కలకత్తాకి చెందినవారు కావడం యాదృచ్ఛికం కాదు.

భారతదేశంలో ఇంగ్లీషు రచనలు చేసిన వారిలో రామ్మోహనరాయ్ ఆద్యుడు. 19వ శతాబ్దం ప్రారంభంలో కవులు హెన్రీ డిరోజియో, మైకేల్ మధుసూదనదత్‌లు రాయ్‌ని అనుసరించారు. దత్ తొలుత ఇంగ్లీషులో సుదీర్ఘమైన కవితలు రాశారు. ఆ తరువాత బెంగాలీ రచనలు చేశారు. 21 సంవత్సరాల పిన్న వయసులో చనిపోయిన తోరుదత్ కవిత్వం, బకించంద్ర చటర్జీ నవల 'రాజమోహన్స్ వైఫ్' ఆంగ్ల భాషా కోవిదుల మెప్పు పొందాయి. తోరుదత్ ఇంగ్లీషులో కవిత్వం వ్రాయడమే గాక ఫ్రెంచి కవిత్వం అనువాదాలు కూడా చేశారు. 'ఏన్షియంట్ బేలడ్స్', 'లెజెండ్స్ ఆఫ్ హిందూస్థాన్' ఆమె ప్రఖ్యాత నవలలో కొన్ని.

ఈ కాలానికి చెందిన అత్యంత ప్రతిభావంతుడైన బహుముఖ సాహితీ వేత్త రవీంద్రనాథ్ ఠాగూర్ (1861–1941) 1913లో ఆయన గీతాంజలికి నోబెల్ బహుమతి లభించింది. సరోజిని నాయుడు (1879–1949) గొప్ప కవయిత్రి. ఆమె కాల్పనీయకత భారత, యూరపు పాఠకుల నాకట్టుకొన్నది. గోల్డెన్ త్రెషోల్డ్ (1905), ది బ్రోకెన్ వింగ్ (1917) ఆమె సాహితీ ప్రతిభకు తార్కాణాలు. అరవిందఘోష్ (1872–1950) కవి, తాత్వికుడు, ఋషి. ఆయన కవిత్వాన్ని ధ్యానం యొక్క ఒక రూపంగా భావించాడు. ఆయన దీర్ఘకవిత 'సావిత్రి', 'డివైన్ లైఫ్' ఆంగ్ల సాహిత్యంలో విశిష్ట రచనలు.

స్వాతంత్ర్య పోరాటం బ్రిటిషు సామ్రాజ్య వ్యతిరేక భావాలను వ్యక్తీకరించే విప్లవాత్మక తరహా రచనలకు అవకాశం కల్పించింది. బాల గంగాధర తిలక్, లాలా లజపతిరాయ్, కస్తూరి రంగ అయ్యంగార్, టి. ప్రకాశం లాంటి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రాజకీయ నాయకులు సాహిత్యకారులుగా ముందుకు వచ్చారు. యంగ్ ఇండియా, హరిజన్ లాంటి పత్రికలకు సంపాదకత్వం వహించి రచనలు చేసిన గాంధీజి చేతుల్లో ఇంగ్లీషు పదునైన బలమైన సాధనమయింది. గాంధీజీ 'మై ఎక్స్పెరిమెంట్స్ విత్ ట్రూత్' పేరుతో స్వీయ జీవిత చరిత్ర వ్రాశాడు. వచనంలో మేటి రచనలు చేసిన మరొక ప్రముఖ నాయకుడు జవహర్‌లాల్ నెహ్రూ (1889–1964). గ్లిమ్‌ప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ, డిస్కవరీ ఆఫ్ ఇండియా, ఏన్ ఆటో బయోగ్రఫీ (1936) లాంటి నెహ్రూ రచనలు కలకాలం వుంటాయి.

ముల్కరాజ్ ఆనంద్, ఆర్.కె. నారాయణ్, రాజారావు ఇంగ్లీషులో నవలలు వ్రాసిన ప్రముఖ నవలాకారులు. వీరు 1930 దశాబ్ద ప్రాంభంలో రచనా వ్యాసంగం ప్రారంభించారు. ముల్కరాజ్ ఆనంద్ 'ది లాస్ట్ ఛైల్డ్' కథానికా రచయితగా ప్రసిద్ధుడు. గద్యం, పద్యం, నాటకం – లాంటి ప్రక్రియలలో చాలా గ్రంధాలు వ్రాశాడు. ఆయన నవలలు కూలీ (1933), అన్‌టచ్‌బుల్ (1935), ది వుమన్ అండ్ ది కౌ (1960) అణగారిన వారి పట్ల ఆయన పక్షపాతాన్ని తెలియచేస్తాయి.

ఆర్.కె. నారాయణ్ మరొక ప్రముఖ రచయిత. ఆయన తొలి నవల స్వామి అండ్ ఫ్రెండ్స్‌తో మొదలై చాలా రచనలకు కాల్పనిక పట్టణమైన మాల్గుడి రంగ స్థలంగా వుంటుంది. భారతీయుల ఆచారాలు, సాంప్రదాయాలు – భారతీయుల హృదయ స్పందన ఆయన నవలల్లో వినిపిస్తుంది. బేచులర్ ఆఫ్ ఆర్ట్స్ (1937), ది ఫైనాన్షియల్ ఎక్స్పర్ట్ (1952), ది గైడ్ (1959), వెయిటింగ్ ఫర్ ది మహాత్మా (1955) – ప్రజాదరణ పొందిన ఆయన ఇతర నవలలు. మరొక ప్రముఖ భారతీయ ఆంగ్ల రచయిత రాజారావు. గ్రామీణ భారతదేశాన్ని చిత్రించిన ఆయన నవల కాంతాపురం (1938) సాహిత్యంలో ఆయన్ని ప్రముఖ వ్యక్తిగా నిలబెట్టింది. రాజారావు ఇతర ప్రముఖ నవలలు సర్పెంట్ అండ్ ది రోప్ (1960), ది కేట్ అండ్ షేక్స్పియర్ (1965).

**నిరాద్ చౌదురి (1897-1999):** అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన రచయిత. 'ది అన్‌నోన్ ఇండియన్' జీవిత చరిత్ర ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టింది.

**ప్రముఖ భారతీయ ఆంగ్ల రచయితలు:**

**సరోజినీనాయుడు (1879-1949):** కాంగ్రెసు మొదటి మహిళా అధ్యక్షులు, మొదటి రాష్ట్ర మహిళా గవర్నరు అయిన సరోజిని నాయుడు గొప్ప కవయిత్రి. ఆమె కాల్పనికత భారత, యూరపు పాఠకులను విశేషంగా ఆకట్టుకొన్నది. ఆమె గోల్డెన్ థ్రెషోల్డ్ (1905), ది బ్రోకెన్ వింగ్ (1917), దిబర్డ్ ఆఫ్ టైమ్, ది మేజిక్ ల్యూట్ – విశేష సాహిత్య ప్రతిభ గల కావ్యాలు. ఆమె నైటింగేల్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందింది.

**నిరాద్ సి. చౌదురి (1897-1999):** ప్రఖ్యాత రచయిత. 'ది ఆటో బయోగ్రఫీ ఆఫ్ ఎన్ ఆన్‌నోన్ ఇండియన్' జీవిత చరిత్ర రచనతో అంతర్జాతీయ ఖ్యాతి నార్జించాడు. జీవిత చరిత్ర రెండవ భాగం దైహేండ్, గ్రేట్ అనార్క్‌లు 90వ ఏట వ్రాశారు. తన రెండవ రచన 'ది పేసేజ్ టు ఇంగ్లాండ్'లో సామ్రాజ్యవాద ఇంగ్లాండు పట్ల విధేయతను, ప్రజాస్వామ్యం పట్ల విముఖతను వ్యక్తం చేశారు. ఆయన ఇతర ప్రముఖ రచనలు: దికాంటినెంట్ ఆఫ్ సిర్స్, టు లివ్ ఆర్ నాట్ టు లివ్, క్లైవ్ ఆఫ్ ఇండియా, స్కాలర్ ఎక్స్‌ట్రార్డినరీ, త్రిహార్స్ మెన్ ఆఫ్ ది న్యూ అపోకలిప్స్.

**ముల్కరాజ్ ఆనంద్ (జననం 1905):** సామాజిక సమస్యలపై అన్ టచ్‌బుల్ (1935), కూలీ (1936), టూ లీవ్స్ అండ్ ఎ బడ్ (1936), ది విలేజ్ (1939), ది బిగ్ హార్టు (1945) లాంటి అనేక నవలలు వ్రాశారు. ఆయన 'ది ప్రైవేట్ లైఫ్ ఆఫ్ యాన్ ఇండియన్ ప్రిన్స్' (1953) మరొక ముఖ్యమైన నవల. ఆయన దిలాస్ట్ చైల్డ్ కథా రచయితగా ప్రసిద్ధుడు.

**ఆర్.కె. నారాయణ్ (1906-2001):** భారతదేశంలో ఆంగ్ల కల్పనా సాహిత్య పితామహుడుగా గుర్తింపబడ్డాడు. మొదటి నవల స్వామి అండ్ ఫ్రండ్స్ (1935) కథాస్థలం మాల్గుడి అనే ఊహాజనితమైన పట్టణం. గైడ్ అనే నవలతో సహా 34 నవలలు వ్రాశాడు. నారాయణ్ ఇతర ప్రముఖ నవలలు: బేచులర్ ఆఫ్ ఆర్ట్సు, ది ప్రింటర్ ఆఫ్ మాల్గుడి, ది మాన్ ఈటర్ ఆఫ్ మాల్గుడి, ది ఫైనాన్షియల్ ఎక్స్‌ఫర్ట్, వెయింటింగ్ ఫర్ ది మహాత్మా, ది వెండర్ ఆఫ్ స్వీట్స్, రిలక్టంట్ గురు, ది పెయింటర్ ఆఫ్ సైన్సు, ది టైగర్ ఆఫ్ మాల్గుడి. ఆయన ఇంకా ఐదు కథా సంకలనాలు, నాలుగు వ్యాస సంకలనాలు భారత ఇతి హాసాల నుండి కొన్ని అనువాదాలు వ్రాశాడు.

**రాజారావు (జననం 1909):** ముల్కరాజ్ ఆనంద్, ఆర్.కె. నారాయణ్, రాజారావులు భారతీయ, ఆంగ్ల నవలాకారుల త్రయంగా ప్రసిద్ధి గాంచారు. రాజారావు ప్రముఖ నవలలు: కాంతాపురం(1938), ది సర్పెంట్ అండ్ ది రోప్ (1960), ది కేట్ అండ్ షేక్స్పియర్

(1965). ఆయన నవల ది సర్పెంట్ అండ్ ది రోప్‌కి సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. ది చెస్‌మాస్టర్ అండ్ హిజ్ మూవ్స్ నవలకు ప్రతిష్ఠాత్మకమైన న్యూస్టాడ్ ఇంటర్నేషనల్ బహుమతి పొందారు. ఇంకా ది కౌ ఆఫ్ బారికేడ్స్ (1947), ది పోలీస్‌మన్ అండ్ ది రోజ్ (1977)లు రాజారావు ప్రఖ్యాత కథా సంకలనాలు.

**మనోహర్ మాల్గోంకర్ (జననం 1913):** చారిత్రకాంశాల పట్ల ప్రత్యేకమైన అభిరుచి గల నవలా రచయిత. ఆయన ప్రముఖ రచనలు: డిస్టెంట్ డ్రమ్ (1960), కంబేట్ ఆఫ్ షాడోస్ (1962), ది ప్రిన్సెస్ (1963), ఎబెండ్ ఇన్ ది గేంజస్ (1964), ది డెవిల్స్ విండ్ (1972).

**కుష్వంత్‌సింగ్ (జననం 1915):** ప్రముఖ నవలా కారుడు కథానికా రచయిత, సంపాదకుడు, సిక్కుల చరిత్ర రచయిత. సింగ్ ప్రఖ్యాత రచన 'ట్రైన్ టు పాకిస్తాన్'. ఆయన ఇతర రచనలు: ఢిల్లీ, ఐ షల్ నాట్ హియర్ ది నైటింగ్‌గేల్. సిక్కుల చరిత్ర ప్రామాణిక మైన బృహద్గ్రంథం.

**నిసిమ్ ఎజెకీల్ (జననం 1924):** భారతదేశంలోని ఇంగ్లీషు కవులలో ఆధునికుడు. ఆంగ్ల కవిత్వంలో ఆధునికతను ప్రవేశపెట్టాడు. ఆయన ప్రముఖ రచనలు: ఎ టైమ్ టు ఛేంజ్ (1952), సిక్స్టీ పోయెమ్స్ (1955), ది థర్డ్ (1958), ది అన్ ఫినిష్డ్ మేన్ (1960), ది ఎగ్జాట్ నేమ్ (1965), హైమన్స్ ఇన్ డార్క్‌నెస్ (1976), లేటర్ డే సామ్స్ (1982), కలెక్టెడ్ పోయమ్స్ (1989).

14

# ఆధునిక భవన నిర్మాణం

### వలసవాద భవన నిర్మాణం:

### పోర్చుగీసు భవన నిర్మాణం:

యూరోపియన్లు భారతదేశానికి నయా సాంప్రదాయవాద, రోమన్, గోథిక్, పునరుజ్జీవ భవన నిర్మాణ రీతులలో గల యూరపు భవన నిర్మాణ శాస్త్రాన్ని తీసుకొని వచ్చారు. వారి తొలినాటి నిర్మాణాలు సముద్రతీరాన గిడ్డంగులు, వర్తక స్థావరాలు, వాటికి రక్షణగా నిర్మించిన కోటలు. పోర్చుగీసువారు కొచ్చిన్ వద్ద 1510లో నిర్మించిన సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి భారతదేశంలో యూరోపియన్లు నిర్మించిన మొదటి చర్చి. పోర్చుగీసువారు బొంబాయి సమీపంలో 'కేజెల్లా అగుండా' అనే కోటని నిర్మించారు. గుజరాత్ బహద్దూర్ షా నిర్మించిన కోటపై 1532లో బురుజులు నిర్మించారు.

### డేనిష్ మరియు ఫ్రెంచి నిర్మాణాలు:

డేనిష్ నిర్మాణ రీతుల ప్రభావం నాగపట్నం సిరాంపూరులలో స్పష్టంగా కనిపిస్తుంది. ఫ్రెంచివారు తమ పాండిచ్చేరి స్థావరానికి సాంప్రదాయ భవన నిర్మాణ రీతుల్ని జోడించి స్పష్టమైన నగరరూపురేఖలు యిచ్చారు. సేక్రెడ్ హార్ట్ ఆఫ్ జీసస్‌చర్చి యింకా యితర కట్టడాలపై ఫ్రెంచి ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

### కంపెనీ పాలన:

భారతదేశ భవన నిర్మాణంపై బ్రిటిషువారు చెరగని ముద్రవేశారు. మొగలు చక్రవర్తుల వారసులుగా వచ్చిన ఇంగ్లీషువారు భవన నిర్మాణాన్ని అధికార చిహ్నంగా ఉపయోగించుకొన్నారు. బ్రిటిషువారు గోథిక్, సామ్రాజ్యవాద, క్రైస్తవ, ఇంగ్లీషు పునరుజ్జీవం, విక్టోరియన్ తరహా –

లాంటి పలు భవన నిర్మాణ పద్ధతులను అనుసరించారు. బ్రిటిషువారు తొలుత నిర్మించిన భవనాలు ఫ్యాక్టరీలు. 'ఆ తరువాత కోర్టులు పాఠశాలలు మున్సిపల్ హాల్సు, డాక్ బంగాళాలు లాంటి సాధారణ నిర్మాణాలను రక్షణ దుర్గాలను కట్టే ఇంజనీర్లు నిర్మించారు. చర్చిలు యితర ప్రభుత్వ భవనాలు నిర్మించడంలో నిపుణతతో కూడిన పద్ధతులు అవలంబించారు. అత్యధిక భవనాలు లండన్ యితర ప్రాంతాలకు చెందిన ప్రముఖ భవన నిర్మాణ నిపుణులైన రెన్, ఆడమ్, నాష్ లాంటి నిపుణుల రూపకల్పనలకు అనుకరణలు.

ఉదాహరణకు 1787లో కలకత్తాలో నిర్మించబడిన సెయింట్ జాన్‌చర్చికి ప్రేరణ వాల్‌బ్రూక్స్ వద్ద గల సెయింట్ స్టీఫెన్‌చర్చి. కెప్టెన్ చార్లెస్ వ్యాట్ కలకత్తాలో నిర్మించిన గవర్నమెంటు హౌస్‌కి నమూనా డెర్బిషైర్‌లోని కెడిల్‌స్టన్ హాలు, కలకత్తాలోని భారత ప్రభుత్వ నాణాల ముద్రణాలయం ఏథెన్స్‌లో మినర్వా టెంపుల్‌కి అనుకరణ. చెన్నైలోని పచ్చయప్ప హాలుకి నమూనా ఎథీనియా థీసియస్ టెంపుల్. యూరపులో లాగా కాక ఈ భవనాలు ఇటుక సున్నం గచ్చులతో కట్టబడ్డాయి. రాళ్లతో కట్టినట్లు కన్పించే విధంగా పనితనం ప్రదర్శించబడింది. ఆ తరువాత కొన్ని భవనాలు రాళ్లతో కట్టబడ్డాయి. వలసవాద చిహ్నాలైన చర్చీలు నిర్మాణంలో లండన్ నమూనాలు స్వీకరించినప్పటికి మార్పులు చేర్పులతో దాదాపు స్వతంత్ర కట్టడాలలా తయారయ్యాయి. అందుకు తొలి ఉదాహరణ చెన్నైలోని సెయింటు జార్జి ఫోర్టులో గల సెయింట్ మేరీ చర్చి.

లండన్‌లోని పార్లమెంటు భవనాల ప్రేరణతో దేశంలోని వివిధ ప్రాంతాలలో నయాగోథిక్ తరహా నిర్మాణం అభివృద్ధి చెందింది. 1820-35 కాలంలో కల్నల్ థామస్‌కూపర్ బొంబాయిలో టౌనుహాలు నిర్మించాడు. గవర్నర్ సర్ బార్టల్ ఫ్రెయిరీ బొంబాయి నగరానికి సామ్రాజ్యవాద వాతావరణాన్ని సమకూర్చయత్నించాడు. అతడి హయాంలో పాత టౌనుహాల్స్ కూల్చివేయబడ్డాయి. గోథిక్ తరహా నిర్మాణ పద్ధతిలో 'గేట్ వే ఆఫ్ ఇండియా' నిర్మించబడింది. సచివాలయం, యూనివర్శిటీ లైబ్రరీ, రాజాబాయ్ టవర్, టెలిగ్రాఫ్ ఆఫీసు, విక్టోరియా టర్మినస్ - అన్నీ లండన్ భవన నిర్మాణ పద్ధతిలో కట్టబడ్డాయి. సెయింట్ పాన్క్రాస్ స్టేషన్ నమూనాలో ఫ్రెడరిక్ విలియం స్టీవెన్స్‌చే రూపకల్పన చేయబడిన విక్టోరియా టర్మినస్ అత్యద్భుతమైన కట్టడం. చర్చిగేటు టర్మినస్ విక్టోరియా టర్మినస్‌కి ఎదురుగా మునిసిపల్ బిల్డింగులకు కూడా స్టీవెన్స్ రూపకల్పన చేశాడు.

వారణాసిలో గోథిక్ నిర్మాణ పద్ధతిలో 1847-52 కాలంలో మేజర్ కిటో 'క్వీన్స్ కాలేజి' నిర్మించాడు. అల్హాబాద్‌లో యూనివర్శిటీ, ఆల్ సెయింట్స్ కేథెడ్రల్, హైకోర్టు, మేయో కాలేజిలతో సహా పలు భవనాల్ని బ్రిటిషువారు నిర్మించారు. కలకత్తాలో గోథిక్ తరహాలో హైకోర్టు నిర్మించబడింది. 19వ శతాబ్దం మధ్యకాలంలో బ్రిటిషువారికి చాలా బలమైన స్థావరంగా వున్న 'ఫోర్టు విలియం' నిర్మాణానికి 3.5 మిలియన్ల పౌండ్లు ఖర్చయింది. 13 సంవత్సరాల కాలం పట్టింది. సర్ విలియంచే రూపకల్పన చేయబడిన విక్టోరియా మెమోరియల్ చాలా ప్రముఖ కట్టడం.

**బ్రిటిషు ప్రత్యక్ష పాలన:**

ఈస్టిండియా కంపెనీ నుండి బ్రిటిషు సింహాసనం అధికారం స్వీకరించడం, భారత జాతీయ వాదం పుట్టుక, రైలు మార్గాల నిర్మాణం – వలసవాద బ్రిటిషిండియా భవన నిర్మాణ చరిత్రలో విభజన రేఖలు. కాంక్రీటు దుక్క ఇనుము, పోత ఇనుము లాంటివి భవన నిర్మాణంలో నూతన అవకాశాలు కల్పించాయి. బ్రిటిషువారు భారతదేశ భవన నిర్మాణ పద్ధతులను యిముడ్చుకొనడం ప్రారంభించారు. ఈ అంశాలు 19వ శతాబ్దాంతానికి హిందూ ముస్లిం సంస్కృతులు మేళవించిన భవన నిర్మాణ పద్ధతుల అభివృద్ధికి దారితీసింది. ప్రధానంగా విక్టోరియా తరహాకి చెందినదైనప్పటికి మొగలు ఆఫ్ఘను పాలకుల ఇస్లాం రీతిని ఎక్కువగా అరువు తెచ్చుకొన్నది. ఇది అర్థనెలవంక లాంటి మొనలు దేరిన ఆర్చీలు, గుమ్మిటాలు, చిత్ర విచిత్రమైన మెలికలతో కూడిన పనితనం, మీనార్లు వగైరాలతో హిందూ ముస్లిం సంస్కృతుల్ని గోథిక్ తరహాతో అద్భుతంగా మిళితం చేసిన భవన నిర్మాణ రీతి. ఈ భవన నిర్మాణ రీతికి యఫ్.యస్.గ్రోసే; సర్ స్వింటన్ జాకబ్, ఆర్.యఫ్. క్రిస్‌హామ్, హెచ్. ఇర్విన్‌లు ఆద్యులు. భారతదేశంలో హిందూ ముస్లిం సంస్కృతులను సమ్మిళితం చేసి పాన్‌బెన్‌ఫీల్డ్‌చే రూపకల్పన చేయబడిన చెన్నైలోని చెపాక్ భవనం మొదటిది. ఈ తరహా భవన నిర్మాణ రీతిలో నిర్మించబడిన యితర ముఖ్యమైన కట్టడాలు: చెన్నైలోని లాకోర్టులు, విక్టోరియా మెమోరియల్ హాలు, ప్రెసిడెన్సీ కాలేజీ, సెనేట్‌హౌస్, అల్హాబాద్‌లోని ముయిర్‌కాలేజి, తిరువనంతపురంలోని నేపియర్ మ్యూజియం, బొంబాయిలో పోస్టాఫీసు, ప్రిన్స్ ఆఫ్ వేల్సు మ్యూజియం, గేట్ వే ఆఫ్ ఇండియా, మైసూరులోని మహారాజా ప్యాలెస్, బరోడాలోని యం.యస్.యూనివర్శిటీ, లక్ష్మీవిలాస్ ప్యాలెస్.

న్యూఢిల్లీ నిర్మాణం బ్రిటిషు రాజ్యం యొక్క భవన నిర్మాణ చరిత్రలో కలికితురాయి. న్యూఢిల్లీని రాబర్ట్ బైరన్ 'హిందూస్తాన్ రోమ్'గా వర్ణించాడు. న్యూఢిల్లీ 1911లో రాజధాని నగరం చేయబడిన తరువాత బ్రిటిషువారు దానిని క్రమబద్ధంగా ఒక పథకం ప్రకారం నిర్మించారు. ఢిల్లీ ప్లానుకి వైస్రాయి సర్ ఎడ్వర్డు లూట్యెన్స్‌ని బాధ్యుడిగా నియమించాడు. భారతీయ కళా సాంప్రదాయంతో సమన్వయం చేసుకోవలసిందిగా సూచించాడు. వైస్రాయి భవన (యిప్పటి రాష్ట్రపతి భవనం) నిర్మాణంలో ప్రాచ్య పాశ్చాత్య కళలు మేళవించబడ్డాయి. రాష్ట్రపతి భవనానికి యిరువైపుల సౌత్‌బ్లాకు, నార్త్ బ్లాకుల్ని బేకర్ చేర్చాడు. మరొక ఆంగ్లేయుడు రాబర్ట్ టర్ టస్కెల్ కనాట్ ప్లేస్, తూర్పు పడమర కోర్టుల్ని నిర్మించాడు. సెయింట్ మార్టిన్స్ గేరిసన్ చర్చి భారతదేశంలో బ్రిటిషు కట్టడాలలో తలమానికం లాంటిది.

**లూట్యెన్స్ - ఢిల్లీ నిర్మాణం:**

ప్రముఖ భవన నిర్మాణ శాస్త్ర నిపుణులు సర్ ఎడ్విన్ లూట్యెన్స్, అతడి మిత్రుడు సర్ హెర్బర్ట్ బేకర్ ఆధునిక ఢిల్లీ నిర్మాతలు. భారతదేశంలో రాజధాని నగరాన్ని నిర్మించేందుకు పాలకులు లూట్యెన్స్‌ని పిలిపించారు. విస్తీర్ణంలోను వైభవంలోను ప్రపంచంలోని యితర

అత్యంత గొప్పనగరాలకు దీటుగా వుండాలన్నారు. పాతనగరానికి వెలుపల, చాందినీ చౌక్ రణగొణధ్వనులకు దూరంగా, రెడ్‌ఫోర్టు ప్రాకారాలకు దూరంగా 2,800 ఎకరాల స్థలం కేటాయించబడింది.

రాష్ట్రపతి భవన్, పార్లమెంటు, రాష్ట్రపతి భవన్ నుండి ఇండియా గేటు వరకు, ఆ తరువాత కింగ్ జార్జి విగ్రహం మంటపం వరకు పథకం స్వేచ్ఛగా రూపొందించేందుకు లూట్యెన్స్‌కి అనుమతి లభించింది. బ్రిటిషు ప్రతినిధి కార్యాలయాలు, రాష్ట్రపతి భవన్‌కి యిరువైపుల నార్త్, సౌత్ బ్లాకులు, పరిపాలనా యంత్రాంగం కొరకు కార్యాలయాలు లోపల భవనాలు, వెలుపలికి చొచ్చుకొని వచ్చిన హరిత వృక్షాలు - చిన్న చిన్న కాలువలు ఫౌంటెన్లు - నీడనిచ్చే చెట్ల మొక్కల నారుమళ్లు - నీటినిపరిరక్షించే జామచెట్లు - హుందాగా కనిపించే ఇండియాగేటు పచ్చిక బయిళ్లు - అన్నీ కూడా ఢిల్లీ వైభవాన్ని రాజరికాన్ని ప్రదర్శిస్తుంటాయి. స్తంభాలతో మండువేసవి నెలల్లో నీడనిచ్చే పోర్టికోలతో రాష్ట్రపతి భవనం అవతల గల 112 బంగళాలను నిర్మించేందుకు దాదాపు 20 సంవత్సరాల కాలం పట్టింది. న్యూఢిల్లీ బ్రిటిషు వారు రూపొందించిన అత్యంత అందమైన నగరం. 1931 నాటికి నగర నిర్మాణం పూర్తయింది.

సామ్రాజ్యవాదులచే నిర్మించబడిన ఢిల్లీ చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేదిగా వుండాలి. భారతదేశంలో బ్రిటిషుపాలకుల దృఢమైన విధానాలకు, చైతన్యవంతమైన ఆలోచనలకు, చట్టం శాంతి భద్రతలు హేతుబద్ధత సహనశీలతల పట్ల వారికి గల గౌరవానికి వ్యక్తీకరణగా వుండాలి. పాలకుల సహకారంతో సాధించగల అభివృద్ధి సామరస్యాలకు ప్రతీకగా నిలవాలి. కొండపై నున్న నగరం దాచిపెట్టబడదు.

ఒక గొప్ప తూర్పు పడమరల ఇరుసు - కింగ్స్‌వే (రాజపథ్); రాష్ట్రపతి భవన్ నుండి యమున వరకు పాతనగరానికి (ఇంద్రప్రస్థకి) పోతుంది. విశాలమైన మార్గాల కిరువైపుల చెట్లు వరుసలు గల ఈ నగరం తరచుగా హాస్‌మన్ పారిస్‌ని తలపిస్తుంది. కింగ్స్‌వే ప్రక్కన అఖిల భారత యుద్ధ చిహ్నంగా వున్న పెద్ద నిర్మాణం (ఇండియా గేట్) ప్రిన్సెస్ పార్కులో వుంది.

లూట్యెన్స్ భవన నిర్మాణశైలి దాని అద్భుతమైన వైవిధ్యంతో పాటు సాంప్రదాయ గ్రీకు భవన నిర్మాణ విధానాన్ని తలపింపజేస్తుంది. ఇసుకరాతితో నిర్మించిన భవనాలు చాలా పెద్దవి; సాధారణమైనవి; విపరీతమైన అలంకరణలు లేకుండా గంభీరంగా వున్నాయి. అలంకరణలు మూడు ముఖ్యమైన భారతీయ సంస్కృతులు - హిందూ, ముస్లిం, బౌద్ధ సంస్కృతుల సమ్మిళితంగా వున్నాయి. భారతదేశంలో ప్రతి పాలకుడు తనకు నచ్చిన విధానాన్ని అమలు జరిపారు. గనుక లూట్యెన్స్ దృష్టిలో భారతీయ భవన నిర్మాణ తరహా అనేది లేదు.

లూట్యెన్స్ అతిగా వుండే అలంకరణలు గాక పొదుపైన సాంప్రదాయరీతుల్ని అనుసరించాడు. ఢిల్లీ నిర్మాణం ముస్లిం తరహాలో నిర్మింపబడుతుందా లేక హిందూ తరహాలో నిర్మింపబడుతుందా? అనే వివాదాన్ని నివారించడం కూడా అప్పటి అవసరం. లూట్యెన్స్

బౌద్ధ స్తూపాల – ప్రత్యేకించి సాంచీ స్తూపంలోని సాదాసీదారేఖల్ని స్వీకరించాడు. ఇంకా పుష్పాల ఆకారాలలోని వైవిధ్యాన్ని, రేఖా గణిత ఆకృతుల లోని విభిన్నరీతుల్ని, జంతువుల ఆకృతుల్ని జొప్పించారు. సామ్రాజ్యవాద క్షీణతతో లూట్యెన్స్ ఢిల్లీకి యిచ్చిన రూపురేఖలు కాగితాలకు పరిమితమయ్యాయి. ఢిల్లీ అసంపూర్ణ నగరంగా మిగిలింది.

**స్వాతంత్ర్యానంతర భవన నిర్మాణం:**

బ్రిటిషురాజ్యంలో బ్రిటిషు భవన నిర్మాణ నిపుణులకు సహాయకుల పాత్రకు నెట్టివేయబడిన భారతదేశ భవన నిర్మాణ నిపుణులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు సమయం తీసుకొన్నారు. గతవైభవానికి అంటిపెట్టుకొని వుండాలా లేక కొత్త ఆలోచనలు నిపుణతల కల్పనలతో కాలానుగుణంగా ముందుకి సాగాలా? అనే సందిగ్ధం వారిని పట్టుకొంది. స్వాతంత్ర్యానంతరం సంగీతం, కళల లాంటి రంగాలలో స్పష్టమైన భారతీయ ముద్ర కన్పించింది. కాని భవన నిర్మాణ రంగంలో అలా జరగలేదు.

స్వాతంత్ర్యానంతర కాలంలో భవన నిర్మాణ రంగంలో రెండు ధోరణులు – పునరుద్ధరణ వాద, ఆధునికవాద ధోరణులు ముందుకి వచ్చాయి. గతం కొనసాగాలని కోరిన పునరుద్ధరణ వాదులు వలసవాద వారసత్వపు సంకెళ్ళను తెగగొట్టుకోలేక పోయారు, ఆధునిక భవన నిర్మాణ రీతుల్ని గణనీయంగా ప్రభావితం చేయలేకపోయారు. ఆధునిక వాదులు కూడా భారతదేశంలోని ప్రాంతీయ అవసరాల్ని ఆకాంక్షల్ని వైవిధ్యాల్ని పరిగణనలోకి తీసుకోకుండా యూరపు అమెరికా నమూనాలపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఆధునిక భవన నిర్మాణం, పథకాలు రూపొందించే వారిలో దూరదృష్టి లేకపోవడం, ప్రభుత్వ మద్దతు కొరవడడం, భవన నిర్మాణ విద్య సంతృప్తికరమైన స్థాయిలో లేకపోవడం లాంటి సమస్యలతో సతమతమవుతోంది. ఫలితంగా స్వతంత్రం వచ్చిన తొలి సంవత్సరాలలో విదేశీ భవన నిర్మాణ నిపుణులు నాయకత్వ పాత్ర నిర్వహించడం కొనసాగింది.

జవహర్‌లాల్ నెహ్రూ 1956లో అశోకా హోటల్‌నమూనా కొరకు పోటీ నిర్వహింపజేశారు. ఈ పోటీలో బొంబాయికి చెందిన బి.ఇ. డాక్టర్ ప్రథముడిగా వచ్చాడు. స్తంభాలు లేకుండా పెద్ద పెద్ద హాలుల్ని నిర్మించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని డాక్టరు ఇస్లామిక్ హిందూ, బ్రిటిషు, ఆధునిక భవన నిర్మాణరీతుల విశేషాల్ని స్వీకరించి అద్భుతమైన కట్టడాన్ని సృష్టించారు.

పంజాబు ప్రభుత్వం చండీఘర్ నూతన నగర నిర్మాణానికి లీకోర్బుసియర్‌ని నియమించడంతో భారతదేశ భవన నిర్మాణం నూతన విప్లవంలోకి ప్రవేశించింది. మూడు దశలలో నిర్మించబడిన నగరం మూడుసెక్షన్లుగా విభజించబడింది. మొదటి సెక్షన్‌లో అగ్రభాగం – రాజకీయ, అధికార యంత్రాంగం, న్యాయవిభాగం, నగరపాలక భవనాలు వున్నాయి. రెండవ సెక్షన్‌లో నగరం మధ్యలో యూనివర్శిటీ, నివాస భవనాలు వున్నాయి. దిగువ

పారిశ్రామిక రంగాలు రైల్వే స్టేషన్ వున్నాయి. తొలుత రూపొందించిన ఈ పథకంతో పాటు కోర్బుసియర్ పలు భవనాలకు రూపకల్పన చేశారు. గాలిని తమగుండా ప్రసరింపజేసే కాంక్రీటు గోడలపై వాలుగా వున్న పైకప్పు గల హైకోర్టు భవనం, పెద్ద పారిశ్రామిక చిమ్నీ గల చతురస్రాకారంగా వున్న అసెంబ్లీ భవనం, గాలి బాగా ప్రసరించడానికి వీలుగా వున్న వందలాది గదులు గల సచివాలయం – అద్భుతమైన కట్టడాలు.

కోర్బుసియర్ సృజనాత్మకత నుండి ప్రేరణ పొందిన యువ జాతీయ భవన నిర్మాణ నిపుణుడు డి.వి. జోషి అహమ్మదాబాదులో లోహశాస్త్ర విద్యా సంస్థకి రూపకల్పన చేశాడు. జోషి సమకాలికుడు చార్లెస్ మార్క్‌కొరియా 1961లో ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌కి, హిందూస్తాన్ లివర్ మంటపానికి రూపకల్పన చేశాడు. అహమ్మదాబాద్‌లో గాంధీకి స్మృతి చిహ్నంగా నిర్మించిన 'గాంధీ సంగ్రాలయ'కి కొరియా రూపకల్పన చేశాడు.

15

# భారత చలన చిత్ర చరిత్ర

### దిగుమతి చిత్రాలు, భారతీయుల చొరవ

ల్యూమిరే సోదరులు సినిమా ప్రొజెక్టరు కనుగొన్న తరువాత చలన చిత్రాలు దిగుమతి చేసుకొని ప్రదర్శించబడ్డాయి. మొదట బొంబాయిలోని వాట్సన్ హోటల్, ఎస్ప్లనేడ్ భవనంలో ఆరు చిన్న మూకీ చిత్రాలు 1896 జూలై 7న ప్రదర్శింపబడ్డాయి. 1897లో ఒక అజ్ఞాత విదేశీ ఫొటోగ్రాఫర్ 'కోకోనట్ ఫెయిర్', 'అవర్ ఇండియన్ ఎంపైర్' అనే రెండు చిన్న చిత్రాలను చిత్రీకరించాడు. 1898లో కొలొరెల్లో, కార్గాగ్లియా – యిద్దరు ఇటలీ దేశస్థులు బొంబాయిలోని అజాద్ మైదానంలో గుడారాలలో సినిమాలు ప్రదర్శించారు. 1898 జనవరిలో ది డెత్ ఆఫ్ నెల్సన్, నోస్ ఆర్క్, కాల్ ఆన్ ది లండన్ ఫైర్ – బ్రిగేడ్ – అనే మూడు దిగుమతి చేసుకోబడిన కధాచిత్రాలు ప్రదర్శింపబడ్డాయి.

మొదటిసారిగా భారతీయుడు హరిశ్చంద్ర భాట్వాడేకర్ (సావేదాదా) భారతదేశంలో రెండు లఘు చిత్రాలను చిత్రీకరించి ప్రదర్శించాడు. తరువాత భారతీయ చలన చిత్ర రంగంలో అగ్రగాములైన హీరాలాల్ సేన్, యఫ్.బి. తానావాలాలు 1900లో కలకత్తా బొంబాయిలలో లఘు చిత్రాల నిర్మాణం చేపట్టారు.

'స్ప్లెండిడ్ న్యూ వ్యూస్ ఆఫ్ బాంబే', 'టాబూ ప్రొసెషన్' లాంటి లఘు చిత్రాలను తానావాలా 1900లో నిర్మించారు. సేన్ 'ఇండియన్ లైఫ్ అండ్ సీన్స్' లఘు చిత్రాన్ని 1903లో నిర్మించారు. చిన్న కథా చిత్రాలు దిగుమతి చేసుకొని ప్రదర్శించడం కొనసాగింది. అలాంటి చిత్రాలలో కొన్ని: 'లైఫ్ ఆఫ్ క్రైస్ట్' (1901), 'అలాడీన్ అండ్ ద వండర్ ఫుల్ లేంప్' (1902), 'ఆలీబాబా అండ్ 40 థీవ్స్' (1903), నెపోలియన్ బోనపార్టే (1904). 1902

ప్రాంతంలో జె.యఫ్. మదన్, అబ్దుల్లా ఈసఫల్లీలు దిగుమతి చేసుకోబడిన చిత్రాల్ని ప్రదర్శించడం వృత్తిగా చేపట్టారు.

1900లో మద్రాసులో మేజర్ వార్విక్ మొదటి సినిమా ప్రదర్శన ప్రారంభించారు. 1907లో జంషెడ్జీ మదన్ కలకత్తాలో 'ఎల్‌ఫిన్‌స్టన్ పిక్చర్ పేలెస్'ని ప్రారంభించారు. మదన్ తొలి చిత్రాలు 'గ్రేట్ బెంగాల్ పార్టీషన్ మూవ్‌మెంట్' (1905), 'ఢిల్లీ దర్బార్ అండ్ కారొనేషన్' (1911), కాటన్ ఫైర్ ఎట్ బొంబే' లాంటి చారిత్రక కథా వస్తువుల చిత్రాలు. మద్రాసులో తొలి పర్మనెంటు సినిమా 'ది గెయిటీ'ని ఆర్. వెంకయ్య, ఆర్.యస్. ప్రకాష్‌లు నిర్మించారు. 1916లో భారతదేశంలో హాలీవుడ్ మొదటి ఏజన్సీని యూనివర్శల్ పిక్చర్ స్థాపించింది.

**భారతదేశపు మూకీ చిత్రాలు:**

20వ శతాబ్ద ప్రారంభం నుండి భారతదేశం మూకీ చిత్రాల నిర్మాణం ప్రారంభించింది. 1912లో యన్.జి. చిత్రే, ఆర్.జి. టోర్నీ 'పుండాలిక్' అనే మూకీ చిత్రాన్ని నిర్మించారు. కానీ ఆ చిత్ర నిర్మాణంలో బ్రిటిషువారి పాత్ర సగం ఉంది. దాదా సాహెబ్ ఫాల్కేగా ప్రసిద్ధిగాంచిన ఘుండీరాజ్ గోవింద ఫాల్కే 1913 మే 3న 'రాజా హరిశ్చంద్ర' అనే పూర్తి స్వదేశీ మూకీ చిత్రాన్ని నిర్మించారు. చిత్రం బొంబాయి కారొనేషన్ సినిమా హాలులో విడుదల చేయబడింది. ఆ తరువాత ఫాల్కే మోహినీ భస్మాసుర (1913), సత్యవాన్ సావిత్రి (1914), లంకా దహన్ (1917) చిత్రాలు నిర్మించారు. 'లంకా దహన్' భారతదేశంలో మొదటి బాక్సాఫీస్ హిట్ చిత్రమయింది. కోహినూర్ ఫిల్మ్ కంపెనీ, ఫాల్కే హిందుస్తాన్ సినిమా ఫిల్మ్ కంపెనీ అనే రెండుకొత్త చిత్ర నిర్మాణ సంస్థలు 1918లో స్థాపించబడ్డాయి.

1920 నాటికి చిత్ర నిర్మాణం క్రమబద్ధమైన పరిశ్రమగా మారింది. మూకీ చిత్రాల నిర్మాణ కాలంలో కేవలం 27 చిత్రాలు నిర్మించబడ్డాయి. కానీ 1931 నాటికి నిర్మించబడిన సినిమాల సంఖ్య 207కి పెరిగింది. ధీరేన్ గంగూలీ నిర్మించిన 'బిలాత్ ఫెరాత్' ప్రేమకథా చిత్రం 1921లో విడుదల చేయబడింది. అదే సంవత్సరం బొంబాయి కోహినూర్ స్టూడియోస్ భక్త విదుర చిత్రాన్ని నిర్మించింది. ఈ దశాబ్దంలో చాలా నిర్మాణ సంస్థలు, నిర్మాతలు ముందుకు వచ్చారు. బాబూరావు పెయింటర్ (షాపుకారి పాశ్) సుచేతసింగ్ (శకుంతల), చందూలాల్ షా (గుణసుందరి) ఈ కాలంలో నిర్మించబడిన చిత్రాలు. ఆర్దేర్షిర్ ఇరాని, వి. శాంతారాంలు 20వ శతాబ్దం నాటి ప్రముఖ నిర్మాతలు.

ఈ కాలంలో నిర్మించబడిన గమనించదగిన మూకీ చిత్రాలలో కొన్ని: మదన్ నిర్మించిన నలదమయంతి (1921), పతిభక్తి (1922), నూర్జహాన్ (1923), బాబూరావు పెయింటర్ నిర్మించిన మాయాబజార్ (1923), కాలనాగ్ (1924), సినిమా క్వీన్ (1926), చందులాల్ షా నిర్మించిన భానేలి భామిని (1927), ఆర్దేషిర్ ఇరాని నిర్మించిన అనార్కలి

(1928), వి. శాంతారామ్ నిర్మించిన గోపాలకృష్ణ (1929), జగదీష్ కంపెనీ నిర్మించిన చంద్రముఖి (1929), సేఠ్ మాణిక్‌లాల్‌పటేల్ యొక్క హతీమ్ తాయ్, యస్.యస్. అగర్వాల్ యొక్క దిలర్ జిగర్ (1931), గులామిని పఠాన్ (1931), దేవకీ బోస్ యొక్క రాజ్ రాణీ మీరా (1933) రంజిత్ కంపెనీ యొక్క గుణసుందరి (1934) బాంబే టాకీస్ యొక్క అచ్యుత్ కన్య (1936), న్యూ థియేటర్ నిర్మించిన 'స్ట్రీట్ సింగర్' (1938).

వి.శాంతారాం దర్శకత్వం వహించిన 'అమర్ జ్యోతి' మహిళా విముక్తి సమస్యపై నిర్మించిన మొట్టమొదటి చిత్రం. ఫాతిమా బేగం బహుశ మొట్టమొదటి మహిళా దర్శక నిర్మాత నిర్మించిన చిత్రం 'బుల్‌బుల్–ఎ–ఫరిస్తా' 1926లో విడుదల అయింది. ఇటలీ సహకారంతో 1921లో నలదమయంతి చిత్రం నిర్మించబడింది. జర్మన్ సహకారంతో హిమాంశురాయ్ ప్రేమ్ సన్యాసి / లైట్ ఆఫ్ ఆసియా (1929), 'ఎ త్రో ఆఫ్ డైస్' (1930) నిర్మించారు. కోహినూర్ ప్రొడక్షన్స్ నిర్మించిన 'భక్త విదుర్' 1921లో మద్రాసులో నిషేధించబడింది. భారత చలన చిత్ర రంగంలో యిది మొట్టమొదటిసారిగా సెన్సార్ షిప్‌కి గురయిన చిత్రం. చిత్ర ప్రదర్శనపై వినోదపు పన్ను 1922లో కలకత్తాలో విధించబడింది. తరువాత సంవత్సరంలో బొంబాయిలో విధించబడింది.

జానపద కథలు, చారిత్రక కథలు, కల్పిత కథలు మూకీ చిత్రాలుగా వచ్చాయి. కానీ మూకీ చిత్రాలు పూర్తిగా నిశ్శబ్దంగా సాగేవికావు. మూకీ చిత్రాలతో పాటు మ్యూజిక్ ప్రదర్శింపబడేవి. చిత్ర కథా గమనాన్ని అనుసరించి హార్మోనియం, తబల, వయోలిన్ లాంటి వాద్య పరికరాల మ్యూజిక్ ఉండేది. మూకీ చిత్రాల మెయిన్ టైటిల్స్ ఇంగ్లీషు, ప్రాంతీయ భాషల్లో ఉండేవి. సబ్ టైటిల్ నాలుగు ప్రాంతీయ భాషలలో–ఇంగ్లీషు, గుజరాతి, హిందీ (లేక బెంగాలి, మరాఠీ లేక తమిళం), ఉర్దూలో ఉండేవి. రాజకీయ చిత్రాలపై సెన్సార్ నిబంధనలు ఉండేవి. చిత్ర నిర్మాణం పాలనలో జోక్యం చేసుకోనంత వరకు బ్రిటిషు పాలకులు చిత్ర నిర్మాణంలో జోక్యం చేసుకోలేదు. అందువలన ముద్దులు, ప్రేమ దృశ్యాలు అసహ్యకరమైనవిగా భావించబడలేదు. పతిభక్తి (1922), ఎత్రో ఆఫ్ డైస్ (1930), కర్మ (1933) లాంటి చిత్రాలలో ముద్దుల దృశ్యాలు ఉన్నాయి.

1920 దశాబ్దం నాటి ప్రముఖ నటీమణులు పేషెన్స్ కూపర్, సినోరా మినేలి, సులోచన (రూబిమేయర్స్), సీతాదేవి (రెనీస్మిత్), తార. హిందీ సినిమాలలోని ప్రముఖ పురుష నటులు డి.బిల్లి మోరియా, సంపత్, హిమాంశురాయ్, చారు రాయ్, వి. శాంతారాం, గోహిర్, రాజా శాండో.

### భారత టాకీ చిత్రాల యుగం:

మొదట భారతీయ టాకీ చిత్రం 'ఆలం ఆరా'ని ఇంపీరియల్ ఫిలిం కంపెనీ నిర్మించింది. అర్దేర్షిర్ ఇరాని దర్శకత్వం వహించారు. బొంబాయిలోని మెజెస్టిక్ సినిమా

థియేటర్‌లో 1931లో మార్చి 14న విడుదల చేయబడింది. టాకీ చలన చిత్రాలలో 'ఆలం ఆరా' మొట్టమొదటిగా నిర్మించబడిన చలన చిత్రం. ఈ చిత్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఇది భారతీయ చలనచిత్రాన్ని మొదటి గాయకుడు డబ్ల్యు.యం. ఖాన్‌ని అందిందించి ప్రజాదరణ పొందిన హిందూస్తానీ సంభాషణలను, 7 పాటలను అందించింది. పాటలు ప్రజాదరణ పొందడంతో పాటల సంఖ్య పెరిగింది. 'ఇంద్రప్రస్థ' 71 పాటలతో తీయబడింది. 'ఘర్‌కీ లక్ష్మి' (1931) బొంబాయి రెండవ టాకీ చిత్రం. అదే సంవత్సరంలో 'షిరీన్ ఫర్‌హాద్' విడుదలయింది.

టాకీ చిత్రాలు పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. మూకీ చిత్రాలు అత్యున్నత దశలో ఉన్నప్పుడు వచ్చిన టాకీ చిత్రాలు వాటిని వెనక్కినెట్టాయి. టాకీ చిత్రాలు కొత్త సమస్యల్ని తెచ్చిపెట్టాయి. అప్పటికి మాటల పాటల రచయితలు లేరు. ముందుగా రికార్డు చేసే వసతి లేనందున చిత్రీకరణ సమయంలోనే పాటలు పాడవలసి వచ్చేది. కనీస సంఖ్యలో వాయిద్య పరికరాలు వాడబడేవి. వాయిద్యకారులు గాయకుడి వెనుక గుంపుగా చేరి వాయించ వలసి వచ్చేది. అయినప్పటికీ టాకీ చిత్రాలు నిలదొక్కుకున్నాయి. తొలినాటి టాకీ చిత్రాలు అత్యధికం బెంగాలీ నిర్మాతలు నిర్మించారు. నరబలులు, మహిళా విముక్తి, పెద్దలు నిర్ణయించిన పెళ్ళిళ్ళు లాంటి సమస్యలపై దృష్టి సారించి టాకీ చిత్రాలయుగం సామాజిక చైతన్యాన్ని తీసుకొనివచ్చింది.

1930 దశాబ్దంలో ప్రభాత్, బాంబే టాకీస్, న్యూథియేటర్స్ – అవే మూడు ప్రముఖ నిర్మాణ సంస్థలు అన్ని వర్గాల సినీ ప్రేక్షకులను ఆకట్టుకునే సామాజికాంశాల్ని చేపట్టి నిర్మాణం ప్రారంభించాయి. 1930 దశాబ్దం ప్రారంభంలో స్టూడియో విధానం మొదలయింది. స్టూడియో విధానం ప్రారంభమైన తొలి కాలంలో పి.సి.బారు చిత్రం దేవదాసు (1935) నిర్మించబడింది. హిందీలో పునర్నిర్మింపబడిన దేవదాసు కుందన్‌లాల్ సైగల్‌కి ఎనలేని పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి. తొలినాటి ముఖ్యమైన టాకీ చిత్రాలలో కొన్ని : అయోధ్యరాజు (1932), లాల్ – ఎ – యమన్ (1933), చార్ ధర్వేష్, ఢాకూకి లడ్‌కీ, మిస్ 1933, బంబయికీ మోహినీ (1934), నయీ దునియా.

వి.శాంతారాం 'దునియా న మానే,' 'ఆద్మీ,' 'పడోసి,' ఫ్రాంజ్ ఆస్టెక్ యొక్క 'అచ్యుత్ కన్య,' మెహబూబ్ యొక్క 'వతన్,' 'ఏక్ హి రాస్తా,' 'ఔరత్' లాంటి చాలా చిత్రాలు సామాజిక న్యాయాలను చిత్రీకరించాయి. చారిత్రక చిత్రాల ప్రముఖ నిర్మాత సోహ్రాబ్ మోడి భారత చిత్రాల స్థాయిని చిత్రీకరించే పద్ధతిని గణనీయంగా అభివృద్ధిపరచారు. ప్రభాత్ నిర్మించిన 'సైరంధ్రి' 1933లో జర్మనీలో ప్రింటులు తీయబడిన తొలి రంగుల చిత్రం. దేశీయంగా తయారుచేయించిన తొలి రంగుల చిత్రం. ఆర్దాషిర్ ఇరాని 1937లో నిర్మించిన 'కిసన్ కన్నయ్యా' దర్శకుడు గిద్వాని.

భారతదేశంలో స్టంటు చిత్రాలకు అగ్రగాములు జె.డి.హెచ్ మీడియా, హోమి వాడియా. వారి తొలి చిత్రం హంటర్ వాలీ (1935). 1930 దశాబ్దంలో భారతీయ చిత్రాలలో వాడియా, నాడియా పర్యాయ పదాలుగా ఉండేవి. ఆస్ట్రేలియా నటి మేరీ ఇవాన్స్ వాడియాల సినిమాల్లో స్టంటు నటిగా నటించింది. భయమెరుగని నాడియాగా పేరుతెచ్చుకున్నది. వాడియాలు తూఫాన్ మెయిల్, ఫ్లైయింగ్ రాణీ, పంజాబు మెయిల్ – లాంటి పలు చిత్రాలను నిర్మించారు. జె.బి.హెచ్ వాడియా నిర్మించిన 'నౌజవాన్' (1937) మొదటి పాటలు లేని చిత్రం. 'ప్రకాష్' బొంబాయికి చెందిన మరొక నిర్మాణ సంస్థ. ఒళ్ళు గగుర్పొడిచే చిత్రాలను నిర్మించడం దీని ప్రత్యేకత. 'జయంత్' ముసుగు వీరుడిగా నటించిన 'పాసింగ్ షో', ముసుగు ధరించిన మహిళా బందిపోటు దొంగను చిత్రించిన మెహబూబ్ నిర్మించిన 'దక్కన్ క్వీన్' విజయవంతమయ్యాయి. కె. సుబ్రహ్మణ్యం దర్శకత్వం వహించిన, నిర్మించిన ప్రేమ్ సాగర్ (1939) దక్షిణ భారతదేశంలో నిర్మింపబడిన తొలి హిందీ చిత్రం. మొదటి డ్రీమ్ గర్ల్గా ప్రసిద్ధి గాంచిన దేవికారాణి 1930లో సినీ జీవితం ప్రారంభించి 'కర', 'ఎ త్రో ఆఫ్ డైస్' లాంటి చిత్రాలలో నటించి అగ్రశ్రేణి కథానాయకిగా పేరుగాంచింది. ప్రఖ్యాతి గాంచిన అప్పటి యితర నటీమణులు : దుర్గా ఖోటే, నాడియా, జమున, పద్మాదేవి, కానన్ దేవి. 1930 దశాబ్దంలో ప్రఖ్యాతి గాంచిన కథా నాయకులు : పృధ్వీ రాజ్ కపూర్, కె.యల్. సైగల్, అశోక్ కుమార్, బి.సి. చారూ.

1940 దశాబ్దం సంక్షుభిత దశాబ్దం. మొదటి అర్థభాగం యుద్ధాలతో అతలాకుతలమైంది. రెండవ అర్థభాగం ప్రపంచ వ్యాప్తంగా సానుకూలమైన రాజకీయ మార్పులు సంభవించాయి. ప్రముఖ నిర్మాత వి.శాంతారాం. 'డాక్టర్ కొట్నీస్‌కి అమర్ కహనీ', 'పడోసి', 'దో ఆంఖే బారా హాత్', 'పింజర్', "చానీ', 'ఝునక్‌ఝునక్ పాయల్ బాజే', 'గీత్ గాయా పత్తరోంనే' లాంటి గొప్ప చిత్రాలను నిర్మించారు. 1940 దశాబ్దంలో రంజిత్ నిర్మించిన 'అచూత్', ఆచార్య నిర్మించిన 'బంధన్', మోహబూబ్ నిర్మించిన 'ఔరత్' (మదర్ ఇండియా తొలిరూపం), రోటీ, చేతన్ ఆనంద్ నిర్మించిన 'నీచానగర్', అబ్బాస్ నిర్మించిన 'ధర్తీ కే లాల్', సోహ్రాబ్ మోడి నిర్మించిన సికిందర్, పుకార్, ఏక్‌దిన్‌కా సుల్తాన్, పృధ్వీవల్లభ్, యన్. నజీర్ నిర్మించిన 'లైలా మజ్ను', కేదార్‌శర్మ నిర్మించిన చిత్రలేఖ, జె.బి.హెచ్. వాడియా నిర్మించిన 'కోర్టు డేన్సర్', యస్.యస్.వాసన్ నిర్మించిన చంద్రలేఖ, విజయభట్ నిర్మించిన 'భరత్ మిలవ్', 'రామరాజ్య', రాజ్‌కమల్ కళామందిర్ నిర్మించిన శకుంతల, యస్. ముఖర్జీ నిర్మించిన 'కిస్మత్', సంతోషి నిర్మించిన 'షెహనాయ్', ప్రకాష్ నిర్మించిన 'సమాజ్ కో బదల్ డాలో', కమల్ అమ్‌రోహి నిర్మించిన 'మహల్' లాంటికలకాలం జ్ఞాపకం ఉండే చిత్రాలు నిర్మించిన దశాబ్దం.

1948లో ప్రముఖ ఆధునిక నర్తకుడు ఉదయశంకర్ కల్పన చిత్రాన్ని నిర్మించాడు. టెక్నీకలర్‌లో వచ్చిన తొలిచిత్రం సోహ్రాబ్ మోడి నిర్మించిన 'ఝాన్సీ కే రాణీ'(1953). 1940

దశాబ్దం నాటి ప్రముఖ నటులు: కిషోర్‌సాహు, జైరాజ్, పహారి సన్యాల్, పంకజ్ మల్లిక్, భరత్ భూషణ్, ఉల్లాస్, గులాం మహమ్మద్, అశోక్ కుమార్, ప్రముఖ నటీమణులు: కానన్‌దేవి, జమున, లలితాపవర్, నూర్జహాన్ (తరువాత పాకిస్తాన్‌కి వలస పోయింది). సురయ్యా, మధుబాల.

1950 దశాబ్దం దిలీప్ కుమార్, రాజ్‌కపూర్, దేవానంద్ త్రయాన్ని వెండితెరకి పరిచయం చేసిన దశాబ్దం. 1950లో 'బర్సాత్'తో ఆర్.కె. ఫిలింస్ చిత్ర నిర్మాణక్రమం ప్రారంభించింది. అదే సంవత్సరం పాట్నా హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ అగర్వాల్ ఛైర్మన్‌గా ఫిలిం సెన్సార్ సెంట్రల్ బోర్డు స్థాపించబడింది. 1952లో బొంబాయిలో నిర్వహింపబడిన అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ భారతీయ చిత్ర పరిశ్రమపై గొప్ప ప్రభావం చూపింది. 1953లో బిమల్‌రాయ్ 'దో బీగా జమీన్' కేన్స్‌లో అవార్డు పొందింది. మొదటి జాతీయఫిల్మ్ అవార్డులు 1954లో 'శ్యామ్ చి ఆయే'కి జగత్ మురారి యొక్క 'మహాబలిపురం'నకు దక్కాయి. 1955లో సత్యజిత్ రాయ్ 'పథేర్ పాంచాలి' కేన్స్ అవార్డు పొందడమే గాక అనేక జాతీయ అంతర్జాతీయ అవార్డులు గెల్చుకొన్నది.

1957లో హిందీ చిత్రాలలో తల్లిని ప్రధాన పాత్రగా చిత్రీకరించిన 'మదర్ ఇండియా' ఉత్తమ విదేశీ భాషా చిత్రంగా ఆస్కార్ అవార్డుకి సిఫార్సు చేయబడింది. అదే సంవత్సరంలో ఇండో సోవియట్ సహకారంతో కె.ఎ. అబ్బాస్ 'పరదేశి' చిత్రం నిర్మించారు. గురుదత్ 1958లో నిర్మించిన 'కాగజ్ కె ఫూల్' మొదటి సినిమా స్కోపు చిత్రం. అదే సంవత్సరం మొదటి డాక్యుమెంటరీ (కథాచిత్రాల) చిత్రోత్సవం బొంబాయిలో నిర్వహించబడింది. రంజిత్ యొక్క జోగాన్, బిమల్‌రాయ్ 'దేవదాసు', 'మధుమతి' కేదార్‌శర్మ 'భవరే నయన్',రాజ్‌కపూర్ 'బూట్ పాలిష్' 'శ్రీ420', 'జాగ్‌తేరహో', మెహబూబ్ 'మదర్ ఇండియా', గురుదత్ 'ప్యాసా', కాగజ్ కె ఫూల్', కె.ఎ. అబ్బాస్, 'ఆధీరాత్', 'అన్ హోనే', దేవేంద్ర గోయల్ 'వచన్', అమియా చక్రవర్తి 'సీమ', ప్రకాష్ 'బైజు బావరా', హృషికేష్ ముఖర్జీ 'ముసాఫిర్', రమేష్ సైగల్ 'ఫిర్ సుబహ్ హోగి', సావక్ వచ్చా 'యాహుది', బి.ఆర్. చోప్రా 'కానూన్'; 'ధూల్ కాఫూల్', 'ఏక్‌హి రాస్తా'.

రంగుల చిత్రాలు 'ఆన్', 'ఝాన్సీ కి రాణి' నిర్మించబడ్డాయి. సోహ్రాబ్ మోడి నిర్మించిన 'మీర్జా గాలిబ్' (1954) రాష్ట్రపతి బంగారు పతకాన్ని పొందిన మొదటిహిందీ చిత్రం. యస్.కె.ఓజా నిర్మించిన 'నాజ్' (1954) మొదటిసారిగా విదేశాలలో – లండన్, కైరోలలో నిర్మించిన హిందీ చిత్రం. గురుదత్ యొక్క 'కాగజ్ కె ఫూల్' బ్లాక్ అండ్ వైట్‌లో తీయబడిన తొలి భారతీయ సినిమా స్కోపు చిత్రం. 1950 దశాబ్దం చిత్రాలలో ప్రముఖ హీరోలు: దిలీప్ కుమార్, రాజ్‌కపూర్, దేవానంద్, కిషోర్‌కుమార్, మహిపాల్, రాజ్‌కుమార్, బలరాజ్ సహాని, షమ్మీకపూర్. ప్రముఖ కథానాయికలు: సంధ్య, వైజయంతిమాల, నర్గీస్, నూతన్, సుచిత్రసేన్, వహీదా రెహమాన్, ఆశాపరేఖ్.

1960 దశాబ్దం సినిమాలలో అత్యంత శ్రావ్యమైన సంగీతాన్ని వినిపించిన దశాబ్దం. కె.అసీఫ్ 'మొగల్–ఎ–ఆజమ్' విడుదల చేశారు. ఈ చిత్రం గతంలోని అన్ని బాక్సాఫీసు రికార్డుల్ని బద్దలు కొట్టింది. ఆ తరువాత వరుసగా రాజ్‌కపూర్ 'జిస్ దేశ్‌మె గంగా బెహతీహై', 'సంగమ్' గురుదత్ 'సాహిబ్ బీబీ ఔర్ గులాం', దేవానంద్ 'గైడ్', 'బిమల్ రాయ్ 'బందిని', యస్. ముఖర్జీ 'జంగ్లీ', సునీల్‌దత్ 'ముఝేజానేదో', బాసు భట్టాచార్య 'తీస్రీకసమ్', కె.ఎ. అబ్బాస్ 'ఆస్మాన్ మహల్' (1965), ప్రమోద్‌చక్రవర్తి 'లవ్ ఇన్ టోక్యో', రామానందసాగర్ 'ఆర్జూ'; శక్తి సామంత్ 'ఆరాధన'; హృషికేష్ ముఖర్జీ 'ఆశీర్వాద్', 'ఆనంద్'; జి.ఆర్.చోప్రా'వక్త్', 'గుమ్‌రాహ్', మనోజ్‌కుమార్ 'ఉపకార్'.

రాజ్‌కపూర్ చిత్రం 'సంగమ్' విదేశాలలో చిత్రీకరించే ధోరణికి ప్రచారం ఇచ్చింది. 1960 దశాబ్దంలో చిత్రాల దృష్టి సామాజిక సమస్యల నుండి ప్రేమ కథా చిత్రాలపై పడింది. ఈ కాలంలో జాతీయవాదంపై కూడా చిత్రాలు వచ్చాయి. 1962, 1965 భారత పాకిస్తాన్ యుద్ధాల తరువాత భారతీయ అధికారి చుట్టూ కథ అల్లి భారతీయ భావాన్ని ప్రోది చేసే ప్రయత్నం జరిగింది. 'సంగమ్' (రాజ్‌కపూర్, 1964), ఆరాధన (శక్తి సామంత్, 1969) అలాంటి చిత్రాలు. చేతన్ ఆనంద్ యొక్క 'హకీకత్' (1964) ఆ దశాబ్దంలో జ్ఞాపకం ఉంచుకోదగిన యుద్ధాన్ని చిత్రీకరించిన సినిమా. హేమంత్ కుమార్ 'బీస్ సాల్ బాద్' (1963) విజయవంతమైన చిత్రం.

1960లో పూనాలో ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ ప్రారంభించబడింది. అదే సమయంలో మద్రాసులో ఫిల్మ్ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ ప్రారంభించబడింది. 1961లో రెండవ ఫిల్మ్ ఫెస్టివల్ ఢిల్లీలో నిర్వహించబడింది. 1969లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులు ప్రారంభించబడ్డాయి. 'ఆరాధన' విజయవంతమవడంతో 1960 దశాబ్దాంతానికి రాజేష్ ఖన్నా ప్రముఖ ప్రేమ కథానాయకుడయ్యాడు. ఈ చిత్రం గాయకుడిగా కిశోర్ కుమార్‌కి మంచి పేరు తెచ్చి పెట్టింది. దిలీప్ కుమార్, సునీల్ దత్, అశోక్ కుమార్, మనోజ్ కుమార్, 1960 దశాబ్దపు ప్రముఖ కథానాయకులు. వైజయంతి మాల, మధుబాల, నూతన్, వహీదా రెహమాన్ ప్రముఖ కథానాయికలు. అందాజ్, ఆరాధన, కటీ పతంగ్, దో రాస్తే, దుష్మన్ – లాంటి చిత్రాలు విజవంతమవడంతో 1960, 70 దశాబ్దాలలో రాజేష్ ఖన్నా ప్రముఖ ప్రేమ కథానాయకుడిగా ఎదిగారు.

## ప్రముఖ వ్యక్తులు

**అశోక్ కుమార్ :** హిందీ చిత్రరంగంలో అత్యంత ప్రముఖ నటులలో ఒకరు. మొదటి చిత్రం 'జీవన్‌నయ్యా' (1936). ఆ వెనువెంటనే వచ్చిన చిత్రం 'అచ్యుత్ కన్య' (1936). ఆయన సుదీర్ఘ సినీ జీవితంలో కంగన్ (1939), ఆజాద్ (1940), మహల్

(1949), దీదార్ (1951), చల్తీకా నామ్ గాడీ (1958), ధూల్ కా ఫూల్ (1959), గుమ్రాహ్ (1963), చిత్ర లేఖ (1964), బహుబేగం (1967), ఆశీర్వాద్ (1968), ఆరాధన (1969), సత్యకం (1969), పాకీజా (1971), గుడ్డీ (1971), ఛోటీ సీ బాత్ (1975) – లాంటివి మైలు రాళ్ళు.

**దాదా ఖోద్కే :** మరాఠీ హాస్య నటుడు. వితండ వాదంతో హాస్యాన్ని పండించారు. మరాఠీ చిత్రం 'సోన్గాద్య' నటుడిగా, దర్శకుడిగా జీవితం ప్రారంభించిన ఆయన దాదాపు అన్ని చిత్రాలలో ఉషా చవాన్ తో కలిసి నటించారు. విజయం సాధించిన ఆయన చిత్రాలు : పాండు హవల్దార్, బోత్ లావిన్ తిత్వే, గుద్గుల్యా, ముకాగ్యాముకా, రాం రాం గంగారాం లాంటి మరాఠీ చిత్రాలు; తేరీ మేరీ బీచ్ మే, అంధేరీ రాత్మే దియా తేరే హాత్మే – లాంటి హిందీ చిత్రాలు. మరాఠీ చిత్రాలు వరుసగా తొమ్మిది చిత్రాలు విజవంతమవడంతో ఆయన పేరు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదయింది.

**ధుండే రాజ్ గోవింద్ ఫాల్కే :** దాదా సాహేబ్ ఫాల్కే (1870 – 1944)గా ప్రసిద్ధి గాంచాడు. భారతీయ చలన చిత్ర పితామహుడుగా గుర్తింపబడ్డారు. తొలి భారతీయ దేశీయ కథాచిత్రం రాజా హరిశ్చంద్రని 1912లో నిర్మించారు. తరువాతి చిత్రాలు మోహినీ భస్మాసుర (1914), సావిత్రి సత్యవాన్ (1914), లంకా దహన్ (1917). ఇంకా పితాబే పంజే, సౌలగ్న రాస, ఎనిమేటెడ్ కాయిన్స్, విచిత్ర శిల్ప – లాంటి హాస్య చిత్రాలను నిర్మించారు. సింహాస్త పర్వాని, కార్తీక పూర్ణిమ ఫెస్టివల్, గణేష్ ఉత్సవ లాంటి విషయ ప్రధాన చిత్రాలను; బర్డ్స్ ఐవ్యూ ఆఫ్ బోధ్ గయ, రాక్ కట్ టెంపుల్స్ ఆఫ్ ఎల్లోరా – లాంటి డాక్యుమెంటరీ చిత్రాలను నిర్మించారు. అంతేగాక 1917లో చిత్రాలు ఎలా నిర్మింపబడతాయనే లఘు చిత్రాన్ని నిర్మించారు. ఆయన చిత్ర రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1960లో చిత్రరంగంలో అత్యున్నత పురస్కారమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుని ప్రవేశపెట్టింది.

**దేవానంద్ :** 1946లో సినీరంగ ప్రవేశం చేశారు. బాజీ, టాక్సీ డ్రైవర్, కాలా బజార్, కాలా పానీ, పాకెట్ మాల్, సౌలహ్ సాల్, తీన్ దేవియా, షరాబి, తేరే ఘర్ కె సామ్నే, గైడ్, జానీ మేరా నామ్, జ్యూయల్ థీఫ్, హరే కృష్ణ హరే రామ్, దేశ్ పర్దేశ్ లాంటి చిత్రాలతో ప్రజాదరణ పొందిన ప్రముఖ నటులలో ఒకరయ్యారు. ఆ తరువాత నవకేతన్ ఫిల్మ్స్ నిర్మాణ సంస్థ సేవతో చిత్ర నిర్మాణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆ సంస్థ 50వ వార్షికోత్సవాన్ని ఇటీవల జరుపుకొన్నది. కాలాపానీ (1959), గైడ్ (1967) చిత్రాలలోని పాత్రలకు ఉత్తమ నటుడుగా అవార్డులు అందుకున్నారు.

**దేవికారాణి :** 1930, 1940 దశాబ్దాలలో అగ్రశ్రేణి కథానాయకి. 'ఫస్ట్ లేడీ ఆఫ్ హిందీ స్క్రీన్'గా గుర్తింపు పొందింది. తన భర్త హిమాంశు రాయ్తో కలిసి 1934లో బాంబే

టాకీస్ స్థాపించింది. ప్రముఖ విషాద నాయకుడు దిలీప్ కుమార్‌ను హిందీ చిత్ర పరిశ్రమకు ఆమే పరిచయం చేసారు. ఆమె చిత్రాలు 'కర్మ', 'అచ్యుత్ కన్య' కలకాలం జ్ఞాపకం ఉండే చిత్రాలు. ఆమె 'పద్మశ్రీ' (1958)తో సహా పలు అవార్డులు గౌరవ పురస్కారాలు పొందిన నటి.

**దిలీప్ కుమార్ :** విషాద నాయక పాత్రలకు ఆయనకు ఆయనే సాటి. 1922లో పెషావర్‌లో జన్మించారు. యూసుఫ్‌ఖాన్ ఆయన అసలు పేరు. ఆయన్ని దేవికారాణి చిత్రరంగంలో ప్రవేశ పెట్టింది. 1944లో 'జ్వార్ భట'తో సినీరంగ ప్రవేశం మొదలయింది. దిలీప్ నటించిన ప్రముఖ చిత్రాలు : మేలా (1948), అందాజ్ (1949), బాబుల్ (1950), జోగన్ (1950), దీదార్ (1951) ఆన్, దాగ్ (1952), ఫుట్‌పాత్ (1953);అజాద్, ఉడన్ ఖటోలా (1955), నయాదౌర్ (1957), మధుమతి (1958), అమర్ (1959), కోహినూర్, మొఘల్–ఎ–ఆజమ్ (1960), గంగ జమున (1961), లీడర్ (1964), దిల్ దియా దర్ద్ లియా (1966), రామ్ ఔర్ శ్యామ్ (1967), రేష్మా ఔర్ షేరా (1971), బైరాగ్ (1976), క్రాంతి (1981), శక్తి, విధాత (1982), మషాల్ (1984), కర్మ (1986), సౌదాగర్ (1991), ఖిలా (1998). పాకిస్తాన్ అత్యున్నత పౌరపురస్కారం నిషాన్ – ఎ – ఇంతియాజ్‌ని అందుకొన్న ఏకైక భారతీయ నటుడు.

**గురుదత్ :** భారతదేశంలో 1950 దశాబ్దంలో మారుతున్న సామాజిక పరిస్థితుల్ని చిత్రీకరించ యత్నించిన ప్రముఖుడిగా భారతీయ చలన చిత్ర చరిత్రలో కలకాలం గుర్తుంటారు. గురుదత్ నటుడిగా, దర్శకుడిగా 1944లో సినీ జీవితాన్ని ప్రారంభించాడు. ఆయన బ్రతికిన కొద్దికాలంలోనే అత్యున్నత స్థాయి సామాజిక చైతన్యాన్ని కలిగించే బాజి (1951), ప్యాసా (1957), కాగజ్ కె ఫూల్ (1959) లాంటి చిత్రాలను నిర్మించారు. సి.ఐ.డి. (1956)లో వహీదా రెహమాన్‌ని పరిచయం చేశారు. తన చిత్రాల ద్వారా ఆమెని అత్యున్నత నటిగా తీర్చిదిద్దారు. గురుదత్ చిత్రాలలో ఒక రకమైన చింతన, తాత్వికత ఉంటాయి. చౌదివీకా చాంద్ (1960), సాహిబ్ బీబీ ఔర్ గులాం (1962) అందుకు ఉదాహరణలు. లైటింగ్, కెమెరా పనుల నుండి చిత్ర నిర్మాణానికి చెందిన అన్ని పనులలో ఆయన అత్యంత శ్రద్ధ తీసుకునేవారు. గురుదత్ ప్రతిభావంతమైన సినీ జీవితం మద్యం మత్తులో సుదీర్ఘ పోరాటం జరిపి 1964లో ఆత్మహత్యతో అంతమయింది.

**కె.యల్.సైగల్ (1904 - 1947) :** శతాబ్దపు అత్యంత గొప్ప గాయకుడిగా ప్రసిద్ధి గాంచారు. సంగీతంలో విశేష ప్రజ్ఞాపాటవాలు గలవారు. ఆయన మొదటి పాటల రికార్డింగు 'ఝూల్నా ఝులావో' 1932లో కలకత్తాకి చెందిన హిందుస్తాన్ రికార్డ్స్ చేపట్టింది. 1934లో న్యూ థియేటర్ నిర్మాణ సంస్థ నిర్మించిన 'చండీదాస్', 1935లో నిర్మించిన

‘దేవదాసు’లతో నటుడిగా గాయకుడిగా సైగల్ విశేషమైన పేరు ప్రఖ్యాతులార్జించాడు. యాహుదీకి లడ్కీ (1933) చిత్రంలో సైగల్ పాడిన గజల్ ‘నుక్తా చిన్ హై గమే దిల్’ దేశవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది. సైగల్ ఉర్దూ కవిత్వాన్ని అభిమానించాడు. సంగీతంలో కవిత్వంలో కొత్తదనాన్ని సృష్టించారు. ప్రముఖ ఉర్దూ కవి మీర్జా గాలిబ్ ఆయన అభిమాన కవి. 1954 లో సోహరాబ్ మోడి నిర్మించిన మీర్జాగాలిబ్ చిత్రంలో గాలిబ్ గజల్స్ సైగల్ మధుర స్వరం ప్రజల మనసుల్లో కలకాలం ఉండేలా చేసింది.

**లతా మంగేష్కర్ :** భారతీయ సినీ సంగీతంలో వివాదరహితమైన రాణిగా గుర్తింపు పొందింది. మరాఠీ చిత్రం పెహలీ మంగ్లాగౌర్ చిత్రంలో గాయక నటిగా సినీ జీవితాన్ని ప్రారంభించారు. ఆమెపై చిత్రీకరించబడిన ఆమె తొలి హిందీ పాట 1944 నాటి ‘గజబావు’ మరాఠీ చిత్రంలోని దేశభక్తి గేయం. హిందీ చిత్రం ‘ఆప్ కీ సేవామే’ అనే తొలి హిందీ చిత్రంలో హిందీ పాట పాడారు. ఆమె కొన్ని మరాఠీ హిందీ చిత్రాలలో నటించారు. తరువాత నేపథ్యగానానికి పరిమితమయ్యారు. పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ లాంటి అనేక అవార్డులను గౌరవ పురస్కారాలను అందుకొన్నారు. ఆమె గౌరవార్థం మధ్యప్రదేశ్ ప్రభుత్వం వార్షికంగా లతామంగేష్కర్ అవార్డుని ఏర్పాటు చేసింది.

**మధుబాల :** అసలు పేరు బేగం ముంతాజ్ జెహాన్ (1933 – 69) అందమైన ముఖంతో, తనదైన చిరునవ్వుతో ఆమె హిందీ చలన చిత్రరంగంలో సంచలనం సృష్టించింది. మొదట విజయవంతమైన చిత్రం కేదార్ శర్మ నిర్మించిన నీల్ కమల్ (1947). చిరకాలంగా గుర్తుండే ఆమె నటించిన ఇతర చిత్రాలు : మహల్, అమర్, మిస్టర్ అండ్ మిసెస్ 55, చల్తీ కా నామ్ గాడీ, హౌరా బ్రిడ్జ్, జూమ్‌రూ, కాలాపానీ, మొఘల్ – ఎ – ఆజమ్. 36 సం॥ల పిన్న వయస్సులో 1969లో మరణించింది.

**మజ్రూహ్ సుల్తాన్‌పురి :** ప్రఖ్యాత కవి, సినిమా పాటల రచయిత. ఫెయిజ్ అహ్మద్ ఫెయిజ్ కాలం నుండి ఉర్దూ కవిత్వంలో ప్రఖ్యాతిగాంచిన వారిలో ఒకరు. వచన రూపంలో ప్రేమ గీతాలు రాయడంలో ప్రసిద్ధుడు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత. 50 ఏళ్ళ సినీ జీవితంలో దాదాపు 350 చిత్రాలకు పాటలు వ్రాసారు. తన తొలి చిత్రం షాజాహాన్ లో ‘జబ్ ఉస్‌నే కేశూ బికరే’, ‘గుమ్ దియా ముస్తాకిల్’ – లాంటి పాటలతో మంచి గుర్తింపు పొందారు. ఉర్దూలో చాలా రచనలు చేసినప్పటికీ సినీ పాటల ద్వారానే ప్రజలలో పేరు ప్రఖ్యాతులార్జించారు.

**మీనాకుమారి (1932 – 72) :** మీనా కుమారి 6 సం॥ల వయస్సులో తన మొదటి చిత్రంలో నటించారు. 1950 దశాబ్దం ప్రారంభంలో బైజూ బావరా (1952) విడుదలతో విషాద నాయికగా తారాపథాన్ని అందుకొన్నారు. 1953లో ఆమె నటించిన

మూడు చిత్రాలు – డయెూరా, దో బీఘా జమీన్, పరిణీత విజయవంతమయ్యాయి. పరిణీత ఆమె సినీ జీవితంలో మూల మలుపు. ఆమె నటించిన మంచి చిత్రాలకు దర్శకత్వం వహించిన కమల్ అమ్రోహిని వివాహమాడారు. ఆమె నటించిన సాహిబ్ బీబీ ఔర్ గులాం (1962), దిల్ ఏక్ మందిర్, ఫూల్ ఔర్ పత్తర్, పాకీజా కలకాలం గుర్తుండే చిత్రాలు.

**రాజ్‌కపూర్ :** నటుడు, దర్శకుడు, నిర్మాత, బహుముఖ ప్రజ్ఞాశాలి. హిందీ చిత్ర రంగంలో తనకొక ప్రత్యేక స్థానాన్ని శాశ్వతంగా ఏర్పాటు చేసుకోగలిగాడు. నటుడు పృధ్వీరాజ్‌కపూర్ కుమారుడైన రాజ్‌కపూర్ తన 11వ ఏట సినీరంగ ప్రవేశం చేశారు. 1948లో తన స్టూడియోని నిర్మించి మొదటి చిత్రం ఆగ్ నిర్మించారు. ఆ తరువాత వెనుదిరిగి చూడలేదు. బర్సాత్, అందాజ్ (1949), ఆవారా (1951), బూట్ పాలిష్ (1954), శ్రీ 420 (1955), జాగ్‌తే రహో (1956), జిస్ దేశ్ మే గంగా బెహతీ హై (1960), సంగమ్ (1964), మేరా నామ్ జోకర్ (1970), బాబీ (1973), సత్యం శివం సుందరం (1978), రామ్ తేరీ గంగా మైలీ హో గయీ (1985) – లాంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. రాజ్‌కపూర్ తన చిత్రాలతో అన్ని సెక్షన్ల ప్రజానీకాన్ని ప్రత్యేకించి సాధారణ మానవుణ్ణి ఆకట్టుకొనేందుకు ప్రయత్నించారు.

**రిత్విక్ ఘటక్ :** రంగస్థలం నుండి చిత్ర పరిశ్రమలోకి వచ్చారు. సత్యజిత్‌రే, మృణాల్‌సేన్ లతో పాటు రిత్విక్ ఆధునిక సినిమా ఉద్యమానికి ఆద్యుడు. ఆయన నిర్మించిన ప్రఖ్యాతి గాంచిన సినిమాలు : నాగరిక్ (1953), అజాంత్రిక్ (1958), బరి తేకె పలియే (1959), కాటో అజానరే (1959), మేఘే ఢాకా తేరా (1960), కోమల్ గాంధార్ (1961), సువర్ణ రేఖ (1965), తితాష్ ఎక్తి నాదిర్ నామ్ (1973), జుక్తి తక్కో అర్ గప్పో (1974) అంతేగాక ఆయన ఒరాన్ (1955), సిజర్స్ (1962), ఫియర్ (1965), రెండేజ్ వస్ (1965), రామ్ కింకర్ (1975) లాంటి పలు డాక్యుమెంటరీ లఘు చిత్రాలను నిర్మించారు.

**సత్యజిత్‌రే :** భారతదేశంలోని అత్యంత ప్రతిభావంతుడైన దర్శకుడు. ఆయన తొలి చిత్రం పథేర్ పాంచాలి. గ్రామీణ పట్టణ, చారిత్రక – విస్తృత కథావస్తువుల్ని స్వీకరించి 30 కథా చిత్రాలను 5 డాక్యుమెంటరీ చిత్రాలను నిర్మించారు. పథేర్ పాంచాలి (1955), అపుర్ సంసార్, అపరాజితత్రయంతో పాటు చారులత, జల్ సాగర్, గూపి గినే బాఘ బినే, అషాని సంకేత్, ఆగంతుక్, షత్రంజి కె ఖిలాడిలు చిరకాలం చిత్ర పరిశ్రమలో కలకాలం నిలిచే చిత్రాలు. మహానగర్ (1963), సీమ బాధ (1971), ప్రతిద్వంది (1970), జన అరణ్య (1975) – లాంటి చిత్రాలు పట్టణ మధ్య తరగతి ఉనికిపై కేంద్రీకరించి నిర్మించిన చిత్రాలు. చిత్ర నిర్మాణంతో పాటు ఆయనకు చిత్ర లేఖనం, ముద్రాపన శాస్త్రం, సంగీతం,

కథారచన ఆయనకు యితర అభిరుచులు. సత్యజిత్‌రే మరణానంతరం 1988లో భారత రత్న అవార్డు యివ్వబడింది. చలన చిత్ర రంగంలో ఆయనకు గల అనితరసాధ్యమైన ప్రజ్ఞాపాటవాలకు, ఆయన మానవతావాదానికి 1992 మార్చిలో ఆస్కార్ అవార్డు అభించింది.

**వి.శాంతారాం :** డాక్టర్ కొట్నీస్ కి అమర్ కహాని, పడోసి, దో ఆంఖే బారాహాత్, పింజర్, చాణి, ఝునక్ ఝునక్ పాయల్ బాజే, గీత్ గాయా పత్తరోంనే – లాంటి కలకాలం జ్ఞాపకం ఉండే చిత్రాలను నిర్మించారు. షావుకారి పాశ్ (1925) లో కథానాయకుడిగా నటించారు. తన దో ఆంఖే బారాహాత్ చిత్రానికి రాష్ట్రపతి బంగారు పతకాన్ని పొందారు.

# VI

# అనుబంధం

# 16. ఆధునిక భారత దేశం - వంశ వృక్షాలు


## అవధ్ నవాబులు

- మీర్ మహమ్మద్ నజీర్
  - సాదత్ ఖాన్ బుర్హాన్ ఉల్ ముల్క్ (1722–1739)
    - కుమార్తె
  - కుమార్తె
    - సఫ్దర్ జంగ్ (1739–54)

(ఎం)

- షాజా ఉద్దౌలా (1754–75)
  - అసఫ్ ఉద్దౌలా (1775–97)
    - వజీర్ అలీ (1797–98)
      - సాదత్ అలీ (1798–1814)
        - హైదర్ (1814–27)
          - నసీరుద్దీన్ హైదర్ (1827–37)
        - అలీ షా (1837–42)
          - అమ్జాద్ అలీ షా (1842–47)
            - ముస్తాఫా అలీ
            - వజీద్ అలీ షా (1847–56)
              - బ్రిజిస్ ఖాదర్ (1857)
            - సులేమాన్ ఖాదర్

## బరోడా గైక్వాడ్లు


దామాజీ - 1
జింగోజీ
పిలాజీ(1721-32)
దామాజీ-2 (1732-68)
గోవిందరావు
(1768-71)
సాయాజీరావు-1
(1771-78)
ఫతే సింగ్
(1778-89)
మానాజీ
(1789-93)
ఆనందరావు
(1800-19)
సాయాజీరావు-2
(1818-47)
గణపత్‌రావు
(1847-56)
ఖండేరావు
(1856-70)
మల్‌హర్‌రావు
(1870-75)
సాయాజీరావు - 3
(దత్తత స్వీకారం)
(1875-1935)

## ఇండోర్ హోల్కార్లు

కుందజీ

మల్హర్రావు(1728-64)

ఖండేరావు(1754లో చంపబడ్డాడు) *(తల్లి)* అహల్యాబాయి(1765-95)

మల్లేరావు(1764-66) ముక్తిబాయి తుకోజు హోల్కర్-1(1795-97)

(1767లో అహల్యాబాయి నియమించిన దళాధిపతి)

కాశీరావు మల్హర్రావు జశ్వంత్రావు-1(1798-1811) విఠోజీ

మల్హర్రావు-2 (1811-33)

హరిరావు (1834-43)


తుకోజీరావు-2 (1843-86)

శివాజీరావు (1886-1903)


తుకోజీరావు-3 (1903-26)

జశ్వంత్రావు-2 (1996-?)

## నాగపూర్ భోంస్లేలు


ముధోజీ
బాపూజీ
పరావ్‌జీ
బింబాజీ
కన్హోజీ
రఘూజీ-1(1738-55)
ముధోజీ
జానోజీ
ఇతరులు
ముధోజీ
వ్యంకోజీ
పరావ్‌జీ
ముధోజీ
రఘుజీ-3(1818-53)

## గ్వాలియర్ సింథియాలు


మీనాబాయి
రాణోజీ సింథియా
(1726-50)ఎం.
మాల్వాకు చెందిన రాజపుత్ర మహిళ
జే పత్
దత్తాజీ జోతిబా
దత్తాజీ జోతిబా
మాధవరావు(మహదాజీ)
(1761-94)
తుకోజీ
(పానిపట్ వద్ద
చనిపోయాడు)
జంకోజీ
(1759-61)
(పానిపట్ వద్ద
చనిపోయాడు)
కేదార్‌జీ
జ్యోతిబా
ఆనందరావు
దౌలత్‌రావు(1794-1827)
జంకోజీరావు(1827-43)
మాధవరావు-2(1886-1925)
జివాజీరావు (1925-?)

## మహారాజా రంజిత్ సింగ్ కుటుంబం

**బుధ్ సింగ్ (సుకేర్చాకియా మిసిల్ ఆద్యుడు)**

**డి.1716**

**చంద్రసింగ్**

సింథియన్ వాలా తెగ మూల పురుషుడు

**నోధ్‌సింగ్**

**(డి.1752)**

**చరత్‌సింగ్**

**(డి.1774)**

**జింద్ యొక్క రాజా గజపతి సింగ్**

**కుమార్తె** **ఎం.** **మహాన్(మహా)సింగ్(పెద్ద కుమారుడు)**

**(డి.1792)**

**రంజిత్ సింగ్(1792–1839)**

**ఖరక్ (1839-40)** **షేర్ (1841-43)** **తారా** **కాశ్మీరా** **పిశోరా** **ముల్తానా** **దలిప్ (1843-49)**

**నావో నెహాల్ (1840)**

**బఖ్** **పర్తాబ్ దేవా** **షా దియో** **నరేన్** **ఠాకూర్** **కరమ్**

**హర్నామ్ సింగ్** **అవతార్ సింగ్**

## హైదరాబాద్ నిజాంలు

ఖాజా అబిద్ కబ్జ్ ఖాన్ (అజ్మీర్ పాలకుడు)

↓

ఘజీయుద్దీన్ ఫిరౌజ్ జంగ్ (గుజరాత్ పాలకుడు)

↓

1. నిజాం ఉల్ ముల్క్ అసఫ్ జాహి (1724-48)

↓

- ఘజీయుద్దీన్
  - ↓ ఇమాద్ ఉల్ ముల్క్
- నాసిర్ జంగ్ (1748-50)
- సల్బత్ జంగ్ (1751-60)
- 2.నిజాం అలీ (1760-1803)
- బసలత్‌జంగ్
- కుమార్తె
  - ↓ ముజఫర్ జంగ్ (1750-51)

↓

3.సికందర్ ఝా(1803-29)

↓

4.నసీర్ ఉద్ దౌలా (1829-57)

↓

5. అఫ్జల్ ఉద్ దౌలా(1867-69)

↓

6. మహబూబ్ అలీ ఖాన్(1869-1911)

↓

9.ఉస్మాన్ అలీ ఖాన్(1911-?)

<u>ఆర్కాట్ నవాబులు</u>

1. జుల్ఫికర్ అలీఖాన్ (1690–1703)
(ఔరంగజేబ్ చేత కర్నాటిక్ నవాబ్ ఏర్పాటు)

↓

2. దావూద్ ఖాన్(1703–10)

↓

3.సాదత్ ఉల్లా ఖాన్(1710–32)    గులామ్ అలీ

↓

4.దోస్త్ అలీ ఖాన్(1732–40)

↓

హుస్సేన్    5.సఫ్దర్ అలీ ఖాన్ (1740–42)    కుమార్తె    కుమార్తె
చందాసాహెబ్(1749)

↓

6.సాదత్ ఉల్లా ఖాన్ (1742–44)

↓

7.అన్వర్ ఉద్దీన్ (నిజాం నియమించిన నవాబు)(1744–49)

↓

మహఫజ్ ఖాన్    8.మహ్మద్ అలీ (1749–95)    అబ్దుల్ రహీం    అబ్దుల్ వాహద్    నజీబుల్లా

↓

9.ఉమదుత్ ఉల్ ఉమారా(1795–1801)    అమిర్ ఉల్ ఉమారా (1795–1801)

↓

అలీ హుస్సేన్    10.అజీమ్ ఉద్ దౌలా (1867–74)

↓

11.అజామ్ ఝా(1819–25)    12.అజీమ్ ఝా బహదూర్(1867–74)
(ఆర్కాట్ యువరాజు)

## బెంగాల్ నవాబులు

ముర్షీద్ ఖులీ ఖాన్ (1703–1727)

కుమార్తె *m.* షుజా ఉద్ దీన్(1727–39)

సర్ఫరాజ్ ఖాన్ (1739–40)

?

మీర్జా ముహమ్మద్, తుర్కిస్తాన్‌కు చెందిన సాహసికుడు

అలీవర్ది ఖాన్(1740–56)

హాజీ అహ్మద్

కుమార్తె (అమీనా బేగం) *m.* జిన్ ఉద్ దిన్

సిరాజ్ ఉద్ దౌలా

?

మీర్ జాఫర్

(మొదటి సారి 1757–60)


(రెండవ సారి 1763–65)


కుమార్తె (ఫాతిమాబేగం) *m.* మీర్ ఖాసిం(1760–63)


నజీమ్ ఉద్ దౌలా(1765–66)

సయీఫ్ ఉద్ దౌలా (1766–70)


# 17. ఆధునిక భారతదేశం మ్యాపులు
















మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధం













RAJPUTANA
AGENCY
AJMER
MERWARA
I N D I A
GUJARAT
CENTRAL INDIA AGENCY
NAGPUR
TERRITORIES
HYDERABAD
MANIPUR
TIPPERA
ARABIAN
SEA
BAY OF
BENGAL
TRAVANCORE
AND COCHIN
INDIAN
OCEAN

ప్రజాశక్తి బుక్‌హౌస్